THE BOOK WAS DRENCHED

TEXT LITE WITHIN THE BOOK ONLY

UNIVERSAL
LIBRARY
OU_206244
UNIVERSAL
LIBRARY

OUP—391—29-4-72—10,000

OSMANIA UNIVERSITY LIBRARY

Call No T928·948131 Accession No T283
VAIA

Author వీరేశలింగము, కే.

Title ఆంధ్ర కవుల చరిత్రము 3వ భాగము

This book should be returned on or before the date last marked below

1911.

			పుట.
115.	ముడుంబి—వేంకటరామాచార్యులు.	...	210.
116.	అక్కలపల్లి—నృసింహకవి	...	211.
117.	పైడిపాటి—వేంకటనృసింహకవి.	...	213.
118.	కోటికలపూడి—వేంకటకృష్ణకవి	...	214.
119.	కాకర్పర్తి—కృష్ణకవి	...	216.
120.	కృష్ణయ్య.	...	217.
121.	తరిగొండ—వేంకమ్మ.	...	218
122.	పిండిప్రోలు—లక్ష్మణకవి.	...	221.
123.	అల్లమరాజు—రామకృష్ణకవి.	...	225.
124.	కాకర్పర్తి—చిప్పాప్రకవి.	...	227.
125.	శిష్టు—కృష్ణమూర్తికవి.	...	229.
126.	మంత్రిప్రెగడ—సూర్యప్రకాశకవి.	...	233.
127	ఘక్కల—వేంకటనరసయ్య.	...	235.
128	వేల్పూరి—వేంకటేశ్వరకవి.	...	,,
129.	తిరుమలకొండపట్టణపు—చినతాతాచార్యుడు.		238.
130.	మాడభూషి—నృసింహాచార్యుడు.	...	239.
131.	కోటగిరిరాజు—నాగయ.	...	,,
132.	కరాలపాటి—రంగయకవి.	...	240.
133.	రామరాజు—లక్ష్మీనారాయణ	...	౨౪౧.
134	త్యాగరాజ మొదలి.	...	
135.	ఓగిరాల—జగన్నాథకవి.	...	
136.	నడకట్టి—రామకవి.	...	
	భూషి—వేంకటాచార్యకవి.		

ఆంధ్రకవులచరిత్రము.

మూఁడవభాగము—ఆధునికకవులు.

హరిభట్టు.

ఈకవి మత్స్యపురాణమును వరాహపురాణమును తెనిఁగించెను. ఇతని నివాసస్థానము కంబముమెట్టు; ఇది బెజవాడ కాఱామడలదూరములో నున్నది. ఇతఁడు తన వరాహపురాణమునందు కంబముమెట్టుగ్రామము నీప్రకారముగా వర్ణించియున్నాఁడు.—

సీ. వరుణదిగ్వీధి నేపురిమునఁ బ్రవహించెఁ బావనసలిలసంపన్న మున్న
దీపించె నేపురి గోపికామానసాపహృదవర్తి చెన్నగోపాలమూర్తి
భాసిల్లె నేపట్టఁ బ్రహ్లాదభక్తివిశ్రాణి కొండనృసింహశార్ఙ్గపాణి
యేపట్టణంబునఁ జూపట్టె హితపద్మహేళి పీరేశబాలేందుమౌళి
చతురచతురంగబలరత్నసౌధయూథ। సాలగోపురతోరణసకలవర్ణ
పావనారాంగనాజనప్రముఖవస్తు। మేదురం బట్టికంబముమెట్టుపురము.

కవి వైదికబ్రాహ్మణుఁడు; భారద్వాజసగోత్రుఁడు; రామపండితుని పుత్రుఁడు. ఇతఁడు మొదట వరాహపురాణమును కొలిపాక యెఱ్ఱనామాత్యుని కంకితము చేసెను.

మ. ఘన తేజుం గొలిపాక యెఱ్ఱనికిఁ గౌదార్యగాంభీర్యస
త్వాఢ్యుఁ భుజోర్వశక్తి ధన్యయోన్నతిప్రశస్తాగ్రక్రియాశాంతులన్
సవితన్ సాత్యకి సింధుసీరి సురశాస్త్రజ్ఞ న్నూరుసేనాని సైం
ధవవిచ్ఛేదను సోము సౌమ్యయుతు సంతానంబు సన్యాధిపున్.

ఇత్యాది పద్యములచేత గుణోత్కర్షమునఁ గవి కృతినాయకుని నెంతగా నభివర్ణించినను,

క. శ్రీమహితస్తంభాచల। నామసముద్దామపట్టణస్థలగణకి
గ్రామణికి బంధుహితకర। క్షామణికిఁ గవీంద్రపంకజనభోమణికిన్.

అను షష్ఠ్యంతపద్యమువలన నతఁడు గ్రామకరణ మయినట్లు స్పష్టపడుచున్నది.
ఇట్టి నాయకగ్రామణి నిప్పుఁ బిలిపించి

మ. అమృతప్రాయవచోవిశేషరచనాహంభావసంభావనా
గ్రమణీమూర్తివి వేదశాస్త్రవివిధగ్రంథార్థనిర్ణీతి నే
కముఖబ్రహ్మవు యాజుషప్రకటశాఖాధర్మధుర్యుండ వ
ర్యమతేజుండవు రామనార్యహరిభట్టా సత్కవిగ్రామణీ.

గీ. అష్టఘంటావధానవిశిష్టబిరుద । నీవు రచియింపఁ దలఁచిన నిరుపమార్థ
రమ్య మగు నీవరాహపురాణకావ్య । మంకితము చేయు నాపేర నభిమతముగ.

అని పలికినట్లు కవి వ్రాసికొనియున్నాఁడు. ఈపద్యమునందే గాక యాశ్వాసాంత గద్యమునందును "అష్టఘంటావధానపరమేశ్వర బిరుదవిఖ్యాత" యని కవి వ్రాసికొనెను గాని యీబిరుద మెవ్వరిచే నియ్యఁబడినదో తెలియఁబడదు. అయినను కవిత్వముమాత్రము పయిపద్యమునందుఁ జెప్పఁబడిన రీతిగా నమృతప్రాయముగానే యున్నది. ఇతఁడు తా నాపస్తంబసూత్రుఁ డయినట్టును తిమ్మాంబపుత్రుఁ డయినట్టును మత్స్యపురాణములో నీక్రింది పద్యమునఁ జెప్పుకొన్నాఁడు—

శా. భారద్వాజసగోత్రసంభవుఁడ నాపస్తంబుఁడన్ తిమ్మకాం
బారాజద్వరగర్భసంభవుఁడ రామక్ష్మాసురానేక జ
న్మారూఢాధికపుణ్యలబ్ధహరినామాంకాప్తసంస్తుత్యుఁడన్
శ్రీరామావరపాదపద్మయుగళీ చింతాసమాయుక్తుఁడన్.

ఇతఁడు మొదట రచించిన వరాహపురాణమును నరాంకితము చేసి యట్లు చేయుట పాపకార్యమని తలఁచి తత్పాపపరిహారార్థముగా మత్స్యపురాణమును శ్రీరంగాంకితము చేసి యందీక్రింది పద్యమును పొందుపఱిచెను—

సీ. ఆయురారోగ్యనిత్యైశ్వర్యములు గల్గి విభవంబుతో ధాత్రి వెలయుకొఱకు
ధనమునకై నరాధముల సన్నుతిచేయఁ బొడమిన పాపము ప్రేదుటకొఱకు
హృదయంబు లక్ష్మీశపదపంకజములందు నిశ్చలవృత్తితో నిలుచుకొఱకు
లోకవాదులఁ బాసి రయమున వైకుంఠసదనంబు వేడ్కఁ జెందుకొఱకుఁ
బరమవైష్ణవజను లెల్లఁ బ్రస్తుతింప । మత్కృతం బయి హరికథామాన్య మగుచు
నుత్తమం బగు విష్ణుధర్మోత్తరంబు । రంగనాథున కర్పింతు రమణ మెఱసి.

కవికాలమును నిర్ణయించుట కీ పుస్తకములు రెంటిలోను నాధారము లేవియుఁ గానరాలేదు. అక్కడక్కడఁ గొన్ని యల్పదోషము లున్నను మొత్తముమీఁద నిర్దుష్టమని చెప్పఁదగిన గ్రంథరచనను బట్టియు శైలినిబట్టియు చూడఁగా నీపుస్తకములు చిరకాలము క్రిందటనే రచియింపఁబడినవయినట్టు తోఁచుచున్నది. "అష్టఘంటావధాన" యని రెండు పుస్తకములయందును గనఁబడుచున్నది. గంటమును తెలుఁగుశబ్దమునకుఁ

ప్రకృతియయి లేఖరియుని యర్థమిచ్చెను "ఘంటు" శబ్దము సంస్కృతమున నున్నదేమో! అప్పటివి యీగ్రంథములనుండి లక్ష్యములను జేకొనకపోవుటచేత నీకవి యతనికిం దరువాతనున్నాఁడేమో యని యూహ కలుగుచున్నది. కాఁబట్టి తగిన యాధారములు దొరకువఱకును మన మిప్పటి కీకవికాలము క్రీస్తుశకము ౧౬౬౦ వ సంవత్సర ప్రాంత మని భావింతము. తెలియని విషయముల నూహించి పెంచి వ్రాయుటకంటె కవికృత గ్రంథములనుండి కొన్ని పద్యముల నుదాహరించి యుదాహరణలతో విరమించుట యుక్తమని యెంచి యిట్లు చేయుచున్నాను.

వరాహపురాణము.

ఉ. మిక్కిలి శీతలాంబువులు మేకొని నీవు మహోష్ణవారిచేఁ
బొక్కక శక్తి మీఱ యుభయంబును గోరిన నింపొనర్చు ని
న్నొక్కరుఁడైన నెంచఁడె భయంబును లేదని నొవ్వక తద్వ్యయంబు లేదా
యుక్క వెతఁగి చూపు మునిజేంద్రుఁడు నవ్వుచు లేదు రందఱున్.—ఆ. ౧.

మ. సకలాశేంద్రులఁగూర్చి సామము భుజాశౌర్యాధికుల్ గూర్చి దా
నము దీనంగలయంగఁ నేరిమహీనాథాగ్రణిం గూర్చి భే
దము శక్తిం దహింపఁగూర్చి కడిమిం దండంబుఁ గావింప యు
క్తము భూపాలు కార్తికా గ్రహరిగష్ఠా కార్యసిద్ధిం ద్రతెన్.—ఆ. ౨.

శా. వేదాంగంబులు వేయుగాఁ దెలిసి దుర్విజ్ఞానులాత్మేశ్వరా
ఖేదధ్యానమెఱుంగలేరు భవతీర్థిత్యర్థమై కర్మముల్
మోదం బొప్పఁగఁ జేయుచేరక మహామోహాంధులై యుందు రం
తాదివ్యాప్తిహీనసుస్మృతిసముద్రాంతర్నిమగ్నాత్ములై—ఆ. ౩.

ఉ. దేహవినాశమూలమగు తీవ్రవిషావృతి మైనయట్టి యా
బాహువుఁ ద్రెంచి మేను నిలుపంచు నరుం డనుగాన సోదకీ
స్నేహము చేయుఁ గొప్పదని నెలిముండలవట్టి యాజగ
ద్ద్రోహి గిరీశుఁ ద్రెంచుటను నెగ్గి గొట్టినఁ జూచి యుత్తమిన్—ఆ. ౪.

చ. ఘనతరకష్టలోభిఁ దనకంబునఁ బెంపెనునంతయుల్క నె
మ్మనమునఁ బుట్టనేని విషమార్గణ కృత్యప్రాణముఖ్యసా
ధనములు గూర్చ నేల ప్రమదంబున దగ్గతి కాను వీసమి
చ్చుటయె చాలు వారి మిషార్థము నిశ్చ్రుతి నొందఁ జేయఁగన్.—ఆ. ౫.

మత్స్యపురాణము.

చ. చదివితి వేదశాస్త్రములు సాంగపదస్వరవర్ణరూఢిగం
దొడవిన మార్గముల్ వివిధయోజ్యములై విలసిల్లు వానిలో

నెఱచిన కర్మకాండమున హింసయు జ్ఞానమునందు గర్మమున్
వదలక పల్కుచుందురు ప్రవాహకుల న్విపరీతవృత్తులై. — ఆ. ౧.

చ. తిరిగిరి కాననంబు లతిదుఃఖముఁ జెందక తద్వనంబులన్
దొరకవు కందమూలములు తోయజనాభ యదృష్టగాక యి
ప్పురమున నన్నపూర్ణ పరిపూర్ణదయై విహరింపుచుండఁగాఁ
గలవలనే తదన్నము లకాలమున న్మనమందిరంబులన్. — ఆ. ౨.

ఉ. విప్రుఁడు నీచకర్మపరుఁ డయ్యెను వారికి మంత్రతంత్రముల్
తప్పినఁ బ్రత్యవాయములు తారొదవున్ మరి యైనఁ గాని దానికే
దప్పరమేశుఁ బొందెదము పాయక యత్నము నే నిటు నీకు వేడుకం
జెప్పెద గుప్తమార్గమునఁ జేయుము తత్క్రియ భూసురోత్తమా — ఆ. ౩.

మ. రమణీబంధుజనాప్తుల న్విడిచి తద్రాజ్యంబు వర్జించి దు
ర్దమకామాదులఁ జెదరీక హృదయస్థైర్యంబున న్నిల్పి నీ
విమలోద్యద్గుణకీర్తనామృతముచే నాహ్లాదయుక్తుండనై
విమలాంతఃకరణుండ నైనయది నే వీక్షించితిం బుణ్యకా. — ఆ. ౪.

మ. హరి సంగీతవినోదలోలుఁ డగుచో నత్యంతశీఘ్రంబునన్
వరగానంబుల నాత్మసద్గుణకథావర్ణంబులై నట్టి గీ
తరసంబుల్ రసనం జవింగొని సుమధ్యశ్రేణి కిష్టార్థముల్
పరిపూర్ణంబులుగా నొసంగును దయాపాంగుండై వేడ్కతో — ఆ. ౫.

ఒజ్జెపూడి-పెద్దయ్య

ఈకవి వాయుపురాణమును తెనిఁగించి, పురుషోత్తమపట్టణ నివాసుఁ డయిన దాసరి చిన్నగంగయ్య యను కమ్మవారికి గంకితము చేసెను. పురుషోత్తమపట్టణము కొండపల్లెకుఁ బ్రాగ్భాగమున నున్నట్టు, దానిని వీరపురుషోత్తమగజపతి తనపేరఁ గట్టించినట్టును గవి చెప్పియున్నాఁడు. వీరపురుషోత్తమగజపతి కొండవీటి కధిపతిగా నుండి క్రీస్తుశకము ౧౪౬౧ వ సంవత్సరము మొదలుకొని ౧౪౯౬ వ సంవత్సరము వఱకును రాజ్యపాలనము చేసెను. ఈతని తరువాత రాజ్యమునకు వచ్చిన యితని మనుమఁడైన వీరభద్రగజపతిని ౧౫౧౫ వ సంవత్సరమునందు కృష్ణదేవరాయలు జయించి కొండవీటిని స్వాధీనము చేసికొనెను. దీనిబట్టి వాయుపురాణము కృష్ణదేవరాయనికాలమునకు ననంతరముననే రచియింపఁబడినట్టు తెలియవచ్చినదిగాని యెప్పుడు చేయఁ

బడినదో తెలియదు. అప్పకవి యీపురాణమునుండి పద్యముల నుదాహరించియుండక పోవుట మొదలయిన కొన్ని హేతువులనుబట్టి హరిభట్టకవికాలమువలెనే యీకవికాలమును ౧౬౬౦ వ సంవత్సరప్రాంతమని యూహింపఁదగియున్నది. ఈయిద్దఱుకవులును కవిత్రయమని ప్రసిద్ధిగన్న నన్నయతిక్కనశంభుదాసులనుదక్క నితరాంధ్రకవులను దమగ్రంథములయందుఁ జేర్కొనియుండలేదు. కవి కృతినాయకుఁ డయిన చినగంగయ్య కొలువుఁ గూర్చుండి తన్నుఁగూర్చియు సభికులనుగూర్చియుఁ బలికిన వాక్యముల నిట్లు చెప్పియున్నాఁడు—

సీ. అతులితశాస్త్రేతిహాసంబు లొకవంక నొకవంక దండనాయకగణంబు
తతచతుర్విధవేదతత్త్వజ్ఞు లొకవంక నొకవంక నిపుణశాబ్దికచయంబు
ప్రకటితప్రౌఢతార్కికబృంద మొకవంక నొకవంకఁ జతురవాగ్మికనికర
మకళంకపౌరాణికకదంబ మొకవంక నొకవంక జ్యోతిషప్రకరవేత్తు
లొక్కచో బంధునిచయంబు లొక్కయెడ స
మగ్రసామంతనిసరంబు మహిమఁ గొలువఁ
గొలువుకూటంబు నందుండి కలితవదన
గౌరవము మీఱ సభికులఁ గాంచి పలికె.

* * * *

చ. వినతసమస్తభూభుజుని వేంకటమంత్రికిఁ బేరమాంబకుం
దనయునిఁ బుణ్యవర్తనుని దానగుణాన్వితు నారసింహహృ
ద్వనరుహచంచరీకు ననివార్యవచోరచనావిశారదుం
ననుపమయొడ్డెపూడిపురనాథునిఁ బెద్దకవీంద్రచంద్రుఁగన్.

తోటకము.—వినయంబునఁ గన్గొని వేడుక ని
ట్లనె సుకవీంద్రసురోచకఫల్
వినుత నభీష్టనవీనఫలో
దయంబులు గల్గు జనావళికిన్.

* * * *

ఉ. పంకజగర్భదారకటిభాగవిభాసితభర్మమేఖలా
కింకిణికావిరావములఁ గేరి తదీయకరాగ్రవిస్ఫుర
త్కంకణనిక్వణంకనినదంబు నగుం బినయొడ్డెపూడిమా
వేంకటమంత్రిపెద్దన నవీనవిలాసవచోనిగుంభనల్.

ఈకవి నియోగిబ్రాహ్మణుఁడు; కాశ్యపగోత్రుఁడు; వేంకటమంత్రి పుత్రుఁడు; ఒడ్డె

పూడి గ్రామమునకు కరణము. ఇతఁడు వాయుపురాణములోని కొంతభాగమును మాత్రమే తెనిఁగించి యున్నట్టు చెప్పఁబడుచున్నది. ఈతని కవిత్వమునం దక్కడక్కడఁ గొన్ని దోషము లున్నను మొత్తముమీఁద కవిత్వము రసవంతముగానేయున్నది. వాయుపురాణమునుండి కొన్ని పద్యముల నిం దుదాహరించుచున్నాను.—

మ. కరకోచ్ఛ్రాయితమై ఘనాఘనబృహద్గర్జారవోపేతమై
ఖరవిద్యుల్లతికాతతిప్రబలమై వాస్తోష్పతీష్వాసబం
ధురమై సర్వదిశాభిభాగములు నస్తోకాంబుపూర్ణంబుగాఁ
గురిసె న్వర్షము నీరజవ్రజము సంక్షోభింప భీమంబుగన్.—అ. ౧.

ఉ. పొంగినవేడ్కచే నతఁ డపూర్వముగా నిరీక్షించుచుండి యా
వెంగటఁ గాంచె దివ్యసరసీరుహశోభితమత్తభృంగ సం
తుంగతరంగఁ దోయపరిలోపకకీర్ణబలాకచక్రచ
క్రాంగ నభంగగంగ నికటాగతసంయమిసంగ నంతయున్—అ. ౨.

మ. కదుమారంబున నుండి మేను వడఁకంగాఁ బావకుల్ తొట్రిలన్
వడచేఁ జిక్కి హరీ యటంచును గృహద్వారంబుఁ జేరంగ నే
నిడఁగాఁ బంచితి నీరసాన్న మతఁడున్ హేయంబుగాఁ జూడకే
కుడిచెం దక్కలుషంబు చేసుకతనన్ ఘోరాటవీభూములన్.—అ. ౩

మ. మునిసంఘంబులు మ్రొక్కఁ దామరలు సమ్మోదంబున న్నిక్కఁ గో
కనికాయంబుల కింపు లెక్కఁ గుముదౌఘంబుల్ రుచుల్ డక్కఁ జో
ర్వనిగర్వంబులు దూలి జాలి బడి జీవంజీవముల్ మ్రుక్కఁ దూ
ర్పున మార్తాండుఁడు గాన్పించె భువనంబుల్ రంజిలం జేయుచున్—అ. ౪

ఉ. ఇంద్రుఁడ వీవు దుఃఖపడ నేటికిఁ గౌశికమౌని చేయు ని
స్తంద్రతపంబు మాన్పుటకు శక్యము గాదన నేల భీకరన్
రుంద్రమతి న్సుఖింపుము నిరూఢిగ నే నిది చక్కఁ జేసెదన్
జంద్రముఖీవిలోకనసుసంగతిఁ జొక్కరె యెట్టివారలున్.—అ. ౫.

కాకమాని - మూర్తి.

ఈకవి కాకమానికులజుఁడైన బ్రాహ్మణుఁడు; కౌండిన్యగోత్రుఁడు; రామలింగభట్టపుత్రుఁడు. ఇతఁడు పాంచాలీపరిణయము, రాజవాహనవిజయము, అను రెండు

ప్రబంధములను రచియించెను. రాజవాహనవిజయములోని యీ క్రింది పద్యమునబట్టి యీకవి యింటిపేరు పెన్నావారని తెలియవచ్చుచున్నది.—

సీ. గుణధన్యుఁ గౌండిన్యగోత్రు నాపస్తంబసూత్రుని వెలనాటి శుభచరిత్రుఁ
గాకమానిమహాగ్రామాబ్ధిమిత్రుఁ బెన్నాకలశాబ్ధితారాకళత్రు
సరసపద్యకృతి సార్వభౌముని రామబుధసంభవునకుఁ బ్రబోధసుధికిఁ
బౌత్రునిఁ బినరామభట్టాగ్రజన్ముఁడై తనరు శ్రీరామలింగనకుఁ దమ్ము
మాంచికకుఁ బుత్రు సూర్యనారాయణద్వ । యికి సహజన్ము నుభయభాషాకవిత్వ
తత్వనిధి నన్ను మూర్తిపద్యకృతీంద్రు । హర్షమునఁ జూచి యిట్లని యానతిచ్చె.

ఇతఁడు తనగ్రంథములను నరాంకితములఁ జేయక రాజవాహనవిజయమును శ్రీవేంకటేశ్వరులకును, పాంచాలీపరిణయమును శ్రీరంగపతికిని, అర్పించినందుచేఁ గృతిపతులను బట్టి కవికాలము నిర్ణయించుట కాధారము లేదు. ఇఁకఁ గవిస్తుతిలో నైనను పాంచాలీపరిణయమునం దితఁ డితరాంధ్రకవులను బేరుకొనక తనముత్తాతయు తాతయు నైనగామపండితుని ప్రబోధపండితునిమాత్ర మీపద్యమునందు పేరులుపెట్టి స్తుతించి యున్నాఁడు.—

చ. ప్రబలమతి న్నుతింతుఁ బ్రతిభాకృతిభాషితభారతీశులన్
గబళితసర్వదిగ్యశులఁ గావ్యచమత్కృతికాళిదాసులన్
నిబిడతపోవిలాసులఁ దృణీకృతకాములఁ గాకమాని రా
మబుధవిధున్ బ్రబోధసుధి మత్ప్రపితామహునిన్ బితామహున్.

రాజవాహనవిజయమునందు వీరిని గాక యీపద్యమునందుఁ గవిత్రయమును గూడఁ బేర్కొని యున్నాఁడు.—

ఉ. శ్రీరఘురామకావ్యకృతిశిష్టవిధిజ్ఞుఁ బరాశరాత్మజున్
భారవిఁ గాళిదాసు శివభద్రు మురారి మయూరు బిల్హణున్
జోరుని మల్హణాదిసురసూక్తికవీంద్రులఁ గొల్చి యెంచెదన్
భారతకర్తృతాచణుల నన్నయఁ దిక్కన నెఱ్ఱనార్యునిన్.

ఇతఁ డన్యకవుల నెవ్వరిని గొనియాడకపోయినను వసుచరిత్రకర్తయైనబట్టుమూర్తికిఁ దరువాతివాఁ డనుటకు సందేహములేదు. వసుచరిత్రకర్త మూర్తి యన్నమాటవినఁ బడఁగానే మూర్తి నరసభూపాలీయకర్తగాని వసుచరిత్రకర్త కాఁ డనియు, ఉభయ గ్రంథకర్తలు బట్టువంశజులును నేకకాలపువా రగుటచేఁ బూర్వకాలమునుండియుఁ బండితపామరసాధారణముగా వసుచరిత్రకారుఁడు బట్టుమూర్తి యన్న భ్రమ యంధపరంపరగా వచ్చుచున్నదనియు, కొందఱు చెప్పవత్తురు. ఒక్కకాలమునం దిద్దఱు

కవులుండి వారిలో నొక్కఁడు సుప్రసిద్ధుఁడును రెండవవాఁ డప్రసిద్ధుఁడును నయినప్పుడు సుప్రసిద్ధునిపేరు రడఁగిపోయి యప్రసిద్ధునిపేరు పైకివచ్చుట యెన్నఁడును సంభవింప నేరదుగాన, అధికప్రసిద్ధుఁ డయిన రామరాజభూషణునిపేరు నడుగంటించి యీతని గ్రంథకర్తృత్వము భట్టుమూర్తిమీఁదఁ బడవేయుట యుక్తియుక్తము కాదు. ఒకవేళ భ్రమకలిగెడుపక్షమున, నరసభూపాలీయకర్త రామరాజభూషణుఁ డని కలుగవలెను. అప్రస్తుతమైన యీయంశము నటుండనిచ్చి కార్యాంశమునకు వత్తము. అనేకు లీతని భట్టుమూర్తినిగా భ్రమించి యితని పాంచాలీపరిణయములోని యీక్రిందిపద్యమును

గీ. అల్లసానివాని యల్లిక జిగిబిగి । ముక్కుతిమ్మనార్య ముద్దుపలుకుఁ
బాండురంగనుకవి పద్యంబు హొయలును । గాక మారిరాయ నీకె కలదు.

భట్టుమూర్తినిగూర్చి రామకృష్ణకవి పలికినట్లు చెప్పుచున్నారు. ఇది నామసామ్యమును బట్టి కలిగిన భ్రమగాని వేఱుకాదు. మఱియు నీపద్యమునుబట్టి యీకవి తెనాలి రామకృష్ణునికాలమునకుఁ దరువాతివాఁ డనుట స్పష్టముగా నున్నది. పయిపద్యములో శ్రీరంగేశుఁడు తనకవిత్వమునుగూర్చి యట్లు పలికినట్లు చెప్పుకొనుటయే కాక రాజవాహనవిజయములో సరస్వతిని ప్రార్థించునప్పుడుకూడ నిట్లు చెప్పియున్నాఁడు.—

ఉ. చేరు నలంక్రియావిహృతిసొంపు మయూరునిసౌరుమాన్యము౯
భారవికాంతిసంపదయు బాణుగుణాఢ్యతరప్రయోగ మా
దారి మురారికోమలపదంబుప్రసాదముఁ గల్గునట్లుగా
భారతి యిచ్చుఁగాతఁ బ్రతిభారతి మత్కృతికిం మత్కృతి౯.

ఈతనికవిత్వమునం దీకవి పొగడుకొన్నంత యోగ్యత లేకపోయినను, రసవంతమయి సలక్షణమయి యమకాది శబ్దార్థాలంకారయుక్తమయి కవితారచన యనర్గళధారగా ప్రవహించుచున్నది. గ్రంథములం దన్యదేశ్యపదములును పూర్వలాక్షణికసమ్మతములుకాని ప్రయోగములును కొన్ని యందందుఁ గానఁబడుచున్నవి. క. ౧౬౪౦ వ సంవత్సరప్రాంతముల యందుండి యుండియుండును. కాకమానిమూర్తి బహుళాశ్వచరిత్రములోనివని కొన్నిపద్యములు రంగరాట్ఛందమునందు సర్వలక్షణసారసంగ్రహమునందును ఉదాహరింపఁబడియున్నవికాని యితఁడు రచియించిన బహుళాశ్వచరిత్రము నాకు లభింపలేదు. ఈమూర్తికవి రాజవాహనవిజయములో చంద్రగిరి హనుమంతుని స్తుతించియుండుటచేత నీతని వాసస్థాన మైన కాకమానిగ్రామము చంద్రగిరిసమీపమున నుండియుండును. కవిత్వరీతిని దెలుపుట కీతని గ్రంథములనుండి కొన్ని పద్యముల నుదాహరించుచున్నాను.—

రాజవాహనవిజయము.

శా. ఘాటీఘోటఖురాగ్రనిర్దళితగోత్రాధూళికాగంధమూ
ర్ధాటోపాతిపరిస్ఫురత్కరినసర్వాశావధూటీకుచా
ఘాటచ్ఛాదకరాగశాటికసమాఖ్యావిక్రమప్రక్రమా
త్యాటీకాహితరాజహంసుఁ డగు నాహా రాజహంసుం డిలన్ — ఆ. ౧.

ఉ. మీసపు మొక్క నిక్కనకు మిక్కిలి తొల్కు దివాన కుంతలా
ళీకరపాలఫాలమణిలీలకుఁ గ్రొన్ననుసాన విభ్రమ
శ్రీ సరసీరుహంబు మదసింధురసప్రసవంబు సూనబా
ణాసతపఃఫలం బలరు యౌవనమబ్బెఁ గుమారమౌళికిన్. — ఆ. ౨.

శా. ప్రావుంగోఁట యొకర్రు చేఁ గలితంపుంజందురాతిన్నెలం
బూవుందేనియ సోనవానఁ జౌతుకు లొప్పైచు గొజ్జంగిపూ
పైవాటుల్ లలవాసనంపుఁగవిమల్ పన్నీటియున్నీటి జల్
ర్రోవం గట్టినపచ్చమెట్టికలపైఁ గోడ్త్రోడఁ గ్రీడింపఁగన్ — ఆ. ౩.

ఉ. తాలిమిమూలి తూలి వెలి దర్పముఁ దప్పడె వంచుతమ్మిపూ
వాలికతూపు క్రొంజెమరువానకుఁ గారణమై నిద్దళం
గోలమెఱుంగు యౌవనచకోరహితాగతరశ్మి యోరయో
లోలమృగాక్షి నాపయిఁ దళుక్కనఁ జూచెఁ జూపు బాపురే — ఆ. ౪.

మ. కటకంబుల్ గలయుత్కటప్రపటుటంకాఘంటాపథప్రస్ఫుట
త్కటకంబుల్ స్తోకమంగఁ జక్కఁజన వాద్యధ్వానశక్తిన్ మహా
కటకంబుల్ ప్రతివాదవీరపథసోత్కంఠతన్ దిశాభూమిభృ
త్కటకంబుల్ గన రాజు చేఁ గనియె దన్మంత్రిరాళిందమున్. — ఆ. ౫.

పాంచాలీపరిణయము.

ఉ. ఏముఁ గఠోరమార్గమున లివ్వలి కవ్వలి కర్గి దూరముఁగా
ప్రేయుధరాస్థలిన్ సడిసె నంటనె గాంగముఖంబు లేవఁగాఁ
జేయుచు నగ్గుమాఁచములు చెట్టుచు జట్టుచు గట్టి బిట్టుగా
నాయువలాయనప్రభువుఁ డాయన యౌవనగర్వసంపదన్. — ఆ ౧.

ఉ. ఎంతటివన్నెఁ దెచ్చె గుణియేసి యుతండు ద్విజన్మజాలికిన్
వింత యుటంచు రాజుల గణింపక తిట్టుచు గేలి గొట్టుచున్
గంతులు వైచుచుం దలకుఁ గట్టించెం గగవైచి పట్టుచున్
గొంతులు గాళకుఁ గోయనుచుఁ గూఁతలు పెట్టిరి గ్రామ్యభూసురుల్. — ఆ. ౨.

ఉ. ముందటఁ గాంచె దిగ్గమణముఖ్యుఁడు వారణవేషభాషణున్
మందరకంధరాకనకమంజిమమధ్యవితర్ద్యమందహా
రుందరనీలకందరధురంధరసింధురవైరిపీఠవా
సేందుకళాకలాపు హృదయేశ్వరితోడుత నెత్తమాడఁగన్ — ఆ. ౩.

శా. నీకేవమ్ము సువాలయున్ ధవళ మింతీ యల్లొనేరెళ్లు గా
రీకళ్యాణము లంచు నింటికడ నేరీతి న్విజృంభింతు వే
వాకీ విచ్చట నంచుఁ దద్దులసతుల్ వ్యాక్యోపవాక్యంబులన్
గాకై ముందలపట్టుకుం బోడఁగి రాకల్యాణవేదిస్థలిన్. — ఆ. ౪

శా. ఆఁడుంగాన్పుల గంటకన్న సతికొం డ్రాలౌటయే మేలు నా
కోఁడు ల్పెంచిఁ గూఁతు రేమి సతమా యీవిద్యయు ల్కోడలిన్
గాఁడంబల్కినఁ దాళఁ గావలసెఁ గాఁ గానిత్తిట్లాడికల్
నేఁ డీతండ్రియుఁ దల్లి వంగడము కానీ సంచుఁ బోనాయెఁ గా. — ఆ. ౫.

కామేశ్వరకవి.

ఇతఁడు సత్యభామాసాంత్వన మను నాలుగాశ్వాసముల శృంగారప్రబంధము రచియించి, మధురనాయకుఁడైన ముద్దళగిరినృపాలున కంకితముచేసెను. ఈమధుర శ్రీకృష్ణుని జన్మస్థలమయిన మధురాపురము గాక పాండ్యమండలమునకు రాజధానియైన దక్షిణమధుర యని యీక్రిందిపద్యమువలనఁ దెలిసికొనవచ్చును—

క. లక్షణలక్షితకమలా । వీక్షణపుంఖానుపుంఖవిభవోన్మేషా
నుక్షణతతవిశ్రుతియై । దక్షిణమధురాపురంబు తనరు ధరిత్రిన్

కృష్ణదేవరాయనియనంతరమునఁ దెలుఁగునాయకులు పాండ్యమండలమును చిరకాలము పాలించిరి. ఈకవి యాకాలమునందు మధురాపురమును బాలించుచున్న ముద్దళగిరిరాజు సభలోఁ గూర్చుండి తన్నుఁగూర్చి యిట్లుపలికినట్టిపద్యములలోఁ జెప్పినాఁడు—

శా. ఆరీతిన్ సభ ముద్దుళగిరధరాధ్యక్షుండు కొల్వుండి తా
హేరాళంబుగ నర్యోదల న్నడుచుసాహిత్యప్రసంగంబు గం
భీరప్రౌఢిమ వించు నన్బిలిచి నెమ్మిం బల్కె వీణాకన
ద్గౌరీపాణిసువర్ణకంకణరుణత్కారానుకారోక్తులన్.

చ. అనువుగ రుక్మిణీపరిణయంబును ముక్ హావణించి యార్యులౌ
నన దనియించినావు మము నప్రతిమంబుగ నవ్యకావ్య మిం

పున రచియింపుమీ సాగసుపోఁడిమి మీఱఁగ సత్యభామసాం
త్వనము గప్పురంపుఁజలువం గెలువం దిరుకామసత్కవీ.

క. కాకులవలె నింటింటను । గాకవు లున్నారు హంసకైవడి భువిలో
శ్రీకామ నీకె తగురా । యేకద నుడిపాలు నీరు నేర్పఱుపంగన్.

క. ఏభాష నైనఁ గృతిపతి । శోభనములు చెందు నీదుసూక్తులవలనన్
నీభాగ్య మసదృశము గా । రీభవకరుణావేశ శ్రీకామేశా.

ఈముద్దళగరి తన సవతియన్నగారయిన చొక్కనాథుఁడు శ్రీలోలుఁడయి రాజ్య భారము తమ్మునిమీఁదఁబెట్టి తంజావూరిలోనున్న కాలములో యువరాజుగా రాజ్యము చేసెను. చొక్కనాథుఁడు క్రీస్తుశకము ౧౬౬౦ వ సంవత్సరము మొదలుకొని ౧౬౮౨ వ సంవత్సరము వఱకును రాజ్యము చేసెను. కవి యీముద్దళగరినే రాజునుగా వర్ణించినను, అతని వర్ణనలోఁగల యీక్రిందిపద్యమునుబట్టి యన్న యుండఁగానే యితఁడు రాజ్యభారము వహించినట్టు స్పష్టమగుచున్నది.—

ఉ. అన్నయు దమ్ము లీఁరణి నందఱు నొద్దికయై యశోరమల్
చెన్ను వహింప రామునృపచేఁ దమఁ జెందినరాజ్యసంపద
భ్యున్నతభోగభాగ్యుఁడయి యుర్వని సర్వనృపాలకోటిలో
నెన్నిక కెక్కె ముద్దళగిరీంద్రుఁడు తాను మహోన్నతస్థితిన్.

ఈముద్దళగరి ౧౬౭౪ వ సంవత్సరప్రాంతమునఁ దానే రాజ్యము నాక్రమించుకొని సంవత్సరకాలము స్వతంత్రముగాఁ దనపేరనే పాలనముచేసెనుగాని యింతలో చొక్కనాథుఁడు వచ్చి దేశము మరల స్వాధీనము చేసికొనెను. చొక్కనాథుఁడును, ముద్దళగరియు, మఱి యిగ్గురును ౧౬౮౩ వ సంవత్సరము మొదలుకొని ౧౬౭౯ వ సంవత్సరమువఱకును రాజ్యముచేసి ప్రసిద్ధికెక్కిన తిరుమలనాయకుని కొమాళ్ళు. ఇందుఁ దెలుపఁబడినచరిత్రమునుబట్టి కవి యీగ్రంథము ౧౬౭౪ వ సంవత్సరప్రాంతమునందు రచించినట్లు తెలియవచ్చుచున్నది. ఇతఁడు రుక్మిణీపరిణయమును గూడ రచియించినట్టు చెప్పఁబడినదిగాని యాపుస్తకము నాకు లభింపలేదు. „దక్షిణసింహాసనాధ్యక్ష తిరుమలక్షమాకాంతకరుణాకటాక్షలక్షిత స్వచ్ఛముక్తాగుళుచ్ఛసితచ్ఛత్ర చామరకళాచికా కనకాందోళికా విరాజోపచార" యని యాశ్వాసాంత గద్యమునఁ జెప్పుకొనియుండుటచేతఁ గవి తిరుమలనాయకునికాలమునందుసహితముండి ౧౬౫౦ వ సంవత్సరప్రాంతమునుండి కవిత్వమునందుఁ బ్రసిద్ధిఁబొందియుండును. ఈగద్యమునందే యితఁడు "శ్రీకాళహస్తీశ్వర చరణారవింద మిళిందాయమాన జ్ఞానప్రసూనాంబికా కృపాలంబ విజృంభమాణ సారసారస్వత సుధాతరంగ" యని చెప్పుకొనుటచే నితఁడు

కాళహస్తినివాసుఁ డయి మధురనాయకులయాదరమువలన మధురసంస్థానమును జేరి నట్లు కనఁబడుచున్నది. విజయవిలాసమువలెనే యిదియు శుద్ధద్రవిడదేశమునందుఁ జేయఁబడిన ప్రబంధము. ఇదిగాక యీయవదేశమునందుఁ జేయఁబడిన తెలుఁగుకావ్యము లింకను బెక్కులు గలవు. "వల్లకీవాదనధురీణ వర్ణగీతాది గాంధర్వస్వరనవీనకల్పనాప్రవీణ" యనియు గద్యమునందు కవి వ్రాసికొన్నాఁడు. అందుచేత నితఁడు సాహిత్యమునందుమాత్రమే కాక సంగీతమునందును బ్రవీణుఁడని విశదమగుచున్నది. ఈకవి యింటిపేరు లింగనమఖివారు; తండ్రిపేరు నాగనామాత్యుఁడు; తల్లిపేరు కామాక్ష్యంబ. ఈతరికవిత్వము ప్రౌఢమయినది. సత్యభామాసాంత్వనమునుండి కొన్నిపద్యముల నిం దుదాహరించుచున్నాను.—

ఉ. ఆపురమందుఁ గొంపుజిగియుం దళుకుంగోట పయోధికన్యకుం
బ్రాపయి తమ్మిపోలికను భాసిలెఁ గొమ్మలు కొను లట్లు చా
లై పరఁగం దదంతరగళన్నవమౌక్తికలీల నబ్ధివీ
చీపృథుశీకరమ్ము లెగఁజిమ్మ హరి సేసలు చల్లు కైవడిన్.

ఉ. తావులవెంబడిం గదలి తారొగి నెందెఁ దేఁటులుం దేఁటిపెండ్రులం
బోవక నాకెఁ బుప్పొడిఁ బుప్పొడితోఁ దగఁ బూవుసోన యా
పూవులసోనతో మిగులఁ బొల్చుచు గల్పకమ్రసూనమా
ధ్వీవిసరంబు నావెఱకఁ బీచెను వల్లరికమ్మతెమ్మెరల్.—ఆ. ౨.

ఉ. చూడక చూచినట్లు తమి సోలుచు సొక్కుచు మోహ ముంచి మా
టాడక యాడినట్లు కలయం గనుఁగొంచి మనంబు గణించి యా
చేడియతో విలోకమయి చింతిలి కార్యము నెంచుకుండుటల్
పాడియె తప్పవా యనితపాండవ గాళి ఛమాళి తాండవా.—ఆ. ౩.

శా. భాసిల్లె న్నిసోవరేఖశుభగంభావక్రియావీక్షణో
ల్లాసోదారముకుందదారకృతలీలాలాస్యసాహస్యభృం
గీసంగీతతరంగితాబ్జరుచిభంగీజాతరంగోల్లస
త్కాసారాబ్ధితరంగజాలము శరత్కాలం బకాలంబుగన్.—ఆ. ౪.

వెణుతురుబల్లి విశ్వనాథకవి.

ఇతఁడు శివధర్మములను బద్యకావ్యమునుగా రచియించి పెద్దాపురసంస్థానాధీశ్వరుఁ డయిన వత్సవాయి తిమ్మనృపాలుని కంకితము చేసెను. ఇతఁ డాయువేలనిమ్మాగి

బ్రాహ్మణుఁడు. ఈతని తండ్రిపేరు వేంకటామాత్యుఁడు. ఇతఁడు ౧౬౦౦వ సంవత్సర ప్రాంతములయం దుండినవాఁడు. ఈకృతిపతినిగూర్చియు కృతికర్తనుగూర్చియు నేమియు లక్షణకవిచరిత్రమునందుఁ గొంత తెలుపఁబడి యున్నది. ఇతనిది సలక్షణమయిన మంచికవిత్వము. ఈతని శేషధర్మములనుండి కొంతుపద్యము లిందుఁ గైకొనఁబడుచున్నవి—

శా. మాయామిశ్రుల కావ్యజుండు కడిగెన్ బాదాంబుజద్వంద్వముల్
చేయూతం గుణమూర్తి తాదులను బూజించెం గాత్రము ల్వైచె న
ట్లాయాపాత్రములందు నన్నము లిడన్ నారంభుఁ డౌనంతలో
నాయింద్రుండు గృహస్థుఁ జూచి పలికెన్ సాక్షేపవాక్యంబుగన్.—ఆ. ౧.

ఉ. కాలినయిప్పగుండ్ల మఖగహ్వరభాగములందుఁ గుక్కుచున్
సోలుపు లేర్పడ న్నెఱయఁ జూపుల కన్నులఁ గ్రుచ్చుచుం దలల్
నేలను ద్రెచ్చ పాదములు నింగికి నెత్తుచుఁ జెక్కు జాడలన్
గాలభటు ల్వెతల్గనఁగఁ బడియుండుదు రంగమీఁదటన్.—ఆ. ౩.

నూతనకవి - సూరన్న.

ఈకవి సకలజనాభిరామ మను నామాంతరముగల ధనాభిరామ మను మూఁడాశ్వాసముల పద్యకావ్యమును రచించెను. ఇతఁడు నియోగిబ్రాహ్మణుఁడు; ఆపస్తంబసూత్రుఁడు; కాశ్యపగోత్రుఁడు; తిప్పయామాత్యపుత్రుఁడు. కవి తన్నుఁగూర్చి యిట్లు చెప్పుకొనుచున్నాఁడు.—

సీ. స్తీర్ణవైభవాపస్తంబసూత్రుండఁ గాశ్యపగోత్రవిఖ్యాతయశుఁడ
ఘనత ననంతసేయుని మల్లయామాత్యపౌత్రుఁడఁ దిప్పయప్రభుసుతుండఁ
భార్గవీశుభగర్భపాథోనిధానసంధానేశపిత్తుండ మానధనుఁడ
సత్కావ్యపాకీణ సాహిత్యసంలబ్ధవిస్తారమతి గలనిర్మలయశుఁడ
భద్రవైభవశ్రీవీరభద్రలబ్ధ । జనితచాతుర్యకావ్యలక్షణవిచిత్ర
విపులవాచాసమగ్రసంసిద్ధమతిని । సూరనామాత్యనామక సుకవివరుఁడ.

కవి తనగ్రంథమున వ్రాసికొన్న యీక్రిందిపద్యమునబట్టి తాను దిక్కనసోమయాజి సంతతివాఁడనని చెప్పఁదలఁచినట్లు కనుపట్టుచున్నది—

చ. ఆంధ్రపుగ భారతాంబునిధి యుర్వశికిం దిగఁబెట్టి యుండులో
ఘనకవితామృతంబు చవి గాంచిన తిక్కన సోమయాజిపా
వనతర మైనయట్టికులవర్గనుఁడై మహి పేరుగల్గు నూ
తనకవి సూరనార్యుఁడను ధర్మగుణాంచితపాలనీయుఁడన్.

ఈకవి తనకావ్యమును దాక్షారామభీమేశ్వరుని కంకితము చేయుటచేత నితఁడు గోదావరిమండలములోనివాఁ డయినట్టు కనఁబడుచున్నాఁడు. ఈతఁ డేకాలపువాఁడో తెలియ రాలేదుగాని పూర్వకవులను మధ్యకవులనుమాత్రము స్తుతించి చిమ్మపూడి యమరేశ్వరుని

చ. అలఘుని శబ్దశాసనపదాంకితుఁ దిక్కనసోమయాజి ని
ర్మలమతి శంభుదాసు బుధసన్నుతు నాచనసోమనార్యుఁ జె
న్నలరిన చిమ్మపూడి యమరాధిపు భాస్కరు రంగనాథునిం
దలఁతు నపూర్వదివ్యకవితామహనీయసమగ్రచిత్తులన్.

అని కవిస్తుతిలోఁ జేర్కొనియుండుటచేతను, ఇంతమంది పూర్వకవులను జెప్పి మధ్యకవులలో నొక్కనిని జెప్పకపోవుటచేతను, ఇతఁడు మధ్యకవులలోఁ జేరినవాఁ డేమో యని సందేహము కలుగుచున్నది. అయినను స్వతంత్రము లైన యితరాధారములు లేక మధ్యకవులను జేర్కొనక పోయినంతమాత్రమున నితఁడు మధ్యకవి యని నిశ్చయించుటకు వలను పడదు. కాని యితఁ డిన్నూఱుసంవత్సరముల క్రిందటివాఁ డని యైనను జెప్పవచ్చునని తోఁచుచున్నది. ఈతఁడు రచియించిన ధనాభిరామము కథ కొంతవఱకు మనోహరముగా నున్నది. ఇంద్రసభామందిరమునందు మన్మథునకిని కుబేరునికిని రూప మెక్కువ యనియు ధన మెక్కువ యనియు వివాదము సంభవించి వారితగవు మాటలతో తెగనందున

చ. తరమిడి యిన్నిమాటలు వృథాపని లేదు సమస్తవైభవో
త్కర మగుదాక్షవాటిపురి గల్గు ధరాస్థలిలోనఁ బోయి నీ
నిరుపమరూపసంపదయు నేర్పుఁ జూపుము నేను వచ్చి యా
పురవరసీమఁ జూపెదను భూరిధనంబున నామహత్త్వముల్.

అని కుబేరుఁడు మన్మథునిఁజూచి, మాటలతోఁ బ్రయోజనము లేదు. మన మిద్దఱమును భూమిమీఁద దాక్షారామములోఁ బుట్టుదము అక్కడ నీవు ముట్టమొదట నీసౌందర్యమును నేర్పునఁజూపుము తరువాత నేను వచ్చి నాధనమహిమను జూపెదను. అప్పుడు మనయిద్దఱిలో నెవ్వరు బలవత్తరులో తేటపడి రూపమహిమ యెక్కువయినదియు ధనమహిమ యెక్కువైనదియు వెల్లడియగును' అని పలుకఁగా మన్మథుఁ డాతని

యాహ్వాన మంగీకరించి పూర్వకాలమునుండియు వేశ్యలచేఁ బ్రసిద్ధమయి నదాత్మహాటి కకుఁ బోయి యందుఁ దన రూపవిశేషమును జూపఁగా నాట్యమునకయి భీమేశ్వర స్వామి యాలయమునకుఁ బోయిన సుగుణావతి యను నొక పణ్యయువతి యాతనిని గాంచి కామించి యింటికిఁబోయి యాతనిం దనయింటికిఁ దోడితెమ్మని తన చెలికత్తెను వేఁడుకొనఁగా నావయస్య

ఉ. అక్కట వాసివన్నె గలయట్టికులంబునఁ బుట్టి రూపుచే
నెక్కుడు భాగ్యసంపదల నెన్నికకెక్కినదాన వింతలో
నెక్కడివారికిన్వలచి తెయ్యనొ వానికులంబు విన్న వా
రొక్కట నవ్వరే విడువు ముత్పలలోచన నీకు మ్రొక్కెదన్.

ఉ. నిచ్చలు నిండి వల్లభులు నీకడ గానఁగలేక కానుకల్
తెచ్చి తమంతఁ గ్రందుకొని తేఁకువ మోసలఁ గాచుచుండఁగాఁ
జెచ్చెరవారలన్ ఘనము చేయక డాయక యూరకున్నచో
నొచ్చెముకాదె నీకును బయోరుహలోచన యిప్పరంబునన్.

చ. కలికితనంబుమీఱఁగ వికారముతోడ మనోజకేళి ని
చ్చలుఁ దమకంబుపుట్టి విటసంఘము తెచ్చియొసంగునీమహో
జ్జ్వలమణిభూషణాదిఘనవస్తువు లొందుట కీర్తిగాక తా
వలచుట పంతమా ధరణి వారవధూమణికిం దలోదరి.

అని యుపాయధనము నిచ్చెడు విటు లనేకు లుండఁగా ధనమియ్యఁజాలని క్రొత్తవానిని కేవలరూపసంపదను జూచి వలచుట వారకాంతకు ధర్మముకాదని బుద్ధి చెప్పియుఁ గార్యము గానక తుదకు మన్మథుని దానియింటికిఁ దెచ్చి యప్పగించెను. సుగుణవతి యు మన్మథుఁడును గొంతకాల మీప్రకారముగా సుఖ మనుభవింపుచుండఁగా, కుబే రుఁడు యోగివేషము వచ్చి భీమేశ్వరస్వామియాలయమునఁ జేరి యచ్చటికి వచ్చెడు వేశ్యల కల్లను ధనమును చీరలును గొలఁగా నొసఁగసాఁగెను. అంత సుగుణవతి తల్లి యు నొకనాఁ డచ్చటికిఁ బోయి యాతఁ డిచ్చిన కనకాంబరములను దెచ్చి కూఁ తునకుఁ జూపి బోధించి మతివిరిచి రూపవంతుఁ డయినమారుని విడనాడి విత్తవంతుఁ డైనకుబేరునిఁ గూడున ట్లాసుగుణవతి నొడఁబఱిచెను. అంతట మన్మథుఁ డోడిపోయి దేవాలయముచేరి భీమేశ్వరస్వామిని ప్రార్థింపఁగా నతఁడు సాక్షాత్కరించి, యొకప్పుడు ధనమును మఱియొకప్పుడు రూపమును విజయము నొందినను మొత్తముమీఁద ధనసౌందర్య ములు రెండును సమానములే యని తెలియఁబలికి వా రిరువురిని సమాధానపఱిచి వారి స్థానములకు వారిని బంపివేసెను. ఈపుస్తకము చిన్నదే యయినను, కవిత్వము

హృద్యముగానే యున్నది. శైలిని జూపుటకై ధనాభిరామమునుండి రెండుపద్యముల నిం దుదాహరించుచున్నాను.—

చ. మదమునిగాఁ దలంతు రిల మానుఁ దెల్లరు, సత్కవీశ్వరుల్
పదపడి కర్ణుఁ డీతఁడని ప్రస్తుతిచేయుదు రాత్మలోపలన్,
మదవదరాతివర్గములు మారుగఁ గవ్వడి యండ్రు, భూజనుల్
మని దిననాథుఁ డందురు, సమస్తము ద్రవ్యముఖంబు చూచినన్.—ఆ. ౧.

ఉ. కమనీయంబుగ నాడఁ బాడఁ జదువంగా నేర్చి కీరాళి వా
ద్యములన్నైపుణి సొంపుమీఱఁగఁ గళాస్థానాంగతంత్రంబులన్
సుమనస్ఫూర్తిమనోజకేళి విటులం జొక్కింపఁగా నేర్చి వి
భ్రమ సౌందర్యముల న్వహించు సరిచెప్పన్ లేరు నాపుత్రికిన్.—ఆ. 3.

సముఖ-వేంకట కృష్ణప్పనాయకుఁడు

ఈకవి యహల్యాసంక్రదన మనుమూడాశ్వాసముల ప్రబంధమును రచించెను. ఇతఁడు శూద్రకులజుఁడు; సముఖమీనాక్షినాయకుని కుమారుఁడు. "శ్రీమత్పాండ్య మండలాధీశ్వర విజయరంగచొక్కనాథ మహీనాథ కరుణాకటాక్ష సంపాదిత గజతురంగమాందోళికా చ్ఛత్రచామరవిజయ దోహళకాహళభూరిభేరీ బిరుదధ్వజప్రముఖ నిఖిలసంపత్పారంపరీసమేత ' అని యాశ్వాసాంత గద్యమునందుఁ జెప్పుకొనుటచేత కవి మధురాధినాథుఁ డగునవిజయరంగ చొక్కనాథునికాలములో నున్నవాఁ డగుట స్పష్టము. ఈవిజయరంగ చొక్కనాథుఁడు క్రీస్తుశకము ౧౭౦౪ వ సంవత్సరము మొదలుకొని ౧౭౩౧ వ సంవత్సరమువఱకు పాండ్యమండలాధీశ్వరుఁడుగా నుండెను. కాఁబట్టి కవియు ౧౭౨౨ సంవత్సరప్రాంతములయందు నుండి యున్నవాఁడే. ఇతఁడు జైమిని భారతమును వచనకావ్యముగా రచించినట్టు అహల్యాసంక్రందనములోని యీక్రింది పద్యమువలనఁ దెలియవచ్చుచున్నది—

గీ. సముఖమీనాక్షినృపగర్భవిమలజలధి। చంద్ర వేంకటకృష్ణేంద్ర శౌర్యసాంద్ర
మునుపు జైమినిభారత మనఘ వచన । కావ్య మొనరించినట్టిసత్కవివికాశి.

ఈకాలమునందే మంచికవులచేత తెలుఁగున వచనకావ్యము లారంభింపఁబడినట్లు విదఁబడుచున్నవికాని యావచనకావ్యము లిప్పుడు కానరావు. తారాశశాంకమును రచించిన శేషము వేంకటపతి యీకవికాలమునం దుండినవాఁడు. కవితాను "పురోహిత

భృత్యామాత్య సామాజిక బంధువర్గంబులు కొలువం గూరుచుండి యుభయభాషాకవి తా విశేషుండై శేషయ వేంకటపతికవీంద్రుం డాప్తసఖుండు గాఁ బిలిపించి సఖు డతఁ డీక్రిందిపద్యము జెప్పెఁట—

చ. నల నాసత్య వసంతులం గెలుచు సౌందర్యంబు ధైర్యంబు దో
ర్బలగుణ స్వామిహితానువృత్తి దయయుఁ బ్రాభవ్యము న్విద్యయున్
వెలయన్ బాల్యమునందె నీవు మధురోర్వీనాథు మెప్పింపవా
ఒళిగా వేంకటకృష్ణనాయకగుణశ్రీ బాహాఫణిగ్రామణీ.

ఆహల్యాసంక్రందనమునుండి రెండుపద్యముల నిం దుదాహరించుచున్నాను—

ఉ. బంటుతనంబు లాముకొని పాఱఁగ రావణుచేతఁ బెట్టుఁగన్
గంటికి నీరు గ్రమ్మఁ గలఁగంబడి పాఱెను నీదుతండ్రి నీ
యింటను లేదు పౌరుష మొకింతయు బీరములేల చేసినా
లంటుకు కోడెకాఁడ వని కంటఁగ నెంటనె చెంపఁ గొట్టెదన్.— ఆ. ౧.

ఉ. ఆరతి నాలతాంగిని మహోగ్రహదృష్టిని జూచి యోసి నీ
చేతిజలంబు లంటఁ గనెఁ జెల్లునె గొంటెలిజంత వేఁకలా
రాతిని గూడి తీ విపుడు గాతిజామునఁ గావుమీ బలా
రాతిశిరోమణి ముని రాజముఖిన్ సుముఖిన్ శపింపఁగన్ — ఆ. 3

రేపనూరి - వేంకటపతి.

ఈకవి విష్ణుమాయావిలాస మను మూఁడాశ్వాసముల పద్యకావ్యమును రచియించి దానిని వేంకటగిరిసంస్థానప్రభువయిన శ్రీవెలుగోటి బంగరు యాచమనాయని కంకితము చేసెను. ఇతఁడు నియోగిబ్రాహ్మణుఁడు; లింగనామాత్యుని పౌత్రుఁడు; గంగనమంత్రి పుత్రుఁడు; కాశ్యపగోత్రుఁడు. కృతిపతి తండ్రియైన కుమారయాచ భూపాలుఁడు తనకు „తిక్కయజ్వ" యను బిరుదము నిచ్చినటు కవి యీపద్యమునఁ జెప్పుకొన్నాఁడు—

మ. ఘను శ్రీనాపతిలింగపాదభజనానందున్ గుమారేశ భూ
జపాలాగ్రణి తిక్కయజ్వయనుచుం జాలంగఁ బేరిచ్చి ప్రో
చినఁ బెంపొందిననోరసనూత్నకులునిన్ శ్రీవేంకటాఖ్యుం గృపా
ఘనగంభీరశుభైకదృష్టి నెలయుంగాఁ జూచి పల్కెం దగన్.

కృతినాయకుఁ డైనబంగరుయాచమనాయఁడు ఔరంగజేబు ఢిల్లీచక్రవర్తిగా నున్న కాలములో ౧౬౯౬ వ సంవత్సరమునందు వెల్గోటివారగు జుల్ఫిఖరుగారుచేఁ జంపఁబడినందున, ఈపుస్తకము ౧౬౯౦ వ సంవత్సరప్రాంతములయందు రచియింపఁబడిన దని చెప్పవచ్చును. వేంకటగిరిసంస్థానప్రభువు లనేకులు తెలుఁగుభాషయం దభిమానము గలవారయి కవులను బ్రోత్సాహపఱిచి తా మనేక ప్రబంధములకుఁ గృతిపతు లయిరి. వీరు పద్మనాయకవంశజు లయినవెలమలు. ఈసంస్థానమును స్థాపించిన మూలపురుషుఁడు బేతాళనాయఁ డనుబిరుదనామము గల చెవిరెడ్డి యనువాఁడు. చేయూరి పోలిరెడ్డికుమారుఁడు. ఇతఁడు తననివాసస్థలమైన యనుమనగల్లు గ్రామమున రేచర్ల యాచెఁడు (ఏచెఁడు) అను మాలవానిచేతఁ దనపొలమును దున్నించుచుండఁగా నాగేటికఱ్ఱున కొకరాగిశాసనము తగిలెను. దానిని జదివిచూడఁగా నందు "నాగభైరవపాలము" అనెడి యాచోట తొమ్మిదిలక్షలధనము భూస్థాపితమయి యున్నదనియు, నరబలి యిచ్చినపక్షమున బలియిచ్చినవాని కాధనము దక్కుననియు, వ్రాయఁబడియుండెను. అతఁ డప్పు డేమిచేయుటకును తోఁచనివాఁడయి యేచనితో నాలోచింపఁగా, వాఁ డాస్థలమునందుఁ దనయింటిపేర నొకగ్రామము కట్టించి తనయింటిపేరును గోత్రముగాఁ బెట్టుకొని వంశమునందుఁ బుట్టినపురుషులు కెల్లను దనపేరు పెట్టుచు వివాహము చేయవలసి వచ్చినప్పుడెల్ల ముందుగాఁ దనకులజులలో నొక్కరికి వివాహముచేయుచు వచ్చుట కంగీకరించినపక్షమునఁ దాను బలియగుట కొప్పుకొనెద నని రెడ్డితోఁ జెప్పెను. చెవిరెడ్డియు వానికోరిన నియమముల కన్నిటికి నొప్పుకొని యప్పుడే వాని న్నాపొలమునకు బలిపెట్టి యానిక్షేపమును స్వాధీనము చేసికొనెను. తరువాత నతఁ డాక్షేత్రమున రేచెర్ల యను గ్రామమును గట్టించి, ఆ గోత్రమును రేచర్లవా రని మార్చుకొని, ఆయూరువిడిచి పిల్లలమఱ్ఱి యను గ్రామముచేరి యాచోటు నివాసముగాఁ జేసికొనెను. ఈ గ్రామమునం దతఁ డొకనాఁడు రాత్రి చీఁకటిపడువఱకును పొలములోఁ బని చేసి యింటికి వచ్చుచుండఁగా దారిలో నురుములతోను మెఱుపులతోను గొప్ప వానవచ్చెను. ఆవానలో నతఁ డొక మఱ్ఱిచెట్టుక్రిందికిఁబోయి నిలువఁబడియుండఁగా, చెట్టుమీఁదినుండి యొకభూతము దిగివచ్చిన ట్లాతనిదృష్టికిఁ గనఁబడెనఁట! అతఁ డింతమాత్రమును జడియక చేత ఖడ్గముధరించి యెదురుగా నడువఁగా, ఆతని ధైర్యసాహసములకు మెచ్చి యాబేతాళుఁడు చెవిరెడ్డియు నాతని సంతతివారును శౌర్యసామ్రాజ్యైశ్వర్యవంతు లగుదురనియు శత్రులతోడి యుద్ధములో నెల్ల దానుపోప్పడి వారికి జయము కలిగింతు ననియుఁ బలికిన ట్లాతనిచెవులకు వినఁబడెనఁట! బేతాళుఁ డాతనికిఁ బ్రత్యక్షమయి వరములిచ్చె నన్నవార్త దేశమునం దంతటను వ్యాపించి యు

చిరకాలములోనే కాకతీయప్రభు వయిన గణపతిరాజు చెఱసోఁకఁగా, అతఁడా చెవిరెడ్డిని తనరాజధాని యైన యోరుగల్లునగరమునకు రప్పించి లక్షరూపాయలు వచ్చు గ్రామము లిచ్చి తనవద్ద సేనాపతినిగా నియమించి „పిల్లలమఱ్ఱి బేతాళనాయఁడు" అన్నబిరుదు పేరిచ్చి గౌరవించెను. ఇది ౧౨౧౦ వ సంవత్సరప్రాంత మయియుండును.

ఈతఁడు చేసినని యమముల ననుసరించి యీతనివంశమువారు నేటివఱకును యాచనామమునుగూడఁ దమపుత్రులనామమునకుఁ జేర్చుచు, తమ యింట వివాహము జరుపుటకు ముందుగా నొకమాలవానికిఁ బెండ్లిచేయుచు, పూర్వ మర్యాదను జెల్లించుచున్నారు. చెవిరెడ్డియొక్క ద్వితీయపుత్రుఁ డయిన ప్రసాదాదిత్యనాయఁడు గణపతిరాజుయొక్క మరణానంతరమునం దాతనిభార్యకును బుత్రికకును సహాయుఁ డయి యుండి రాజ్య మన్యాక్రాంతము కాకుండఁ గాపాడి కాకతిరాయ రాజ్యప్రతిష్ఠాపనాచార్యుఁడని బిరుదందెను. వెలిగోటివారని పేరు రావువారు. ఈరావువారు మొదట నోరుగల్లురాజ్యమునకే యుండి పిదప విడిపోయి, తరువాతఁ దమపౌరుషమువలన సర్వభూమిని నాక్రమించుకొని స్వస్థానప్రభువులయిరి. ఈవంశమువారిలో నొకఁ డగు తిరుమలనాయఁడు కృష్ణదేవరాయలరాజ్యకాలములో వెలుగోటిరాజ్యమును సంపాదించి వెలుగోడుపట్టణము తన రాజధానిగాఁ జేసికొన్నాఁడు, అతనివంశమువారిప్పటికిని వెలుగోటివారని పిలువఁబడుచున్నారు. కృష్ణమయూరవిలాసకృతిపతియొక్క తాతయైన పెద్దయాచమనాయఁ డావలి కన్యాక్రాంతమయిన వేంకటగిరిపురమును మరల స్వాధీనపఱచుకొని దానిని స్వరాజధానిని జేసికొనఁగా నాఁటినుండియుఁ దత్సంతతివారు వేంకటగిరియే రాజధానిగా నున్నది. చెవిరెడ్డివంశజులలో నొకఁడగు సర్వజ్ఞ సింగమనాయఁడు బమ్మెర పోతనామాత్యునివలన నుద్దండభోగినీదండకము శ్రీనాథునివలనఁ గొన్నికృతులను బొందుటయేగాక తాను పండితుఁడయి సింగభూపాలీయ మను నలంకారశాస్త్రము మొదలగు సంస్కృతగ్రంథములను సహితము రచించెను. ఆతనివంశజులలో నొకఁ డగు రాయపనాయఁడు ౧౫౨౦ వ సంవత్సరప్రాంతముల యందు భానుమతీపరిణయము కృతినందెను. ఈవెలుగోటివా రిప్పటికిని తెలుఁగుకవుల నాదరించుచున్నారు. కవిత్వరీతి తేటపడుటకయి కృష్ణమయూరవిలాసము లోని రెండుపద్యముల నుదాహరించుచున్నాను—

చ. ఇటువలె నేమి యాపయుఁ డిశ్చను మీ రఖిలేశ మాయలన్
బటువగు విష్ణుఁ డంచనెదుపల్కులు సిద్ధము సుందరీ కితా
కుటిలశిరోజయైన హరి గొబ్బునఁ జూచితి రేని మీకు నా
క్కటుఁ జపలత్వ మైంతటి గౌరవ మెట్లగునో తలంపుఁడీ.—ఆ. ౧.

చ. వనయువతీవసంతులకువివాహమహోత్సవవేళ నెమ్మెయిం
దనరు కుతూహలంబున లతాలలనల్ కరపల్లవంబులన్
ఘనముగ సేసవెట్టుటకుఁగా ధరియించినమౌక్తికంబులో
యనఁ దలసిల్లె నెల్లెడ సుహాసుమరాజికిఁ గోరకావళుల్.—ఆ 3.

పైడిమఱ్ఱి - వేంకటపతి.

ఈకవి చంద్రాంగదచరిత్ర మనెడి యాఱాశ్వాసముల ప్రబంధమును రచించి యున్నాఁడు. ఈతనికవిత్వము మిక్కిలి ప్రౌఢమయి రసవంతమయి పూర్వకవుల రచనమువోలె హృదయాహ్లాదకర మయినదిగా నున్నది. ఇతఁడు తనగ్రంథమును శ్రీరామాంకితము చేసియుంటచేఁ గృతిపతినిబట్టి యీతనికాలనిర్ణయము చేయుట కాధారము కనఁబడలేదు. ఉన్నయాధార మంతయు కృతికర్త వంశవర్ణనము చేసికొన్న యీక్రిందిపద్య మయియున్నది—

సీ. సకలసత్కవిఘోష్యసుకవిత్వసామ్రాజ్యనిర్వాహకుఁడు పెద్ద పర్వతన్న
వివిధభాషావార్యపరచనాచాతుర్యసర్వంకషుఁడు బోడిపర్వతన్న
వరపద్యదాకార వాచాచమత్కారనిరుపమమతిశాలి తిరుమలన్న
యవధానకృతిగర్భకవితాచ్ఛపందర్భకీర్తిసంప్రజ్ఞుఁడు కేశవన్న
దనకు నన్నలు గాఁగను దనరుకృష్ణ। రాయభూషణకులరామరాజతనయ
కేశవాత్మజ పర్వతాఖ్యసు వేంక। టాద్రి నిదె కవ్య మేస్తు నంకితముగ.

ఇందలిపేరులనుబట్టియు కవికాల మిదియని నిశ్చయించుట కాధారము దొరకలేదు. ఇందు కృష్ణరాయభూషణ యనుపద ముండుటనుబట్టి కర్నల్ మెకంజీదొరగారు సంపాదించిన లిఖితపుస్తకములపట్టికలో కవి కృష్ణదేవరాయని కాలములోనివాఁ డని చెప్పఁబడి యున్నది. ఇటీవల బ్రౌన్దొరగారు నిఘంటువునం దీకవి యాధునికుఁ డని వ్రాసియున్నారు. పయిపద్యములో నున్నకృష్ణరాయభూషణశబ్ద మాకవికి కృష్ణదేవరాయనియాస్థానమున కలంకారముగా నుండుటచేతనే వచ్చెనన, ఈకవి కృష్ణరాయభూషణుని వంశజుఁ డగురామరాజుకొడు కైనకేశవార్యునిపుత్రుఁ డగుపర్వతాఖ్యునిసుతుఁ డగు వేంకటపతి యగుటచేఁ గృష్ణదేవరాయని యనంతరమునఁ బెక్కుతరములు గడచినతరువాత నున్నవాఁ డగుట స్పష్టము. అప్పకవి యీచంద్రాంగదచరిత్రములోనిపద్యముల నుదాహరించి యుండకపోవుటచేత నీకవి ౧౬౫౦ వ సంవత్సర

మునకుఁ దరువాతివాఁ డనియు నూహింపఁ దగియున్నాఁడు. అందుచేత కవి ౧౭౦౦వ సంవత్సరప్రాంతములయం దున్నవాఁ డని తోఁచుచున్నది. చంద్రాంగదచరిత్రము నుండి కొన్ని పద్యముల నిం దుదాహరించుచున్నాను—

ఉ. అప్పుచు లాడుచున్ నగవు లాడుచు బారలు సాఁచిసాఁచి మా
యప్పలు వచ్చి రంచు సకియల్ గనుదమ్ములు మెచ్చి పిల్వఁగా
గుప్పునఁ దప్పుతప్పటడుగుల్ నడలం గొమరుండు పైఁబడుం
దప్పక చూచు తల్లికిని దండ్రికి ముచ్చట తీఱునట్లుగన్.—ఆ. ౧.

మ. హరిమ్రోలం గడుపోటుబంటు నయి గర్వాలాపముల్మున్న స
త్వరతం బల్కితిఁ గొన్ని నోఁకొలఁదుల్ తథ్యంబు నేఁ డన్నియున్
బరఁగం బందనుఁ జెప్పసాధనగతిన్ బాటిల్లె వ్యర్థంబులై
సురలోకంబున నేగు టెట్లు సమయున్ ల్పన్నల న్నవ్వఁగన్.—ఆ. ౩.

సీ. భుజగలోకాధీశ భోగితల్పశయాన హరిరూపధర మహాపురుష యనుచు
నకులార్కకులటవర్తితపాదరాజీవ రామార్చనీయ శ్రీరంగ యనుచు
మారీచమదభంగ మహితవాంఛవ్యాఘ్ర శరదనిద్రితనేత్ర శౌరి యనుచు
సముద్రగర్వాపహర యోగనిద్రాణ కంజనాభ వరద శ్రీకాంత యనుచుఁ
దలఁచు నుతియించు నలుకు ల్గిలుచుఁ బలుకు | సఖులనయున స్వరశిరోంఘ్రచరణకలన
పవనశంపగ్రఘనహంస వనతులగ | భటనటప్రియసముదాయ పటిమ దోఁచ.ఆ. ౪.

ఉ. ఓరిమృగాంక నాఁడడుకు నోఁడనరాహువు కిన్క నంకమున్
నేఁ విస బు నీయొడలఁ గరఁగఁ గోరలకొగ్గి నక్కి డు
ర్వారగరిత్త్వదీయనరవారవిషంబుల నొంచసాఁగఁ బె
న్వేఁముఁ బాఱ యొప్పదిచి నీదగుచేతఁగఁ జాడ కమ్మెయున్.—ఆ. ౫.

వెలగపూండి కృష్ణయ్య.

ఈకవి భానుమద్విజయ మనెడియైదాశ్వాసముల ప్రబంధము రచియించెను. మఱియు నితఁడు మాలతీమాధవీయము, గౌళికాశాస్త్రము, చతుర్విధకందశతకము, అను పద్యకావ్యములను, వేదాంతసారసంగ్రహ మను వచనకావ్యమును, రచించినట్లు భానుమద్విజయములోని యీక్రింది పద్యములోఁ గవి చెప్పుకొనియున్నాఁడు—

సీ. మహిలోన మాలతీమాధవీయ మనంగ శృంగారకావ్య మొసంగఁజేసి
గౌళికాశాస్త్రంబు కవులోకహితముగా నెనయు నేకాశ్వాసమున రచించి

షట్ఛల్లక్షగంధపద్యపుశతకంబు నాల్గుయోగంబుల ననువుపఱచి
సన్నుతవేదాంతసారసంగ్రహశాస్త్ర మమరంగ వచనకావ్యం బొనర్చి
చాటుకృతులను మఱికొన్ని సంఘటించి । మాతులాంకితమొనరించి మించినట్టి
శాలియగు గీర్తిఁ గైకొన్న సత్కవీంద్రు । మధురవాక్సాంద్రుఁ గృష్ణయామాత్యచంద్రు

పూర్వ మీతనివంశపువారు గాంగేయోపాఖ్యానము, సుమంతోదయము, ఆంధ్రకర్ణామృతము, వజ్రభుజోపాఖ్యానము, సేతుమాహాత్మ్యము, దత్తాత్రేయచరిత్రము, మర్యాదరామసచివచరిత్రము, మొదలగుగ్రంథములను రచియించియుండినట్టును గవి యీక్రింది పద్యములతోఁ జెప్పియున్నాఁడు—

క. భూనుతగాంగేయోపా । ఖ్యానసుమంతోదయాంధ్రకర్ణామృతముల్
మానిత వజ్రభుజోపా । ఖ్యానము శుభహేతుసేతుమాహాత్మ్యంబున్.

క. దత్తాత్రేయచరిత్రన్ । సత్తగు మర్యాదరామసచివచరిత్రన్
బిత్తరపుఁ గృతులు చేసిన । యుత్తమకవు లెల్ల మీకులోద్భవు లనఘా.

ఈకవి యాఱువేల నియోగిబ్రాహ్మణుఁడు; ఆపస్తంబసూత్రుఁడు, లోహితసగోత్రుఁడు; వెల్లపూడి నారసింహార్యపౌత్రుఁడు; నరహరిమంత్రి పుత్రుఁడు. ఈకవి పాండ్యమండలాధీశ్వరుఁ డైనవిజయరంగచొక్కభూపాలుని దండనాథుఁ డగుసాంబయామాత్యునిపుత్రుఁ డగుగోవిందయామాత్యునికి మేనమఱఁది యైన ట్లీక్రిందిపద్యమునఁ జెప్పుకొన్నాఁడు—

సీ. పాండ్యభూమండలాఖండలుం డై విజయరంగచొక్కభూజాని కస్త
మందనుం డగుసాంబదండనాథాగ్రణితనయులలో మేటిదండి యగుచు
సంగీతసాహిత్యసంస్కృతాంధ్రకవిత్వసరసజ్ఞుఁ డై మేనమఱఁది యగుచుఁ
గొమ రొప్పుచుండెడుగోవిందయామాత్యుఁ డనుపమవిద్యాధికార్యసభను
నిండుకొలు వుండె నపుడు నే దండఁ జేరి । సారసల్లాపముల మీఱి చతురమతిని
దక్షిణామూర్తికృపనుప్రత్యక్షమగుచుఁ । గృతిపతిత్వంబుఁ గోరుసంగతిని దెలుప.

ఇందుఁ జేర్కొనఁబడిన విజయరంగ చొక్కభూపాలుండు దక్షిణమధురాపురము రాజధానిగా పాండ్యమండలమును క్రీస్తుశకము ౧౭౦౪ వ సంవత్సరము మొదలుకొని ౧౭౩౧ వ సంవత్సరమువఱకును పాలించిన ట్లీవఱకే చెప్పఁబడెనుగదా? అందుచేత నీ కృష్ణకవియు నాకాలపువాఁడే యని వేఱుగఁ జెప్పనక్కఱలేకయే తెలిసికోవచ్చును. కవి సాంబదండనాథుని వర్ణించుచు

సీ. సరిబేసిచక్రకోటీసాదులాఖాయతో ఘటియించె నెవ్వాఁడు ఘనతమీఱఁ
జెక్కిదంజావూరుశేషువాళయానందరావును నెవ్వాఁడు రహి నడంచె

. మయినూరినంజరాజయగరిప్రియవాక్యసంధికి నెవ్వాఁడు శక్తుఁ డాశ్చె
* * * సదుపకారి శ్రీవరహస సాంబశౌరి.

అని యతఁడార్కాటినవాబగు సాదతుల్లాఖాను మొదలగువారి నోర్చినట్లు చెప్పియున్నాఁడు. ఈసదతుల్లాఖాను ౧౭౧౦ వ సంవత్సరము మొదలుకొని ౧౭౩౨ వ సంవత్సరమువఱకును నవాబుగా నుండి యార్కాటురాజ్యము చేసెను. కాఁబట్టి కవి ౧౭౨౦ వ సంవత్సరప్రాంతమునందు మధురాపురములో భానుమద్విజయమును రచియించియుండును. ఈతనికవిత్వము రసవంతమైనది. కవితాధోరణి తెలియుటకయి భానుమద్విజయములోని రెండుపద్యముల నిందుదాహరించుచున్నాను—

ఉ. ఏమియు లేనివారలె మహోన్నతిభావము లందుచుండఁగా
భూమిపతిత్వ మొందినప్రభుల్ వ్యసనంబులఁ గాంచు టబ్రమౌ
నేమయిన న్నమేయధృతి నేర్పడఁ బూని సమస్తకార్యముల్
తాము వహించిచూడవలె ధాత్రి యరాజక మౌను భూవరా — ఆ. ౨

మ. గిరులం బాఱెడివేగులల్లుగ వడిం గీలార్కసన్నికర్ణులా
గురువక్షోరుహతారహారములతోఁ గూడం బ్రకాశింప నా
ధరణీశాంగన దస్రహార్తిగతసంతాపంబుచే నేడ్చె భా
స్వరవాసంతికిస్వరాకలితవాహామాధురీశైఖరిన్.— ఆ. ౪

శేషము — వేంకటపతి

ఇతఁడు శశాంకవిజయ మనెడి యైదాశ్వాసముల శృంగారప్రబంధమును జేసి వంగలసీతయార్యునకు కంకితము చేసెను. శశాంకవిజయమునకు తారాశశాంకమని నామాంతరము గలదు. ఇందుఁ జంద్రుఁడు బృహస్పతివద్ద విద్యాభ్యాసమునకయి చేరి గురుపత్నియగు తారనింటినుండి లేవఁదీసినకథ మిక్కిలి పచ్చిగా వర్ణింపఁబడినది. ఈశేషము వేంకటపతి నియోగిబ్రాహ్మణుఁడని తోఁచుచున్నది. ఇతఁడు కందాళరామానుజాచార్యుని శిష్యుఁడు; కృష్ణయార్యునికుమారుఁడు. కృతినాయకుఁడు తన్నుఁ బిలిపించి పలికినట్లు చెప్పఁబడిన యీక్రిందిపద్యములలో కృతిపరంపరలు చేసినట్టు కవి చెప్పుకొనుటయే కాని యొక్కగ్రంథమునైనను పేర్కొనియుండలేదు. —

క. నను రంగేశ్వరపదయుగ। ఘనతరభజనానిరూఢకవితాసామ్రా
జ్యుని శేషుకృష్ణసుధీ। తనయునిఁ బిలిపించి పలికె దయవైవారన్ .

చ. అసదృశభక్తి సద్గురుకటాక్షముఁగాంచి సమంచితాత్మతన్
బిసరుహమాకరందరసపేశలకౌశలవస్త్రధూర్తులన్
రసికుల కింపుగాఁ గృతిపరంపరలన్ రచియించి కీర్తిచే
నెసఁగితివయ్య వేంకటపతీ బళి శేషమువంశసత్కృతీ.

ఈకవి పాండ్యమండలాధీశ్వరుఁడైన విజయరంగ చొక్కనాథుని కాలములో నున్న ట్లీవఱకే సముఖ కృష్ణప్పనాయకునిగూర్చి వ్రాయునప్పుడే చెప్పఁబడెనుగదా! కవియు తారాశశాంక కృతినాయకుఁడైన వంగల సీనయామాత్యుని వర్ణించుచు, అఖండమండితమహీమండలమండనాయమానపాండ్యమధురాధరాఖండల శ్రీవిజయరంగచొక్కనాథ మహీనాథ కృపాకటాక్ష వీక్షణాయుక్షణ వర్ధమాన.........నిఖిల సంపత్సంపరాకంపితబలింపనాయకుండని యతని కొక విశేషణమును ప్రయోగించియున్నాఁడు. మఱియు ద్వితీయాశ్వాసారంభమున

క. శ్రీవిజయరంగచొక్కక్ష్మాపానుగ్రహప్రసాదసంపన్నాత్మా
శ్రీవరదాచార్యమణీ! శ్రీవరదాస్యైకకృత్య సీనామాత్యా.

అని కృతిపతిని సంబోధించియున్నాఁడు. దీనినిబట్టి కవి విజయరంగచొక్కనాథుని కాలములో మధురలో నుండుట నిశ్చయ మగుటచేతను, ఆరాజు ౧౭౦౪ వ సంవత్సరము మొదలుకొని ౧౭౩౧ వ సంవత్సరమువఱకును రాజ్యముచేసినవాఁ డగుటచేతను, శేషము వేంకటపతి యాకాలమునం దున్నట్లు స్పష్ట మగుచున్నది. అక్కడక్కడ క్త్వార్థక సంధి మొదలయిన కొన్ని లక్షణదోషము లున్నను, కవిత్వము మొత్తముమీఁద ద్రాక్షాపాకమయి మిగుల రసవంత మయియున్నది. చక్కఁగ నెత్తి పసువలె నీతిమాలిన యీ కథ మనోహరము లయిన తేటమాటలతో నింపుగా చెప్పఁబడినందున, అనేకులయిన యౌవనపురుషుల నాకర్షించి పాడుచేయుచున్నది. దుర్నీతిని వర్ణించునప్పు డీకవి తనయసమ్మతిని దెలుపువాక్యము లెక్కడను ప్రయోగింపక, "లోకము లోఁ గొందఱబలల్.........తాటాకులలోన వ్రాసిరి పరాంగనఁగూడినఁ బాపమంచు, మిన్నుపువ్వులన్ వ్రాలదు తేఁటి యట్లు మగవాఁ డనువానికి దోస మున్నదే" యిత్యాదివాక్యరత్నముల చేత వలపుగలచోటఁ గలయుటయే పరమార్థ మన్నట్లు తెలిపి పామరులను భ్రమింపఁ జేసియున్నాఁడు. అంతను మంచిదని సాధించుటకు సహితము మనవారికి పురాణములనుండి దృష్టాంతములు తండోపతండములుగా దొరకు ననుట కీక్రిందిపద్యము నిదర్శనముగాఁ జూపవచ్చును —

సీ. కన్నకూఁతు రటంచు నెన్నక భారతీసతిఁ గూడఁడే నీపితామహుండు
మేనత్త యనుమేర మీఱి రాధికతోడ నెనయఁడే నీయన్న నీయనుఁగుబావ

వరిసెనుంచు నొకింత వావి లేకయు జ్యేష్ఠునెలంతతోఁ బొందఁ జేసె నీగురుండు
మునిపత్ని యన కహల్యను బట్టఁ జేసె నీదుసహపాఠి యగుపాకశాసనుండు
యిట్టిమీవారిచరితలు కట్టిపెట్టి యమ్మ నేచెల్ల న్యాయంబు లాడె దౌర!
కడు నీఱుకు నీ వెఱుంగవితా! మాటువవు నన్నుఁ జెప్పెదు దోసకారి!

„మున్నలదారుకావనస్త్రీలు శివునిం గలియరే? వ్రజభామలు కృష్ణుఁ గూడరే? యీలలనాశిరోమణుల కందుకు నిందుకు నేమి చెప్పుమా' యఁట! ఆహా! ఏమి యీదేవత్వలక్షణము! దేవత్వమున కిప్పుడు శుద్ధపాత్రమే లక్షణముగా నుండవలయును గాని నీతిమాలి పరకాంతలఁ గలయుటుంటె నాసురకృత్యము మఱియేముండును?

ఉ. ఎవ్వనిఁగూర్మిమోహమున నేనిటు పిన్నటనాఁటనుండియున్
బెంచితిఁ బెద్దఁ జేసితిని జేర్చికఁ బ్రాయము వచ్చినంతనే
యెంచక మాటలాడె నిపు డిన్ని ప్రియోక్తుల కిమ్ముపుట్టెఁగా
మించిరి నిన్నుఁ గూడుటకు మాకు స్వతంత్రత లేకపోయెనే?

గురుపత్ని శిష్యునిఁ జిన్ననాఁటనుండియుఁ బెంచి పెద్దవానిఁ జేసెనఁట! అందుచేత వానికామెఁ గూడుటకు స్వాతంత్ర్యము గలదఁట! ఏమి యీదుర్నీతి! దుర్నీతి యింతకంటెను మానవులు సహింపఁ జేయుదురా? కృతయుగమునం దైనను కలియుగమునం దైనను జారత్వ మెప్పుడును మొదలంట నశింపదు. కృతయుగపు తారలును చంద్రులును మన యీకలియుగమునందును గలరు అయినను మన యీకాలపు కలియుగపుజనులు మాత్రము యిల్లువిడిచి లేచిపోయిన స్త్రీని మగని కప్పించుటకయి పెద్దమనుష్యులుపోయి జారుని బతిమాలుటయు, మగని కప్పించిన యాఱుమాసములకే సంతానము కలిగినప్పుడు జారపురుషుఁడువచ్చి పెట్టినబిడ్డ కయి యింటిమగనితో తగవులాడుటయు లేదు. ఇవి కృతయుగధర్మములు కాఁబోలును! దూరపుకొండలు నునుపన్నట్లు ఆకటివారియకృత్యములు కంటికి ముద్దుగాఁగా మనవారు పూర్వకాలమును పొగడుచుందురు. బ్రహ్మదేవుఁడింతలోవచ్చి భార్యను గోలుపోయి దుఃఖించుచున్న బృహస్పతికి తారను మరల నిమ్మని చంద్రుని ప్రార్థించెనఁట!

చ. అని పరమేష్ఠి పల్కుటయు నట్లకాకని చంద్రుఁ డయ్యెడన్
ఘనతరగర్భభార నఖకాంతివిదీప్తితతారఁ దారఁ దా
ననునయపూర్వకంబు దెలిపి యంపి తోడనె దివ్యతూర్యని
స్వనములు మ్రోసె మింట విరివానలు పర్వెను జంట జంటగన్.

బ్రహ్మదేవుని ప్రార్థన నంగీకరించి చంద్రుఁడు గర్భవతియైయున్న గురుని భార్యను గురుని కియ్యఁగానే, తమగురునిల్లు పాలఁబ్రోచి యింతటి ఘనకార్యమును జేసినందున కాతని

మీఁద సిగ్గులేక నగలు విరులవాన గురిసిరఁట!

చ. అమరులతోడ నప్పు డవి రబ్జభవుండు భవుండు సద్గురుం
బ్రమదము మీఱఁగాఁ బిలిచి మావచనంబునఁ దారఁ జెందుమీ
రమణి కశుద్ధి లే దమృతరశ్మిని బొందుటచేత దాన నీ
కోమ పరిశుద్ధిఁ గాంచెఁ గయికొమ్మనఁ గొమ్మ గురుండు చేకొనెన్.

దేవతలును బ్రహ్మరుద్రులును గురునిఁబిలిచి వ్యభిచారదోషము లేకపోవుటయేకాక యమృతరశ్మిని బొందుటచేతఁ దార పరిశుద్ధురాలయ్యెనని చెప్పి యొప్పగించిరఁట.

ఉ. తత్సమయంబునన్ శశి ముదంబున నచ్చటి కేగుదెంచి పు
త్త్రోత్సవ మాచరింప విని యుద్ధతితో గురుఁ డందువచ్చి య
స్మత్సుతుఁ డీబుధుం డిట నిశాకర రాఁ గత మేమి నీ కన
న్మత్సరబుద్ధి వారికిఁ బునఃకలహంబు జనించె నయ్యెడన్.

ఆపతివ్రతాతిలకముకు పుత్త్రుఁడు పుట్టఁగానేవచ్చి చంద్రుఁడు పుత్త్రోత్సవ మాచరించినప్పుడు గురు శిష్యులకు పునఃకలహము జనించెనఁట!

క. నావిని యజుఁ డోహోహో । మీవాదము చాలుఁ గుముదమిత్త్రునిపుత్త్రుం
డీవత్స మితనిఁ జంద్రుని । కీ విమ్మా వలదు విరస మిఁక నాంగిరసా.

అని బ్రహ్మదేవుఁ డంటిమగనికి బుద్ధిచెప్పి శిశువును తేరమగనికిప్పించి వివాదము తీర్చెనఁట! ఈవిషయమునే చెప్పుచుఁ గాశీఖండములో

గీ. చదివె గురునొద్ద ధర్మశాస్త్రంబుఁ దొలుత । బరమవిశ్వాసతాత్పర్యభక్తిగరిమఁ
జదివెఁ జంద్రుఁడు కామశాస్త్రంబు పిదపఁ । దలిరుఁబోఁడ్వ ననురక్తిఁ దారయొద్ద.

సీ. భువనైకధన్వి చేఁ బుష్పాయుధునిచేఁ బ్రసవాస్త్రమున నేటు పడనివాఁడు
నతిగాఢ మైత్త్రోత్థాంధకారంబుఁ గన్నుల నంధుండు గానివాఁడు
నిశ్చిబంధనలోభనిద్రాభరంబునఁ బారవశ్యంబుచేఁ బడనివాఁడు
లక్ష్మీకటాక్షవిలాసదుర్మదమున మనములోపల నన్ను గొననివాఁడు
లేఁడు భూపతి గలిగెనే న్వాఁడు నృపుఁడె । విశ్వధాత్రీజనులపాలివేల్పు గాక
బాహ్యశత్రులఁ బరిహరింపంగవచ్చు । నంతరరులను వర్జింప నలవికాదు.

ఈవిధముగా శ్రీనాథుఁడు చెప్పినరీతి ప్రౌఢవాక్యములు గాని, పురూరవశ్చరిత్రములో

క. పాపపరాఙ్ముఖతామతి । దీపాంకుర మానెలంతదీర్ఘశ్వసితా
టోపమునఁ ద్ధతి నడఁగి । బ్రాపితమోహాంధకారబంధురుఁ డయ్యెన్.

సీ. లలనానితంబమండలముపై నుత్పలదళములు రచియింపఁ దలఁచుఁగాని
తరుణికెమ్మోవిమీఁదఁ బ్రవాళమణిసొంపు గులుకఁగా ఘటియింపఁదలఁచుఁగాని

జలజాక్షికుచకుంభములమీఁద శశిపుత్రంబుఁ దా నొనరింపఁ దలఁచుఁగాని
మృగరాజమధ్య నెమ్మేను లతావేష్టితంబుఁ జేయఁగాఁ దలఁచుఁగాని
తలఁపఁ డెప్పుడు గురువనితా సమాగమాగతాత్యుగ్రదురితదవానలంబు
దుస్సహం బకటకటా తొలఁగించుట యెఱుఁగఁడుగదా వివేకంబు కాముకులకు?

సీ. సకియకౌఁగిటఁ దలఁచి సన్మార్గమనుఁగాని యింతిదుర్మార్గత నెంచఁడయ్యెఁ
జెలువచన్నవఁ దలంచి సువృత్తమనుఁగాని తరుణికువృత్తంబుఁ దలఁపఁడయ్యె
నలినముఖిఁ దలంచి యకళంకమనుఁగాని తెఱవకళంకంబుఁ దెలియఁడయ్యె
సుదతివప్పుఁ దలంచి శుచి యనుఁగాని యువ్వెలఁదుక యశుచి భావింపఁడయ్యె
గురువువంటిమహాత్ముఁ డిక్కురంగిణిఁ దరుణి చక్కఁదనమే గుణంబుగ సంస్మరించుఁ
గానివ్యభిచారదోషంబుఁ గాంచఁడయ్యె నజ్ఞుఁడో ప్రాజ్ఞుఁడన నెవ్వఁడవనినింక?

ఈవిధముగా నబ్బయామాత్యుఁడు చెప్పినరీతి నీతిబోధకవాక్యములు గాని, తారాశశాంకమున లేవు. కవియొక్క రచనను దెల్పుపద్యములు కొన్ని యుదాహరించుచున్నాను—

చ. హతబహుశిల్పిపం బగు ప్రయోగము యాగముదావహంబు సాం
ప్రతముగ నందు నింద్రికఁ బట్టనఁ బట్టణమున్ సృజింపుమా
యతులితశిల్పశక్తి గొని యంచని యంచ నియూఢి నెక్కి యం
చితగతి ధాత యేగ నుపసిద్ధులు సిద్ధులు తత్సృజింపఁగన్.—ఆ. ౧.

చ. అలకలినాతి పాల్పు నిజయావ వేశస్వకీయబింబలీ
లలు తననెమ్మొగంబనఁ గళంకరుచుల్ నుమీసకట్టుఁగా
వలమదయానుణద్యుతులు వాతెఱ వెన్నెలడాలు లేఁతన
వ్వుల నమృతంబు పల్కులని బూనెనునాఁగ మనోహరాంగుఁడై.—ఆ. ౨.

ఉ. చందురుఁడుం బురందరగురుశాతశరాహతిఁ గంది నివ్వెఱం
జెందఁగ నింద్రుఁ డిట్లను శశీ వినుతా విఁగానిపాలికిం
బంధితవాని కార్తి యగుదా గురుదారకృతాపరాధమే
ధం దిగఁద్రోచి చేసితి వృథా ఖలభావలితో విరోధముల్.—ఆ. ౫.

కూచిమంచి-తిమ్మకవి.

ఈకవి యనర్గళ మయినకవితాధార గలవాఁడు; బహుగ్రంథములను రచియించినవాఁడు; ఇన్నిగ్రంథములను సలక్షణ మయినమృదుమధురపాకమున రచియించిన కవి యాంధ్రకవులలో మఱియెవ్వఁడును లేఁడు. ఈకవి యారువేలనియోగిబ్రాహ్మణుఁ

డు; కౌండిన్యగోత్రుఁడు; బయ్యనామాత్యుని ప్రపౌత్రుఁడు; తిమ్మయామాత్యుని పౌత్రుఁడు; గంగనామాత్యుని పుత్రుఁడు. ఇతనికి లచ్చమాంబ తల్లి; జగ్గన్న, సింగన్న, నరసన్న, పితృవ్యులు; వీరమ్మ పాపమ్మ, మేనత్తలు; సింగన, జగ్గన, సూరన, తమ్ములు; గొట్టుముక్కల రామయామాత్యుని కూఁతురైన బుచ్చమ్మ భార్య. ఈవిషయములను రుక్మిణీపరిణయములోని యీక్రిందిపద్యము తెలుపుడు చేయుచున్నది—

సీ. గురుతరకౌండిన్యగోత్రవిఖ్యాతుండు బయ్యనామాత్యుఁ డేశవ్యతాత
నిరతాన్న దానవర్ణితయశస్సాంద్రుండు తిమ్మనసచివుఁ డేధీరుతండ్రి
ఘనులుజగ్గనయు సింగనమంత్రియును నరసన్నయు నేమంత్రిజనకుఁ దమ్ము
లలరఁ దిమ్మకవి సింగన్న జగ్గనయును సూరన యేధన్యునతవరేణ్యు
లానర వీరమ్మ పాప మేఘనునిసహజ । లతిపతివ్రత లక్ష్మి యేచతురురాణి
యట్టి శ్రీకూచిమంచివంశాబ్ధిచంద్రు । మజ్జనకు నలగంగనామాత్యుఁ దలఁతు.

ఈమధ్యను ముద్రింపఁబడిన రుక్మిణీపరిణయములో నీపద్యములోని నాలవపాదమున సింగన్న యనుటకు మాఱుగా రాజన్న యని యున్నది కాని యది యచ్చుతప్పని తలఁచెదను. తిమ్మకవికి సింగన్నయు జగ్గనయు సూరనయు నే కాని రాజన్న యనుతమ్ముఁడు లేనట్టులతఁడు రచియించినపుస్తకము లన్నిటివలనను దెలియవచ్చుచున్నది. అందు సింహాచలమాహాత్మ్యములోఁ గవి తనవంశవర్ణనము చేయుచుఁ బెద్దతమ్ముఁ డగుసింగన్నను గూర్చి చెప్పిన పద్యముల నిం దుదాహరించుచున్నాను—

క. నాతమ్ములు సింగనయును । ఖ్యాతయశుఁడు జగ్గయును ఘనతరసుగుణ
వ్రాతాంకుఁడు సూరనయును । భీతాంగమూహము లలరుచు వెలసిరి సిరులన్.

సీ. వక్రించు చందురు వదలక మూఢత నలరెను సురమంత్రి నపహసించి
సాముల ంగూడి యుశనుని బుధేంద్రుని గన నోడు నచలప్రసంగవృత్తి నెంచి
శ్రుతిదూరుఁడై చరించుచు రెండునాలుక లొనగి యుండె శేషభోగికులుండు దగడి
భంగము నొంది యేపట్టున నడలెను రత్నాధివాసుఁ దిరస్కరించి
ప్రజ్ఞచే గౌరవమున వాక్పాటవమున । సూనృతగాంభీర్యమున జనుల్ పొగడ నెగడెఁ
గూచిమంచ్యన్వయాంభోధికుముదహితుఁడు । శిష్టహితచింతకుఁడు గంగయసింగమంత్రి.

కవియొక్క జన్మసంవత్సర మేదో తెలియదు గాని యితఁడు రచియించినగ్రంథములలో నెల్లను మొదటి దగు రుక్మిణీపరిణయము

ఉ. ఆరయ శాలివాహనశకాబ్దము లద్రిగుణాంగచంద్రులం
జేరగు మన్మథాబ్దమునఁ బ్రేమఁ బ్రబంధ మొనర్చి మీకిటుల్

చేఁకతోఁ సమర్పణము చేసితి మీకృతి యాతమిస్రసహ్య
శైత్యకరవమిత్రతారకముగా భువిఁ జెల్వగుఁ గాత శంకరా.

అను పద్యమునుబట్టి శాలివాహనశకము ౧౬౬౭వ సంవత్సరము మన్మథాబ్దమునకు సరియైన పాశ్చాత్యశకము ౧౭౪౫వ సంవత్సరమునందుఁ జేయఁబడిన దగుట స్పష్టమయినందున, కవి యప్పటి కిరువదియైదు సంవత్సరముల ప్రాయము వాఁడయిన పక్షమున ౧౭౨౦వ సంవత్సరప్రాంతమునఁ బుట్టినవాఁడై యుండవచ్చును. అచ్చతెలుఁగు రామాయణములోని

గీ. మునుపు మాకీవె భళ్హాణుఁ డనెడి శౌరికథయు రుక్మిణి పెండ్లికథయుఁ బొల్పు
మెకపుగుబ్బలికథయు మేల్మి నీలపెండ్లికథయును గబ్బముల్ పేర్మిఁ గూర్చి.

అను పద్యమునుబట్టి భల్హాణరాజచరిత్రము రుక్మిణీపరిణయమునకంటె ముందుగా రచియింపఁబడినట్లు భ్రమ కలుగును గాని నిజ మారయఁగా రుక్మిణీపరిణయమును రచించిన తరువాతనే కవి రాజశేఖరవిలాస మను నామాంతరము గల భల్హాణచరిత్రమును రచించినటు పెక్కువిధములవలన స్పష్టమగుచున్నది. రుక్మిణీపరిణయమునందుఁ గవి తానావఱకు గ్రంథము లేవియుఁ జేసియున్నట్టు చెప్పకొనలేదు. కవిచేత రచియింపఁబడిన మూఁడవగ్రంథ మగు సింహాచలమాహాత్మ్యమునందు

గీ. ప్రథమమున రుక్మిణీపరిణయంబుఁ
గలుషహర మగురాజశేఖరవిలాస
మును మఱియుఁ జాలదండకములు శతక
ములును రచియించి కృతులు శంభునకు నిడితి.

అని కవి రుక్మిణీపరిణయమునే మొదటఁ జెప్పియున్నాఁడు. లక్షణసారసంగ్రహము, రసికజనమనోభిరామము మొదలయినగ్రంథము లన్నిటిలోను గూడ కవి మొట్టమొదట రుక్మిణీపరిణయమునే పేరుకొనియున్నాఁడు. కవి యేహేతువుచేతనో రుక్మిణీపరిణయము చేసినతరువాతఁ జేసిన యచ్చతెలుఁగు రామాయణము నీలాసుందరీపరిణయము లోనుగాఁ గలపుస్తకములలోఁ దా నాపుస్తకములను జేసి ముగించినకాలమును వేసికొనలేదు.

తిమ్మకవి గోదావరీమండలములోని పిఠాపురసంస్థానములోని దైన కందరాడ గ్రామమునకు కరణము ఇతఁడు కందరాడగ్రామవాసుఁ డయినట్లు లక్షణసారసంగ్రహములోని యీక్రిందిపద్యమువలనఁ దెలియవచ్చుచున్నది.—

సీ. కౌండిన్యగోత్రవిఖ్యాతుఁడఁ గూచిమంచ్యన్వయాంబోధినీహారకరుఁడ
గంగనమంత్రిశేఖరునకుఁ బరమపావని యగులచ్చమాంబకును సుతుఁడ

వెరవొప్ప రుక్మిణీపరిణయంబును సింహశైలమాహాత్మ్యంబు నీల పెండ్లి
కథయును రాజశేఖరవిలాసము నచ్చతెనుఁగురామాయణంబును మొదలగు
కృతులు రచియించి పార్వతీపతికి భక్తి | తోడ నర్పణ మొనరించినాఁడఁ గంద
రాడపురసంస్థితుఁడఁ గవులఁబ్రోడ నేను | దిమ్మకవిచంద్రుఁడను జగద్విదితయశుఁడ.

ఈయన గ్రంథములు చేయ నారంభించినకాలమునందు పీఠికాపురసంస్థానమునకు రావు మాధవరాయనృపతి ప్రభువుగా నుండెను. ఈవిషయము రుక్మిణీపరిణయములోని యీ పద్యమువలనఁ దెలియవచ్చుచున్నది—

సీ. చక్రవాళాహార్యజలధికుల్యాసన్నతప్రాకారపరిఖావిరాజితంబు
సాంద్రముక్తాసౌధచంద్రశాలానేకభర్మనిర్మితహర్మ్యశర్మదంబు
కరిసైంధవాందోళికాధేనుధనధాన్యవనదేవగృహసరోవర్తితంబు
విమలచాతుర్వర్ణ్యవిద్వత్కవిశ్రేష్ఠ భటఘటామాత్యవిస్ఫారితంబు
రాజమహేంద్రవరదుర్గరాజ్యభూరిభారసంభరణాక్రాంతిభాసమాన
రావుమాధవనృపపరిరక్షితంబు | భోగనికరంబు పీఠికాపురవరంబు

ఈరావు మాధవనృపతియే కొన్నిగ్రంథములు రచించిన యనంతరముఁ గవికిఁ గవిసార్వభౌమబిరుదము నిచ్చినట్లు రసికజనమనోభిరామములోని యీక్రిందిపద్యమువలనఁ గనఁబడుచున్నది—

సీ. నిఖిలవిద్యాభ్యాసనిపుణుఁడు మత్సహోదరుఁ డగునగ్రసత్కవితనయులు
ఘనులు తిమ్మనయు సింగనయును లేఖకపాఠకులై కృతుల్ వ్రాసి బలఁజేయఁ
జేర్మిఁ గాంచినవాఁడఁ బీఠపురప్రాజ్యరాజ్యాధిపత్యవిరాజమాన
భూరివైభవుఁడు నద్భుతపరాక్రముఁడును దానకళాధురంధరుఁడు నైన
రావు నీలాద్రిమాధవరాయనృపతి | చేతఁ గవిసార్వభౌమ విఖ్యాతబిరుద
మందినఘనుండఁ దిమ్మనామాహ్వయుఁడ నేను | విమలతరభక్తి మదిలోన విస్తరిల్ల.

కవి పీఠికాపురసంస్థానములో నుండినవాఁ డయినను తనగ్రంథములు వేఱొ నరాంకితము చేయక యిష్టదేవతయైన కుక్కుటేశ్వరస్వామికే యంకితము చేసియున్నాఁడు. ఇతఁడు రుక్మిణీపరిణయము రాజశేఖరవిలాసము చేసినతరువాత రాజు తనకొక గ్రంథము నంకితము చేయ నడిగినట్లును కవి యట్లుచేయ నిష్టములేనివాఁ డయినట్లును సింహాచలమాహాత్మ్యములోని యీపద్యములవలన నూహింపఁదగియున్నది.—

క. నృపులకుఁ గావ్యం బొసఁగిన | నపవర్గం బిడఁగఁగలరొ యటుగాకున్నన్
ద్విపతురగభూషణాంబర | తపనీయాదికము చేతఁ దనుపంగలరో.

సీ. ద్విజపుంగవులకుఁ బ్రవేశింపఁగారానిపృథుగృహాంతరములఁ బ్రేవనుండి
కృతియంతధర్మపద్ధతు లెవ్వియెఱుఁగక ధరణిపై నడవఁ బాదములు లేక
దుష్కృత్యముల్ చేయుమంత్రములు చెప్పినట్టులె మీఱకనటింపుచు ద్విజిహ్వకలుగఁగి
వితతంబుగా వక్రగతులచేఁ బొదలుచుఁ బూని యేప్రొద్దును బుస్సు రనుచు
గాఢరోషవిషాగ్నులోద్గారఘోరవక్త్రములుగల్గి దర్పదవర్తులగుచుఁ
జెలఁగుచుండెడుభోగిరాజులభజింపఁ। గుటిలతరబుద్ధి నెవ్వఁడు కోరఁగలఁడు?

* * * *

క. పరిపూని తుచ్ఛభోగం। బునకై కొఱగానిజనులఁ బొగడుటయెల్లన్
గనుఁగొన నిహపరదూరం। బని తలఁచి విరక్తాంతరంగుఁడ నగుచున్.

ఈయన శివభక్తుఁడయి తాను జేసిన గ్రంథముల నన్నిటిని పిఠాపురమునందలి కుక్కుటేశ్వరస్వామికే యంకితము చేసినను, ఒక్క సర్పపురమాహాత్మ్యమును మాత్రము రాజానుగ్రహము నపేక్షించి కాఁబోలును కవిసార్వభౌమబిరుద మందినతరువాత సర్పపురమందలి భావనారాయణస్వామి కంకితము చేసెను. ఈసర్పవరము పిఠాపురపు రాజుల గురువులగు వైష్ణవస్వాములకు నివాసస్థలమయి పీఠికాపురమునకు సమీపమున నున్నది. కవిమాత్రము సర్పపురమాహాత్మ్యములో భావనారాయణస్వామి తనకు స్వప్నమున సాక్షాత్కరించి యిట్లానతిచ్చినట్టు చెప్పికొనియున్నాఁడు.—

సీ. ప్రౌఢిమై రుక్మిణీపరిణయంబును సింహశైలమాహాత్మ్యంబు నీలపెండ్లి
కథయును రాజశేఖరవిలాసంబును నచ్చతెనుఁగురామాయణంబు
సారంగధరనరేశ్వరచరిత్రంబు సప్తార్ణవసంగమాహాత్మ్యకంబు
రసికజనమనోభిరామంబు లక్షణసారసంగ్రహము నింపారఁ గూర్చి
కృతులు శంభునికిడినసుకృతివి నీవు। ప్రతిభమెఱయంగ నొక్కసత్కృతి యొనర్చి
మాకు నర్పణచేయు నెమ్మదిదలిర్ప। తిమ్మకవిచంద్ర సుకవితసుధీకులేంద్ర.

తనకు మాహేశ్వరాచారవృత్తి నుపదేశించిన శైవుఁడగు దెందులూరిలింగనారాధ్యుని

క. చిరభక్తిం బొగడెద నుద్గురునాథుం దెందలూరికులపావనునిన్
గరుణానిధి నపరాంతక। హరమూర్తిని ఘనుని లింగనారాధ్యమణిన్.

ఇత్యాది బహుపద్యములతో బహుగ్రంథములయందు స్తుతించి శివభక్తుఁడయినను, కవి తాను కేవల శివమతస్థుఁడు గాక శివకేశవులకు భేదము లేదని భావించెడి యద్వైతమతస్థుఁడయియుండెను. కవి తాను కట్టకడపట రచియించిన శివలీలావిలాసములో నిందు క్రిందఁ బొందుపఱిచిన పద్యమునందుఁ దాను జేసినపుస్తకముల నన్నిటిని జేర్కొనియున్నాఁడు—

సీ. ప్రతిభ మై రుక్మిణీపరిణయంబును సింహశైలమాహాత్మ్యంబు నీలపెండ్లి
కతయును రాజశేఖరవిలాసంబును నచ్చతెనుంగురామాయణంబు
సారంగధరనృపచరితంబు సాగరసంగమాహాత్మ్యంబు రంగుమీఱ
రసికజనమనోభిరామంబు లక్షణసారసంగ్రహమును సర్వపురస
మంచితక్షేత్రకథనంబు మఱియుఁబెక్కు శతకదండకసత్కృతుల్ ప్రతిభఁగూర్చి
యుల్లమలరారఁ బార్వతీవల్లభునకు భక్తి నర్పణ చేసితిఁ భవ్యమతిని.

ఈగ్రంథములలో సారంగధరచరిత్రమును సాగరసంగమాహాత్మ్యమును నాకు లభింపలేదు. అవి చిన్నగ్రంథము లని కవివంశములోనివా రొకరు నాతోఁ జెప్పియున్నారు. ఈకవి కవిత్వములో నచ్చతెలుఁగుపదము లధికముగా నుండును. కష్టపడి మొట్టమొదట యౌవనకాలమునందు శృంగారప్రధానముగా రచియించిన దగుటచే రుక్మిణీపరిణయము నందే కవి యొక్క ప్రౌఢిమను జూపియున్నాఁడు. కపికృతము లయినబహుగ్రంథములు పురాణపాకమున రచియింపఁబడినవి. శ్లేషయులును శబ్దాలంకారములును విశేషముగా నుండినను, కవిత్వమునం దద్భుతకల్పన లంతఁగాఁ గానఁబడవు. మొట్టమొదట రచియింపఁబడిన గ్రంథములలో నదంత స్త్రీవాచకపదసంధులు లోనుగాఁగల కొన్ని దోషములు కనఁబడుచున్నను, ఆటుపిమ్మటఁ జేసినగ్రంథములు నిర్దుష్టములుగా నున్నవి. కవి యితరగ్రంథములను రచియించిన కాలపరిమితిఁ బట్టి విచారింపఁగా, ౧౬౭౪ వ సంవత్సరమునందు ముగింపఁబడిన రుక్మిణీపరిణయము ౧౬౭౦ వ సంవత్సరమునం దారంభింపఁబడి సంవత్సరమున కొక్కొక్కయాశ్వాసము చొప్పున నయిదాశ్వాసములు నయిదుసంవత్సరములలో రచియింపఁబడె నని చెప్పుట సత్యమున కంత దూరముగా నుండదు. కవన మారంభించి యొకటిరెండు శతకములను జేసి ప్రబంధరచనకుఁ బూనునప్పటికిఁ గవి కిరువదిసంవత్సరముల ప్రాయ ముండుననుటయు నంతగా తప్పు కానేరదు. కవి తరువాత రచియించిన రెండవగ్రంథ మగురాజశేఖరవిలాసము మూఁడాశ్వాసములును మూఁడుసంవత్సరములలోఁ జేసినపక్షమున, అపుస్తకమును ౧౬౭౭ వ సంవత్సరమున ముగించియుండవచ్చును. మూఁడవగ్రంథ మగుసింహాచలమహాత్మ్య మయిదాశ్వాసములు నయిదుసంవత్సరములలోఁ జేసినయెడల, అస్థలపురాణము ౧౬౮౩ వ సంవత్సరమునందు ముగింపఁబడియుండును. కవిచే రచియింపఁబడిన గ్రంథములలో నాలవదియు నచ్చతెలుఁగుకావ్యములలో మొదటిదియునైన నీలాసుందరీపరిణయము మూఁడాశ్వాసములును మూఁడుసంవత్సరములలో రచియింపఁబడినచో, అది ౧౬౮౬ వ సంవత్సరమునందు ముగింపఁబడియుండును. అయిదవగ్రంథ మగు నచ్చతెనుఁగురామాయణ మాఱుకాండములు నాఱుసంవత్సరములలోఁ గూర్పఁబడిన

పత్రమున, అది ౧౬౩౭ వ సంవత్సరమునందు సమాప్తి నొందియుండును. ఈయప్ప తెలుఁగుకావ్యముల రచనచేతఁ గవి కభినవవాగనుశాసనబిరుదము వచ్చెనని చెప్పుదురు. ఆఱవగ్రంథమగు సారంగధరచరిత్రము రెండుసంవత్సరములలోఁ జేసెనేని, అది ౧౬౩౮వ సంవత్సరములో పూర్తి యయియుండును. ఏడవదియగు సాగరసంగమాహాత్మ్యము రెండుసంవత్సరములలోఁ జేయఁబడినయెడల, ౧౬౩౯వ సంవత్సరమున సంపూర్ణమయి యుండును. ఎనిమిదవగ్రంథ మగులక్షణసారసంగ్రహము

గీ. శాలివాహనశకవర్ష సంఖ్యకరగిరిహయ శశిసంజ్ఞ లగు రౌద్ర్యబ్దమునను
భాద్రపదశుక్లపంచమివలనఁ బూర్ణమయ్యె నీకృతి నీపేర నగసుతేశ.

అని శాలివాహనశకము ౧౭౭౨ వ సంవత్సరమునకు సరియైన క్రీస్తుశకము ౧౮౫౦ వ సంవత్సరమునందు ముగింపఁబడినదని కవియే చెప్పియున్నాఁడు. మూఁడాశ్వాసములు గల యీలక్షణగ్రంథము రచియించుటకుఁ గవికి ౧౬౩౯ వ సంవత్సరము మొదలుకొని నాలుగుసంవత్సరములు పట్టియుండును. చంద్రమపాలెములో నున్న యీకవివంశమువారియింటఁ గలపుస్తకములను వెదకింపఁగా నందు భారతాదులును లక్షణవిషయకగ్రంథములును దక్క విశేషగ్రంథము లేవియుఁ గానఁబడవఁదునన, లక్షణసారసంగ్రహములో లక్ష్యములుగాఁ జూపఁబడిన ప్రబంధాదులలోని పద్యములు చాలవఱకితరపూర్వలక్షణగ్రంథములలో నున్నవే యగుటచేతను, కవి యీగ్రంథరచనమునందు భారతరామాయణములను మఱి కొన్నిప్రబంధములనుమాత్రమే శోధించినట్టు తోఁచుచున్నది. అందుచేత గ్రంథసమాప్తికి నాలుగుసంవత్సరములు చాలును.

గీ. తెలుఁగుకు మున్ను లక్షణంబులు మహాకవీశ్వరుల్ పెక్కు రచియించియిడి రేఁకేల
కూర్పవలెనన్నఁ బ్రౌఢిమకొలఁదినాకుఁ దెలిసినతెలుఁగుఁ దగఁగొంతతెలియఁబలుకు.

అని కవి లక్షణసారసంగ్రహమునఁ బూర్వలక్షణగ్రంథములలో లేని నూతనవిషయములను గొన్నిటిఁ జేర్చినట్లు చెప్పియున్నాఁడు. కొన్నివిషయములను గవి క్రొత్తగా శోధించి చేర్చెననుటకు సందేహములేదు. తొమ్మిదవగ్రంథ మగురసికజనమనోభిరామ మనెడి యాఱాశ్వాసములప్రబంధమును రచించుటకు గవికి ౧౮౫౦ వ సంవత్సరము మొదలుకొని ౧౮౬౦ వ సంవత్సరమువఱకును పదిసంవత్సరములు పట్టినది.

సీ. * * రసికజనమనోభిరామం బనెడుపేరఁ దనరుగున శాలివాహనశకాబ్ద
ములఁ గరగిరిరసభూసంఖ్యఁ దద్దయు వఱలుప్రమోదూతవత్సరమున
నీప్రబంధంబు రచియించి నీకొసఁగితి.

అని కవి రసికజనమనోభిరామమును దాను శాలివాహనశకము ౧౭౮౨ వ సంవత్సరమునకు సరియైన ౧౮౬౦ వ సంవత్సరమున రచియించినట్లు చెప్పెను. ఈకవి యీ

గ్రంథమును బహుపుస్తకములు చదివి బహుసంవత్సరములు శ్రమచేసి తనప్రౌఢిమ నంతయు జూపి వసుచరిత్రమువలె నుండవలెనని దాని ననుసరించి చేసెను. అందుచేతనే కవి యీగ్రంథాదియందు

సీ. బహుపురాణములు ప్రబంధము ల్లక్షణశాస్త్రము ల్వివిధకోశములు నాట
కము లలంకారశాస్త్రములును శోధించి ప్రౌఢిమై నేతత్ప్రబంధ మేనొ
నర్చెద * * * * *

అని వ్రాసికొనియున్నాఁడు. అయినను వసుచరిత్రమునం దుండుగల ప్రౌఢిమలోను సారస్యములోను శతాంశమైనను రసికజనమనోభిరామమునకు రాలేదు. అన్యోన్య తారతమ్యము తేటపడుటకయి యుభయగ్రంథములనుండియు సమానవిషయములను దెలుపు పద్యములను గొన్నిటి నిందుఁజూపెదను. వసుచరిత్రములో గిరికాదేవిని గూర్చుటకయి రాజుచేతఁ బంపఁబడిన దూతి పోయి సఖీజనమధ్యమున నున్న కన్నియను జూచి సమయోచితసరసాలాపములతో ముచ్చటించి యామె చెలికత్తెలచేతనే,

ఉ. ఇన్నగరాజు జూచె వసుధేశ్వరుఁ డెన్నఁడు వచ్చు వచ్చి యీ
క్రొన్ననతీవజొంపములలోనను నెన్నఁడు డిగ్గు డిగ్గి యీ
కన్నియఁ గన్నులారఁ గుతుకంబున నెన్నఁడు గాంచుఁ గాంచి తా
నెన్నఁడు గారవించుఁ జెలు లెన్నఁడు కాంతు రభీష్టసంపదల్

రాజునిమిత్తమయి ప్రార్థించునట్లుచేసి నేర్పుతో కార్యసంఘటనముచేయఁగా, రసికజనమనోభిరామములోఁ బ్రియురాలి నిమిత్తమయి రాజుచేఁ బంపఁబడినదూతి యామెకడకుఁబోయి

చ. పలుకులు కోయిలేటి కిఁక భావభవప్రతిమానుఁ డైనయా
చెలువునితోడుతం జెలిమి చేకుఱ కున్న నయారె నీమెయిం
గల యౌవనం బడవిఁ గాచిన వెన్నెలసుమ్ము ముద్దులేఁ
జిలుకలకొల్కి నాపలుకు చిత్తమునం దలపోసి చూడుమా.

అని చెప్పి యామెచేత

చ. అవునవు మంచిప్రోడవె బళా యొకయింత కించుక లేక మానినీ
నివహపుఁబ్రాగ్రభాగమున నిల్చి వినం గొఱగానివాక్యముల్
తవిలి వచింపఁ జాగితివి తాళుము మే మతియొక్కఁడైన దూ
తవు నిను నేమియుం బలుక ధర్మము కాదని యంటి మిత్తఱిన్.

అని చీవాట్లుతిని తనప్రభువువద్దకు మరలివచ్చెను.

చ. కటకట మమ్ము నొక్క త్రుటికాలముఁ బాయనిదాన వొంటిమై
వెటువలె వచ్చి తమ్మ చెలి యిప్పటి వేకువఁ దేనెవాక లీ
వెటువలె నీఁగి తమ్మ తెరు వెల్లను బుష్పకి నీపదాంబుజం
బెటువలె నొచ్చె నమ్మ తరుణీ తరు నమ్ము కడింది చైదముల్ — వసుచ.

ఉ. కొమ్మరొ ముమ్మరంపు వెతఁ గుందుచు నిల్లెడఁ బాసి యిమ్మెయిన్
మమ్ముల చేసి యొంటిగ వనంబున కేటికి వచ్చితమ్మ నె
త్తమ్ముల గేరు నీ మృదుపదంబులు కందెఁ గదమ్మ మేలు మే
లమ్మక చెల్ల నీ బలుగయాళితనమ్ములు చెప్పఁ జిత్రముల్. — రసికజ.

ఈపుస్తకమునందు స్త్రీవర్ణనములు మొదలయినవి శెట్టిగాఁ జేయఁబడినవి. ఈ శృంగార ప్రబంధమును రచియించిన కొంతకాలమునకుఁ గవి వీధిని బడి పోవుచుండఁగా నొక వేశ్య చూచి రసికజనమనోభిరామమును జెప్పియున్న దగుటచే నందలి రసికత్వమున కానందించి వలచి వచ్చి పైఁబడి కవిని కౌఁగిలించుకొనఁగా నతఁడు పెడమొగము పెట్టెననియు, అంతపయి నా సరసురాలు

చ. చతురులలోన నెంతయును జాణ వటంచును నేను గౌఁగిలిం
చితి నిటు మోముమో పిడఁగఁ జెల్లునె యో రసికాగ్రగణ్య

అని పూర్వకవిత్వము చేసి యడుగఁగా,

అ| ద్భుతమగునట్టి బంగరపు కొంగ రపుంగవఁ బోలు నీకుచ
ద్వైతము నీ యొమ్ము నాఁటె నుఱులీఁపున దూసె నటంచుఁ జూచితిన్.

అని కవి పద్యమును బూర్తి చేసెననియు, చెప్పవాడుక యొకటి కొంతకాలము నుండి కలదు గాని యీగాథ యసత్యమని కొందఱు సజాలత్వమే ముఖ్యమని భావించెడి యపూర్వ పండితులచే నిట్టికవులయం దారోపింపఁబడినరీతియు సత్యకల్పనమే యనుటకు సందేహము లేదు. రుక్మిణీపరిణయము రచించునాటికిఁ గవి కిరువదియైదు సంవత్సరములున్నచో నిప్పటి కాతనికి నలువదిని వత్సరములు దాటియుండవలెను. కులవృత్తిని మాను చేసెంత సిగ్గువిడిచినదయినను పట్టపగలు నట్టనడివీధిలో నడుచుచున్న ముసలిని సిగ్గువిడిచి పయిఁబడి నడుచుపనుపడఁగి యెల్లరుఁ జూచుచుండఁ గౌఁగిలించుకొన్నదనుటకంటెఁ బరిహాసాస్పదమయిన విరుద్ధపుమాట మఱియొకటి యుండదు. పదవదియగు మూఁడాశ్వాసములుగల సర్పపురమాహాత్మ్యము తరువాత నాలుగుసంవత్సరములలో ౧౭౪౪ వ సంవత్సరమునందు ముగింపఁబడినది.

పదునొకండవదియు కట్టకడపటిదియు నగు శివలీలావిలాస మను రెండాశ్వాసముల గ్రంథము మఱి రెండేండ్లకు

గీ. శాలివాహన శక వర్ష సంఖ్య వసుర । సాంగశశిసంజ్ఞ నలరు ధాతాబ్దమునను
దగ రచించిన యీకృతి ధరణియందు । నాసుధాకరతారార్క మగుచు నుండు.

శాలివాహనశకము ౧౬౬౮ వ సంవత్సరమునకు సరియైన ౧౭౪౬ వ సంవత్సరమున రచియింపఁబడినది. అటుతరువాతఁ గవిచే రచియింపఁబడిన గ్రంథము లేవియుఁ గానరావు. ఆరంభదశలో రచియింపఁబడిన కుక్కుటేశ్వరశతకము మొదలయిన కొన్ని శతకములును దండకములును గలవు. శివలీలావిలాసము ముగిసిన యల్పకాలములోనే కవి పరలోకగతుఁడయ్యెను. కాఁబట్టి యితఁడు ౧౭౪౭ వ సంవత్సరమునందు మృతినొందెనని యించుమించుగా నిశ్చయముగానే చెప్పవచ్చును. అందుచేతఁ గవి దాదాపుగా డెబ్బదిసంవత్సరములు జీవించి సుమారు నలువదియైదు సంవత్సరములు గ్రంథరచనయందుఁ గడపినట్టు స్పష్టమగుచున్నది. ఈకవికి సంతతి లేదఁట. ఈకవియొక్క కడపటికాలములో నింగ్లీషువారికిని ఫ్రెంచివారికిని యుద్ధములు జరగినందున కందరాపమీఁదుగా రాకపోకలు చేయుచువచ్చిన సేనలబాధకు వెఱచి యాగ్రామము విడిచి చంద్రమపాలెము నివాసముగా నేర్పఱచుకొనెను. ఈకవివంశమువా రిప్పటికిని చంద్రమపాలెములోనే యున్నారు. ఆంధ్రనామసంగ్రహము చేసిన పైడిపాటిలక్ష్మణకవి, కన్నప్పచరిత్రము చేసిన కంచిరాజు సూరయ్య, శివజ్ఞానదీపికను చేసిన కాశీలోకబ్రహ్మ, ఇందుమతీకళ్యాణము చేసిన యంగర బసవయ్య, ద్వాదశరాజచరిత్ర చేసిన కట్టవరపు చిట్టిమరాజు, ద్విపద రుక్మాంగదచరిత్రను చేసిన రామయ భాస్కరుఁడు, మొదలగు కవు లీకవికి బంధువులుగా నుండినట్లు లక్షణసారసంగ్రహములో నియ్యఁబడిన లక్ష్యములవలనఁ దెలియవచ్చుచున్నది. కవియొక్క శైలి జూపుటకు పద్యములఁ గొన్నిటి నిందుదాహరించుచున్నాను:—

రుక్మిణీపరిణయము.

ఉ. సారము పద్దుఁబల్కు ఘనసారము దర్పమె తావి కా
సారము నాభిరంధ్రము పసారము లేఁటమిటారిమోము శ్రీ
కారము కర్ణయుగ్మము చకారము నవ్వు మొగంబు పట్టపా
కారము కొప్పు సన్మథునికారము మోవి వధూలలామకున్.—అ. ౧.

ఉ. కౌను చలింప నిద్దపు మొగంబునఁ జెమ్మట యుంపఁ గెంకణ
ధ్వానము లింపు నింపఁ గరతాళగతుల్ ప్రవర్తింప హారముల్
పూని నటింప నూర్పుసొలపున్ వలితెమ్మెర లంకురింపఁగాఁ
జానయొకర్తు రుక్మిణికి సంపఁగినూనెఁ దలంటె నేర్పునన్.—అ. ౫

రాజశేఖరవిలాసము.

శా. ఏరాభూవర మాకుఁ గాంచనతురంగేభాంబరాందోళికా
భూరిస్యందనమందిరోపవనసమ్యగ్భూషామణిశ్రేణులన్
చేరన్ బొందగుపల్లెలుం బనుపులన్ లెక్కింప కర్థంబులున్
ఈరా కోరికలీల మీఱఁ గీర్తి నీవెంతేనియున్ శ్రీగతన్.—ఆ. ౧

ఉ. అయ్యెడఁ జెల్లఁబోఁడు విభునానతి గైకొని వాఁడిచూపు లా
య్యొయ్యనమీఱ లేనగవు లొప్పఁగఁ జెక్కులఁ బాఱ దీపమై
బయ్యెదజాఱ ముద్దుమొగబల్కులు చెల్వలుగార నవ్విటుం
జయ్యనఁ జేరఁ ద్రొక్కి నెఱజాణకు డెల్ల నెఱింగి రంగుగన్.—ఆ. ౩.

సింహశైల మాహాత్మ్యము.

మ. వలపుం గొజ్జఁగినీటిశీతలహరీవ్యాప్తిం దువుల్చిమ్ముచున్
గలయుం గప్పురపుందుమారము మెయిన్ గాటంబుగాఁ గప్పుచున్
బలవద్దర్పకబాణపంక్తుల క్రియన్ పైపైఁ బయిల్గుప్పుచున్
జెలఁగెన్ నందనమారుతంబు ద్విజశ్రేష్ఠాగ్రభాగంబునన్.—ఆ. ౨.

ఉ. అక్కట! దైత్యనాయకుఁ డహర్నిశముం దయమాలి నెంతయున్
మ్రొక్క వమీఱి నిన్నడుము మాటలవలె పక తప్పిపత్తురే
చెక్కుఁ దెఱంగులం గడఁగి కేరొక్కఁ డనుఁ జూచె మదిన్న వాఁడవీ
వెక్కడ? తత్త్వ మెక్కడని సహింపఁ దనుసుమ్ము నిశాచరార్భకా.—ఆ. ౩.

నీలాసుందరీ పరిణయము.

ఉ. మిసిమిఁగడానిబంగరుపుమేడల సోరణగండ్లవెంట రే
ల్ఛాయలు మిక్కుటమౌ త్తునము దక్కఁగఁ జూచి మెఱుంగుబోండ్లు ని
చ్చలు పిక్కిళ్లఁబట్టి యుపి జాతివెంపఁ దమగోళ్ల చుక్కలం
చును నెఱిల్చి చేవదగి మూఁడుచు నబ్బురపోదు రందులన్.—ఆ. ౧.

ఉ. కన్నులవింటివాఁడ తెగకన్నులదేవరతోడఁబోరి మున్
బన్నము నొంది మేఁనొడలుఁగుపట్టున నెక్కడ డాఁగిపోయె నీ
వన్నెతికంబు నేఁడు కొఱమాలినకోయిలవిల్కుమారిక లన్
బన్నగఁ గూడి చేతియల బాములఁ బెట్టెదు పోటుబంటవై.—ఆ. ౩.

అచ్చతెలుఁగు రామాయణము.

ఉ. కాయము మేటితప్పు కొడుకాయము నిద్దపుఁబూఁతమాపి మో
కాయముఁ బంజరంపుఁజిలుకాయము నబ్బపసోయగంపుఁబ్రో

కాయకుఁ బల్కవేమి యెఱుకాయకుఁ బంతము తీర్చి కోటికై
కాయము నేర యిట్లు దుడుకాయకుఁ దూయుఁగఁ గొంకకాయముల్ — అయోధ్యా.

చ. జగములఁ గ్రిర్లొ ఫుటమిణజవ్వనగాడలిశట్టి దైనయి
మ్మగుదలమిన్నఁ దెచ్చితివి మోసము మేలుగఁగాక నీవు నెవ్వరుం
దగ దివితేరుందుఁ దెల్పఁ గలవంటులు గల్గినఁ జేసి యుత్కట
డగపడె నిరంకుశైన విడనాడక రాముని ప్రాపుఁ జేయుమీ — సుందర.

లక్షణసారసంగ్రహము.

చ. కరములు దోయిలించి కుతుకంబున నిచ్చలుఁ బ్రస్తుతింతు భా
స్వరగుణవంతునిన్ సకలసత్కవిజాలవసంతునిన్
జిరకరుణారసాంతుని విశిష్టజనావనతాపశాంతునిన్
సురతరుమంజరీవిభయశోహరిదంతుని నేకదంతునిన్ — ఆ. ౧.

మ. ఘనకారుణ్యకటాక్షు రాక్షసచమూగంధేభహర్యక్షు స
జ్జనసంరక్షణదీక్షు పాలితసరోజాతాక్షు శక్రాంబుజా
సనముఖ్యామరపక్షు దక్షసవనాంచత్క్రీడదాత్రమాక్షు యా
చనకప్రాంగణకల్పవృక్షు రిపుశిక్షాదక్షు మోక్షప్రదా. — ఆ. ౨.

రసికజనమనోభిరామము.

మ. తనుమూలంబులపొంతఁ బొంచి సచివోత్తంసంబు వీక్షించె భా
స్వరకార్తస్వరవిగ్రహన్ సమదచంచద్భృంగికాలకన్
శరదిందుప్రతిమాననచారువదనన్ జక్రస్తని న్విస్ఫుర
త్సరసీజాతదళాయతాక్షి నాకకాంతాలోకచూడామణిన్. — ఆ. ౨.

మ: సవనాదిక్రియల న్బుధాంధులను మెచ్చం జేసి ధన్యాత్ములై
నవిశేషజ్ఞుల కబ్బఁగాక యకటా నా కేటికిం గల్గు ని
ర్భువనాతీతవిలాసవిభ్రమమహాశోభాసంప్రభాంచన్మరు
ద్ధవళాక్షీమధురాధరాధరసుధాధారాసమిద్ధోరణుల్. — ఆ ౫.

సర్వపుర మాహాత్మ్యము.

మ. సరసీనిర్మలనీరబిందుకణముల్ సమ్యగ్గతిం బూని వి
స్ఫురదారామలతాంతసౌరభరజశ్శ్రేణిం జయంబుఁ గైకొంచు ని
ర్భరమందానిలశాబకప్రకరముల్ పల్మాఱు సశోకవనలోఁ
దిరుగుం బాంధజనశ్రమాపహరణోద్వృత్తిం బ్రకాశించుచున్. — ఆ. ౨.

ఉ. నీరజుణావిలోకనము నిల్పఁజొచ్చెఁ గులహీనుఁడన్ హరా
నీరపహీనసామరమణీరమణీ మణిభూషణావళీ
స్తోకవిభూతి చెంది పరిశుద్ధులుం డన మించు లేచటో
నాకనివాసులున్ వెతల నందఁగ దమ్ము ఒగత్రుళ్ళటుంబిసీ.— అ. ౩.

శివలీలావిలాసము.

ఉ. అంగదముద్రికావలయహారలలాటిక లెమ్మె నెమ్మెయిన్
రంగులు గుల్కఁ గ్రొందగటువాడె పుఁబావడ సొంపుమించ మే
ల్బంగరుగిల్కుటందియలు బాలిక సంఘములఘుల్ఘుల్లనన్
గంగ తరంగములం గలసి కౌతుకలీలలఁ గ్రీడ సేయుచున్.— ఆ. ౧.

ఉ. కన్నులు మూయుఁ ద్రెళ్ళిపడి గ్రక్కున దిక్కులు చూచు నూరకే
సన్నలు చేయుఁ బైవలువ చయ్యన నవ్వలఁ ద్రోయు మింటిపై
వెన్నెలగాయుచందురుని వేఁడికిఁ దాఁ బెడఁబాయు నద్దిరా
చిన్నలజంగమప్రభుని చిత్తవికారము లెన్నఁ జిత్రముల్.— ఆ. ౨.

పక్కిలంక వీరభద్రకవి.

ఈకవి కూచిమంచి తిమ్మకవి జగ్గకవుల కాలమునందే పీఠాపురమునందుండి మిక్కిలి ప్రసిద్ధిగన్నవాఁడు. కూచిమంచి తిమ్మకవివలెనే యితఁడును దెందులూరి లింగనారాధ్యుని శిష్యుఁడయి తన వాసవదత్తాపరిణయమునం దాతని నిట్లు స్తుతించి యున్నాఁడు—

సీ. అంభోధివలయితకుంభినీజనతదంభశాంభవక్షాజృంభితములు
నందివాహపదారవిందనిశ్వాసమకరందసంపాదనేందిందిరములు
స్వైత్తిణాదనరాధ్యత్వలక్ష్మీప్రదానత్వసామ్రాజ్యదక్షిణములు
ఊహాపదాత్మబోధామాతస్వాంతసాదేవలీలాపశ్యతోహరములు
ధీరతాగుణమణిహారి దెందులూరి । లింగగురువరసత్కృపాపాంగవీక్ష
ణములు సతతంబు శుభవిధానంబు లొసఁగి । శిష్టజనుల దయను రక్షించుఁ గాత!

ఈకవి గౌరీకల్యాణ మను నామముతోఁ గాళిదాసకృతమయిన కుమారసంభవమును దెలిఁగించుటయేకాక సుబంధకవి విరచితమయిన వాసవదత్తను వాసవదత్తాపరిణయ మను పేరితో నాంధ్రీకరించి దానిని పీఠికాపురాధీశ్వరుఁడయిన రావు మాధవరాయని

గారి కంకితముచేసెను. పద్మనాయకకులసంభవుఁడైన శ్రీ రామచంద్ర మాధవరాయ నృపాలుఁడు తన్ను బిలిపించి వాసవదత్తను దెనిఁగింప నడిగినకథను కవి వాసవదత్తా పరిణయమునం దిట్లు చెప్పికొనియున్నాఁడు—

శా. శ్రీమచ్చంద్రకళాకిరీటపదరాజీవద్వయీభావనా
సామర్థ్యోదితవాక్ప్రపంచఘటనాచాతుర్యవిద్వజ్జన
స్తోమానందదశేముషీనిజవిలాసు న్వాక్యాలంకాన్వయున్
ప్రేమాస్పదు వీరభద్రుని నయం బిల్పించి యుప్పొంగుచున్.

క. తాతలతరమునసుండియు । నీతనిజనకుండు మఱియు హితుఁడు కవీంద్రుం
డీతని చేతం గృతి వి । ఖ్యాతిగఁ గైకొందు ననుచు హర్షం బొదవన్.

గీ. సవినయంబున సముచితాసనమునందు । నంతికంబునఁ గూర్చుండఁ జేసి యాజ్ఞ యొసఁగి
మందహాసాంచితముఖారవిందుఁ డగుచు । సదయానుస్ఫూర్తి నిట్లని యానతిచ్చె.

క. శ్రీవెలయ నుభయభాషల । నీవలెఁ గృతిఁ జేయఁగలరె నేఁటి వింద్రల్
భూవిశ్రుతకవితావి । ర్భావయశస్సాంద్ర వీరభద్రకవీంద్రా.

సీ. మీతాత లోకవిఖ్యాతభాషాఖిలశేషాహి యాచంద్రశేఖరుండు
మీతండ్రి చాటువాగాతతచిత్రప్రబంధకల్పనశాలి భాస్కరుండు
మీతల్లితండ్రి పురాతనసత్కవినాథుల కెన విశ్వనాథసుకవి
మీ మేనమామ సుత్రామవైభవుఁడు సద్యఃకృతిమతి వేంకటాద్రిసుకవి
చదువకరయె శ్రీసతీశప్రసాదగరిమ । బాల్యమునను గుమారసంభవము తెనుఁగు
చేసి కవు లెంచఁ బ్రఖ్యాతిఁ జెంది తీవు । కలరె నీసము లాధునికులు కవీంద్ర.

ఉ. అత్యలఘుక్రియానిపుణుఁడై ధరణీతల మేలు విక్రమా
దిత్యసభాంతరంబునఁ బ్రతిష్ఠితుఁడై ఘనధీసమగ్రతన్
సత్యవతీతనూభవునిజాడఁ బ్రసిద్ధికి నెక్కె నవ్యసా
హిత్యమునన్ సుబంధుకవీంద్రుఁడు ప్రస్తుతిఁగన్న వాఁడిలన్.

గీ. ఘనతరమనీష నమ్మహాకవివరుండు । ప్రతిపదశ్లేషగద్యప్రబంధ మత్యు
దారతను జెప్పె వాసవదత్తయనఁగ । నార్యులాకథ కడుచోద్య మనిరి సభను.

మ. స్తవనీయం బగుతత్కథాక్రమము భాషాయోషిదంఘ్రిస్ఫుర
న్నవమంజీరరవనాదమేదురనితాంతప్రౌఢవాగ్గుంభన
ద్భవదీయోక్తుల నాంధ్రకావ్యముగ వైదర్భిగతిం గూర్పు త
త్కవివాక్ప్రోక్తులు కొన్ని నీకవితకుం గైదండ గావింపఁగన్.

క. వరమతి వాసవదత్తా । పరిణయము ను జెప్పె యీప్రబంధము విద్వ
త్పరిగణ్యంబుగ మాకుం । జిరముగ నంకితము చేయ ధీరవిచారా.

భర్తృహరియొక్క సుభాషితరత్నావళిని రచించిన యేనుగు లక్ష్మణకవి మొదలైన వారికవితో సమకాలికులు. సమకాలమునందున్న కవులు కూడివుంచి తిమ్మకవిని బాగడక యీతని బాగముటచే తిమ్మకవికవిత్వము కంటె నీతనికవిత్వమునం దప్పటివారి కధికాదర మున్నట్లు స్పష్టమగుచున్నది. ఏనుగు లక్ష్మణకవి తన రామవిలాసమునందుఁ బూర్వకవులను స్తుతి చేసినచోట

గీ. భట్టుకవి విశ్వనాథుఁ బ్రార్థించి కొలుతు । నతని నందనుఁ డగు వేంకటాద్రికవికి
వాక్యప్రౌఢిఁ గాంచు వక్కలంక । వీరభద్రుని భావింతు గౌరవమున.

అని యీవీరభద్రకవిని పేర్కొనియున్నాఁడు. ఆకాలమునం దుండిన యీదరపల్లి భవానిశంకరకవియుఁ దాను రచించిన ధర్మఖండములో

మ. హరికుర్యం బగు రామమాధవ నృపాలాగ్రేసరుం గావ్యచా
తురి మెప్పించి ఘనీయసత్కృప సిరుల్ తోరంబుగాఁ బొంది బం
ధుర తేజుం డగు వక్కలంకకులపాథోరాశి రాకాసుధా
కిరణుండై తగు వీరభద్రసుకవిం గీర్తింతు నానేర్పులన్.

అని వీరభద్రకవిని ప్రశంసించియున్నాఁడు. సమానకాలకులు వారట్లు మెచ్చుటచేతనే యీకవి యసమానకవిత్వప్రౌఢిగలవాఁడని తేటపడుచున్నది. ఈ వీరభద్రకవి యాఱువేల నియోగి బ్రాహ్మణుఁడు; భారద్వాజగోత్రుఁడు; భాస్కరకవిపుత్రుఁడు; చంద్రశేఖరకవిపౌత్రుఁడు; భట్టుకవి విశ్వనాథకవి దౌహిత్రుఁడు. ఈతని తల్లి జగ్గాంబ; మేనమామ భట్టుకవి వేంకటాద్రికవి. ఈకవి వెల్దితాపెలనుండియుఁ బిఠాపురసంస్థానమునం దుండినవాఁడు తండ్రితాతముత్తాతలును తల్లితాతముత్తాతలుఁగూడ సత్కవీశ్వరులు. ఈకవి మాతామహుఁడైన విశ్వనాథకవి పెద్దాపురసంస్థాన స్థాపకుఁడయిన శ్రీవత్సవాయ ముసలితిమ్మరాజుగారికిఁ దాను రచించిన శేషధర్మప్రబంధము నంకితము చేసెను. శేషధర్మరత్నాకర మనుపేరితో నీగ్రంథమునే రామచంద్రపురవాసుఁడగు కొండయ కొడుకగు శ్రీనివాసకవియు రచియించెను. వీరభద్రకవి ౧౭౭౦ వ సంవత్సరప్రాంతమువఱకును జీవించియుండవచ్చును. ఇతఁడు తన వార్ధకదశలో పిఠాపురమును విడిచి వృద్ధగౌతమీతీరమునందున్న యిమ్మిడివరము ప్రవేశించి సన్యాసాశ్రమమును స్వీకరించి యక్కడనే సిద్ధిపొందెనట. ఈకవి విరచితగ్రంథములనుండి కొన్ని పద్యముల నిందుదాహరించుచున్నాను —

వాసవదత్తా పరిణయము.

శా. భల్లూకంబులఁ జూచితే తిమిరసంపల్లాలితాంగప్రభో
ద్యల్లీలన్ ఘననీలనీలఘనసఖ్యం బెప్పుడుం జేయఁగా
వల్లీవేల్లితవాసులూయవుల్రేవం గొంటుజుంటీఁగలం
దెల్లం గుయ్యిడఁ దేనియల్ గొనెడు భూమీశా విచిత్రంబుగన్.—ఆ. ౬

శా. ప్రచ్ఛాయస్థలపల్లవాస్తరణనిద్రాయోగ్యముల్ పాటలీ
గుచ్ఛాకల్పమనోజ్ఞతరముల్ కూలంకషాభ్యంతర
స్వచ్ఛాంభఃపరిషేచనార్ద్రములు పశ్చాద్భాగసౌభాగ్యముల్
స్వచ్ఛందస్థితి గ్రీష్మవాసరము లెంచం జాల మించెం ధరన్.—ఆ. ౩.

కుమారసంభవము.

చ. హరుఁ డఖిలేశుఁ డవ్వనమహాక్షితపఃప్రతిఘాతహేతువై
పరఁగినతత్సపర్యలకు భావమునం గడుమెచ్చి యొప్పెఁ దా
నరయ వికారకారణము లంటిన నిశ్చలతం దఱుచ్చ నె
వ్వారిహృదయారవిందములు వారలె ధీవరు లెంచిచూడఁగన్.—ఆ ౧.

చ. మలయవసుంధరాధరసమాగతబంధురగంధవాహకా
కుల నెదిరించుచున్ వివిధసూనగుళుచ్ఛరజఃపరంపరల్
కలయఁగఁ జూపు లడ్డుకొనఁగాఁ గను గానక దగ్గ మేర్పడన్
జెలఁగి మృగంబు లప్పిపినసీమ నటించె మధూదయోన్నతిన్.—ఆ. ౨.

ఉ. అన్న తలంచు రూపము హిమాద్రి తలంచుఁ గులంబు తల్లి దా
నెన్ను సువస్తువుల్ వరుల నేర్చుతఁజేన్ బురవైరి నెంచినన్
గన్నులు మూడు పుట్టుటయు గాఁగరాదు దిగంబరుండునుం
జిన్నము సొమ్ములేదు శిగి సొందఁగఁ దాతఁడు నీకు మానినీ.—ఆ. ౩.

ఉ. క్రొత్తలు చేసి గేహములు గోవజవాజిని బచ్చికస్తురిన్
మెత్తిరి గోడ లందుపయి నిద్దపుఁజాయలపాలుకున్నముల్
చిత్తరువుల్ లిఖించిరి విచిత్రగతి న్నయనోత్సవంబుగా
నత్తతి నుత్తముల్ ప్రతిగృహంబున శోభనశోభ సంధిలన్.—ఆ. ౮.

కూచిమంచి-జగ్గకవి.

ఇతఁడు సుప్రసిద్ధుఁ డయిన తిమ్మకవి సార్వభౌముని రెండవతమ్ముఁడు. ఇతని జన్మసంవత్సర మేదో తెలియదుగాని తిమ్మకవికంటె నాలుగయిదుసంవత్సరములు చిన్నవాఁడయి యుండవలసినందున, ఇతఁడు ౧౭౦౦ వ సంవత్సర ప్రాంతమునందు పుట్టినట్టూహింపఁదగియున్నది. ఈజగ్గకవి యిరువదిసంవత్సరములప్రాయము వచ్చువఱకును చదువుసంధ్యలు లేక యల్లరిమూఁకతోఁ దిరుగుచు కాలము గడపెననియు, అప్పుడు వివాహితుఁడయి యత్తవారియింటికి మనుగుడుపునకుఁ బోయి మామగారు తనకుఁ బరమశుంఠ యైనయల్లుఁడు దొరికెనని కనుతాపపడఁగా రోషముచేత దేశాంతరమునకు లేచిపోయి పండ్రెండు సంవత్సరములు విద్యాభ్యాసము చేసి పండితుఁడయి కవిత్వము చెప్ప నారంభించెననియు, ప్రకృతిపురాణ మొకటి కలదుగాని యిది కేవల కల్పితకథ యని తోఁచుచున్నది. ఈకథనుబట్టి యీకవికి కవిత్వము చెప్పనారంభించు కాలమునాఁటికి ముప్పదిమూఁడు సంవత్సరముల ప్రాయ మయి యుండవలెను. కూచిమంచి తిమ్మకవి తాను ముప్పదిసంవత్సరముల ప్రాయమునఁ జేయ నారంభించిన సింహశైలమాహాత్మ్యమునందుఁ దనపెద్దతమ్ముఁ డైనసింగన్నను వర్ణించినతరువాత రెండవతమ్ముఁ డైనయీజగ్గకవింగూర్చి యిట్లు వ్రాసియున్నాఁడు—

క. అతనియనుజన్ముఁ డతులిత । మతియుతుఁడు సమస్తరాజమాన్యుఁడు సుగుణా
న్వితుఁడు సమంచితకవితా । చతురుఁడు జగ్గప్రభాచంద్రుఁడు తనరున్.

క. ఘోటకలాటకిరాటవ । రాటమరాటాంగవంగరాజన్యసభా
ఘాటనిరాఘాటనట । చ్చాటుకవిత్వాంకుఁ డరయ జగ్గన ధరణిన్.

సీ. నిరతంబు నుడివోనిసిరిగరిమం బొందియుఁ దవుటినిప్పటి మెక్కుఁ దలఁపఁ డేని
సవమలాచారప్రశస్తి గాంచియు వర్ణములు సంకరంబుగాఁ గలుపఁ డేని
ఖలజనసంశిక్ష గావించుచుండియుఁ బతితుల నెపుడుఁ జేపట్టఁ డేని
యురుపుణ్యవర్తియయ్యును బాదబాహ్యాశ్రయసీమ నిల్లుగను వసింపఁ డేని
యలజగన్నాయకుఁడు సాటియనఁగఁ బోలు। భోగమున నిర్మలాచారమున విశిష్ట
రక్షణంబునఁ బుణ్యమార్గమున నరయ। గంగనామాత్యజగ్గయఘనునితోడ.

ఈపద్యములు రచియింపఁబడినకాలమునకు జగ్గకవి యించుమించుగా నిరువదియైదు సంవత్సరముల యీడుగలవాఁ డయి యుండును. ఇరువదియైదేండ్లప్రాయమునాఁటికె కన్నిదేశములు తిరిగి రాజసభలలోఁ బ్రసిద్ధి గాంచఁ గలుగుటకు కవి యిరువదియేండ్ల

వయస్సునను లోపలనే పండితుఁడయి కవనచాతురి గలవాఁ డయియుండవలెను. అందుచేత జగ్గకవి యిరువదిసంవత్సరములప్రాయము వచ్చినవఱకును నక్షరజ్ఞానము లేనివాఁడని చెప్పెడికథ నమ్మఁదగినది కాదు. ఈకవి తనవివాహానంతరమున ధనార్జనము నిమిత్తమును పాండిత్యప్రకాశనమునిమిత్తమును బహుదేశాటనముచేసి రాజస్థానములలో మెప్పొంది సత్కారములను బొందుట వాస్తవమే యైనను, "భోటకలాటకిరాటవరాట మగాటాంగవంగ" యని ప్రాసనిమిత్తము వేయఁబడిన దేశసంచారము కొంత యతిశయోక్తి యై యుండవచ్చును. ఇతఁడు దేశాటనము చేసి వచ్చినతరువాతను దత్పూర్వమునను, జానకీపరిణయమును, శ్రీపదరాధాకృష్ణచరిత్రమును, చాటుప్రబంధములును, సుభద్రాపరిణయమును, చంద్రరేఖావిలాపమును, సోమదేవరాజీయమును, రచియించెను. చంద్రరేఖావిలాపములోని యీక్రిందిపద్యమున వర్ణింపఁబడిన వరుసనుబట్టి విచారింపఁగా నితఁడు దేశసంచారము చేసి రాజస్థానములయందు రాజులమీఁద చాటుప్రబంధములు చేయుటకుముందే జానకీపరిణయమును రాధాకృష్ణచరిత్రమును రచించి నట్లు తోఁచుచున్నది—

సీ. రచియించితివి కుశాగ్రమతిని లోకము మెచ్చ నుచితజానకీపరిణయంబు
వచియించితివి కవివ్రాతము ల్పొగడఁగ శ్రీపదరాధాకృష్ణచరిత
ముచ్చరించితివి విద్వద్వితానంబు మెచ్చఁ జాటుప్రబంధముల్ శతకములును
వర్ణించితివి యిరువదిరెండువర్ణనల్ గణించఁగా సుభద్రావివాహ
మాంధ్రలక్షణలక్ష్యంబు లరసినావు! భూరిగాంభీర్యసత్ప్రౌఢిఁ జెలఁగుదవు
బళిర నీభాగ్యమహిమ చెప్పంగఁదరమె! జగ్గకవిరాయ చంద్ర వాచాఫణీంద్ర.

ఇతఁ డీచంద్రరేఖావిలాపమును విజయనగరసంస్థానపులం శ్రీపూసపాటి విజయరామరాజుగారి చెల్లెలిపెనిమిటి యగు చింతలపాటి నీలాద్రిరాజుమీఁది కోపముచేతఁ జేసెను. ఇది బూతుపుస్తకమగుటచే నిందలిపద్యము లుదాహరింపఁదగియుండలేదు. "అర్ణవవేష్టితాఖిలమహీమండలిలోన బూతుకబ్బముల్! బూర్ణుఁడ' వని కవియే చెప్పికొనుటచే నితఁడు తిట్టుకవిత్వమునందసమానపాండిత్యముకలవాఁ డయినట్టు స్పష్టమగుచున్నది. జగ్గకవి ధనసంపాదనము నిమిత్తము విజయనగరమునకుఁబోయి రాజు బావయైన నీలాద్రిరాజు నాశ్రయింపఁగా నతఁడు తా నుంచుకొన్న వేశ్యను నాయికఁగాఁ జేసి తనమీఁద ప్రబంధము చేయుమని కోరెనఁట! ధనాశచేత నట్టిప్రబంధరచన కొప్పుకొని కవి చంద్రరేఖావిలాస మనుశృంగారకావ్యమును జేసెనఁట! అటు తరువాతఁ దాను సంస్కృతకావ్యమును రచించి యిచ్చెదనని చెప్పి రాజుమతి మరలించిన యాడిమళ్ళ వేంకటశాస్త్రిప్రోత్సాహముచేత నీలాద్రిరాజు జగ్గకవికి నొసగినబహు

మానముచేసి సత్కరింపక తిరస్కారమును జూపెనఁట! అందుపైని ముంగోపియైన యీసూర్తకవి తాను రచియించిన చంద్రరేఖావిలాసమును చింపివేసి చంద్రరేఖావిలాపమను పేరిట నిప్పటి బూతుగ్రంథమును జేసెనఁట! ఇందలి కవివర్ణనలో సహితము సాధుకవులను విడిచి కవి యిట్లు తిట్టుకవిత్వము చెప్పినకవులనే పేర్కొనియున్నాఁడు —

క. భీమకవి రామలింగని । శ్రీమంతుండైన వెలుఁగు శ్రీనాథకవిన్
రామకవిముఖ్యులను బ్రో । ద్దామగతిం జిత్తవీథిఁ దలఁచి కడంకన్.

ఈపుస్తకములోని మొదటిపద్య మిట్లున్నది—

శా. శ్రీకంఠుండు భుజంగభూషణుఁడు భస్మీభూతపంచాస్త్రుఁ డ
స్తోకాటోపబల ప్రతాపపరరక్షోదక్షసంశిక్షణుం
డాకాశోజ్జ్వలకేశపాశుఁడు త్రిశూలాంకుండు రుద్రుండు దా
వీఁకం జింతలపాటినీలనృపతి న్వీక్షించు నేత్రత్రయిన్.

ఈపుస్తకమును జేసి సుగ్గకవి నిజాము రాజ్యమునకుఁ బోయి హైదరాబాదునగరమునందుఁ గల తురకవారల నాశ్రయించి వారిమీఁదపద్యములు చెప్పి తన్మూలమున నబాబుయొక్క దయను సంపాదించి, నిజాము ప్రభుత్వమునను లోఁబడిన సామంతరాజ్య మైనవిజయనగరమునకు ప్రభువగు శ్రీవిజయరామరాజు గారివద్దనుండి యీగ్రంథమును నీలాద్రిరాజు సమ్ముఖమున సభలోఁ జదివించి యట్లు వారివద్దనుండి యుత్తరువు తెచ్చి యట్లు చరిత్రము చెప్పుదురు. ఇతఁడు గ్రంథమునందు నీలాద్రిరాజు నెంత దూషించినను, తత్పత్ని యగు సరసమాంబను దూషింపక యాపతివ్రత నిట్లు భూషించెను —

క. ఘనుఁడైన నీలనృపుఁ డీ । యిలపై నెన్నాళ్లు బ్రతుకునే సరసాంబా
గళకలితకంకణము సుమం । గళసూత్రోత్కృష్టమహిమఁ గాక సుమారా.

ఈసుగ్గకవి యించుమించుగా నన్నిసంవత్సరకాలము జీవించినట్లు కనఁబడుచున్నది. అందుచేత నితఁడు ౧౭౭౦ వ సంవత్సరప్రాంతమున మొదలుకొని ౧౮౫౦ వ సంవత్సరప్రాంతమువఱకును జీవించియుండినవాఁడని చెప్పవచ్చును. ఈతఁడు రచియించిన గ్రంథములలో నాలాశ్వాసములు గల సుభద్రాపరిణయము మనోహరముగాఁ గనఁబడుచున్నది. ఆపుస్తకమునందు జగన్నాయకస్వామినిగూర్చి వ్రాయఁబడిన మొదటిపద్య మిట్లున్నది—

ఉ. శ్రీకలరన్ సుభద్రయును సీయఁ బార్శ్వములన్ వెలుఁగన
త్యాయతలీల నీలమధరాగ్రమునందు వసించి నిచ్చలుం
బాయక భక్తకోటి కనపాయశుభంబు లొసంగు శ్రీజగ
న్నాయకదేవదేవుఁ డభినంద్యకృపామతి మమ్ముఁ బ్రోవుతన్.—ఆ. ౧.

సుభద్రాపరిణయమునం దితఁడు

గీ. నన్నపార్యుని దిక్కన సాచిరాజు । సోము నమరేశు శ్రీనాథు భీమకవిని
రంగనాథునిఁ బోతనఁ బ్రాజ్ఞవరుని । శంభుదాసుని భాస్కరుఁ సంస్తుతింతు.

అని కవిస్తుతి చేసి తనయన్న యగు తిమ్మకవి నిట్లు పొగడి యున్నాఁడు—

సీ. కౌండిన్యగోత్రవిఖ్యాతునిఁ గూచిమంచ్యన్వయాంభోధినీహారకరుని
గంగనమంత్రిశేఖరునకు నంగనామణి యగు లచ్చమాంబకును సుతుని
బహుకావ్యనిర్మాణబంధురప్రతిభునిఁ గుక్కుటేశ్వరకృపాంకూరలబ్ధ
సత్కవితామహాసామ్రాజ్యధౌరేయుని బుధజనప్రియచరితుని
దండలూరి లింగనారాధ్య దేశికేంద్ర । దత్తమాహేశ్వరాచారవృత్తిరతునిఁ
గందరాదఘవ్రాతమంటను మ । దగ్రజునిఁ దిమ్మకవిరాజు నభినుతింతు.

ఇతఁడు తనగ్రంథములను జగన్నాథస్వామి కంకితము చేసెను. ఈకవిచే రచియింపఁబడిన జానకీపరిణయము మొదలయిన గ్రంథములు నాకు లభించినవి కావు. ఇతఁడు కాకతిప్రతాపరుద్రవంశజుఁడయిన మందపాటి నారాయణరాజుయొక్క ప్రేరణముచేతఁ బ్రతాపరుద్రమహారాజును వర్ణించుచు సోమదేవరాజీయము మను మూఁడాశ్వాసముల గ్రంథ మొకటి రచియించెను. కవియొక్క కవితానైపుణిని జూపుటకై కొన్నిపద్యముల నిం దుదాహరించుచున్నాను—

సుభద్రాపరిణయము.

చ. సుమశరలీలఁ గన్గొనయె శోభనదివ్యసరోజమాలికా
పరిమళలాభలోభమదబంభరడింభరవానుషంగ దు
ష్కరదురితౌఘభంగ నతిభాస్వరగాఢతరంగ రంగదీ
శ్వరమకుటాగ్రరంగ శుభసంగను గంగఁ దగంగఁ జెంగటన్ —ఆ. ౧

ఉ. ఆరయ నీలలామ మది యంచితలీలలఁ గాంచి తొక్కకా
సారము సారసారవిభవాంకితసారసపుండరీకక
హ్లారమరందపానపరిలంపటమాద్యదళీంద్రసాంద్రఝం
కారము కోకహంస బకకచ్ఛపమీనధునీకుళీరముల్ —ఆ. ౩

శా. కారం బయ్యె నితంబినీమణి కలాకారంబు కోలంబరుం
గారంబున్ సముదగ్రశోకిలహాహాకారంబుఁ జంద్రోద్ధతా
కారంబున్ గుసుమాస్త్రుచాపగుణటంకారంబు రాయంచకుం
గారంబున్ శుకశారికానికరహుంకారంబు ఘోరంబుగన్ —ఆ. ౪

చ. తనుజులఁ బొసంగి వాలుఁగనుదమ్ము లొసంగుచుఁ జెప్పి కన్యకా
తిలకము గాంచె నీలమణిదీధితిజాలమనోజ్ఞ గాత్రునిన్
జలదరాతిజైత్రుఁ గృపాపరిపూరితనేత్రుఁ సమా
కలితవిలాసచైత్రుని జగన్నుతిపాత్రుని బాండుపుత్రునిన్.—ఆ. ౫.

సోమదేవరాజీయము.

శా. అన్నా యొక్కఁడవుంటి వొక్కఁడవు రేనూహా మహైశ్వర్య మీ
వెన్నన్ బాలుఁడ వీటు బంటు విహితంబే లేయి సజ్జాతులన్
నిన్నుం గానక యుందుమంటిమిగదా నిక్కంబు మాప్రాణముల్
కన్నారన్నినుఁ జూడకున్న నిలువంగానేర్చునే లేశమున్.—ఆ. ౧.

ఉ. వింటిరె మీర లిప్పు డొకవింత కుమారపుబండివాండ్రు మె
న్నంటిరి కార్థభాగమున నాచి మహేశగృహంబు చొచ్చి రా
బంటులె నిన్న రేయి మనపట్టణభూసురవర్యుఁ గొట్టి వా
రింటిపదార్థ మెల్ల హరియించిరి నాయక మర్త్యరాజ్యమున్.—ఆ. ౨.

కొఱవి గోపరాజు.

ఈకవి యారువేలనియోగిబ్రాహ్మణుఁడు; హరితసగోత్రుఁడు; గోపరాజు పౌత్రుఁడు; కసవరాజునకును కామాంబికకును పుత్రుఁడు. ఇతఁడు సింహాసనద్వాత్రింశిక యను పేర విక్రమార్కుని కథలు పండ్రెండాశ్వాసముల పద్యకావ్యముగా రచియించెను. ఈద్వాత్రింశత్సాలభంజికల కథలను రచించుటనుగూర్చి కవి యిట్లు వ్రాయుచున్నాఁడు—

క. అప్పగ నొప్పారు కరుణన్ । గుప్పలుగొను విక్రమార్కుగుణములకొఱకై
చెప్పెద రసభావంబులు । చిప్పిలి కొనునట్లు కథలు ముప్పదిరెంటిన్.

ఈకవివంశమునకు మూలపురుషుఁడైన పెన్నయామాత్యుఁడు

సీ. కలుషమండలిక భేకఫణీంద్రుఁడన రాయగజగంధవారణఖ్యాతి వెలసి

* * * *

నెగడె నందవోలు నెలవుగా భూసుర । వంశసాగరామృతాంశుమూర్తి
చక్రవర్తిమాన్యసౌజన్యధుర్యుండు । విక్రమార్కనిభుఁడు పెన్నవిభుఁడు.

అనుపద్యమునుబట్టి నందవోలురాజులయొద్ద మంత్రిగానుండి బిరుదముల నందినట్టు కను

పట్టుచున్నాఁడు. ఇతఁడు పదునాఱవ శతాబ్దమధ్యమునందుండి యుండవచ్చును. కాఁబట్టి యీపెన్నయామాత్యున కేడవపురుషుఁడైన కవి తరువాత నూటయేఁబది సంవత్సరముల కనఁగా పదునేడవశతాబ్దాంతమునం దుండి యుండును. కవిచంద్రుఁడయిన కసవరాజు వేముగల్లుపురాధీశ్వరుఁ డయిన మల్లరాజు మంత్రియైనట్లు

శా. రాణన్ మల్లన కీర్తిచంద్రికలు సర్వంబుం బొంది మధ్యాశ్రిత
క్షోణీభృద్ఘనదుర్గమై గుణమణిస్తోమంబుల న్నిండి యీ
క్షోణిన్ శ్రీపురుషోత్తమాశ్రయమునై శోభిల్లి దానామృత
శ్రేణిన్ ద్యాగసముద్రనామము వహించెన్ వేముగల్లిమ్మహిన్.

ఇత్యాది పద్యములవలనఁ దెలియవచ్చుచున్నది. కాని యీమల్లనృపాలుఁ డెవ్వఁడో యేకాలమునందుండినవాఁడో యింకను విచారింపవలసియున్నది. ఎట్లయినను గవి యించుమించుగా నిన్నూఱుసంవత్సరముల క్రిందటివాఁ డగుటను సందేహము లేదు. ఈ విక్రమార్కచరిత్రములోని గద్యమునందు

"ఇది రాయగజగంధవారణ వైరిమండలీకభేకఫణీంద్ర వీరఘోట్ట విభాళాది బిరుద ప్రకటచారిత్ర కొలనిపెన్నయామాత్యపౌత్ర హరితసగోత్రపవిత్ర సకలసుకవిమిత్ర కసవరాజతనూజ గోపరాజ విరచితంబైన......"

అని పెన్నయామాత్యుఁడు తనకు తాతయైనట్లు చెప్పుకొనెను గాని వంశవర్ణనమువలన నతఁడు కవి కేడవపురుషుఁ డైనట్టు స్పష్టమగుచున్నది. ఈద్వాత్రింశత్సాలభంజికాకథల కవిత్వము విక్రమార్కచరిత్రమును రచించిన జక్కనకవిత్వమునకుఁ జాలకపోయినను మొత్తముమీఁదఁ జక్కనిదిగానే యున్నది. ఈపుస్తకములోనివిరెండుపద్యము లిందుఁ బొందుపఱుపఁబడుచున్నవి—

ఉ. అన్నలొ తమ్ములో చెలులొ యాత్మజులో నను వారు వీరకై
మిన్నక చావ నేల యిఁక మేలె భుజంగ బలీభోజికయ్యు నా
యున్నెడ విశ్వసింప నొరునొద్దకుఁ జేరఁ బ్రమాద మౌనుఁ గ
న్నన్న నెఱింగి యుండెడకుఁ జాగుఁడు ప్రాణము తీసి చూచితే.—ఆ. ౪.

ఉ. దేవసమాన నిన్ను వినుతించుట వాంఛితసిద్ధి భూమిలో
నేవసుధేశు నీయెదుట నెన్నఁగవచ్చు మదీయజిహ్వా ల
జ్జావశమై చలింప దిఁక సద్గుణముం దగ సద్గుణాఢ్య ప్ర
స్తావన చేయ నేరనియతం డతిమూర్ఖుఁడు గానఁ జెప్పెదన్.—ఆ. ౧౧.

కొడిచెర్ల-శ్రీనివాసకవి.

ఇతఁడు శేషధర్మరత్నాకర మనియెడి యాఱాశ్వాసముల పద్యకావ్యమును రచియించెను. ఈగ్రంథమును శేషధర్మము లనియు నందురు. ఈకవియాత్రేయ గోత్రుఁడగు కొండయభవానిపుత్త్రుఁడు; రాజమహేంద్రపుర నివాసుఁడు. ఇతఁ డిన్నూఱుసంవత్సరములకు ముందుండినవాఁడు. ఇతఁ డొకవేళఁ బదునేడవశతాబ్ద మొదటనుండి మధ్యకవులలోఁ జేరవలసినవాఁడేమో! పుస్తకములోని

> "ఇది నవీనసాహిత్యబంధ-బంధుర ప్రబంధ నిబంధనా చాతురీ ధురీణ సకలకళా ప్రవీణాత్రేయగోత్రపవిత్ర-కొడిచెర్ల కొండయభవానిపుత్త్ర ఐవరగండ బిరుద ప్రచండ మంత్రిమార్తాండ సమస్త సద్గుణావాస శ్రీనివాసప్రణీతంబైన హరివంశంబునందలి శేషధర్మసారంబను మహాప్రబంధంబునందు."

అను గద్యమునుబట్టిచూడఁగా నితఁడు మంత్రిశిఖామణియై బిరుదముల నందినట్లును, అత్యంతాధునికుఁడు కానట్లును, కనఁబడుచున్నాఁడు. ఈతనికవిత్వము ప్రౌఢమయి రసికజనహృదయంగమముగా నున్నది. ఈతని శేషధర్మములనుండి కొన్నిపద్యముల నిం దుదాహరించుచున్నాను—

చ. నెలకొని సంగమంబున జనించును గామము కామవృద్ధిచేఁ
దలకొనుఁ గ్రోధ మట్టిదెసిదం బగుక్రోధమునం దనర్చు మో
హలతిక మోహమస్మృతి నుదయం బగు విస్మృతి విస్మృతిం జనున్
దలఁపఁగ బుద్ధి బుద్ధి చనినన్ మతిదాఁ జెడు మానవుం డిలన్.—ఆ. ౧.

ఉ. మేఁడియు నీగిముల్ భుజముమీఁద ధరించుచుఁ బోతునెద్దుతోఁ
గూడఁగఁ గాఁడిఁబూన్చి మునికోల కరంబునఁ బట్టి పగ్గముం
ద్రాడును మోకువారెనయుఁ దాలిచి ముందట వెక్కుఁ జుంగు ద్రే
లాడఁగఁ గాసెఁ గట్టుకొని యుక్కుటిలాత్ముఁడు సాఁగెఁ జేనికిన్.—ఆ. ౩.

ఉ. రామ కృపాభిరామ రిపురాక్షసవీరవిరామ సాహసో
ద్దామ లసద్గుణప్రకరధామ సమస్తనృపాలలోకసు
త్రామ విభాకరాన్వయ[illegible]సోమ సద్గుణా
రామ నిను న్నుతింప నల రాజకళాధరుఁడైన నోపునే.—ఆ ౪.

పట్టమట్ట సోమనాథకవి.

ఇతఁడు స్కాందపురాణములోని సూతసంహితను నేడాశ్వాసముల గ్రంథముగాఁ దెనిఁగించెను. ఈకవి యారువేల నియోగిబ్రాహ్మణుఁడు; హరితసగోత్రుఁడు; వేంకటామాత్యపుత్రుఁడు. ఇతఁడు తన గ్రంథమును బిక్కనవోలి కామారెడ్డి కంకితము చేసెను. ఈ గ్రంథము రచియింపఁబడినకాల మిప్పటి కిన్నూఱుసంవత్సరములకంటె నెక్కువయినట్టు తోఁచుచున్నది. కృతిపతియైన కామినేని కామారెడ్డి యెప్పుడుండినవాఁడో తెలిసినదికాదు. కృతికర్త గోదావరీమండలములోనివాఁడు. సూతసంహిత కవిత్వము సలక్షణమయినదిగా నున్నది. కవితాధోరణిని దెలుపుటకయి సూతసంహితలోని పద్యములు కొన్ని యిందుదాహరింపఁబడుచున్నవి—

ఉ. మున్ను పురాణపూరుషుఁడు ముఖ్యుఁడు విష్ణుఁడు శంభుమాయపైఁ
గొన్ని విమోహితుండయి యకుంఠితగర్వ మెలర్ప నేన యీ
యున్నజగంబులం బొదివి యాలికి కర్తను వేరుకొన్న నా
కన్న ఘనుండు నాసముఁడు గల్గిన నెవ్వఁడు శాశ్వతంబుగన్.—ఆ. ౧.

ఉ. పాపము లట్టు కొన్ని యెడఁబాసిన రోగము లెల్ల మాని య
ద్దీపితసత్త్వుఁడై దృఢమతిన్ శశివర్ణుఁడు తస్కరైకర
క్షాపరతంత్రవృత్తిఁ దృణకాష్ఠఫలోదకశాకమూలనా
నాపరిచర్యలన్ దినదినంబు గురున్ భజియించు నెంతయున్.—ఆ. ౩.

చ. సరవి నబోధమూల మగుసంసృతివృక్షము మూలనాశనం
బురుగతిఁ జేయు మంత్రరచితోదక పుష్పముఖార్చనంబు లే
సరణిని బాల హాత్త్రరతి జ్ఞానమె ముఖ్యశివార్చ యాబహి
ర్వరచితపూజనంబు లవి వేతులు స్థూలము లందు రజ్ఞులన్.—ఆ. ౪.

ఉ. అట్టిమహేశ్వరుం దెలిసి యవ్యయధామము నొందవచ్చు నే
పట్టునఁ గర్మకోటి నది ప్రాప్తముకాదు సమస్తయజ్ఞముల్
చెట్టన భూరిసంసరణనీరధి దాఁటఁగ మంటిరోడ తా
నెట్టును మృత్యువున్ జరయు నేమును గేవలకర్మతంత్రులన్.—ఆ. ౮.

ఓబిరమణకవి.

ఇతఁడు వాసిరెడ్డి రామలింగప్రభుని ప్రేరణముచేత శృంగారధామమను రెండాశ్వాసముల ప్రబంధమునుజేసి శ్రీమంగళగిరి నృసింహస్వామి కంకితముచేసెను. కవి తన్నుఁ గృతిచేయఁ బ్రేరేపించిన రామలింగప్రభునిఁ దనప్రబంధమునం దిట్లు వర్ణించియున్నాఁడు—.

సీ. ఏధన్యవంశమునఁ దెలిమి నుమానాధువరమున నభివృద్ధివంతుఁ డయ్యె
నేమేటికూటస్థుఁ డెసఁగ వేమనృపాలుప్రీతిచే భువి వాసిరెడ్డి యయ్యె
నేమహాత్మునియింద్రిడి యొందెఁ గుతుబుశానృపాలుచే గజాందోళికంబు
లేమహాద్యుగ్రజుఁ దెలిమి శాత్రవవీరగజరాజసింహతఁ గలనమున
నతఁడు వంశజుఁ దగనికూటస్థజాతుఁ | డతఁ సత్పుత్రుఁ డాతనితమ్ముఁ డగుచు
నమరె బహుగుణరత్నరత్నాకరుండు | కదనవిజయుండు రామలింగప్రభుండు.

ఈపద్యమునుబట్టియే యీకవి సద్దృష్టముగాఁ గవిత్వము చెప్పలేనివాఁడనుట స్పష్టము చున్నది. అభివృద్ధిమంతుఁడనుట కభివృద్ధివంతుఁడనియు, అందెననుట కందెన యనియుఁ బ్రయోగించినను మొత్తముమీఁద గవిత్వము రసహీనమైనదికాదు. కృష్ణామండలములోని యమరావతీ సంస్థానప్రభువుల ప్రేరణమునుబట్టి పుస్తకము రచించుటయు మంగళగిరి నృసింహుని కంకితముచేయుటయు విచారింపఁగా నీకవి కృష్ణామండలములోనివాఁడనుట తేలుచున్నది. కుతుబుశాహ పేర్కొనియుండుటచేతఁ గవి పదునేడవశతాబ్దమధ్యమునం దుండినట్లూహింపఁదగియున్నది. శృంగారధామమునుండి రెండుపద్యము లిం దుదాహరింపఁబడుచున్నవి—

ఉ. అళికులవేణికిం బ్రియుఁ డనంగనృపాలుఁడు దాడిచేసి యీ
వలకి నేఁట రేపటనె వాసిగఁ గాఁగలఁడంచు బాల్యముఁ
గళవళమంది చిత్తిలఁగఁ గ్రుడ్డెఁ దత్సుఖరాజచిహ్నముల్
కలికి వయఃప్రకాశగుణకాంతియు బాల్యవయస్సుసంధిగన్.—ఆ. ౧

మ. సరి నీవాఁమొదలింటి కేగఁ గని యోఁ జాలించి యున్నంతలో
నరయం దక్షుల మేమి యున్నటియదీయాగ్రంబు మాకిచ్చి యే
పగణింపోయినఁ బొమ్మటంచు వడిఁ జంపచ్చిత్తయై వేశ్య త
త్సాగరయుక్తాంచితకంకణంబు లొగిఁ దాఁ గాంక్షించి తీసె న్వెసన్.—ఆ. ౨

కోడూరి వేంకటాచలకవి.

ఇతఁడు స్కాందపురాణములోని శివరహస్యఖండమును తెనిఁగించెను. ఇతనికి బాలసరస్వతి యను బిరుదాంకము గలదు. ఈతఁడు ఆఱువేలనియోగిబ్రాహ్మణుఁడు; ఆపస్తంబసూత్రుఁడు; కాశ్యపసగోత్రుఁడు; ఎల్లనామాత్యపౌత్రుఁడు; శంకరామాత్యపుత్రుఁడు. ఈ శివరహస్యఖండము శ్రీ సుబుద్ధి ముళువాగిళ్ళ ప్రభుని కంకితము చేయఁబడినది. ఇతఁడు బళ్ళారి ప్రాంతములయందుండిన లింగబలిజప్రభువని తోఁచుచున్నది. కృతిపతియొక్క పూర్వులలో నొకనిని వర్ణించుచు

క. ధరణీస్థలి నాపరశివ। చరణోద్భవ కులజుఁడు సకలసామ్రాజ్యగుణా
భరణుఁడు వీరన్నపొలుడను। వరభింగకగోత్రుఁడు వెలుఁగును బరిఖ్యాతుండై.

అని కవి యతని శివపాదోద్భవకులజుఁగాఁ జెప్పినందున నితఁడు శైవశూద్రవర్ణమని చెప్పవచ్చును. కృతిపతియొక్క పితామహుని మాతామహుఁడైన చిక్క రాజను నామాంతరముగల ముళువాగిభూపాలు నీక్షించి పద్యములలో మధురాధీశ్వరుని జయించినట్టును శ్రీవేంకటపతిరాయల కాలములో నుండినట్టును కవి వర్ణించియున్నాఁడు—

మ. ప్రకటారాతివినాశకాగ్రభుజాప్రావీణ్యమింపార వా
రక యెంతే మధురాపురీశుని దర్పం బెల్ల వారించి భూ
రికృపాసిద్ధిచేత వేంకటపతిశ్రీరాయసన్మాన్యుఁడై
చిక్కరాజాఖ్య వహించె భానురజయశ్రీధుర్యుఁడై వేడుకన్.

క. అనఘుఁడు నాగనృపతి ధ। రామండలిఁ గీర్తిగాంచె రాజన్యకశో
ద్దామబలావాప్యజయ। స్తోమమహైశ్వర్యధుర్యశీలాన్వితుఁడై.

సీ. ఏధరిత్రీశుకీర్తి శుభ్రాంతగంగంబు రంగంబు పార్వతీరమణిపతికి
దేవరేశ్వరుకరాన్వితచంద్రహాసంబు హాసంబుఁ జేయు వజ్రాయుధంబు
నేరసజ్జనకీర్తి శారదామోదంబు మోదంబు హరిదంతములఁ గూర్చు
నేసుధీపత్కుభాషా శోభా సారంబు సారంబు బుధజనశ్రవణములకు
నతఁడు చెలువొందు వాటకారాగ్రధైర్య
సహితుఁ డవిచార్యశౌర్యమాంసలభుజుండు
[illegible]గాంభీర్యసౌందర్యయానవిభుఁడు
సుప్రభావుఁడు ముళువాగిళ్ళప్రభుఁడు.

ఈ పద్యములవలనఁ గృతిపతిపూర్వులు విజయనగర సంస్థానాధీశ్వరుల సేనాపతులై యుండి ప్రభుత్వము సంపాదించిరని మాత్రమే కాక కవికాలమును సరిగా నిర్ణయింపవచ్చును. వేంకటపతిరాయలు ౧౫౮౬ వ సంవత్సరము మొదలుకొని ౧౬౧౪ వ సంవత్సరము వఱకును రాజ్యము చేసినవాఁడగుటచేత నాతనికి నాలుగుతరముల తరువాత నున్న కృతిపతియుఁ గృతికర్తయు ౧౭౦౦ వ సంవత్సర ప్రాంతములయందున్నట్టు నిశ్చయముగాఁ జెప్పవచ్చును. ఇంతేకాక యాంధ్రకవిస్తుతిలోని యీ క్రిందిపద్యములో బింగళి సూరన్నను బూర్వకవినిగా నభివర్ణించుటను బట్టి కూడఁ గవి యర్వాచీనుఁడని చెప్పవచ్చును.—

సీ. చతురాస్యుఁ డనఁగను జగతి వాగనుశాసనప్రౌఢిఁ జెలువందు నన్నపార్యుఁ
గుందలీంద్రుఁ డన నఖండమేధాస్ఫూర్తి నలరారు తిక్కనయజ్వమణిని
నచ్యుతైకసమాఖ్య నరచితవరభాగ ప్రకటించు శ్రీనాథసుకవివరుని
సన్నార్యులఁ సుప్రసాదతేజంబులఁ బరఁగిల్లెడు సోమభాస్కరులను
భూనుతకృతిశాత్వజరాజుఁ బోతరాజు । సుగమకోరధుఁ బింగళి సూరవిభుని
మతియనాంధ్రోక్తి శ్వారాణ్ణపతిని । ఘనతీకమలాంచయులను మహాకవులనెంతు.

ఈ క్రిందిపద్యములలోఁ గవి కృతిపతియొక్క తాతయగు పొట్టి లింగభూపాలుని తండ్రియగు లింగభూపాలుని బహువిధముల వర్ణించియున్నాఁడు—

సీ. ఘనమార్గవర్తుల్ గానిగ్రోధుల ఘనమార్గవర్త్మ లాగఁ గఁ జేసెఁ
గనిదానమహిమంబు గాంచని విభుల కనదానమహిమంబు గాంచఁ జేసె
మిత్రపద్ధతి దప్పి మెలఁగెడు వైరుల మిత్రపద్ధతిఁ జెంది మెలఁగఁ జేసె
నెలమిఁ బావనమూల్యాశ్రయింపని ఘలల నెలమిఁ బాదము లాశ్రయింపఁ జేసె
ననుచు మెచ్చుచు జనులు మానవనాయుఁ । యాతిదెవ్వానిభుజపీఠి నాశ్రయించె
నతని నుతియింపఁ బెరమె నహార్యధైర్య । భైరవ పొట్టిలింగభూపాలవర్య.

*　　*　　*　　*

సీ. ధరణి రాజులుగాని ధరణిరాజులుగారు దీటుదాగత్నమాది వ్యరుచుల
దినకేసములుగాని యినకేసములుగారు ప్రతి ప్రభావాటోపపటుజవముల
నలనరేంద్రులుగాని నలనరేంద్రులుగారు పురుషభాసురవచోభోగములను
గోత్రేశ్వరులుగాని గోత్రేశ్వరులుగారు సరిదైర్యబంధురైశ్వర్యములను
నతనిఁ బనిద్యున్న ధారుణీపతులు ధీశ! ఇలసెనెవ్వాఁడు ప్రఖ్యాతి విస్తరిల్ల
నతఁడు చెలువొందె రాయవేశ్యాభుజంగ । జయవిజయదశాలి లింగభూజానిపాలి.

ఉ. లింగనృపాలపుత్త్రుఁడగు లింగనృపాలుని శుద్ధకీర్తిశా
లింగని శారదాభ్రపటలింగని నాకధునీతరంగపా
లింగని నీలచేలునిహలింగని మానసవిస్ఫురత్సరా
లింగని పద్మగర్భునిచెలింగని సారె హసించు నెంతయున్

ఈపై నుదాహరింపఁబడినపద్యములచేతనే యితఁడు ప్రౌఢకవియనియు నిరర్గళకవితాధార గలవాఁడనియుఁ దెలియు నయి యున్నను శివరహస్యఖండములోని కొన్ని పద్యములఁగూడ నిం దుదాహరించుచున్నాను—

సంభవకాండము.

ఉ. తేనియవాఁక యిచ్చటను దిన్నఁగ రాఁగదవే మృగీమదం
బీశైలతాళిఁబోదలిసు నిచ్చటజాతిమనుష్య కోకిలో
దామము లిందు విచ్చె కలకంఠి యటంచు సఖీజనావళుల్
మాటగ హెచ్చరింప నసమానమహామహిమాభిరామయై.—అ ౧.

మ. పతితస్వచ్ఛశిరోజము ల్దరఁగా బల్జీర్ణమా మేనతోఁ
బలుకుల్ ప్రేలఁగఁ గంపమంద శిరముల్ వక్త్రంబు నిర్దంతమై
వెలయన్ భూరిజరాతిభారమున గర్వీభూతుఁడై సారె ప్ర
స్ఖలదంఘ్రిద్వయు మొప్ప గద్దెక మించన్ వృద్ధవిప్రాకృతిన్.—అ. ౨.

ఉ. పోయెద నుండెదన్ సమరము న్రచియించెద నాయుధచ్ఛ నే
లా యిటు లాసఁ దావకబలంబుఁ జలంబును లావుఁ జేవయున్
వేయివిధంబులం బలుక వేమఱు నాకు జనించు హాస మో
హో యిఁకఁ జాలుఁ జాలు విను మోరి వచించెద దానవాధమా —అ. ౫.

ఏనుగు లక్ష్మణకవి

ఈకవి బహుగ్రంథములు చేసి ప్రసిద్ధి కెక్కినవాఁడు. ఇతఁడు చేసినగ్రంథములలో రామవిలాసప్రబంధము కడపటిదిగాఁ గనఁబడుచున్నది. ఈప్రబంధము పెద్దాపురసంస్థానము దుండిన శ్రీవత్సవాయ గోపరాజున కంకితము చేయఁబడినది. ఈ గోపరాజు తన్నుఁగూర్చి పలికినట్లు కవి తన రామవిలాసములో నీపద్యములఁ జెప్పుకొన్నాఁడు—

సీ. సుచరితాపస్తంబసూత్రు వాధూలసగోత్రు సత్వనయాదిగుణసమేతు
నేఁగు లక్ష్మకవీంద్రునిపౌత్రుని శ్రీమాధిరాజు నృసింహమంత్రి

దౌహిత్రుఁడు భూవరాస్థానపూజ్యుఁడు తిమ్మమంత్రికిఁ బేరమాంబకు సుపుత్రు
ధన్యు ననంతాభిధానానుజుని వీరభద్రున కగ్రజు భాగ్యవంతు
లలితకవితాకళాధుర్యు లక్ష్మణార్యు। నన్నుఁ బిలిపించి యుచితాసనమున నుంచి
చాలఁ గరుణించి తనముఖాబ్జమున మందహాస మమరఁగ నిట్లని యానతిచ్చె.

సీ. సృజియించినాఁడవు సేతురామేశ్వరమహిమంబు పాండిత్యమహిమ మెఱయఁ
గల్పించినాఁడవు ఘనులెన్న జాహ్నవీమాహాత్మ్యకృతి సుధామధురఫణితి
నిర్మించినాఁడవు నిర్జరభాషచే శతకంబు భాస్కరస్వామి కలిమి
రచియించినాఁడవు రుచిరంబుగా సుభాషితరత్నమాలిక శివునిపేర
రమ్యవిశ్వేశ్వరోదాహరణ నృసింహ।దండకాదిస్తుతిప్రబంధములు గూర్చి
సభలలో నుత్తమఖ్యాతి నమరినావు। లలితగుణధుర్య యేమఁగు లక్ష్మణార్య.

గీ. వారిజాసననారీముఖారవింద। సారసౌరభఘన ఘనసారసాంద్ర
వీటికాబంధురసుగంధవిభవమధుర। లలితవాగ్ధుర్య యేమఁగు లక్ష్మణార్య.

గీ. ధీరులు నుతింప నిప్పుడు మీరు సేయు। భాసురం బగురామవిలాసకావ్య
మంకితము చేయు మా పేర నచలధీర। ధరణి నాచంద్రతారకస్థిరముగాఁగ.

పైపద్యములవలన నితఁడు రామేశ్వరమాహాత్మ్యము, గంగామాహాత్మ్యము, గీర్వాణసూర్యశతకము, సుభాషితరత్నావళి, విశ్వేశ్వరోదాహరణనృసింహదండకాదిస్తుతులు, రామవిలాసము, చేసినట్లు తెలియవచ్చుచున్నది. మఱియు నితఁడు విశ్వామిత్రచరిత్రము మఱియొక గ్రంథముగూడ రచించినట్లు సుభాషితరత్నావళి యవతారికలోని యీక్రిందిపద్యమువలనఁ గానవచ్చుచున్నది—

క. రామేశ్వరమహిమము వి। శ్వామిత్రచరిత్ర సూర్యశతకంబును గం
గామాహాత్మ్యము మొదలగు। శ్రీమత్కృతిరత్నములు రచించితి మఱియున్.

ఆఱువేల నియోగియైన యీకవి యాపస్తంబసూత్రుఁడు; వాధూలసగోత్రుఁడు; తిమ్మకవిపుత్రుఁడు; లక్ష్మణకవిపౌత్రుఁడు; మాచిరాజు నృసింహుని దౌహిత్రుఁడు. ఈతని తల్లిపేరు పేరమాంబ; అన్నయనంతకవి; తమ్ముఁడు వీరభద్రుఁడు. ఈకవి వంశమునకు మూలపురుషుఁడు పైడిపాటి సింగన్న. ఈకవిపూర్వులయింటిపేరు పైఁడిపాటివా రయినను సింగన్నవంశజులలో నొకఁ డగు జలపాలామాత్యుఁడు పెద్దాపురసంస్థానాధీశ్వరుఁ డగు గజపతిరాజుచే నేనుఁగును బహుమానమందుటచే నప్పటి నుండియు నేనుఁగువా రని మాఱినది. ఈయంశమే సుభాషితరత్నావళ్యవతారికలో నిట్లు చెప్పఁబడినది—

సీ. పరమేష్ఠికుల్యాగ్రభావ్యుఁడు వాధూలుఁ డన బాహుఁడింద్రుఁడుం డొప్పె, నాతనిమూర్తి
యమ్మునినాథువంశమ్మున క్షీరాంబుధి సుధాకరుఁ డనఁ జన్మించినట్లు
ప్రభవించి శ్రీపైడిపాటి సింగనమంత్రి వరుఁ డగ్రగణ్యుఁ డైనఁ డతని
మహిమసంతానక్రమమున జలపాలసచివుఁ డొప్పె బలాకొసచివసఖుఁడు
గజపతిక్షితిభర్త చే గజముతోడ । నగ్రహారము లతఁడు పరిగ్రహించె
నెలమి నేఁగువారన్న యింటిపేరు । గలిగె నతనికి గజలాభగరిమవలన.

గీ. ఈదృగ్గజపతిదత్తసోమేశ్వరాగ్ర । హారశాసనుఁడై మహోదారభాగ్య
మహిమ గలిగినజలపాలమంత్రిమణికి । గేకిరాజు జనించె విఖ్యాతయశుఁడు.

ఈకవియొక్క పూర్వులు చిరకాలమునుండి పెద్దాపురసంస్థానములో నుద్యోగములలో నుండుచువచ్చిరి. వారిలోఁ గొందఱు కవులు సహితముండిరి. ఈపద్యమునఁ జెప్పఁబడిన గేకిరాజునకు మనుమఁడును కవికిఁ దితామహుఁడును పెద్దాడ గ్రామమునకు కరణము నయినయేఁగులక్ష్మణకవి పెద్దాపురసంస్థానమునం దుండి వత్సవాయువంశజు లయిన యచ్చటిరాజుల కనేకకృతు లంకితము చేసెను. ముందుగాఁ గవి తనతాతను గూర్చి సుభాషితరత్నావళిలో చెప్పినపద్యములమాత్ర ముదాహరించి యాతఁడు రచించిన గ్రంథనామములను కృతిపతులనామములను గామవిలాస కృతిపతిని గూర్చి చెప్పినప్పుడు ముందు వివరించెదను.—

ఉ. సాదరయుక్తి నద్రుహిణసారథికిన్ గురురాజమంత్రికిన్
బేరమయుండు నందనుఁడు పేర్మి జనించె విలాససంపదన్
మాహేంద్రుఁడు విక్రమంబునఁ గుమారుఁడు లక్ష్మణశౌరి భూమిలో
భారవి సాహితీవిజితభారవి ధీరవిచారవిశ్రుతిన్.

ఉ. దండి మనోజ్ఞశబ్దకవితారుచిచే నుపమానవృద్ధిచే
గండవకాళిదాసు రసదీపితరంగితసూక్తిఁ గుండలిం
ద్రుం డని ధీరు లెంచఁగఁ గృతుల్ రచియించినధన్యునిన్ మహా
పండితమాన్యు నెన్నఁదగు భాజితసూర్యుని లక్ష్మణార్యునిన్.

గీ. కృతు లొసఁగి వత్సవాయితిమ్మనృపతిచేతఁ । గురగమణిభూషణాంబరాందోళికాది
పూజ గైకొని పెద్దాడపురవరాను । శాసనం బంది లక్ష్మణశౌరి తనరె.

కవియొక్క యన్నయైన యనంతార్యుఁడు గౌరీపరిణయకావ్యము రచించినట్లు సుభాషితరత్నావళిలోనే యీక్రిందిపద్యమునఁ జెప్పఁబడినది.—

క. గౌరీపరిణయకావ్యము । సూరీంద్రులు మెచ్చఁ జెప్పి శుంభత్కవితా
పారీణబిరుద మందిన । భూరియశోఘనుఁ డనంతబుధవరుఁ డలరున్.

లక్ష్మణకవి రచియించిన రామవిలాసమునుబట్టి యితనికాలమును దెలిసికొనవచ్చును. ఇతఁడు కూచిమంచితిమ్మకవికి బంధువయినను కాకపోయినను, అతనితో సమకాలికుఁ డయినందునకు సందేహము లేదు.

క. హాటకగర్భవధూటీ। లాటనచలితాంఘ్రినూపురారావశ్రీ
పాటచ్చరములు తేనియ। తేటలు మాకూచిమంచి తిమ్మనమాటల్.

అను కూచిమంచి తిమ్మకవినిగూర్చినపద్య మీతఁడు చెప్పినదైన నయియుండవచ్చును. రామవిలాసము వత్సవాయ గోపరాజున కంకితము చేయఁబడినది కవి కృతినాయకుని

సీ. తనమహౌదార్యంబు తనమహాధైర్యంబు కరణి జీమూతలాఘవ మొసఁగఁ
దనవిమలకీర్తి తనవిక్రమస్ఫూర్తి పగిదిఁ బద్మాహితోపమ వహింపఁ
దనవిద్యాభూతి తనదానవిఖ్యాతిగతిఁ గమలోద్భవగామ మీఱఁ
దనకార్ముకప్రౌఢి తనప్రతాపనిరూఢిభాతి ధనంజయప్రథిమఁ బూనఁ
ధరణి నుతికెక్కె నిజభుజాదండమండ। లాగ్రదర్శనచకితమత్తారినృపుఁడు
వత్సవాయసింహాద్రిభూవరసుతుండు। ప్రణుతగుణశాలి గోపభూపాలమౌళి.

సీ. శారదనీరదనారదపారదహారదరస్ఫూర్తి నవఘళించి
శరదిందుకరకుంద శరబృందవరచందనహారిచందనకాంతిలహరి మీఱి
హరికాంతహరిదంతహరిదంతకరిదంతవిధుకాంతపృథుకాంతవిధ హసించి
పురవైరిధరణీధ్రగిరిదారిహరిశౌరిచరణనిర్ఝరవారిసురుచి గేరి
పాండురాఖండనిజకీర్తిమండలంబు। పుండరీకభవాండంబు నిండి మెఱయఁ
బ్రాభవము గాంచె సింహాద్రిరాజసుతుఁడు। ప్రణుతగుణశాలి గోపభూపాలమౌళి.

ఇత్యాదిపద్యములతో నెంతవర్ణించినను, ఈగోపరాజు పెద్దాపురసంస్థానాధీశ్వరుఁడుగాక తత్సంస్థానాధిపతి యగుతిమ్మజగపతిమహారాజుగారి కాప్తబంధువయి గౌరవము నొందినవాఁడుగా నుండెను. అప్పుడు ప్రభువుగా నుండిన జగపతిమహారాజుల పుత్త్రుఁడగుతిమ్మజగపతిమహారాజుగారు ౧౭౫౯ వ సంవత్సరము మొదలుకొని ౧౭౯౭వ సంవత్సరమువఱకును రాజ్యపాలనము చేసిరి. ఈయన సింహాసనమునకు వచ్చినది ప్రమాది సంవత్సర పుష్యశుద్ధదశమి. గతదినమున నీయనతండ్రిగా రగురాయజగపతిరాజుగారు శ్రీపూసపాటి యానందగజపతిరాజుగారితో ఉండూరువద్ద జరిగిన యుద్ధములో హతులైరి. అంగీరస సంవత్సర కార్తికశుద్ధ ప్రథమదినమున జనన మొందినందున, జనకుని మరణమునాఁటి కీయనకు వయస్సెనిమిదిసంవత్సరములు. ఈయన నలువదియైదుసంవత్సరములు జీవించి పింగళ సంవత్సరాశ్వయుజబహుళపంచమినాఁడు పరలోకగతులైనారు. ఈయనకాలమునం దుండి యీయనను బహుపద్యములతో స్తుతిం

చినవారగుటచే నేనుఁగు లక్ష్మణకవిగారు ౧౭౩౦-౫౦ సంవత్సరముల వఱకును జీవించి యున్నట్టు కనఁబడుచున్నది. అందుచేత నీకవి కూచిమంచితిమ్మకవి మరణానంతరమున నిరువదియేండ్లు జీవించియుండవచ్చును. పెద్దాపురపురాజు లగువత్సవాయివారు తాము మొదటినుండియు విద్వాంసు లయి విద్వత్కవుల నాదరించుచుండినట్లు వారివంశచరిత్రమువలన విస్పష్టమగుచున్నది. ఈవంశపువారి మూలపురుషుఁడు సూర్యవంశ్యుఁడయి కృష్ణామండలములోని గుడిమెట్ట రాజధానిగాఁ గల చాగి పోతరాజైనట్టు రామవిలాసములోని యీక్రిందిపద్యమువలనఁ దెలియవచ్చుచున్నది—

గీ. సహ్యజాతీరమునకు భూషణ మనంగ । సిరుల కిరవగు గుడిమెట్టపురము తనకు
రాజధానిగ సత్కళాభోజరాజు । చాగిపోతక్షమాభర్త జగతి యేలె

ఈసాగిపోతరాజుయొక్క శాసనములు గుడిమెట్టలోను నవాబుపేటలోను బెజవాడలోను ౧౨౩౦ వ సంవత్సరమువఱకును గానఁబడుచున్నవి ఈతనియింటిపేరు సాగివారేయైనను, ఈతనివంశమువారిలో నొకఁడగు రామన్నపాలుఁడు

„తగవత్సవాయిసమాఖ్యనగరంబు నిజనివాసము చేసె నదికారణముగ సాగి
వంశమునకు వత్సవాయనామము లోక । సుప్రసిద్ధ మగుచు సొంపుగాంచె"

తననివాసమును వత్సవాయినగరమునకు మార్చినందున గృహనామము వత్సవాయివారయినది. వీరివంశజులలో నొకరగు (పేరరాజునుతు లయిన) ముసలి తిమ్మరాజుగారు ౧౫౫౫వ సంవత్సరమునకు సరియైనయానందసంవత్సర భాద్రపద బహుళసప్తమినాఁడు పెద్దాపురసంస్థానమును సంపాదించి ౧౬౦౭వ సంవత్సరమునకు సరియైనపరాభవసంవత్సర మార్గశిరబహుళ ద్వితీయవఱకు నేఁబది రెండుసంవత్సరముల రెండుమాసముల యిరువదియైదుదినములు రాజ్యముచేసి లోకాంతరగతు లయిరి. దిట్టకవి విశ్వనాథకవి విరచిత మైనశేషధర్మములను గృతినందిన దీయనయని రామవిలాసములోని యీపద్యము తెలుపుచున్నది—

సీ. బిరుదాంకపురిని సుస్థిరముగా నిర్మించెఁ బాలమున్నీటిని బోలుచెఱువు
తిరుపతివల్లికి గిరిఁ బూలపల్లెను ఫలవృక్షవనములు నిలిపెఁజాల
నృహరిగేహతటాకనిక్షేపవనములు కొమరుగాఁ బెద్దాపురమున నునిచె
విశ్వనాథకవీంద్రవిరచితశేషధర్మప్రబంధము సాదరముగ నందె
విప్రవశ్యప్రతిష్ఠలు వెలయఁజేసెఁ । బుత్రులను గాంచె నీతిని బుడమి యేలె
వత్సవాయాన్వయమునకు వన్నెఁదెచ్చె । హెచ్చి పేరయతిమ్మధాత్రీశ్వరుండు.

ఈతిమ్మరాజుగారు డెబ్బదియాఱుసంవత్సరములు బ్రతికి కాలధర్మము నొందఁగా, శ్రీముఖసంవత్సర కార్తికశుద్ధపంచమినాఁడు జనన మొందిన యాయనపుత్రుఁడు రాయప

రాజుగారు ౧౬౦౪వ సంవత్సరమునందు తండ్రిపోఁగానే రాజ్యపరిపాలన మారంభించి నలువదిరెండుసంవత్సరములు రాజ్యము చేసి ౭౫ ఏండ్లు బ్రతికి ౧౬౪౬వ సంవత్సరమునకు సరియైనసర్వధారి సంవత్సర మాఘ శుద్ధసప్తమినాఁడు పరమపదప్రాప్తి నొందిరి ఈయన హరిభక్తిసుధోదయమను కృతినందిన ట్లీక్రిందిపద్యము చెప్పుచున్నది—

సీ. శ్రీరాముఁడుఁ గట్టుకూరను గట్టించె గుళ్ళు మంటపములు గోపురములు
గంభీరజలతటాకంబు త్రవ్వించె గృహస్థపురంబున సుస్థిరముగఁ
బొలుపుగా వాల్మీకిపురికాంద్రకోటను ఫలభూజవాటిక ల్పరిలపతిచెఁ
బ్రవ్య మగుహరిభక్తిసుధోదయం బనుమహాకృతిరత్న మందుకొనియెఁ
బేఁగలుగు సుహృత్సుబేగు నరిమి! మెచ్చఁగాఁ దగినఘవిరాలు తెచ్చుకొనియెఁ
బగితు రసువాంగుండియు గిరులుకొనఁగఁ! దిమ్మనృపరాజపత్రమాధీశ్వరుండు.

ఈయన యనంతరమందు పింగళసంవత్సరాశ్వయుజ శుద్ధసప్తమినాఁడు జన్మించిన యీయనపుత్రుఁడు సార్వభౌమ తిమ్మరాజుగారు సింహాసనమునకు వచ్చిముప్పదితొమ్మిది సంవత్సరములు ప్రజాపరిపాలనము చేసి డెబ్బదవయేట ౧౬౮౫వ సంవత్సరమునకు సరియైనప్రభవసంవత్సర ఫాల్గుణబహుళత్రయోదశినాఁడు దేహావసానము నొందిరి. మన కవితాతయైన యేనుఁగు లక్ష్మణకవిగారీ యనకాలమునందే యుండి యీమహారాజునకుఁ దాము రచించిన ద్రౌపదీపరిణయము నంకితము చేసిన టీక్రిందిపద్యములవలనఁ దెల్ల మగుచున్నది—

సీ. రాజులు మెచ్చఁ బల్నాఁటికోట సాధించి నరహరిదేవు దుర్గము మడచెఁ
సదురైనభావిణికోట లగ్గలుపట్టి యొండుకోటయు నివ్వఁ గెలచె
దగిరాజు మొదలైనవారలను భంగించె విశ్వంభరుని యుద్ధహతుఁ జేసెఁ
దగఁబూసపాటి సీతారామభూపాలుఁ డభిమానముగ విజయంబు గాంచె
సాసనముగ నవాబగు నరపతిని! గయ్యమున గెల్చె లోకవిఖ్యాతి చెందె
వత్సవాయాన్వయమునకు వన్నె తెచ్చె! రాయపరిపాలు శ్రీతిమ్మరాజమౌళి.

చ. హరిహరపద్మజాంశభవుఁడై తగు నేనుఁగు లక్ష్మణార్యచే
సురుచిరశబ్దభావరసశుభదలంకృతిమాధురీమనో
హర మగుద్రౌపదీపరిణయం బను నుత్తమకావ్య మందె నం
చిర మగుకీర్తి సొంపెసఁగఁ దిమ్మనృపాలుఁడు ధర్మపద్ధతిన్.

ఈయేనుఁగు లక్ష్మణకవియే ధ్రువచరిత్రమును వేంకటరాజపుత్రుఁ డగుజగ్గరాజునకును, తులాభామాహాత్మ్యమును కస్తూరిరంగరాజపుత్రుఁ డగుజగన్నాథరాజునకును, వత్సవాయ

కులజు లయిన రామబంధుకవుల కంకితము చేసిన ట్లీ క్రిందిపద్యములవలనఁ దెలియవచ్చు చున్నది—

చ. కవికులహర్షదాయిఁ దనరఁగాఁదగు నేర్పుగ లక్ష్మణార్యచే
ప్రథనవతిప్రబంధము బుధుల్ వినుతింపఁగ నంది యోగభూ
గ్భవమహనీయభవకారణ మైనయశంబు గాంచె వా
సవనిభవృంత వత్సవమ జగ్గనృపాలుఁడు సద్గుణోన్నతిన్.

ఉ. హేమనగేంద్రధీరుఁ డగునేర్పుగ లక్ష్మణసత్కవీంద్రుఁ డు
ద్దామసుధామయోక్తి వితతం బగునట్లు రచించినట్టి స
ల్లామహిమ ప్రబంధము గుణాఢ్యులు మెచ్చఁ బరిగ్రహించెఁ బ్ర
జ్ఞామహిమంబు జగ్గనృపచంద్రుఁడు శాశ్వతకీర్తి సంధిలన్.

ఈతిమ్మరాజుగారి యనంతరమునందు వారికుమారు లైన బలభద్రరాజుగారికుమారులు రామపరాజుగారు ౧౬౮౯ వ సంవత్సరమునందు రాజ్యమునకువచ్చి యిరువదియారు సంవత్సరము లీ సంస్థానపాలనముచేసి నలువదేండ్లప్రాయమున ౧౭౧౫ వ సంవత్సరమునకు సరియైన మన్మథ సంవత్సర జ్యేష్ఠశుద్ధ చతుర్థినాఁడు పరమపదమునొందిరి. ఈయనతండ్రి యగు బలభద్రరాజుగారు తాను కవులయి రామశతకమును జెప్పుటయే కాక కిరాతార్జునీయకృతినందిన యీపద్యము తెలుపుచున్నది—

చ. అమితఖ్యాతికి మూలమైనకృతిఁ దా నందెన్ గిరాతార్జునీ
యము శ్రీరాముల పేరఁ బద్యశతకం బాయూధి నిర్మించె భో
జమహీనాయకుఁ బ్రతిష్ఠనయి సాహిత్యపారజ్ఞుఁ డై
రమణన్ శ్రీబలభద్రరాజు ప్రజలన్ రక్షించె ధర్మస్థితిన్.

తరువాత రామపరాజుగారికుమారుఁడు తిమ్మరాజుగారు రాజ్యమునకు వచ్చి దాదాపుగా నిరువదిసంవత్సరములు పాలనముచేసి ముప్పదిసంవత్సరముల ప్రాయముననే ౧౭౩౫ వ సంవత్సరమునకు సరియైన రాక్షస సంవత్సర చైత్రశుద్ధ ద్వాదశినాఁడు పరమపదము నొందిరి. తదనంతరమునందు పుత్రుఁడు శ్రీరామజగపతిరాజుగారు రాజ్యమునకువచ్చి యిరువదిసంవత్సరము లొంబదినెలలు రాజ్యపాలనముచేసి యుద్ధరంగమున విజయనగర పూసపాటి యానందగజపతిరాజుగారితో జరిగిన యుద్ధములో నిరువదియైదుసంవత్సరముల యీడుననే ౧౭౫౯ వ సంవత్సరమునకు సరియైన ప్రమాదిసంవత్సర పుష్య శుద్ధ నవమినాఁడు రణనిహతు లయిరి. ఈయన పిమ్మటనే యేనుఁగు లక్ష్మణకవిగారి కాశ్రయుఁడయి యుండిన (రామ జగపతిరాజుగారి పుత్రుఁడయిన) తిమ్మజగపతిగారు రాజ్యమునకు వచ్చి ౧౭౯౪ వ సంవత్సరమువఱకును ప్రభుత్వముచేసి స్వర్గస్థు లయిరి

పయిని వివరించిన చరిత్రమునుబట్టి పెద్దాపురసంస్థానాధిపతు లందఱు నించుమించుగాఁ దాము కవులయ్యును కవుల నాదరించి కృతులందినవారయ్యును ఉండిరని తెలియవచ్చుచున్నది. ఏమఁగ లక్ష్మణకవి తిమ్మజగపతిరాజు తండ్రియగు రామజగపతి మహారాజుగారి కాలములో సహితము ఉండినట్లు తద్రచితమైన యీచాటుపద్యము పలుకుచున్నది.

ఉ. ఆ యతివత్సవాయకులాంబుధిపూర్ణనిశాపతీ జగ
ద్గేయకళాకృతీ! విదితకీర్తిసతీ కమనీయయౌవన
ప్రాయనవలాకృతీ సతతవైభవనిర్జితపూర్వదిక్పతీ
ధీయుతవాక్పతీ జగపతీ నృపతీ సుకృతీ మహోన్నతీ.

ఈజగపతిరాజుగారు కవిత్వమునందు నిపుణులయి పెక్కుపదములు శతకములు దండకములు మొదలయినవి భద్రాద్రిరామునిమీదఁ జెప్పినట్లు రామవిలాసములోని యీ పద్యముద్ఘోషించుచున్నది—

చ. పదములు కీర్తనల్ రుచిరపద్యశతంబులు రాగమాలికల్
మృదుపదదండకంబులు సమిద్ధగతిన్ రచియించి కామిత
ప్రదునకు భద్రశైలరఘునాథునకుం గానుకగా నొసంగె నా
త్రిదశులు మెచ్చఁగా జగపతిప్రభుచంద్రుఁడు భక్తి పెంపునన్.

ఏమఁగ లక్ష్మణకవికృతములయిన గ్రంథములలో సుభాషితరత్నావళియు రామవిలాసము మాత్రము నాకు లభించినవి. ఇందు మొదటిపుస్తకము భర్తృహరియొక్క సంస్కృతగ్రంథమునుండి తెనిఁగింపఁబడినను, కొంచెమయినను విరసముగా నుండక మూలానుసారముగాను నిర్దుష్టముగాను రసవంతముగాను హృదయరంజకముగాను ఉన్నది. స్వప్నమున పెద్దాడ గ్రామమునందలి సోమశంకరస్వామి తనహృదయమున సాక్షాత్కరించి సుభాషితరత్నావళిని దెలిఁగింపు మన్నట్లు కవి యీపద్యమునఁ జెప్పుకొన్నాఁడు—

సీ. కలధౌతగిరియును గలశౌతగిరియును విల్లుగాఁ బొదవైనయిల్లుగాఁగఁ
గమలాహితుండును గమలాహితుండును శరముగా లలితశేఖరముగాఁగఁ
బద్మోద్భవుండును బద్మోద్భవుండును సారెగా మెయిఁదాల్పుబూరెగాఁగఁ
బవనప్రియుండును బవనప్రియుండును సొమ్ముగా ఫాలనేత్రమ్ముగాఁగఁ
గ్రాలుపెనువేల్పు సమ్మోదవాలుదాల్పు। జగములకు ఱేఁడు ధనదునిసంగడీఁడు
హరుఁడు పెద్దాడ సోమశంకరుఁడు హృదయ। సరసిజంబున నాకు సాక్షాత్కరించె.

రామవిలాసములోని యవతారికనుండి యున్నపద్యముల నుదాహరించినతరువాతఁ గవిత్వము నిర్దుష్టముగాను మృదుమధురవాగ్గుంభనలు కలదిగాను ఉండు నని వేఱుగఁ

చెప్పనక్కఱలేదు. పూర్వోక్తములయిన గ్రంథద్వయమునుండియుఁ గొన్ని పద్యముల నుదాహరించి కవిచరిత్రము నింతటితో ముగించుచున్నాను:—

సుభాషిత రత్నావళి.

చ. నళులగుచు న్నసహోన్నతిఁ దనర్చుచు నన్యగుణోక్తిచే గుణో
న్నతిఁ బ్రకటించుచుం బరజగత్ప్రియకావ్యసమర్థతన్ సమం
చితనిజకావ్యసంగ్రహము చేయుము నిష్ఠురవాదులన్ క్షమా
ధృతి నిరసించుచుం బరఁగుధీరులు పూజ్యులు గారె యోచికిన్.—నీతిశతకము.

ఉ. అతివలఁ జూచి వీ రబలలంచు వచించు మహాకవీంద్రు లు
ద్ధతివిపరీతవాదులిరె దబ్బఱ గాదు విలాసినీసమం
చితతరశక్తిపాత్రములచే గెలువంబడి రింద్రముఖ్యులున్
ధృతి నటువంటివా రబలలే గతి నైరి తలంచిచూడఁగన్.—శృంగారశతకము.

చ. కడు వెఱపించుచు న్ముదిమి గద్దతి బెబ్బులిమాడ్కి నున్న దె
క్కుడు పగదాయులంబలెఁ దెగుళ్ళు శరీరము నొంచుచున్న వె
ప్పుడొ చను భిన్నకుంభములబలె నాయువు నిట్టు లయ్యుఁ దా
రుడుగక మానవుల్ దురిత మొలి నొనర్చుచు నున్నవారహో—వైరాగ్యశతకము.

రామవిలాసము.

ఉ. వాసవనీలనీలరుచిలావితభ్రమశీలముల్ మదం
దాసవలోలుపుల్ యువభయానకసూనకదంబబృందకాం
దాసవముక్తలోహగుళికాళికరాళము లంజనప్రభా
భాసురభృంగజాలములు బంధురవృత్తిఁ జెలంగెఁ గాననన్.—ఆ. ౧.

శా. రామా రాజలలామ యోగిహృదయారామా మహాభోగసు
త్రామా నా కొకముద్దుపెట్టుమువు రారా యంచుఁ గౌసల్య సు
ప్రేమం బిల్చిన నువ్వ లందెలు గంభీరంబుగా మ్రోయఁగా
శ్రీమంతుం డట దారిరేక మెఱయం జేరంగవచ్చుం గృపన్.—ఆ. ౨.

చ. కటుభట ఘోషగర్జితము ఖాడ్గికపాణినటత్కృపాణము
క్షటిమదయుంబు చిత్రఘటితధ్వజపంక్తిసురేంద్రచాప ము
ద్భటవిభవప్రతాపగవిబాధక ముగ్రనిశాటవాహినీ
ఘటఘనబృంద మయ్యెడ నభంబునఁ బర్వె నసృక్ప్రవర్షియై.—ఆ. ౩.

ఉ. చంపకపుష్పవాసనలసార మెఱింగి మధువ్రతంబు లీ
సొంపగు కొన్నపెన్నెరులు చూచితిరే చెలులార యంచు భా

షింపుచుఁ గింకిణీవలయశింజిత మొప్పఁ దలంచె వేడుకన్
సంపఁగిమానెచేత నొకశారదచంద్రనిభాస్య సీతకున్.—ఆ. ౪.

ఉ. ఇందు మెలంగుభృంగములు నిచ్చటికీరమయూరశారికా
బృందము లిందుఁగల్గు సురభిప్రసవంబులు సాధ్యంబులై
యుందులభించినన్ హరుఁ బూనినయుంపదె మారుఁ డంచు నె
న్నందగి రాముకేళిభవనప్రమదావనవాటి వాటిలన్.—ఆ. ౫.

నెల్లూరి- వీరరాఘవకవి.

ఇతఁడు యాదవరాఘవపాండవీయ మనునాలుగాశ్వాసముల త్ర్యర్థికావ్యమును రచియించెను. ఇందు శ్రీకృష్ణునియొక్కయు శ్రీరామునియొక్కయు పాండవులయొక్కయు కథలు ప్రతిపద్యమునకును మూడర్థములు వచ్చునటుగాఁ జెప్పఁబడినవి. వర్ణనాంశములయందుమాత్రము కొన్నియేకార్థపద్యములు లుండును. ఈకవి యాఱువేల నియోగిబ్రాహ్మణుఁడు ఈతని పూర్వుల యింటిపేరు మొదట దేశరాజువారయినను నెల్లూరియందు వాసము చేయుచుండుటచే నెల్లూరివారని మాఱినది. ఈతఁడు కాశ్యపగోత్రుఁడు; ఆపస్తంబసూత్రుఁడు; వేంకటపతిపుత్రుఁడు. ఈతఁడు తనతాతతాతయైనకొండనమంత్రిని దనగ్రంథమునం దిట్లు వర్ణించియున్నాఁడు—

సీ. ఎవ్వనితండ్రి పేరెల దేశరాజువారనఁ బేరింటిపేరు మున్నమరఁ దెచ్చె
నెవ్వనివిద్యాహెచ్చుగా వీణవారన నింటిపేరు నన్నమరఁగూర్చె
నెవ్వనికొమరుఁ డీయిలఁ బెద్దవేంకటపతిరాయలకును దళవాయి యయ్యె
నెవ్వఁడు గీతసాహిత్యవిద్యలనేర్చి దిగ్విజయము బూనె దేశరత్నె
నెవఁడు ఘనిణమలహారియు ధవళశంఖ । మానిగా బిరుదులనెల్ల నంది మించెఁ
బ్రౌఢరాజులచేనిమ్మపడసఁగి । నతఁడుమతికెక్కుఁ గొండనార్యుఁడుజగతి.

తిరుమలదేవరాయనిపుత్రుఁ డయిన యీపెదవేంకటపతిరాయలు ౧౬౧౪వ సంవత్సరమువఱకును రాజ్యముచేసెను. కవియొక్క ప్రపితామహుఁ డాతనికాలములో నున్నందున, నాలుగుతరముల తరువాతివాఁ డయినకవి ౧౭౧౪వ సంవత్సరప్రాంతముల యందుండి యుండవలెను. కవి తనశక్తి సామర్థ్యాదులనుగూర్చి యాదవరాఘవపాండవీయావతారికయం దిట్లు వ్రాసికొనియున్నాఁడు—

సీ. సకలమంత్రరహస్యశాస్త్రసర్వంకషప్రజ్ఞాధికస్ఫూర్తిఁ బరిఢవిల్లి
నిఖిలయోగరహస్యనిరుపమశ్రీఘోరశాంభవయోగాభ్యాస రక్తిమీఱి
యాగమాంతరహస్యభాగోపనిషదర్థసర్వస్వవిజ్ఞానసాని మెఱిఁగి
నాటకాలంకారనానార్థవిశేషరసభావభేదము ల్బాసఁగఁ దెలిసి
శబ్దముఖ్యశాస్త్రసదసద్వివేకత। స్మృతిపురాణవాస్తుగతిరహస్య
గణితతురగరత్నగజపరిజ్ఞాత। నమరు వీరరాఘవాఖ్యకవిని.

క. నానావిధావధానము। లానృపనీతియును భరతమాహాత్మ్యాదుల్
మానుగనిచ్ఛాలిపియును। మానితముగఁ గల్గుఁ గోపనంబులు మఱియున్.

క. ప్రాకృతముఖషడ్భాషల। వ్యాకరణంబులును దెలుఁగువ్యాకరణంబుల్
ప్రాకటసాముద్రికములు। వీఁకన్ జ్యోతిషముఁ జాపవిద్యావిధముల్.

క. సాంగముగఁ దెలిసి మును యో। గాంగీకారమతి నిశ్చలానుభవాప్తిన్
బొంగియు నియోగవృత్తిఁ బో। సంగి చెలఁగితిని సారసాహిత్యనిధిన్.

సీ. శతలేఖినీపద్యసంధానచాతురి ఘటికాశతగ్రంథకరణపటిమ
ఆశుప్రబంధబంధాదిక్రియారూఢి సంకరోష్ఠ్యనిరోష్ఠ్యచాటుకలన
విస్తరమాతృకావివిధచిత్రస్ఫూర్తి పాదమాత్రప్రతిపాదఘటన
వ్యస్తాక్షరవిమిశ్రబహుపద్యగుంభన మచలజిహ్వాదికప్రచురరచన
బహుజనమనోంతరస్థిరబహువిధార్థ। బహుసమస్యాప్రపూర్తియు బహువిభేద
సకలభాషాసమస్యాదిసంవిధాన। మమరఁ గూర్తును వీరరాఘవాఖ్యకవిని.

క. పంచాశచ్చాటుకథా। చంచత్కృతులను రచించి సత్కవిపూజా
సంచితకీర్తిని దగు సా। ధ్వంచితుఁడను వీరరాఘవాఖ్యనియోగిన్.

చ. అవునని కావ్యపంక్తి పదియర్థములన్ రచియింపనేర్తు స
త్కవులదయన్ శిరీషకవితామృదుతామహితార్యవైఖరిన్
భువి నటులైన సత్కథల మాటికిఁ గూర్తును బాలబోధకై
తివిరి బహుత్వమందు నలతిత్వము పర్యవసాన మాటచేన్.

కవి తాను జెప్పుకొన్నట్లు స్వసామర్థ్యము నంతను జూపి పదియర్థముల గ్రంథమును రచియింపక మూడర్థములదానినే రచియించినను, ఇట్టి గ్రంథములయందు నిఘంటువులు వెదకి పదములనేర్చి కూర్చినశిల్పప్రౌఢిమయే కాని యర్థచమత్కారము కాని భావగౌరవముకాని రసపుష్టికాని పుట్టదు. యాదవరాఘవపాండవీయములోని కొన్ని పద్యము లిందుక్రిందఁ జూపఁబడుచున్నవి—

శా. వాతెం దెచ్చిన వంశహానియును దుర్వ్యాపారబాధాగతుల్
చేరకా రా విటు సేయుమావిధి యిదే సేవింతు వీక్షింపు మా
త్మాయాసవ్యథఁ బాపు నాహృదయశల్యం బొయ్యనం బాపవే
స్వారాజ్యస్థితి నిల్పఁజే యఁగలధన్యస్వీకృతింబోయెదన్.—ఆ. ౧.

మ. అసురారాతిథవాతిభీతికలకంసారంభతన్ బాలకా
ర్యసుహృద్వృత్తి మెలంగఁ దెల్పఁగను విశ్వామిత్రమౌనీశుమా
నస ముప్పొంగ నభూమురేగ యవనాకందక్రియల్ పెప నా
నిసమాజంబులు నిండ్లలో నిలువఁ బూనెం గామచారోన్నతుల్.—ఆ ౨.

ఉ. కౌతుకమాత్ర నేర్పడఁ దగన్ జనకేశమహాబలాప్తివి
ఖ్యాతచరిత్రు సింహబలుఁ గన్గొని యావిధ మెల్లఁ దెల్పి సం
ప్రీతిగ రాము నీకడకు వేగమె తెత్తునటంచుఁ దత్సమా
హూతి సువర్ణకృద్గోమణిఁ దదుక్తిని గైకొని పోయి యచ్చటన్.—ఆ. ౩.

చ. హరివిభుఁ డంతకీర్తినుతసాంబసమాఖ్యుఁడు వైరికర్ణభే
కరనిజనాముఁ డాబలముఁ గావఁగఁబూని తదగ్రయాయియై
మదమువేగ నచ్చటి కమందధృతిన్ జని యోగలంకలోఁ
జొరఁబడి కాల్బ సైన్యములఁ జూర్ణముచేసెను దాఁ దదన్నతిన్.—ఆ. ౪.

నంజరాజు.

ఈకవి హాలాస్యమాహాత్మ్య మను డెబ్బదిరెండధ్యాయముల వచనకావ్యము రచియించెను. ఈగ్రంథమున నధ్యాయాద్యంతములయందుఁ బద్యములుగలవు. కవి వంశవర్ణనమును బద్యములతోనే చేయఁబడినది. ఈకవి మహిశూరురాజగు దొడ్డమహీపాలునిపౌత్రుఁడు; వీరరాజభూపాలుని పుత్రుఁడు. ఈదొడ్డభూపాలుఁడు ౧౬౫౦ వ సంవత్సర ప్రాంతములయందుండినవాఁడు. కవితానును దనయన్నయు మహీశూరరాజ్య సేనాధిపతులయినట్టు చెప్పుకొనియున్నాఁడు. కవి యన్నయగుదేవభూవిభుఁ డిట్లు వర్ణింపఁబడెను.—

శా. శ్రీశ్రోత్రాణపరాయణుం డగుచు నెంతేవిశ్రుతుం డైనయా
సేనాధీశ్వరదేవభూవిభుఁడు తాశింఖానమాద్యన్మలా

ఖానాద్యద్భుతయాదవనాధిపుల సంగ్రామంబునం గూల్చి ఢి
ల్లీనాథాదుల కెల్ల నచ్చెరువు గొల్పెం ధారుణీమండలిన్.

౧౬౫౯వ సంవత్సరమునందు మైసూరు రాజగు చామరాజును సింహాసనవిహీనుని జేసి చెఱసాలయందుం బెట్టించినవాఁడు దళవాయియైన యీదేవభూవిభుఁడే. కవి ౧౭౩౦వ సంవత్సర ప్రాంతమునయందుండినవాఁడు. ఇతఁడు క్షత్రియవంశజుఁడు; భారద్వాజ గోత్రుఁడు; ఋక్శాఖవాఁడు. ఈహాలాస్యమాహాత్మ్యము దక్షిణమధురాపురీమాహాత్మ్యము దెలిపెడి శైవగ్రంథము. ఇందలికథ స్కాందపురాణమునుండి గైకొనఁబడినది. పదునెనిమిదవ శతాబ్దారంభమున మధురలోను మైసూరులోను దెనుఁగునఁ గొన్ని వచన కావ్యములు చేయఁబడినవి. ఈహాలాస్యమాహాత్మ్యముయొక్క రచన సలక్షణమయి నాతికఠినముగానున్నది. ఆకాలపు వచనరచనయొక్క రీతిని జూపుటకయి హాలాస్య మాహాత్మ్యములో కొన్నిపంక్తుల నిందుఁ బ్రదర్శించుచున్నాను.—

"వ. రూపలావణ్యభాగ్యంబువల్లనో యనువైనగోత్రంబు గలవాఁడనియో విద్యం జూచియో సుందరేశ్వరుం డనబుద్ధిచేతనో లేక భ్రాంతిచేతనో నేనునేను బిడ్డ నిచ్చుట యనుచుం బలికి యాబ్రహ్మచారిం గులగోత్రంబు లడుగ నతండు తనగోత్రంబును సూత్రంబును నక్షత్రంబును నూర్ధ్వపుండ్రంబును గ్రమంబుగా విస్పష్టుండై యెఱింగించుటయు నబ్బాంధవులు కులగోత్రవ్యత్యాసంబులు లేకుండుటకు సంతసించి యూర్ధ్వపుండ్రధారణంబున కొకింతఖేదంబుఁ జెంది యనేకమ్ములగుణమ్ములయం దొకదోషంబు గలిగియుండినంగాని యడంగునని నిశ్చయించినవారై వివాహంబు లొనరింప నవ్విరూపాక్షుండైశ్వర్యయుక్తుం డగుటం జేసి పుత్రిక కధికంబుగా ద్రవ్యం బొసంగ నయ్యుర్వీసురనందనుండు సంతుష్టుండై యాధనం బంతయుం గైకొని పత్నీసమేతంబుగా నెక్కండ్రు బంధువులతోడఁ గూడుకొనియున్న తల్లిదండ్రుల సమీపంబునకుం జనుదేర దేశాంతరంబున కరిగి వివాహంబు చేసికొని భార్యతోడం జనుదెంచిన కుమారుం గాంచి తండ్రియుం దదీయబాంధవులు నత్యంతసంతోషం జెందిరి&c"—

౨౬ అధ్యాయము.

కోటి వెంకనార్యుఁడు.

ఇతఁడు "ఆంధ్రభాషార్ణవము" అను పేరు గల మంచియచ్చ తెలుఁగునిఘంటువును పద్యములుగాఁ జేసెను. దీనితో సమాన మైనయచ్చ తెనుఁగునిఘంటువు మతి

యొకటి లేదు. ఈకవి యీపుస్తకమును శ్రీవిజయరఘునాథునిపుత్రుఁడైనరఘునాథ రాజు ప్రేరణముచేతఁ జేసి యాతని కంకితము చేసెను. ఈరఘునాథరాజు రామనాథ సేతుపతి యనువిజయరఘునాథరాజుకుమారుఁ డని తోఁచుచున్నది. అట్లయిన పక్షమున రఘునాథరాజు ౧౭౩౪వ సంవత్సరము మొదలు ౧౭౪౭వ సంవత్సరమువఱకును రాజ్యము చేసినందునఁ గవియు నాకాలమునం దుండియుండవలెను. కవి గద్యము నందుఁ దనబిరుదావళి నీప్రకారముగా వ్రాసికొనియున్నాఁడు.—

"ఇది శ్రీమత్పరమేశ్వరకరుణాకటాక్షసంప్రాప్త సర్వజ్ఞత్వాది కతిపయగుణ స్వసామ్యతదితరసకలగుణనిరూప మ్యాసేతుహిమాచలఖ్యాత మహోద్దండ కవిబిరుదప్రశస్త సీతారామార్యవర్యతనూజాత శౌర్యధైర్యస్థైర్యాది సకల గుణచిరత్నరత్నాకర కోటిసమాఖ్యవంశసుధాపయోధిరాకాశశాంక ఘంటికా తురంగ నీలాతపత్ర హనుమద్ధ్వజ మకరకేతన దివాదీప నవవిధ భేరికాది నిఖిల బిరుదాంక బృహదంబికాకటాక్షసంజాతసామ్రాజ్యధురంధర విమలయశోబంధుర కర్ణాటపాండ్యచోళమహీపాలాదిసంస్తూయమాన శ్రీరాయరఘునాథమహీనాథసభాంకణ బిరుదాయమానార్యనుతచర్య వెంకనార్యప్రణీతం బైన &c."

కవితాధోరణిని జూపుటకయి సిఘంటువునుండి పద్యముల నుదాహరించుట యుచితము కాదుకావునఁ గృతిపతిని వర్ణించిన పద్యము నొకదాని నిం దుదాహరించుచున్నాను.—

ఉ. శ్రీరఘునాథరాయ నృపశేఖర నీదుకరాసి భీమకా
ళోరగతుల్య మాటను రణోర్విని దుర్మదమత్తచిత్తులౌ
వీరులప్రాణవాయువులఁ బీల్చుట యుక్తమి దెంతవింత య
య్యారె సముద్రమయ్యు నినుమంతయు భంగము గాంచ దెప్పుడున్.

అడిదము సూరకవి.

ఈకవి నియోగిబ్రాహ్మణుఁడు; అడిదము బాలభాస్కరునిపుత్రుఁడు. ఈయడిదము బాలభాస్కరుఁడు శుద్ధాంధ్రరామాయణమును రచించినట్లు కవిజనరంజనములో సూరకవి వేసికొనె.—

"శుద్ధాంధ్రరామాయణ ఘటనకై దక్షధురంధ రాడిదము
బాలభాస్కరతనూభవ"

అను గద్యమువలనను, కవిసంశయవిచ్ఛేదములో బాలభాస్కరుని శుద్ధాంధ్రరామాయణములోని దని యుదాహరించిన

« నిగి మినువైపుల న్వ్రేడల నేటయినీటగువీటికోట »

అను చంపకమాలికాపాదమువలనను దెలియవచ్చుచున్నదిగాని యీశుద్ధాంధ్రరామాయణ మిప్పు డెచ్చటను గానరాదు. ఈసూరకవి తాను జేసినగ్రంథముల నన్నిటిని రామచంద్రపుర రామలింగేశ్వరుని కంకితము చేసెను. ఇతఁడు చేసినగ్రంథములలోకెల్లఁ జంద్రమతీపరిణయ మను నామాంతరము గలకవిజనరంజనము మిక్కిలి మనోహర మైనది. ఇది మూఁడాశ్వాసములు గల చిన్నప్రబంధ మైనను, దీనియందలి గుణసంపదను బట్టి పండితులు దీనిని పిల్ల వసుచరిత్ర మని వాడుచున్నారు. ఇతఁడు చేసిన యితర గ్రంథములు రామలింగేశ్వరశతకము, కవిసంశయవిచ్ఛేదము, ఆంధ్రచంద్రాలోకము, ఆంధ్రనామశేషము, అనునవి. కవిసంశయవిచ్ఛేద మనునది మూఁడాశ్వాసముల చిన్న లక్షణ గ్రంథము. ఆంధ్రనామశేషము పైఁడిపాటి లక్ష్మణకవికృత మైనయాంధ్రనామసంగ్రహములో లేనియచ్చతెలుఁగుపదముల నేర్చి కూర్చినపద్యరూప మగు చిన్న నిఘంటువు. కవి తనగ్రంథముల నన్నిటిని దేవాంకితములు చేయుటచేత వానిఁబట్టి కవికాలమును నిర్ణయించుట శక్యము కాదు. ఇతనిచే రచియింపఁబడినగ్రంథములనుబట్టి కవి గోదావరిమండలములోనివాఁ డయినట్టు కనఁబడుచున్నఁదిగాని యితఁడు విజయనగరసంస్థానములో శ్రీపూసపాటి విజయరామరాజుగారికాలములో నుండినట్టు తద్రచితము లయిన చాటుపద్యములు మొదలయినవానివలనఁ దెలియవచ్చుచున్నది. విజయనగరసంస్థానప్రభువులలో విజయరామరాజు లిద్ద ఱున్నందున నితఁ డేవిజయరామరాజుకాలములో నుండినవాఁడో నిశ్చయింపశక్యము కాకున్నది. పెద్దాపురములో వత్సవాయ తిమ్మజగపతి మహారాజుగారు రాజ్యము చేయుచున్నకాలములో నీకవి తనప్రభువువెంట పెద్దాపురసంస్థానమునకు వచ్చి రాజు లందఱును సభ చేసి కూరుచుండియుండఁగా

ఉ. రాజు కళంకమూర్తి రతిరాజు శరీరవిహీనుఁ డంబికా
రాజు దిగంబరుండు మృగరాజు గుహాంతరసీమవర్తి వి
భ్రాజితపూసపాటివిజయరామనృపాలుఁడె రాజుగాక యీ
రాజులు రాజులే పెనుతరాజులు గాక ధరాతలంబునన్.

అను పద్యమును సభలో నాసీను లయియున్నరాజులవంకఁ జూచుచు లేచి చదివె ననియు, అందుమీఁద నందలి కడపటివాక్యము తమ్ముద్దేశించి పలికినట్లు భావించి రాజు లందఱును కవిని గోపదృష్టితోఁ జూచుచు లేవఁబోఁగా నతఁడు జంకక పద్యార్థమును జెప్పి «యీరాజులనఁగా» పైచరణములయందుఁ జెప్పఁబడినరాజు మొదలయిన

వారని స్పష్టపఱచి రోషముడిపి వారిని శాంతచిత్తులను జేసెననియు, చెప్పుచున్నారు. ఏమైనను లక్ష్మణకవిగారి నాదరించిన యీవత్సవాయ తిమ్మజగపతి మహారాజుగారు ౧౭౫౯ వ సంవత్సరము మొదలుకొని ౧౭౯౭వ సంవత్సరము వఱకును రాజ్యముచేసిరి. ఈయనకాలములోనుండినవారు రెండవవిజయ రామరాజుగారే. ఈయన విజయనగర రాజ్యమునకు వచ్చినదియు తిమ్మజగపతి మహారాజుగారు పెద్దాపురరాజ్యమునకు వచ్చిన సంవత్సరములోనే. ఈవిజయరామరాజుగారు ౧౭౫౯ వ సంవత్సరము మొదలుకొని ౧౭౯౮వ సంవత్సరమువఱకును రాజ్యపాలనముచేసిరి. ఈరాజులిద్దఱును సింహాసన మెక్కినప్పటికి యుక్తవయస్సురాని బాలురు. వీరిలో తిమ్మజగపతి మహారాజులుగా రప్పటి కేడుసంవత్సరముల ప్రాయమువారు; విజయరామరాజుగారు పండ్రెండు సంవత్సరముల ప్రాయమువారు. నిజాము ౧౭౬౦వ సంవత్సరమున రాజమహేంద్రవరము వచ్చినప్పుడు వీరిద్దఱిని గొనిపోయి దర్శనముచేయింపఁగా నతఁడు వీరిద్దఱిని వారివారి సంస్థానములకు రాజులనుగా నంగీకరించెను. మొదటివిజయ రామరాజుగారు బొబ్బిలియుద్ధమున ౧౭౫౭వ సంవత్సరముననే మృతులయినందున, తిమ్మజగపతి మహారాజుగారి కాలములోనుండినయతఁ డతఁడయి యుండఁడు. సింహాసనముకు వచ్చునప్పటికి వీరిద్దఱును బాలురయినందున వీరు తమ యాస్థానకవులతోఁ గలిసి పెద్దాపురమున సమావేశమగుట తరువాత నిరువది సంవత్సరముల కనఁగా ౧౭౭౭వ సంవత్సర ప్రాంతమం దయియుండును. అందుచేత సూరకవి ౧౭౮౦ వ సంవత్సరము వఱకైనను జీవించియుండవచ్చును. ఇతఁడు పెద్దవిజయరామరాజుగారి కాలములోఁగూడ బాల్యావస్థలో నుండియుండును. కవి కాశ్రయుఁడైన విజయరామ రాజుగారినిగూర్చియు వా సంస్థానమును గూర్చియు నిందుఁ గొంత వివరించుట యనుచితము కానేరదు.

ఓరుగంటియం దుండిన కాకతీయరాజులు చెప్పుకొనునట్టుగానే యీపూసపాటి వారును తాము సూర్యవంశజులైన మాధవవర్మ సంతతివార మని చెప్పుకొందురు. కొండపల్లి సర్కారులోని పూసపాడను గ్రామనివాసముచేత వీరికి పూసపాటివారని యింటిపేరు గలిగినది. ఓరుగంటిసంస్థానము ప్రతాపరుద్రునితోఁ నశించినవెనుక వత్సవాయివారు పూసపాటివారు మొదలయినవారు మహమ్మదీయులకు లోఁబడిరి. రఘునాథరాజను మాఱుపేరుగల పూసపాటి తమ్మిరాజుగారు గోలకొండలో సరదారుగానుండి శ్రీకాకుళమునకువచ్చి, శ్రీకాకుళమునకు ఫౌజుదారుగానుండిన షేర్‌మహమ్మదుఖాన్ వలన ౧౬౫౨వ సంవత్సరమున కూలిమి భోగాపురపుతాలూకాలను గుత్తకు పుచ్చుకొని పాలనము చేయ నారంభించెను. ఈయనపుత్రుఁ డయిన

సీతారామచంద్రరాజుగారు మఱికొన్ని తాలూకాలను మాన కవులునకు పుచ్చుకొని, పర్లాకిమిడి సంస్థానాధిపతియైన గజపతిదేవులతో మైత్రిసంపాదించి, ౧౫౦౦ గుఱ్ఱపురౌతులతోను ౪౦౦ కాల్బలముతోను పొట్నూరు జయించి కళింగరాజని పేరువడసి యాయూరు నివాస మేర్పఱచుకొని ప్రబలుఁడయియుండెను. ఈయన యనంతరమున ఆనందరాజుగారు పరిపాలనమునకు వచ్చిరి. ఈయన పుత్రులు విజయరామరాజుగారు బహు ప్రసిద్ధపురుషులు. ఈయన మన్నెదొరలను గెలిచి వారి దేశము నాక్రమించుకొని మన్నెసుల్తానను బిరుదంది, పొట్నూరునుండి తనపేరట విజయనగరమను పేరఁబరఁగిన యూరికి రాజధాని మార్చుకొని, ౧౭౧౨ వ సంవత్సరమునకు సరియైన విజయసంవత్సర విజయదశమి జయవారమునాఁడు కోటకట్టుటకు శంకుస్థాపనము చేసెను. ౧౭౫౩ వ సంవత్సరమున నిజాము కొండపల్లి యేలూరు రాజమహేంద్రవరము శ్రీకాకుళము సర్కారులను ఫ్రెంచివారి కిచ్చెను. అప్పుడు విజయరామరాజుగారు శ్రీకాకుళమునకు నాయిబయిన జాఫరల్లీతోఁ జేరి దేశము ఫ్రెంచివారికి స్వాధీనము కాకుండునట్లు చేయుటకయి ప్రయత్నించెనుగాని, వారు రాజమహేంద్రవరము శ్రీకాకుళము సర్కారుల నక్కువసిస్తునకు కవులున కిచ్చెదమన్నందున జాఫరల్లీని విడిచి ఫ్రెంచివారితోఁ జేరెను. తరువాత సర్కారులలోని రాజులందఱును ఫ్రెంచివారికి లోఁబడక తిరుగఁబడినప్పుడుసహితము ఈయన వారియెడల విశ్వాసముగలవాఁడయియుండి ౧౭౫౬ వ సంవత్సరమున ఫ్రెంచి సేనానాయకుఁడయిన బుస్సీకి కావలసినధనము రహస్యముగాఁ బంపెను. తరువాత బుస్సీ సేనలతో దేశమును స్వాధీనము చేసికొనుటకు కళింగదేశమునకు వచ్చినప్పు డీయన బొబ్బిలివారితోడి తనపూర్వవైరమును సాధించుకొనుటకయి బుస్సీని పురికొల్పి యుద్ధము చేయునట్లుచేసి తానుగూడ సేనలతోఁ బోయి ౧౭౫౭ వ సంవత్సరము జనేవరు నెల ౨౪ వ తేదిని తాండ్ర పాపయ్యచే పొడువఁబడి పరమపదము నొందెను. తరువాత విజయరామరాజుగారి పితృవ్యపుత్రుఁ డయిన యానంద గజపతిరాజుగారు సింహాసనమునకువచ్చి, బుస్సీ విజయరామరాజుగారి యెడలఁ జూపిన యాదరమును తనయెడలఁ జూపకపోవుటచేత మనసులో ద్వేషము పెట్టుకొని బుస్సీ విశాఖపట్టణము మొదలయిన స్థలములన్నిటిని స్వాధీనము చేసికొని పైయధికారులయుత్తరువు ననుసరించి యీదేశమును విడిచి కర్ణాటకమునకు వెడలిపోఁగానే సేనలను గూర్చుకొనిపోయి విశాఖపట్టణమును పట్టుకొని దాని నింగ్లీషువారికి వశపఱచెదనని యుత్తరములువ్రాసి ౧౭౫౮ వ సంవత్సరమున వారితో స్నేహము చేసికొనెను. తరువాత నతఁడు ఫ్రెంచివారి నుత్తరపుసర్కారులనుండి తఱిమివేయు ప్రయత్నములో నింగ్లీషువారితోఁజేరి, దొరకినకొల్లలోఁ దనకు భాగ మిచ్చునట్లును

జయించినదేశములలో నదీ సముద్రతీరపట్టణములును వాని చుట్టుపట్లఁగల దేశమును దక్క మిగిలిన భాగమును దన పాలనములో నుంచునట్లును యుద్ధవ్యయములక్రింద తాను నెల కేఁబదివేలరూపాయలచొప్పున నిచ్చునట్లును ఏర్పఱుచుకొని, కర్నల్ ఫోర్డు గారిచే నడుపఁబడుచుండిన యింగ్లీషుసేనతోఁ దనసేనను జేర్చి దండయాత్ర వెడలెను. ఆవలకే ఫ్రెంచిసేనానాయకుఁడయిన కన్ఫ్లాన్సుగా రానందగజపతిరాజుగారిని శిక్షించుటకయి దండయాత్ర వెడలి యింగ్లీషుసేన యాయనతోఁ జేరినదని విని రాజమహేంద్రవరమున నిలిచిపోయెను. కర్నల్ ఫోర్డుగా రానందరాజుగారు వెంటరాఁగా రాజమహేంద్రవరమునకువచ్చి ఫ్రెంచిసేనాధిపతియైన కన్ఫ్లాన్సుగారి నక్కడనుండి పాఱఁద్రోలి, మచిలీబందరునకుఁబోయి దానిని స్వాధీనపఱుచుకొనెను. దండువెడలి యున్న యింగ్లీషువారిని జయించుటకై నిజాము సలాబత్ జంగు మచిలీబందరునకు ౧౫ మైళ్ళదూరమువఱకునువచ్చి వారిని జయించుట సాధ్యముకాదని తెలిసికొని ౧౭౫౯వ సంవత్సరము మెయినెల ౧౪వ తేదిని సంధిచేసికొని మచిలీబందరు సర్కారును కొండవీడు నైజాముపట్టణము సర్కారులును ఇంగ్లీషువారి కిచ్చివేసి, ఆనందగజపతిరాజుగారు ఫ్రెంచివారి కియ్యఁబడిన దేశమును డి గ్రహించిన సొమ్ము విషయమయి తగవుపెట్టక విడిచిపెట్టి వారితండ్రి తాతలనుండి వా రనుభవించుచుండిన దేశమును వా రనుభవించుట కంగీకరించెను. ఈయొడంబడిక యయినతరువాత స్వదేశమునకు వచ్చుచు త్రోవలో రాజమహేంద్రవరమున నానందగజపతిరాజుగారు స్ఫోటకముచేత కాలధర్మమునొందిరి. అప్పు డాయనభార్య లిద్దఱును సహగమనము చేసిరఁట! తర్వాత బొబ్బిలిలో మృతులయిన విజయరామరాజుగారిభార్య చంద్రయ్యమ్మగారు స్వహిత జ్ఞాతియైన పూసపాటి రామభద్రరాజుగారి ద్వితీయభార్యపుత్రుఁడయిన పండ్రెండు సంవత్సరములప్రాయముగల వేంకటపతిరాజను చిన్నవానిని పెంచుకొని, ఆచిన్నవాని పేరు విజయరామరాజుగా మార్చి యాయనను పట్టాభిషిక్తుని జేసెను. ఈవిజయరామరాజు బాలుఁ డయినందున రాజ్యాధికారమునంతను సవతియన్నగారగు సీతారామరాజుగారు వహించి, తమ్మునకు యుక్తవయస్సు వచ్చినతరువాతసహిత మధికారమునంతను తానే చెల్లించుచువచ్చెను. ఈవిజయరామరాజుగారికాలములోనే మనకవియుండినది. ఆకాలమునందు విజయనగరమువారు నిజామునకు కట్టుపన్ను రెండులక్షల తొంబదివేల యేఁబదితొమ్మిదిరూపాయలు. అయినను దేశ మస్వస్థస్థితిలోనున్నందున నిజాము తనకు రావలసినకప్పమును తిన్నఁగాఁ గైకొనశక్తుఁడుగాక పెక్కేండ్లూరకుండుచువచ్చెను. ఈహేతువుచేతను, సీతారామరాజుగారు బలవంతులయి తమసేనలతో చిల్లరసంస్థానాధిపతుల నదిమి కప్పములు గొనుచుండుటచేతను, విజయనగరరాజ్య మాకాలమున

దించుమించుగా స్వతంత్రరాష్ట్రమువలెనేయుండెను. ఈసీతారామరాజుగారు బొబ్బిలిరాజయిన చిన్నరంగారావుగారిని పట్టుకొని విజయనగరములో చెఱసాలయం దుంచెను; పర్లాకిమిడిరాజగు నారాయణదేవు జగన్నాథయాత్ర పోవుచు సందుచేసికొని యతనిరాజ్యముమీఁద దండెత్తి యాత్రనుండి తిరిగివచ్చినయాతని నరసన్నపేటవద్ద నోడించి యిప్పటి గంజాముమండలములో విశేషభాగమును విజయనగరరాజ్యములోఁ జేర్చెను. తనతమ్ముని వెంటఁగొని దండయాత్ర వెడలి సీతారామరాజుగారు మొగలితుర్రు వఱకును వచ్చి స్థానికపాలకుఁడైన నసబాబు బడ్డీఅబ్బమాఖానును జయించి కొంతకాలము రాజమహేంద్రవరముసర్కారునుసహిత మాక్రమించినట్టు చెప్పుదురు. ఇట్లింకను పెక్కుజయములను బొంది మహోన్నతదశయం దుండిన యీకాలములోనే యింగ్లీషువారు నిజామువలనఁ బొందిన సనదుక్రి కారముగా నుత్తరపుసర్కారులలో దమ యధికారమును జెల్లించుట కారంభించిరి. ఇంగ్లీషుకంపెనీవారితోఁ జేసికొన్న యొడంబడికనుబట్టి సంవత్సరమునకు మూడులక్షలరూపాయలు పేష్కష్ చెల్లించుటకును పర్లాకిమిడి రాజయిన నారాయణదేవువలనఁ గైకొన్న రాజ్యమును విడిచిపెట్టుటకును విజయనగరము వారొప్పుకొనిరి. ఇట్లు కొంతకాలము జరిగి తరువాత విజయనగర సంస్థానమునకు లోఁబడియున్న కొందఱు జమీందారు లందఱును విజయనగరమువారి మీఁద తిరుగఁబడి స్వతంత్రులగుటకుఁ బ్రయత్నించిరి. కాని, సీతారామరాజుగా రన్నిటికిని దగినవాఁ డగుటవలన నింగ్లీషుసేనలను సహాయపడుచుకొని యాకొందఱు సంస్థానాధిపతుల నొక్కొక్కరినే జయించి కొందఱిదేశములను తమరాజ్యములోఁ గలుపుకొనియు కొందఱిని విజయనగరమునఁ జెఱసాలలోఁ బెట్టియు నందఱిని సాధించెను. ఈకలహములో ఆంధ్రపాలకొండ జమీందారులుమాత్రము చేరలేదు. సీతారామరాజుగారిట్లు పరరాజులను జయించుటయేకాక తురకదొరలు మసీదుల కిచ్చిన భూములను పూర్వరాజులు బ్రాహ్మణుల కిచ్చిన మాన్యములనుగూడ లాగుకొని ప్రజలను సహితముక్షోభపెట్ట నారంభించెను. ఈయనపెట్టుబాధలే సూరకవిని రామలింగేశ శతకము చెప్పునట్లు చేసినవి. ఆకాలపు ప్రభువులయందు కవి కెట్టియభిప్రాయముండినదో కొంతవఱకీక్రిందిరీతిపద్యములు వెల్లడిచేయవచ్చును—

సీ. పదుగురు కోఁతివెంబడి సంచరింపరే నాహుతుల్ లేరె శవంబులకును
గంగిరెద్దుకు లేవె ఘనతూర్యరావముల్ కల్మి గల్గదె వారకామినులకుఁ
బులి గోవుఁ జంపి నక్కలనుబోషింపదే స్థూలకాయము లేదె దున్నలకును
బుప్పిపంటికి లేదె పుట్టంబుఁ జుట్టుట వేణుధరుం డెద్దువెంట రాఁడె
న్యాయపద్ధతినడువనియవనిపతికి। నెన్నిచిన్నెలు గలిగిన నెందుకొఱకు
నంత్యమునఁ జూడవలయు నాయయ్యసుఖము। రామలింగేశ రామచంద్రపురవాస.

సీ. కడువింత యగుస్థూలకాయంబు గల్గుట చిత్రభూషాంబరస్థితిని గనుట
తూర్యరావంబులతోఁ గదలుచుట వాలవీజనసమావాప్తి గనుట
శృంగవేత్రోద్ధతిఁ జేగరాకుంచుట చూపఱు పదుగురు చుట్టుకొనుట
స్వామియంతవాక్యంబు విని తలయూఁచుట మానముద్ర వహించి మతము గనుట
గంగిరెద్దుకు మూర్ఖభూకాంతునకును। భేద మించుకయును గనిపించ దట్టి
ప్రభువు వేఁడిన సత్కవిపటిమ చెడదె। రామలింగేశ రామచంద్రపురవాస.

సీ. మాన్యంబు లియ్య సమర్థుఁ డొక్కఁడు లేఁడు మాన్యము ల్చెలుప సామంతులంద
ఱుండినయూళ్ళగో డెత్తఁగింపఁ డెవ్వఁడుఁ బండినయూళ్ళన్నఁ బ్రభువులంద
ఱితఁడు పేద యటంచు నెత్తఁగింపఁ డెవ్వఁడుఁ గలవారిసిరియెన్నఁ గలరుదొరలు
తనయాలిచీఁకటితప్పెన్నఁ డెవ్వఁడు పరకాంతలంకెన్నఁ బెద్దలంద
ఱిట్టిదుష్టుల కధికార మిచ్చినట్టి। రాజు ననవలెఁ గాక దుర్జయుల ననఁగ
నేమిపనియున్న దిఁక సత్కవీంద్రులకును। రామలింగేశ రామచంద్రపురవాస.

ఇట్లుండఁగా సంస్థానమునం దుండినరాచవారందఱు నొక్కటిగాఁ జేరి ౧౭౭౪ వ సంవత్సరమునందు మంత్రిత్వమును మాని రాజకార్యసంబంధము వదలుకొనునట్లు సీతారామరాజుగారి నిర్బంధపఱచిరి. తనపుత్రుఁ డయిన నరసింహగజపతిరాజును స్వీకారము చేసికొని విజయరామరాజుగారి మరణానంతరమున సింహాసన మాతని కిచ్చునట్లు తమ్ముని నొడఁబఱచి యాతఁడు తాను మంత్రిత్వమును విడుచుట కంగీకరించెను.

విజయనగరమువారు చెల్లింపవలసిన కప్పముయొక్క మొత్తమును నిర్ణయించుటకయి కంపెనీవారి చెన్నపురిపరిపాలకుఁడు విజయరామరాజుగారిని చెన్నపురి రమ్మని కోరెను. కోరినప్రకారముగా విజయరామరాజుగారు చెన్నపురికిఁబోక ప్రయాణవ్యయములకు తనచేతి సొమ్ములేదనియు, తన యన్నయైన సీతారామరాజుగారు తన్ను నాశనము చేయుటకయి తంత్రములు పన్నుచుండిన యాకాలములోఁ దాను రాజధానివిడిచి దూరముగాఁబోవుట యుచితము కాదనియు, విశాఖపట్టణములోని యధికారులసమక్షమునఁ దాను వారు విధించెడు న్యాయమైనకప్పమున కంగీకరించెదననియు, చెప్పి తప్పించుకొనెను. అంతట చెన్నపురిపరిపాలకుఁడు సీతారామరాజుగారిని చెన్నపురికి రమ్మని కోరఁగానే యతఁడు తత్క్షణమే పోయి యక్కడివారిని వశపఱుచుకొని రాజకార్యములు చక్కఁబఱుచుకొని, విజయనగరసంస్థానమునకు తన్ను దివానుగా నేర్పాటు చేయించుకొని తనపుత్త్రుని స్వీకారమును స్థిరపఱిపించుకొని, మరల వచ్చెను. ఈయేర్పాటులవలన విజయరామరాజుగారు పేరునకు రాజుగా నుండినను నిజమయిన యధికారమంతయు సీతారామరాజుగారి చేతిలోనే చిక్కెను. ఈ

విషయములు విజయరామరాజుగారు కంపెనీవారికి మొఱపెట్టుకొనఁగా పెట్టుకొనఁగా తుదకు వారాయనను దివానుపనినుండి తొలఁగించి విజయనగరము విడుచునట్లుత్తరువు చేసిరి. అందుపైని సీతారామరాజుగారు విజయనగరమువిడిచి సింహాచలము నివాసముగా చేసికొని యక్కడ కొంతకాలముండి, తరువాత మరల తమ్మునిమంచిమాటలాడి ౧౭౯౦వ సంవత్సరమునందొకసారియు ౧౭౯౨వ సంవత్సరమందొకసారియు మరల స్వస్థానములో దివానుగాఁ బ్రవేశించి, కడపటిసారి కంపెనీవారిచే చెన్నపురికిఁ బోవునట్లుత్తరువుచేయఁబడి నెలకయిదువేలరూపాయల యుపకారవేతనముమీఁద ౧౭౯౩వ సంవత్సరమునందక్కడకుపోయి చేరెను. సీతారామరాజుగారి దుష్పరిపాలనము మొదలైన కారణములచేత విజయరామరాజుగారు ఋణములపాలగుటయేకాక కంపెనీవారికి కట్టవలసినకప్పము సరిగా కట్టలేక యాఱులక్షల యిరువదియైదు వేలరూపాయలవఱకును బాకిపడిరి. అందుచేత కంపెనీవారు సంస్థానమును తమపాలనమునకుఁ దీసికొని, విజయరామరాజుగారిని స్వరాజ్యమునువిడిచిమచిలీబందరులో వాసము చేయునట్లుత్తరువుచేసి, ఆయనకు ముప్పదివేలరూపాయలొక్కసారిగా రొక్కమిచ్చెదమనియు నెలకు రు ౧౨౦౦ లు వ్యయముల కిచ్చెదమనియుఁ జెప్పిరి. ఆయన స్వదేశమును విడుచుటకిష్టము లేనివారయి బందరుపురమునకుఁ బోవుమార్గమున బైలుదేఱియయిదాఱు క్రోసులుదూరముపోయి యక్కడనుండి పరివారముతో వెనుకఁదిరిగి పద్మనాభమునకుఁ బోయి యక్కడనుండి తాను ప్రయాణము చేయలేకపోవుటకు సాకులు వ్రాయ నారంభించెను. విజయరామరాజుగారక్కడనున్నకాలములో రాచవారును నాలుగు వేల సైనికులును బోయి యాయనను జేరిరి. కంపెనీవారి కీసంగతి తెలియఁగానే యిరువదినాలుగుగంటలకాలము గడువిచ్చి యాలోపల నతఁడు బందరుమార్గమున బైలుదేఱని పక్షమున, బలాత్కారముగాఁ బంపవలసినదని విశాఖపట్టణములోనున్న సేనానాయకునకుత్తరువుచేసిరి. పయివారి యుత్తరువును దెలియఁబఱచి యింగ్లీషు సేనాధిపతియైన ప్రెండర్గాస్టుగారు కొంతసేన (౪౫౦భటుల)తో పద్మనాభమునకుఁ బోయిరి. ౧౭౯౪వ సంవత్సరము జూలయినెల ౧౦వ తేది యుదయమున నింగ్లీషుసేనాధిపతి పద్మనాభపుకొండను జేరునప్పటికి, విజయరామరాజుగారును బంధువు లయినరాచవారును ఖడ్గపాణులయి లోఁబడక యుద్ధముచేసి వీరమరణము నొందుటకు నిశ్చయించుకొని యందఱును పద్మనాభస్వామిప్రసాదమును స్వీకరించి యుద్ధోన్ముఖులయి నిలిచి యుండిరి. నాఁడు సూర్యోదయకాలమున నింగ్లీషుసేనలకును రాజుగారి సేనలకును ముప్పావుగంటసేపు ఘోరయుద్ధము జరిగినది. అంతట రాజుగారి సేనలన్నియు చెల్లాచెదరయి పాఱిపోయినవి. రణరంగమునకుఁ బోయి చూడఁగా రణనిహతులయివీర

శయనము నొందినవారిశరీరము లక్కడ మున్నూటతొమ్మిది కనఁబడినవి. రణభూమి నలంకరించిన మున్నూటతొమ్మిదింటిలో నిన్నూటయేనుబది రాచవారిదేహములు. రణరంగమధ్యమునఁ బడియుండిన విజయరామరాజుగారి శవముచుట్టును కోటకట్టినట్లుగా సంస్థానములో నున్నతస్థితిలో నుండిన యుత్తమక్షత్రియుల శవములు నలుబది గుండు దెబ్బలతోఁ బడియుండెను. ఇట్లు మరణము నొందినవారుగాక పారిపోయినవారిలో నెందఱికి గాయములు తగిలినవో తెలియలేదు ఇంగ్లీషు సైనికులలో మృతులయినవారు పదుముగ్గురు; గాయపడినవా రఱువది యొక్కరు. ముప్పదియేండ్లక్రిందట బొబ్బిలి కోటముందు పెద్దవిజయరామరాజుగారు హతులయినట్లే మనకవీంద్రునికాలములో నుండిన యీచిన్నవిజయరామరాజుగారు పద్మనాభపుకొండముందు నిహతు లయిరి. మనకవికాలముతో సంబంధించినచరిత్ర మింతే. తండ్రిమరణమును విని యప్పటి కని మిదిసంవత్సరములప్రాయమువాఁడయిన నారాయణబాబుగారు తల్లితోఁగూడ కొండదేశమునకు పాఱిపోయిరి కాని, కంపెనీవా రాయనను పిలిపించి దొరతన మిచ్చిరి. ఆయ పండ్రెండులక్షలవఱకును ఋణములు చేసి ౧౮౦౨వ సంవత్సరమునందు తనకు సంవత్సరమున కెనుబదివేలరూపాయలిచ్చుపద్ధతిమీఁద రాజ్యపాలనము నింగ్లీషువారి కప్పగింపఁగా వారు ౧౮౨౨వ సంవత్సరమునాఁటి కప్పులన్నియుఁ దీర్చి రాజ్యము నాయనకు మరల నిచ్చిరి. నారాయణబాబుగారు మరల నేడులక్షలరూపాయలప్పుచేసి తనకు సంవత్సరమునకు లక్షరూపాయలిచ్చు పద్ధతిమీఁద ౧౮౨౭ వ సంవత్సరములో రాజ్యము మరల నింగ్లీషువారి యధీనముచేసి కాశీయాత్రపోయి యక్కడనే వాసముచేసి ౧౮౪౫ వ సంవత్సరమున దేహము చాలించిరి. మరణకాలమున కాయన యప్పు ౧౧ లక్షలకుఁ బెరిగినది. పండ్రెండుసంవత్సరములప్రాయము గల నారాయణబాబుగారి కుమారుఁ డగు విజయరామ గజపతిరాజుగారికి రాజ్యమిచ్చి, ఆయన కాశీనగరమును విడిచివచ్చుట కిష్టము లేనివారుగా నుండినను ౧౮౪౮వ సంవత్సరమునం దాయనను విజయనగరమునకు రప్పించిరి. ఋణముల నన్నిటిని దీర్చి ౧౮౫౨వ సంవత్సరములో ౨౧౨౭౦ల రొక్కముతో నింగ్లీషువా రాయనకు రాజ్యమొప్పగించిరి. ఈవిజయరామగజపతిరాజుగా రాంగ్లేయోపాధ్యాయుల శిక్షచేఁ బ్రవీణు లయి సత్ప్రజాపాలనము చేయుచు బాలికాపాఠశాలలు మొదలయిన జనోపయుక్తములగు ధర్మకార్యములకొఱకు ధనమును సద్వినియోగపఱుచుచు వచ్చిరి. విశాఖపట్టణములోని వైద్యశాలకు ముప్పది వేలరూపాయల నిచ్చినందున, దొరతనమువా రాయనకు ౧౮౬౪వ సంవత్సరములో "మహారాజా" యన్న బిరుదిచ్చిరి. ఈయన ౧౮౭౯ వ సంవత్సరమున స్వర్గస్థులుకాఁగా ౧౮౫౦వ సంవత్సరమునందు జనించిన యీయనపుత్రు లానంద

గజపతిరాజుగారప్పటినుండి విజయనగరపరిపాలకులుగానున్నారు. దొరతనమువారా రీతులకు ౧౮౭౭ వ సంవత్సరమున "మహారాజా" యను బిరుదము నిచ్చిరి.

పూర్వకవికి రేవళ్ళు గ్రామమున చెఱువుగట్టుక్రింద నొకమాన్యముండెననియు, ఆగ్రామమును గుత్తచేసిన దంతులూరి యన్నమరాజు కవిమాన్యమునకు చెఱువునీరు పెట్టుకొనీకపోఁగా, అతఁడు ప్రభువునకు మొఱపెట్టుకొనియు కార్యముగాక తుదకు చెఱువుపొంత నిలుచుండి యీక్రింది నాలుగుసీసపద్యములను జెప్పఁగానే చెఱువు నాలుగువైపుల గండిపడి నీరంతయు పొలములమీఁద పాఱెననియుఁ జెప్పెదరు—

సీ. బ్రహ్మాండభాండసంపత్తి కుక్షిని గల్గుపద్మనాభునిపదాబ్జమునఁ బుట్టి
సకలరత్నాకరస్థానమై యుప్పొంగునంబుధీశుని చరణంబు ద్రొక్కి
పరమతత్త్వజ్ఞుఁడై పరఁగుశంతనుమహీరమణు వామాంకభాగమునఁ జేరి
యఖిలలోకాధ్యక్షుఁడై మించివిహరించుశివుజటాగ్రసీమ నిలిచి
తనరు నీవ టిధన్య కుత్తమము గాదు। ఘనసపాటిమహాస్థానభూమియందుఁ
గాలుద్రొక్కంగ నోడుఁ జండాలుఁడై। గదలు మిటమారి దివిజగంగాభవాని.

సీ. ఆదిభిక్షుం డితఁడని రోసి వడిఁదూకి కాశివచ్చి యిటఁ గల్పఁగోరి తొల్లి
జగదాలచీఁకవై సవతితోఁ బోరాడి వీఁగివచ్చి యిచట డాఁగి తొల్లి
నిర్జరాంగన లెల్ల నీయందు వెలిపుచ్చ మాయమై యిచ్చోట దూఱి తొల్లి
బీదబాపలఁ గష్టపెట్టుటకై మిన్ను దాఁటి యిచ్చోటను నిలిచి తొల్లి
వలను ద్వీపభూమిఁ గాల్నిల్ప వసగాదు। గవ్వ నీకేల తగ దుబురాశికరుకు
నాతి యనఁడె కాఁప కొపిన్న నాఁటిమగఁడు। కదలుమిటమారి దివిజగంగాభవాని

సీ. భాగ్యప్రదంబు వెల్ల భంగంబులేకాని భంగము లెవ్వఁడు చెప్పటికి లేదు
తిరుచూపు వంకర తిరుగు డింతియుకాని తిన్నఁగాఁదిరుగుట యెన్న డేనిఁ
మొనసిరేఁ ఖుఁపగిల్లు మొరయు చుండుటెకాని మొగ్గయకూరక యుండుటెపుడుఁగ మెపుడు
పాలిక త్రిపరోసి పల్ల నగుటెకాని పలుచని గతి మాని మెలఁగు టెపుడుఁగ
మనుచు నీలోన నీవైనయవగుణంబు। లరసి లజ్జించి దివి నంద కరుగుదాచి
నిలువు నీరైన నీవందు నిలిచితొల్లి। కదలు మిటమారి దివిజగంగాభవాని.

సీ. కృత్తికాద్రులు లాయెనా కీలాగ్రఫణిఫణానేకపూర్వాగ్రరవలీకయుయును
కిరిదోఁట లాయెనా కటుకకంటకకంటకాంకురవిస్ఫురితాగచయము
పుప్పొడిబొప్పు లాయెనా నవమంజులశ్వేతలవణాలవాలమా నవుటినేల
బొమ్మరిండ్లాయెనా భూరిభేకాండజాధారమై తరుకేదారచయము

నీకు విహరింప నసమర్థులై నివ్వటిల్లెను। చిన్నపాలములుం బ్రాహ్మణక్షత్రియులవలె
ఘాతుకత్వంబు చేయుమన్నారులు గలరె। కదలుమిటమాని దివిజగంగాభవాని.

ఈసూరకవి విషయమున నింకం దెలిసినసంగతు లంతగను సమకాలికులగు కవులతోం బెట్టుకొన్న వివాదములును, కవులాంజోరులను దిట్టుకొన్న పద్యములును దక్క వేఱే యేమియుం గానరావు. కాంబట్టి యా కథలనువిడిచి కవికృతగ్రంథములనుండి కొన్ని పద్యములనుమాత్ర మిం దుదాహరించుచున్నాను.—

కవిజనరంజనము.

మ. అమరద్వీపవతీపయోవిహరణప్రాంచత్సురస్త్రీల వ
జ్రమయూర్ధ్వాంకపమంటపాగ్రముల నిచ్చల్ క్రీడఁగావించుత
త్క్రమశీవారము వేళ నేర్పుపఱుపన్ రా దంచుఁగా దివ్యరా
జముఖీపాళికిఁ దమ్మిచూలి యనిమేషత్వంబు గావించుటల్ —ఆ. ౧.

శా. శయ్యాదంభమున స్మరాంతకుఁడు భూషాకైతవవ్యాప్తిచే
నయ్యార్యారమణుండు దాల్చి భుజంగాధీశులన్ నీయసా
హాయ్యప్రస్ఫుటఖ్యాతి కోర్వ కనుచో నజ్ఞాస్యలా యొప్పు వా
రయ్యా గంధసమీరప్రోవఁగదవయ్యా యాతురంగేక్షణన్.—ఆ. ౨.

మ. అలమన్ మైఁ బులకాంకురాళి దరహాసాంకూరము ల్కన్గవం
దొలఁకన్ ముత్యపుటొంట్లు గండయుగళిన్ దూఁగన్ గనత్కంకణం
బులు మ్రోయన్ భుజమధ్యసీమ రతికంఠుండాళి తాల్మాయుగాఁ
దలఁప్రా లొప్పెను లతాంగియాదలపయిన్ ధాత్రీశుఁ దత్యాదృతిన్,—ఆ. ౩.

ఆంధ్రచంద్రాలోకము.

గీ. అక్రమాతిశయోక్తి ప్రఖ్యాతికెక్కు। హేతుకార్యంబులకు సహవృత్తి గలుగ—
జ్యాపరీరంభనైకదక్షత వహించె। నీశరంబులు నీశత్రునృపులతోడ.

క. ఏపారుఁ గృతులఁ బ్రతివ। స్తూపమ వాక్యములు రెంటి కొగి సమత దగన్—
తాపమున నలరు నరుఁడు। చాపంబున శూరుఁ డొసరు జగతిననుక్రియన్.

రామలింగేశశతకమునందలి పద్యము లివటికే కొన్ని యుదాహరింపఁబడినవి. లక్షణగ్రంథము లగుటచే నాంధ్రనామశేష కవిసంశయవిచ్ఛేదములనుండి కవితాధోరణిని జూపుటకుఁ బద్యముల నదాహరించుట యుచితము కాకపోయినను, అందుండియు నొక్కొక్క చిన్నపద్యమును గైకొనుచున్నాను.—

క. వెన్నవఁగ బీఁకమంజకి । వెన్నఁడఁ జరవూంగము కు వెలయుదు వేఱై
కన్ను లవం బగ్యంబులు । కన్నులనఁ లోచనములు కంఠేకాలా. — ఆంధ్రశేష.

గీ. ఎఱుకగలవార లెచ్చోట నెఱుకగలరొ । యిట్టివారలు నెడిచోట నిట్టిరాయఁగఁ
జేయఁగలవారలును చోటఁజేయఁగలరొ । యనుచు శ్లోకప్రసిద్ధోక్తి యగునుశర్వ
కవిసంశయవిచ్ఛేదము.

మంగళగిరి - ఆనందకవి.

ఈకవి వేదాంతరసాయన మనెడు నాలుగాశ్వాసముల పద్యకావ్యమును రచియించి దానిని నిడిమామిళ్ళ దాసయామాత్యుని కంకితము చేసెను. కవి క్రైస్తవమత మవలంబించిన నియోగిబ్రాహ్మణుఁడు. ఈతఁడు తిమ్మయామాత్యుని పుత్రుఁడు; ఆత్రేయ గోత్రుఁడు; కవి కృతిపతి తన్నుఁగూర్చి పలికినవిధము నిట్లు చెప్పుకొన్నాఁడు—

సీ. ఒకవంక నిగమాగమోజ్జ్వలాతిశయార్థవిధివాదకౌశలప్రజనికాయ
మొకచాయ న్యాయశాస్త్రోదాత్తవాక్యప్రసంగకృద్విద్వత్ప్రజావితాన
మొకక్రేవ సంస్కృతప్రకటాంధ్రభాషాకవిత్వప్రవీణకవిప్రకాండ
మొకచెంత సప్తస్వరోద్గీతగీతికావైచిత్రిపటుస్ఫురద్వైణికౌఘ
ముల్లసిల వజ్రకాక్షేయకోపమాన । వైభవస్ఫూర్తి నొకశుభవాసరమున
మహితగుణశాలి దాసయామాత్యమౌళి । ప్రమద ముప్పొంగఁ బేరోలగమున నుండి.

మ. నను సర్వేశపదాంబుజద్వయనితాంతధ్యానపారీణు భూ
రినయోపేతచరిత్రు మంగళగిరి శ్రీవంశవారాశిపూ
ర్ణనిశానాథు సుధీజనాభిహితు నానందాఖ్యు సద్గ్రంథక
ల్పను సాహిత్యకళావిశారదుని బిల్వం బంచి పల్కెం గృపన్.

చ. తిరుముఖసప్తసంతతు లుదారత నెచ్చట నిల్ప నచ్చటన్
బరఁగు సమస్తదిక్కులకుఁ బ్రాకగుభావరసానుకూలవా
గ్గరిమఁ దనర్చు సత్కృతిముఖంబున దానికిఁ దారకేందు
భాస్కరులు గలంతకాల మనిశంబుఁ గరంబుఁ బ్రసిద్ధి చెల్వగున్.

ఇతఁడు లాక్షణికాగ్రగణ్యుఁ డయిన ప్రబంధకవి పేరునుబట్టి తోఁచు నట్లిది వేదాంత గ్రంథముగాక మతస్థాపకుఁ డయినయేసుక్రీస్తుయొక్క చరిత్రముగా నున్నది. ఈపుస్తకము నిర్దుష్టమయి మృదుమధురమైన ప్రబంధపాకమునఁ జేయఁబడియున్నది. ఇందలి

వర్ణన లేశమునైనను బూర్వప్రబంధములలోని వర్ణనలకుఁ దీసిపోవు. బ్రౌన్ దొరగారీకావ్యము ౧౭౦౦ వ సంవత్సరప్రాంతమున రచియింపఁబడినట్టు చెప్పిరికాని, కవి కృతిపతి యయినదాసామాత్యునిసోదరుఁ డగు రాజప్పను వర్ణించుచో

మ. మనిరాశీమదముండు రాజపమహామంత్రీంద్రుఁ డుద్యన్మహా
మ్మదలీఖాను కృపానులబ్ధమదవన్మాతంగమాణిక్యహా
రదుకూలానికసత్కృతిం ద్రిదశవర్యస్ఫారసామ్రాజ్యల
క్ష్మిఁ దనర్చు నృపకోటి పేర్కొనఁగఁ బుల్చేర్పట్టణాధ్యాసియై.

అను పద్యములో నతఁడు కర్ణాటకపు నవాబగు మహమ్మదల్లీ చేత సత్కారమును బొందినట్లు చెప్పియుండుటచేతను, ఈమహమ్మదల్లీ ౧౭౪౯ వ సంవత్సరమునఁగాని సింహాసనమునకు వచ్చి యుండకపోవుటచేతను, వేదాంతరసాయనము ౧౭౫౦ వ సంవత్సరమునకు తరువాతనే రచియింపఁబడినదని నిశ్చయింపవలయును. ఈకవి కూచిమంచి తిమ్మకవి మొదలయినవారికాలములోనే కృష్ణామండలమున నుండినవాఁడు కృతినాయకుఁడు బందరుపురములో నధికారము చేసినట్లీ క్రిందిపద్యమువలనఁ దెలియవచ్చుచున్నది.

మ. ప్రకటారాతిచమూభయానకఘనప్రాకారఖేయంబులన్
సుకరశ్రీఁ దగుబందరాఖ్యనగరిన్ సొంపొందుదీనార్థిక
ల్పకభూజం బన దాసమంత్రి శుచికుంభద్రత్నజాంబూనదా
దికవస్తుప్రకరాన్వితాయతనుఁడై ధీరుల్ ప్రశంసింపఁగన్.

వేదాంతరసాయనకృతికర్తయు కృతిభర్తయు నిరువురును శైవమతప్రవిష్టులైన నియోగి బ్రాహ్మణులు. వేదాంతరసాయనముయొక్క యొక్కొక్కయాశ్వాసమునుండి యొక్కొక్కపద్యము నిందుదాహరించుచున్నాను—

చ. జగదుపకారకారకవిశాలసమస్తపదార్థకల్పకుం
డగునతనిం బరాత్పరు మహామహు సర్వశుభస్వభావు బ్రో
క్కఁగఁ దగుఁగాక యాతఁడిలఁ గల్గఁగఁ జేసినవానిపూజ స
ల్పఁగ దురితంబు లంటు నని పల్కుట యొప్ప నసంశయంబుగన్.—ఆ. ౧.

చ. ఘనతరపాపపుణ్యముఖకార్యసమాచరణస్వతంత్రతన్
గొనినమనంబు మానవునకుం బొసఁగం దగు లేనిచో జగం
బున సుకృతాఘము ల్నరక మోక్షపదంబులు గల్గవం చనం
జను నుచితజ్ఞ సంతతి ననశ్వరవాక్యవిజృంభణంబునన్—ఆ. ౨.

చ. చని పెలయేటి మొత్తములఁ జందనశైలమరుద్విలోల కాం
చనకురువిందచందనరసాలముఖద్రుసమీపగోస్తనీ

ఘనతరకాయమానములఁ గ్రమ్ముచు నిన్నియులన్ లతాసికే
తనముల సంచరింపుచు నతండు పరాత్పరచింతనంబునన్.— ఆ. ౩.

ఉ. వారక యార్యకాంతుకనివాసమనోంబుజాలై జగజ్జనా
ధారు నమృప్రచారు సముదారుని నమ్మెరియాదుమారునిన్
భారపుస్త్రీవ్రమాదున విపద్దశలం బొరయించినట్టి సం
సారరణైరులన్ సరకుగాఁ గొన కించుక యెల్లెడల్కులన్.— ఆ. ౪.

కనుపర్తి అబ్బయామాత్యుఁడు.

ఈకవి యారువేలనియోగిబ్రాహ్మణుఁడు; రాయన మంత్రిపుత్రుఁడు; కౌండిన్య గోత్రుఁడు. ఈతనితల్లి నరసమాంబ; అన్నయోగానందుడు. ఈకవి యనిరుద్ధచరిత్రము, కవిరాజమనోరంజనము, అను రెండుప్రబంధములను రచియించెను. ఇందు మొదట రచియింపఁబడిన యనిరుద్ధచరిత్రములో

ఉ. నిండుమనంబు సత్యమును నీతియు శాంతియుఁ గల్గి కీర్తిమం
తుం డయి భోగభాగ్యములతోఁ జెలువొందుచుఁ గొండవీటిభూ
మండలనాయకుల్ మిగుల మన్ననచేయఁగఁ బెంపుమీఱె స
త్పండితుఁ డబ్బమంత్రి కనుపర్తి పురాన్వయవార్ధిపూర్ణచం
ద్రుం డని లోకు లందఱు నెఱుంగుటకు న్నుతిచేయ నేటికిన్.

అని కవి తనతాతయైన యబ్బన్న కొండవీటిరాజుల మన్ననఁబొందినట్లు వ్రాసికొనెను గాని యాతనికాలమునాటికిఁ గొండవీటిరాజ్యము తురుష్కులయధీన మయినది. ఈహేతువుచేతఁ గాఁబోలును కవి తాను తరువాత రచియించిన కవిరాజమనోరంజనములో

చ. సుగుణకదంబ మెల్ల నొకచోట నె కాపుర మున్నయట్లుగా
నగునని వేయినోళ్ళఁ గొనియాడుచు భూజను లెంచ ధన్యుఁడై
తగు కనుపర్తియబ్బనకుఁ దత్ప్రియసాధ్వికి లచ్చమాంబకున్
బొగడిక కెక్కి రిద్దఱుసుపుత్రులు రాయన నమ్మనాహ్వయుల్.

ఉ. వేయనవచ్చుఁ గాక సుతువే యనపాయవదాన్యుఁడై భవం
బాయనవద్యబుద్ధి తగు నాయనకే యనఁ గీర్తిచంద్రికల్
గాయ నయుస్వగీతికలు గాయకశీలురుపాడ నొప్పు మా
రాయనమంత్రి మేలు బళిరాయన నూరిజనాభినంద్యుఁడై.

అను పద్యములయందుఁ దనతండ్రి తాతలు కొండవీటిరాజులయొద్దనున్నట్లు చెప్పక తనతాతకు ముత్తాతయైన బసవామాత్యుఁడుమాత్రమే కొండవీటిరాజులమంత్రియైనట్లీక్రిందిపద్యమునఁ జెప్పెను—

శా. శ్రీపేర్మిన్ శశిపోలె బ్రహ్మకులవార్ధిం బుట్టి కౌండిన్యగో
త్రాపస్తంబపవిత్రసూత్రకలితుండై రామసింహాసనా
ఖ్యోపేతస్ఫుట కొండవీటిపురరాజ్యోర్వీశ్వరు ల్మంత్రిగాఁ
జేపట్టన్ బసవప్రధానుఁ డిల మించెన్ భాగ్యసంపన్నుఁడై.

కవియొక్క తండ్రితాతలు కొండవీటిసీమలోని కనుపర్తిగ్రామమునకు కరణములని తోఁచుచున్నది. కవికి మంగళగిరిలోనున్న పానకాలరాయఁ డిష్టదైవతము. మంగళగిరి కృష్ణామండలములో గుంటూరునకు సమీపమున నున్నది. అబ్బయామాత్యుఁడు పదునెనిమిదవ శతాబ్దమధ్యమున నుండినవాఁడు. ఇతఁడు ౧౭౭౦ వ సంవత్సర ప్రాంతము వఱకును జీవించియుండవచ్చును. ఇతఁ డాశతాబ్దమునం దుండిన ప్రబంధకవీశ్వరు లందఱిలోను మిక్కిలి ప్రౌఢుఁడు. వసుచరిత్రమునకుఁ దరువాత నీతనికవిరాజమనోరంజనముతో సతూఁగఁదగిన ప్రబంధము లొకటి రెంటికంటె నెక్కువగాలేవు. కవిరాజమనోరంజనములోని యీక్రిందిపద్యమువలనఁ గవి సాహిత్యమునందుమాత్రమే కాక సంగీతమునందును బ్రవీణుఁ డయినట్లు కనఁబడుచున్నాఁడు—

క. శ్రీమంగళగిరినరసిం। హామేయకృపావిజృంభితాద్భుతకవితా
శ్రీమంతుఁడఁ గానకళా। ధీమంతుఁడ దేవతాస్తుతివ్రతపరుఁడన్.

కవిరాజమనోరంజనమునకుఁ బురూరవశ్చరిత్రమని నామాంతరముగలదు. బాల్యమునందు రచింపఁబడినదగుటచే ననిరుద్ధచరిత్రము పురూరవశ్చరిత్ర మంత ప్రౌఢముగా లేదు. ఈరెండు పుస్తకములనుండియుఁ గొన్నిపద్యముల నుదాహరించుటకన్నఁ గవి విషయమున వ్రాయఁదగిన విశేషాంశము లేవియుఁ గానఁబడవు.

అనిరుద్ధచరిత్రము.

చ. విచికిలగంధియున్ విభుఁడు వేడుకతోఁ దెర రెండువైపులన్
రుచిరకటాక్షపంక్తులమెఱుంగులు నిండఁగ నిల్పి రయ్యెడన్
భ్రమరతరానురాగరసబంధురతం దెరచీర దూరి పా
ఱుచు హృదయాబ్జముల్ మొగ మెఱుంగనిచుట్టఱికంబు సేయఁగన్. — ఆ.౧

ఉ. కన్నుల కొప్పు లాఁగనివికాసపుఁజూపును మానముద్రతో
నున్నమొగంబు నిశ్చలత నొప్పుశరీరముఁ గాఁ బటంబుపై

మున్నతలీల వ్రాసినప్రియుం గని సొక్కినఁ దాను నట్లయై
చిన్నెలు దక్కియుండె సఖి చేసినజంత్రపుబొమ్మకై వడిన్.—ఆ. ౨.

ఉ. మీసముతీరుఁజూచి జిగిమేనిపటుత్వముఁజూచి మోములో
హాసముఁజూచి చేతులయొయారముఁజూచి మనోజ్ఞ రూపరే
ఖాసమలీలఁజూచి యహహా యనుచుం దలయూఁచి ముందు తా
వ్రాసినభావ మెంచి తల వంచుకొనెం జలజాక్షి సిగ్గునన్.—ఆ. ౩.

చ. అనవుడు మందహాసముఖుఁడై హరి నీభుజశక్తి నీవె నె
మ్మనమున లజ్జలేక పలుమాఱును మెచ్చుకొనంగ నీతియే
యని మొన నిల్చినప్పుడు నిరర్థక మీవెడమాట లేల నాఁ
కొని భుజియింపఁబోవుచును గూరలమే లనుగంగ నేటికిన్.—ఆ. ౪.

ఉ. భూసురవేదనాదములఁ బుణ్యసతీజనమంజులోక్తులన్
భాసురవృత్తగీతరసబంధురరావములం బురీవనీ
వాసశుకానులాపముల వారణబృంహితవాజిహేషలన్
శ్రీసముదంచితం బగుచుఁ జెల్వు వహించెఁ బురంబు సర్వమై.—ఆ. ౫.

కవిరాజమనోరంజనము.

చ. కొడుకులు గల్గుదాఁక నొకకొన్నిదినంబులు చింత నందనుల్
వొడమిన నాయువు న్బలము బుద్ధియు విద్యయుఁ జాలఁగల్గఁగా
నుసుగనిచింత కల్గితను నోలిభజింపనిచింత తండ్రి క
ప్పుడుఁ గడుచింతసేయుదురు పుత్రులు శత్రులుగాక మిత్రులే.—ఆ. ౧

సీ. ధర నల్పులకుఁ బ్రభుత్వంబు వచ్చిన మనుష్యుల వికారపుఁజూడ్కిఁజూచినట్లు
పల్లవు ల్పొరి లేమిపడి యింటిచాయరా మొగిలంజెతల్లులు మూల్గినట్లు
పరదేశి యతిలోభపరునియింటికిఁ బోవఁ దగి కోఁతిపరెను గద్దించినట్లు
వంతువానికి హీనవైశ్యులు తమలోన నేకంబుగాఁ గలహించినట్లు
తెరలి రొయుంగొక్కటిని రూక్షదృష్టిఁ జూచు
గొఱగొఱను మూల్గు గద్దించుఁ దఱిమి తఱిమి
కవిసి కలహించి భౌకృతి కలకలముగ
జాగిలమ్ములు రోషభీషణము లగుచు.—ఆ. ౨.

చ. కర మనురక్తిఁ గొమ్మ కరకంజమునం దిడి మీఁదఁ బాలుఁ జ
క్కెరలును బెట్టి పెంచి పలికింపుచు మాటలు నేర్పినందుకా

విరసపుఁగూఁతల న్నిగుల వేదన గొల్పెద రింతి కియ్యెడన్
గురువుకు బొమ్మవెట్టితిరి క్రూరవిచారము కీరవాగమా.—ఆ. ౩.

ఉ. నిప్పులురాలు గ్రీష్మమున నిక్కసగాడ్పులు వార్షికంబునన్
జప్పుడుసేయుకే మరలఁపోఁగఁ బ్రతీచికిఁ బ్రాచినుండి తా
రప్పటిపొంగుచేఁ బ్రజల నాపదఁ బెట్టి నిజాధికారముల్
దప్పినఁ జిన్నబోయి మరలం జనుచుందురుగాద దుష్ప్రభుల్.

చ. మలయజగంధి తాళపరిమాణమనోహరరాగగీతికా
కలనదంబు జంత్రమున గాత్రమునన్ జెలఁగింపు నింపుచే
శిలలు ద్రవించెఁ జిత్రములు జీవకళల్ ధరియించె దారువుల్
పొలుపుగ నంకురించె మృగము ల్మదిఁ జొక్కవహించె నంతయున్.—ఆ. ౪.

మ. తగునే రాజకుమార నువ్వథ మవస్థాపంబుచే నింత నె
వ్వగలం బొందఁగ ధైర్యశాలిపిగదా వాగాంగనాస్నేహమో
హగుణంబు ల్చపలాయతాయతము లెంతైన న్సతం బేలగున్
నగరే లోకులు నీమనం బిటులు మగ్నంబైన రాగాంబుధిన్—ఆ. ౫.

కాణాద-పెద్దన సోమయాజి

ఈకవి నిజాముురాజ్యములోని గద్వాలసంస్థానాధిపతి యైన ముష్టిపల్లి సోమ భూపాలుని ప్రేరణుచేత ముకుందవిలాసమును, అధ్యాత్మరామాయణమును రచియించెను. ఇతఁడు నందవరీక నియోగిబ్రాహ్మణుఁడు; ఆశ్వలాయనసూత్రుఁడు; ఆత్రేయ గోత్రుఁడు; తిమ్మనార్యపుత్రుఁడు. సోమభూపాలుఁడు తన్నుఁగూర్చి పలికినట్లు కవి చెప్పుకొన్న ముకుందవిలాసములోని యీక్రింది పద్యములలో „శేషశైలేశలీల'' అను నామముతో అపంచవర్గీయ చిత్రకృతి మొద లయినవానినిగూడఁ దాను రచించినట్లు చెప్పెనుగాని యవి యిప్పుడు కానరావు—

సీ. నను నందవరపురాన్వయపయోనిధిచంద్రుఁ గాణాదవంశవిఖ్యాతిసాంద్రు
నాశ్వలాయనసూత్రు నాత్రేయమునిగోత్రు సకలవిద్వత్కవిప్రవరమిత్రు
ప్రౌఢలక్ష్మీపతిపండితసోదర్యు బాహటగ్రంథానుభావధుర్యు
వేదశాస్త్రపురాణవివిధమ ర్మధురీణు వరచతుర్విధకవిత్వప్రవీణు
భోజచంపూప్రబంధార్థబోధనానాబంధగీర్వాణటీకానిబంధనాది
పేశలవచోరచనచర్యు పెద్దనార్యుఁ గాంచి దయమించి పలికె సగౌరవముగ,

గీ. కాదివర్ణంబు లెవ్వఁడైనను విడిచి । చేసెఁ దిప్పచతుర్థయమకకృతిని
శివశైలేశ లీలాఖ్యచే నెనఁగ । యాదిమితవర్ణనియతి కావ్యంబు జగతి.

ఉ. శ్రీరమణీయరక్ష నూరపురీవగరీపగరీశదేశభూ
భారధురీణుఁ డాబహిరిపాముప్పభూపాలసభాంతరంబునన్
మారమణాంకితంబులుగను మత్స్యపురాణ మొనర్చెఁ బూనవే
సారసుధాప్రసారవిలసత్కృతి నాంధ్రవచశ్చమత్కృతిన్.

ఈకవి సంస్కృతాంధ్రములయందు బహుసమర్థుఁడు. ఈతనిగ్రంథములలో నున్నన్ని శబ్దాలంకారములును చిత్రబంధకవిత్వపద్యములును మఱి యేకవిగ్రంథములోను లేవు. ఈతనికవనము రసవంతమయి కవిజనహృదయరంజకముగా నుండును. తనకవిత్వమును గూర్చి వెన్నెలకంటి వేంకటపతి యీక్రిందిపద్యమును చెప్పినట్లు కవి తనయధ్యాత్మరామాయణమునందు వ్రాసికొనియున్నాఁడు—

ఉ. ఇద్దఱుజోదు నన్నకవి యెఱ్ఱన, తిక్కనసోమయాజి దా
నుద్దగు వారికిన్, ముగురికొక్కఁడె దీటగు నల్లసానిమా
పెద్దన, వారితోడుతను బేరువహించిన శ్రీకణాదముం
బెద్దనసోమయాజి విను పెద్దనఁ బోల్చుఁ గవిత్వసంపదన్.

ఇట్లితరులు పొగడినట్లు చెప్పుటయేకాక కవి తాను తనముకుందవిలాసము నిట్లు పొగడుకొన్నాఁడు—

గీ. ఇందు సకలహితము నిచ్చు ముద్విష్ణువి । శ్రీయతుల్యమా మదీయకవిత
యెటుకుటఁజేవఁబోలువనలిఁబోలుఁ గొమ్మా । మృదువుగాదె విరులమీఁద వ్రాలి ?

క. ముకుందవిలాసము తావి ము
కుందవిలాసము సదాముకుందవిలాసం
బిందువిలాసమును సుధా
బిందువిలాసము హసించుఁ బేశలఫణితిన్.

ఈకవికాలముగాని కృతిపతి యనఁదగు పెదసోమభూపాలునికాలముగాని నిశ్చయముగాఁ దెలియలేదు. అయినను

ఉ. కన్నయభట్టు, భీమన, ఘనంబు నధర్వణుఁ దిక్కహోత్రి నె
ఱ్ఱన్నను సోము భాస్కరుని నయ్యలనైషధకావ్యకర్తఁ బో
తన్నను చిన్నశౌరిఁ జిదన్నను నూరప రామభద్రుఁ బె
ద్దన్నను దిమ్మనార్యు గరుడాంకుని మూర్తి సుకీర్తి నెంచెదన్.

అని భట్టుమూర్తివఱకును గలకవుల నీకవి పొగడి యుండుటచేత నీతఁడు పదునారవ శతాబ్దాంతమునందును పదునేడవశతాబ్దాదిని దనుక నుండెనా యనుపట్టు స్పష్ట

మగుచున్నది. ముష్టిపల్లి సోమనృపాలుని తాత మొదలయినవారు మహమ్మదీయులతో యుద్ధము చేసి వారిని జయించుట మొదలయిన సంగతులు చెప్పఁబడి యుండుటచేత నితఁడు పదునేడవ శతాబ్దాంతమునందో పదునెనిమిదవ శతాబ్దారంభమునందో యున్నట్లూహింపఁ దగియున్నది. గద్వాలసంస్థానమునందున్న యామిత్రులకొకరికి కవికాలవిషయమునుగూర్చి వ్రాయఁగా ౧౬౫౦వ సంవత్సరప్రాంతములయం దుండినట్లు తెలిపియున్నారు. ఇతఁడలికపిస్తుతిలోఁ జేర్పఁబడిన యయ్యలు రెట్టమతమును జేసి నతఁడే యయినపక్షమునఁ గవి ౧౭౩౦వ సంవత్సరమువఱకుఁ దరువాతఁగూడ నున్నట్టు చెప్పవలసి యుండును. ముకుందవిలాసమునకు భద్రాపరిణయ మని నామాంతరము గలదు. కవికృతము లయినయితరగ్రంథములయందుండియుఁ గొన్ని పద్యము లిం దుదాహరింపఁబడుచున్నవి—

ముకుందవిలాసము.

ఉ. ఆటలు పాటలుం గలుగునందఱు గందపుఁగూటవాటముల్
కోటలు పేటలుం బసిఁడిగోడలు మేడలుఁ గల్వవిందురా
చోటులు నీటులుం గులుకుమక్కను జుక్కను నిండుఁజెల్వొపుం
బోటులమేటులం దగినపొన్నలచెన్నులు గల్గువీటిలోన్.—ఆ. ౧.

ఉ. చేరలఁ గొల్వవచ్చు దయచిప్పిలుఁ గొప్పకు గొప్పకన్నులన్
మూరలఁ గొల్వవచ్చుఁ గడుముచ్చట లిచ్చు వెడందవక్షమున్
బారలఁ గొల్వవచ్చుఁ గవపాలి బళీ హరికి న్నమోపలన్
మేరలఁ గొల్వవచ్చునొక మేలితఁ డీతఁడు ప్రీతిఁ జేసినన్.—ఆ. ౨.

ఉ. కాననకానభంజనక కాళిజగావిలనిల్లుమోఁకిం
పోనఁగఁ బానకంబు సమ మానన మానసపిల్లు మేనమా
మే ననమేనసం గనక మేనన మీననఁ గన్గవందగున్
వే. లివేనలిన్వారుల వేయుఁ జూవే యువతీమతల్లికిన్.—ఆ. ౩.

మ. తనరన్ వ్యాకరణజ్ఞుఁ దండ్రియనుచుం దర్కజ్ఞునిన్ భ్రాతయం
చును మీమాంసకునిన్ నతుంపతిఁ దటంచు న్వేడి దూరంబునం
గని యస్పృశ్యునిఁ బోలె ఛాందసుని వేదక్రం గావ్యలీలారస
జ్ఞ నిజేచ్ఛం గవితావధూమణి వరించున్ భావగర్భంబునన్.—ఆ. ౪.

అధ్యాత్మరామాయణము.

సీ. సంసారదావాగ్ని సంతప్తులకు సుధాస్తోమవర్షణియుక్తి రామభక్తి
తాపత్రయామయతాపక్లేశితులకు రమ్యభేషజయుక్తి రామభక్తి

పంచమహాపాతకపటలసర్పములకు రచితగారుడభక్తి రామభక్తి
భవవిపద్వారాశిపాతభీతులకును ప్రబలతరీయభక్తి రామభక్తి
ప్రేమబోధితగురుమూర్తి రామభక్తి। కామితార్థజనాసక్తి రామభక్తి
శ్రీమదురుసంపదనురక్తి రామభక్తి। సామరస్యోదితవిముక్తి రామభక్తి.—బాల.

చ. సొరిదిఁ గళత్రపుత్రపితృసోదరబాంధవముఖ్యసంగముం
బరయ నదీప్రవాహపతితాగతకాష్ఠములట్ల కూడుచుం
బరిపటివీడు నైజము ప్రపంచగతజంతులఁబోలి మోహముం
బొరయకయుండఁగావలయుఁబోవుచునున్నదవచ్చుచున్నదన్.—అయోధ్యా.

ఉ. అంతట దైత్యకాంతుఁడు సురాదివిరోధి సరోధిదాటి య
త్యంతవిభాకలంకను శుభాంకను లంక నశోకకాననా
భ్యంతరసీమలో నిలిపె నాసురకాంతలు కాచియుండఁగా
సంతతపూత సాధుగుణజాతను నాక్షితిజాత నెంతయున్.—అరణ్య.

ఉ. అంచలుపాఱెఁ గేకులకు నాటలుగేరె ఘనంబు లూఱెఁ గ్రొ
మ్మించులుకూరె శీతలసమీరమువారె మరుండు చేవ ము
న్మించుగ జాతిబాణతతి మాఱె నటంబధికాళిధైర్యముల్
గ్రించుకజాఱె మాఱె నలగ్రీష్మము మీఱె జలాగమంబిలన్.—కిష్కింధా

చ. కమలవిరోధి కామజయకారి కిరద్యుతికీర్తనీయుఁడున్
కుముదహితుండు కూటమృగగోత్రకృతాంకుఁడు క్లృప్తసత్క్రియా
క్రముఁడును కేశవేక్షణము కైరవిణీశుఁడు కోకభేదనా
గమనుఁడు కామదీకరుఁడు కంధిభవుం డుదయించెఁ దూర్పునన్ —సుందర.

ఉ. దానవనాశనార్థముగఁ దత్సతిఁ దెచ్చితి వీవున్నహో
మానము నామిషం బనతమి న్విషపిండము గ్రోలి సోలు నె
ట్లానెతి నామహీసుతసమాహరణం బొనఁగూడె మీఁదటన్
గా నగునట్టికార్య మది కానగుచున్నది దానవాగ్రణీ.—యుద్ధకాండము.

మ. శ్రవణానందకరంబు సుందరముగా షడ్జాదిసప్తస్వరా
ర్ణవముం జాతిగతుల్ త్రికాలకలితస్థానత్రయాళుల్ మార్గమా
ర్గవిధుల్ తోఁపఁగ వల్లకీచతురతన్ రంజిల్ల గాంధర్వసా
రవిదుల్గానమొనర్చి రాకుశలవుల్ రామాయణం బాసభన్.—ఉత్తరకాండ.

కుందుర్తి-వేంకటాచలకవి.

ఈకవి మిత్రవిందాపరిణయమనెడి యారాశ్వాసముల ప్రబంధమును రచియించెను. ఇతఁడు నాలువేల నియోగిబ్రాహ్మణుఁడు; ఆపస్తంబసూత్రుఁడు; శాండిల్య గోత్రుఁడు; రామయామాత్యపుత్రుఁడు. ఈతని తాతయైన గోవిందామాత్యుఁడు ౧౬౫౦ వ సంవత్సరప్రాంతములయందు రాజ్యముచేసిన వీరవేంకటపతిరాయలవద్ద నుండి, భారతీపరిణయమను కావ్యముఁజేసి యాతనిని మెప్పించినట్లు కవి యీక్రింది పద్యమునఁ జెప్పియున్నాఁడు—

చ. పటుతరగోస్తనీమధురపాకసమంచితమై రసోర్జిత ప్ర
ర్యటమగుభారతీపరిణయం బనుకావ్య మొసంగి వీరవేం
కటపతిరాయలం దనిపి కాంచె మణీకనకాభిషేక ము
త్కటగతి నమ్మహామతి సుఖస్థితిశోభి యశోభిరాముఁడై.

ఈకవికాలమునాఁటికి విజయనగరసంస్థానప్రభువులు మిక్కిలి హీనదశకువచ్చినందునఁ గవి ఈరాజ్యమునువిడిచి పాండ్యమండలమునుజేరి మధురలోనుండినట్టు తెలియ వచ్చుచున్నది. గ్రంథావతారికలోఁ దాను పాండ్యమండలాధీశ్వరుఁడయిన విజయ రంగ చొక్కనాథునిఁ గవిత్వముచెప్పి మెప్పించినట్లు కవియే యీక్రిందిపద్యములలో వ్రాసికొనియున్నాఁడు—

సీ. చదివినావే మేమి చదువయోగ్యంబులో యవియెల్ల నిస్సంశయంబుగాఁగ
వచనకావ్యములుగా రచియించినావు భారతభాగవతములు రామకథయు
ఘటియించినావు ద్రాక్షపాకముగ బహునాటకంబులు సమున్నతిఁజెలంగఁ
జాటించినావు దిక్కోటరంబుల బుధకోటిమెచ్చ నపారచాటుకృతులు
నర్థగుంభసముజ్జృంభితాశుమధుర । చిత్రవిస్తరకవితా ప్రసిద్ధి నీకు
సహజమేకద పాండ్యభూజానిసభఁ గ । థాశుకవియనఁ గీర్తిఁ జెన్నలరినావు.

చ. కవిజనకల్పకం బఖిలకావ్యరసజ్ఞుఁ డఖండపాండ్యభూ
ధవుఁడు మహానుభావుఁ డతిధార్మికుఁ డర్యగవజ్రధారి యై
న విజయరంగచొక్కనరనాథుఁడు నీకవితాసమగ్రవై
భవములు మెచ్చి నీ కొసఁగె భర్మ మణీశిబికాదిసంపదల్.

పయిపద్యములవలనబట్టి యితఁడు కొన్నినాటకములనుమాత్రమేకాక భారత భాగవత రామాయణములను వచనకావ్యములుగాఁగూడ రచియించినట్లు విశదమగుచున్నది.

ఇతఁడుమాత్రమేకాక యితనికాలమునం దుండినయితరకవు లనేకులుకూడఁ దాము వచనకావ్యములను రచియించినట్టు తమ ప్రబంధములలో వ్రాసికొనియున్నారు. ఆవచనకావ్యము లన్నియు మాకు దొరకకపోయినను, ఈకాలములో రచియింపఁబడిన వచనకావ్య మొకటిమాత్రము మాకు లభించినది. ఆవచనకావ్యమునుగూర్చియుఁ దత్కర్తనుగూర్చియు నింతకుముందే కొంత వ్రాయఁబడెను. పయి నుదాహరింపఁ బడినవానిలోని కడపటిపద్యమునుబట్టి కవికాలము సహితము స్పష్ట మగుచున్నది. విజయరంగ చొక్కనాథుఁడు ౧౭౦౪ వ సంవత్సరము మొదలుకొని ౧౭౩౧ వ సంవత్సరమువఱకును రాజ్యముచేసి విద్వాంసుఁడై యాంధ్రకావ్యరచనను బ్రోత్సాహము చేసినవాఁడగుటచేతను, అతనికాలములోనే కవి యనేక గ్రంథములనుజేసి తర్వాతమిత్రవిందాపరిణయమును జేసియుండుటచేతను, ఇతఁడు హూణశకము ౧౭౪౦వ సంవత్సర ప్రాంతమువఱకును జీవించియున్నట్టు తెల్లమగుచున్నది. కొంతకాలమునుండి యీతని పూర్వకవు లాచరించుచువచ్చిన యాచారమును మానక యీకవియు రంగనాథుఁడు తనకు స్వప్నమున సాక్షాత్కరించిన ట్లీక్రిందిపద్యమున వ్రాసికొనియున్నాఁడు.—

సీ. నీలమేఘముడాలు చాలించఁగఁజాలుమేనువాఁడు జగంబు లీనువాఁడు
వేల్పురాతాతల్పు విప్పటందమదల్పుటొమ్మువాఁడు కళాధరమ్మువాఁడు
వెలలేనిబంగారు చెవన్నెరంగారుచేలవాఁడు మనోజ్ఞలీలవాఁడు
కడకంట సొంపారుకరుణారసమునీరుచూపువాఁడు భవంబుఁబాపువాఁడు
హీరకటకకిరీటకేయూరతార । హారమంజీరచాకచక్యములవాఁడు
కలనొకానొకపురుషుఁ డుత్కలికఁదొలుకఁ । బ్రేమ నామ్రోల వేకువజామునకేళ.

గ్రంథమునం దక్కడక్కడ లక్షణవిరుద్ధము లైనప్రయోగము లనేకము లుండుటచేత నీతఁడు లాక్షణికకవి కాకపోయినను, మొత్తముమీఁద నీతనికవిత్వము రసవంతము గానే యున్నది. మిత్రవిందాపరిణయములోని రెండుమూడుపద్యముల నిం దుదాహరించుచున్నాను.—

చ. అని వనితోక్తియుక్తిగతి నవ్వని నవ్వనిగుంపు సొంపుఁ జే
కొని తనివార సౌరభము గ్రోలుచు సోలుచు మిన్నగస్థ క్రొ
న్ననల నవద్యహృద్య కల నన్గని కన్గొని తావిమావి పెం
పొనరినమేర గీరరుతు లూకొని తూకొనినంత సింగమై.—ఆ. ౨.

ఉ. సారస మామొగంబు జితసారస యాగమునంబు నాభికా
సారశుభాభ యాళదమసారసమాజము మేఘు మానుధా

సారసమావృతంబు నుడి సారసమానము తన్నుతంబ మా
సారసమానినీయనువిసారసమాయత మాద్యగజ్జనుల్. — అ. ౪.

చ. కనియె నుదారుఁ బావతరకౌస్తుభహారు సుమేరుధీరు దే
వనదశరీరు దుగ్ధమయవార్ధిగభీరు దురాపసారు లో
చనసుఖదావతారు ఖలశైలశతారు నఘౌఘమారు స
ద్వినుతయశోవిహారు వసుదేవకుమారు నతాబ్జసూనునిన్. — అ. ౬.

ఈటూరుపల్లి - భవానిశంకరుఁడు.

ఈకవి ధర్మఖండమును రచించెను. ఇతఁడు కూచిమంచి తిమ్మకవితోను వక్కలంక వీరభద్రకవితోను సమకాలికుఁ డయినందున, ఇతఁడును పదునెనిమిదవ శతాబ్దారంభమునుండి ౧౭౫౦ వ సంవత్సరప్రాంతములవఱకును జీవించియుండును. ఈకవి తనధర్మఖండమున వక్కలంక వీరభద్రకవినిగూర్చి వ్రాసిన "హంసశౌర్యుండగు" అనుపద్య మీవఱకే యుదాహరింపఁబడియున్నది. ఇట్టికవి వేంకటరాయకవి తన విద్యాగురువైనట్లు కవి ధర్మఖండమున నీక్రిందిపద్యముచేఁ జెప్పుకొనియున్నాఁడు—

ఉ. శ్రీమయవాగ్విలాసుఁడు నశేషలిపిశ్రవణుండు భూరిశో
భామహనీయమూర్తి యఁ బ్రబంధనిబంధనబంధురక్రియా
భామహితోరుసూత్రుఁడు నృపాలకపూజ్యుఁడు నంచుఁ దన్బుధుల్
వేమఱు నెంచ దిట్టకవి వేంకటరాయకవీంద్రుఁ డొప్పుగన్.

ఈకవి యాఱువేల నియోగిబ్రాహ్మణుఁడు; భారద్వాజగోత్రుఁడు; శంకరామాత్య పుత్రుఁడు. కవి తాను శృంగారమంజరి యనుకావ్యమునుగూడ రచించినట్లీక్రింది పద్యమునఁ జెప్పుకొనెనుగాని మాకాగ్రంథము లభింపలేదు—

సీ. ధాత్రి భారద్వాజగోత్రపవిత్రుఁడై సురుచిరాపస్తంబసూత్రుఁ డగుచు
నిరతాన్నదానాభినిరతుఁడౌ నీదురుపలి నరసామాత్యుపౌత్రవరుని
నంగనపూజితశంకరుం డగుశంకరామాత్యవరునికి నాత్మభవునిఁ
బ్రాజ్ఞుని నచ్చమాంబాగర్భశుక్తిముక్తామణి నీశ్వరధ్యాననిరతు
భవ్యశృంగారమంజరీకావ్యరత్న। మంత్రభాష నొనర్చినయట్టిసుచరితు
శంభుభక్తుఁడై నయిపటూరి శంభుశిష్యు। నను భవానిశనాముఁ గన్గొనుచుఁ బలికె.

ఈకవి రచియించినగ్రంథము సమగ్రముగా దొరకలేదు గాని దొరకినంతవఱకుఁ

గవనము రసవంతమును మధురమయి నిర్దుష్టముగానున్నది. ధర్మఖండమునుండి రెండు మూడుపద్యముల నిందుదాహరించుచున్నాను—

చ. అనవిని వానిఁజూచి మునులారయఁ బుత్రకళత్రరక్షకై
యనయముఁ గ్రూరవృత్తిమెయి నర్థము నీవు గడించె దేని నీ
ఘనతర మైనకిల్బిషనికాయము భాగమువారు కొందురో
కొనరో యెఱుంగఁదెల్పు మనినం దతిలీల నటంచుఁ బల్కెనన్.

చ. హరి భజియింపనైతి లలనావయవామితవర్ణనాప్తి న
స్థిరమతి నర్థలోభరతిఁ జేయఁగనైతిఁ బరోపకార మి
ద్ధర శశతాదయాకలితతాగుణము ల్సహజంబు లయ్యె నె
ట్లరయుదు నీయపారకలుషాబ్ధికిఁ దారణయానపాత్రమున్.

చ ఫలితసరుల్ ద్విజాతులకు భక్తి నొసంగుటయున్ గతోదక
స్థలములఁ బ్రాణిలోకము హితంబునకై సరసీతటాకముల్
నిలుపుటయున్ మహాత్ములకు నెంజిలి దీర్చుటయున్ దలంప నీ
యలఘుసుకర్మపంక్తులు తదవ్యయమార్గసుఖైకహేతువుల్.

ధూర్జటి—వేంకటరాయకవి.

ఇతఁడు రత్నావళీపరిణయ మనెడు నాలుగాశ్వాసముల ప్రబంధమును రచించి చేకూరి రామస్వామిమంత్రి కంకితము చేసెను. ఈకవి కాళహస్తిమాహాత్మ్యమును రచియించి కృష్ణదేవరాయనికాలములో నుండినధూర్జటికవివంశమువాఁడు. ఇతఁడు తన గ్రంథమునందు ధూర్జటికవి నిట్లు స్తుతించి యున్నాఁడు—

మ. పటుగంగాలహరీతరంగసమశుంభత్ప్రౌఢతాంచత్కళా
ఘటనన్ బాదవినమ్రకృష్ణవరరాడ్గంభీరకోటీరవి
స్ఫుటరత్నద్యుతిపాటలీకృతపదాంభోజాతు సర్వజ్ఞు ధూ
ర్జటినిం గొల్చెద నష్టదీయకులకర్తన్ భక్తి రంజిల్లఁగన్.

ఈధూర్జటిపౌత్రుఁ డయిన వేంకటపతి కృష్ణరాజవిజయమును జేసెను. ఈవేంకటపతి కుమారుఁడును కవితండ్రియు నైనలింగరాజు కాళహస్తిరాజుల ప్రేరణముచేత మఱియొక చిన్నకాళహస్తిమాహాత్మ్యమును రచియించెను. రత్నావళీపరిణయమునఁ గవి తన తండ్రినిగూర్చి యిట్లు వ్రాసియున్నాఁడు—

మ. ఘనగౌరీశకటాక్షలబ్ధకవితాగాంభీర్యసంతుష్టభూ
జనకాద్దత్తసువర్ణచేలమణిభూషాగ్రామపల్యంకికా
ఘనదంతావళఘోటకాదిబహుసత్కారప్రతిష్ఠాత్మ మ
జ్జనకా! ధూర్జటి లింగరాజకవిరాజశ్రేష్ఠ! గీర్తించెదన్.

ఈకవి పాకనాటి యార్వేలనియోగిబ్రాహ్మణుఁడు; భారద్వాజగోత్రుఁడు. ఇతఁడు తన్నుఁగూర్చి చెప్పుకొనుచుఁదా నింతకుమున్న నామలింగశాసన మనఁబడెడి యమరమునంతను బద్యకావ్యమునుగా రచించిన ట్లీక్రిందిపద్యములలోఁ దెలిపియున్నాఁడు—

చ. స్థిరముగఁ గాళహస్తిగిరిజేశవరాగతసంస్కృతాంధ్రనుం
దరకవనంబు వ్యాకరణనాటక కావ్యవిచక్షణత్వమున్
గరిమవహింప భూవరశిఖామణు లెన్నఁ జెలంగి తా రం బం
ధురతనుకాంతిబాలరవి ధూర్జటి వేంకటరాయసత్కవీ.

మ. అమరం బంతయుఁ బద్యకావ్యముగ భవ్యంబైనయయ్యాంధ్రభా
ష మహాపండితసత్కవివ్రజము మెచ్చన్ సాహితీకౌశల
క్రమ మొప్పన్ దృఢభక్తితోడుతను శ్రీరామాంకితంబై తగన్
రమణీయంబుగఁ జేసినాఁడవు బళీ ప్రఖ్యాతివాటిల్లఁగన్.

ఈకవి కాలనిర్ణయమునుగూర్చి కొంచెము విచారింపవలసియున్నది. ఈతనితండ్రియైన లింగకవి తాను రచించిన పంద్రెండాశ్వాసముల కాళహస్తిమాహాత్మ్యమును కాళహస్తి రాజయినదామెర్ల యకృష్ణనాయనిపుత్రుఁడగు వేంకటపతిరాయని కంకితముచేసి యున్నాఁడు. అకృష్ణనాయనిపుత్రుఁడయిన వేంకటపతినాయఁడు పదునెనిమిదవ శతాబ్దారంభమున నుండినవాఁడు. దీనినిబట్టి చూడఁగా కవి ౧౭౫౦ వ సంవత్సర ప్రాంతమునం దుండినట్టు నిశ్చయింపవలసి యున్నది. అయినను మన మిప్పుడు నిర్ధారణము చేసిన యీకాలమున కొక బాధకము కనఁబడుచున్నది. కవితండ్రియైనలింగకవి తన కాళహస్తిమాహాత్మ్యమునందు

సీ. శ్రీకాళహస్తీశసేవనాన్వితచిత్త చిత్రజాకార లక్ష్మీవిహార
రమణీయశీల భారద్వాజగోత్రపవిత్ర యాపస్తంబసూత్రమహిత
ధూర్జటివంశపాథోధిచంద్ర కుమార ధూర్జటినామ విస్ఫూర్జితాంక
స్తుతమతి వేంకటపతితనూభవ లింగరాజకులేంద్ర ధైర్యాచలేంద్ర"

అను సీసపద్యములోఁ దాను కృష్ణవిజయము నొనర్చిన కుమారధూర్జటికిఁ బుత్రుఁడయినట్టు వ్రాసికొనియున్నాఁడు. ఈకుమారధూర్జటి తాను కృష్ణదేవరాయలకాలములో నుండి కాళహస్తిమాహాత్మ్యమును రచించిన ధూర్జటికవికి మనుమఁడైనట్లు తనకృష్ణ

రాజవిజయమును వ్రాసికొనియున్నాఁడు. ౧౫౨౦ వ సంవత్సరప్రాంతమునందుఁ గృష్ణ దేవరాయలకాలములో నుండిన ధూర్జటికవి మనుమనికొడుకగు లింగకవి ౧౬౩౦వ సంవత్సరప్రాంతమునం దక్కరాజు వేంకటపతికాలములో నన్నఁగా నిన్నూఱుసంవత్సరములకుఁ దరువాత నుండుట పొసఁగనేరదు. కాఁబట్టి కుమారధూర్జటికి ధూర్జటి సరిగా తాతగాక తాతవరుసవాఁ డయియుండవచ్చును. అందుచేతనే కాఁబోలుఁ గుమారధూర్జటియే యొకచోట ధూర్జటిని దనపెదతాతనుగాఁ జెప్పుకొన్నాఁడు. ఈలింగకవియుఁ దనతండ్రిని ధూర్జటి మనుమనిగాఁ జెప్పక 'ధూర్జటివంశపాథోధిచంద్ర' యని తద్వంశజునిగామాత్రము చెప్పినాఁడు. కుమారధూర్జటి చినవేంకటాద్రీశ్వరుని యాజ్ఞాప్రకారముగాఁ దాను కృష్ణరాజవిజయము చేసితినని చెప్పుకొన్న చినవేంకటాద్రి నరపతి కృష్ణరాజవిజయకృతిపతి యగు కోదండరామరాజుయొక్క రెండవకుమారుఁ డగుచినవేంకటాద్రి యైనచో నీకాలనిర్ణయము మించుమించుగా సరిపోవును. రత్నావళీపరిణయకర్తయగు వేంకటపతికవి కవిత్వము ప్రౌఢముగను హృద్యముగా నున్నది. కవిత్వరీతిని జూపుటకయి కొన్ని పద్యము లిందుక్రిందఁ బొందుపఱుపఁ బడుచున్నవి.

మ. మెఱుఁగుంబోఁడులు మీఁటి సౌధపఙ్క్తులై మిన్నేటిబంగారుతా
మరపువ్వుల్ గ్రహియింపఁబోవ మదశుంభద్భృంగభగ్నశ్రేణి త
త్తరుణీవక్త్రవితానముం గని యభీతిస్వాంతలై కాంతలం
తరయుఁ బ్రౌఢిఁ గవాటముల్ మూగుదు రుద్యన్మృగ్రభావంబునన్ — ఆ. ౧

ఉ. ధన్యుఁడ వీవు సుమ్ము విమదమ్మునఁ బల్కి సమస్తదేవతా
గ్రణ్యుఁ డదృశ్యుఁ డై [illegible] రంజిలఁగా వసుభూమియంత సౌ
జన్యసమేత యైననిజజాయయుఁ దాను సమస్తభోగస
మ్మాన్యము లైజను [illegible] మమందగతిం జని చేరెఁ గూరిమిన్. — ఆ. ౨.

చ. ఘనతరలక్షణప్రతిభ గాంచినరాజసటంచుఁ బద్మిని
జనములఁ గుందఁ జేసి యనిశంబు నిజప్రతతిం గలంపఁగాఁ
దనరు మహాప్రతాపమహితస్థితిఁ గాంచుచు వచ్చినట్టి న
య్యకలంకమండలాగ్రహారి నెంతయు వెన్నెలనె తొలంగవే. — ఆ. ౩.

మ. చెలి [illegible]
లలన [illegible]
ష్టలిఁబోవన్ గ్రహియించె రక్కసుఁడు దోస్సారంబు మించంగ బె
బ్బులిచేఁ జిక్కుకురంగులట్ల తివలింపుల్ మిక్కిలిన్ భీతిల్లఁగన్ — ఆ. ౪.

అయ్యలరాజు - అయ్యలభాస్కరకవులు.

అయ్యలరాజవంశసంభవు లయినయయ్యలకవియు భాస్కరకవియుఁ జేరి కాలస్వరూపాదులను దెలిపెడి కట్టమత మను గ్రంథమును గన్నడభాషనుండి రెండాశ్వాసములపద్యకావ్యమునుగాఁ దెనిఁగించిరి. ఈకవు లిరువురును క్రీస్తుశకము ౧౭౭౦వ సంవత్సరమునం దీపుస్తకమును దెలిఁగించినట్లుగా గ్రంథాంతమునందలి యీక్రిందిపద్యమువలనఁ దెలియవచ్చుచున్నది —

సీ. కలియుగప్రథమభాగము నాల్గువేల యెన్మిదినూర్లపై డెబ్బదియునొకటి
శాలివాహనశక సమ లిల వేయునార్నూటతొంబదిరెండు రూఢిగాఁగ
బ్రభవాదిగతములు పరఁగ నిర్వదిమూడు నేం డయ్యె నంతయు నెన్న బుధులు
అట్టికాలంబున నయ్యల భాస్కర కవివర్యు లలరాజకమలహితుని
యాజ్ఞఁ బూర్వోక్త కట్టమతాఖ్యకావ్య । మును నొనర్చిరి యాచంద్రముగను గీర్తి
వక్తృశ్రోతలకును గల్గ వసుధమీఁద । నల యహోబలనృహరికి నర్పణముగ.

కవు లీగ్రంథమును కొండ్రాజు పెదతిమ్మరాజునకుఁ బుత్రుఁడును మఱియు గుర్వరాజునకు దౌహిత్రుఁడును నయిన వేంకటరాజున కంకితము చేసిరి. ఈవేంకటరాజు కర్నూలు మండలములోని రొట్టపాలెమునకుఁ బాలకుఁడును అహోబలక్షేత్రధర్మకర్తయు నయినట్లును, అతఁడు కవులను బిలిపించి కట్టమతమును దెనిఁగింపఁ బ్రార్థించినట్లును, ఈపద్యములలోఁ జెప్పఁబడి యున్నది —

సీ. శ్రీమదహోబలస్వామి మహారాజ్య రక్షకుం డగుచు నేరాజు వెలయు
నభిరామకామందకాఖ్యసత్కావ్యరత్నమునకు నేరాజు నాథుఁ డయ్యె
జానకీనాయకచరణసంసేవ ప్రౌఢిచే నేరాజు ప్రబలు సిరుల
నెరయూరి పురవరాధీశాది బహుబిరుదాంకుఁడై యేరాజు యశముగాంచె
నతఁడు కొండ్రాజు తిమ్మభూపతివరేణ్య । తనయు పెదతిమ్మరాజవతంసగర్భ
వార్ధిచంద్రుండు సత్కులవర్ధనుండు । సతతవిభవుండు వేంకటక్ష్మాపభుండు.

క. ఒకనాఁడు నిఖిలకోవిద । నికరహితామాత్యబంధుసుతవీరభట
ప్రకరము గొలువఁగ నెలవుం । డి కథాప్రస్తావ మాత్మ నివ్వటిలంగన్.

గీ. ఘనుఁ డకవియో యయ్యలనామవంశ్యు । ఘనుఁ డయ్యక్కసభుపుత్రు నయ్యలాఖ్యు
నాగఘనునాను భాస్కరినామధేయుఁ । గరుణ దనకొత్త రావించి గారవించి,

వ. తత్కాలోచితప్రసంగంబున నిట్లనియె.

గీ. ఘనతసుజ్ఞాననిధి భట్టభూసురుండు ముక్కు! చెలఁగఁ గన్న ధర్మారావు చెప్పినట్టి
శాస్త్రమంతయు నేను నీజయమువఁబోగదఁ। చెనఁగుభావనానర్వంగఁదివురుఁడీరు.

ఈపుస్తకమునుబట్టి యీకవుల కాలమును నిర్ణయించుటకుమాత్ర మేకాక తెనాలిరామకృష్ణకవి కాలమును కనుఁగొనుటకు సహితము కొంతయాధారము కానవచ్చుచున్నది.

భట్టుమూర్తియును దాఁగిరచిన యీకవుల యింటిపేరు అయ్యలరాజువారు. వీరిలో నొకఁడు పినతండ్రి యమాత్యపుత్రుఁ డయిన యయ్యలకవి; రెండవయతఁడు నాగయామాత్యపుత్రుఁ డయిన భాస్కరకవి. ఈకవుల కిద్దఱికి నెట్టిబంధుత్వ మున్నదో తెలియరాదు కాని వీ రన్నదమ్ముల బిడ్డ లని తోఁచుచున్నది. వీరిపూర్వులలో నొకఁడైన తిప్పనార్యుఁ డొంటిమిట్ట రఘువీరశతక నిర్మాణకర్తయయి రామరాజు యాస్థానకవిగా నుండెను; అతని మనుమఁ డయిన రామభద్రకవి రామాభ్యుదయమును రచియించెను. ఈకవుల కవిత్వము నిర్దుష్ట మయినదికాదు. ఈపుస్తకముగాక కామందకమునుగూడఁ గృతిపతి కృతినందెనఁట. కవనరీతిని దెలుపుటకయి భట్టుమతమునుండి కొన్నిపద్యముల నిం దుదాహరించుచున్నాను—

ఉ. పూవులు నక్షతంబులును బొందుగ దోయిటఁదాల్చి వానకై
భావములోన మానవుఁడు ప్రశ్న యొనర్పఁగఁ బల్కి యయ్యెడన్
వాపిరి చేసిఁ గాఁ బలుక వారితవృష్టియుఁ గల్గునంద్రు గో
త్రావలయంబునందుఁ గవిరాజి నుతింపఁగ వేంకటాధిపా.—ఆ. ౧.

ఉ. పాఱెడు బండిబ్రోఁతగలి బండులు చెల్వుగఁ గొప్పరీతి వే
సారక గార్దభం బఱచుజాడను ఘంటలనాదుకై వడిన్
వారక తోయమండలరవంబుగ తిన్ స్తనితంబు పద్వెనన్
ధారుణి వాన లేదనియె ధన్యుఁడు భట్టఁడు ప్రాజ్ఞు లెన్నఁగన్.—ఆ. ౨.

చ. అమరగురుండు లగ్నమునయందు వసింపఁగ విస్తుటల్ చతు
ర్థమున మెలంగఁ బైరు తతితప్పక యుండుట స్త్రమంబునం
దమరఁగ వేగ నాపయిరు లాయతపెట్టుట మంచి దాతయున్
విమలగుణాఢ్య తిమ్మపృథివీపతి వేంకటరాజశేఖరా.—ఆ. ౩.

చ. రవితనయుండు రోహిణికిరంబున నుండిన చైత్రకంబునన్
దవనము హెచ్చు మర్త్యులకుఁ దద్దయు నబ్బసఁగుం దెవుళ్ళ సం
భవిలును గౌతమీనదిని బంటలు రాజిలు సస్యభూములన్
ధ్రువముగ వాన లేదనియెఁ బ్రోడతనంబున భట్టుఁ డిమ్మహిన్.—ఆ. ౪.

మ. బుధుఁ డబ్దాధిపుఁ డైన వాచకరియున్ భూమండలిన్ రక్తధా
న్యధరల్ క్రీలు ఘటిల్లు కాలాల ప్రజ లన్నింతు కెంచున్ సమ
స్తధరాంతర్యాలకున్ శుభం బొదవుఁ గాంతా శ్రేణిపైఁ గూర్మి యు
ల్లధికం బాయువ కోటికి న్యనుము-ధరాత్య వేంకటేశ్వాధిపా.—అ. ౫.

అజ్జరపు - పేరయలింగము.

శకురంబివిలాస మనెడి స్థలపురాణగాథను దెనుఁగున నాల్గాశ్వాసముల గ్రంథముగా రచియించిన యీకవి శైవుఁడైన యాఱువేల నియోగి బ్రాహ్మణుఁడు. ఇతఁడు పదునెనిమిదవశతాబ్దమధ్యమునం దనఁగా నిప్పటికి నూటయేఁబదిసంవత్సరముల క్రిందట నుండినట్టు కనుపట్టుచున్నాఁడు. శకురంబివిలాసము యొక్క యవతారికయందున్న

ఉ. బమ్మెరవంశమందునను బ్రౌఢసరస్వతి పద్దుగాంచి తా
నెమ్మె దలిర్పఁ గేసనకవీశ్వరు లప్పమనామసాధ్వియం
దిమ్మహిఁ గూర్మిఁ గన్నసుత యెల్లమయందును బేరయాఖ్యఁగ
న్నమ్మతిఁ గంటి వీరవరసమ్మతు గంగనమంత్రి యగ్రమున్.

అను పద్యమునుజూచి భ్రమించి యొక టీకవీశ్వరుఁడు బమ్మెర పోతరాజుగారి బావ మఱఁదియని వ్రాసియున్నారు గాని యీ యంశ మంతవిశ్వాసార్హ మయినది గాఁ దోఁచదు. ఈయుపద్యము నాయొద్దనున్న వ్రాఁతపుస్తకమునందిట్లున్నను ముద్రితప్రతిలోఁ దప్పులు తప్పుఁగా సవరింపఁబడియున్నది. ఇందుఁ జెప్పఁబడిన కేసనకవీంద్రుఁడు బమ్మెర పోతనామాత్యుని తండ్రియైన కేసన కాఁడు. ఆ తండ్రి కవీశ్వరుఁ డయినట్టు పోతన భాగవతమునఁ జెప్పుకొనియుండలేదు; తనకన్న యొకఁ డుండినట్టు చెప్పుకొనె నేకాని తోఁబుట్టినవాఁ డున్నట్టును జెప్పుకొనియుండలేదు. అంతేకాక, "తనకు లక్కమాంబ ధర్మగేహినిగాఁగ" అని పోతన తనతల్లి లక్కమ యైనట్టు చెప్పుకొన్నాఁడు. ఈకేసన్న భార్య లక్కమాంబగాక యప్పమ యైనట్టు కవియే వ్రాసియున్నాఁడు. అయినను గవి యీమగారు పోతనామాత్యుని తండ్రియైన కేసన యని సమర్థించుటకయి యొకరు పద్యములోని "కేసన కవీశ్వరు లప్పమనామసాధ్వి" యన్నభాగమును "కేసనకవీంద్రుఁడు లక్కమసాధ్వి' నని దిద్దుటకయి సహితము ప్రయత్నము చేసినారు. ఈకవికి బమ్మెర పోతనామాత్యునివంటి కవిశ్రేష్ఠుఁడే బావ యయి యుండినపక్షమున, అతఁ డాబాంధవ్యమును దెలుపుకొనకుండఁడు. కవి యీగ్రంథమును వ్రాయునప్పటికి తన మనుమలుకూడ పెద్దవాఁ డయియున్నందున, ఆకాలమునకుఁ

బోతన కవిత్వ మారంభింపని పిన్నవయసువాఁడగుటచే నాతనిఁ జేర్కొనలేదని చెప్పుటకు సహిత మవకాశములేదు. ఈకవి తనవంశమూలపురుషుఁడైన కొండన గజపతియైన వీరనృపాలునిచే గోదావరిమండలములోని యుజ్జరపుగ్రామము నగ్రహారముగాఁ బడసిన ట్లీక్రిందిపద్యమునఁ జెప్పియున్నాఁడు:—

శా. శ్రీరంజిల్లఁ దెలుంగుమన్న గజరాట్సింహాసనాధ్యక్షునిన్
ధారాళంబుగ వేదశాస్త్రబహువిద్యారూఢి మెప్పించి యా
వీరాగ్రేసరుఁ డియ్యఁ గొండన మహావిఖ్యాతిగా గౌతమీ
తీరక్షోణిని నజ్జరంబనఁగఁ దాఁ దచ్చెన్నహాగ్రామమున్.

ఇందుఁ జెప్పఁబడిన వీరాగ్రేసరుఁడు

మ. ధర కొంధూళుబు కృష్ణరాయలనమాధాటీగతి న్వింధ్యగ
హ్వరము ల్దూఱఁగఁ జూచి తా రచటఁ గాపై యుండుటం జాల న
చ్చెరువై యొడ్డివింతచీఁకటులు వచ్చెం జూడరే యంచు వే
సారిం జూతురు వీరరుద్రగజరాట్శుద్ధాంతము ల్గాంగసల్.

అని మనుచరిత్రమునందుఁ గృష్ణరాయనిచే నోడింపఁబడినట్టు చెప్పఁబడిన వీరరుద్రగజపతి యేమో యని యూహపుట్టుచున్నది. ఆయూహయే నిజమయినచోఁ గవివంశమునకు మూలపురుషుఁ డయిన కొండన పదునాఱవశతాబ్దాదియం దుండియుండవలెను. కవి కొండన కేడవపురుషుఁ డయినందున నొక్కొక్కపురుషునికి ముప్పదేసిసంవత్సరములచొప్పునఁ జూచినచో నీపేరయకవి ౧౭౪౦ వ సంవత్సరప్రాంతములయం దుండియుండును. పలివెల మొదలయిన గ్రామములయం దిటీవలఁ జేరినవేశ్యలను వర్ణించి యుండుటచేతను. పదునేడవశతాబ్దమునందలి కవుల గ్రంథములలోని పద్యములను జూచి యటువంటిపద్యములను జేసియుండుటచేతను, మఱి కొన్నికారణములచేతను పేరయకవి పదునెనిమిదవశతాబ్దమువాఁడని నిశ్చయముగాఁ జెప్పవచ్చును.

చ. మొదలను బద్మసూతి నవమోహనలీల తెఱగంటికొమ్మలన్
మనమునఁ దా సృజించి సుమనోహరమూర్తుల దత్తవాటికా
సుదతులఁ దా నొనర్చి యట సొంపునఁ బల్వెల వారకాంతలన్
గదలక తా సృజించెఁ గరకౌశల మొప్పుచునుండ మానినీ.

అని పలివెల వారకాంతలు వర్ణింపఁబడిరి. పదునేడవశతాబ్దారంభమున సారంగు తిమ్మన వైజయంతీవిలాసమున

ఉ. ఒక్కనిఁ బిల్వనంపి, మఱియొక్కని చేతఁ బసిండిపట్టి, వే
ఱొక్కనియింటి కేగుచు, మఱొక్కని నానడుచక్కి నొక్కచోఁ

బొక్కకలంచి చూడ భ్రమఁ బొంది విటుల్తెలియంగలేరుగా
కక్కడిసత్య మేదవల పెక్కడినేమము వారకాంతకున్?

అని వ్రాసినపద్యము ననుసరించి యీపేరయకవి

ఉ. ఒక్కని దాయరమ్మని మఱొక్కనిఁ గన్గొని ముచ్చటించి వే
ఱొక్కనిఁ బొంది రొక్కము మఱొక్కనిచేఁ గొని వేఱొకవానికిన్
ఎక్కుడుప్రేమ లుండ వలపించుట ధర్మముగాక యయ్యయో
యొక్కనియందె తా వలచియుండుట న్యాయమె వారకాంతకున్.

అని వ్రాసియున్నాఁడు. ఈ యొదయనంబివిలాస మహాస్థలపురాణము విప్రనారాయణ చరిత్రమును జూచి దానిని మించునట్లుగా కల్పింపఁబడినకథయే యయినను, ఇందలి కథ వైజయంతీవిలాసములోని కథకంటెను నెక్కువ నీతిబాహ్యమైనదిగా నున్నది. కవిత్వమునం దందలిసారస్యమును నిందుఁ గానరాదు. ఇందుఁ దండ్రియే యొదయనంబికి వలసినంత ధనమిచ్చి యొక వేశ్యపాలుచేసి దాని నెప్పుడును విడువవలదని కొడుకునకు బుద్ధిచెప్పెను—

చ. నగవుదలిర్చుమోమున ఘనం బగు వేడుక నివ్వటిల్లఁగా
నగపతి ధైర్య నయ్యొదయనంబిని గాంచి బుధేంద్రుఁ డిట్లనున్
బగలును రేయి నిష్ఠురవఁ బాయకయుండు మటంచు నీకు నిం
పుగ నిరతవ్యయంబునకుఁ బొందుగ నిచ్చెద నూఱునిష్కముల్.

ఇందుఁ బాతివ్రత్యమునకంటె వేశ్యావృత్తియే మేలయినదని ఈశ్వరుఁడే బోధచేసెను—

సీ. సర్వస్థలంబుల సరస మాడఁగరాదు వలసినప్పుడు రతిఁ గలయరాదు

* * * *

ధాత్రిపై దంపతులకెల్లఁ దలిరుబోఁడి

* * * *

సీ. మగనిచే బాధలు మామచేఁ బీకలు నత్తచే నాడిక లరయులేవు
మఱఁదులచేఁ గొట్లు మఱఁదండ్రచేఁ దిట్లు పదినెల సరిపోటు బావపోటు
బంధుల కగపడు బాధ లింతయులేవు

* * * *

కావునను వేశ్యతనువొంద * * *
నిరాముఁ బరమును దగఁ గల్గు నిందువదన. *

ఇందు వేశ్యవాటికలో ఱంకని పలికినవారి నందఱినిబట్టి యముఁడు దండించునని చెప్పఁబడినది—

ఉ. పంకజపత్రనేత్ర విను పల్వెలలోపల వేశ్యవాటిలో
ఱంకని యెవ్వఁడేఁ బలుకు రంగుగ వానినిబట్టి మీఁదని
శ్శంకను నా దూతలురుచంద్రకతారకతోరశూలబా
ణాంకవిశాలతోమరమహత్తరహేతులఁ ద్రుంతు రెంతయున్.

ఇఁక జగత్తున దుర్నీతి యింతకంటెను బయికిఁబోవుట సాధ్యమగునా? ఈపుస్తకము నందు దుర్నీతి పాఠము కడముట్టినదనియే చెప్పవచ్చును. భక్తులమహిమలను జూపెడి యిటువంటిపుస్తకములే లోకమున కనంతమయిన చెఱుపును గలిగించుచున్నవి. ఈ స్థలపురాణమునం దీశ్వరుఁడు భోగముదానిచంటిలోనే ప్రత్యక్షమయినట్టు చెప్పఁబడినది.

ఈపేరయకవి భారద్వాజసగోత్రుఁడు; కొండనకును బాపమ్మకును బుత్రుఁడు. అక్కడక్కడ వ్యాకరణదుష్టములైన ప్రయోగము లనేకములు కానఁబడుచున్నను మొత్తముమీఁద నీతని కవనచాతురి శ్లాఘ్యమైనదిగానే యున్నది. ఒడయనంబివిలాసమునుండి మఱి మూఁడుపద్యముల నిం దుదాహరించుచున్నాను—

ఉ. ఎక్కి మహేశుఁ డప్పురము నెక్కువమీఱినఘోరదృష్టిచే
నొక్కటిగాఁగఁ జూచుచు మహోజ్జ్వలరూఢిఁ బసిండికొండఁ దా
నెక్కఁగఁబెట్టి దేవత లహీనగుణుం డని సన్నుతింపఁగాఁ
దక్కరిదైత్యులం దునుము లత్సవయుంబున శంభుకన్నులన్. —ఆ. ౯.

చ. ప్రియతనయామణీ! ఒడువు ప్రీతిని జెప్పినఁ బోనయ్యనున్
నయముగ నాటపాటల ఘనంబుగ నేర్పినగాయకోత్తమున్
నయముగ సత్కవిత్వమును జక్కఁగ నేర్పినసత్కవీంద్రునిన్
నయమునఁ బారితోషికమునం దనియించితి వ్యర్థ మయ్యెఁగా. —ఆ. ౪.

ఉ. కమ్మనిగోఘృతమ్ము తెలగంటికి నప్పత మైనయన్నమున్
దిమ్మనము ప్రసాదములుఁ దేనెతొనల్ బహుశాకపాకముల్
కమ్మనిపిండివంటలును గాంచనవర్ణము గల్గుపప్పు మో
దమ్ముగవారలుం గుడిచి తద్దయు సన్నుతిచేసి రందఱున్. —ఆ. ౬.

మరింగంటి-సింగరాచార్యులు.

ఈకవి దశరథరాజనందనచరిత్ర యనెడు నిరోష్ఠ్యరామాయణమును రచియించెను. ఇతఁడు శ్రీవైష్ణవబ్రాహ్మణుఁడు; మౌద్గల్యగోత్రుఁడు; తిరుమలాచార్యపౌత్రుఁడు; వేంకటాచార్యపుత్రుఁడు. ఈకవి తా నేకైకదినప్రబంధరచనాధురీణుఁడ ననియు, ఆంధ్రభాషా నిరోష్ఠ్యద్విపంచశతిప్రబంధనిర్మాణుఁడ ననియు, వ్రాసికొనెను గాని యితఁడు రచియించిన యితరగ్రంథము లేవియు నిప్పుడు గానరావు. ఇతఁడు నూటయేఁబదిసంవత్సరములక్రిందట నుండిన ట్లితనివంశమువారు చెప్పుచున్నారు. ఈకవి వాసస్థలము దేవరకొండసీమ. ఈతనికవిత్వము సలక్షణమై హృదయంగమముగా నున్నది. దశరథరాజనందనచరిత్రములోని కొన్ని పద్యముల నిం దుదాహరించుచున్నాను—

చ. కఘట లేల చిత్రగణికాచ్ఛట లేల హిరణ్యశాటికా
హాటధనధాన్యరత్నఘటితాచ్ఛదలంక్రియ లేల నర్థిశిల్
పిగతి నేలఁగాఁ దగదె తే జరి యేల యనేకచర్యలం
సిరి గల దట్టిసంగతిని జెందిన యారడ లెస్స లెన్నఁగన్. —ఆ. ౧.

చ. అనఘనగాత్రి నీరజదళాక్షి యఁ జెందితిఁ గాన దాఁచనే
కనకకిరీటహారికటకాంకణచిత్రకరత్నచేలచం
దనకటచేటికార్యతతిదంతిరథాంగహయాదికాంతయా
సనఁగిరవంతనే తనియు నాలఁడి సెప్పఁడఁ గీర్తిఁ గోరఁగన్. —ఆ. ౨.

చ. అని తృణశీలగాఁ దలఁచునా రిత డాత్మనిధానశీలఁ గా
తనరు శిరోనరాగ్రణి సరాగతి దిక్కుల నెల్లఁ గీర్తి గన
గనఘటితోల్లగాఁ గదలి దాడికి కాననధాత్రి చేరఁగాఁ
జని ఖరహంతఁ గాంచి దశకంఠసహోదరి సాతిశాయియై. —ఆ. ౩.

మ. అగజాజానిశరాసనేకకంధరలచే నర్చించి జట్కస్థలీ
దిగధీశాదితనందితచ్ఛటల నర్థిం గెల్చి శంకించనే
తెగి కైలాసగిరిం దృణాకృతిగ నెత్తెం గాన నీతం డహో
జగదారాధ్యత మెచ్చనేఁడె సదాచారక్రియం జెందినన్. —ఆ. ౪.

మ. గద కేలన్ ధరియించి యింపెసఁగ నాగ్లాతాల్టహాసక్రియన్
చదలంటం జరణాగ్రఘట్టనల నాశల్ ఘల్లుఘల్లనఁగ దీ
క్షదశన్ దీర్ఘదృగంచలాగ్నికణసంక్రాంతిం జలించంగ నా
త్రిదశాలిం గని కీశసేన యధికార్తిన్ డాఁగె నాయారయోదరన్. —ఆ. ౫.

అనంతరాజు-జన్నయకవి.

ఇతఁడు రామకథాభిరామమను పదియాశ్వాసముల మహాకావ్యమును రచియించెను. ఈకవి నియోగిబ్రాహ్మణుఁడు; జన్నపమంత్రిపౌత్రుఁడు; అమ్మయామాత్య పుత్రుఁడు. ఇతఁ డేకాలమునం దుండినవాఁడో తెలియరాలేదుగాని నూటయేఁబదియేండ్ల క్రిందటివాఁడయి యుండవచ్చును. ఈపుస్తకమునందలికథ శ్రీరామచరిత్రమౌట దీని నామముచేతనే తెల్లమగుచున్నది. ఈతనికవిత్వము నాతికఠినమయి మృదుపద గుంభితమయి కర్ణరసాయనముగా నున్నది. రామకథాభిరామములోని రెండుమూడు పద్యము లిం దుదాహరింపఁబడుచున్నవి—

ఉ. శ్రుతులకు భూషణంబు లగుచున్ బరమానుభవంబు గల్గు నీ
శ్రుతులకు నెల్లలోకములఁ జూచిన సామ్యము లేదు మాధురీ
గతుల సుధారసంబుచిలుకన్ ఘనమోహనసుస్వరైక సం
గతుల మహాద్భుతంబు గులుకన్ లసిల్లెఁ బ్రయోగిపాళులన్ —ఆ. ౧.

మ. వికచాంభోరుహచారులోచనకుఁ బర్వాం గాంతిమీఱన్ లలా
టికముక్తాఫలభాసురంబగుచు నూటిం దన్ముఖేందూపచా
రకలాపాచరణంబుపొంకె నునుపారం జేరునత్యుత్తమా
లికచందంబున నందమై కచతమోలీలా ప్రతారాకృతిన్ —ఆ. ౩.

చ. దరము హరించి యాశ్రితవితానముఁ గాచున భవ్యవజ్రపం
జరము విపన్నదీనజనసంఘముఁ బ్రోచుసమీపమేరుభూ
ధరము మహోగ్రశోకపరితాపమడంచుసుధాభ్ధానసా
గరము కరంబు రామవిభుకారుణికత్వమహత్త్వ మెన్నఁగన్ —ఆ. ౯.

ముద్దుపళని.

ముద్దుపళని పద్యకావ్యములు చేసినస్త్రీలలో నొకతె. మొల్ల రచియించిన రామాయణమునుగూర్చి రెండవభాగమునందే తెలుపఁబడినది. మోహనాంగి యను నామె మారీచిపరిణయమును రచియించినట్లు చెప్పుటయేకాని పుస్తకము లభింపలేదు. మొదటఁ బద్యకావ్యములను రచించినవా రిరువురును కులాంగనలు; ఈముద్దుపళని వేశ్యాంగన. ఇది రాధికాసాంత్వన మను నాలుగాశ్వాసముల శృంగారప్రబంధమును

రచించెను. దీని తల్లిపేరు ముత్యాలు. అది తంజావూరుసంస్థాన ప్రభువయిన ప్రతాపసింహుని యుంపుడుకత్తె యయినట్లు "చోళసింహాసనాధ్యక్ష ప్రతాపసింహ మహారాజ బహుమతానేకచామీకరాంబరాభరణ ముత్యాలుగర్భశుక్తి ముక్తాయమాన" యని రాధికాసాంత్వనముయొక్క గద్యములో వ్రాయఁబడినదానినిబట్టి యూహింపఁదగియున్నది. ఈరాధికాసాంత్వనమునకే యిళాదేవీయమని నామాంతరముగలదు. ప్రతాపసింహుఁడనెడి ఈమహారాష్ట్రప్రభువు ౧౭౬౩ వ సంవత్సరమునందు మృతినొందెను కాఁబట్టి యీముద్దుపళని ౧౭౬౦ వ సంవత్సరప్రాంతమునందు తంజావూరులోనుండెను. ఇది సంగీతసాహిత్యభరతశాస్త్రములలోఁ బ్రవీణురాలయినట్లు తానే చెప్పుకొన్నది. దీనికవిత్వము నాతికఠినమయి మృదువుగా నుండినందునకు సందేహములేదు; దీనికి మంచి సంస్కృతాంధ్రసాహిత్యమును గలదు. అందందు తప్పులున్నవికాని యట్టితప్పులు పురుషకవిత్వమునందు సహితమనేకగ్రంథములలోఁ గానఁబడుచున్నవి. అయినను గ్రంథములోనిభాగము లనేకములు స్త్రీలు వినఁదగినవియు స్త్రీనోటినుండి రాఁదగినవియుఁగాక దూష్యములయి యున్నవి. ఇది జారత్వమే కులవృత్తిగాఁగల వేశ్య యగుటచే స్త్రీజనస్వాభావికమయిన సిగ్గును విడిచి శృంగారరసమనుపేర సంభోగాదివర్ణనములను పుస్తకమునిండ నిక్కిలిపచ్చిగాఁ జేసినది. అయినను స్త్రీకవిత్వమని తెలిపెదను

గీ. తనదుమట్టెంత తానెంత తానెయెంత । చేయఁజూచిన నేనెంత చేయరాదు
వేలువాచిన రోలంతవిరివియైన । రోలువాచిన నది యెంతమేలు గనవొ.

గీ. కుట్టఁదేలు కుట్టుకున్నఁ గుమ్మరిబూచి । తోసిరాజటంచుఁ దోఁచెఁ జెలియ
దానివేలుఁదీసి దానికన్న పొడిచి । నటులుచేయుచున్న నగునె చిలుక.

గీ. తగవు కొండమీఁద దాఁటఁ గోరెదాని । నేఁటఁ దన్నుఁ దెలియు కింతపలికి
నెంతమీసవచ్చి యౌఁతమీసమ్రింగెఁ । గానఁ దల్లినెద్ద గంతమోచు.

గీ. కాని పదగను మిఁకమీఁద దానిమొగము । కనఁగవలదని శౌఁకెఁ గట్టుపెట్టి
బింకములు కూలనడకాలఁబెట్టి నేల । రాయకున్నను నాపేరు రాధగాదు.

గీ. లేనిపట్టింపు లెల్లను బూని చావ । నేనె దిమ్మదు గైనఁగాని యింతైనఁ జూడ
దల్పునకుఁ గల్లివచ్చిన నర్ధరాత్రి । గోడుగు తెమ్మన్నకతగాను గోమలాంగి.

ఇత్యాదిలోకోక్తులును జాతీయములును గలపద్యము లందందు లేకపోలేదు. రాధికాసాంత్వనమునుండి మఱికొన్నిపద్యముల నిం దుదాహరించుచున్నాను—

మ. యమునాతీరవిహార హారసదృశోద్యత్కీర్తిసంభార భా
రమణీయాకృతిమార మారసికతాప్రావీణ్యసంసార సా

రమరందోక్తివిచార చారణమదప్రఖ్యాతవిస్తార తా
రమహీభృత్సమధీర ధీరమునివాగాధార రాధాకరా — ఆ. ౨.
ఉ. ఈయెడఁ గాయము న్విడిచి యేగెద నంచు విచార మొందలే
దా యదుసార్వభౌమునికి నాయురవైకకిఁ గాని కాయమై
పోయినఁ బోవ నున్ననిలఁ బుణ్యము పాపము గుడ్డికన్నదా
మాయకయున్నదేమి మఱి మూసినదేమి తలఁచిచూడఁగన్. — ఆ. ౩.
చ. మెలఁకువమాటలం గలుగుమేలను లచ్చట గచ్చు లిచ్చటన్
దలఁపులు దానిపైని బలుతప్పులు నాపయి నేస్తమాడఁ జే
రలుక మఱీదఁ గూర్మి వగ లక్కడ నిక్కడ టక్కు లద్దిరా
తెలియఁగవచ్చె నీనడత తెల్లము వింటిమి ప్రాణనాయకా. — ఆ. ౪.

కంకంటి-పాపరాజు

ఈకవి యాఱువేలనియోగిబ్రాహ్మణుఁడు. ఇతఁడు తనయుత్తరరామాయణము నం దాఱువేలవారి నిట్లు వర్ణించుచున్నాఁడు—

సీ. అఖిలరాజాధిరాజాస్థానజనహృద్యవిద్యావిహారు లాఱ్వేలవారు
కల్యకబలికర్ణకలశార్ణవోద్గీర్ణవితరణోదారు లాఱ్వేలవారు
సజ్జనస్తవనీయసతతనిర్వ్యాజపరోపకారు లాఱ్వేలవారు
ఘనదుర్ఘటస్వామికార్యనిర్వాహణప్రవీణతాధారు లాఱ్వేలవారు
విమతగర్వాపహారు లాఱ్వేలవారు । లట్టియాఱ్వేలవారిలో నలఘుకీర్తి
వెలయు శ్రీవత్సగోత్రారవిందహేళి । మహితగుణశాలి వల్లభామాత్యమౌళి.

కవి శ్రీవత్సగోత్రుఁడు ; ఆపస్తంబసూత్రుఁడు ; అప్పయామాత్యపుత్రుఁడు. ఈతని తల్లి నరసాంబ ; తమ్ముఁడు నరసింహుఁడు. ఈతనివాసస్థానము నెల్లూరుమండలము. అక్కడక్కడఁ గొన్నివ్యాకరణదోషము లున్నను మొత్తముమీఁద నీతనికవిత్వము మిక్కిలి రసవంతమయినది. ఇతఁ డుత్తరరామాయణమును పురాణశైలినిమాని ప్రబంధపాకమునఁ జెప్పినవాఁడు. పూర్వ ముత్తరరామాయణము తిక్కనసోమయాజిచేఁ దెలిఁగింపఁబడినను దానిఁ గ్రొత్తఁగా మరలఁ దెలిఁగించుటకు రామకథ యగుటయే కారణమని కవి యీక్రిందిపద్యమునఁ జెప్పెను—

మ. వసుసం దిక్కన యజ్వ నిర్వచనకావ్యంబై తగంజేసె ను
త్తరరామాయణ మందున న్మఱి ప్రబంధం బూని నిర్మించుటే

సరసత్వం బని ప్రాజ్ఞులార నిరసించంబోకుఁడీ రాఘవే
శ్వరుచారిత్రము లెందఱెన్నిగతుల న్వర్ణించినం గ్రాలవే?

కవి యుత్తరరామాయణమును రచించుటకుముందు విష్ణుమాయావిలాస మను యక్షగానమును రచించినట్లు తన్నుఁగూర్చి యిష్టదైవము పలికినరీతిగా నీక్రిందిపద్యమునఁ జెప్పుకొన్నాఁడు—

గీ. శ్రీవెలయు మున్ను విష్ణుమాయావిలాస । యక్షగానంబు మాకు సమర్పణముగఁ
జేసి తదియాదిగా మేము నీసుధాను । సారివాక్కులఁ జొక్కియున్నార మనఘ.

ఉత్తరరామాయణము కంకంటి పాపరాజు చెప్పినట్లున్నను నిజముగాఁ బుష్పగిరి తిమ్మన్న రచియించి యాతనిపేరు పెట్టెనని వాడుక గలదు. ఈతనికవిత్వమునకును బుష్పగిరి తిమ్మనకవిత్వమునకును భేద మున్నందునను, ఈలోకప్రవాదము సరియైనదిగా నుండదు. పుష్పగిరి తిమ్మన్న గొప్పకవి యగుటచేతను, పాపరాజునకు మిత్రుఁడును సహశ్రోతయు నయియుండుటచేతను, కావ్యరచనయందుఁ గొంత తోడ్పడియుండుట చేతను, ఇట్టిప్రవాదము కలిగియుండవచ్చును. పుస్తకరచనయందుఁ బుష్పగిరి తిమ్మన్న తనకు తోడ్పడినట్లు కవియే యీక్రిందిపద్యములలోఁ జెప్పియున్నాఁడు—

మ. హరిమద్దివ్యపదారవిందమకరందానందనేందిందిరా
త్ముననేకాంధ్రకృతిప్రకల్పనసమర్థుం బుష్పగిర్యప్పనా
ర్యునిసత్పుత్రునిఁ దిమ్మనాఖ్యకవిచంద్రు న్మత్సహశ్రోతఁ బ్రో
ద్బుద్ధునే పిల్వఁగఁబంచి కన్నకల సంతోషంబునం దెల్పినన్.

మ. అతఁ డానందముఁ జెంది నన్నుఁగని యన్నా జాళువాపైఁడికిన్
గృతవర్ణాంచితరత్న మబ్బినటు లయ్యె న్నీవు వాక్ప్రౌఢిమం
గృతి సేయంగఁ గోడంగు రామకథకుం గృష్ణుండు రాఁ గోటఁ బ్ర
స్తుతి గావింపఁగ నాకు శక్యమె భవత్పుణ్యప్రభావోన్నతుల్.

గీ. అని కిరీటికి శౌరి తోడైనయట్టు । లమ్మహాకవిసాహాయ్య మాచరింపఁ
గృతి నొనర్పఁగఁబూనితి నేను మొదటి । నెంతు మద్వంశవిధమది యెట్టు లనిన.

కంకటి పాపరాజు ప్రళయకావేరిపట్టణములో నమీనుగా లౌక్యాధికారమునం దుండినవాఁడు. ఆకాలమునందే యీతనివద్దఁ బుష్పగిరి తిమ్మన్న కొంతఋణము చేసి యాయప్పు తీర్పలేక యీపుస్తకమును దానిక్రిందఁ జేసి యియ్యఁగా, ౧౭౯౦వ సంవత్సరప్రాంతమున నుత్తరరామాయణమును పాపరాజు అన పేరితోఁ బ్రచురించెనని చెప్పుచున్నారు. కవి యిప్పటికి నూఱుసంవత్సరములక్రిందట నుండినవాఁడు. కవిత్వశైలి

తెలియుటకయి యుత్తరరామాయణమునుండి కొన్నిపద్యముల నిం దుదాహరించుచున్నాను—

మ. పలుమాఱుం దనువేఁడు రామవిభునిం బాటింప కుత్తుంగభం
గలసత్తోయభుజంగసంఘఫణభంగప్రౌఢరంగత్తిమిం
గిలవాలప్రహతప్రవాళశకలాకీర్ణాంబుణార్ణవప్రభా
కలనం దేజము చూపె వార్ధి జడధుల్ గైకొందురే ధీరులన్. —ఆ. ౧.

ఉ. ఓయినిశాచరప్రవర యొప్పఁగ నిప్పుడు పల్కునీగణ
న్యాయము లెందుఁబోయె సురనాథులఁదోలెడువేళఁ జాలఁజా
లన్యాయముచేతఁగాదె జయ మందుట మీరు జగం బెఱుంగదే
న్యాయము మేము దప్ప మొకనాఁటి కదట్టిన విష్ణు తెల్పెదన్. —ఆ. ౨.

ఉ. తమ్ముఁడ వంచు నీకొకహితం బెఱిఁగింపఁగ దూఱఁబంచిన
వ మ్మొనరించి నాపలుకు వానినిజంపి నవున్ గయింపరే
ద్రిమ్మరిగుంపుతోడ నరుదెంచిన నిన్ననవేల నీవు డెం
దమ్మున మేలు గాఁదలఁచు నన్నె యనందగునే గాక దుర్మతీ! —ఆ. ౩.

మ. పలుతావు ల్వెదచల్లుతెమ్మెరలు పైపైఁ డాయ రేగాజువె
న్నెలగాయన్ మధుపాళిమ్రోయఁ గలకంఠీపాళికూయన్ మను
ల్లలనల్గానముచేయు నొంటి నిశివేళం దోఁటలో నైందవో
పలవేదిన్వసియించుపాంథుని స్మరాపస్మారము ల్చేరవే? —ఆ. ౪.

చ. కిలకిలనవ్వి యుచ్చెలి సఖీమణులంగని యమ్మలార యిం
తలు కనుఁగొంటిరే యిదిగొ తానఁట యిక్కడ నున్నవారితోఁ
గలహ మొనర్పవచ్చెనఁట కాదనిపట్టిన వీఁడు చేతిలో
పలికినిలేఁడు నేఁడు బహుభంగులఁ ద్రేలెడు నంచుఁ జూపినన్. —ఆ. ౫.

ఉ. మాటలఁ దాటకాంతకుఁడు మాటికిఁ దేనియ లొల్క వేఁడినన్
బాటలగంధిసిగ్గు ప్రతిభాషితచాతురి నడ్డగింపఁగా
గాటపుఁగాంక్షయన్ దరువుకత్తె మదిం ద్వరసేయ నల్లనన్
మీటినమ్రోయువీణవలె మించునెలుంగున భర్తతో ననున్. —ఆ. ౬.

ఉ. ఈవెదబుద్ధి నీకెజనియించెనొ యేజడుఁడైనఁ దెల్పెనో
హా విధిద్రోయ నీకు వశమా లవణాసురుబారిఁబడ్డవా
రీవలఁ గివ్వరైన మనిరే యిఁక నూర్వులుబ్రహ్మ లాఁగినన్
బావక పోదువోటు కొనసాగునె నీకిలువిద్య లిచ్చుటన్. —ఆ. ౭.

చ. వలసినభోజనాభరణవస్త్రధనాదులఁ జెంది తృప్తులై
పలుమఱుఁ జాలుఁజాలు నని పల్కెడువారలె కాని మాకుఁ గా
వలయుఁ గొసంగుఁడుం చనెడువారల మందున కైనఁ గాన మా
స్థలమున జానకీవిభునిజన్నమువైభవ మెన్న శక్యమే.—అ. రా.

పుష్పగిరి-తిమ్మన్న.

ఈకవి సమీరకుమారవిజయ మనెడి యేడాశ్వాసముల కావ్యమును రచియించి, భర్తృహరి నీతిశతకమును తెనిఁగించెను ఇతఁ డుత్తరరామాయణమును రచియించిన కంకంటి పాపరాజుతో సమకాలికుఁడు. ఇతఁడు రచియించిన సమీరకుమారవిజయ ముత్తరరామాయణ మంత మధురముగా లేదు, భర్తృహరినీతిశతకము సహిత మేనుఁగు లక్ష్మణకవి తెనిఁగించినదానికి చాలదు. కవి సంస్కృతాంధ్రములయం దసమానపాండిత్యము కలవాఁడే యయినను, కవనమం దక్కడక్కడ లక్షణవిరుద్ధము లయినప్రయోగములు కానఁబడుచున్నవి. ఈకవి నివాసస్థలము నెల్లూరిమండలములోని మోడేగుంట యయినట్లు నెల్లూరిమండలచరిత్రసంగ్రహమునందు వ్రాయఁబడియున్నది. ఇతఁ డాశ్వలాయనసూత్రుఁడు; విశ్వామిత్రగోత్రుఁడు; అప్పనార్యుని పుత్రుఁడు. ఇతఁడు సమీరకుమారవిజయమునందు తన్నుఁగూర్చి యిట్లు చెప్పుకొన్నాఁడు—

సీ. శ్రీహనూమత్పాదసేవాగతాధ్యాత్మ తత్త్వైకవిశ్వమహత్త్వవిదుఁడ
నాశ్వలాయనసూత్రిహాఁవిశ్వామిత్రగోత్రాబ్ధిచంద్రుఁడఁ గుశలమతిని
అలపుష్పగిరియప్పనార్యున కొబళాంబకును సుపుత్రుండ బ్రహ్మవేత్త
యైన వేంకటకృష్ణయాగ్రణికిని వేంకటాఖ్యకవీంద్రున కవరజుండ
సరసగుణయుతుండ వరకవిఁ దిమ్మనా। హ్వయుఁడ నేను జననమంగి మనుట
కల్ల ఫలముగల్గఁ గృతి యొక్కటిరచింప। నూహ సేయుచున్న నొక్కనాఁడు.

కవి పదునెనిమిదవశతాబ్దమధ్యము మొదలుకొని ౧౭౫౦వ సంవత్సరమువఱకును కవిత్వరచన చేసియుండవచ్చును. ఉత్తరరామాయణముయొక్క కర్తృత్వము నారోపించినట్టే దశకుమారచరిత్రముయొక్క కర్తృత్వమునుగూడఁ గొంద ఱీకవి కారోపింతురు గాని యీయారోపణము కేవల నిరాధారముగాఁ గనఁబడుచున్నది. ఈతని పుస్తకములనుండి కొన్నిపద్యము లుదాహరింపఁబడుచున్నవి—

భర్తృహరి నీతిశతకము

చ. మతిఁగలజాడ్యము ల్చెఱుచు, మాటల సత్యము గూర్చు, మానము
న్నతి నెనయించుఁ బాపములు నాశ మొనర్చు, మనంబునం బ్రస
న్నత గదియించు, దిక్కుల ఘనంబుగఁ గీర్తులు నించు, సాధుసం
గతి యిఁక నేవిశేషములు గల్గఁగఁజేయదు మర్త్యకోటికిన్.

ఉ. నీతు లెఱుంగువారు తము నింద ఘటించిన నెంచినన్, మహా
భూతులు పాయుచున్న నవి పోయినఁ, జావది నేఁడైనఁ గల్పసం
ఘాతవిరామకాలములఁ గల్గినఁ గల్గుఁగా కొంకెప్పుడున్
నీతిపథంబునం జెదర నేరరు ధైర్యరమాధురంధరుల్.

సమీరకుమారవిజయము

ఉ. ఆరజనీచరాగ్రణి లయావసరాసిలసీగదాకృతిన్
దారుణ రాఁగనంగొని యథాయథలై సుర లప్రరాడ్గుహాన్
దూఱెడువారు నిచ్చ నిధ మూలెడువారుఁ గపీంద్రువెక్కటిన్
జేరెడువారుఁ గావుమని చీఱెడువారునునై యలంకఁగన్. ఆ. ౧.

ఉ. ఎమ్మెయు జవ్వనంబుఁ గలయింతి పతిం బెడఁబాసి యొంటిగాఁ
గ్రిమ్మరుచోట గర్భము ధరించిన దన్నను గన్నకన్నవా
రెమ్మెయిఁ గల్ల లేమిఁ గణియింతురొ యెంతురొ బంధుకోటిలో
నమ్మకచెల్ల నానియమ మాఁగడ మాయెను నేమిచేయుదున్. — ఆ. ౨.

చ. రమణుఁ డొసంగ నుంగరము రాముకనుంగొను మన్నమాత్ర మే
ను మఱచి సొక్కి యొక్కటఁ గనుంగొనుచుండెడిఁ గాని తత్ప్రమో
దమునకు నాదికారణ మితం డని నెన్నన నైతి నెచ్చటన్
బ్రమద లెఱుంగ నేర్తురె కృపాళు రొసంగిన మేలు మారుతీ. — ఆ. ౩

ఉ. ఇంతవిచార మయ్యెఁ గద యేచుచు నీ వనభేదయుక్తి నీ
స్వాంతమునందు వర్తిలుట నన్యుఁడు నేనను చింత యెంతప
ర్యంతము జంతుసంతతిహృదంతమునందు వసించు నంతప
ర్యంతము జన్మమృత్యువుల కంతములేదు సమీరనందనా. — ఆ. ౪.

ఉ. రావణుగీవణున్ సమరరంగమునం గుదియించినట్లు నా
లావున కోహటింపక నిలం గలవే రఘురామ వేత్తవై
యీవెడ క్రోఁతి నెక్కుకొని యేటికి వచ్చితి వింత దూఁగ మ
య్యో విజయంబు చెందఁగలఁడో టు శతాస్యుఁ గడంగి రుద్రుఁడున్. — ఆ. ౫.

సీ. హీనాధిక్యము లెంచి పంచితివొ నన్నేమాడ్కిఁ బొమ్మంటి వా
హీనాత్ముం గపిమాత్రుఁ బిల్పుటకుఁ బోనీ యొక్క వేగంబునం
దైనన్ నాకు సమానుఁ గే పలుకు లేలా నీవె యిట్లాడఁగా
నేనా కాదను వాఁడ నంచడలు పక్షీంద్రు న్నిరీక్షించుచున్. —ఆ. ౬.

శా. అన్నా నే మునివాఁడ లేవ వశిలే దండంగొ నీ వేగఁగా
సన్నాహంబున వచ్చినాఁడ వుగదా జాగేల నీకేల నీ
సన్నంబైన మదీయ పుచ్ఛ మొక పార్శ్వంబందుఁ బొందించి పా
ష్మన్నున్ దన్మహిమం బెఱుంగ కుసితాహంకారపంకాత్ముఁడై. —ఆ. ౭.

ధరణిదేవుల-రామమంత్రి.

ఈకవీంద్రుఁడు నూఱు సంవత్సరముల క్రిందట దశావతారచరిత్ర మను పదియాశ్వాసముల గ్రంథము రచియించెను. ఇతఁడు నియోగిబ్రాహ్మణుఁడు; తిమ్మయామాత్యుని పౌత్రుఁడు; ధరణిదేవుల నాగయామాత్యునకును పణియమ్మకును పుత్రుఁడు. అందందుఁ గొన్ని వ్యాకరణదోషము లున్నను, ఈతనికవిత్వము రసవంతమయి హృదయరంజకముగా నుండును. కవియే తన్ను సంస్కృతాంధ్రభాషా ప్రవీణునిగాను దినైక ప్రబంధనిరచనదక్షునిగాను

క. నను సంస్కృతాంధ్రభాషా। ఘనుతు దినైకప్రబంధనిరచనదక్షున్
గనుఁగొని యిట్లనిపలికెన్। వినయంబు నయంబు హెచ్చ విబుధులు మెచ్చన్.

అను పద్యములోఁ జెప్పుకొని, తన్నష్టభాషాకవిత్వ తత్త్వసంవేదినిగా కృతిపతి పొగడిన ట్లీక్రిందిపద్యములోఁ జెప్పుకొన్నాఁడు—

సీ. శ్రీరామకరుణాప్రసారూప్య సంస్కృతప్రాకృతాద్యష్ట భాషాకవిత్వ
తత్త్వసంవేది ధరణిదేవుల తిమ్మయామాత్యపౌత్రుండ వన్నదాన
ముఖ్యనానాదానముదితభూసురచంద్ర నాగప్రధానేంద్ర నందనుఁడవు
పణియమాంబాగర్భపాథోధిచంద్రుఁడ వాత్మవిద్రఘునాయకాద్యనుజుఁడ
వాప్తుఁడవు గాన వేఁడెద నందముగను
గృష్ణుదశావతారముల్ గృతి యొనర్చి
యంకితము సేయు నాకుఁ బ్రఖ్యాతి నీకు
మహితగుణసాంద్ర రామయామాత్యచంద్ర.

కవి తనదశావతారచరిత్రము నాటుకేలిసరాగి యగు మగదల కృష్ణమంత్రిం దనకంకితముచేసి యాతఁడు విద్యానిధి యైనట్లు

ఉ. నారదమా! యేమి? సురనాథ! విశేషములేమి? వింటిరో
సారసగర్భుచెంగటను శారద లేదఁట! యెందు నిల్చెనో?
యారసి చూడుఁ డామగదలాన్వయదుగ్ధపయోధిచంద్రమం
దారము కృష్ణమంత్రి రసనాస్థలినిల్చెను, యుక్తమే కదా!

ఇత్యాదిపద్యములలో నభివర్ణించియున్నాఁడు. కృతిపతియైన కృష్ణమంత్రి గత శతాబ్దాంతమునందు నెల్లూరిమండలములోని ప్రళయకావేరిపట్టణమునం దొలాందావారి ద్విభాషిగా నుండెను. కంకంటివారి యుత్తరరామాయణమువలెనే యీదశావతార చరిత్రమును పుష్పగిరి తిమ్మన్నచే రచియింపఁబడినదని కొందఱు చెప్పుచున్నారు గాని కవు లిద్దఱు నేకకాలమునం దొక్కదేశములో నుండుటతక్క వారిమాట కాధార లేశమును గానరాదు. దశావతారచరిత్రకవిత్వము పుష్పగిరి తిమ్మన్నదైన సమీర కుమారవిజయకవిత్వముకంటె మృదుతరముగాను మధురతరముగాను కనఁబడు చుండుటచే దశావతారచరిత్రరచనలోఁ బుష్పగిరి తిమ్మన్న కేమియు సంబంధము లేదని నిశ్చయముగాఁ జెప్పవచ్చును. దశావతారచరిత్రములోని పద్యములఁ గొన్నిటి నిం దుదాహరించుచున్నాను—

శా. ఆవార్తన్ విని పింప దైత్యపతి రోషావేశ ముప్పొంగ నా
హా! వేదంబుల యాగభాగము లమర్త్యశ్రేణికే కాని మా
కేవంకం బనిలేకయుండుటగా నేర్పాటు గావించెఁ గా
నీ వేగంబ హరించి తదృత్విజుల భగ్నీభూతులఁ జేసెదన్.—ఆ. ౧.

ఉ. కన్నులు బ్రహ్మ రెండొసఁగఁ గాఁగలేవని గౌతముండు తాఁ
గన్నులు నే యొసంగె నధికంబుగ నష్టమదాంధకార సం
ఛన్నము లౌటచేఁ దెలియఁజాలవు తన్మదకారణంబు నిం
కన్నను గూడ నీయుపకారము చేసెదఁ జూడు వాసవా.—ఆ. ౨.

ఉ. వీరుఁడ వంచు నిన్నుఁ బదివేలవిధంబులఁ బ్రస్తుతించుచున్
వారిధిభర్త తెల్పిరని వచ్చితి మెచ్చెద నేఁడు చూపు నీ
వీరతఁ గాందిశీకపదవీరతవృత్తిని మోఁతోపున్
జాలెదవన్నఁ బో విడఁడు స్వర్ణవిలోచనుఁ డంచు నుగ్రుఁడై —ఆ. 3.

చ. గెలిచితి సర్వదేవతలఁ గేశవుఁ డొక్కఁడె తక్క నాతనిన్
గెలిచినఁగాని యీగెలుపు గెల్పుటకాదని యొట్టు లంటిరేఁ

దోఃఖత శరాహమై యనఙుఁ ద్రుంచు టెఱుఁగర నూతు దీర్పఁగాఁ
గలుగని గల్పదేల బలగౌరవ మేటికి శౌర్య మేటికిన్ —ఆ. ౪.

ఉ. ముక్కున గవ్వ గిట్టి నిను ముందుగ నీడిచి తెమ్మటంచు మా
రెక్కపి కోఁడు పంచె విభురా దివిజర్షభ యింక నెట్టటుల్
దిక్కులు మూచిన న్వీడువ దేవర వైనను నీకువెక్క నే
ద్రొక్కఁడుఁగాని రమ్మనుచు ముందలఁ బట్టఁగఁడంగ నద్భుతిన్ —ఆ. ౫.

శా. ఔరా విప్రుఁడనంచు నిన్ జాలకసేయ న్వచ్చితే మంచిదే
గారమ్మా ధను పూని నీదయినశాస్త్రం జేను శిక్షించెదన్
శూరత్వంబులు మీకెయుంచు నజుఁ డెచ్చో ముద్ర గావించెనే
లేరా బ్రాహ్మణశూరు లింకిటను గల్పింతు న్ననుం జూడుమా.—ఆ. ౬.

శా. ఔనౌ నే వెలయాలనా యిటులు నీ వాదన్ బళా చాలుఁ బో
షో నవ్వే రెవరైన విన్న నిట నేర్పు ల్చూపఁగా వచ్చితో
నానాథుం డిదివిన్న యంతఁ దను న్నాకు న్మహావాని రా
దా నావ టికులాంగనామణికి న్యాయం బౌనె యీమార్గముల్.—ఆ. ౭.

మ. ఎలనాగా! తలయెత్తి చూడఁగదె నీ రెన్నారు నీ రేమికా
వలెనే యుంచవె యమ్మలక్క లట క్రోవన్ వేఁడ నీపైఁడిచా
యలచే మించువతంసు నావఱఁగయానం చంటతన్ సిగ్గుచేఁ
దలవంచు న్మహికన్య వాగ లదె యాతం డెవ్వరంచు న్నగన్.—ఆ. ౮.

ఉ. ఓయిగుగాకు బోఁడి! కఃవో విఃవో యిఃయేమిచెల్ల నీ
ప్రాయపుఁదోయజాక్షులెడఁబాయ రొకప్పుడు ప్రాణనాథులం
బ్రాయుచు రిత్తఁబుత్తురటె పల్కవె నీమరి నన్న యట్టియూ
నాయకుఁ దెల్పవే త్రిదశనాయకుఁ గోరనఁ దెచ్చికూర్చెదన్.—ఆ. ౯.

శా. సంభాభోగముఁగోరి యాగములకర్థం బెల్ల వెచ్చించుటా
యంభోదమ్ములఁజూచి చెర్వుజల మాద్యంతంబు చల్లించుటల్
సంభోగేచ్ఛ జనించెనేని మఱి వేశ్యారత్నము ల్లేరొకో
సంభోగింపఁగరాద కాసను జనల్ జ్ఞానంబు సామాన్యమే.—ఆ. ౧౦.

దిట్టకవి—నారాయణకవి.

ఇతఁడాఱువేల నియోగిబ్రాహ్మణుఁడు; కాశ్యపగోత్రుఁడు; పాపరాజకవి పుత్రుఁడు. ఇతఁడు రంగరాయచరిత్రము ప్రబంధముగజేసి దానిని కృష్ణామంద

లములోని నర్సారావుపేట జమీదారగు మల్రాజు రామారాయనింగారి కంకితము చేసెను. ఈగ్రంథము ౧౭౫౦ వ సంవత్సర ప్రాంతములయందు రచియింపఁబడినట్టు తెలియవచ్చుచున్నది. ఈపుస్తకము ౧౭౫౭ వ సంవత్సరమున బొబ్బిలికోటవద్ద శ్రీరావు రంగారాయఁడుగారికిని ఫ్రెంచిసేనానాయకుఁడగు బుస్సీగారితో నప్పటి కేగిన పూసపాటి విజయరామరాజుగారికిని జరిగినయుద్ధము భారతయుద్ధముగా వర్ణింపఁబడినది. బొబ్బిలికోటవద్ద జరిగిన యుద్ధక్రమమును బొబ్బిలిసంస్థాన చరిత్రమును కథా సందర్భమున నిందు కొంత వివరించుచున్నాను.

బొబ్బిలిసంస్థానస్థాపకుఁ డయిన పెద్దారాయనింగారును విజయనగరరాజ్య సంస్థాపకుఁడయిన పూసపాటి తమ్మిరాజుగారివలెనే ౧౬౫౨ వ సంవత్సరమునందు శ్రీకాకుళపు సర్కారు ఫౌజుదారగు షేర్ మహమ్మదుఖాన్ యొక్క ప్రాపుచేత నక్కడకువచ్చెను. పెద్దారాయనింగారు మహాశూరుఁడయి రంగవారయనుచోట జరిగినయుద్ధములో శత్రువుల సంహరించి షేర్ మహమ్మదుఖాన్ యొక్క పుత్రుని ప్రాణములు రక్షించినందున, షేర్ మహమ్మదాయనకు రాజామహుండా కవులునకిచ్చి రంగరావని బిరుదునిచ్చెను. రంగరావను బిరుదనామమునొందిన యీ పెద్దారాయనింగారు పద్మనాయకవంశజులయిన వెలమదొరలలోనివాఁడు. ఈయనయు వేంకటగిరి సంస్థానప్రభువులును పిఠాపురసంస్థానప్రభువులును ఏకవంశములోనివారే. రాజాము కౌలునకుఁ బుచ్చుకొన్నతరువాత పెద్దారాయనింగారు క్రొత్తగా నొక పేటను కోటను గట్టి దానికి తన యుపకర్తపేరట బెబ్బులియని నామకరణము చేసెను. షేర్ మహమ్మదులోని "షేర్" అను పదమునకు బెబ్బులియని యర్థము. బెబ్బులి యనునదే కొంతకాలమునకు బొబ్బిలిగా మాఱినదఁట! అప్పటినుండియు క్షత్రియులయినవిజయనగరమువారికిని వెలమవారయిన బొబ్బిలివారికిని వైర మారంభమయ్యెనని చెప్పుదురు.

మన ప్రస్తుతచరిత్రారంభకాలమున ౧౭౫౬ వ సంవత్సరమునందు ఉత్తరసర్కారులు ఫ్రెంచివారికియ్యఁబడఁగానే ఫ్రెంచిసేనాధ్యక్షుఁడగు బుస్సీదొరగారు రాజమహేంద్ర శ్రీకాకుళ సర్కారులను విజయనగర సంస్థానాధిపతులగు విజయరామరాజుగారికి కౌలునకిచ్చుట కంగీకరించెను; అటు జరగినపక్షమునఁ దనస్థితికి భంగము కలుగునని దూరాలోచనచేతఁ దెలిసికొన్నవాఁడయి యప్పటి బొబ్బిలి ప్రభువుగారగు రంగారావుగారు రాజ్యము ఫ్రెంచివారియధీనము కాకుండఁ జేయుటకయి యితరసంస్థానాధిపతులతోఁ జేరి కృషిచేసెను. ఈకృషికి శ్రీకాకుళపు నవాబగు జాఫరల్లీఖాన్ యొక్క ప్రోత్సాహముసహితము విశేషముగా నుండెను తిరుగఁబడిన జమీదారుల నదిమి కప్పములు గొనుటకయి బుస్సీగారు ౧౭౫౬ వ సంవత్సరము

నవంబరు నెల ౧౬ వ తేదిని ౫౦౦ యూరపియనులతోను ౪౦౦౦ సిపాయీలతోను హైదరాబాదునుండి బైలుదేరి డిసంబరు నెల ౧౯ వ తే-కి రాజమహేంద్రవరమువచ్చి చేరెను. విజయరామరాజుగారు పదివేల స్వసేనతోను, ఇతర రాజులతోను, వచ్చి యచట బుస్సీని చేరెను. తమదేశములోనుండి విజయనగర రాజ్యములోనికిఁ బాఱెడు కొండ కాలువలను మళ్ళించి బొబ్బిలి రంగరావుగారి కాపులు తమభూములకుఁ బెట్టుకొన్నందునను, దేశస్వభావమునుబట్టి బొబ్బిలివారిని సాధించుట సుసాధ్యము కాకపోయినందునను, విజయరామరాజుగారు మనస్సులో బొబ్బిలిరంగారావుగారిపై ద్వేషమువహించి యాయనను శిక్షించుటకయి బుస్సీని తనయావచ్ఛక్తిని వినియోగించి బహువిధముల ప్రోత్సాహపఱిచి పురికొలిపెను. అందుమీఁద బుస్సీగారు బొబ్బిలిరాజ్యమును విడువవలసినదనియు, దానికి బదులుగా నధికవైశాల్యమును మూల్యమునుగల దేశ మియ్యఁబడుననియు, రంగారావుగారికి వ్రాసిరి. రంగారావుగారు పితృపితామహాగత మయిన బొబ్బిలిరాజ్యమును విడుచుట కంగీకరింపక పోవుటయేకాక తక్కిన సంస్థానాధిపతులతోడిపాటుగా రాజమహేంద్రవరమునకువచ్చి యాతనిని సందర్శింపకపోయెను. రాజమహేంద్రవరమున బుస్సీని దర్శించుటకయి విజయరామరాజుగారు మొదలగు సమస్త రాజులును వచ్చినప్పుడు రంగరావుగారు రాకుండుట లోనుగాఁగలకథను గవి యిట్లు చెప్పినాఁడు—

ఉ. రాజమహేంద్రపట్టణవిరాజదమూల్యతలంబున న్సము
త్తేజిత మైనగారితమ దీరెటసీమును గోటిలింగవి
భ్రాజిత మైనయొక్కనవపాదపమంజులవిష్కుటస్థలిన్
రాజితలీలఁ జేరె శిబిరంబు వడి న్వడియించె వేడుకన్.

* * * *

ఉ. కాయినికత్వ మేర్పడ సికాకుళపున్నగకారులోని సమీ
దారుల రామరాజవసుధావలయేశ్వర ముఖ్యుల న్స్వకం
బారఁగఁ బిల్వఁబంపమని హైదరుజంగున కానతీయఁ ద
ద్వారుపచరిక్రమంబునను సత్వరుఁడై పిలిపించె వారలన్.

ఉ. పాయనివేడ్క విద్విషదపాయకరాయతబాహుశౌర్య లో
పాయకరాయఁడుం గిమిడిపట్టణపుంబృథివీశ్వరుండు నా
రాయణదేవుఁడున్ నరసరాజు మఱిం గొలుగొండ మన్నెపున్
రాయఁడు నాదిగాఁగలధరావరు లందఱు వచ్చి రత్తఱిన్.

గీ. ఉద్ధతులమూఁకుల సందర్శనోత్సుకత్వ । మూర్తిఁ జట్టాడ నాడాడ నలరుమన్న
దొరలువచ్చిరమానవద్రోహిప్రసంగ । కలితుఁడగు రంగరాయఁడొక్కరుఁడుదక్క

సీ. నిజభుజాదండ నిర్నిద్రకోదండంబు గాండీవకార్ముకక్రమముఁ జూపఁ
జరమభాగస్ఫుటచ్ఛటులతూణీరముల్ కవదొనసొంపు సంఘటిలఁజేయ
నాసీరముఖరనానాశంఖికధ్వనుల్ దేవదత్తరవోద్వృత్తిఁ దెలుప
నూరెలఁ బరతెంచుజులుమతీ తేజీలు ధవళాశ్వములమస్తు ప్రదర్శింపఁ
గలియుగార్జునుఁడౌనని యూఘునుఁడటంచుఁ । దను జగజ్జన మెన్న నద్ధతులమల్లు
వీక్షణాపేక్ష నేతెంచె విజయరామ । రాజరాజన్యలోకమార్తాండమూర్తి.

* * * *

చ. నలువదివేలకాల్బలము నాలుగువేలతురంగమంబులుఁ
నలువదియేఁబదేనుఁగు లనంతములైనశతఘ్నికాచయం
బులు నొకవేయిలొట్టియ లపూర్వవిభావిభవంబు దెల్పుచుఁ
గొలువ ఘరానుతేరిఁ గనుఁగోఁ జనుదెంచెను రాజతిత్వరన్.

ఇట్టికావ్యమునందు విజయరామరాజుగారు నలువదివేలకాల్బలముతో వచ్చినట్లు చెప్పఁబడినను, ఆయనవెంట నిజముగావచ్చినసేన పదివేలని చరిత్రకారుఁడైన యార్మ్ దొరగారు వ్రాసియున్నారు. ఇట్లుండఁగా రంగారావుగారియనుమతిమీఁదనే బుస్సిదొరగారు కొందఱు సిపాయిలను బొబ్బిలిరాజ్యముమీఁదుగా మఱియొకచోటికిఁ బోవుటకుఁ బంపిరి. విజయరామరాజుగారి తంత్రమువలననో రంగారావుగారి బుద్ధిపూర్వకమయిన యేర్పాటువలననో పంపఁబడిన సిపాయీలు త్రోవలో బొబ్బిలిభటులచే నెదిరింపఁబడి ముప్పదిప్రాణములను గోలుపోయి మరలి రావలసినవారైరి. ఈయవమానము విజయరామరాజుగారి ప్రోత్సాహమునకు తోడుపడఁగా, బుస్సీగారు రంగారావుగారిని శిక్షించి వారిని కుటుంబసహితముగా బొబ్బిలినుండి వెడలఁదోలుటకు నిశ్చయించుకొనెను. ఇన్నూట యేఁబండ్రు గుఱ్ఱపు రౌతులును నాలుగు ఫిరంగులును గల ౭౫౦ యూరపియనులతోను, విజయరామరాజుగారి భటులును సిపాయీలును గలిసిన ౧౧౦౦౦ స్వదేశీయపదాతి బలముతోను బుస్సీగారు బొబ్బిలికోటమీఁదికి దండు వెడలిరి. బొబ్బిలికోట యిన్నూరుగజముల వైశాల్యముగలిగి నలుచదరముగానుండెను. నాలుగుమూలలను నాలుగు గుండ్రనిబురుజులుండెను. వెలుపలిగోడలయెత్తు ఇరువదియడుగులయినను, లోపలిబురుజులయెత్తు పండ్రెండడుగులే యుండెను. పయినిగోడలవెడల్పును పండ్రెండడుగులుండెను. ఇట్టి మట్టికోటయొద్దకుఁబోయి బుస్సీగారు తన సేనలను నాలుగుభాగములుచేసి యొక్కొక్కభాగమున కొక్కొక్క ఫిరంగినిచ్చి

నాలుగుభాగములను నాలుగు బురుజులను సాధింప నియమించెను. ౧౭౫౭ వ సంవత్సరము జనేవరు నెల ౨౪ వ తేదిని ప్రాతఃకాలముననే యుద్ధ మారంభమయినది. శత్రువులు కోట బురుజులమీఁద ఫిరంగులు కాల్ప నారంభింపఁగానే, కోట లోపలి వా రగ్నిభయముచేత బురుజులమీఁది కప్పులీసివేసిరి. ఉదయమున జాము ప్రొద్దెక్కువఱకు బురుజులగోడలలో విశేషభాగము కంతలుపడినవి. అప్పుడు శత్రువులయొక్క నాలుగుభాగములు నొక్కసారిగా నిచ్చెనలు గైకొని లగ్గలు పట్టుటకయి కోటగోడను సమీపించి గంటవఱకును ప్రయత్నించిరి గాని కోటను రక్షించుచున్న భటులయొక్క శౌర్యమువలన నొక్కరు నైనను కోటగోడ నెక్కలేకపోయిరి. కోటలోపలి వారు స్త్రీలతోఁగూడ వేయింటికి లోపుగానే యుండిరఁట. కోటగోడల నెగఁబ్రాఁక ప్రయత్నించినవారి నేకులు గాయములతోఁ గ్రిందఁబడిరి. ఈ యుద్ధమును కవి యిట్లు వర్ణించుచున్నాఁడు—

ఉ. ఉగ్గపరాసుమండల ముదగ్రతమై బిరుదు ల్వహించుచున్
లగ్గల కెక్కరా బురుజులం దగుచున్న కుమార సైన్యముల్
వెగ్గలమైన కోపమున వెక్కుచు న్నరుమాడువీఁక చే
నగ్గలికం దుపాకులఁ గిలార్చుచు నేయుచు గోయుచు న్వడిన్.

సీ. పొంకులు రాఁగ గాఁగి పొరలునూనియు మంచి గరగలవంచి యక్కలఁగఁజల్లి
జిగురుటంబలి వేఁడి దిగుపాలజాలఁగా గుండలకొలఁదిగాఁ గుమ్మరించి
వసియూర్పు దారుమంత్రసముత్కారంబులు మేను లుచ్చిచనంగి మీఁటివైచి
యొండొంటిఁ దోడుగా గుంపియ నాదల ల్గతిచేసి త్రుంపఁగా గుండ్లువొలపి
బిరుసులఁ దరల్చి క్రొంబొగల్గురియునిశపగొట్టములదాల్చి మొద్దీటెగములఁ గ్రుచ్చి
చిచ్చుబుడ్లఁ గల్చి నిస్త్రింశతతులఁ బొడిచి పడఁద్రోచిరా సేనఁ గడిమితొలఁగ.

లగ్గలెక్కి కోటపట్టుటకు శక్యముకాకపోఁగా నంతట నాప్రయత్నము నుమాని శత్రువులు వెనుకకుమరలి మరల కోటమీఁద ఫిరంగులను గాల్వ నారంభించిరి. అట్లు ప్రయోగింపఁబడిన ఫిరంగిగుండ్ల నొకచోటఁ గవి యీవిధముగా వర్ణించెను—

సీ. ఱట్టికోట యగల్చి దారుణోష్మలు గ్రమ్మ వంతదారుకు డాని వ్రాలునవియు
నిసుపతల్పుల ఘణిల్లునఁ దాఁకి పిడిఁ జెకి దవలిమైవచ్చి విట్టవియునవియు
ద్వారబంధపుఁ గమ్మిదూఱి యవ్వలికంట దుస్సిపొలఁగ నొడి డొల్లునవియు
గుఱితప్పి పఱతెంచి కోటముంగలిహస్తినఖపుదుమ్ములరేఁచి నక్కునవియు
నగుచునొండెడ నెడయీకయుంటితూగి బంతులాడినపగిది గుభాల్గుభాలు
నిపదభయదార్భటుల శతఘ్నిప్రయుక్తతాళఫలసన్నిభాయస గోళతతులు.

ఈఫిరంగిప్రేట్లచేత కోటగోడ మఱింత పడిపోయి శత్రువుల కెక్కువయానుకూల్యమును కలిగించినది. అయినను కోటగోడలు పగులుటచేత కోట కావలివారి ధైర్యకంచుకము పగులక వారిని మఱింత తెంపరులనుగాఁ జేసినది. కోటకావలిభటులు తమప్రాణముల కాశపడక తమగుహలనుకాపాడుకొను బెబ్బులులవలెఁ బోరాడిరి. ఫిరంగిగుండ్లు చిత్తజల్లుగాఁ గురియుచున్నను వెనుకతీయక వీరభటులు శత్రువులు కోటగోడల కెగఁబ్రాఁకఁగానే యీటెలతోఁ గ్రుమ్మి క్రిందఁబడఁద్రోయవలెనన్న నిశ్చయముతో నిశ్చలులై కాలుగదల్పక బురుజులమీఁద నిలువఁబడిరి. ఆగ్నేయాస్త్రముల నసహసించెడు శతఘ్నికా ప్రయోగములముందఱ కేవల భుజవీర్య మేమి పనికివచ్చును? క్రిందనున్న సైనికులు గుఱిచూచి తుపాకులు కాల్చి బురుజులమీఁద నున్నవారి ననేకులను రూపుమాపిరి. స్వదేశ సైనికులయం దీవఱకెన్నఁడు నేయుద్ధమునందును గనియుండని యిటువంటి యసమాన ధైర్యసాహసముల కద్భుతపడి శత్రువులు హితము పలుమాఱు వారి కభయప్రదానము చేసిరిగాని యావీరభటులు శత్రువుల వాక్యములను తిరస్కారపూర్వకముగా నిరాకరించి తమదేహములలోఁ బ్రాణము లుండఁగాఁ దమతావు విడువమని యక్కడనే సుస్థిరులై పర్వతములవలె నిలువఁబడిరి. అప్పటికి మధ్యాహ్నము రెండుగంట లయినను శత్రువులలో నొక్కఁడును కోటగోడ నెక్కలేకపోయిరి. అందుచేత శత్రువులు కొంతసేపు యుద్ధము నిలుపవలసినవారైరి. అప్పుడు రంగారావుగారు శత్రువులతోఁ బోరాడి గెలువఁ గలనన్నయాశ వదలుకొని తనవారిని బిలిచి యాలోచించి యంతఃపురస్త్రీలు శత్రులచేతులలోఁ బడి మానము గోలుపోకుండ కాపాడవలెనని నిశ్చయించి శిశుసహితముగా వారినందఱిని సంహరించుటకయి కొందఱిని నియమించెను. వారప్పుడే చేతులలో బాకులతోను బల్లెములతోను గదలిపోయి యంతఃపురమును వాకిట గడ్డిరించి గృహముల కగ్నితగిలించి యాసంఘాత మరణమునుండి తప్పించుకొని ప్రాణములఁ దక్కించుకొనఁ బాఱుతెంచిన శిశువులను సహితము పుత్రులనక దయాపాత్రులనక క్రూరులై పొడిచి చంపిరి. ఈ దారుణకృత్యమును గవి యిట్లు చెప్పియున్నాఁడు—

క. చెలికాని వంశసంభవు। లలఘుతరస్థైర్య ననిచె నవరోధవధూ
కులకంఠనాళకృంతన। కలనాదారుణవిధానకరిణత నెఱపెన్.

తే. అతఁడు నభిమానరక్షణాగ్రప్రచార। దారుణాకార సాహసౌద్ధత్యమమర
నంతిపురి కేఁగ మొరసె దిగంతరములు। ధరణి వడవడవడఁకె భూతలము బెగడె.

తే. రాయమణిరాణి తనకుమారాగ్రయాయి । నప్పడ కొండొకదాదికి నప్పగించెఁ
గోటవెడలించి బ్రతికించు కొమ్మటంచు । నట్లు కావించె నాదాయి యదలువోడమ.

* * * * *

క. ఘననిశితఖడ్గధారను । మొనకొని చెలికానివంశమూర్ధన్యుఁడు పెం
పున వడివడి నంతఃపుర । వనితాజనతాతిచిత్రవధ నడిపెన్.

తే. తక్కుఁగల యట్టి యభిమానధనులు వెలమ । లొక్కనూటిఁడ్డవా గనలోగ్రశస్త్ర
నిహతులై రంగనాథుసహితు లగుచుఁ । దస్వదారుణమెంతని తలఁప వచ్చు.

దురభిమానజనితమైన వధూశిశుసంహారక్రూరకార్యము ముగియఁగానే ప్రాణములకు తెగించి వారందఱును మాల యుద్ధోత్సాహముతో వచ్చి తమస్థానముల నిలిచిరి. నాలుగుభాగములలో నొకభాగమునకు నాయకుఁడైన లాడోరగారు మార్గమునుండి యగ్నిదాహమును జూచి లోపలి కావలిసేనలు పలుచగుటకని పెట్టియాలోపల లగ్గలు పట్టుటకయి మరలవచ్చెను. నిచ్చెనలతో పయికెక్కఁ బ్రయత్నించిన వారనేకులు నిహతులయి క్రిందఁ గూలుచు వచ్చినను కొందఱు క్రూరు లొక్కబురుజుపై నెక్కి నిలువఁగలిగిరి వారి వెంబడినె వతి కొందఱును కోటగోడల కెగఁబ్రాకి బురుజు చేరిరి. రంగారావుగారు శత్రువులను బాఱఁద్రోలి యాబురుజు రక్షింపవలెనన్న యాశతో హతశేషులైన భటులతో వచ్చుచు నొకగుండుదెబ్బతో నేలఁగూలి వీరశయనము నొందెను. ఆయనపాటువలనఁ గలిగిన సక్రోధశోకోద్రేకముతో లోపల నున్న వీరభటబృందమంతయు పగదీర్చుకొనవలెనన్న దృఢనిశ్చయముతో తక్కిన బురుజులను విడిచి యక్కడకు వచ్చిచేరెను. అంతట తక్కిన శత్రుసేనాభాగములు మూడును వరుసగ నాయాబురుజులను జేరి యరక్షితము లయియున్న యామూడుబురుజుల ననాయాసముగా సాధించి లోపలఁ బ్రవేశించెను. ఇట్లు లెక్కకు మిక్కిలిగా శత్రుసేనలు నానాముఖముల వచ్చి చుట్టుముట్టుచు లోపలనుండి కోటను సంరక్షించుచున్న వీరభటులలో నొక్కఁడైనను బాఱిపోవుటకుఁగాని శత్రువులకులోఁబడి శరణు చొచ్చుటకుఁగాని ప్రయత్నింపలేదు ప్రతిభటుఁడును వీరరసము మూర్తీభవించినట్లు యుద్ధపాణియై శత్రువున కభిముఖముగా నడిచి శత్రువును పొడిచి తాను పడిపోవుచు వచ్చెను; గాయపడి భూమిమీఁద నొరిగినతరువాతసహితము ప్రాణములు బొందిలోనుండి వెడలువఱకును దన చేతిలోని ఖడ్గముతో దాపునకు వచ్చిన శత్రువును నఱకవలెనన్న ప్రయత్నమును మానలేదు. ఇది కావ్యమునందుఁ గవిచేసినవర్ణనముగాక యింగ్లీషు చరిత్రకారుఁడు వ్రాసిన సత్యాంశ మగుటచేత బొబ్బిలికోటలోని రణశూరులుచూపిన విచిత్రపౌరుష మత్యంతశ్లాఘాపాత్ర మయిన దనుటకు సందేహములేదు. ఇట్టి వీరవధ

కొంతసేపటి కెల్లను సంపూర్ణ మయిపోయెను. కోటలో జరిగినప్రాణనాశనమునకుఁ గరితహృదయు లయినశత్రువులుసహితము జాలిపడుచువిచారించుచున్న యాసమయమునందు గుంపులోనుండి వృద్ధుఁడొకఁడొకబాలునిఁ జంకఁ బెట్టుకొని తిన్నఁగా లాదొర యున్నచోటికి వచ్చి „ఈశిశువు రంగారావు కుమారుఁడు. తండ్రి యభీష్టమునకు విరోధముగ నే నీబాలునిప్రాణములను గాపాడితిని" అని పలుకుచు, ఆసేనానాయకునకు బాలు నొప్పగించెను. లాదొర యప్పుడే యాబాలకుని బస్సీదొర యొద్దకుఁ బంపఁగా, అతఁడాశిశువును వృద్ధుని తనసేనానివేశమునం దుంచి యాదరించి యాశిశువుయొక్క సంరక్షణభారమును తాను వహించి శత్రుభయమువలన శిశువును గాపాడుట కయి తగినకావలివారిని నియమించి యప్పుడే యాశిశువును బొబ్బిలిరాజ్యమున కభిషిక్తునిఁ జేయుచు లేఖ్యములు వ్రాయించెను.

నాఁటిరాత్రియు మరుసటిదినములు రెండును గాయములు తగిలినభటులయొక్క చికిత్సలు మొదలయినపనులతోఁ గడచెను. మూఁడవనాఁ డర్ధరాత్రమునందు విజయరామరాజుగా రుండినపటకుటీరములో గొప్పసంక్షోభ మొకటి పుట్టెను. రంగారావుగారు నిహతు లయినదినమునం దాయన నమ్మిన వీరభటులు నలుగురు కోటలో నేమూలనో దాఁగియుండి చీకటిపడినతరువాత కోటదాటిపోయి విజయరామరాజుగారిశిబిరముల వెనుక నున్నయడవిఁ జొచ్చి చేరువపొదలలో దాఁగియుండి సమయము నిరీక్షించుచు వారక్కడ రెండుదినము లుండి మూడవనాఁటిరాత్రి స్కంధావారము సద్దడఁగినతరువాత నిశీథసమయమునందు వారలు నిద్దురపొదలలో నుండి వెడలివచ్చి కావలివాండ్రను మోసపుచ్చి గూఢముగా విజయరామరాజుగారు నిద్రించుచుండిన పటకుటీరములో వెనుకవైపునుండి ప్రవేశించి యిద్దఱు నొక్కసారిగా తమబాకులతో పొడిచి విజయరామరాజుగారి వక్షస్థలమును గంతలు చేసిరి. మొదటిపోటుతో మేలుకొని విజయరామరాజుగారు మూర్ఛగానే వెలుపలినుండి కావలిభటుఁడు వచ్చి తుపాకితో కాల్చెనుగాని గుఱితప్పిపోయెను. ఇంతలో నితరభటులును వచ్చి వెంటనే యాహంతకులను జంపి ముక్కముక్కలుగా నఱికివేసిరిగాని యీలోపలనే వారువిజయరామరాజుగారిని ముప్పదిరెండుచోట్లఁ బొడిచిరి. ఇట్లు విజయరామరాజుగారిని జంపినతఁడు తాండ్రపాపయ్య యని కవి యిట్లు చెప్పియున్నాఁడు—

గీ. కదిసి పైఁబడి యొకకేల నదిమిపట్టి । వాఁడివాలున వక్షశ్శికవాటపాట
నంబుఁ గావించె నతనియానాభికుహర । నిర్దళితాంత్రవ్రజంబులు వెలికినుబుక.

* * * * *

మ. అపు డాంధ్రకులాభిమాననిధి యాహా రాజదేవేంద్ర నీ
విపులప్రాభవశక్తి నీనిఖిలపృథ్వీభారధారేయతా
నిపుణత్వంబును భాగ్యముల్ వృథ చుమ్ నీచేయుదుశ్శ్రేష్ట ని
ట్లుపభోగింపఁగనయ్యె నిట్టివెతయుం దద్వృత్తి వర్తిల్లఁగన్.

గీ. తాంధ్రపాపయ్యసలుపుధార్త్యంబువలన। క్షత్రవర్యుండుపులివాతికండయయ్యె
ననెడు రీవడపుట్టెనంత నయ్యవనినాథు। బలగు లార్తరవంబునఁగలయ బట్వె.

సీ. తనచావు సర్వసిద్ధంబుగా మదిఁగోరి సాహసకృత్యకినై చన్నవానిఁ
దనయేలికవిరోధదర్పంబుమాపుట పరమార్థమని యేచుపడుచువానిఁ
దనపడినట్టిబన్నములకుఁ గార్యంబు ఫలరూపమని యాత్తఁదలఁచువానిఁ
దనకులస్వాములందఱు మెచ్చుకొన నోర్చి పగదీర్చుకొన్నసంభ్రమమువానిఁ
దాంధ్రకులజుని బొదివిరి దారుణముగ। ఘోరయుద్ధంబుసలిపి యవ్వీరవర్యుఁ
జిమిమై చిరి కతివని స్త్రీ శరోతుల। నతనిసహచరయుగళసంగతముగాఁగ.

ఇట్లు మొదటవచ్చిన యుద్ధముచే దమ పూర్వులని సాధింపలేకపోయిన పత్తుమున, పొద లలో దాఁగియుండిన తక్కిన యుద్ధ వచ్చి విజయరామరాజుగారి ప్రాణములుగొని తమస్వామిఋణము తీర్చుకొనుటకు శపథము చేసికొనిరఁట! విజయరామరాజుగారు భృత్యులకైదండగొనక నడువలేనంత స్థూలకాయులని చరిత్రకారుఁడు వ్రాయు చున్నాఁడు. యుద్ధములోఁ బాలుడు రక్షించుకొన్న రంగారావుగారితమ్ముఁడు వెంగళ్రావుగారు భద్రాచలమునకు పారిపోయి, ఆనందరాజుగారు బందరు వెళ్ళి యున్నప్పుడు ౧౭౫౮వ సంవత్సరమున మరలవచ్చి తనకుటుంబమునెడలవిశ్వాసముగల తొంటిసేనను గూర్చుకొని రాజాము కోటను స్వాధీనము చేసికొనెను. వెంగళ్రావు గారు మూడుసంవత్సరములు ప్రభుత్వముచేసి మృతినొందఁగా, ఇంతకుముం దొక వృద్ధునిచే ప్రాణరక్షణము చేయఁబడినట్లు చెప్పఁబడిన గోపాలవేంకటరావుగా రను చిన్నరంగారావుగారు రాజ్యమునకువచ్చి నాలుగుసంవత్సరములు పాలనము చేసిన తరువాత ౧౭౬౬వ సంవత్సరమున సీతారామరాజుగారాయనను చెఱసాలలోఁ బెట్టించిరి. ఆయన ౧౭౯౦వ సంవత్సరమునందందుండి తప్పించుకొని నిజాముదేశ ము నకు పారిపోఁగా, ౧౭౯౪వ సంవత్సరమునం దింగ్లీషువా రాయనను బిలిపించి పూర్వులబొబ్బిలిరాజ్యమంతయు మరల నిచ్చిరి.

ఈనారాయణకవియొక్క కవిత్వమునందు లక్షణదోషములు కొన్ని యందందుఁ గానఁబడుచున్నను కవనము రసవంతమయినది. ఈప్రబంధమునందు వీరరస మించు క్లించుగా భారతమునఁ దిక్కన సోమయాజిచే వర్ణింపఁబడినట్లు వర్ణింపఁబడినది,

అత్తలూరి - పాపకవి.

ఈకవి చెన్నబసవపురాణ మను నయిదాశ్వాసముల పద్యకావ్యమును రచియించి మాపూర్వులలో నొకరయిన కందుకూరి యమృతలింగముగారి కంకితము చేసెను. మా పూర్వులు మహమ్మదీయ ప్రభుత్వములో „దేశపాండ్యా" లయి ఘనతఁబొంది పెక్కు కావ్యములను కృతులనంది కవుల నాదరించియున్నారు. పూర్వము కృతిపతు లయిన వారిని గూర్చిన కొన్ని పద్యముల నీపుస్తకమునుండి యిం దుదాహరించుచున్నాను.

ఉ. ఆతతకీర్తికై కువలయాశ్వచరిత్రకృతిన్ గ్రహించి ప్ర
స్ఫీతము లైన కొత్తపలి యేలెటిపా డనునగ్రహారముల్
ఖ్యాతిగఁ జేసి బంధులకు గ్రాససమృద్ధు లొసంగి శాంభవ
వ్రాతము కోర్కు లిచ్చి విభవంబున మల్లనమంత్రి వర్ధిలెన్.

కందుకూరి మల్లికార్జునమంత్రి కువలయాశ్వచరిత్రము కృతినందినతరువాత

సీ. మహితపంచాక్షరీమాహాత్మ్యమును గృతియంది త్రైలోక్యవిఖ్యాతిఁ గాంచె
నతిభక్తి శ్రీశైలమందు మానులు మెచ్చ సంవత్సరము నివాసంబు చేసె
నష్టాగరిష్ఠుడై నేఁడునాఁ డనక యసంఖ్యమాహేశ్వరార్చన మొనర్చె
హితుల రక్షించి యహితుల శిక్షించి భూపతుల వశ్యులఁజేసి చతురుఁ డయ్యె
నితని కెనయైనమంత్రు లీక్షితితలమునఁ। గలరె యని సర్వజనములుఁ బలుక నెగడె
గందుకూర్ మల్లికార్జుననందనుండు। సంగరగుహుండు వీరేశలింగవిభుఁడు.

వీరేశలింగమంత్రి పంచాక్షరీమహాత్మ్యము కృతినందెను. అటుతరువాత

సీ. నారదప్రభమించి నారదప్రభ నెంచి యమరినకీర్తిదానములవాఁడు
చిత్రభానునిమీతి చిత్రభానునిగేరి పరఁగుశుచిప్రతాపములవాఁడు
భీముపేర్మికిఁ గెల్చి భీముపేర్మినగల్చి వలలినభూతిసత్త్వములవాఁడు
ధర్మగర్వముఁద్రోచి ధర్మగర్వముఁబాచి తగుశివభక్తిసత్యములవాఁడు
జగతిఁ జెలువొందె నుదయాస్త్రశైలసేతు। శీతనగమధ్యరాట్సభాసీనవిబుధ
వినుతసుగుణుఁడు మల్లికార్జునసుతుండు। మహితధృతిశాలి బసవరాణ్మంత్రిమౌళి.

క. ఘనముగ నైతమపూడియు। మినుమించిలిపాడు సిరులు మించఁగ నొసం
గెను గురుచరవరులకు బస। వనితో నెనయైనమంత్రి వసుధం గలఁడే.

క. తనమేనయల్లుఁ డాప్పురి। ఘనయశుం డగుబుద్ధిరాజు వీరనచేతన్
గొనె సత్యవతీపరిణయ। మనుకృతి శ్రీబసవమంత్రి యతిసంప్రీతిన్.

కందుకూరి బసవరాజుగారు సత్యవతీపరిణయమును గృతినందిరి. అటుపిమ్మటఁ గందు

కూరి యమృతలింగముగా రిచె న్నబసవపురాణము గృతినందిరి. కృతిపతియొక్క పెదతండ్రియైన సాళువపతి

గీ. సుగుణు లగుమల్లికార్జునసుతులలోన । నాలుగవనందనుం డగుసాళువపతి
సంతత శ్రీయుమహృదయపద్మాంతరాళ । సంచరత్సాళువపతి ప్రశస్తిగాంచె.

శా. ఢిల్లీనాయకుచేత దంతిహయకోటీముఖ్యవస్తువ్రజం
బెల్లం గైకొని కాశికాప్రముఖగౌరీశావనుల్గాంచి ని
త్యోల్లాసంబున శంకరార్చనలు దివ్యస్థైర్యగాఢింపి సం
ఫుల్లాంభోరుహలోచనామదనుఁడై పుష్పప్రథ న్వర్ధిలెన్.

అని ఢిల్లీనాయకునిచేత బహుమానము లందినట్లు చెప్పఁబడియుండుటచేతను, ఢిల్లీరాజ్యము నశించి నూఱుసంవత్సరములకంటె నధికకాల మగుటచేతను, కృతిపతియు కృతికర్తయు నుండినకాలము మాఱుసంవత్సరములకుఁ బూర్వమని చెప్పవచ్చును ఈ గ్రంథమునకుఁ గథానాయకుఁడయిన చెన్నబసవన్న వీరశైవమతమును స్థాపించి కళ్యాణ నగరమునందు బిజ్జలరాజునకు మంత్రియైయుండి యాతనివధించిన బసవేశ్వరునకు మేనల్లుఁడు. బసవేశ్వరుఁడు తన యధికారబలముచేత శైవమతమును వ్యాపింపఁ జేసినను చెన్నబసవన్నయే యధికమతాభినివేశముకలవాఁడయి మతవ్యాపనమునకు ముఖ్యకారకుఁడయి యుండినవాఁడు. బసవేశ్వరుఁడు శ్రీశైలమునకు సమీపముననున్న యొక గ్రామములో బ్రాహ్మణదంపతులకుఁ బుట్టి యుపనయన సంస్కారము చేసికొనక శివభక్తుఁడయి లింగము కట్టుకొనెడి యాచారమును మొదట నేర్పఱిచెను. ఈచెన్నబసవపురాణములో నక్కడక్కడ లక్షణవిరుద్ధము లయిన ప్రయోగములు కానఁబడుచున్నను, కవి మిక్కిలి ప్రౌఢుఁడయి హృద్యముగా పద్యరచనను జేసి యున్నాఁడు. కవితాత యక్కిరాజు; తండ్రి శ్రీగిమంత్రి ఈతనిది కౌశికగోత్రము. చెన్నబసవపురాణలోని కొన్నిపద్యము లిందుదాహరింపఁబడుచున్నవి—

చ. కనుఁగవఁ గెంపునిప్ప నలుకన్ బసవేశునిఁజూచి బిజ్జలుం
డనియెఁ బ్రధానశేఖరుఁడవై నుతిగాంచుట వన్నె కెక్కెయి
ట్లనుచితవృత్తికిం దగిలి యగ్రజ చీఁకటితప్పు సైపఁ గూ
డునె కులశీలమానములు డొంకిచనన్ ధరణీతలంబునన్.—ఆ. ౧

ఉ. ఎక్కడినుండివచ్చెనొకొ యీముదిజంగమువానిమాయలోఁ
జిక్కి నరాలనుండి యొకచీమకుఁ బోవఁగనీక దాఁచు నా
చక్కనిపిండి నగ్గామి సర్వముఁ బెట్టఁగఁబంచె నింక నే
నెక్కరణి న్వసింతు మరు లెత్తి వ్యయం బొనరించువీనితోన్.—ఆ. ౨

మ. ఇతఁడా శ్రీగిరిమల్లికార్జునుఁడు సామీ లెస్సబాగాయె నీ
మతిలో నేమితలంచి దైవ మని సంభావించి కాన్పింపఁ జూ
చితి నే వెఱ్ఱిగాను వేలు పని దర్శింపంగ నాతోడనా
చతురత్వంబులు చాలు దేవు నిఁక దాఁచంబోక కాన్పింపవే.— ఆ. 3.

చ. అతులనదీప్రవాహమున నాడది యీడది రెండుకాష్ఠముల్
జతపడి కొంతద వ్వరిగి యంక తటాలున నడ్డమైన నా
జత విడి యొక్క టేగు నటుసాగక యొక్కటి నిల్చుఁ గావునన్
వెత కుదువంగ నేల నను వీడె నతఁడని నెమ్మనంబునన్.— ఆ. ౪.

ఉ. నిద్దురలేచి యాఘనుఁడు నీలగళున్ స్మరియించు వేళ నా
పెద్దయు సంచరించుచుసడివీనుల సోఁకిన నావుదూడయో
యొద్దొ యటంచుఁ దాసియని యేడ్తెఱ ముష్టులఁబల్కనాఁడె డీ
ప్రొద్దుటి కబ్బె నాకు గురుబోధితమంత్ర మటంచు నాత్మలోన్.— ఆ. ౫.

కస్తూరి - రంగకవి.

ఈకవి లక్షణచూడామణి యను నామాంతరముగల రంగరాట్ఛందస్సును రచియించుటయేకాక సాంబనిఘంటువును కృష్ణార్జునసంవాద మనెడి యైదాశ్వాసముల కావ్యమునుగూడ రచియించెను. ఇతఁ డార్వేల నియోగిబ్రాహ్మణుఁడు; ఈతనితండ్రి వేంకటకృష్ణయామాత్యుఁడు; తల్లి కామాక్షమ్మ. ఇతఁడు ౧౭౫౦వ సంవత్సరప్రాంతమునందు తంజావూరిసంస్థానమం దుండినవాఁడు. శంకరవిజయమును రచియించిన యాంధ్రకాళిదాసు తా నీకవికి శిష్యుఁడయినట్టు తన గ్రంథమునందు వ్రాసికొనియున్నాఁడు. కస్తూరిరంగకవి రచితమైన రంగరాట్ఛందములో ననేకాపూర్వగ్రంథములనుండి పెక్కు పద్యములు లక్ష్యములుగాఁ జూపఁబడియున్నవి. ఆయాకవులకు కర్తృత్వమారోపింపఁబడిన యాగ్రంథములు కొన్ని యెంతవఱకు సత్యమైనవో యింకను విచారింపవలసియున్నది. ఇతఁడు మంచికవి. ఈతని కవిత్వనైపుణిని దెలుపుటకయి కృష్ణార్జునసంవాదములో నొక్కొక్క యాశ్వాసమునుండి యొక్కొక్క పద్యము నిందుదాహరించుచున్నాను—

ఉ. తమ్ములవ్రాలి పుష్పరసధారలు గ్రోలి సుగంధగంధవా
హమ్ములఁ గ్రాలి తేనియలయుంటపువాఁకలఁ దేలి పువ్వుఁదోం

పద్మములఁబోలి కింశుకసుమమ్ముల ద్రేలి ప్రియాళి నేలి జం
ఝుమ్మని క్రిమ్మి తుమ్మెదలు చొప్పడుచున్నవి కాననంబునన్. — అ. ౧.

ఉ. హా విధి యెంత చేసితివహా యిపు డెంతటిమాట వింటి నా
హా విపరీతదుర్దశల నందితి హా యిఁక మీఁద నన్ను సం
భావనచేసి ప్రోవఁగలవా రెవరం చని యాగయుండు నెం
తే వెతఁ జెంది కన్నుఁగవ నీ రొలుకం బలపించి వెండియున్. — అ. ౨.

మ. అతివ ల్కొందఱు వద్దఁ జేరి యిదియే పద్మా మహారాజు గా
నుకఁ దండుండఁగ సారెసారెకు నిటుల్ శోకించుట ల్మీకు సం
గతి కాదమ్మ సహించవమ్మ యనుచుం గాంతేయు లెల్ల న్నయో
న్నతి రక్షించిరి నమ్మవమ్మ యని నానారీతులం దెల్పుచున్. — అ ౩.

శా. యుష్మత్సాంద్రచమూసమూహభుజగర్వోగ్రాంధకారంబునన్
గ్రీష్మవ్యత్యయప్రచండకరసంకీర్ణార్కసంకాశమ
దీప్తాస్త్రంబుల నేసి మాన్చి తుది నీవీరంబు వారించెదన్
భీష్మాచార్య యొకింత నిల్వుమని గంభీరాట్టహాసోగ్రుఁడై. — అ ౪.

చ. తరణి సుధాకరుల్ గతులు తప్పఁ గులాచలము ల్వడంక ది
క్కరులు చలింప సర్వసురకాండము లంబరవీధి భీతిచే
నొరగఁ బయోధు లింకఁగ మహోద్ధతి మంటలు గ్రక్కుకొంచుఁ దీ
వరముగఁ గ్రీడిపై ఘనవైష్ణవసాయక మేగుదెంచినన్. — అ ౫.

ఆలూరి - కుప్పనకవి.

ఈకవి యానందగిరికృతియైన శంకరవిజయము నాల్గాశ్వాసముల పద్యకావ్యముగా రచియించెను. ఇతఁడు వైదికబ్రాహ్మణుఁడు; వేంకటగిరిపౌత్రుఁడు; వేంకటేశ్వరార్యునకును నరసమాంబకును పుత్రుఁడు; ఆపస్తంబసూత్రుఁడు; కాశ్యపగోత్రుఁడు.

క. ఘనుఁ డగుతుళజేంద్రుఁడు దయ। తనరఁగ నీ కాంధ్రకాళిదాసాభిధ మ
న్ననగా నొసంగెనఁట నీ। యనుపమసాహిత్యమున కహో యెన గలదే?

అని కవి తనకు తంజావూరుమహారాజగు తుళజేంద్రుఁ డాంధ్రకాళిదాసను బిరుదిచ్చినట్లుచెప్పుకొనియున్నాఁడు. ఈతుళజేంద్రమహారాజు ప్రతాపసింహమహారాజు పుత్రుఁడు. క్రీస్తుశకము ౧౭౬౦వ సంవత్సరము మొదలుకొని ౧౭౮౫ వ సంవత్సరము

వఱకును తండ్రి రాజ్యముచేసి మృతినొందఁగా, తుళజేంద్రుఁడు డీకదపటి సంవత్సరమున సింహాసనమెక్కి ౦బూరావ సంవత్సరమునందు మృతినొందెను. ఈమహారాష్ట్ర ప్రభువుచేత నాంధ్రకాళిదాసబిరుదాభిదాన మందిన మనకవి నూఱు నూటయిరువది సంవత్సరములక్రిందట నుండినవాఁడు. ఇతఁడు చెన్నపట్టణములో నుండిన నియోగుల ప్రార్థనమీఁదఁ బానీశంకరవిజయమును దెలిఁగించినట్లుకవి యిట్లు వ్రాయుచున్నాఁడు—

సీ. శ్రీపార్వతీశలక్ష్మీశసేవాసముపార్జితమహనీయభాగ్యయుతులు
ఘటనాఘటనసముత్కటమనీషాతిచమత్క్రియాధోరణీమంజుమతులు
నతులితసామదానాద్యుపాయైకవిచక్షణాక్షీణశాశ్వతచతురులు
హితపురోహితనిజాశ్రితబాంధవావనామానసస్ఫురితాన్నదానరతులు
కలితయజనాదిమహితషట్కర్మనిరతు। లగణితజగన్నుతాద్భుతసుగుణతతులు
సాంపరలౌకికవైదికాచారభృతులు। చతురచెన్నపురీచరత్సచివతతులు

* * * *

క. నను శ్రీనృసింహపాదా।శ్చనజనితలసత్కవిత్వచాతుర్యగుణా
ఢ్యుని నాంధ్రకాళిదాసా।ఖ్యునిఁ బిల్వఁగఁబంచి పల్కి రున్నతకరుణన్.

సీ. లీలఁ బంచనదీస్థలీపురాణము తెలిఁగించితి వారూఢకీర్తిమెఱయఁ
బరఁగు రామాయణభాగవతంబులు యక్షగానముచేసి తద్భుతముగఁ
గరమొప్ప పరమభాగవతచరిత్రయన్ కృతి యొనరించి తున్నతి దలిర్పఁ
దలిపొందు నిందుమతీపరిణయనామకృతి రచియించితి వతులగరిమ
గురుతరోజ్జ్వలసరణితో సురకథాను। ధారసాభిధకావ్య ముదారఫణితి
గా రచించితి వెనలేనిగద్యపద్య। తతుల లెక్కింపఁదరమె త్వత్కృతులు జగతి.

* * * *

వ. కావున జగద్గురుండై విశేషించి మనకు గురుండైన యాచార్యునివిజయంబు ......నొనరించి మాకందఱికి నత్యానందం బొనఁగూర్పుమని యాశీర్వచనరూపంబుగా నిర్దేశించి పలికి యనేకరీతుల సత్కరించిన..................

సీ. కార్యఖడ్గకవిత్వకరణికచాతురి యిలఁ బ.కి.ప మీయిండ్లబిరుదు
సలలితయజనాదిషట్కర్మనిరతులు ఖ్యాతిరంజిల్లు మీజాతిబిరుదు
ధైర్యదాతృత్వోచితజ్ఞతాదిగుణైకసరణి మీసాంగత్యసహజబిరుద
మనుగతంబగు పాలనానూనచాతుర్య మమరుమీభవ్యగోత్రములబిరుద
మట్టిమీరలు నాపట్ల నతులకృపను। గురువిజయమిట్లు తెలిఁగింపఁగోరుకొనుటఁ
గలిగె నిలమీఁద యోగంబునిలువరముగ। సారెకునియోగిమంతని సన్నుతింతు?

మను పద్యములలోఁ జెప్పఁబడినదానినిబట్టి కవి యీశంకరవిజయమునుగాక యాంధ్రకృతులను మఱియుఁ బెక్కింటిని రచించినట్లు కనుపట్టుచున్నది. రంగరాట్ఛందస్సును రచించిన కస్తూరి రంగకవి తనకు విద్యాగురు వయినట్లు చెప్పి కవి గ్రంథాదియం దాతని నిట్లు స్తుతించియున్నాఁడు—

సీ. భారతీదేవి యేయయ్యనిజిహ్వ నిత్యముగ వసించునాస్థానవాటి
వాణీవధూటి కెవ్వానిసూక్తులు ధరియించినట్టిముత్యములచాలు
శారద కేసుధీస్వామి చేతోవీథి యమరినరత్నసింహాసనంబు
పలుకులవెలఁది కేభాగ్యశాలిగృహంబు నెట్టుగా వసియించుపుట్టినిల్లు
నలువచెలువకు నెవ్వఁ డెన్నఁదగుపుత్త్రుఁ డట్టికస్తూరిరంగార్యు నచలధైర్యు
నార్యనుతచర్యు మద్గురువర్యు నెంచి ప్రణుతిగావింతుఁ బలుమాఱుఁ బ్రస్తుతింతు.

మొత్తముమీఁద నీయాంధ్రకాళిదాసుని కవనము సరసమైనదని చెప్పవచ్చును. శంకర విజయములోని కొన్ని పద్యముల నిం దుదాహరించుచున్నాను—

శా. ప్రామగ్ర్యం బగుతావకీనకథితప్రఖ్యాతసంశుద్ధవే
దాచారంబులు మాని తప్తతనులై యాహూకుపహ్నంబులన్
వైచిత్ర్యంబుగఁ గాల్చి విప్రముఖులో వారెల్ల నత్యంతమి
థ్యాచారంబున సంచరించెదరు పిత్రాహూతులై యీశ్వరా.— అ. ౧.

చ. అనయము నైజధర్మములయందుఁ జరింపక మిత్త్రశత్రుభా
వముల స్వపక్షమందుఁ బరపక్షమటంచుఁ దలంప కెంతయున్
ఘనసమబుద్ధిమీఱఁ గలఁకింగొన కెవ్వరి నొవ్వసేయకే
పనుపడి స్వస్థచిత్తుఁ డగువాఁ డుసుమీ హరిభక్తుఁ డెంతయున్.— అ. 3.

మ. నను నీభక్తుఁ డటంచు నెంచ కిల విన్నాణంబుగా నిట్లొన
ర్చన యజ్ఞానుల నేమిపల్కి నిఁక నీచిత్తంబు నాభాగ్య మో
యనుకంపాంబుధి విన్న నమ్మితిని నెయ్యంబొప్ప నీవేళ నీ
యనలార్త్యం దొలఁగించి ప్రోవుము నృసింహా దీనకల్పద్రుమా.— అ. ౬.

సంగళి-ఎల్లనార్యుఁడు.

ఈకవి సర్వేశ్వరమాహాత్మ్య మను నామాంతరముగల తోభ్యచరిత్రమును రచియించెను. తోభ్యచరిత్రము నాలుగాశ్వాసములు గలశైవగ్రంథము. ఇది శ్రీమ

ివ్యటూరి శంభునారాధ్య సద్గురుప్రసాదలబ్ధాష్టవిధకవిత్వప్రవీణ" అని గద్యము నందు వ్రాసికొనుటచేతను,

సీ. భక్తిమై రేణుకప్రమథోత్తము నుతించి మాయిదేవాహ్వయుమహిమ పొగడి
చెలఁగి యథావాక్యముల నన్నమయగారి భజియించి మ్రొక్కుడి పాలకురికి
సోమన్నగారిఁ బ్రస్తుతిచేసి ప్రియమంది శివదేవముఖనవకవుల నెంచి
గణపతిదేవుని ఘనతసన్నుతిచేసి వేమనఁ గీర్తించి విమలమతిని
వ్యాసవాల్మీకికాళిదాసాదిఘనుల। నన్నపార్యునిఁ దిక్కనయజ్వ నెఱ్ఱ
ప్రెగడ ధూర్జటిఁ బోతన భీమకవిని। జెలఁగి శ్రీనాథముఖకవిశ్రేణిఁ దలఁచి.

అని శివభక్తులను ముఖ్యముగా నుతించి యుండుటచేతను, ఈకవి శైవుఁడయిన నియోగి బ్రాహ్మణుఁడని యూహింపఁదగియున్నాఁడు. ఇతఁడు క్రైస్తవుఁడుగాక శైవబ్రాహ్మణుఁడే యైనపక్షమున, క్రైస్తవమతగ్రంథ మేల చేసెనో తెలియరాకున్నది. ఇతఁడు క్రైస్తవమతావలంబనముచేతఁగాని, ధనాపేక్షచేతఁగాని యీగ్రంథమును రచించి యుండును. కవి భారద్వాజగోత్రుఁడు; పింగళి నాగయామాత్యపుత్రుఁడు. ఇతఁడు కృష్ణామండలములోని కొండవీటిసీమయం దుండిన నియోగిబ్రాహ్మణుఁడు. ఈకవి తమ్మ రాయపరెడ్డి ప్రేరణముచేత నీగ్రంథమును రచియించెను. ఈసందర్భమునఁ గవికృత్యాదిని వ్రాసినపద్యములఁ గొన్నిటి నిం దుదాహరించుచున్నాను—

చ. తనర విదర్భసీమ కవతంస మనందగు కొండవీటి కిం
ద్రునిదిస రాజ్యలక్ష్మికి నిరూఢనివాస మనంగ భక్తవా
దనుపుర మొప్పు నుర్వరకు హారమణిస్థితిఁ బొల్చి సజ్జగల్
ధనకనకాంబరామలపదావిభవోన్నతిఁ జెంది వర్ధిలన్.

వ. ఆపట్టణంబున కధీశ్వరుండు.

సీ. తనకీర్తికామినుల్ దశదిశాభాగరంగస్థలంబుల నాట్యగతులు నెఱపఁ
దనశౌర్యవహ్ని దుర్దమభయంకరశత్రునగరీశ్వరాటవుల్ దరికొనఁగఁ
దనదానధారానితంబినీరత్నము లబ్ధినాయకులతో నసఁగి పెనఁగఁ
దనకరుణాగసఘనతరాపద మఖిలార్థిదారిద్ర్యమయంబు లడఁప
ఘనతఁ జెన్నొందుజగనొబ్బగండబిరుద। భూమణుఁడుతుమ్మవంశాబ్ధిపూర్ణచంద్రుఁ
డలఘుచరితుఁ డనంతాధిపాత్మజుండు। రమ్యరుచిహేళి రాయపరెడ్డిమౌళి.

వ. ఒక్కనాఁ డమాత్యపురోహితవిద్వత్కవీంద్రతార్కికమీమాంసికవందిమాగధ సుహృద్బంధుసేనాధీశ్వరసహితంబుగా నాస్థానమంటపంబున గీతవాద్యనృత్య వినోదలీలాకౌతూహలమ్మానసుండై యుచితాసనంబున సుఖాసీనుండై

గీ. అనఁగుఁదమ్ముఁడు పాపన్న వినయగరిమ। నాత్మధర్మప్రవర్తన ననుకరింపఁ
బరఁగ ధరమంత్రిపోతురిపాకనార్యుఁ। డెలమి విద్యాప్రసంగముల్సలుపుచుండ.

మ. నను శ్రీమద్గురుచిత్కశేక్షణమహాసంధానసంధానపా
వనకారుణ్యకటాక్షలబ్ధవరగీర్వాణాంధ్రభాషాకవి
త్వవిశేషక్రమచిత్రలక్షణచమత్కారప్రబంధాళిక
ల్పనలన్ బింగళి యెల్లనార్యమణిఁ బిల్వంబంచి పల్కెం గృపన్.

చ. ప్రణుతయశోవిశాలుఁడవు భాసురశబ్దనిగుంభనాదిల
క్షణములఁ జిత్రవైఖరుల సర్వనృపాలసభాంతరంబులన్
గణుతికి నెక్కినీకవితఁ గర్ణరసాయన మాచు నిప్పురీ
గణకవితానమందు నతిగౌరవ మంచితి వెంచిమాడఁగన్.

* * * *

శా. కొండారెడ్డిఘనుండు కో ల్వపటిమన్ గొప్పైన్నరాటీల ను
ద్దండుం డన్న యుమెండు నూప సుకవీంద్రశ్రేణిఁ బ్రోచున్ సిరుల్
నింకన్ దామెర వేంకటాధిపుఁడు మన్నించంగఁ బామూటిలో
నుండు న్నిన్ను బహూకరింపఁగలఁ డేయుద్వృత్కృతిశ్రేష్ఠతన్

వ. ......యున్న మజ్జనకాగ్రజుండును గొండారెడ్డికి జనకుండును నగునోబళరెడ్డి
భూకాంతునకుం దదీయాచార్యుం డగుసంజీవనాథస్వామి పరాపరవిజ్ఞానమా
ర్గోపదేశప్రసంగవశంబున నిత్యం బైనసత్యాధ్యయనవిధానప్రవర్తకుం డైన
తోభ్యుండను శౌక్కమహాపురుషునిదివ్యచరిత్రంబు గలసర్వేశ్వరమాహాత్మ్యం
బు చిత్రంబుగా ముఖవనరంబులం దేటపడిచి సంక్షేపరూపంబైనవాక్యగ్రంథం
బొసంగె దీనిం బరికిలించి సర్వేశ్వరున కంకితంబుగాఁ దనుంగున మృదువచన
రచనాగౌరవం బేర్పడఁ బ్రబంధంబుగా నిర్మింపవలయు...............

పయిదానినిబట్టి యీకవి యంతకుముందు వచనకావ్యముగా రచియింపఁబడినదానిని బట్టి యీపద్యకావ్యమును రచించినట్లు తెలియవచ్చుటయేకాక యితఁడు దామెర వేంకటాద్రిప్రభుకాలములో నుండినట్లుకూడ స్పష్టమగుచున్నది. బహులాశ్వచరిత్రమును రచియించిన దామెర వేంకటాద్రిప్రభుఁడు పదునేడవశతాబ్దారంభమున నుండినవాఁడు. ఇతఁ డతఁడుగాక యాతనిమనుమఁ డయ్యెను, కని పదునేడవశతాబ్దమధ్యమునం దున్నట్లేర్పడుచున్నది. దీనినిబట్టి మాకఁగా నీతోభ్యచరిత్రము వేందాంతరసాయనమునకంటెఁ బూర్వమున రచియింపఁబడినట్లు కానఁబడుచున్నది. ఈకవి కవిత్వము మృదుమధురపాకము గలదయి హృద్యముగా నున్నది. కవనపటిమ తెల్పి

యుటకయి తోభ్యచరిత్రమునుండి కొన్నిపద్యముల నిం దుదాహరించుచున్నాను—

మ. ఇల కంపించెఁ దారకల్ చెదరెఁ హేమాచలం బెంతయున్
దలక్రిందైనను భానుఁ డస్తగిరిమీఁదం దోఁచినన్ దిగ్గజా
వలి యుల్లాసిన వార్ధు లింకిన మనోవాక్కాయకర్మంబులన్
బలుకంబూనఁ డసత్య మెన్నటికి మానం డాత్మధర్మస్థితిన్.—ఆ. ౧.

మ. అకటా చేరెడుకూలిబియ్యమునకై యత్యంతదౌర్భాగ్యదా
నకళావైభవలక్ష్మికిన్ నిలయమా నాలీలహస్తాబ్జ మిం
తకృశీభావము నొంది క్రిందుపడఁగా నాగుండె యెంతే వికా
వికలై వ్రీలక నిల్చియుండెఁ గఠినోర్వీభృద్విపాషాణమై—ఆ. ౨

ఉ. బాలుఁడు వీరి నింతకును బాముల నొందఁగనీక పెంచితిన్
దాళఁగఁజాలఁ డాఁకలికి దప్పికి వేళ యతిక్రమించినన్
మే లొనరింపఁ గైకొనిన మిమ్మిఁక నేమని వేఁడుకొందు నా
జాలి దొలంగు టెట్లు మునిసత్తమ సత్కృప నానతీయవే.—ఆ. ౩.

ఉ. సంతసమంది యప్పుడు వెసన్ మగుడంజని ప్రాణనాథ యా
వంతయుఁ జింతలేదు భవదాత్మజ మున్నఁగలేచి పాదుకల్
కాంతునిప్రోల నిద్ర వెసకంబుగఁ దల్పము డిగ్గి నాఁటి
కాంతునిబోలు నాథుని గన్నులపండువుగాఁగఁ జూచితిన్.—ఆ ౪

చింతకుంట_కోదండరామకవి.

ఈకవి సునందాపరిణయమను నామాంతరముగల ప్రదీపచరిత్రము నైదాశ్వాసముల ప్రబంధమును రచియించెను. ఇతఁడు నందవరీక నియోగి బ్రాహ్మణుఁడు, అక్కనమంత్రిపుత్రుఁడు. కవి తన వంశజులలో సుప్రసిద్ధుఁడయి యుండిన రాయన భాస్కరు నిట్లు వర్ణించియున్నాఁడు—

సీ. ఘనతరాచార్యదీక్షాకల్పితానల్పకరనిబద్ధసువర్ణకంకణుండు
ఆసేతుశీతనగాంతరరాట్సభామధ్యవిశ్రుతకీర్తిమండలుండు
కొండపల్లి వినుకొండ దుర్గద్వయీదేశప్రజావనధీయుతుండు
సకలావనీపకసంతానయాచితవస్తుప్రదానప్రవర్తమండు
అన్నవేమమహీశదత్తాగ్రహార । మదకలాందోళికాశ్వసన్మణివిశేష
భూషణాద్యష్టభూతివిభూషితుండు । భానుతేజుండు రాయనభాస్కరుండు,

ఈకవి ౧౭౫౦ వ సంవత్సర ప్రాంతమునం దుండినవాఁడు. ఈతని కవిత్వము మెత్తనిమీఁద రసవంతమయి హృద్యముగానే యున్నది. సునందాపరిణయములోని కొన్ని పద్యము లిం దుదాహరింపఁబడుచున్నవి—

శా. సేనార్థాగతకామినీనికరకాంచీకింకిణీకంకణా
రావంబు ల్వివిధోరువాద్యపటలీరమ్యధ్వనుల్ భవ్యభూ
దేవాగ్రేసరగానసంయుతములై దిక్కు ల్మొగ న్నిండఁగా
దేవాగారము లొప్ప నప్పురమునన్ దేదీప్యమానంబులై —ఆ. ౧.

ఉ. ఇమ్మెయిఁబెట్టుచాయ లవియెన్నఁగ నేటికి నైజకాంతిచే
నిమ్మనిరాక్షిమోముసరి యిచ్చుట నెచ్చట లేదు చూడ నీ
సెమ్మది సంశయం బయిన నిక్కము చేసెద నిప్పుడాన నా
తమ్ములమీఁదఁ బెట్టుకొనెదన్ ద్విజరాజుకుఁ జేయిసాఁచెదన్.—ఆ. ౨.

ఉ. కుంజరయాన కాంచె నవకోరకనూతనగీతమంజరీ
మంజులపుంజరంజితసమంచితభవ్యనికుంజసంభ్రమ
ద్గుంజదమందషట్చరణకోటిగవాంచితసద్గంతమున్
గంజముఖీవిలాససఖికాంతినిశాంతము నవ్వనాంతమున్.—ఆ. ౩.

ఉ. అన్నవులార నావలపు నంగికరింపకు రమ్మ చాలు మీ
మన్నన లింక నన్నుఁ బలుమారును వేఁడకు రమ్మ ప్రాణముల్
గ్రొన్ననవింటిదేవతకుఁ గొంకక యిచ్చెద నమ్మ నాని నే
మున్న రవంత పోవిడుట మోసమువచ్చెఁగదమ్మ బుద్ధికిన్.—ఆ. ౪.

ఉ. సంతమసంబుపోక నవసాహసలక్ష్మికిఁబోక యామినీ
కాంతుఁడుగాక కోకకులశోకంబులపోక యులూకపంక్తికిన్
జింతలమూఁక పద్మలకుఁ జెన్నుసుధాకప్రభాంకాలపున్
వింతనురాక శోణరుచి విన్నగఁ బ్రాఁకి చెలంగె దిక్కులన్.—ఆ. ౫

కైపమాయనకవి.

ఇతఁడు దుషాకళ్యాణ మనఁబడు నైదాశ్వాసముల ప్రబంధమును రచియించెను. ఈతఁడు వైదికబ్రాహ్మణుఁడు; మహాదేవశాస్త్రికిని కామాక్షికిని బుత్రుఁడు. ఈకవి యుషాకళ్యాణమునందుఁ దనజనకుని నిట్లు స్తుతించెను—

క. కామాహంకృతిహరణుఁడు । కామాక్షీధవుఁడు విబుధగణవినుతగుణ
స్తోముఁడు సర్వజ్ఞుఁడు ని । స్సీమయశోధనుఁడు వృషవిశేషప్రియుఁడున్,

గీ. చిద్విలాసకళానిధిశేఖరుండు । శ్రీమహాదేవుఁ డాశ్రితశ్రీకరుండు
శైవకులవార్ధిచంద్రలింగనకవీంద్ర । పుత్రుఁడై యొప్పె నాకవిపుణ్య మేమొ॥

గీ. ఆమహాదేవు నప్రమేయప్రభావు । ధర్మవర్ధను ననఁగన్నతండ్రి నార్తిఁ
దలఁచి తద్దివ్యపదపద్మములను గొలుతు। నతులనతులను బుధులవినుతితతులను॥

ఈకవి నూఱుసంవత్సరములకుఁ బూర్వపువాఁ డగుటకు సందేహముండదు. ఇతఁడు తనపుస్తకమునందను శబ్దాలంకారములను విశేషముగా సమకూర్చినగాని పుస్తకమునందు వ్యాకరణదుష్టములైన ప్రయోగము లనేకములు గానఁబడుచున్నవి. ఈశృంగారప్రబంధము కొంతవఱకు రసపుష్టికలదిగానే యున్నది. ఈపాఖ్యానమునుండి కొన్నిపద్యముల నిం దుదాహరించుచున్నాను—

మ. త్రిజగన్మోహనదీపమో బహుజయశ్రీపూర్ణనిక్షేపమో
యజనైపుణ్యకలాపమో తపనచంద్రాగ్నిత్రయీరూపమో
ద్విజముఖ్యస్తుతలగ్నమం దొకమహాతేజంబు తద్భీష్మకా
త్మజగర్భంబున నుద్భవించెను సమస్తానందసంధాయియై —ఆ. ౧.

ఉ. భంబులు గోళ్ళు పల్లవనిభంబులు కాళ్ళు మనోజకాహళా
భంబులు జంఘ లౌర కరభంబులు సక్థులు శాతకుంభకుం
భంబు లురోజముల్ దరనిభంబులు కంఠవలగ్నముల్ ద్విరే
ఫంబులు కుంతలంబులు శుభంబు లుమాసతిలక్షణంబులున్.—ఆ. ౨.

చ. అతఁడును మారుదారుణశరావళిహావళి కోర్వలేమి నో
తనుమణి మనీష నిటు సోలుచు వ్రాలుచుఁ దూలనేల నీ
వితరపుఁజింతఁ దక్కు నతి కెక్కిన హేలల నోలలాడుమా
దృతముగఁ జేతుఁ గామితముఁ దెల్పుము సల్పుము బల్పుముచ్చటల్.—ఆ. ౩.

ఉ. ఇయ్యెడఁ దియ్యమావిచిగు రెంతయు వింతగఁ దేనె లొల్కుచున్
సయ్యనఁజాలుమేలుజిగిచాలునఁ గ్రాలు ననూనవైఖరిన్
దొయ్యలి తావకాధరముతో సరిగా దవునంచు సందియం
బయ్యెడిఁ దారతమ్య మరయుంజను నీ నునుమోవి నియ్యపే.—ఆ. ౪.

ఉ. నాకులఁ బూర్వనాకుల వినంబడ నట్టివిధంబు లొప్పఁ దన్
దాఁకుచు మిన్ను ప్రాఁకుచును దద్దయు యుద్ధముసల్పుతన్నవో
ద్రేకులఁ దమ్మిరేకులవలెన్ హలకోటి కలంకరించి పె
ల్లాఁకలిగొన్నరోకలికి నాహుతిఁ జేసెను సీరి పోరిలోన్ —ఆ. ౫.

వెలిదండ్ల - వేంకటపతి.

ఇతఁడు రాధామాధవసంవాద మను మూఁడాశ్వాసముల ప్రబంధమును రచియించి ప్రళయకావేరి నివాసుఁడగు మగదలరామదాసున కంకిత మొనర్చెను. ఈకవి తిరువేంగళాచార్యపుత్రుఁడు. కృతిపతియగు మగదల రామదాసామాత్యుఁడు గతశతాబ్దమధ్యమునకుఁ దరువాత నుండినవాఁడయి నందునఁ గవి యిప్పటికి నూఱుసంవత్సరములక్రిందట నుండినవాఁడు. ఈతని కవిత్వము మనోహరముగా నేయుండును. రాధామాధవసంవాదములోని మూఁడుపద్యముల నిందుఁ బొందుపఱుచుచున్నాను—

చ. పడుచులతోడ నాడఁ బసిబాలుఁడవా వలదన్న మాన వా
గడములు గొన్ని నేర్చితివి కల్లరివైతివి కొల్లకాఁడవై
దుడుకులు చేయఁజాగితివి దొంగిలఁ జొచ్చితి వేమి చెప్పినన్
నడిగఁ బరాకు చేసికొని వాకిటి కేగదు పిల్వఁ బిల్వఁగన్.— ఆ. ౧.

ఉ. ఏవగ వారు చేసిన సహించి తదంతటివారిఁ జేయుచున్
దైవము దాటి తల్లియును దండ్రియుఁ దాసయి ప్రోవఁగా జగ
త్పావనమూర్తియౌ తనకుఁ బావనమే తనఁగన్న దేవకీ
దేవిని దన్నుఁగన్న వసుదేవుని నాపదఁ బాచి ప్రోచుటల్.— ఆ. ౨.

ఉ. ఒక్కతె భ్రాంతచేఁ బోరల నొక్కఁడు మానుపఁ బూఁటకాఁపె నే
నెక్కడిదాన నీవు మును పెక్కడివాఁడవు నాకు నీకు నే
మక్కఱ వెక్కసైన నొక రాదెసు పల్కులు నేనె పల్కెదన్
గ్రక్కఁగ నాయెఁ బోయె నవి కొన్నిదినాలు ఋణానుబంధముల్.— ఆ ౩.

పట్టుసొట్టు - సరస్వతి సోమయాజి.

ఇతఁడు పృథుచరిత్ర మను ప్రబంధమును రచియించి దాక్షారామ భీమేశ్వరున కంకితముచేసెను. ఈకవి యాఱువేలనియోగిబ్రాహ్మణుఁడు; హరితసగోత్రుఁడు; పోతనామాత్యపౌత్రుఁడు; పెద్దనార్యపుత్రుఁడు; శివలంక గౌరనార్యునిశిష్యుఁడు. ఈశ్వరుఁడు స్వప్నమున సాక్షాత్కరించి తన్నుఁగూర్చి యిట్లు పలికెనని కవి గ్రంథాదిని చెప్పుకొనియున్నాఁడు—

సీ. నవఘంటసురతాణి నామధేయమువాఁడు తాత వెల్లాలపల్లి పోతరాజు
కవిశేఖరుం డనఁ గవిధూర్జటి యనంగఁ బెనుపొందు జనకుండు పెద్దిరాజు

పవనదీక్షామహేశ్వరుఁడు శ్రీరఘునాథ సోమయాజి నిజాగ్రజుండు గురుఁడు
తల్లి పాతివ్రత్యధర్మబుద్ధి కదంబ కారుణ్యజగదంబ పేరమాంబ
నీకు మద్వరలబ్ధవాణీప్రసాద । మంగళవచంబు సకలవిద్యాస్థలములఁ
బట్టమెట్టాంక వెల్వలపలివృషాంక । సోమయాజి సరస్వతిసోమయాజి.

ఉ. శైవులలోపలం బరమశైవుఁడు వేదపురాణవాణిచే
శైవగురుండు నీగురుఁడు ధన్యుఁడు శ్రీశివలంకవారిలో
దేవవిభుండు భక్తి శివదేవుఁడు గౌరయగారు తత్కృపా
పావనకీర్తిఁ గాంచితివి బాలసరస్వతి దీక్షితాగ్రణీ.

ఈకవి కవిత్వము శబ్దార్థాలంకార భూయిష్ఠమయి మృదుమధురపదఘటితంబయి సలక్షణమయి హృదయకర్ణ రంజకముగా నున్నది. ఈతని పృథుచరిత్రమునందలి శబ్దాలంకార రీతిని జూపుటకయి యొకపద్యము నిందుఁ బొందుపఱుచుచున్నాను—

సీ. హస్తకంకణములు హస్తకంకణములు పదసంపదధికసంపదలొసంగ
మఖజాతవేదంబు మఖజాతవేదంబు స్వర్గాపవర్గరాజ్యము లొసంగఁ
గళ్యాణతత్వంబు కళ్యాణతత్వంబు సగుణనిర్గుణవృత్తిచయము మొసఁగ
సత్యానుకూల్యంబు సత్యానుకూల్యంబు సాధ్వీశ్వరత్వంబు సంఘటింపఁ
బరఁగుద్దవతకులశిరోవిప్రకటకుసుమ । మంజుమకరందధారాసమంజసాంఘ్రి
పద్మసన్నిధిసన్నిధిప్రభవవిభవ । శాశ్వతశ్రీకరుండు సర్వేశ్వరుండు

ఈకవి గోదావరీ మండలములోనివాఁడగుట వేఱుగఁ జెప్పనక్కఱలేకయే కృతి దాక్షారామభీమేశ్వరుని కంకితము చేయఁబడుటచేతనే తెలిసికొనవచ్చును. ఇతఁడు నూఱుసంవత్సరములకుఁ బూర్వమునందుండినవాఁడు ఇతని పృథుచరిత్రములోనికొన్ని పద్యములనిందుదాహరించుచున్నాను.—

చ. మలయఁ బురంబునన్ నిరుపమానవిమానసమానధామకో
మలలలనామనోరమసమాగమభోగమదాంతతాంతతా
జలకలికానికారముఖసారసగంధసుగంధసారముల్
మలయమరుత్కిశోరములు మారవిహారకరప్రచారముల్.—ఆ. ౧.

శా. ఏచూపుల్ రజూపును వియ్యమయ్యె సతికిన్ క్షోణీతలస్వామికిన్
దూపుందూపును వియ్యమయ్యె రతికిన్ దోర్ద్రోరతిస్వామికిన్
జాపాఖ్యాసము చూడుఁడీ సభ మహాచాతుర్య మన్నట్లు త
ద్భూభృత్పారిష్వవచేష్ట లొప్పెఁ దమిచూపుల్ క్రీడ మళ్ళింపఁగన్.—ఆ. ౨.

చ. కదలిరి పాఠకోత్తములు గాయకులుం గవులు న్సహాకవుల్
మెదలిరి సత్ప్రియాణమతి మిశ్రితమిశ్రితతుల్ నిజాశ్రితుల్
పొదలిరి వాంఛితార్థపరిపూర్ణసువర్ణసువర్ణసంతతుల్
తదనుమతిం బురంబులకుఁ దత్పరదత్పరతత్పరాగతిన్. — ఆ. ౩.

చ. అలసితి రమ్యలార కుసుమాపచయం బొనరించి దండ మీ
యలయిక లేనదంతు నని యంబురుహాక్షరలక్ష్మి పంపుచు
న్చెలులకుఁ జెల్వలం దరలించెన్ జలజోత్పలపత్రవాసనా
లలితమదాళికేకలకలంబుల శీతలవాతపోతముల్. — ఆ. ౪.

అవుడూరి-కిచ్చయ్య.

ఈకవి కాళిదాసప్రణీతమయినరఘువంశమహాకావ్యమును పదియాశ్వాసముల గ్రంథముగా రచియించెను. కిచ్చయ నియోగిబ్రాహ్మణుఁడు; గురవయామాత్యుని పుత్త్రుఁడు; హరితసగోత్రుఁడు; చెన్న కృష్ణశాస్త్రిశిష్యుఁడు. ఇతఁడు నూట యేఁబదిసంవత్సరములక్రిందట నుండినట్లు తెలియవచ్చుచున్నది. ఆంధ్రరఘువంశకావ్యము సంస్కృతకావ్యమంత మనోహరము గాకపోయినను మొత్తముమీఁద రసవంతముగానే యున్నది. కవిత్వశైలి తెలియుటకయి రఘువంశమునుండి రెండుమూఁడుపద్యముల నిందుఁ బొందుపరచుచున్నాను—

ఉ. ఉన్నతమర్త్యలభ్యఫల మొందెదనన్నతి నూర్ధ్వబాహుఁడై
యున్నసగర్వఖర్వమనుజోత్తముకైవడి మందబుద్ధినై
కొన్ననబుద్ధుఁడు సాధుకవికుంజరకీర్తి వహించ నెంచినన్
సన్నుతిచే నగఁబోవుదురొకో సత్కృపులైనసమస్తభూజనుల్. — ఆ. ౧.

చ. పొలఁతిరో! నిన్ను ముత్తెపుఁబూసలఁబోలెనుబాష్పవారిబిం
దులఁ బరిపంథిధాత్రిపవధూస్తనపాళిని బ్రస్తరించునీ
కలితమహౌజుఁడైనమహికాంతునిచేత సమర్పితంబులై
యలరె గృహీతసూత్రకములై తగుమౌక్తికతారహారముల్. — ఆ. ౪.

మ. తనపై విశ్వసనంబు పంక్తిముఖధూర్తత్వంబునన్నన్వచెం
దనియీభూజను లిర్వ్యోదన్ నిజచరిత్రంబందు విశ్వాస మొం
దిన మీయాజ్ఞఁ బరిగ్రహింతుఁ దనయాస్త్రీఁ గాంచి శోభిల్లు న
జ్జనకక్ష్మావిభుకీర్తిపుత్త్రి కని కౌసల్యాతనూజుం డనన్ — ఆ. ౧౦.

ఈకవి రఘువంశముగాక మాధవాభ్యుదయ మను మఱియొక ప్రబంధమునుగూడ రచియించెను. ఈక్రింది రెండుపద్యములును మాధవాభ్యుదయములోనివి—

ఉ. అంతట నొక్కనాఁడు చతురాస్యుఁడు వేదచయంబుఁగానమిన్
వంతదురంతచింత బలవంతము పంతముసంతసిల్ల శ్రీ
కాంతనితాంతకాంతపదకంజయుగంబు మదిన్ ఘటించి యు
శ్రాంతభయైకభక్తిఁ గరసారసముల్ముకుళించి యిట్లనున్.

శా. త్రుంతున్ సోమకు నుద్ధరింతు నిగమస్తోమంబు లంచున్ రమా
కాంతుం డొందె సువర్ణసంఘటితజాగ్రత్పృష్ఠవక్షఃకృతా
తాంతోత్తాలకరాళవాలహతి ధూతప్రోదనీశాప్పృష
త్సంతానాహతినివృతత్స్వరతరూద్యత్సామినాకృతిన్ — ఆ. ౧.

తక్కెళ్లపాటి-లింగన్న.

ఆధునికుఁడైన యీకవియొక్క కాల మెప్పుడో నిశ్చయముగాఁ దెలియలేదు గాని యించుమించుగా నూఱు నూటయేఁబదిసంవత్సరముల క్రిందట నుండిన ట్లూహింపఁదగియున్నది. నూఱుసంవత్సరముల క్రిందట రచియింపఁబడిన లక్షణగ్రంథములలోసహితము యీతనిగ్రంథములలోనుండి లక్ష్యములుగాఁ గైకొనఁబడిన పద్యములు కానరావు. అట్లు కైకొనఁబడకపోవుట కీతనికవనము లక్షణవిరుద్ధముగా నుండుటయే కారణమయి యుండవచ్చును. కవి తాను రచియించిన గ్రంథములపేళ్ల నుత్తరహరిశ్చంద్రకథలోని యీక్రింది పద్యమునఁ జెప్పుకొనియున్నాఁడు—

సీ. తగ రచించితిని మదనమోహినీవిలాసంబు మెప్పుగ యౌవనంబునందు
భక్తి సూర్యతనయాపరిణయం బనెడుప్రబంధంబుఁ జెప్పితిఁ బ్రౌఢిమమున
నావెనక విద్యుత్ప్రభావిలాసము వేడ్కఘటియించితిని యక్షగానరీతి
నలువదియేండ్లప్రాయమున నుత్తరహరిశ్చంద్రాఖ్యకథ యిది సారమతిని
వేంకటేశ్వర శ్రీరామవిభుల కెలమి। నంకితంబుగ మును చెప్పినట్టికృతుల
రీతి నిది కృష్ణునకు సమర్పించి యిప్పు। డిలను ధన్యుండనైతి వాక్యులు నుతింప

వీనిలో మదనమోహినీవిలాసమును, సూర్యతనయాపరిణయమును, ఉత్తరహరిశ్చంద్రకథయు, పద్యకావ్యములనియు, విద్యుత్ప్రభావిలాసము యక్షగానమనియు, పైపద్యమువలననే తెలియవచ్చుచున్నవి. ఈకవి నియోగిబ్రాహ్మణుఁడు; హరితసగోత్రుఁడు; ఆపస్తంబసూత్రుఁడు; చిట్టయ్య పౌత్రుఁడు; వేంకటపతిపుత్రుఁడు. ఈతని తల్లిపేరు సూరమ్మ. ఇతనిది రసవంతమైన ప్రౌఢకవిత్వముకాదు; యౌవనకాలమున రచియిం

చిన గ్రంథములలోనే కాక యీ మువదియేండ్లు వచ్చినతరువాత రచియించిన యుత్తర హరిశ్చంద్రకథలో సహితము లక్షణవిరుద్ధము లయినప్రయోగము లనేకములు కానఁబడుచున్నవి. ఈతని గ్రంథములలోని రెండేసిపద్యము లిందుదాహరింపఁబడుచున్నవి.

మదనమోహినీవిలాసము.

ఉ. అక్కట మానవస్త్రీ దమరాధిపుతోఁ బలుకంగ నూరకే
గ్రుక్కున నుండలేక ప్రతికూలుఁడనై పరుషంబువల్కి నే
నిక్కడి కేలవచ్చితి సహింపఁగరాని వియోగవహ్ని చేఁ
బొక్కఁగ నేల దైవకటపుంగవు లింతకు నవ్వకుందురే.

ఉ. కమ్మనివింటిబోయ యొడికంబుగ సంజమెఱుంగుటగ్గిచే
బమ్మిక యొకదంపతులపై వడిఁ బుష్పవిమందు కాల్వఁగాఁ
గ్రమ్మినపొగనాళమున దాపున వెల్వడుచున్న గుండునా
దొమ్మిగఁ జిమ్మరేఁగె నలుపమ్మెడ తెల్పరోవరంబులన్.

సావిత్రీపరిణయము

ఉ. ఒప్పెడు లేవిరూపమపి మాన్పి సూనసరీకే తగుంగదా
యచ్చున నొత్తినట్లు నెఱనాణెఁ శిక్షయించఁగ నీకిచెల్లుఁగా
కిప్పెలువన్ వగపఁగలఁగే మొకఁ డెందును నన్నుఁగన్న యా
పప్పరికాటివాఁడె మగుఁ బంకజలోచనఁ బెండ్లియాడఁగన్ — ఆ. ౧.

సీ. హరి యలధర్మసూనుఁ డిప్పటి కుండెనా వింటిరే రమా
వరుఁ డిటువచ్చునో యనుచు వారక చూచితి మిన్ని నాళ్ళు నేఁ
డరుదుగ నొక్కమాట వినవయ్యె ముకుందుఁడు వేఁటవచ్చె ని
న్నావనసీమలో ననని సత్యము లేకని యంకృపోక్తియో. — ఆ ౫.

ఉత్తరహరిశ్చంద్రకథ.

చ. జలరుహబాంధవాన్వయనిశాధవ! యోనరనాథ! నేఁడు గా
ఫలితము లయ్యె మాకు శుభసప్రతిహోమతపఃప్రభావముల్
కలఁగి మహాపద ల్గడచి కాంతియు మీరును బుత్రరత్నమున్
వలనుగ సర్వరాజ్యవిభవంబు వహింపఁగఁ జూడఁ గాంచుటన్.

మ. సకియా! యే త్రిశంకుసూనుఁడ హరిశ్చంద్రుండు నా పేరు పా
యక సైన్యావళితోడ ఘోరమృగయావ్యాసక్తచిత్తుండనై
ప్రకటారణ్యగిరీంద్రసానువులు చేరన్వచ్చి వర్తించుచో
నొక్క క్రోధం బలియించి చిక్కక రదే నొక్కండ దీవ్రంబుగన్,

గుడిపాటి-కోదండపతి.

ఈకవి శృంగారరసమంజరి యనుపేర భానుమిశ్ర విరచిత మైన రసమంజరిని మూడుగుచ్ఛములనుగాఁ దెలిఁగించెను ఈగ్రంథము శృంగారనాయికానాయకలక్షణములను దెలుపునది. కవి నందవరీకనియోగిబ్రాహ్మణుఁడు. పూర్వకాలమునందు నందుఁడనుచంద్రవంశపురాజొకఁడు కర్ణాటకదేశమును పాలించుచుండెనఁట. అతఁడు స్వీయమహిమచేత "యోగవాగ" ముల నెక్కి రహస్యముగాఁ బోయి ప్రతిదినమును కాశికాపురములో గంగాస్నానమును జేసి వచ్చుచుండెనఁట! ఈరహస్యము నతని భార్య కనిపెట్టి యొకనాఁడు తన్నుఁగూడ వెంటఁ గొనిపొమ్మని భర్తను నిర్బంధ పెట్టెనఁట. అతఁడా మెనిర్బంధమును మానుపలేక భార్యను వెంటఁ గొనిపోఁగా, కాశీపురమును జేరినతరువాత నామె బహిష్ఠ యయ్యెనఁట. అందుచేత యోగవాగములు మఱలనోఁకి నడవక పోయినందున నతఁడు స్వపురమును జేరుట కుపాయము తోఁపక పరితపించి గంగాతీరమునం దున్నబ్రాహ్మణులను బ్రార్థింపఁగా వారు తమకుఁ గర్ణాటకరాజ్యమునందు వృత్తుల నొసఁగునటు చముడేశ్వరీసన్నిధానమునం దాతనిచేతఁ బ్రమాణము చేయించుకొని స్నానము చేయించి యాతనిభార్య నప్పుడే తమమంత్రప్రభావముచేత శుద్ధురాలిని జేసి యోగవాగములను నడిపించి యాదంపతులను స్వరాజధానికిఁ బంపివేసిరఁట. అటుతరువాతఁ గొన్నిసంవత్సరములకు కాశీదేశమున క్షామము సంభవింపఁగా నాశ్వలాయనసూత్రు లయినయాబ్రాహ్మణు లేనూఱుకుటుంబములవారు బైలుదేఱి పదుమూడుగోత్రములవారు నందునిరాజధానికి వచ్చిరఁట! అప్పుడు రాజు తాను జీవనములు కల్పించెద నన్నబ్రాహ్మణులు వీరే యని చూపుటకై సాక్షులను దేవలయు నని కోరఁగా వారు కాశికాపురమునుండి చముడేశ్వరీమహాదేవినే గొనివచ్చి యామెచే సాక్ష్య మిప్పించిరఁట! అంతట రాజు వారిమహిమ కద్భుతపడి తనపేరిట నందవరమను గ్రామమును గట్టించి వారి కగ్రహారముగా నిచ్చెనఁట. నందవరమునం దుండినబ్రాహ్మణు లగుటచే వీరు నందవరీకు లనఁబడుదురు. వీరినే కరణకమ్మలనియుఁ జెప్పుదురు. ఈ యోగవాగములకథ యెట్టి దయినను, వీరు కాటకము సంభవించినప్పు డార్యావర్తమునుండి దక్షిణహిందూస్థానమునకు వచ్చి తెలుఁగుదేశములో వృత్తులను సంపాదించుకొన్న విషయములో సందేహ ముండదు. ఈతెగబ్రాహ్మణు లిప్పుడు కృష్ణా కర్నూలు బళ్ళారి మండలములలో నధికముగా వ్యాపించియున్నారు. వీరిలో నల్లసాని పెద్దన, రాయని భాస్కరుఁడు మొదలయినవారు మహాప్రసిద్ధులు. కవి మూడవగుచ్ఛము యొక్క కడపటఁ దన్నుగూర్చి యిట్లు వ్రాసికొని యున్నాఁడు—

సీ. శ్రీకరనందవరీకాగ్రగణ్యుండు కపిమీఱు గుడిపాటివంశభవుఁడు
బిరుదుగా నవఖండసురతాని పేరంది మహితుఁడౌ వేంగళమంత్రిపౌత్రుఁ
డతులితుఁడౌ రంగయామాత్యతనయుండు వీరమాంబానందవృద్ధికరుఁడు
సింగన్న వెంగళశ్రీనిధు లనుజులై భాసిల్లు కోదండపతిఘనుండు
సరసకవితాచమత్కారసార్వభౌముఁ । డవని శ్రీరంగధామదయాశ్రయుండు
నెలమి రసమంజరిని రచియించె నందు । సరవిగాఁగఁ దృతీయగుచ్ఛంబు తనరు.

ఈపద్యమునుబట్టి కవి వేంగళమంత్రిపౌత్రుఁ డనియు, రంగయామాత్యునకును వీరమాంబకును బుత్రుఁ డనియుఁ దెలియవచ్చుచున్నది. ఇతఁ డాశ్వలాయనసూత్రుఁడు; భారద్వాజగోత్రుఁడు. ఈతఁ డేకాలమునం దుండినవాఁడో నిశ్చయముగాఁ దెలియదు. ఇన్నూఱుసంవత్సరములక్రిందట నుండి యుండునేమో! ఈతనికవిత్వమునందుఁ గొన్ని దోషము లున్నను గవిత్వము రసవంతము. ఈ రసమంజరిలోని యొక్కొక్కగుచ్ఛమునుండి యొక్కొక్కపద్యము నిం దుదాహరించుచున్నాను—

చ. జలదము నాథుఁ డంగ నయఁ జాలెనె నీళ్ళకె చిక్కఁ, బచ్చికల్
కలయఁగ నించెఁగా గిరులు కాంతుల నీనెనె, యెల్లవృక్షముల్
ఫలము లొసంగుఁ గాని పతిపఁత్తుల నిచ్చెనె, సిద్ధయాత్మ హా
కులటవుఁ గాఁగ నేమి యొనఁగూర్పఁగ నేర్చితి వంబుజాననా.—గు. ౧.

చ. పదయుచు నీ పిటూరికి ప్రైనము పోయెద నన్నమాత్రలో
నదటున మేను చిక్కి వలయుంబులు జాఱెను నీయుంగరం
బరిగ యొసంగినం గరమునందు ధరించెఁ గంకణంబుగాఁ
జదరిక యిమ్మటంచు వెలచేసియు దోఁచు నెటున్నిటుం బటుక్.—గు. ౨.

చ. ప్రతిఫలితామృతాంశువును భామముఖంబని యెంచి నాయకుం
డతులితలీలమీఱఁ బరిహాసముచేసిన నింతయేనియుక్
బ్రతివచనంబు లేమిఁగని పైదలి మానముఁ జెందె నంచుఁ దా
నతిపులకాంకితం బయినహస్తము చేఁ దడవుం బ్రియుంబునక్.—గు. ౩.

మల్లసరపు-వాచేశ్వరుఁడు.

ఇతఁడు భళ్ళాణచరిత్ర మను నైదాశ్వాసములప్రబంధమును రచించెను. సింధుకటకరాజయినభళ్ళాణుఁడు జంగము లడిగినదెల్ల నిచ్చుచుభక్తిచూపుచుండెనఁట! అతని భక్తిని పరీక్షింపవలె నని శివుఁ డొకనాఁడు జంగమువేషముతో వచ్చి తనకుఁ బతివ్రత

యగుయువతి కావలెనని యడుగఁగా, రాజు తనపట్టణమునం దట్టిస్త్రీ దొరకనందున దనభార్య యగుచెల్లమ్మనే యాజంగమున కర్పించెనఁట! శయనగృహమున కేగినప్పు డాజంగ మామెనంటు సందేహపడుచుండఁగా, చెల్లమ్మయే ముందుకుఁ బోయి యాయతి థిని కౌఁగిలించుకొనునప్పటి కతఁడు మూడునేత్రములతఁడు వయ్యెనఁట! అంతట నా దంపతు లతఁడు శివుఁడని తెలిసికొని యారాధింపఁగా, ఈశ్వరుఁడు నిజస్వరూపముతో సాక్షాత్కరించి వారికి ముక్తి నిచ్చెనఁట!

వాలేశ్వరుఁడు పాక నాఁటి నియోగి యగు శైవబ్రాహ్మణుఁడు; గౌతమసగోత్రుఁడు; పోలయామాత్యపుత్రుఁడు. ఇతఁడు తనగ్రంథమును మల్లవరపు నాగేశ్వర స్వామి కంకితము చేసెను. కవి తన్నుఁగూర్చి భళ్యాణచరిత్రమునం దిట్లు చెప్పుకొని యున్నాఁడు—

సీ. అనఁ బాడఁ జదువఁ జెప్పను నేర్చు సర్వజ్ఞభోజుండు మాతాత పోతరాజు
బహుపురాణజ్ఞుండు బాంధవాశ్రితకల్పభూజంబు మాతండ్రి పోలమంత్రి
పరమశాంతుఁడు కృపాపాథోధి మాపినతండ్రి విరూపాక్షదండనాథుఁ
డఖిలవిద్యానిధి యర్థార్థితతిఁ బ్రోచుదాత మత్సహుఁడు సదాశివుండు
నే వితర్కింప వరకవితావిశేష। వదనుఁడను బ్రాఁకనాఁ డింటివాఁడ శుద్ధ
శైవుఁడను గౌతమసగోత్రసంభవుండ। నెంచఁదగు మల్లవరపు వాలేశ్వరుండ.

* * * * *

మత్తకోకిల. సన్నుతం బగునట్టి వేల్పు ప్రసన్నుఁడై మముఁ బ్రోవఁగా
విన్నకోటవిలాతిలోఁ గడు వేడ్క మల్లవరంబునన్
బన్నగేశ్వరసుప్రతిష్ఠను భక్తరక్షణ చేయుచున్
వన్నెమీఱఁగ నాగలింగ మనన్ వసించు మహోదయున్.

ఈకవి నివాసస్థలము కృష్ణామండలమునందలి విన్నకోటసీమలోని మల్లవర మయినట్టు పయిపద్యమువలననే విస్పష్ట మగుచున్నది. కవి యెప్పటివాఁడో నిశ్చయముగా తెలియరాదుగాని యిన్నూఱుసంవత్సరములక్రిందటివాఁడయినట్టు కనుపట్టుచున్నాఁడు. భళ్యాణచరిత్రములోనివి రెండుపద్యముల నిం దుదాహరించుచున్నాను—

మ. భువి రుద్రాక్షను సెవ్వ రేని మది శంభుం డంచు భావించుచున్
జెవులన్ వక్షమునన్ శిరస్థ్సలమునన్ జేదోయిఁ గంఠంబునన్
దవిలింపంగ ధరింతు రాజనులకున్ వీక్షింపఁగా సాటిరే
దు విరించ్యంబుజనాభకిన్నరమరుద్యక్షేంద్రలోకంబులన్.—అ.౨.

ఉ. కప్పురవీడెముం నొసటఁ గస్తురిబొట్టును జంద్రకావియా
దుప్పటివల్లెవాటు కలదో మతి లేదో యనంగఁ జాల మైఁ
జిప్పిలు భూతిలేపనముఁ జేతను సన్నపుగొంబెత్తి మా
యొప్పులకుప్ప హూళువు మహోన్నతియు న్వెలసిల్లఁ జెల్వుగన్.—ఆ. ౪.

చింతలపల్లి - వీరరాఘవుఁడు.

ఈకవి మధురవాణీవిలాస మనెడి యైదాశ్వాసముల ప్రబంధమును రచియించి శ్రీ వేంకటేశ్వరస్వామి కంకితము చేసెను. కవి నియోగిబ్రాహ్మణుఁడు; ఆశ్వలాయన సూత్రుఁడు; వీరరాఘవ పౌత్రుఁడు; వేంకటార్య పుత్రుఁడు. కవి తన్నుఁగూర్చి మిత్రు లన్నట్లుగాఁ దద్గ్రంథమునం దీక్రిందిపద్యములను జెప్పికొనెను—

శా. సాహిత్యంబుఁ గవిత్వమున్ వివిధశాస్త్రప్రజ్ఞ సత్కీర్తితా
సాహిత్యంబును దత్వబోధమును ద్రిస్కంధాత్మక జ్యోతిషం
బూహాచాతురి దేవభక్తియును నీకొప్పున్ స్వభావంబులై
యాహా చింతలపల్లి రాఘవకవీ యాధ్యుండ వీ వన్నిటన్.

మ. అవధానంబు లనేకము ల్నెఱపి రాజాస్థానముల్ చేరి వా
దవిధిన్ ధీరుఁడవై చతుర్విధకవిత్వప్రౌఢిమ ల్చూపి భూ
ధవదత్తవ్యపఘోటకాదిబహుసత్కారంబు గైకొన్నమి
న్నవు నీ కబ్బమె వేంకటేశ్వరుఁడు స్వప్నంబుం బ్రసాదించుటల్.

* * * *

సీ. జాములో శతకంబు సంధించి కంకణాదులఁ గొంటి వలరాయదుర్గమునను
బహుళావధానముల్ పఱపి నాలుగుఁగల్ తేజి నందితి మల్లధీరువల్ల
వాగ్ఘాటిసంప్రీతి దిగ్ధరాధిపదత్తవస్తువాహనములవార్తఁ గంటి
భూపవాటీతటాకోపవనుల్చేసి స్థిరకీర్తి చెందితి పురుతరముగ
సకలభూపాలసంస్థానశంసనీయ! నిజచతుర్విధకవితాభినేయపాండి
తీసమాఖ్యాకశాపూర్ణదిక్ప్రదేశ! వీరరాఘవ నీసరి విబుధు లేరి?

ఈపద్యములయందుఁ జెప్పఁబడినవన్నియు నిజములయినపక్షమున, కవి యసమానపాండిత్యమును గవిత్వకౌశలమును గలవాఁ డయినందుకు సందియముండదు. కడపటిపద్యమునందుఁ జెప్పఁబడిన మల్లధీరుఁ డెవఁడో యింకను విచారింపవలసి యున్నది. కవి తుంగభద్రాప్రాంతప్రదేశములయం దుండినవాఁడు. ఈతనికాల

మేదో స్పష్టముగాఁ దెలియరాదుగాని యీతఁడు పదునెన్మిదవశతాబ్దమధ్యమునం దుండినట్లూహింపఁదగియున్నది. కవిపూర్వులలోసహితము కొందఱు విద్వత్కవు లుండినట్లు మధురవాణీవిలాసములోని యీక్రిందిపద్యములు తెలుపుచున్నవి—

సీ. ఏధన్యుమహితతత్త్వబోధాప్తి కలపుష్పగిరిదుర్గతోడైనవరము సాక్షి
యేవాగ్మిసుకుమారతావృత్తికిని బినాకినిచెంత సేవింపుచునికి సాక్షి
యేమాన్యునైశ్వర్యసామాన్యతకు రాజ్యకృతశిరోభూషణకృతియె సాక్షి
యేగ్రంథకారవంశాగ్రియతకు ఘనప్రభుమానితంబైన బ్రతుకు సాక్షి
యట్టిఘనుఁ గేశవులంబునఁ బుట్టి వాని కలిమికవితయొకా వర మడిగికొనియె
నట్టిచింతలపల్లివంశాగ్రయాయి పల్లకిపదస్థుఁడై మించు నెల్లనుకవి.

మ. చతురుండై యవధానముల్సలిపి దేశాయీలు మెచ్చన్ మహో
న్నతుఁడై యప్పకవీశ్వరుండు గిరియానారీవతంసంబునం
దతివిద్యానిధి సాహితీనిపుణు రాజాస్థానసంపూజ్యు నం
చితవాగ్ధాటిఁ బ్రబంధకర్తఁ గవిసంజీవాఖ్యుఁ బుత్రుం గనెన్.

ఈకవి సంజీవాఖ్యుఁడు చంద్రాంగదోపాఖ్యానము ప్రబంధము రచియించెను. వీరరాఘవకవియొక్క కవిత్వము ప్రౌఢమైనది. ఈతని మధురవాణీవిలాసమునుండి రెండుపద్యము లిందుక్రింద నుదాహరింపఁబడుచున్నవి—

శా. కాసారస్థితిఁ బూని నీచులకు యోగ్యంబై విమ్రపాయమై
గాసిన్ నైకొనుకంటకంబుల నిజాంగం బెల్ల సచ్ఛిద్రమై
యేసూత్రంబున బల్కినేని బిస మాహేలావతీబాహుశా
ఖాసామ్యం బెటువోందు నా నిజ మదశిపాలిన్ సిరుల్చెందునే.— అ. ౧.

చ. వలగగుపుష్పమంజరులు బంగరుతీఁగెలు ముత్యపున్సరుల్
వెలయుపుసుంగుతావు లిడ వెన్నెలకుప్పలువోలె రాజభో
గులు నగునవ్వలానినలు కొట్నమునం దటు వట్టిధాన్యముల్
సొలసి సువాలు పాడుచును సుంకులు నించిరి మించి రమ్యగన్.— అ. ౫.

రేచర్ల మాధవరాయకవి.

ఈకవి చంద్రికాపరిణయ మనెడి యాఱాశ్వాసముల ప్రబంధమును రచియించెను. ఇతఁడు పద్మనాయకకులజుఁడు; సురభి మల్లమాపాలపుత్రుఁడు. ఈచంద్రికాపరిణయములోనికథ బాలసరస్వతికృతమైన చంద్రికాపరిణయములోనిదానికంటె

వేఱయినది. ఇందు కథానాయకురాలగు చంద్రిక పాంచాలరాజుకూఁతురు. ఈకవి నూటయేఁబదిసంవత్సరములక్రిందట నుండియుండవచ్చును. ఈకవి కవిత్వము తెలియుటకయి చంద్రికాపరిణయములోని కొన్నిపద్యముల నిందుఁ జూపుచున్నాను—

శా. ఏంటే మన్మథ మత్ప్రభుత్వమున కుర్విం బట్టువిఘ్నావళిన్
గెంటం దార్చుచు మామకాత్మహితభంగి న్మించు నీవుండుటల్
కంటంగానక బ్రహ్మభావము నెదుం గాంక్షించి యొక్కండు పెన్
గొంటుందాపసుఁ డెచ్చినాఁ డిలఁ దపశ్శల్యాధ్వసంచారియై.—ఆ. ౨.

చ. పలుచనివాఁకిం బొడమి భాసురపుణ్యజనాహితాత్మునిం
గలసి చెలంగ నొప్పదని కల్మి వెలంది తలంచి ధాత్రిని
య్యలఘుకకన్ జనించె సముదంచిత పుణ్యజనాప్తు నొక్కరా
జు లలి వహింపఁగోరియుని సొంపుగ నెంచిరి కొందఱార్తులన్.—ఆ. ౫.

అనియాది–గణపతిదేవుఁడు

ఇతఁడు శివయోగసారమను గ్రంథమును రచియించెను. ఈవేదాంతగ్రంథము పూర్వోత్తరభాగములు గలదయి, భాగమొకటికి నాలుగేసియాశ్వాసములు గలదిగా నున్నది. ఈకవి నియోగిబ్రాహ్మణుఁడు; మూలనామాత్యుని పుత్రుఁడు. ఈతనికవిత్వము ప్రౌఢమయి హృద్యముగానున్నది. ఈతఁడేకాలపువాఁడో సరిగా తెలియదుగాని యిన్నూఱుసంవత్సరములకుముందే యుండినవాఁడయిన ట్లూహింపఁదగియున్నాఁడు. శివయోగసారమునుండి కొన్నిపద్యముల నిం దుదాహరించుచున్నాను—

పూర్వభాగము.

చ. ప్రమదముతో నొకింతయినఁ బాత్రున కీఁగి మహాఫలం బగున్
బ్రమసి యపారవిత్తము లపాత్రున కిచ్చినఁ గీడు పొందు ఘా
సము నొసఁగంగ దుగ్ధములఁ జాలఁగ ధేనువు లిచ్చు నట్టిదు
గ్ధము లొసఁగన్ విషం బొలుకుఁగాద భుజంగమయూధ మిమ్మహిన్.—ఆ ౧.

ఉ. ఈక్రియ గర్భ మేర్పడిన నెంతయు భీతి జనింపుచుండఁ జిం
తాకులచిత్తయై కటకటా యిదియేమినిమిత్తమోకదా
నాకని కన్నుఁదమ్ముల ఘనమ్ముగ బాష్పము లేగుదేరఁగా
శోకభరాబ్ధిలో మునిఁగి సుందరి కోకిలవాణి యేడ్వఁగన్.—ఆ. ౨.

మ. ఎవయున్ జీవనచింతఁ బొట్టుపొరలై యేప్రొద్దువర్తించు నీ
చురియుందుం గలశీలనూనృతగుణస్తోమంబు లిట్లున్నయున్
గనరం బక్వానుకానికుంభమున యుగ్నంబార నిండంగఁ బో
సినవార్వారముభంగి నాశ మగుఁ జర్చింపంగ దేహంబులోన్.—ఆ. ౩.

ఉత్తరభాగము.

శా. శాంతాకారుని నాత్మసంస్థితు శివున్ సత్కాంతిసంపన్ను న
శ్రాంతంబుం దమయాత్మలో సుజను లారాధింతు రాయీశు న
య్యంతర్యాగవిహీను లల్పమతు లుద్యద్బాహ్యకర్మైకవి
భ్రాంతు ల్బాహ్యమునందుఁ గొల్తు రధికప్రాయాసముం బొందుచున్.—ఆ. ౧.

శా. దేహం బస్థిరమాటఁ గన్గొని మదోద్రేకంబునం బొందక తా
దేహంబు న్మనమున్ ధనంబు నతిభక్తిన్ సద్గురుస్వామికిన్
నీహారాద్రిసుతామనోహరునకున్ నిత్యంబు సద్భక్తియు
క్తాహీనాత్ములకున్ వివేకులకు వారర్పింతు రెల్లప్పుడున్.—ఆ. ౨.

మ. గుహలోన న్వసియించునొండెఁ దిరుగున్ క్షోణీతలంబందు ని
స్పృహవృత్తిన్ వివిధక్రియాకుశలుఁడై పెంపొందుఁ గాదేని ప్ర
త్యహము న్నిష్క్రియుఁడైననౌ నిజసమాధ్యాసక్తచిత్తుండు స
ర్వహితైకస్థితిఁ బెక్కుచేష్టలమరన్ వర్తించు స్వేచ్ఛాగతిన్.—ఆ. ౪.

ఉ. బోరన భేదవాదములు పుణ్యము పాపము సంశయంబు శా
రీరమునన్ బ్రవృత్తులఁ బరిభ్రమఁ దృష్ణను బాసి యవ్వఁడే
ధామని నిర్గుణం బయినతత్త్వముత్రోవఁ జరించుచుండు నా
ధీరుఁడ కేలగల్గు మఱిం దలఁప న్విధియు న్నిషేధమున్.—ఆ. ౪.

వేంకటాచార్యుఁడు.

ఈకవి ముక్తిచింతామణి యనుపేర జగన్నాథమాహాత్మ్యమును నాలుగాశ్వాసముల గ్రంథమునుగా రచియించెను. ఈకవి వైష్ణవబ్రాహ్మణుఁడు; యతిరాజకుల పెరుమాళ్లాచార్యుల కుమారుఁడు.

‘‘ఇట్లు గురుపరంపరానుసంధానపూర్వకంబుగా శ్రీజగన్నాయకుని కంకితంబుగా ముక్తిచింతామణిప్రబంధం తెనుంగు చేయుమని రాజమహేంద్రవరా

ధ్యక్ష పద్మనాయకాగ్రేసర కోన తిమ్మరాయకకృత కనకాంబరాభరణాను
లేపనపూర్వకసమర్చన ప్రేరితుండనై"

అని కవి వ్రాసికొనియుండుటనుబట్టి రాజమహేంద్రపుర ప్రభువైన కోన తిమ్మరాజు ప్రేరణముచేత నీగ్రంథము చేయఁబడినట్టు తెలియవచ్చుచున్నది. ఈగ్రంథ మిన్నూఱు సంవత్సరములకు ముందే చేయఁబడినదేమో! జగన్నాథమాహాత్మ్యకథనము రసవంతముగానేయున్నది. ఇందుండి కొన్ని పద్యములఁ జూపుచున్నాను—

శా. ధర్మాధర్మవిచారము ల్విహితసంధ్యాపూర్వయజ్ఞాదిస
త్కర్మంబుల్ నిరతాన్నదాననియతుల్ కాలానుగుణ్యక్రియల్
మర్త్యం బీపురుషోత్తమస్థలములో మర్త్యాళి కెల్లన్ భవ
న్నిర్మాల్యగ్రహణం బటంటి రిఁక నీనిత్యక్రియల్ వ్యర్థమే.—ఆ. ౧.

ఉ. నిద్దురరాఁ బఱుండుటయె నిక్కపుమ్రొక్కగు నిద్రయోగమౌఁ
దద్దయు వ్యర్థహింసక్రియ ధర్మ మగున్ నిరతాన్నదుష్టమా
చద్ది మహాప్రసాద మగు సన్నుతియౌను నిరర్థకోక్తియే
ప్రొద్దును నిత్యవాసు లగు పుణ్యులకుం బురుషోత్తమంబునన్.—ఆ. ౨.

ఉ. హీనుఁడు ముట్టినాఁ డనుచు నెంచి మదీయమహాప్రసాదమున్
దా నుపభుక్తియోగ్య మని తప్పుబుద్ధిఁ బరిగ్రహింపకే
మానసవ్యాజుండు హృతమంగళుఁడై భవరోగభాగియై
న్యూనతఁ జెంది పంచమనియోగమునందు వసించు నెప్పుడున్.—ఆ. ౩.

మ. జలజాక్షుండు రథంబుపైఁ గదలఁ దచ్ఛాయాసమాక్రాంతుఁడై
ఖలుఁ డైనన్ ఘనపాపము ల్వలఁగు సాకాంక్షన్ దదుద్యద్ధ్వజా
కలనోద్భూతరజోభరాంకితుఁడు వాక్కాయాంతరాఘంబులన్
గెలుచుం దత్సురసింధుమజ్జనఫలోన్నిద్రప్రభావుం డగున్.—ఆ. ౪.

లింగకవి, గంగకవి.

ఈయిరువురుకవులునుజేరి సీతావిజయ మనునామాంతరము గల శతముఖరామాయణమును రచించిరి. ఈయిరువురుకవులు వేదాద్రిపురనివాసులు. వీరిలో నీలకంఠోపాసకుఁ డయిన లింగకవి తాను రచియించిన మొదటి మూఁడాశ్వాసములును చిన్నారెడ్డిపుత్రుఁ డగు పోచనృపాలున కంకితము చేసెను; నృసింహోపాసకుఁ డగుగంగ

కవి తాను రచియించిన నాలవయాశ్వాసమును భోగనృపాలుని కంకితము చేసెను. ఈ యిరువురకవిత్వమును మొత్తముమీఁద రసవంతమయి స్పష్టమయి హృదయంగమముగా నున్నది. ఈకవు లిన్నూఱుసంవత్సరములక్రిందట నుండినట్టు తెలియవచ్చుచున్నది. వీరి కవనధోరణి తెలియుటకయి శతముఖరామాయణములోని పద్యము లొక్కొక్క యాశ్వాసమునుండి యొక్కొకటి యిం దుదాహరింపఁబడుచున్నది—

చ. శతముఖనామధేయుఁ డొకచండనిశాచరలోకనాథుఁ డు
గ్రత నలపంక్తికంఠఘటకర్ణపురందరజిత్ప్రహస్తు లీ
క్షితిఁ బడు టంతయున్ హితులచే విని రామునిమీఁద నాదటన్
ఘృతయుతపావకుండు బలెఁ గీలలు గ్రక్కుచు మండెఁ గ్రక్కునన్.—అ. ౧.

ఉ. రాముని భక్తికంధరవిరాముని నీలపయోదకోమల
శ్యాముని దానిహృత్కుముదసంచయసోముని సత్యభాషణ
స్తోముని సార్వభౌముని విశుద్ధసుకీర్తిగుణాభిరామునిన్
ధీమణి యైనభానుజుఁడు దగ్గఱఁ గాంచి ముదంబు చేకొనెన్.—అ. ౨.

శా. ఏరా యోరివనేచరాధమ భయం బింతైనన్ లేక ప్రా
కారంబు ల్వెసదాఁటి తెల్లు వతి వీఁకం దాఁటి దుర్భవనా
కారం బొప్పఁగవచ్చి టెల్లు తగ నల్క న్వచ్చి నాముందటన్
ధీరత్వంబున నిల్చి టెట్టు లిది చింతింప న్మహాశ్చర్యమా.—అ. ౩.

ఉ. రాయనుఁ బోతమంటిఁగదరాయను నిన్నెకఁబాసి యోర్వలే
రాయను హా శతద్వయకరాయను మన్నిక బాధపెట్టెనే
రాయను సీతనూజాఁ గనరాయను నెక్కడఁ గందురా కుమా
రాయను సగ్గ నేల వినురాయను హా శతకంధరాయనున్.—అ. ౪.

అంగర నృసింహకవి.

ఇతఁడు రాజరాజాభిషేక మనునైదాశ్వాసముల ప్రబంధమును రచియించి, కొప్పుల వల్లభూపతున కంకితము చేసెను. ఈకవి రామకృష్ణభట్టారకుని కుమారుఁడు. ఈకవి యేకాలపువాఁడో నిశ్చయముగాఁ దెలియరాలేదు. ఇతఁ డల్లసాని పెద్దనాదులను జేర్కొనక శ్రీనాథునివఱకును గలకవులనుమాత్రమే కవిస్తుతిలోఁ జెప్పియుండుట చేతను మధ్యకవులమాత్రమే చేర్కొన్న చిమ్మపూడి యమరేశ్వరుని సంస్తుతించియుండుటచేతను నృసింహకవి మధ్యకవులలోనివాఁ డేమోయని సందేహము కలుగుచున్నది.

ఇతఁడు చేసినకవి స్తుతిపద్యముల నిం దుదాహరించుచున్నాము—

క. భారతఘట్టోల్లంఘన । పారీణుల ధురీణబంధురధారా
ధీరప్రబంధగంధ । ర్వారూఢుని భట్టనన్నపార్యునిఁ దలఁతున్.

ఉ. అంజలిచేతుఁ బద్మజనిశాంతకరాంతనిరంతరోల్బణ
న్మంజులవల్లకీమధురమంద్రనినాదసముల్లసధ్వని
వ్యంజకవాణ్నిగుంభనసముంచితనూతనసృష్టిచాతురీ
రంజితసత్కవీంద్రబుధరాజికి దిక్కనసోమయాజికిన్.

ఉ. ఇద్ధగుణుం బ్రబంధపరమేశ్వరు నెఱ్ఱప్రెగ్గడన్ మనః
పద్ధతి నిల్పి సూక్తిరుచిభాస్కరుఁడైనహులిక్కి భాస్కరున్
బుద్ధి ఘటించి సంతతము పూనిభజింతు వచఃప్రసాదసం
సిద్ధుఁ జిమ్మపూడి కులశేఖరు నయ్యమరేశసత్కవిన్.

క. పాథోధిపయోభర ని । ర్బాధచలద్ధ్వనఘుమాయమానలహరికా
పాథేయదాయిసూక్తి ప । నాథున్ శ్రీనాథు నెమ్మనంబునఁ గొలుతున్.

ఈగ్రంథ మొకవేళ మధ్యకవులకాలములోనిదే యైనను దీనియందు లక్షణవిరుద్ధములైన ప్రయోగములు కొన్ని కానఁబడుచుండుటచేతి నప్పకవీయాదులు తమలక్షణగ్రంథములలో నిందలిపద్యముల నుదాహరింపక పోయియుండవచ్చును. కృతిపతినిబట్టి సహితము కవియొక్క కాలనిర్ణయము జేయుట కిప్పు డాధారములు దొరకలేదు. కృతినాయకునకు కొత్తాపురము రాజధానియైన ట్లీక్రిందిపద్యమునఁ జెప్పఁబడినది—

సీ. కుదురయ్యె నేవీటికోటలోపల వైశ్యసుప్రతిష్ఠితుఁ డైనశూలపాణి
పాయలే దేవీటిపర్యంతవనవాటి నిందరాయుండు లక్ష్మీధవుండు
నిండారు నేవీట నెండకాలమునందు జలజాకరం బైనసాగరంబు
చను రొండు నేవీట సార్వకాలికఫలస్ఫురితంబు వేదంగిపోఁకతోఁట
సూరపురంబుకైన నబ్బూరను లగుమ । ఱబ్బీఁగుచునుండు నేవీటిసిరులు
వసుమతీపాదపద్మసంవలితరత్న । నూపురంబగు నట్టికొత్తాపురంబు.

ఈకొత్తాపురము విశాఖపట్టణమండలములోని కొట్టాము గ్రామమేమో! ఈపురాధిపతియయిన కృతిపతి శూద్రకులసంజాతుఁడు.

సీ. మూర్ధాభిషిక్తకులముకుటంబు లేరాజుపాదపీఠికకు సోపానపంక్తి
చతురబ్ధివలయితక్షితితలం బేరాజుబాహుదండమునకు బావఁదండ
భువనంబు లేలుకప్పురగంధి యేరాజులీలాకటాక్షపాళికకు నీడ
రజనీకాంతజయంతరతికాంతు లేరాజురూపరేఖకుఁ బ్రతిరూపకంబు

లతఁడు పట్టుతలాటకేళావిరాయ। రాజదేవేంద్రరాజాధిరాజచంద్ర
గాయిగోవాళజగనొబ్బగండబిరుద। శాలి కొప్పుల వల్లభూపాలమౌళి.

మ. ధరియించెం జతురర్ణవీవృతమహాభారంబు దోశ్శీరికన్
విరియించెన్ విమతాంధకారము సముద్వేలప్రతాపోన్నతిన్
గురియించెన్ ధనధాన్యరాశి కవిరాట్కోటీనివాసంబులన్
వరియించెన్ వరకీర్తికాంతఁ దనరన్ వల్లక్షితీశుం డిలన్.

ఇత్యాదిపద్యములలో బిరుదాంకములతో వర్ణింపఁబడి యుండుటచేతఁ గృతిపతి కవి చెప్పిన ట్లఖండభూమండలాధిపతి కాకపోయినను చిన్నసంస్థానాధిపతియైనట్లు కనుపట్టుచున్నాఁడు. స్పష్టముగాఁ దెలియువఱకును గవికాలము నిప్పుడు పదునాఱువందలయేఁబదికిఁ దగువాతికాల మనుకొందము. ఈకవిత్వమునందు లక్షణదోషము లనేకములు గలవు. ఇతఁడు ప్రబంధములోని యీమొదటిపద్యములోనే వ్రాయుట యని యుండవలసినదానికి వ్రాసుట యని ప్రయోగించినాఁడు—

ఉ. శ్రీసతి చన్నుఁగ్రేవలను జెక్కుల నొక్కుటఁ బత్రభంగముల్
వ్రాసుటకున్ విరించి నిటలంబుల నొక్కట భాగ్యవర్ణముల్
వ్రాసుటకున్ జతుర్భుజవిలాసము పూనినవేల్ప సత్కృపా
ల్లాప మెలర్పఁ బ్రోచు శుభలక్షణుఁ గొప్పుల వల్లభూవరున్.

ఇట్లు కొన్నిదోషములు కానఁబడుచున్నను మొత్తముమీఁదఁ గవిత్వము రసవంతముగానేయున్నది. రాజరాజాభిషేకములోని కొన్నిపద్యము లిం దుదాహరింపఁబడుచున్నవి—

చ. పనివడి చెప్ప నేల శిశుపాలునివిక్రమచేష్టితంబు లా
తనిపనిపూని దానవపదాతులు వచ్చిరి వీరె వారె యం
చనిశము తెప్పవెట్టక సురావళి దిక్కులు చూచుచుండఁగా
ననిమిషనాథు మొక్కటియు నగ్గము దప్పకయుండె నిప్పుడున్.—ఆ. ౧.

ఉ. ఆరయ విన్నమాత్రమున నైనను జూచినమాత్రనైన నె
వ్వారిమనంబులం బ్రణయవాసితమై యనురాగకందళం
బీరిక లెత్తుఁ గారణ మొకించుక లేకయుఁ బూర్వజన్మసం
స్కారవిశేషమం దదివికస్వరమై కొనసాగు నుర్వరన్.—ఆ. ౨.

చ. అమృతసరోవరంబుగ హిమాంశునిమూర్తి గరంగి లోనిచి
హ్నము వికచోత్పలప్రకరమై చెలువొందిన నందులోన సం

భ్రమమున నీఁదు లాడి జడిమంబున నంగము లూఁచు నేని యా
హిమమున నించు నేని శమియించునొకో మదనాస్త్రవేదనల్ —అ. 3

శా. శుద్ధాంతశ్శికరైకయోగ్య మగుచున్ శోభిల్లు నస్మద్వచో
రాద్ధాంతం బిది యిచ్చగింపక వృథా ప్రజ్ఞాపఃజ్ఞానస
న్నద్ధు లొక్కొందఱు కేవలంబుగ వితండావాదులై తా రసం
బద్ధోక్తు ల్వచియించి రేని మదమార్ప న్వారి ఖండించెదన్.—అ. ౪.

మ. మహిలో నీకిటు కున్న నేమి విమతస్తుత్యత్వము ల్పూనుటల్
సహియింపం దగునంచు నిప్పుడును విజ్ఞాపింప మా కేటికిన్
గుహనానాటకసూత్రధార భువి నీక్రొవ్వాడిమాయావిధుల్
బహురూపంబులు పన్నఁగాఁ దిరుగరే బ్రహ్మేంద్రచంద్రార్కులున్. —అ ౫.

సిరిపెగ్గడ—ధర్మనామాత్యుఁడు

ఈకవి నలచరిత్రము నాలాశ్వాసములపద్యకావ్యమునుగా రచియించి, శ్రీవేంకటేశ్వరుల కంకితము చేసెను. ఇతఁడు నియోగిబ్రాహ్మణుఁడు; హారితసగోత్రుఁడు; తిప్పయామాత్యపుత్రుఁడు. ఇతఁడు నలచరిత్రములోఁ దనదండ్రి నిట్లు వర్ణించి యున్నాఁడు—

ఉ. సూనుతుండు తిప్పనయశోంబుజాక్షికిఁ గ్రీడ సల్పఁగా
మేరుధనుర్ధరాచలము మేడ సుధాజలరాశి కేళికా
సారము పువ్వుఁదోఁట దివిషద్ధరణీరుహసంచయంబు నీ
హారమహీధరంబు కృతకాద్రియునై విలసిల్లు నెప్పుడున్.

తనతండ్రి యిందుర్తిసీమలోనివాఁడనియు, ఈ క్రిందిపద్యములలోఁ దనమేనమామ పేరూరి నివాసుఁడనియు, కవి చెప్పుకొనుటచేత నీతఁడు గోదావరీ కృష్ణామండలముల లోనివాఁడని తోఁచుచున్నది.—

సీ. తన కేఘనుఁడు ప్రపితామహుం డగు లోహితసగోత్రుఁ డల పల్లవందనాథుఁ
డెసఁగు నేఘనుతాత యసదృశోన్నతి పుట్టమాంబాధవుఁడుతిమ్మనాహ్వయుండు
పొంచె నేఘనుతండ్రి తనకీర్తిలత లాశ లంటఁ బెంపగు తిమ్మయప్రభుండు
వెలయు నేఘనుతల్లి విమలపతివ్రత వివిధసద్గుణశీల వెంగళాంబ
యతఁడు తుమురుగోటివరవంశాబ్ధి'ధుఁడు । సతతపేరూరి కేశవస్వామ్యధీన
మానసస్థితిఁబరఁగు నా మేనమామ । మతినిగురుసన్నిభుఁడు ధర్మమంత్రివిభుఁడు,

చ. విను మనఘాత్మ ధర్మసుకవీ భవదీయవచోవిలాసముల్
ఘనకవిహృద్వికాసములు గావె చమత్కృతిమీఱ నీవు నే
ర్చినగతి నిప్పు డానలచరిత్రము వేంకటశైలరాణ్ణివా
సునకు సమర్పణంబుగను శోభనలీల రచింపు పెంపుగన్.

ఈకవికాల మేదో నిర్ణయించుటకుఁ బుస్తకమునం దాధారము లేవియుఁ గానరాలేదు. ఇతఁడు శ్రీనాథుని వర్ణించియుండుటచేతఁ బూర్వకవి కాఁడనుట నిశ్చయము. ఇతఁ డాధునికుఁడయి యిన్నూఱుసంవత్సరములక్రిందట నుండియుండును. ఈతని కవిత్వము మొత్తముమీఁద నిర్దుష్టమయి యింపుగా నున్నది. నలచరిత్రములోని పద్యములఁ గొన్నిటి నిందుక్రిందఁ బొందుపఱుచుచున్నాను—

ఉ. ధారుణి వీరసేనవసుధావరువా లటువాల వీరలా
సారసమిత్రుఁ దూఱి తనసన్నిధిఁ జేరినవారి కెల్ల జం
భారి యిడన్ సురద్రుమసుమావళియే యుడివోయె నన్నచో
నారగణింపఁగాఁ దగమె యాఘనుఁ డోర్చినశత్రుసంఘముల్.—ఆ. ౧.

శా. లీల న్నీలలపట్టాలమేడకడ లాలిం గేలిమై నుంచి జో
జో లక్ష్మీశకటాక్షవీక్షణయుతా జోజో శుభాకార జో
జో లావణ్యరమాకుమార యనుచుం జోకొట్టుచుం బాడి ర
న్నాళీకేక్షణ లాస్యపాలసుతు వీణాకోకిలాలాపలై.—ఆ. ౨.

ఉ. వెన్నెల చందమామకును వెన్నెలకుం దగఁ జందమామయున్
పన్నుతలీల నంద మగు నందమునన్ నరసింహశేఖర యా
కన్నియ నీకు వేఱ్ఱ నలకన్నియ కీవును నాఁడుగూడ నేఁ
గన్నులఁ జూచు నేమొ నని కాంక్ష మొనర్చెద నెమ్మనంబునన్.—ఆ. ౩.

ఉ. అర్థఫలప్రదాయక గుణాకర నైషధసార్వభౌమ కా
ర్యార్థుల మైన మమ్ములఁ గృతార్థులఁ జేయఁగదయ్య సర్వశా
స్త్రార్థము లెందు నీ వెఱుఁగనట్టివి లేవకదా పరోపకారా
ర్థమిదంశరీర మను టాత్మఁ దలంచఁగదయ్య ధీనిధీ.—ఆ. ౪.

శా. నీతిం జూడు నరేంద్ర మీనతతుల న్మీనంబులే మ్రింగుటల్
ఘోరక్రీడఁ గుఠారకాష్ఠ మిల వృక్షవ్రాతముం ద్రుంచుటల్
జ్ఞాతిత్వంబునఁ గాదె జ్ఞాతు లెచటన్ సామాన్యులే చెల్లఁబో
జ్ఞాతిశ్ఛేదనలేనకి మ్మనెడుశాస్త్రంబుం బరీక్షింపవే.—ఆ. ౫.

మ. లలనా ప్రాణసమాన వైనను నేలాపాయు దే నన్ను నీ
పలుకే నమ్మి భవత్పదాంబుజసమీపక్షోణి నిద్రింపఁగాఁ
గలితవ్యాళవృకాదిజంతుభయదోగ్రంబైనయీకానలోఁ
బల నన్నీడఁగనాడి పో నధిప నీపాదంబు లెట్లాడెనో. — అ. ౬.

గణపవరపు-వేంకటకవి.

ఇతఁడు శ్రీప్రబంధరాజ వేంకటేశ్వరవిజయవిలాసమనెడి యేకాశ్వాసప్రబంధమును రచియించెను. ఇది యేకాశ్వాసగ్రంథమే యయినను, ఇందలిపద్యములసంఖ్యమాత్రము నాలుగాశ్వాసముల గ్రంథములో సామాన్యముగా నుండుదానికంటెఁ దక్కువ గాలేదు. ఈకవి నందవరీక నియోగిబ్రాహ్మణుఁడు; ఆశ్వలాయనసూత్రుఁడు; వసిష్ఠగోత్రుఁడు; అప్పయామాత్యపుత్రుఁడు. ఇతఁడు కృష్ణామండలములోని కామెపల్లెసీమయందలి గణపవరగ్రామవాసుఁడు ఇతఁడు పల్నాటిసీమవాఁ డగుటచేతనే స్వానుభవముచేతను గాఁబోలును 'పలనాటి గొల్లలపాటజాతి' యని యచ్చటి గొల్లలపాటను నిరసించియున్నాఁడు. ఇతఁడు మిక్కిలి యాధునికుఁడే యయినను, ఇతనికాల మిదియనిమాత్రము సరిగాఁ దెలియదు. ఇతఁడును దనకు వేంకటేశ్వరుఁడు స్వప్నమున సాక్షాత్కరించి తన్నుఁగూర్చి పలికినట్లు చెప్పుకొన్న పద్యములలోనియీ క్రిందిపద్యమువలన నితఁడు పదునాఱవశతాబ్దాంతమునకు లోపలివాఁడు కాఁడని స్పష్టమగుచున్నది—

సీ. అల నన్నెకోట పెద్దలక్షణజ్ఞత శబ్దశాసనకవి శబ్దబుద్ధి
ప్రాబంధికపరమేశ్వరు నర్థమహిమం బుభయకవిమిత్రునిపదలలితత
శ్రీనాథువాగ్రూఢప్రసిద్ధి నాచనసోమునభూరికావ్యంబు పోతరాజు
యమకవిధము మల్లయమనీషిచిత్రంబు పింగళి సూరకవివరు శ్లేష
నాంధ్రకవితాపితామహునల్లికబిరుదు ముక్కుతిమ్మనతేటయు భూషణునియ
లంకృతియు నీకె కలదౌ తలంపలక్ష్మి ఘనకవి యప్పయ వేంకటసుకవిచంద్ర.

ఈపద్యమునుబట్టిమాత్రమే కాక యితఁ డవతారికయందుఁ దన్నుఁగూర్చి చెప్పుకొన్న యితరభాగములనుబట్టికూడ విచారింపఁగా స్వాతిశయమును జెప్పుకొన్న యాంధ్రకవులలో నెల్ల నితఁ డగ్రగణ్యుఁ డయినట్టు కనఁబడుచున్నాఁడు. పయిపద్యమునందుఁ బదునాఱవ శతాబ్దాంతమందున్న పింగళి సూరనార్యుని (రామరాజ) భూషణుని పేర్కొనుటచేత నితఁడు పదునేడవశతాబ్దమునకు లోపలివాఁడు కాఁడనుటకు

సందేహములేదు. మఱియొకచోట నీతఁడు తన గ్రంథమునందు "లక్షణసారసంగ్రహ సరస్వతీవిలాస సాహిత్య చింతామణి సత్కవిజనసంజీవని" యని లక్షణసారసంగ్రహమును కవిసంజీవని చేర్కొనియున్నాఁడు. ఇందలి లక్షణసారసంగ్రహము చిత్రకవి పెద్దన్న రచియించినదైనపక్షమునఁ గవి పదునేడవ శతాబ్దారంభమునకుఁ దరువాతివాఁడును, కూచిమంచి తిమ్మకవి రచించినదయినపక్షమునఁ బదునెనిమిదవశతాబ్ద మధ్యమునకుఁ దరువాతివాఁడును, అగును. ఈగణపవరపు వేంకటకవి తనకుఁబూర్వులయిన కవుల కావ్యములలోనుండి గ్రంథచౌర్యమును విశేషముగాఁ జేసినవాఁడయినందున, అలక్షణసారసంగ్రహము కూచిమంచి తిమ్మకవిదే యైన పక్షమునఁ దిమ్మకవి గ్రంథములనుండియు చౌర్యముచేసినాఁ డని చూపుటకుఁ దగినదర్శనములు లేకపోలేదు. ఇరువురకవులగ్రంథములలోని యీపద్యములను జూఁడుఁడు—

సీ. బింబోష్ఠి యని నీవు పెంగరాకు శుకంబ సాంకవగంధి యీపంకజాక్షి
పంకజాక్షి యటంచుఁ బదరకు తేఁటి చంపకజాలనాస యీపల్లవాంఘ్రి
పల్లవాంఘ్రి యటంచు బాధింపకు పికంబ రామాంగి యీబిసప్రసవబాహ
బిసబాహ యని రాకు వెసనంచ జలదశిరోరుహ యీమహిరోమరాజి
యహిపరోమాళి యనుచు డాయకుము నెమ్మి
కార్ముకభ్రూలతిక యీచొకాఁగవుఁ జెలి
యనుచు శుకభృంగ పరభృత హంస నీల
కంఠ నికురుంబములఁ దద్ద కనలి పలికె.

అని తిమ్మకవి తన రసికజనమనోభిరామములోని చతుర్థాశ్వాసమునఁ జెప్పియుండఁగా గణపవరపు వేంకటకవి

సీ. చక్రస్తని యటంచు జగడించకు శశాంక గురుతమోవేణి యీసుందరదన
మధురాధర యటంచు మట్టుమీఱకు తేఁటి చంపకనాస యీజలజవదన
బిసబాహ యని మాఱు మసలకు రాయంచ జలధరచికుర యీకలువకంటి
పల్లవకర యని త్రుళ్ళకు కోయిల కిరామమూర్తి యీకీరవాణి
వదరకు తల యోశ సుస్వర సఖిత్వ
మోసియుండుటకతన మీ కితవొరచ్చ
ననుచు నళి చంద్ర పరభృత హంస శుకుల
భయము నయమునఁ దెలియఁగఁబలికె మఱియు.

అని చెప్పియున్నాఁడు. ఈయుభయులలో నెవ్వఁడు పూర్వుఁడో యాతని పద్యమును జూచి రెండవవాఁడు తనపద్యమునైనను వ్రాసికొని యుండవలెను, లేదా

యిఱువునుగూడఁ బూర్వమున్న యిటువంటి పద్యమును మఱియొకదానిఁ జూచి రైనను వ్రాసికొనియుండవలెను. వేంకటకవి గ్రంథచౌర్యము చేయువాఁడగుట తెలియుటకయి సరసభూపాలీయము నుండియు వేంకటేశ్వరవిలాసము నుండియు నొక్కొక్క చిన్న పద్యము నిం దుదాహరించుచున్నాను—

క. ఔరా యోబన్నృపాలక । మారా మను మదనసమరమాధుర్యుఁడవై
ధీరా నృసింహ కూడిలి । మారామను మదనసమరమాధుర్యుఁడవై.

అని యీపద్యము కావ్యాలంకారసంగ్రహములో పాదయమకమునకు లక్ష్యముగా నీయఁబడియుండఁగా, వేంకటకవి

క. ఔరా మాధవయజ్వక । మారా మను మదనసమరమాధుర్యుఁడవై
ధీరా విటార్య యేలితి । మారామను మదనసమరమాధుర్యుఁడవై.

అని పైపద్యమునే పేరులుమాత్రము మార్చి పంచదశవర్ణయుక్తపాదయమకమని తన పుస్తకములో వేసికొనియున్నాఁడు. ఈకవి వేంకటేశ్వరుఁడు తన్నుద్దేశించి పలికినట్లు కొన్నిటిని, తానే చెప్పినట్లు కొన్నిటిని, ఇతరులు తన్ను మెచ్చి పొగడినట్లు కొన్నిటిని, స్వరచితములైన గ్రంథముల నామములను జెప్పుకొనియున్నాఁడు. ఇట్లు చెప్పుకొనఁబడిన తారావళులు, యమశతకము, శృంగారరసమంజరి, కృష్ణమల్లకథ, బాలరామాయణ ద్విపదము, చాటుపద్యములు, లింగనిర్ణయము, ఆంధ్రప్రతాపరుద్రీయము, ఆంధ్రరసమంజరి, ఆంధ్రనిఘంటువు, ఆంధ్రకౌముది, గణయతిప్రాసలక్షణ సీసమాలిక, ఆంధ్రప్రయోగరత్నాకరము, రేఫ అకారనిర్ణయము, షట్ప్రత్యయ ప్రస్తారసరణి, ఇరువదారు ఛందముల వచనము, అలంకారసారము, పరమభాగవత చరిత్ర, ఆంధ్రద్వ్యర్థకోశము, కల్పితకల్పలత, ఆంధ్రవసంత తిలకభాణము, కవిత ప్రాసశతకము, ఆంధ్రప్రక్రియాకౌముది, జాంబవతీవిలాసము, చండవిద్యావతీ దండకము, చక్రవాళతారావళి, పురాణసారము, ప్రబంధరాజ వేంకటేశ్వరవిజయ విలాసము, అను గ్రంథములలో రెండుమూఁడులెక్క శేషించినవన్నియు నామమాత్రావశిష్టములయినవి. అట్లగుటకుఁ గారణము లేకపోలేదు. ఈకవి తానుజేసిన పుస్తకములు లోకమున కుపయోగపడవలెనన్న యుద్దేశముతోఁ గాక తనసర్వతోముఖ పాండిత్య ప్రకర్షమును లోకమునకుఁ బ్రకటింపవలెనన్న యుద్దేశముతో విశేషభాగము చేసి నందున నీతనిపుస్తకముల కిట్టిగతి పట్టియుండును.

సంస్కృతములోనున్న జ్ఞానధనమును జనులకు వెదచల్లవలెనన్న పరమార్థచింతతో మొట్టమొదట నన్నయభట్టారకాదులగు మహాకవులు పదునొకండవశతాబ్దారంభము నుండి సులభశయ్యను సంస్కృతగ్రంథములఁ దెనిఁగింపఁబొడఁగిరి. ఈభాషాంతరీకరణ

కార్యము పదునేఁడవశతాబ్దాంతమువఱకును నవిచ్ఛిన్నముగా జరగుచువచ్చెనుగాని యిట్లు భాషాంతరీకరణమునకుఁ బూనుకొన్నవారిలోఁ గడపటివారగు శ్రీనాథాదులు తమపూర్వులకన్నఁ దాము ఘనులనిపించుకోవలెనన్న చింతచేతనో మఱి యేహేతువు చేతనో సంస్కృతపదభూయిష్ఠము లైనదీర్ఘసమాసములతో నింపి రసమును జెఱుపక పోయినను తమగ్రంథములు బహుజనులకు దుర్గ్రాహ్య మైనకఠినశైలిని జేసిరి. ఇట్లా కాలములో భారత భాగవత రామాయణాదిముఖ్యగ్రంథము లన్నియుఁ దెలిఁగింపఁబడఁగా, అటుతరువాతఁ బదునాఱవశతాబ్దారంభమునం దల్లసాని పెద్దనాదు లొక క్రొత్త త్రోవం ద్రొక్కి కేవలభాషాంతరములు కాకుండఁ బురాణములలోని కథలను గైకొని స్వకపోలకల్పితములైన వర్ణనలను జేర్చి పెంచి శ్రీనాథాదులశయ్య నవలంబించి స్వతంత్రముగా ప్రబంధములను జేయ నారంభించిరి. ఈపని నూఱు నూటయేఁబదిసంవత్సరముల వఱకును జరగుచు రాఁగా, ౧౬౫౦వ సంవత్సరములోపల బహుమార్గముల నూతనప్రబంధము లనేకములు తెలుఁగునఁ జేయఁబడినవి. అంతటితో నూతనసృష్టి బహుతరముగా నంతరింపఁగా, ఈవలివారు వసుచరిత్రమును మాతృకనుగాఁ గొని దానికి పాఠాంతరములో యున్నట్లు పూర్వవర్ణనలనే తలలుమార్చి ప్రయోగించుచు వెనుకటి ప్రబంధముల ననుకరించి తమప్రబంధముల నల్లఁజొచ్చిరి. చేసినదానినే పేరులుమార్చి మఱలఁ జేయుచుండుటచేత నూతనార్థకల్పనలను జేయుట దుష్కరమయినందున నీవలివారిలోఁ గొందఱు మహాపురుషులా యర్థలోపమును పదాటోపముతోఁ బూరింపఁ బ్రయత్నించిరి. పూర్వపువా రక్కడక్కడ సముచితముగా శబ్దాలంకారములను జేర్చుచు వచ్చినను భాషావధూటికిఁ బ్రాణ మైనయర్థసారస్యమును జెడఁగొట్టకుండిరి. ఇటీవలివారర్థసారస్యము నంతగాఁ బాటింపక నిఘంటువుల వెదకిపదము లేరికూర్చి బంధించి తమ సరస్వతిని హృదయాకర్షకముగాఁ గాకపోయినను కర్ణరంజకముగా నైనను జేయఁ బాటుపడిరి. ఇట్టివారిలో నెన్నికగన్న కొందఱు బంధాదుల నతిమాత్రముగాఁజేర్చి యర్థసారస్యమును బూర్ణముగాఁ జెఱిచి యవయవములు విఱిచి తమభాషావధూటిని విరూపినిఁజేసి శవప్రాయము జేసిరి. మన యీవేంకటేశ్వరవిలాసకృతికర్తయు బలరామచరిత్ర కృతికర్తయైన గుడారు వేంకటదాసకవియుఁ గొంతవఱకీకడపటితెగలోఁ జేరినవారు. ఒకఁడు తనపుస్తకమునకుఁ బ్రబంధరాజవేంకటేశ్వరవిజయవిలాస మని పేరు పెట్టుకొనఁగా నింకొకఁడు తనపుస్తకమునకుఁ బ్రబంధరాజశిరోభూషణ ప్రకృష్టబలరామచరిత్రమని పేరుపెట్టుకొనెను. వేంకటదాసకవి

''నిరోష్ఠ్యమత్తేభవిక్రీడిత శార్దూలోత్పలమాలా తోటక మత్తకోకిల లయగ్రాహి
మణిగణనికర పంచచామరస్రగ్విణీప్రమితాక్షర మణిభూషణ ద్రుతవిలంబిత కవికంఠ

భూషణ విషయస్వభూతాద్భుతహర్షణి రథోద్ధతాంబురుహ కవిరాజవిరాజిత గణస
మకదండకార్యాగీత సీస ద్వివిధకంద శ్లోకచూర్ణికా వచనకైవార గద్య కళికో
త్కళికామంజరీ ద్విపద ధవళసువ్వాలశోభనారాత్రిక నానారగడభేదసప్తతాళైలా
మహార్ణవమిళాలిశానదద్వాత్రింశద్రాగ నానావిధవిచిత్ర నాగబంధ పుష్పమాలికా
బంధసంయుక్తకల్పిత కల్పవల్లీ చంపకమాలికావృత్తము'

అని పేరుపెట్టియొకపద్యములో ననేకబంధ గర్భవృత్తముల నిమిడింపఁగా, మన యీ వేంకటకవి దీని మించునట్లుగా ,

"బహువిధచిత్రకంకణ బంధత్రిగుణితసీసచరణచతుష్టయగర్భిత ద్విపదకందద్వయ
సమవృత్తచాపనయుగళాటవెలఁది తేటగీతి మదనవిలసిత తురంగవృత్త బహువిధ
తాళవృత్తాష్టక ధవళశోభనగానారాత్రిక గాన జంపెత్రిపుటార్ధచంద్రిక సువ్వాల
లాలిపద్యైలామంజరి సమతాడిండిమతాళవృత్త మణిగణనికర తురగవల్గన రగడోదా
హరణసంబుద్ధి కళికోత్కళికాగ్రాహిత రాగదళ ముఖారిరాగాటతాళదళ కాం
భోజిరాగ రూపకతాళదళ కాంభోజిరాగ సమపద కన్నడరాగ సాంగత్య కొరవంజి
దళ రేవగుప్తరాగ సమపద సావేరారాగైకతాళదళ బిలహరిరాగాటతాళ సమపద
పుష్పమాలికాబంధ గోమూత్రికాబంధ తారగబంధ షోడశదళపద్మబంధ పాదుకా
బంధ నవరంగబంధ ఖడ్గబంధ గుచ్ఛబంధ ఛత్రబంధ చామరబంధ గదాబంధ
చక్రబంధ శకటబంధ నాగబంధ రథబంధ వీణాబంధ శంఖబంధ మృదంగబంధ
పాదభ్రమకబంధ పాదార్ధ భ్రమకవింశతిబంధ భేదకందానుష్టుప్ శ్లోకాంతర్గత
చతుర్భద్ర నవరంగ సర్వతోభద్రాందోళికాబంధ యమకానులోమవిలోమ కంద
భాషాశ్లేషకందపకందాటవెలఁది గర్భితాంత్య తేటగీతియుక్తచాష్టభేదచిత్రసీసము"

అని పేరుపెట్టి యొకపద్యములోనే బహుబంధ గర్భవృత్తముల నిమిడ్చెను. కవిమిక్కిలి కష్టపడి పయిని జెప్పఁబడినరీతి గర్భబంధకవిత్వమును, ఏకాక్షర నిఘంటులను వెదకి

క. కైకోకీకాకకుకై । కోకాకాకింక కూకి కూకకకోకీ
కాకుకకు కేకికేకక । కూకోకోకూకక కింక కోకైకాకా.

ఈరీతి నేకాక్షరములతోడ చిత్రకవిత్వమును, ఒక్కదానిలో నేయితరపుస్తకములోను లేనంత యమితముగాఁ జెప్పి తనశిల్పవ్యాపారకౌశలమును కొంత చూపినను, కాళ్ళతో నడచి గమ్యస్థానమును చేరు సామాన్యమార్గమునువిడిచి యడ్డముగా భూమి మీఁదఁబడి కడుపుతో దొర్లి ప్రయాసపడి గమ్యస్థానమును జేరి యసాధారణప్రౌఢిమను జూపిన బుద్ధిమంతునిశక్తిని మెచ్చుకొనునట్లు యిట్టి కపటాచమత్కృతులు మెచ్చుకొనఁదగియుండును గాని యంతకంటె నెక్కువ శ్లాఘాపాత్రములు గావు.

నవరసరసికు లెప్పుడును హృదయాహ్లాదకరముగా నర్థకల్పనము చేసియు కర్ణరసాయనముగా మృదుమధురవాగ్గుంభనలతో భావములం గూర్చియు మహోద్దీపకముగా నీతిపోషణమొనర్చియు వర్ణనలు చేయంగలిగిన కవినిమాత్రమే మెచ్చుకొందురుగాని కావ్యదోషములకు లక్ష్యము లగునట్లుగా నర్థగౌరవముం జెఱిచి పదములవిఱిచి పద్యములలోం బద్యములను దూర్చినవానిని మెచ్చుకోరు. ఈ వేంకటకవర్యుని కవనమునందు వ్యాకరణదుష్టము లయినప్రయోగము లనేకములు కానంబడుచున్నవి. ఈకవికాల మేదో సరిగాం దెలియ రాకపోయినను, ఈతనిగ్రంథములోని సలాము సాహెబు పిరంగి తుపాకి మొదలగుపదప్రయోగము లీతం డాధునికుండని ఘోషించుచున్నవి. బంధగర్భచిత్రకవిత్వములకొఱకై శ్రమపడి కూర్చినభాగములను విడిచినపక్షమున, ఈతని కవిత్వము మొత్తముమీంద రసవంతమయి పదలాలిత్యము కలదయి మనోహరముగానే యున్నది. ప్రబంధరాజ వేంకటేశ్వరవిజయవిలాసములోని కొన్నిపద్యముల నిందుం బ్రదర్శించుచున్నాము—

చ. తగునె నృపాలకన్యలకు దవ్వులనవ్వుల పువ్వులాటలీ
వగలం జరింప నిందుం దగవా మగవా మగవార లుండంగా
మగుడి పురంబుం జేరం జనుమా వినుమా యనుమాన మేల నీ
సొగసు విలాస మందమును సొంపును నింపును దెంపుమీఱంగన్.

ఉ. వ్రేలిమి వ్రేల్వం డెప్పుడును వ్రేల్చు మొగంబు వధూలలామకై
చాలంగ సంధ్యవార్చండు త్రిసంధ్యలవార్చును వంటవార్పులా
బాలికయింటం దండ్రి సలుపం గననొల్లండు దేవపూజ యే
వేళల లంజెత్తల్లి యిలువేలుపుమాత కిడుంబ్రణామముల్.

చ. అడిగినం దెచ్చువాండొ కడునందమునం గనునైనవాండొ మే
ల్నడవడికాండొ వీటం దగునాయకమై చరియించువాండొ చే
విడిముడికల్గువాండొ తలవెంద్రుక లందఱు రాకుమారకుల్
ముడుపులు వారగాంగురియ ముట్టవు కారణ మేమికూంతురా.

శా. ఏమీ పల్కవు నేను బిల్వ దయ లేదే నీకు నాయయ్య ని
న్నేమంటిన్ సుకుమార నాయెదను దప్పేదీ కుమారాగ్రణీ
నామీందన్ జల మేలగా తనయ నన్మన్నించరా పెన్నిధీ
నీముద్దుల్గననోచినాముగద తండ్రీ నీతిపారంగతా.

వేముగంటి-దత్తోజీపండితుఁడు.

ఈకవి ప్రస్థానత్రయములో నొకటియైన భగవద్గీతా యోగశాస్త్రమును బద్యకావ్యముగాఁ దెనిఁగించెను. ఇతఁడు హరితసగోత్రుఁడు; నాగమాంబకును నాగోజీపండితునకును బుత్రుఁడు; ఆపస్తంబసూత్రుఁడు; మాధ్వమతస్థుఁ డని తోఁచుచున్నది. ఈయనకాలము మొదలయినవానిఁ గూర్చి యేమియు నిశ్చయముగాఁ దెలియదు. ఇతఁడు నూఱుసంవత్సరముల లోపటివాఁడు కాఁడు. కృష్ణార్జునసంవాద మనునామాంతరము గల యీయోగశాస్త్రములోని కొన్ని పద్యముల నిం దుదాహరించుచున్నాను—

ఉ. కోకలు జీర్ణమై చనఁగ గొబ్బున వానిఁ బరిత్యజించి తా
నాకరనూత్నవస్త్రములఁ జెల్వుగఁ దాల్చినభంగి దేహి సు
శ్లోకుఁడు జీర్ణదేహములశోభను రోసిన జీవమూర్తి యీ
లోకపుఁగోమలాంగముల లోలతఁ దాల్చును భద్రమూర్తియై.— అధ్యా. ౨

ఉ. సల్లలితంపుఁగర్మములు సాంద్రదయాశ్రీగధి సద్విరక్తిచే
నోలిఁ సన్యసించి పటుయోగసుఖంబుఁ జెందుచుండుఁ దా
నెల్లెడ జీవుఁ బోలి కడుహేయపుఁదొమ్మిదితూంట్లమేనిలోఁ
ద్రష్టృమఁ జేయ నొల్లఁడు ప్రతోషముతో నియమింపఁ దన్యలన్.— అ. ౫.

ఉ. వేదములన్ మఖంబులను శ్రుతదానతపంబులన్ సమ
ర్థాపిత మైనపుణ్యము నధిగించిన బొనరించుయోగి య
య్యాగమపూరుషోత్తమునిజార్థగుణమ్మి సంగ్రహించి ని
ర్వేదన లేక యాగ్య మగు విష్ణుపదంబును జెందు నర్జునా.— అ. ౮,

ఉ. ఇంద్రియసౌఖ్యసంపదల నేమియుఁ గోరక వీతరాగుఁడై
సాంద్రయశుం డహంక్రియలచక్కటిఁ బోవక దూరవర్తియై
యింద్రజ మేనికిన్ జరయు మృత్యువు జన్మము వ్యాధులున్ వని
స్తంద్రత దుఃఖదోషములుఁ జాలఁగఁగల్గు నెఱుంగఁగాఁదగన్.— అ. ౧౩.

ఉ. కామము రాగముం బలుఁగల్గి యహంకృతి దంభయుక్తుఁడై
యేమనుజుండు శాస్త్రవిధి నెంతయుఁ దుచ్ఛముగాఁ దలంపుచున్
భూమికి భీకరం బయినభూరితపం బొనరింపుచుండు నా
పామరు నాసురక్రియులఁ బల్కెదవానిఁగ నిశ్చయింపుమా.— అ. ౧౭.

గుడారు-వేంకటదాసకవి.

ఈకవి బలరామచరిత్రమని సామాన్యముగా వాడఁబడు ప్రబంధరాజశిరోభూషణ ప్రకృష్ట బలరామచరిత్ర యను నాల్గాశ్వాసముల ప్రబంధమును రచియించెను. ఇతఁడు బలిజవంశజుఁడు; పైడిపాలగోత్రుఁడు. ఈతని తండ్రి గురవేంద్రుఁడు; తల్లి రంగమాంబ. ఇతఁ డాధునిక కవియే యయినను, కాలనిర్ణయము చేయుట కాధారము లేవియుఁ గానరాలేదు. ఇతఁడు నూటయేఁబది సంవత్సరములక్రిందట నుండెనేమో! ఈతని కవిత్వము ప్రౌఢమైనది. బలరామచరిత్రమునుండి రెండుపద్యము లిం దుదాహరింపఁబడుచున్నవి:—

శా. నీరేజాక్షికి హారమౌక్తికతతుల్ నీలంబులై తైలముల్
జాలింగాఁ బగడంబులై పిసప వజ్రాకారముల్పూని వి
స్తారస్వేదకణంబులం దడిసి సున్నం బయ్యె నాద్యుద్ధమ
స్తారస్ఫారశరాగ్ని హైమపట మచ్ఛచ్ఛాయమై తోఁచినన్.—ఆ 3.

ఉ. వారిధిధీరమానసుఁ డవారితతేజుఁడు నైజరాజకం
ఠీరవభావభీతహరిణీభవదున్మదవైరివీరుఁ డు
ద్దారుణమార్గణప్రకరదైన్యవిదారణదానదక్షుఁ డీ
భూరమణాగ్రణిం గనుము పుష్కరనేత్రవిదూరకాహ్వయన్.—ఆ. 4

కామనూరి-కృష్ణయ్య.

ఇతఁ డిందుమతీపరిణయ మనెడి యైదాశ్వాసముల ప్రబంధమును రచించెను. రఘువంశములోని యజమహారాజుచరిత్ర నీప్రబంధరూపమునఁ జేసినట్లు కవియే యీపద్యమునఁ జెప్పియున్నాఁడు:—

గీ. కాళిదాసకవిశ్రేష్ఠకల్పితంబు। భవ్యచరితంబు రఘువంశకావ్య మందు
నజునికథ యాంధ్రభాషచే నలఘుమతిని। కృతి రచింపఁ బూనితి నలంకృతులు చెలఁగ.

ఈకవి నందవరీకబ్రాహ్మణుఁడు; గోవిందయామాత్య నందనుఁడు. ఇతఁడు నూటయేఁబదిసంవత్సరముల నాఁటివాఁడయి యుండునేమో. ఈతనికవిత్వము మనోహరమైనదే. ఇందుమతీపరిణయములోని రెండుపద్యముల నిం దుదాహరించుచున్నాను:—

ఉ. అంత దిలీపభూపతనుజాగ్రణి దేశము మేలుబంతి మ
ధ్యందినపంకజాప్తనిభుఁ డాధరణీశుఁడె మేటి తత్సుతుం

డిందు వసంత చిత్తజ సురేశ్వరసూనులకన్న మిన్న వా
సందముఁ జెప్పఁ జూప వశమా యసమానపరాక్రమక్రమా. — ఆ. ౧.

ఉ. అన్నను ద్రొక్కి తత్కరుణ నాయితపెట్టిచదంతపుంబసిన్
జెన్నలగారుపల్లికి వసించి చొకాటపుఁదేటకెంపురా
కన్నె మెఱుంగుఁగేలఁ బొసఁగంగ ధరించె మధూకదామము
త్యున్నతమంగళప్రకటితూర్యరవంబులు మిన్నుముట్టఁగన్. — ఆ. ౪.

వేంకటాచార్యుఁడు.

ఈకవి భద్రరాజపుత్త్రచరిత్రమను నైదాశ్వాసముల ప్రబంధమును రచియించెను. కళాపూర్ణోదయమునందువలెనే యిందలి కథలును కవిచే నూతనముగాఁ గల్పింపఁబడినవి; కాని కవిత్వ మంత ప్రౌఢమయినది కాదు. ఇందలి కథలను బోలిన కథ లనేకములు కొన్ని వైష్ణవగ్రంథములలోఁ గానఁబడుచున్నవి. ఈకవి వైష్ణవ బ్రాహ్మణుఁడు; ఆపస్తంబసూత్రుఁడు; ఆత్రేయగోత్రుఁడు; శ్రీనివాసాచార్య పుత్త్రుఁడు. ఇతఁడు నూటయేఁబది సంవత్సరములక్రిందట నుండినవాఁడయినట్లు చెప్పుచున్నారు. భద్రరాజపుత్త్రచరిత్రమునుండి రెండుపద్యముల నిందుఁజూపుచున్నాను —

శా. ఏమం జెప్పనభంగిఁ జేసితివె కాశీశుండు ప్రత్యక్షమై
తా నిన్మెచ్చితిఁ గోర్కె వేఁడు మనెనే ధన్యుండ నైతిఁ గృపన్
నానాసౌఖ్యశుభాకరంబుఁ బరము న్నాకిమ్ము యంటే శివుం
డానందించి యొసంగెనే వరము నీవబ్బంగిఁ జేకొంటివే. — ఆ. ౧.

ఉ. ఎవ్వరు నావిధంబు జలజేక్షణకుం దెలిపించి మేలు లో
నివ్వటిలం గరంగ నని నేర్పుదలిర్పఁగఁ దెచ్చికూర్చి యీ
నెవ్వగఁ బాపువారు తమి నిల్పఁగఁగూడదు మేనఁ బ్రాణముల్
రవ్వకుఁ బోవుచున్నయవి రాదు ధరింపఁగ నేమిచేయుదున్. — ఆ. ౫.

మల్లంపల్లి — నాగభూషణకవి.

ఇతఁడు బసవవిజయమను మూఁడాశ్వాసముల గ్రంథమును రచియించెను. ఇతఁడు వీరశైవమతస్థాపకుఁడైన బసవేశ్వరునిచరిత్రమును మాత్రమే కాక బసవచరిత్రాదులను రచించినపాలకురికిసోమనాథాదులనుగూర్చియు నిత్యాదిపద్యములలో వ్రాసియున్నాఁడు.—

క. వీరప్రతాపరుద్రుఁడు । ధారుణిలోఁ గలుగుప్రజల ధర్మాత్ముండై
యారూఢి నిలయు నేలుచు । గారవమున నున్నయట్టికాలమునందున్.

సీ. ఫాలాక్షుభక్తుండు భవపాశత్యాగి సముచితభూతిరుద్రాక్షధారి
పంచాక్షరీమంత్రపఠనపారీణుఁడు విమలఘోరవ్రతవీర్యయుతుఁడు
కావ్యకళాశాస్త్రకామితప్రవణుండు శాఖాగ్నిఫలపత్రజలము లైన
భవిచేఁ జేకొనం దవి వినోపఁడు భాతిమీఱంగను బాలకుఁడు
సోమనాథుఁ డనఁగ సురలు ప్రస్తుతి చేయ । సకలశాస్త్రములను జదివిచూచి
ప్రకటితముగ శివునిభక్తి యధికమని । బసవదేవుమహిమ ప్రబలఁజేసె.

ఈకవి శైవబ్రాహ్మణుఁడు, హారితసగోత్రుఁడు; త్రిపురాంతకారాధ్యపుత్రుఁడు; ఇతఁడు నూటయేఁబది సంవత్సరములక్రిందట నుండినట్లు తెలియవచ్చుచున్నది. ఈతని కవిత్వ మంత మంచిది కాక, వ్యాకరణవిరుద్ధములైన ప్రయోగములతోఁ గూడియున్నది. ఈతని బసవవిజయములోని రెండుపద్యము లిందుఁ బ్రదర్శింపఁబడుచున్నవి:—

చ. బసవపురాణకావ్యమును బ్రాభవ మొప్పఁగఁ బద్యగద్యలన్
బొసఁగఁగ నాంధ్రకావ్యములు బుద్ధిని దా రచియించి చెప్పఁగాఁ
బసిగొని భూసురుల్ పనియుఁ బాయక గుంపులు గూడి రాజుతో
మసలక పోయి పాల్కురికిమాన్యుఁడు సోమన చేయుశాస్త్రముల్ — ఆ. ౧.

చ. అధములు మీరు బ్రాహ్మణులె యందఱుఁ జూడఁగ నొక్కచకి యీ
పథమున వేదవాక్యములు పాడి పదంబుల విమ్ము నందఱన్
బధిరులఁ జేసెఁగా సరిపాల్పడి మీ రొకరైన వారితో
నెదుటను నిల్చి సంహితల నేర్పునఁ జెప్పఁగఁజాల రెవ్వరున్. — ఆ. ౧

చిత్రకవి_సింగరార్యుఁడు.

ఈకవి ఓప్పణీయమను మూఁడాశ్వాసముల ప్రబంధమును రచియించి శ్రీరామాంకితము చేసెను. ఈకవి యాఱువేలనియోగిబ్రాహ్మణుఁడు. ఈతని యనంతరమున నీతని పుత్రుఁడగు నారసింహాకవి తనతండ్రి రచియించినగ్రంథమును దెచ్చి పండిపెద్ది కృష్ణస్వామి కిచ్చి యాతనివలన ధనస్వీకారము చేసినట్టును, వారిద్దఱును గలిసి కృత్యాదియందలికొన్నిపద్యములను గద్యములనుమార్చి గ్రంథమును కృష్ణస్వామి రచియించినట్లు దిద్దినట్టును జెప్పుచున్నారు. ఆకొన్నిపద్యములను మార్చుటలోఁ గూడఁ గృష్ణ

స్వామికి నారసింహకవిసాహాయ్య మున్నదని తెలుపుటకుఁ గాఁబోలును ఓల్లాణీయమున నీక్రిందిపద్యము వేయఁబడియున్నది—

క. మున్నింద్రదత్తనాథపునకు వెన్నుఁడు సహాయు మైనకథమున సేనా
    సన్నుతసద్గుణగణసం పన్నుం డగుకవివరాధిప సహాయమునన్.

గ్రంథమునందుఁ బండి పెద్దికృష్ణస్వామియే గ్రంథరచన చేసినట్లు చెప్పఁబడియున్నను నిజముగాఁ గృతికర్త సింగరయ్యయే యనుటకు నిదర్శనము ప్రథమాశ్వాసాంతమునం దుండిన యీక్రింది చక్రబంధమునందుఁ గానఁబడుచున్నది—

శా. ధన్యా సింహభచంద్రకీర్తి వరవిద్యాపండితాగ్య్రక్రమా
    గణ్యా గర్వధనంజయా శివదముక్తాకృత్పృథ్విగిరక్రప్రభూ
    జన్యారాజితభూమిశాత్రవసుభృజ్జావిద్రమావిక్రమా
    మాన్యారాధన త్యాగభోగజయధామా సవ్యభాగోత్తమా.

ఈకావ్యము నూటయేఁబది సంవత్సరములకుఁ బూర్వము రచియింపఁబడినట్టు తెలియ వచ్చుచున్నది. ఇందలికథ మనోహరముగాను కవనము రసవంతముగాను గొంతవఱ కున్నను దానిశశాంకమువలెనే యిదియు నీతిబాహ్యమైనదగుటచే చదువఁ దగినది కాదు. మదనాభిరాముఁడనురాజు రూపలావణ్యవతియగు యామినీపూర్ణతిలకకు సంగీతసాహిత్యములు చెప్పింపఁదలఁచి, సమస్తవిద్యలయందును సమర్థుఁడయిన బిల్హణుఁడను సంస్కృతకవీంద్రుని రావించి, అతఁడును రూపయౌవనసంపన్నుఁ డయినందునఁ దన కూఁతు నాతనికడ నొంటిగానుంచి చదివించుటకిష్టము లేనివాఁ డయి మంత్రితో నాలోచింపఁగా నతఁడు

మ. ఒకచిత్రవతి మున్న దర్వరకు రాజోత్తంస సిద్ధంబుగా
    నకలంకాకృతి యోవనీతనము జాత్యంధు న్విలోకింప దా
    సుకవీంద్రుండును గుష్ఠగాత్రి నెపుడుం జూడ న్నొంగోరఁ డిం
    దుకు నేమో వచియించు టే నెఱిఁగి యుండు న్మహ్న తత్కార్యమున్.

మ. కవిరాజాగ్రణి పట్టుపద్దరుచు నీకంజాక్షికిం జెప్పి యా
    కవికిన్ మీసుత కుష్ఠగాత్రియని వేషంబుం దెల్పి యవ్వాకిన్
    భువి నన్యోన్యవిలోకనక్రియలు నేర్పున్ మీఱఁ గాకుండున
    ట్టు విచారించెద నొక్కయుక్తి వినుఁ డట్లున్ రాజదేవప్రభా.

అని రాజపుత్రి తాను జాత్యంధునిముఖముఁ జూడనని నియమముపట్టియున్నందున నామెతో నావిద్వాంసుఁడు పుట్టుగుడ్డివాఁడని చెప్పియు బిల్హణుఁడు కుష్ఠగాత్రిని జూడనని నియమముచేసికొనియున్నందున నాతనితో రాజపుత్రి కుష్ఠగాత్రియని చెప్పి

యు నిరువురకు నన్యోన్యముఖావలోకనము లేకుండ నడుమ తెర వేసి చదివింప వలె నని యుపాయము చెప్పెను. రాజాయుపాయమునకు సంతోషించి తనకొమారితతోను విద్వాంసునితోను నమ్మఁబలికి వారి నొడఁబఱిచి యిరువురమధ్యను తెర వేయించి కూఁతు నాతనివద్దఁ జదివింప నారంభించెను. కుశాగ్రమతియైన యామినీపూర్ణతిలక యాతని వలన సంగీతసాహిత్యాదివిద్యల నభ్యసించి యల్పకాలములోనే కవిత్వముచెప్పనేర్చు కొనెను. ఇట్లు కొంతకాలము జరుగఁగా నొకనాఁటిరాత్రి క్రొత్తగా నుదయించిన పూర్ణచంద్రునిఁజూచి కవి

చ. జలనిధిపంక మంచు మఱి చాయయెఁ జిహ్నము లేడిపిల్ల కం
దళితసురేంద్రనీలమణిధామ మటంచు రచింతు రంద ఱీ
కలువలరేనియందుఁ గలకందును నే ననుకొందు రాత్రియం
దలవడ మ్రింగినట్టితమ మంతరసంస్థ మటంచు నెంతయున్.

ఇత్యాదివాక్యములతోఁ జంద్రవర్ణనము చేయఁజొచ్చెను. ఆవర్ణన నాలకించి యామినీ పూర్ణతిలక

శా. అంధుం డెక్కడ చంద్రుఁ డెక్కడ తదీయంబైన యావర్ణనా
బంధం బెక్కడ యిట్టివింత గలదే భాషింప నెచ్చోటనై
నం ధాత్రీంద్రుఁడు మాకు నిర్వురకు నందంబొప్ప నన్యోన్యదృ
క్సంధానం బగు నంచుఁ జేసె నిటులం జర్చింప వేమున్నదే.

పుట్టుగ్రుడ్డివాఁడెక్కడని చంద్రవర్ణనము చేయుటెక్కడని రాజు మాకిరువురకు నన్యోన్య సంధానము కలుగకుండ నిమిష కల్పించెఁగాఁబోలునని తలఁచి, వ్రతభంగమయినను గానిమ్మని సాహసముచేసి తెర దీసి చూచెను.

ఉ. ఆకడ బిల్హణాఖ్యకవి యత్తఱిఁ దామరసారిఁ గూర్చి యెం
తో కళ యుప్పతిల్ల వినుతుల్ప్రచరింపుచునుండి యంతలోఁ
బ్రాకటబద్ధకాండపటిపై రమణీమణిమోముఁ జూచి య
స్తోకమహోదయాద్రిపయిఁ దోఁచిన చంద్రునిఁ బోల్చి యిట్లనన్.

ఆయౌవనపురుషుఁడు పండువెన్నెలఁ గాయుచుండఁగా సంపూర్ణపూర్ణిమాచంద్ర బింబమును మీఱిన నిండుజవ్వనియొక్క ముఖచంద్రబింబము నొంటిగాఁ జూచిన తరువాత జరిగినపని చెప్పనక్కఱయే లేదు. ఇట్లు కొంతకాలము రాజపుత్రియుఁ గవీశ్వరుఁడును యథేష్టవిహారముల నానందించుచుండఁగాఁ దెలిసి కావలివారు రాజు నకు విన్నవింపఁగా నతఁడు కూఁతుం జేరఁబిలిచి

ఉ. కోరినరాకుమారకునకుం బ్రియ మారఁగ నిన్ను నిచ్చి యిం
తో రతిమీఱి సౌఖ్యమున నుండెదనంచుఁ దలంచియున్న నా
కోరిక లెల్లఁ బోఁగలఁచి కొంకుఁగలంకము లేనిమత్కులం
బారఁగ దుర్యశంబు మహి నందఁగఁజేసితివమ్మ బాలికా.

అని కోపముతో బిల్హణుని శిరశ్ఛేదము చేయ నియమించెను. రాజభటుల లాతనిని వధ్యస్థలమున కీడ్చుకొనిపోవుచున్నారని విని రాజపుత్త్రి యిట్లు విలపింపఁజొచ్చెను—

మ. అరవిందంబులరీతిఁ జెన్నలరునీహస్తంబు లెట్లోర్చె ము
ప్పిరిగాఁ బెట్టిన కాలపాశమునకున్ ముగ్ధాంగనా గానధ
వ్యరసోత్కృష్టము లైన నీశ్రుతియుగం బత్యుద్ధతోర్వీపకిం
కరనాదార్భటి కెట్లుతాళె మదనాకారా మనోనాయకా!

కవియును దన ప్రాణాపాయమును బాటింపక త్రోవపొడుగునను దనప్రియురాలిని దలఁచుకొని యామెపయి నీరీతిని పద్యములు చెప్ప నారంభించెను—

ఉ. హా కమలాయతాక్షి చెలి హా సరసీరుహకుట్మలస్తనీ
హా కమనీయగాత్రి సతి హా నవమోహిని హా వధూమణీ
హా కనకాంగి నేను విడనాడితి నంచుఁ దలంచె దీవు నీ
లోకమునందు జీవునకు లోలతగాక స్వతంత్ర మున్నదే?

కవి తలవరులు తనశిరమును ఖండింపఁబోవునప్పుడొక పద్యము వ్రాసి రాజున కంపఁగా నతఁ డది చదువుకొని కవిని క్షమించి, బిల్హణునికిని దనపుత్త్రికకును గల యన్యోన్యానురాగమును విచారించి, తనకూఁతు నాతని కిచ్చి వివాహము చేసెను.

మ. పొలుపొందన్ ద్విజరాజశేఖరుఁ డిలన్ భూభృద్వతంసంబు ని
శ్చలభావోన్నతిఁ గన్య నిచ్చుపగిదిన్ శ్రీనాకముఖ్యంబుగాఁ
బొలుపొందన్ ద్విజరాజశేఖరునకున్ భూభృద్వతంసంబు ని
శ్చలభావోన్నతిఁ గన్య నిచ్చె సుమనస్సంతానము ల్మెచ్చఁగన్.

రేవుణూరి_వేంకటార్యుఁడు.

ఇతఁడు శకుంతలాపరిణయమను మూఁడాశ్వాసముల ప్రబంధమును రచియించెను. ఇతఁడు నందవరీక వైదికబ్రాహ్మణుఁడు; శ్రీవత్సగోత్రుఁడు; తిరుమల కొండయార్యపుత్త్రుఁడు. ఈతఁడు తన శకుంతలాపరిణయము నొకానొక రాజున కంకితము చేయనుద్దేశించియుండఁగా నొకకరణము విఘ్నమాచరించినట్టును, అందు చేతఁ

దనకృతిని వేంకటేశ్వరుని కంకిత మొనర్చినట్టును, కవి యీ క్రిందివాక్యములలో వ్రాసి కొని యున్నాఁడు—

వ. "అపూర్వపూర్వకవిసుపర్వపానుగ్రహంబునఁ బుణ్యగుణకథాశ్రవణకుతూహలిక
బుధసహానుబంధం బగునొక్కప్రబంధంబు సరససుమనోనుబంధంబుగా
నిర్మింపం బూనియున్న సమయంబున నతిప్రభావసంపన్నుం డగు కశ్చిత్ప్రభుండు.

శా. శ్రీవత్సాన్వయు రేవణూరికులజుఁ శ్రీపాదరేణుప్రభా
సౌవర్ణ్యస్ఫుటకావ్యకల్పకకళన్ సంకీర్తనాచార్యపు
త్రీవంశోత్తము నందవైదికబుధాదిప్రోక్తవృత్తిస్వయం
భావుఁ దిర్మల కొండయార్యసుతు శుంభద్వేంకటాభిఖ్యునిన్.

క. పిలువంబంచి యెదుర్కొని । మిలమిల నలఘుప్రభానమిద్ధాస్థాన
స్థలిఁ జాఁగిలి మ్రొక్కి పటీ। కలితసుఖాసీనుఁ జేసి కలకల నగుచున్.

చ. కనఁగొని చండికాభిసుఖప్రదనందవరాగ్రహారపా
వన ఘన పెద్దిభట్టకులవార్ధినిశాకర నీవు శ్రీనివా
సుని యలమేలుమంగకృపఁ జొక్కిన దిక్కరి వాంధ్రభూమిరా
డ్వినుతసభాస్థలీవనవీనపికంబవు కాకలీకృతిన్.

శా. సల్లాలిత్యభవత్కవిత్వపటిమాసందర్భవైదర్భికా
సల్లాపంబులు మామకీనసుకులస్వామీంద్ర కీరాద్రి రా
ణ్మల్లేశుండును మెచ్చ నొక్కకృతి నిర్మాణంబు గావింపుమా
మల్లీఫుల్లసుమోల్లసన్మధురుచీమాధుర్యకౌదార్యతన్.

మ. అని హేమాంబరరత్నభూషణసుగంధాలంకృతుం జేసి స
ద్ఘనసారస్ఫుటవీటికాదు లొసఁగన్ గైకొంచు వాక్కీవధూ
వనజాతాంఘ్రిఘుఘుల్లఘల్లనటజ్జిహ్వాస్థానవాగ్గోస్తనీ
జనితానందమరందకందళనదీజంఘాలవేలాస్యుఁడై.

వ. అమ్మహాకవివరుండును దదీయవంశావతారనిర్ణయవర్ణనానుపూర్వంబుగాఁ
దత్ప్రబంధబంధురానల్పకల్పనంబొనరించి తత్సముచితకృతికన్యాకరణంబునకు
నవకరణంబుగా నపకరణంబగు నొక్కకరణంబు కృతఘ్నుండై విఘ్నంబు
చేసిన.........శ్రీ వేంకటరమణునకు.........దండప్రణామ పుష్పాంజలి
ప్రపూర్ణభర సమర్పణంబుగా సమర్పించెద.

ఇంత చెప్పినవాఁడు కశ్చిత్ప్రభుండనక యాప్రభుఁ డెవ్వఁడో పేర్కొనియుండిన

పక్షమునఁ గవికాలనిర్ణయమున కనుకూలపడియుండుఁ గేమో! అయినను కవి తన శకుంతలాపరిణయమునందుఁ జేసిన యీ కవివర్ణనమునుబట్టి యితఁ డాధునికుఁడగుట స్పష్టమగుచున్నది—

మ. పరఁగన్ భారతకల్పనారతులు శబ్దస్ఫూర్తి సంధింప ని
ర్భరవృత్తిన్ బరమేశగోత్రభవు లాలంకారము ల్గూర్పఁ జూ
పరు లైనట్టిపితామహాద్యులు నుతుల్ వ్యాపింప నర్తించు నీ
సరసాంధ్రోక్తివధూటి కేను సుకుమారస్ఫూర్తి గావించెదన్.

ఈకవి నూఱునూటయేఁబదిసంవత్సరముల క్రిందట నుండియుండవచ్చును. ఇతఁడు శబ్దాలంకారములనిమిత్త మమితముగాఁ బాటుపడి గ్రంథమునందు వ్యాకరణదుష్టము లైన ప్రయోగముల ననేకములను జేసియున్నాఁడు. వసుచరిత్రములోని కల్పనలను బోలిన కల్పనల ననేకములఁ జేసినను మొత్తముమీఁద నీతనికవిత్వము శబ్దాలంకారభూయిష్ఠమయి హృద్యముగానున్నది. ఇతఁడు తాను రామచంద్రోపాఖ్యానమను మఱియొకగ్రంథమును జేసినట్టు చెప్పుకొనెనుగాని యాగ్రంథము దొరకలేదు. ఈతని కవితారీతిని జూపుటకయి శకుంతలాపరిణయములోని కొన్నిపద్యముల నిం దుదాహరించుచున్నాను—

ఉ. సింగము లెన్న వీరలకు సిద్ధముగా మొలబంటి మత్తమా
తంగశిరస్తటంబులు పదంపడి బ్రొమ్ములబంటి యంచు సా
రంగచయంబు లెగ్గు సరాసరిగా నెదిరింపలేక మా
వ గడపున్వధూమణులవాలికచూపులకున్ భయంపడున్.—ఆ. ౧.

ఉ. శ్రేణులుగట్టి మౌనిజనశీర్షజటాచ్ఛట లుద్గమింప న
క్షీణవిరాగయోగములు చెదును పల్లవరాజకోటికిన్
స్థాణులకున్ బరాగగుణసారతరాంకురలబ్ధి గల్గు పూ
బోణులమేని వాసనలు పొల్చినమాత్రఁ దదాశ్రమంబునన్.—ఆ. ౨.

ఉ. వారనిప్రేమ నేగి రటు వా రనిన్ విని మాఱుద్దతిన్
వారువ మైనయక్కులికి వారు వనంబునకున్ ఫలంబు ల
వ్వారిగఁ దేరఁగాఁ జనిరి వారిఁ గనుంగొను గౌరవంబునన్
మీ రరుదేరఁగాఁ దెలిసి మీఱరు రాఁ దటవత్తు రింతకున్.—ఆ. ౩.

పోచిరాజు వీరన్న.

ఈకవి తాను కృష్ణార్జునసంవాదము, పంచకావ్యములు, విభూతి మాహాత్మ్యము, మార్కండేయచరితము, మనువంశపురాణము, ముక్తదేవుకథ, ఆనందలహరి, సౌందర్యలహరి, సుభాషితము, అను గ్రంథములను రచియించినట్లు భిల్లాణచరిత్రమున నీక్రిందిపద్యములలోఁ జెప్పుకొన్నాఁడు—

సీ. పదునాలు గగు నేట మొదటఁ గృష్ణార్జునసంవాదము ప్రబంధసరణియయ్యెఁ
బదునెన్మిదగు నేటఁ బంచకావ్యము లాంధ్రపద్యకావ్యములుగాఁ బాధఁకిలై
నిరువదిరెండగు నేట విభూతిమాహాత్మ్యంబు ద్విపదకావ్యముగ నొప్పె
నిరువదియారగు నేట మార్కండేయచరితంబు రచితమై సంఘటిల్లె
ముప్పదగు నేట మనువంశముఖ్యనృపపు। రాణము ప్రకల్పితంబయి ప్రకటమయ్యె
ముప్పదారగు నేట శ్రీముక్తదేవు। కథ కథితమయ్యె నాచేతఁ గౌశలమున.

గీ. సంస్కృతంబై శంకరాచార్యవిరచి। తంబు లానందలహరి సౌందర్యలహరి
భర్తృహరికృతమైన సుభాషితములు। శతకములుగాఁగ మత్పరికల్పితములయ్యె.

ఇందుఁ జెప్పఁబడినవానిలో నీపుస్తకముగాక మాకు మనువంశపురాణ మొక్కటి మాత్రము లభించినది. భిల్లాణచరిత్రమును గవి బందరుపురములో నుండిన చిత్రకార (ముచ్చి) కులస్థుఁడయిన దాము మొగ్గన్న కంకితము చేసెను. బందరుపురమును చిత్రకారకులమును వర్ణించినపద్యముల రెంటి నిందుఁ బొందుపఱిచెదను.

సీ. శ్రీకంఠవైకుంఠసేవావికుంఠ వందారుమందిరము బందారుపురము
నిరతోత్సవైశ్వర్యనికరాభిభూత బృందారకపురము బందారుపురము
సంతతాయాత యాచకజనవ్రాత మందారభాసురము బందారుపురము
సకలవర్ణాశ్రమాచార సంపత్సమంచారతిభరము బందారుపురము
శిల్పివర్తక వర్తన చిత్రకార। సూత్రకారాదివివిధవిచిత్రకృత్య
దానధర్మపరప్రజోత్కరచకోర। కారవిందారికరము బృందారపురము.

ఉ. ఆపురి నుంద్రు దాముకులజాఢ్యులు మార్తికసంప్రదాయము ల
ద్దీపితకీర్తిలోలు రతిధీప్రియశీలురు శూలిపాదపూ
జాపరతంత్రమంత్రగుణశాలు లఘాటకీలు లర్హాధ
ర్థోపకృతిస్వభావమతియుక్తులు చిత్రవిధానశక్తులున్.

మనువంశపురాణము బెజవాడ మల్లేశ్వరస్వామి కంకితము చేయఁబడినది. దీనికి ఖండకపాలాఖ్యానమని నామాంతరము. కవి నియోగిబ్రాహ్మణుఁడు; తండ్రి వీర

భద్రుఁడు; తల్లి మూర్తిమాంబ; నివాసస్థలము కృష్ణామండలములోని కొలకలూరు. ఇతఁడు కౌండిన్యగోత్రుఁడు. ఇతఁడు నూఱుసంవత్సరములక్రిందటివాఁడయి యుండ వచ్చును. ఈతనికవనధోరణి యీక్రిందిపద్యములవలనఁ దెలిసికోవచ్చును—

భల్లాణచరిత్రము.

చ. కలువలసొంపు డాఁగె భుజగంబులు పుట్టల దూఱెఁ దారకా
వళి రుచి జాఱెఁ జక్రవలవంతలు దీఱెఁ జకోరకవ్రజం
బులసుఖ మాఱె దమ్ములకు మోదము లూఱె నిశాకరద్యుతుల్
వెలవెలఁబాఱెఁ దూర్పుదెస వెల్లడిగాఁ దెలవాఱె నయ్యెడన్.— ఆ. ౧.

ఉ. ఇంటికిఁ దోడితెచ్చి యవనీశ్వరుఁ డవ్వటురూపుఁ డైనము
క్కంటిని భీరసంగతునిగా నొనరించి సపర్యసల్పి నే
జంటకు మాఱుగాఁ దలఁచి జాజులు నించినసెజ్జఁ జేర్చి వా
ల్గంటినిఁజూచి పల్కెఁ గుతుకంబు మనంబునఁ దొంగలింపఁగన్.— ఆ. 3

మనువంశపురాణము

మ. ఖల! దుష్పాత! మనుప్రభూత! బుధధిక్కారంబుఁ గావించి తీ
ఱల నీయార్యుయు మింతయుండి వసుధాధీశత్వదుష్కర్మమై
తిలఘ్నాంతవ్యవహారలక్షణముతో దీర్ఘత్వముం బూని ని
ష్క్రళమై యుండెనుఁ గాత సర్వజనము ల్గర్హింప హైన్యంబునన్.— ఆ. ౨.

శా. భూనాథోత్తమ! మేదినీసురధనంబు ల్గోరఁగాఁగూడ దీ
దేవోత్తంసము యజ్ఞకార్యమున కాదిద్రవ్యమౌఁ గావునన్
దీనిం బట్టఁగరాదు మీ రఖిలధాత్రీపాలకుల్ ధర్మని
ష్ఠానైపుణ్యులు మీ కెఱుంగనికథాసంఘం బిలం గల్గునే— ఆ. ౪.

అయ్యలరాజు_నారాయణకవి.

ఈకవి హంసవింశతికథల నయిదాశ్వాసముల పద్యకావ్యముగా రచియించెను. హంసవింశతియందు కట్టమతము రచియించినకవు లీపద్యమునఁ జెప్పఁబడియున్నారు—

ఉ. అయ్యలరాజుఁ దిప్పసచివాగ్రణిఁ బర్వతరాజు రామభ
ద్రయ్యను భాస్కరాగ్రణిఁ బ్రధానవరుం డగుకొండధీరునిన్

జయ్యనఁ దిమ్మయప్రభుని సత్కవితారచనాధుర్యులైనమా
యయ్యలరాజువంశజుల నాఁకవీంద్రుల సన్నుతించెదన్.

౧౫౭౦ వ సంవత్సరమునందుండిన కవులను చేర్కొనియుండుటచేత నితఁ డాకాలమునకుఁ దరువాత నుండినవాఁ డనుటస్పష్టము. ఇతఁ డిప్పటికి నూఱుసంవత్సరముల క్రిందట ౧౭౦౦ వ సంవత్సరప్రాంతములయం దుండియుండును. పైపద్యమునఁ జేర్కొనఁబడిన యయ్యలరాజవంశజు లయినకవులలోఁ బ్రాతరాజును గొండయ్యయుఁ దిమ్మయ్యయుఁ జేసినగ్రంథము లేవియు తెలియరావు. ఈకవితండ్రి సూరనార్యుఁడు; తల్లి కొండమాంబ; గోత్రము కౌండిన్యసగోత్రము. ఈతనికవిత్వములో లక్షణవిరుద్ధము లయిన ప్రయోగము లనేకములు గలవుగాని మొత్తముమీఁదఁ గవిత్వము ప్రౌఢమయి రసవంత మయినదిగా నున్నది. ఈపుస్తకమునం దన్యదేశ్యము లనేకములు వాడఁబడియున్నవి. ఈతఁ డాయాజాతులవారిని వర్ణించవలసివచ్చినప్పుడు మిక్కిలి కష్టపడి వారివారికుచితము లయిన యుపకరణాదులనామముల నన్నిటిని సంగ్రహించి వివరించియున్నాఁడు. ఈకథయొక్క ముఖ్యోద్దేశము

ఉ. మున్నలరావణాదులు సముద్ధతి సాధ్వులఁ గోరి యేమి సౌ
ఖ్యోన్నతిఁ జెంది రట్లగుట యన్యజనావళు లన్యకాంతలన్
బన్నగఁ గోరరాదు కడుఁబాతక మంచుఁ దలంచి యింతిపై
నున్నమనంబు ద్రిప్పి యథోచితపద్ధతి నుండె భూవరా.

అన్న ట్లోకపురుషునిమనము నన్యకాంతనుండి విముఖము చేయుటయే యయినను, పుస్తకమునిండ జారుపోయి బోఁకాండ్రు తప్పించుకొన్న యుపాయములే వర్ణింపఁబడి యుండుటచేత నిది దుర్నీతిబోధకమయి నీతిపరులకుఁ బఠనయోగ్యము కానిదయి యున్నది. ఈపుస్తకమునుండి కొన్నిపద్యము లిందుదాహరింపఁబడుచున్నవి—

శా. పన్నీట న్నయనంబు లొత్తెఁ దనువుం బాటీరపంకంబుతోఁ
జెన్నారం బవ నిచ్చి గీఁజె పిగ వేసె దాయెతు లున్నట్టు జీన్
సొన్నాపట్టెరుమాలు గట్టె జలతార్పట్టంచుడాల్మించువేల్
మిన్నాసన్నపుదుప్పటంబు దగహాళిం గప్పె సొంపారఁగన్.—ఆ. ౧.

చ. కమటము కట్లసంచి యొరగల్లును గత్తెర సుత్తె చీరముల్
ధమనియు శ్రావణంబు మొలత్రాసును బట్టెడ నీరుకారు శా
ణము పటకారు మూస బలునాణెపరీక్షలమచ్చు నాదిగా
నమరఁగ భద్రకారకసమాహ్వయుఁ డొక్కరుఁ డుండునప్పురిన్.—ఆ. ౨.

శా. పున్నాగంబున గెల్వఁజాలు రుచిరాంభోజాస్య వేణీరుచుల్
పున్నాగంబును నవ్వనోపు నెలుఁగన్ లోలాక్షి యానంబులుం
బున్నాగంబును గేరి మీఱి మెఱయుం బూఁబోఁడి నూగారడాల్
పున్నాగంబును మించు నాభిచెలువంబుం గా సారెవర్ణింపఁగన్.—ఆ. 3.

మ. చతురోపాయసమర్థుఁ డప్రతిమ వాచాతుర్యధుర్యుండు వి
శ్రుతకార్యజ్ఞుఁడు రాజనీతిపదదక్షుం డింగితజ్ఞుండు ద
ద్భుతశక్తిత్రయపారగుండు గుణసంపూర్ణప్రభావుండు సం
తతభూపాదరణీయుఁ డొక్కరుఁ డమాత్యశ్రేష్ఠుఁ డుండుం బుధన్.—ఆ. 4.

వెణుతుర్ల-వడ్డికవి.

ఇతఁడు శృంగారరసాలవాల మను పేరుగల మూడాశ్వాసముల యలంకారశాస్త్రమును రచియించెను. ఇతఁడు ప్రథమశాఖ బ్రాహ్మణుఁ డయినట్టును రామభక్తుఁ డయినట్టును శృంగారరసాలవాలములోని యీక్రిందిపద్యమువలనఁ దెలియవచ్చుచున్నది—

ఉ. శ్రీరఘువీరభక్తిరససింధువిహారుఁడ శుక్లయాజుషా
చారుఁడ దేశికాంఘ్రిపంచారుఁడ నే వెణుతుర్ల వంశవి
స్తారుఁడ వడ్డినామ కవిసత్తముఁడన్ రఘువర్య పేర శృం
గారరసాలవాల మను కావ్య మొనర్తు జగద్ధితంబుగన్.

ఈకవి కౌండిన్యసగోత్రుఁడు; వేంగనార్యపౌత్రుఁడు; మంగళగిరిపుత్రుఁడు. ఇతని కాలమేమో తెలియరాలేదు గాని కవిత్వము రసవంతము మృదువుగాఁ గనుపట్టుచున్నది. శృంగారరసాలవాలములోని పద్యములరెంటి నిందుఁ జూపుచున్నాను—

ఉ. కుందనమున్ హసింపఁగలకోమలి కోమలదేహవల్లిపైఁ
గందళితంబు లయ్యె సితకాంతులు సంతత మమ్ముఖేందు నిం
పొంద మనంబులోన నిడియున్న మనోభవుఁ డందు నాతినిన్
గ్రందుగ నేయుపుష్పశరగాఢరుచుల్ వయిఁ దోఁచెనో యనన్.—ఆ. 1

ఉ. ఆసలు బాసలిచ్చి కపటాత్మసఖుల్ పొదరిల్లు చేరఁగాఁ
దీసిన నందు నిందుముఖి తెల్లమిగా హరి లేమిఁ జూచి వి
శ్వాసములోఁ గుతన్నరలి వచ్చెనెడన్ మరలింప దచ్చటన్
భాసిలు చంచరీకములబారు గనుంగొను దృష్టి పెంపునన్.—ఆ. 3.

కొత్తలంక-మృత్యుంజయుఁడు.

ఈకవి బృహన్నారదీయము, ధరాత్మజాపరిణయము, నిరోష్ఠ్యనలచరిత్ర, అను పద్యకావ్యములను రచియించెను. ఇతఁడు శివబ్రాహ్మణుఁడు. శివాలయములలో నర్చకులుగా నుండెడి యీతెగబ్రాహ్మణుల నీప్రాంతములయందు శివలవాండ్రని వాడుదురు. ఈతని నివాసస్థలము గోదావరీమండలములోఁ గౌశికీతీరమందున్న కొమరగిరి గ్రామము. ఈకవి బోధాయనసూత్రుఁడు; భారద్వాజగోత్రుఁడు; విశ్వనాథపుత్రుఁడు. ఈతఁ డించుమించుగా నూఱుసంవత్సరములక్రిందట నుండినవాఁడు. ఈతని మునిమనుమ లిప్పటికిని గోడి యను గ్రామములో జీవించియున్నట్టు వినుచున్నాము. ఈతని కవిత్వము హృద్యమయి సలక్షణముగా నుండును. ఇతఁడు రచియించిన పుస్తకములలో బృహన్నారదీయపురాణ మాఱాశ్వాసముల గ్రంథము; ధరాత్మజాపరిణయము నాలుగాశ్వాసముల ద్వ్యర్థికావ్యము; నిరోష్ఠ్య నలచరిత్ర యైదాశ్వాసముల చిత్రకావ్యము. ఈకావ్యములలో ధరాత్మజాపరిణయమును కవి తన కాశ్రయుఁడైన యల్లూరి యప్పలరా జనుక్షత్రియునకు రచియించిన ట్లవతారికలోఁ

ఉ. ఎల్లజగంబులం గరుణ నేలెడువేలుపు నిందిరామనో
వల్లభు నాశ్రయించి యనవద్యతదీయకృపావిభూతి భూ
వల్లభసత్సభావిబుధవర్ణ్యకవిత్వనిరూఢిఁ గన్న శ్రీ
యల్లురి వంశసంభవుఁడ నప్పనృపాలక నామధేయుఁడన్.

ఇత్యాదిపద్యములచేఁ జెప్పినను, ఆశ్వాసాంత గద్యమునఁ దనపేరే వేసికొనియున్నాఁడు. ఈప్రాంతములయందలి క్షత్రియులు సామాన్యముగాఁ దాము మాధవవర్మసంతతివార మని చెప్పుకొనునట్లే యీయల్లూరివారును మాధవవర్మసంతతివారే యయినట్లు ధరాత్మజాపరిణయమునందు వంశకర్తగా మాధవవర్మ యిట్లు వర్ణింపఁబడెను—

ఉ. మాధవవర్మ నాఁగ నొకమానవభర్త జనించి విస్ఫుర
ద్బోధసమగ్రుఁడై కనకదుర్గను శ్రీజయవాటికాపురీ
సాధువిహారిణిం గొలిచి చక్కఁగఁ దత్కరుణారసంబుచే
నీధర హేమవృష్టిఁ గురియించె నతిస్థిరకీర్తి మీఱఁగన్.

కవినిగూర్చి వ్రాయఁదగిన విశేషము లంతగాఁ దెలియనందున, పూర్వోక్తగ్రంథముల నుండి కొన్నిపద్యముల నుదాహరించి విరమించుచున్నాము—

బృహన్నారదీయము.

చ. హృదయమున న్వివేక మొకయించుక లేనిదురాత్మునింటిసం
పదలు శరన్నదీజలముభంగి నశించు ననూయ యాత్మలోఁ
బొదలినవానిసంపదలు పోఁడిమి దక్కను మారుతంబుతోఁ
గదియుతుపారలంబుక్రియఁ గంజభవాత్మజ యాలకింపవే — ఆ. ౧.

ఉ. ధ్యానవిహీనుఁ డయ్యు ననయంబు జితేంద్రియవర్గుఁ డయ్యె నా
యానరుఁ డెప్పుడుం జెడనియట్టిపదంబున నుండు నిశ్చల
ధ్యానసమేతుఁ డింద్రియజయం బొకయించుక లేకయున్నఁ ద
ద్ధ్యానము నిష్ఫలం బగు నతండును మూఢుఁ డనం బ్రవర్తిలున్. — ఆ. ౪.

ధరాత్మజాపరిణయము.

ఉ. అనఘ వసిష్ఠమానిముఖు లవ్విబుధాఘముఁ గూడి యమ్మహా
వనిపుఁ బూర్ణభూతిభవు వర్ణితతేజునిఁ జూచు వేడుకం
జని విలసిల్లుతద్విపులసంజనితప్రమదాన్వితాధికా
ననుఘునుఁ గనుంగొని మనంబున నుబ్బుచుఁ బల్కి రీగతిన్. — ఆ. ౧

ఉ. ఆగ్రహబుద్ధిచేత విషయంబు లశేషము గాఁజయించి లో
కాగ్రియబాహుశౌర్యగతి యాగహింసకుఁడై తనర్చు న
య్యుగ్రునిమీఁద శాతశర మొక్కటి వేయఁగ సమ్మతింపుమా
నిగ్రహభూతవైరిగణ నీదగు పట్టి కార్యసిద్ధికిన్. — ఆ. ౩

ఉ. అచ్చట నచ్చట న్వెలయు నచ్చపుఁబచ్చలతోరణంబులన్
రచ్చల హెచ్చులై వెనెలరాలయరంగులరంగుల న్సదా
లచ్చికి నాటపట్టయినలచ్చనము ల్పరికించి చూచుచో
నొచ్చెము లేనియచ్చెరువు నొందఁగఁజేసెఁ బురంబువారికిన్. — ఆ. ౪.

నిరోష్ఠ్య నలచరిత్ర.

ఉ. అల్లలితాంగి చంచలకటాక్షనిశాతశరాళి నేయఁ గాఁ
గల్లరియైనచిత్తజునిగాసిఁ దలంకితిఁ గ్రాసగీతి నం
ధిల్లఁగఁ గీరసంతతికి దీనత గాంచితి రాకరాకచే
జల్లరి తల్లజిల్లితిని జల్లరిగాలికి సంచలించితిన్. — ఆ. ౧.

ఉ. చంచలరీతిగా నధికచంచలతం గనిపట్టియుండరా
చంచలనేత్ర నెల్లెడ నచంచలఁ గా నెడఁదం దలంచి యా

చించినయర్థిరాజి నిరసించిననిర్గతకీర్తి కాంత చి
తించిన నక్కటా తగిననిష్కృతి కల్గఁగనేరదేకదా. — ఆ. 3.
చ. అలిగినయత్త్రిం గలఁక నందక సారదయానిరీక్షచే
నలరఁగఁ జేసిన త్రుటి నహంకృతిఁ జెందక ధాత్రికీతని
శ్చలత నిశేశసన్నిధిని సంతతహర్షనిశాంతచిత్తయై
చెలఁగెడికన్య ధన్యగతిచే నలరారెడి సారసాననా. — ఆ. 4.

అంతర్వేది నృసింహస్వామి కంకితము చేయఁబడిన యీనిరోష్ఠ్యనలచరిత్రము కొన్ని వ్రాఁతప్రతులలో

"ఇది శ్రీమద్భవానీశ్వర శాశ్వత కృపాపాత్ర కొత్తలంక విశ్వనాథపండిత పుత్ర సకలసుకవి జనానుగ్రహసహాయ మృత్యుంజయనామధేయప్రణీతంబైన నలరాజచరిత్రము"

అను గద్యమునకు మాఱుగా

"ఇది శ్రీమదంతర్వేది లక్ష్మీనృసింహస్వామి చరణారవిందైక రుద్రరాజాన్వయాభరణ ధనంజయగోత్రపవిత్ర కూనన్నపాలపుత్ర నిరర్గళ కవితావిలాస సంతోషితాశేష విద్వత్కవిరాజ తిరుమలరాజ ప్రణీతంబైన నలరాజచరిత్రము"

అను గద్యము కానఁబడుచున్నది. మృత్యుంజయకవి యీగ్రంథముయొక్క కర్తృత్వమును ధనస్వీకారకారణముచేత రుద్రరాజు తిరుమలరాజునం దారోపించి యుండును.

తిరుమల బుక్కపట్టణపు-వేంకటాచార్యుఁడు.

ధరాత్మజాపరిణయ మను పేర మృత్యుంజయకవి రచించిన ప్రబంధమువంటి దానినే యీకవి "యచలాత్మజాపరిణయము" అను నామము గల మూఁడాశ్వాసముల ద్వ్యర్థిప్రబంధము నొకదానిని రచియించియున్నాఁడు ధరాత్మజాపరిణయమునకంటె నచలాత్మజాపరిణయము ప్రౌఢతరముగా నున్నది. ఈగ్రంథకర్త మిక్కిలి సమర్థుఁడు. ఇతఁ డాశ్వాసాంత గద్యమునందుఁ దన్నుఁగూర్చి యిట్లు వ్రాసికొనియున్నాఁడు—

"ఇది సర్వతంత్రస్వతంత్రసకల భాషావిశేష కవితాధురంధర ప్రతినవప్రబంధ పరమేశ్వర శ్లేషయమక చక్రవర్తిబిరుదాంక తిరుమల బుక్కపట్టణ శ్రీనివాస తాతాచార్యతనయ శ్రీమదణ్ణయాచార్య దీక్షితసుత పితృవ్య శ్రీనివాసాచార్య కృపాకటాక్షలబ్ధ సకలపాండిత్య తర్కాలంకార వాగీశ్వర బిరుదాంక వేంకటాచార్య ప్రణీతంబైన యచలాత్మజాపరిణయము."

ఈవైష్ణవకవిగ్రామణి యేకాలపువాఁడో తెలియరాదుగాని యిక్కవి యాధునికుఁడు కాఁడని తోఁచుచున్నది. అచలాత్మజా పరిణయములోని రెండుపద్యము లిందుక్రిందఁ బొందుపఱుపఁబడుచున్నవి—

ఉ. చల్లనివాఁడు పాదములచాయలఁ జేరి నెల్లవారికిన్
గొల్లలుగాఁగ నార్తులఁ గొబ్బునఁ ద్రుంపఁగ కంకణంబులున్
జల్లెడువాఁడు వాహినులసంఘటనం బ్రతికూలవర్తన
త్పుల్లకభూమిభృత్కులముఁ గ్రుంగఁగఁ జేయునతండు మేదినిన్.—అ. ౧.

ఉ. రాజకుమారశేఖరుఁడు రమ్యత నంపయి స్వనోదయన్
రాజిల నార్యసంగతి యనంతసుఖాశ్రయ మంచు నెంచుచున్
దాఁ జనుదెంచెఁ దాపసహితస్థితి నవ్వల నివ్వల న్వనీ
రాజుల చల్లపెల్లుమృగరాజులు తన్గని విస్తరింపఁగన్.—అ. ౩.

కటికనేని-రామయకవి.

కువలయానందమని సాధారణముగా వాడఁబడెడి యలంకారశాస్త్రమును కువలయానందప్రకాశ మనుపేరితోఁ దెనిఁగించిన యీకవి చెఱుకునూళ్ళగోత్రుఁడు; నూరనకును బుచ్చమకును బుత్రుఁడు. కవి తనది పద్మనాయకకుల మగుట యీక్రిందిపద్యముచే నిట్లు చెప్పియున్నాఁడు—

సీ. సకలజగజ్జనస్వర్గసోపానోర్మి గంగ నెచ్చట సిద్ధగతి జనించె
పతిశాపజాశ్మతాపతితసతీశుద్ధభావకృద్రజ మెందుఁ బరిఢవిల్లె
సనకాదినిఖిల సన్మునిమనఃప్రకరము ల్మధుకరంబులమాడ్కి మలయు నెచట
బలిబంధనోత్క్షేపకలితాబ్జజాండగోళములు కేసరాభ నెచ్చోటఁ గనియె
నట్టి నారాయణాంఘ్రిపద్మాంతరమునఁ, బుట్టి, కులంబులఁ బూర్ణమహిమ
నాయకత్వముఁ గనుటచే నవ్యగరిమఁ! బ్రకట మయ్యెను పద్మనాయకకులంబు.

ఈకవిగాలమేదో యెక్కడనుండినవాఁడో తెలియరాలేదు. ఆతఁడు నూఱు నూటయేఁబదియేండ్లక్రిందట నుండియుండవచ్చును.

గీ. సరసుఁడకళంకవంశాబ్ధిచంద్రుఁడనఘుఁ! డైనరంగార్యవర్యు సాహాయ్యమునను,
గువలయానందమిలను దెన్గునరచింపఁ! గడఁగితిని దుష్కరంబైనకార్యమునను.

అను పద్యమునందుఁ గవి తా నీగ్రంథమును రంగార్యుని తోడ్పాటుచేత రచించినట్లు

చెప్పుకొనియున్నాఁడు. కవిత్వశైలిని తెలియుటకయి కువలయానందప్రకాశము యొక్క మూఁడుఘట్టములనుండియు మూఁడుపద్యము లిందుక్రింద నుదాహరింపఁబడు చున్నవి—

చ. అబలలయందుఁ గాంచనమునందు భ్రమ న్విధి కల్గఁజేసె నా
యబలలయం దుఁ గాంచనమునందును భ్రాంతి దొలంగి నిష్ఠచేఁ
బ్రబలినవాఁడు చూడఁగ నరాకృతిఁ దాల్చి చెలంగుచున్నయ
న్నిబిడపరాక్రమక్రమవినిద్రుఁడు కేవలరుద్రుఁడే ధరన్.—ఘ. ౧.

చ. ధనికులమోము గన్గొనవు దబ్బఱ లాడవు వారిగర్వదు
ర్వినయవచస్తతు ల్వినవు వేమఱు వారల డాయఁబోవు క్ర
న్ననఁ దినె నిచ్చ నూతనతృణంబుల నిద్దుర రాఁగ నిద్దురం
గొనియెద వెందు నేమి వ్రతగోష్ఠిని జల్పితో తెల్పు మేణమా—ఘ. ౨.

చ. ధృతిని మధువ్రతంబులు నిజేష్టమధుప్రపరైన పద్మసం
తతి ముకుళింపఁజేసె వెసఁదా నితఁ డంచుఁ దలంచి పంకజా
హింతతతబింబమున్ బలిమి నేర్చి వడిం గడునాక్రమించి యం
చితముగ మేన నంకమునుచేసె నిజం బిది యెన్నిభంగులన్.—ఘ. ౩.

కొండమడుగు-పురుషోత్తమకవి.

ఈకవి సానందగణేశ్వర మను మూఁడాశ్వాసముల గ్రంథమును రచించెను. పుస్తకము డిబగుంట వీరేశ్వరస్వామి కంకితము చేయఁబడినను, కవి తనగ్రంథమును కుంజేటి బుచ్చయ్య యను కోమటియొక్క ప్రార్థనమీఁద రచియించి యందుఁ గోమట్ల నీవిధముగా వర్ణించెను—

శా. సాలంకాయనమౌని పూర్వమున భాస్వద్దివ్యతేజోధనుం
డాలీలాధివంశసంభవులలో నత్యుజ్జ్వలోదారవా
గ్జాలు ర్నిత్యధనుల్ కుబేరసదృశుల్ సౌభాగ్యభాగ్యోదయుల్
మేలింపొందినవైశ్యవర్ధనులు గాంభీర్యామితౌదార్యులన్.

కవి నియోగిబ్రాహ్మణుఁడు; భారద్వాజగోత్రుఁడు; గిరియప్పనందనుఁడు. కవి తనే కయ్యలూరు మొదలయిన యగ్రహారము లుండినట్టు వ్రాసికొనియున్నాఁడు ఈతని కాలము సరిగా తెలియదు నూఱుసంవత్సరముల క్రిందటివాఁడయి యుండును. సానందగణేశ్వరములోని రెండుపద్యము లిం దుదాహరింపఁబడుచున్నవి—

ఉ. ఇంటికి నేగుదెంచి తనయింటిని గాంచి ప్రపంచవృత్తి నై
కొంటను బొంచి రత్నరుచికుండలమండితగండ యైనవా
ల్గంటికి శంభుఁ డిచ్చినవరంబు కరం బనురక్తిఁ దెల్పి! క
న్గొంటి భయంబుఁ దక్క మిఁకఁ గోమలి కామునిలీల నేలెదన్.— అ. ౧.

ఉ. మీనము లెల్లలం గడిమి మ్రింగుచు గాలములందు డిందు నెం
దేని పరాంగనారతికి దీకొని యే మిటు లైతి మింతె కా
దా నలినాయతేక్షణలయుబ్రపుగుబ్బల గోరు లుంచఁగా
సోఁగ నల్లవా రినుపసూదుల గ్రుచ్చిరి మచ్చరంబునన్.— అ. 3.

నాగులూరి-శేషనారాధ్యుఁడు.

ఈకవి శ్రీపర్వతపురాణమనెడి యాఱాశ్వాసముల గ్రంథమును రచియించెను. ఈపుస్తకమునకు శ్రీశైలమాహాత్మ్యమని నామాంతరము గలదు. ఇతఁడు గ్రంథాదిని తెలుఁగు నిట్లు పొగడియున్నాఁడు—

చ. జనని సమస్తభాషలకు సంస్కృతభాష ధరాతలంబునన్
ఘనలలితార్థగౌరవనికాని తెనుం గభిరమ్య సంతతన్
గనుఁగొనఁ జాతిబీజమునకంటెను గోమల పత్రపుష్పసం
ధనమృదుపల్లవాభినవబాలరసాలము సొంపు నింపదే.

ఆధునికుఁడే యయినను గవి యేకాలమునం దుండినవాఁడో సరిగా తెలియదు. ఇతఁడు నూటయేఁబదిసంవత్సరముల క్రిందట నుండియుండవచ్చును. ఈతనికవిత్వము సరస మయినది. శైలి జూపుటకయి శ్రీపర్వతపురాణమునుండి రెండుపద్యముల నిం దుదాహరించుచున్నాను—

ఉ. శ్రీనగకంధరంబున వసించి చరించుపులిందబృందముల్
భూనుతభోగమోక్షములఁ బొందఁగఁ జూచి నిలింపసంఘముల్
శ్రీనిలయాభిరామ మగు శ్రీగిరిమీఁదఁ జరింతు రట్లయ
మ్మానితనాకసౌఖ్యమహిమంబుల నెల్లఁ దృణీకరింపుచున్.— అ. 3.

శా. పాటింపందగు ముజ్జగంబులఁ బురప్రత్యర్థిజూటాటవీ
కోటీకోటరపావనామరధునీఘూర్ణో త్తరంగావళీ
వ్యాటీకాయుతవేణికానికరసమ్యక్పుణ్యతోయచ్ఛటా
చాటుత్వంబు వహించు శ్రీనగముపైఁ జంచజ్జలశ్రేణికల్.— అ. ౯.

పీసెను-లక్ష్మీపతి.

ఇతఁ డభిమన్యు పరిణయ మనెడి యైదాశ్వాసముల ప్రబంధమును రచియించెను. ఇతఁడు స్వష్టికరణవంశజాతుఁడు. పీసెను కృష్ణరాజునకును రంగమాంబకును జనియించినవాఁడు. ఇతఁ డభిమన్యుపరిణయములోఁ దన్నుఁగూర్చి యిట్లు చెప్పికొనుచున్నాఁడు—

ఉ. మాగధవంశసంభవుఁడ మాన్యతపీసెకులావతంసుఁడన్
భోగబిడౌజుఁ డార్యజనపూజిత వేంకటకృష్ణరాజుకున్
బాగుగ రంగమాంబకును నౌరసపుత్త్రుఁడ లక్ష్మణాఖ్యుఁడన్
శ్రీగలుగన్ రచించెదను నే నభిమన్యుచరిత్ర వేడుకన్.

ఇతఁ డెప్పు డెక్కడనున్నవాఁడో తెలియరాలేదు. దాదాపుగా నితఁడు నూఱు సంవత్సరముల క్రిందటివాఁడయి యుండును. ఈతనికవిత్వ మంత మంచిది కాదు. అందు ఛందోవ్యాకరణదోషము లనేకములు కానఁబడుచున్నవి. అభిమన్యుపరిణయములోని రెండుపద్యముల నిం దుదాహరించుచున్నాను—

ఉ. పన్నినవీరయోధులను బాహుబలంబున నగ్గుసేయు సం
పన్నుఁడ వార్యసన్నుఁడవు పాండవపౌత్త్రుఁడ వైననిన్నునన్
జిన్నెల పువ్వుల న్సరులఁ జెన్నుగఁ గూర్పను నేరఁబట్టియీ
కన్నియ లెట్లు నీమనసు కాంక్ష కరంగఁగఁ జేయువారలో.—అ. ౧.

ఉ. నారదమౌనిమాట మది నమ్మితి నేఁడది కానిచందమై
దూరము నాట కానఁబడెఁ దూర్యవాదులఁ జుట్టుపక్కలన్
వారును వీ రెదుర్కొనుచు వచ్చుట కీయగువేళ పోవుచు
న్నారిక విఘ్నము ల్గలవె నన్నిట దైవము మోసపుచ్చనే.—అ. ౪.

వేమనారాధ్యుల-సంగమేశ్వరారాధ్యుఁడు.

శైవుఁడయిన యీకవి యహల్యాసంక్రందనవిలాస మనెడి యైదాశ్వాసముల ప్రబంధమును రచియించెను. ఒక యెత్తుగీతములో

గీ. అట్టిసాహసవిక్రమారూఢుఁడైన। వాసిరెడ్డివ్యయాంభోధివరసుధాంశు
చంద్రమౌళిక్షమాపాలజనవిభుండు। కొలువుదీర్చి మహోత్సవాతురగతిమ.

అని కవి వాసిరెడ్డి చంద్రమౌళిప్రభువు తన్నుఁ బిలిపించి వేడఁగా తా నహల్యాసంక్రం

దనవిలాసము చంద్రమౌళి కంకితము చేసినట్లు చెప్పెను. ఈ వాసిరెడ్డిచంద్రమౌళి కృష్ణామండలములోని యమరావతీపురమును బరిపాలించిన కమ్మవంశజుఁడు. ఇతఁడు సుప్రసిద్ధుఁడయిన వాసిరెడ్డి వేంకటాద్రినాయని సోదరపుత్రుఁడు. ఈకవి కవిత్వము ప్రౌఢమయినదిగాని యిందు వ్యాకరణదుష్టములైన ప్రయోగము లనేకములు కానఁబడుచున్నవి. ఈ గ్రంథము నూఱుసంవత్సరములక్రిందట రచియింపఁబడినది. అహల్యాసంక్రందనవిలాసమునుండి రెండుపద్యముల నిం దుదాహరించుచున్నాను—

మ. పరకాంతారతిదోష మంచు మది సంభావింపఁడో యన్య లె
వ్వరు గన్నం దను విందనేతు రనుభావం బెంతయుం బూనఁడో
సరుఁ డొక్కింత యెఱింగెనేని సిలుగు ల్వాటిల్లునం చెన్నఁడో
పరమామోదమె కాని యింద్రునకుఁ బాపభ్రాంతి లే దేమియున్. — ఆ. 3

చ. సరసిజ! నిన్నువంటి చెలిజాణలు పుట్టరె వార లెల్ల నీ
కరణిఁ దలంతురే చింతితకార్యము లిచ్చటఁ జెల్లునే యయో
పరమపతివ్రత లైరు నిభామినితో నెకసక్కె మేమి నీ
గరిమను గానవచ్చె నిఁక కందురొ వినరో బుధాగ్రణుల్. — ఆ. ౫.

ములపాక బుచ్చన్నశాస్త్రి

ఈకవి వేంకటేశ్వరమాహాత్మ్యమను పద్యకావ్యమును రచియించెను. ఇతఁడు కోనసీమ ద్రావిడబ్రాహ్మణుఁడు. ఈబ్రాహ్మణులనే యారామద్రావిడు లనియు, పేరూరు ద్రావిడు లనియు, వాడుదురు. వీరు మొట్టమొదట నఱవవారే యయినను చిరకాలము క్రిందటనే యీయాంధ్రదేశమునకు వచ్చి తోఁట దొడ్లను సంపాదించి యిచ్చటనే నిలిచిపోయినవా రగుటచే నఱవభాషను మఱచిపోయి యించుమించుగా దెనుఁగు భాషనే స్వభాషనుగాఁ జేసికొనియున్నారు. వీరు తెనుఁగున గ్రంథరచన చేయుటయే యీవిషయమును దెలుపుచున్నది. ఈకవి కోదండరాముని పుత్రుఁడు; భార్గవగోత్రుఁడు; గుంటూరియం దుండినవాఁడు. ఇతఁడు తనపూర్వులను గూర్చియు, తన్నుఁ గూర్చియు, వేంకటేశ్వరమాహాత్మ్యమునం దిట్లు చెప్పియున్నాఁడు—

సీ. అనుపమకోనసీమాభిధాన ద్రావిడాన్వయంబునను విఖ్యాతిమీఱ
ములపాకవా రనుముఖ్యాన్వవాయులు కాశ్యప భార్గవ కౌశి కాత్రి
గోత్రజు ల్గల రందు గురుతరభార్గవగోత్ర సంజాతుఁడై కోమరుమీఱ
వేంకటపతి వాని కుంకుమమీఱ వెంగాంబికయందు సుబ్బాభిధాన

విబుధవరుఁ డుద్భవించె నవ్వీమలమతికి । బుచ్చమాంబికయందు సంపూర్ణచంద్ర
మండలమురీతి సత్కళామండనుండు । రహి జనించెను గోదండరామవిభుఁడు.

* * * * * *

సీ. మట్లవంశోద్భవక్ష్మాపాలపాలిత గుఁడ్లూరిపురి నుండు గురుయశుఁడ
నాంధ్రగీర్వాణభాషాద్వభాషాకవిత్వాభి నిర్మాణమహత్వవిదుఁడఁ
గాశికాపిశ్వేశకరుణాకటాక్షాభిభాషితబహుళప్రబంధచయుఁడ
హితనాటకాంతసాహిత్యనిత్యాభ్యస్తసకలపురాణార్థసారవిదుఁడ
సాంద్రములపాక విద్వత్కవీంద్రవంశ । వార్ధిచంద్రుండ సర్వసర్వంసహాభి
విశ్రుత శుకవికులగోత్రపిపులపక్షు । శాగపదర్యైన బుచ్చనశాస్త్రికవిని.

ఇతనికాలము తెలియదు. ఇతఁడు నూఱుసంవత్సరముల పయివాఁ డయియుండును. వేంకటేశ్వరమాహాత్మ్యమునుండి మఱి రెండుపద్యముల నిం దుదాహరించుచున్నాను—

ఉ. సంగతిమీఱ మీచరణసారస మందు జనించినట్టి యా
గంగకు దక్షిణంబున నగాధతరం బగుదక్షిణాబ్ధికిన్
రంగగు నుత్తరంపుదెస రాజిలుపూర్వసముద్రపశ్చిమా
శం గన నొక్కరా వమరు సారతరోన్నతదండకాటవిన్.—ఆ. ౧.

చ. గిరిజయు నీవు నెల్లప్పుడుఁ గిన్నర పన్నగ సిద్ధ సాధ్య భూ
సుర నరసంఘము ల్గొలువ సొంపు దలిర్పఁగఁ జేరి యీసరో
వరతటసీమనుండుఁ డభివర్ణన కక్క భవత్సమాఖ్య ని
గ్గిరియు సరోవరంబు నరఁ గేవలమోదముతో హరుం డనన్.—ఆ. ౧.

పాలవేకరి_కదిరీపతి

ఈకవి శుకసప్తతియను కావ్యమును రచియించెను. ఈతని కవిత్వము హృద్యముగానే యున్నది కాని పుస్తకమంతయు దొరకలేదు. దొరికిన రెండాశ్వాసములను బట్టి చూడఁగా నితఁడు ప్రౌఢకవి యగుటకు సందేహ మగపడదు. "ఇది శ్రీమత్కదిరీ నృసింహ కరుణాకటాక్ష వీక్షణ సమాగత కవితాధార పాలవేకరికుల కలశాంభోధి సుధాకర తాడిగోళ్ళ కరియమాణిక్య నృపహార్యక్షపౌత్ర పవిత్రచరిత్ర కదిరి ధరా మండలాఖండ పుత్ర విద్వత్కవిరక్షాయసంధాయక కదిరీపతినాయక ప్రణీతంబైన" ఇత్యాది గద్యమునుబట్టి చూడఁగా కవి నాయకకులజుఁడయినట్లును, కరియ

మాణిక్యనృపపౌత్రుఁడయినట్టును కదిరిరాజపుత్రుఁడయినట్టును దెలియవచ్చుచున్నది. కవి నెల్లూరిమండలములోనివాఁడు. ఇతఁడు తనగ్రంథమును శ్రీరామాంకితము చేసెను. ఈతనికాల మేదో తెలియరాలేదు గాని యితఁ డాధునికుఁ డగుటకు సందేహములేదు. శుకసప్తతినుండి రెండుపద్యముల నిం దుదాహరించుచున్నాను—

చ. అలజయకేతనుండు రుచిరాంగతిరస్కృతమీనకేతనుం
డెలమి మదిం దలిర్ప దయ నేలికయుం దలిదండ్రు లయ్యెడన్
దలఁచినకార్యభాగ ముచితజ్ఞులచే విని నీతికార్యవ
ర్తులగునియోగిపుంగవులతోడ రహస్య మొనర్చె యిట్లనున్.—ఆ. ౧.

మ. అక్కట దోసతోఁట యిదియైనఁ దదీయఫలంబు లమ్మి యీ
డొక్కయు సాకఁ గోరితిఁ గదున్న దురేఁచుని వచ్చి యెవ్వరో
మక్కువలేక నాకడుపుమంటయుఁ బుచ్చ నొసంగఁ బూని యీ
చక్కగ వంటిపండ్లు తినసాగిరటంచుఁ గృశించు నెంతయున్.

మాధవమంత్రి.

ఇతఁడు భగవద్గీతలను నాలుగాశ్వాసముల పద్యకావ్యమునుగా రచియించెను. ఇతఁడు గోదావరీమండలములోని నియోగిబ్రాహ్మణుఁడు. గిరిమనమంత్రి పుత్రుఁడు; కిడాంబి వేంకటాచార్యుల శిష్యుఁడు. ఈతని గ్రంథమునందు లక్షణవిరుద్ధములైన ప్రయోగము లనేకములు గానఁబడుచున్నవి. అయిన నితఁడు తనగ్రంథమునందు దత్తోజీ పండితవిరచితమయిన భగవద్గీతలలోకంటె వృత్తముల నధికముగా వేసియున్నాఁడు. ఇతఁడు తనకృతిని భద్రాద్రిరామున కంకితము చేసెను. ఈతని పుస్తకమునుండి రెండు మూఁడు పద్యము లిం దుదాహరింపఁబడుచున్నవి—

మ. ధరఁ బాలియ్యక లోభకాంక్షయుతుఁడై ధాత్రీశుల న్మిత్రులన్
గురురాజీకృతఁ జంపఁగాఁ దలఁచి తాఁ గ్రూరాత్ముఁడై యున్నచోఁ
బొరిఁ గొన్నన్ దురితంబు చెందు విను మీపాత్రోల్ల నాకేల య
స్థిర మీకాయము దీనికై కులజులం ద్రెళ్ళింపఁగాఁ బాడియే—ఆ. ౧.

శా. విద్వన్ముఖ్యుఁడు కర్మపుంజములు తా నిధ్యుక్తమార్గంబుచే
మద్వాక్యంబులరీతి సల్పుచును సాత్మ్యం గాంచి యవ్వేళలన్
హృద్వ్యాసంబున మోహ ముప్పతిల వర్తించు న్మమత్వాది రా
గద్వేషంబులు లేక యోగి సమతన్ గంభీరుఁడై ఫల్గునా.—ఆ. ౨.

చ. పరులు నుతింపఁ బాలు నని పల్కుచుఁ జిత్తములం దలంచి సు
స్థిర కుశలబుద్ధి లేక ఫలసిద్ధిని గాంత్రు రొకర్చి దంభులై
యురవసుకటిజ్ఞానమున కెంతొ విరోధము చేయుట్టి యా
నరు లొనరించు యజ్ఞము ఘనంబుగ రాజసయజ్ఞ మర్జునా.—ఆ. ౪.

గోపాలుని-సింగయ్య.

ఈకవి భారవికృతమైన కిరాతార్జునీయ మను సంస్కృతకావ్యమును నయి దాశ్వాసముల గ్రంథముగాఁ దెనిఁగించెను. ఇతఁడు నియోగిబ్రాహ్మణుఁడు; మౌద్గల్య గోత్రుఁడు; భాస్కరామాత్యపౌత్రుఁడు; వీరనమంత్రి పుత్రుఁడు. ఈకవి కర్నూలు మండలములోనివాఁడు. ఇతఁడు తనగ్రంథమును శ్రీమదహోబల లక్ష్మీనృసింహస్వామి కంకితము చేసెను. ఈకవిపుత్రుఁ డెనుబదిసంవత్సరములక్రిందట జీవించియుండెను. కాఁబట్టి కవి నూఱుసంవత్సరములక్రిందటివాఁడు. ఈతని కవిత్వము రసవంతమయి సలక్షణ మయినదిగా నున్నది. కిరాతార్జునీయకావ్యములోని కొన్ని పద్యముల నిందుఁ బొందుపఱుచుచున్నాను—

చ. కొలిచినభృత్యకోటి ననుకూలత నొప్పెడు మిత్రులట్ల మి
త్రుల నతి బంధువర్గములతో సరిగాఁ గను బంధుజాలమున్
దెలియఁ గృతాధిపత్యమున విశ్రుతమాతఁబోలె నాదరం
బలరఁగ దన్మయుం డగుచు నాగయు లెస్సగ సంతతంబునన్ —ఆ. ౧.

ఉ. భానుకరప్రసారపరభాగితలస్ఫురదింద్రనీలసం
తానవిరాజమానరజతస్ఫటికాంచితకుడ్యదీధితుల్
మానుగ నెంచిచూడ దినమధ్యమునందును గౌముదీభ్రమన్
బూనుత మాటిమాటికిని బుట్టఁగఁ జేసెడుఁ జూడు విగ్గిరిన్ —ఆ. ౨.

ఉ. కొప్పులు వీడఁగా నడిచి గొజ్జఁగిదండలు జాఱఁగొట్టియున్
గప్పురగంధము ల్చెదరఁగా వసఁ దాఁకియుఁ బెక్కునేరముల్
తప్పక యిగ్గతి న్సలిపి తత్సతు లందఱిప్రీతి చేబలెన్
దప్పర హైమకంఠమునఁ దేలుచునుండెను వీమ లక్ష్మికా.—ఆ. ౩.

మ. అటులైన న్మతి రోమియున్న వినుమీ యారాజు నీప్రాణసం
కట మావేళను వచ్చిసూకరముఁ దా ఖండించి రక్షించె ని

న్నటుగా నం బరమాత్ముఁ డంచు మదిలో హర్షించి వైరింప కొ
క్కటిరాయుండు కృతజ్ఞతాశీలయు లౌఁగాధగ న్సజ్జనల్ — ఆ.౪.

మ. జయవాంఛ ల్విడనాడుచుం బలుచనా సైన్యంబులం జూచిఁగ
దయపుట్టన్ స్వాలోన నర్జునునకుం దర్కింప నట్లేకదా
భయులై చిక్కినవీఁ శత్రుల దయం బాటించి రక్షించిఁగ
నయముం గీర్తి మహాత్ములౌనరుల కెన్నఁగావె యుద్ధంబులన్. ఆ ౫

గూళికిల్లు - వెంకటరమణకవి.

ఇతఁడు కనకరంజితశిఖామణిపరిణయ మనువిక్రమార్కునిగూర్చిన యాశ్వాసములపద్యకావ్యమును రచియించెను. ఇతఁడు నియోగిబ్రాహ్మణుఁడు; వేంకటమాత్యునకును రంగమాంబకును కుమారుఁడు. ఇతఁడు హరివంశమునుగూడఁ దెనిఁగించినట్లు కవినిగూర్చి వేంకటేశ్వరుఁ డనిన ట్లున్న కనకరంజితశిఖామణీపరిణయములోని యీ క్రిందిపద్యమువలనఁ దెలియవచ్చుచున్నది—

సీ. నీయిష్టదైవంబ నిన్నుఁబ్రోచుచుండెడు శ్రీవేంకటేశుండ నీ వెఱుంగు
మోవత్స యిప్పుడు నీభావంబు తెలిసి వచ్చితి గూళికల్వంశశేఖరుఁడవు
వేంకటామాత్యుఁడై వెలయుమంత్రికి జిక్కులేటివంశజయౌవధూటి రంగ
మాంబకు జనియించి మాపేరుగొన్న వేంకటరమణుఁడవు సత్కవివి మాకు
మునుపు హరివంశ మంతయుఁ దెనుఁగు చేసి
యంకిత మొసర్చితివి విక్రమార్కచరిత
మిఁకఁ బ్రబంధ మొనర్చి మాకిమ్ము సిరులు
శుభము లొసఁగెదనని పల్కె సుముఖుఁ డగుచు.

ఈ వేంకటరమణకవి నూఱుసంవత్సరములక్రిందట నుండినవాఁడు. ఈతనికవిత్వము రసవంత మయినదే. కనకరంజితశిఖామణీపరిణయములోని రెండుపద్యముల నిం దుదాహరించుచున్నాను—

ఉ. అంత నితాంతమామకతపోగ్ని దహింపఁ బురంబులో మహీ
కాంతుఁడు మిత్రబాంధవనికాయముతోఁ బరిదగ్ధుఁ డైని
ల్వెంతయు ఘోరకాననము వృద్ధి వహించె మదీయజీవముల్
చింతిలి మస్తకాంతరముఁ జెందుట నేదరి గాన కుండెదన్.— ఆ. ౧.

చ. తెలిపినవారు రంజిలుచు దేవర దేవరకు న్వరంబు ని
ర్మలమతి నిచ్చెఁ గావునఁ గుమారుని మారునివంటివాని స
త్సిరి గలవాని సర్వజనమిత్రుని మిత్రునిఁ జూడ్కి సత్ప్రితా
పలసితుఁ గాంచి యొప్పును శుభంబుల భంబుల దేలిచాడ్పునన్ — ఆ. ౫.

కృష్ణకవి.

ఇతఁడు శకుంతలాపరిణయ మనెడి మూఁడాశ్వాసముల ప్రబంధమును రచించెను. ఈకవి మైత్రేయసగోత్రుఁడు; నారసింహార్యుని పుత్రుఁడు. కవి తనయింటిపే రేదో తా నేతెగ బ్రాహ్మణుఁడో చెప్పలేదు గాని శకుంతలాపరిణయ ప్రథమాశ్వాసములోని యీక్రిందిపద్యములనుబట్టి చూడఁగా నితఁడు వైష్ణవుఁ డైనట్లూహింపఁ దగియున్నది—

మ. నను రామానుజపాదపద్మయుగళీనవ్యవ్యయధ్యానపా
వనహృద్భాగవతావతంసపదసేవాసక్తచిత్తున్ మరు
త్తనయారాధనచారులబ్ధకవితాధారున్ సదారూఢభా
వన నాస్థానకవీన్ నిజాశ్రితునిఁ బిల్వంబంచి పల్కెం గృపన్.

క. పౌత్రుఁడవై మైత్రేయస । గోత్రుఁడవై నారసింహగురువర్యునకున్
బుత్రుఁడవై వెలయుదు వీ । ధాత్రిన్ మాపనుపు సేయఁదగుఁ గృష్ణకవీ.

ఈగ్రంథము చిలుమామిళ్ళ పాపయ్య యను కమ్మనాయని ప్రేరణమువలన రచియింపఁబడినది. కవి నూఱుసంవత్సరములక్రిందటివాఁడు. ఈగ్రంథము పిల్లవసుచరిత్ర మని దాక్షిణాత్యులు కొందఱనుచున్నారుగాని యీప్రాంతములయందు దీనికట్టిప్రసిద్ధి లేదు. అబ్బనామాత్య విరచితమైన కవిరాజమనోరంజనమున, సూరకవి ప్రణీతమైన కవిజనరంజనమును, పిల్లవసుచరిత్ర మని యిచ్చటివారు చెప్పుదురు. ఈగ్రంథకవిత్వము శ్లాఘ్యమైనదే యైనను, పిల్లవసుచరిత్రమని చెప్పఁదగినంత శ్రేష్ఠముగా లేదు. ఈకవి యనేకపద్యములను వసుచరిత్రాదిప్రబంధములను జూచి వానిలోని పద్యములవలె రచియించి యున్నాఁడు. ఇందుకు నిదర్శనముగా వసుచరిత్రములోనిపద్యము నొక దానిని శకుంతలాపరిణయములోనిపద్యము నొకదానిని జూపుచున్నాను—

ఉ. కొండఁట విల్లు వేదలఁట కుండలిరాజఁట నారి యమ్మనం
తుండఁట బైటిపల్లియలఁ దున్నినవాఁడఁట యొండురెండు భ
ర్గుం డిది నిండుపౌరుషముకో యని గెల్వవె ముజ్జగంబు లు
ద్దండత నొక్కతుంటవిలు దాలిచి యంటినఁ గందమూఁపులన్. — వసు. ౧.

ఉ. తుంటఁట కార్ముకంబు కరదొట్టిన తేంట్లఁట వింటినారి చే
నంటినవాఁడు తూపు లఁట యుప్పలపాలఁట కేతనంబు వా
గంటి పులుంగు గుఱ్ఱమఁట కాయము లేదఁట నీకు లోకముల్
కొంటెతనంబున న్గెలిచితో ఇది యచ్చెరువంబు మన్మథా.—శకుంత

ఇందప్రశస్తంబులగు ప్రయోగంబులును గొన్ని కానఁబడుచున్నవి.

క. ఆ ఖేటమునకు ధాత్రీ । శేఖర్షుఁ డనుమతింప లేఁ డనుచున్
శ్లాఘించుచుఁ బశువారులు । లాఘవమునఁ బిలిచి రగ్గలంబుగ వారల్.

ఇందు శ్లాఘించు 'లాఘవము' అనుపదము లప్రయోగము లైనను గావలెను, ఖఘల కొండొంటికిఁ గూర్చినయప్రశస్తప్రాసము లైనను గావలెను. ఈపుస్తకములోని మంచి భాగము లనేకములు కాళిదాసుని యభిజ్ఞాన శాకుంతలనాటకమునుండి తెనిఁగింపఁబడినవి. అభిజ్ఞాన శాకుంతలములోని మనోహరములైన నాలుగుశ్లోకములలో రెంటిని గవి యీక్రిందిరీతిని దెనిఁగించియున్నాఁడు—

చ. కనుఁగవ బాష్పపూరములు గ్రమ్మెను గద్గదభిన్నమై యెలుం
గనువున రాదు నా హృదయ మాకుల మయ్యెడు మేనుమ్రాన్పడుం
బెంచినవారి కింతవగఁ బిమ్మటిఁ గ్రమ్మెనుఁ గన్నవారలుం
దనయను బంపలేక సంతాపభరంబున నెట్లు సైతురో.

మ. గురుశుశ్రూషలు సేయుమీ సవతులన్ గూర్మి న్విలోకింపుమీ
పతివాక్యమ్ములఁ బ్రోవుమీ సిరుల గర్వస్ఫూర్తిఁ గైకోకుమీ
పురుషుం దూఱకుమీ సకుల్ నడచు నేర్పు ల్నీకు సూచించితిన్
దరుణీ లోకమతల్లి చేకొనవె మాతల్లీ మదీయోక్తులన్.

ఇట్లున్నను మొత్తముమీఁదఁ గవిత్వము ప్రౌఢమనియే చెప్పవచ్చును. కవిత్వప్రౌఢిమ తెలియుటకయి శకుంతలాపరిణయములోని రెండుపద్యము లిం దుదాహరింపఁబడుచున్నవి—

ఉ. మోవ మొగ్చఁ బుష్పముల గ్రుగ్గులపై నొఱపైన మొగ్గలన్
గేదఁగి పూలరెక్కములఁ గ్రొందలిరాకుల తోరణంబులన్
బ్రోది వహించు పక్వఫలపుంజములన్ శుకకోకిలాళిస
న్నాదములన్ నికుంజభవనంబుల నీలనృపాలనూతికిన్.—ఆ. ౧.

శా. పాయవ్యంబులు పల్కు నేల నృపతీ పన్నీరకర్పూరక
స్పూరస్ఫాగపటీరసౌరభపటీ పూరంబె జంద్రాతపం

బారామానిలసేవనంబు మఱి మీ రత్యంతముం గాంతురా
హేరాళంబుగఁ బుత్రగాత్రమిళనం బెట్లుండునో చూడుఁడీ.— ఆ 3.

వల్లూరి_నరసింహకవి.

ఇతఁడు నాగ్నజిత్తీపరిణయ మను మూఁడాశ్వాసముల ప్రబంధమును రచియించెను. ఈకవి యాపస్తంబసూత్రుఁడు; కౌండిన్యగోత్రుఁడు; హనుమత్కవిపుత్రుఁడు; ఆఱువేల నియోగికులపవిత్రుఁడు. ఇతఁడు నూఱు సంవత్సరముల క్రిందటివాఁడని తోఁచుచున్నది. ఈతని కవిత్వము రసికజన హృదయాహ్లాదకరముగా నున్నది. కవితాపటిమ తెలియుటకై నాగ్నజిత్తీపరిణయములోని మూఁడుపద్యముల నెత్తి చూపుచున్నాను—

చ. తనయునిముద్దుపల్కు చెవిఁ దార్కొన సంతసమందుచున్నత
జ్జనకునికీర్తి మామకవచఃప్రకరంబు వినంగఁ గోరె మీ
రనిశనివేశ నిట్లు సెల విచ్చుట నాయెడఁ గూర్మిగాద మీ
పనుపున విన్నవించెదను బద్ధదళాత్మశుభప్రసంగముల్.— ఆ. 1.

ఉ. వందుర నేల యిట్లు మగువా తెగనా నగువా గాఁడ కీ
యందఱిలోఁ జెప్పుఁగదా పగదాయఁగదా యటంచు నా
గంను రటించు నిట్టు లుసుగన్ నుసుగం బొదఁగందలంచి నీ
కందువ లిఁక మాను కోలుగా దలగా లెలుగాను నెచ్చెలీ.— ఆ. 2.

ఉ. కోసలుఁ డార్త నేనృపులకున్ వృషభంబులఁ బట్టరామికిన్
గాసిలి వీఁ బట్టుకొని కట్టినవానికిఁ గన్య నిత్తు నే
బాస యొనర్చినాఁడ నని పల్కెతి నిఁకెటుఁ దప్పి తేని పెన్
దోసము దప్పు నీకొమరితో జతగూర్పఁగ నెవ్వఁ డబ్బునో.— ఆ 3.

గోంతేటి_సూరన్న

ఇతఁడు కృష్ణాభ్యుదయ మనెడి యైదాశ్వాసముల పద్యకావ్యమును రచించెను. ఈకవి తన్నుఁ గూర్చి కృతిపతి యైనబొల్లాప్రెగడ కామమంత్రి పలికినట్లుగా గ్రంథాదియం దీపద్యమును వ్రాసికొనియున్నాఁడు—

మ. ననుఁ గోంతేటికులసత్కవిన్ జెలిమియొప్పన్ దాను వీక్షించి నూ
తన నీ వక్కజభైరవస్కవివి యోగ్యప్రేక్షణు లెగ్గింపభ

త్తిని కృష్ణాభ్యుదయప్రబంధము జగద్గేయప్రమేయంబుగా
నొనరం జెప్పుము మెప్పు లుప్పతిల సర్వోగానురాగంబునన్.

ఈకవి నియోగిబ్రాహ్మణుఁడు; భారద్వాజగోత్రుఁడు; కామయామాత్యపౌత్రుఁడు; కాశిరాజపుత్రుఁడు. ఈతనికవిత్వ మంతశ్రేష్ఠ మయినదని చెప్పఁదగినదికాదు. ఇతఁడు నూఱుసంవత్సరములక్రిందట నుండినవాఁడు. కృష్ణాభ్యుదయములోని రెండుపద్యము లిం దుదాహరింపఁబడుచున్నవి:—

ఉ. దేవకిగర్భగోళమున దేవతరణ్యుఁ డగణ్యపుణ్యసం
భావితభద్రమూర్తి యగుపంకజనాభుఁడు భవ్యలాభుఁడై
శ్రీవెలయం బ్రతిష్ఠిత వసించె జగజ్జనరక్షణక్షమన్
భావభవాబ్జభూప్రభవభావుకుఁ డయ్యును దీనికాసతన్.—ఆ. ౧.

చ. పదముల వ్రాలి బాలకుని పై దయసేయుము తప్పు చేసితిన్
సదమలచిత్స్వరూ రుద సత్తను యుత్తమ మైనీకథా
భ్యుదయము గోరి నీపు పవిత్రప్రరము లొనవచ్చినాఁడ నా
కొదవలు దీర్ప దేవతలకున్ పె హర్షుఁ దవర్పనీవికా.—ఆ. ౪.

బేతపూఁడి-కృష్ణయ్య.

ఈకవి జానకీరాఘవ మను నయిదాశ్వాసములప్రబంధమును రచియించి దానిని కమ్మప్రభు వయిన యడపానాగప్ప కంకితము చేసెను. ఈపుస్తకమునుగాక కవి యలమేలుమంగావివాహము, పండితమనోభిరామము, అను గ్రంథములను రచించిన ట్లవతారికలోని యీక్రిందిపద్యమువలనఁ దెలియవచ్చుచున్నది—

సీ. మఱి శ్రీనుపలమేలుమంగావివాహంబు శ్రీజగన్నాయకార్పితము చేసి
రహిఁ బండితమనోభిరామశృంగారకావ్యము ధవళాద్రిరాయునికి నొసఁగి
బహుకల్పనాకల్పబంధురోక్తులతోడ రచియించె జానకీరాఘవంబుఁ
బ్రాకటప్రాసాదపంచాక్షరీమంత్రజపపరాధీనరసజ్ఞుఁ డితఁడు
హరికథలె కావ్యములు చేసినాంధ్రభాష! యందుమద్భక్తుఁడితనిచెన్నొందుకావ్య
రత్న మైనట్టిజానకీరాఘవంబు! శ్రీకరం బగు నారధాత్రీతలేంద్ర

ఈకవి శ్రీవత్సగోత్రుఁడైన యాఱువేలనియోగి. ఈతనికవిత్వము సరసముగానే యున్నది. ఇతఁడు నూఱుసంవత్సరములక్రిందటివాఁ డయియుండును. జానకీరాఘవమునుండి రెండుపద్యము లిం దుదాహృతము లగుచున్నవి:—

చ. పృథులకుచప్రకాండములు బింబఫలాధరసద్రుచుల్ సుధా
మధురపికానులాపములు మత్తమయూరవిహారముల్ శుభ
గ్రథితవినీలవద్భ్రమరకంబులు కప్రపుఁ జెక్కులున్ వసీ
మధుకరవేణికల్ దరు మాధవుఁ డం దమరాగ మూనఁగన్.—ఆ. ౪

శా. ఆకోదండము రామభద్రుఁడు సముద్యల్లీల నీక్షించి శాఁ
నైకోఁ జూచి ప్రదక్షిణంబుగ భుజాగర్వంబుతో వచ్చి పూ
ర్ణాకల్పంబుగ దానిఁ బుచ్చుకొని నిస్సారంబుగా నంతఁ దా
నాకర్ణాంతముగాఁగఁ దీసి విఱిచెన్ హాస్యప్రభావంబునన్.—ఆ. ౫.

బసవరాజు-నాగేంద్రకవి.

ఇతఁ డానందసుందరీచాతుర్యవిలాస మను మూఁడాశ్వాసముల ప్రబంధమును రచియించెను. ఈకవి యాఱువేలనియోగి; పాపనామాత్యుని కుమారుఁడు. ఇతఁడు సుమారు నూఱుసంవత్సరములకిందట నుండియుండును. ఆనందసుందరీచాతుర్యవిలాసమునుండి రెండుమూఁడుపద్యములను గవి కవిత్వకౌశలమును జూపుటకయి యిందుఁ బొందుపఱుచుచున్నాను.—

ఉ. క్షోణిప యాతఁ డక్కుధరకూటశిఖాంతరమందుఁ గాంచె న
క్షీణజలోచ్చలన్నదజశీకరబంధురసింధురార్భక
శ్రేణిని హంసకోకబకచిత్రితరమ్యవిశాలసైకత
శ్రోణిని దీర్ఘవేణిని బహుప్రఘనాణిని గృష్ణవేణినిన్.—ఆ. ౨.

ఉ. భూమిపతీ యతం డక్రమలపూరములోపలఁ గాంచె నుల్లస
ద్భానుసహస్రరమ్యమణిభాసితభోగవిభూషు నానతో
న్నానితకైటభారిగుణమంజురసౌఘనరస్తదోషు నం
భోనిధికాననాకలితభూధరబాహువిశేషు శేషునిన్.—ఆ. ౨.

ఉ. దైన్యముదక్కి చాపశరదారుణఖడ్గము లూఁపట్టి యు
న్నోన్యవధాశచేఁ బెనఁగునప్పుడు చూడు మురారిశక్తిన
త్యున్నతిఁ దద్బలంబు నధికోజ్జ్వలతూరాధులు విచ్చలింపఁగా
జన్యమునందుఁ గూల్చెడను జక్రిని శుక్రుఁడు తల్లడిల్లఁగన్.—ఆ. ౩.

మాచవరపు పాపనామాత్యుఁడు.

ఇతఁడు నందవరీకచరిత్రము రెండాశ్వాసముల గ్రంథమును రచియించెను. ఈనందవరీకులచరిత్ర మీవఱకే యించుక వ్రాయఁబడినది. కవి నందవరీక నియోగి బ్రాహ్మణుఁడు; శ్రీవత్సగోత్రుఁడు; వేంకటాచలమంత్రిపుత్రుఁడు. ఇతఁడు తన వాసస్థలాదులనుగూర్చి యిట్లు చెప్పికొనియున్నాఁడు—

సీ. శ్రీమించు వినుకొండసీమలో నల్ల యనంతవరం బనునగర మొకటి
కొమరొప్పు బెల్లముకొండదేశంబున మానితంబై యొప్పు మాచవరము
గ్రామద్వయంబునఁ గాణాచి యేకభోగముమీఱ వెలసినఘనయశుండు
పెద్దనామాత్యుండు ప్రియురాలు జ్ఞానాంబ వారికి జనియించె వరసుతుండు
పాపనాహ్వయుఁ డనఁ బ్రఖ్యాతుఁడై యొప్పు నాతనిభార్య శ్రీయచ్చమాంబ
వారికి ముగురుపుట్టిరి వరుస సుతులు। ముదముతోడుతవసుధఁ ద్రిమూర్తు లనఁగ
నగ్రజుఁడు వేంకటాచలం బనెడుపేరఁ। బ్రబలుఁ గెక్కెను విభవసౌభాగ్యగరిమ.

క. అతనిదేవి పతివ్రత। సీత నరుంధతనిబోలి సృష్టిని వెలసెన్
జేతోమోదంబున సం। ప్రీతిని శ్రీకొండమాంబ ప్రియముం జనింపన్.

ఉ. శ్రీపరమేశుసత్కరుణ శ్రీవిలసిల్లఁగ వారికిన్ సము
ద్దీపితచారుమూర్తు లతిధీయుతు లిద్దఱుపుత్రు లందులోఁ
బాపన నగ్రజుండ నయి భాసిలి సత్యము దేవభక్తియున్
బ్రాపుగ నమ్మి సద్గురునిపాదములే గతియంచు నున్నెడన్.

నందవరము లిప్పు డనేకములు కానఁబడుచున్నవి. పూర్వకాలమునందు నందుఁ డేలి నట్టియు నందవరీకుల కియ్యఁబడినట్టియు నందవరము కర్నూలుమండలములోనిదయి నట్లు కవి యీక్రిందిపద్యమున వర్ణించియున్నాఁడు—

సీ. అందమై విలసిల్లుఁ గందనోలిసీమలో నందవరం బనునగర మొకటి
తత్పట్టణంబుసౌందర్యంబుఁ గొనియాడఁ జిత్ర మెవ్వారికి విచిత్ర మరయ
సుందరం బగుచు సంక్రందనపురిఁబోలి యిందిరాదేవికి మందిరముగఁ
గడురమ్యమై చాలఁ గన నొప్పుచుండును గూపతటాకము ల్గొమరుమీఱుగలఁ
బంకజాకరవిలసితపద్మనికర। మధురమకరందరసపానమత్తమధుప
సరసఝంకృతసంగీతసంకులంబు। నగుచు రంజిల్లు వీక్షింపలి యవనియందు

పయిపద్యములోని యనావశ్యకములయిన పదములప్రయోగమునబట్టియే యీకవిత్వ

మంత మంచిదికాదని చదువను తెలియఁగవచ్చును. ఇతఁడు నూఱు నూటయేఁబది సంవత్సరముల క్రిందటివాఁడేమో! నందవరీకచరిత్రము రెండాశ్వాసములనుండియు రెండేసిపద్యము లిం దుదాహరింపఁబడుచున్నవి:—

మ. దివమం దెల్లను రాజ్యభారముఁ దగం దీర్చున్ మఱిన్ రాత్రులం
దవలీలం జని జాహ్నవీసలిలమం దారూఢిగా స్నానముల్
సవిశేషంబుగఁ జేయుచున్ నిరత మీచందంబునన్ రాజపుం
గవుఁ డంభోరుహమిత్రప్రభావసముఁడై గాంభీర్య మింపొందఁగన్ —ఆ. ౧.

ఉ. ఒక్కమహానుభావుఁ డిటవచ్చి దయారస ముప్పతిల్ల నల్
దిక్కుల దివ్యతేజములు దీటుకొనం గడుసత్త్వభావుఁడై
మక్కువ యోగవాగ మనుమంత్రము నా కుపదేశ మిచ్చి తాఁ
జక్కఁగ నిచ్చి పాదుకల సంభ్రమ మొప్పఁగ నేగె నంతటన్ —ఆ. ౧.

ఉ. నందవరంబు మాకును ఘనంబుగ నచ్చట భారపోషణం ద
త్సంసరెఁ దాను గూనుకొని శుభ్రతరం బగుజాహ్నవీజలం
బందులఁ గాన వచ్చితిమి యాతనితో మతిఁ దల్పి వేగ మా
కుం దగఁజెప్ప మన్న ననుకూలత నచ్చెరియంబు తోఁపఁగన్. —ఆ. ౨.

ఉ. భూసురకోటి వచ్చుటకు భూపతి యాత్మఁ గలంగి దానముం
జేసితి మున్ను వీరల కజేయులు గావునఁ దప్పినన్ విప
ర్యాసముఁ బ్రత్యవాయమును రాఁగల దిచ్చిన విత్తహీనమా
మోసము వచ్చె నెట్లనుచు మో మొకయించుక వంచె నంతలోన్. —ఆ. ౨.

కృష్ణదాసకవి

ఇతఁడు రాధాకృష్ణవిలాస మనుపేర జయదేవవిరచితమైన గీతగోవిందమును మూడాశ్వాసముల కావ్యమునుగా రచియించెను. ఈతనితండ్రి వేంకటదాసుఁడు. ఈతఁడు శూద్రకులజుఁడని తోఁచుచున్నది. అయినను కవిత్వము హృద్యముగానే యున్నది. రాధాకృష్ణవిలాసములోని మూడుపద్యముల నిం దుదాహరించుచున్నాను—

చ. అలఘుభుజాబలంబుల నొయారము లయ్యసమానసాహసం
బులు నెర వైనసాదనలు పోటరిపంతము లేకవీరతల్
చలమరితెంపులున్ జవవిలంఘనముల్ విలసన్నియుద్ధతుల్
కలిగినకాల్బలంబు కటకంబున దంబున నొప్పె నెప్పుడున్ —ఆ. ౧.

ఉ. కూరిమి చేయు దిక్పతుల కోరిక లీరిక లెత్త రావణో
దారశిరంబులం దునిమి దద్దిశలన్ బలిపెట్టి సర్వభూ
భార మడంచి మానిజనభావనల న్విహరించినట్టి దు
ర్వారబలాభిరామ ధృతరాఘవరూప నినున్ భజించెదన్.—ఆ. ౧.

ఉ. ధ్యానము చేతఁ జూచెద సుధానిధితోఁ బ్రతివచ్చునట్టి రా
ధానన మిప్డు కోపజనితారుణమై కడువంకలై బొమల్
పైఁమరంగ శోణకమలంబునఁ ద్రిమ్మరునంచరీకసం
తానవిలాసములు తానొకనాయుండక మాననేర్చునే.—ఆ. ౩.

చెన్నూరి శోభనాద్రి.

ఇతఁడు బిల్హణీయకథను శృంగారసుధాసముద్రపూర్ణచంద్రోదయ మనుపేరను నాలుగాశ్వాసముల ప్రబంధముగా రచించి గుమ్మనపు పాపన్నపతి కంకితము చేసెను. కృతిపతిగాని కృతికర్తగాని యెప్పు డుండినవారో తెలిసినదికాదు. కృతిపతి పద్మనాయకకులసంభవుఁడయి గుళ్ళపాటి పురాధీశ్వరుఁ డయిన జగ్గనప్రభుని కుమారుఁడు; కృతికర్తయాఱువేలనియోగియైన చెన్నూరి రామచంద్రుని కుమారుఁడు. కవిత్వము ప్రౌఢముగా నున్నది. శృంగారసుధాసముద్రపూర్ణచంద్రోదయ మనెడి యీ యామినీపూర్ణతిలకకథనుండి రెండుమూఁడుపద్యముల నిం దుదాహరించుచున్నాను—

చ. చక్కనివాఁడు మాటలకు జాణ కళాగమసాహితీచణుం
డక్కట బిల్హణుం డిగని యందము చూచిన మందయాన ల
మ్మక్కయటంచు భర్తలను మాని పయింబయివచ్చి నిచ్చలుం
జొక్కకయుందురే రతులఁ జొప్పగునే మన కీతఁ డుండినన్.—ఆ. ౧.

ఉ. అంధుఁడు బిల్హణుండు తనయా తెరచాటున నుండి నీవు స
ద్గ్రంథము లన్నియుం జదువఁగావలె నీతఁడు బుద్ధిమాత్రవా
తంధయసార్వభౌముఁ డని తండ్రి విధించిన నమ్మియుంటి జా
త్యంధుఁడయేని యీతఁడు సుధాంశునిఁ గాంచను శక్తుఁ డెట్టులో?—ఆ. ౩.

మ. తనయా రాజకుమారుల న్విడిచి విద్వాంసున్ గ్రహింపంగ నీ
మన సెట్లొప్పెను రాజకన్యవుగదా మర్యాదయా నా ధరన్
వినవే పెద్దలు చెప్పుచుందురుగదా విద్వత్సుదారిద్ర్యతా
జని తద్వాక్యము వ్యర్థమయ్యెనుగదా హా యేమిచేయందగున్.

కోటీశ్వరుఁడు.

ఈకవి భోజకన్యాపరిణయమనెడి యైదాశ్వాసముల ప్రబంధమును రచియించెను. ఈతనిది రసవంతమైన కవిత్వమేకాని యందందు వ్యాకరణవిరుద్ధము లయిన ప్రయోగములు కానఁబడుచున్నవి. భోజకన్యాపరిణయమునందు రుక్మిణికిఁ గృష్ణుని తోడి వివాహకథ చెప్పఁబడియున్నది. కవి నియోగిబ్రాహ్మణుఁడు; చక్రప్పకును మంగమ్మకును నందనుఁడు. ఈతనికాలము మొదలయినవానినిగూర్చి యేమియుఁ దెలియదు. ఇతఁడు నూటయేఁబది సంవత్సరముల క్రిందట నుండియుండవచ్చును. ఈతని ప్రబంధములోని యొక్కొక్క యాశ్వాసమునుండి యొక్కొక్క పద్యము నిందుఁ బ్రదర్శించుచున్నాను—

ఉ. కోమలియూర్త్త చందనము కుంకుముతోడనగూర్చి యంత న
త్తామరసాక్షుపై నలఁదఁ దద్దయు నొప్పె మనోహరాకృతిన్
సోముఁడు నీరజాప్తుఁడును జూడ్కులయందు వసించియుండుటన్
గాముని గూర్చి యాతపము గ్రమ్మి వెలింగెడు నంద మొందుచున్.—అ. ౧.

మ. జనకీర్తిప్రదఘోషపంకజనవస్ఫారాయశశ్రీప్రాప్తిపో
షనరాశిం దప మొంది శంఖముకలస్వానామృతౌఘంబు శో
భనరేఖాత్రయభాసురంబు నయి తద్బామాగళత్వంబు నొం
దిన ముక్తావళి శుద్ధభక్త్యమున నే చెందెన్ హారవామాకృతిన్.—అ. ౨.

మ. అన నబ్జాస్య యనున్ వయస్యలకు నీయబ్జాక్షిఁ గైసేయుమం
చని నే సొమ్ములపెట్టె తెచ్చి మణిభూషానేకము ల్వానఁబో
యిన నొండేఁటియుఁ బాటిగామిఁ జెలి యేమే చెల్ల నాసొమ్ము లే
వని ఖండించుచు నాని నేరదెలుఁగన్ స్వప్రాప్తకారుణ్యసన్నతిన్.—అ. ౩.

శా. భద్రేభంబులఁ గూల్చు సింహము గతిన్ బ్రత్యర్థిభూపాలురన్
రౌద్రోల్లాసవిలాసము న్మెఱయఁ బోరన్ గెల్చి నానాదిగ
న్ముద్రశ్రీలకు నాటపట్టుగఁ బోల్చు న్యాసవుండో యనన్
రుద్రాధీశుఁ డిటంచు చూచితివె శ్రీరుద్రాజబింబాననా.—అ. ౪.

చ. సురవరదత్తమండనవిశోభితుఁడై హరి యిట్లు రుక్మిణీ
పరిణయకాంక్ష నుండుటయు భానుఁడు కన్గొని తాను నట్లు తా
హరికి ననర్ఘరత్నములు సర్వము చేయఁదలంచియో యనన్
బరవడిఁ బశ్చిమాంబునిధిపారమున న్నిలిచెన్ ద్వరాదృతిన్.—అ. ౫.

చల్లపిల్ల-నరసకవి.

ఇతఁడు యామినీపూర్ణతిలకావిలాసమను పేరిటో బిల్హణచరిత్రము నాలాశ్వాసముల శృంగారకావ్యముగా రచియించినకవి. ఈతనికావ్యము పూర్వోక్తమయినబిల్హణీయమునకంటె మిక్కిలి రమణీయముగా నుండును. ఈకవి వైదికబ్రాహ్మణుఁడు; ఆపస్తంబ సూత్రుఁడు; భారద్వాజసగోత్రుఁడు; కామకవి పుత్రుఁడు. ఈకవి తాను గొంతకాలముక్రిందట మృతుఁడయిన పిఠాపురపురాజుగారి పితామహుఁడగు శ్రీరావు నీలాద్రిరాయనింగారి కాలములోఁ దద్దాస్థానములోని కడియమను గ్రామమున నుండినట్టు యామినీపూర్ణతిలకావిలాసములో నీక్రిందిపద్యమునఁ జెప్పికొనియున్నాఁడు—

సీ. త్రిభువనపూతకృత్తివాసుగల్గు గౌతమీతీరవితీర్ణధాత్రిప్రసిద్ధ
తర మైరకంకణపురవరసంస్థానభూతిఁ జెందినవాఁడ భూసురుండ
శ్రీరామనామమంత్రారాధనపరుండ సకలవిద్వన్మహాజనహితుండఁ
బూజ్యతరప్రాజ్యరాజ్యసత్పీఠికాపురవరసామ్రాజ్యపరివృఢుండు
విమలరేచర్లగోత్రపవిత్రమూర్తి। రావు వేంకటనీలాద్రిరాయనృపతి
చేత సత్కృతి నొంది ప్రసిద్ధి నొందు। నట్టి నరసయనామవిఖ్యాతయశుఁడ.

కడియ మనెడి యీగ్రామము రాజమహేంద్రవరమునకు మూఁడుక్రోసులదూరమున కాకినాడకాలువయొడ్డున నున్నది. శ్రీరావు వేంకటనీలాద్రిరాయనింగారు నూఱుసంవత్సరములక్రిందట నుండినవారై నందున నాతనికాలములో నుండిన కవియు దాదాపుగా నూఱుసంవత్సరములక్రిందటివాఁడు. ఈయనకవిత్వము రసవంతమయి ప్రౌఢముగా నున్నది. ఈయన కవనరీతిని దెలుపుటకయి యామినీపూర్ణతిలకావిలాసములోని కొన్నిపద్యముల నిందుదాహరించుచున్నాను—

చ. నిరుపమసాహసాతిశయనిర్భరదుర్భరవైరివీరసం
హరణరణోత్సవోచితవిహారమహారథికప్రదత్తస
త్పరిణయకార్యధుర్యతరధాణధణంధణనాదఘుంటికా
నుగమితగర్జనీజనమనోరథముల్ రథము ల్పొగింబుసన్.—ఆ ౧.

చ. ఘనకబరీస్తనాకృతులు కంధరమై ధరమై రమైక్యమై
చను నొగిఁ గంరవక్త్రములు సాదరమా దరమా రమాకమా
దినుసుగ వాగ్ముఖాంగములు తేనెలతో నెలతో లతోక్తితో
నెనయుగు నాభిజంఘగతి హేమకరిన్ మకరిన్ గరిన్నగున్.—ఆ. ౨.

ఉ. అమ్మకచెల్ల! చెల్లఁ దగు నల్లికబెల్లికమాటలాడి చి
త్రమ్ముగఁ బన్ని నన్నిటులు దాఁచిచి మీరు పుడందఁ బొంకకై
గమ్మని గేలిసేయ నాడికట్టితి రమ్మ యికేమి మాటలన్
నమ్మఁగరాదు విమ్మనుచు నర్మిలి వేఁడుకతీరు మాటిరన్.—ఆ. ౩.

చ. కలువ లెసంగఁ దామరలు కందిముడుంగ దెస ల్వెలుంగ వె
న్నెలలు చెలంగ జక్కవలు నెక్కొని సేగి మునుంగఁ జీఁకటుల్
బలిమి నడంగ వేగ మరుఁ బ్రాయపువారల డెందమందమై
పాలు పలరంగ వారినిధిఁ బొంగఁగఁ జేయుచు రాజు రాజిలెన్.—ఆ. ౪.

శా. స్వామీ వేరము లేదు నావలన నీసర్వంబు నీకృత్రిమ
స్తోమంబున్నను భ్రాంతి ముంప సమయానూభూతిన్ మదీయానన
క్ష్మామాలోకనబద్ధకాండఘటరాజిం గూర్చి తేఁగాదె మ
త్ప్రేమానందకరాశయగ్రహణకారి ప్రాప్తిగ మున్నుగన్.—ఆ. ౫.

ఉ. రాముశరప్రయోగము సురప్రభువజ్రము చక్రిచక్రమున్
భామనిధిప్రియాత్మజునిదండము కామరిపుత్రిశూలమున్
భూమి నొకప్డు రిత్తయయిపోయినఁ బోవునుగాక యీగవి
స్వాములవాక్ప్రయోగములు బ్రహ్మకునైనఁ దరంబె త్రిప్పఁగన్.

అయ్యగారి - వీరభద్రకవి.

ఈకవి రాఘవయాదవపాండవీయమను మూడాశ్వాసముల త్ర్యర్థికావ్యమును రచియించెను. ఈతఁ డారువేలనియోగి యైనశైవుఁడు; కౌండిన్యగోత్రుఁడు; సోమనారాధ్యపుత్రుఁడు. ఈతఁ డేకాలమునం దుండినవాఁడో నిశ్చయముగాఁ దెలియరాదు. ఇతఁడు నూఱు నూటయేఁబది సంవత్సరములక్రిందట నుండియుండవచ్చును. మూఁడర్థములు గల పద్యమునుబట్టి కవననైపుణి యిట్టిదని చెప్పుటకు వలనుపడదు. ఇట్టికవిత్వరచనయే కష్టము. అయినను గవి యవతారికలోఁ జెప్పిన

ఉ. హారికిరీంద్రవిగ్రహనిహారికి నాశ్రితబృందదుఃఖసం
హారికి ధూర్తదేవనివహారికిఁ గౌస్తుభసజ్జ్వలన్మణీ
హారికి హస్తపద్మగమహారికి సాగరబాలికామనో
హారికి వాహనస్థగణవహారికి శౌరికిఁ గేలు మోడ్చెదన్.

సీ. నిండుచందురుఁడాలు నీటుచేలఁగఁజాలు మొగముపైఁ జిఱునవ్వు మొలకలాడఁ
దలిముత్తెములమించు తేటమాటాడించు నెలకూనయును దలఁ దళుకు లీనఁ
గొదమకుమ్మెదబారు నదలించితనరారు కడచూపు లక్కటికంబు నింప
జోడుగేదఁ తెల్పు సొగసుకత్తుక నల్పు మేవన్నెలకు వింతమిసిమి నొసఁగ
నలువ మొనలైనవారు తన్గొలిచి రాఁగ । గిబ్బ బాబాపయింబొల్చియబ్బురముగ
నెలమి చెన్నారఁగా నాకుఁగలను గానఁ । బడియె ముక్కంటికన్నులపండువుగను.

ఇత్యాదిపద్యములనుబట్టి చూడఁగా నితఁ డాంధ్రగీర్వాణపదబహుళముగా మంచికవిత్వము చెప్పఁగలవాఁ డనియే తోఁచుచున్నది. ఈతనిగ్రంథములోనివి కొన్నిపద్యము లిం దుదాహరింపఁబడుచున్నవి.

శా. నానారత్నవిభూషితాఖిలజనానందదానుసంధాయిశ్ర్యం
గానూనంబులు చారుగంధసుమశ్రీప్రాంచన్మహాపాదపా
శ్రీనవ్యంబులు సద్వ్యపాగ్నికతముల్ లీలార్థగోత్రాళు లెం
తో నేత్రోత్సవసంబు నామఁ జెలువొందుం దత్పురం బందునన్.—ఆ. ౧.

ఉ. ప్రాంచితకీర్తి రాముఁడు పంక్తిరథాత్మజాతుఁడు కృష్ణమూర్తి దా
మించినవేడ్క నంప జలమీఱఁగఁ బెంచి విరాధరాజితో
దంచదనూ లీలల నుదాత్తముగా యవనాశ్రము స్నతు
గ్గాంచుచు నింద్రకీలధరణీలలితదీప్తి నతండు భాసిలన్.—ఆ. ౨.

ఉ. రాముని ధర్మరాజు రణరంగవిరాజితు నచ్యుతప్రభున్
నీమతి మర్త్యగాఁ దలఁచి నీతివిహీనతఁ బోరఁబోకుమీ
సామము మేలు తద్విభుఁడు శస్త్రబలంబున మేటి భూమిలోఁ
గామిని రత్నయుక్తముగఁ గ్రక్కున నిచ్చి కులంబుఁ బ్రోవుమా.—ఆ. 3.

మట్టు ప్రభువు.

ఇతఁడు సురభాండేశ్వరము, కుచేలోపాఖ్యానము, యాజ్ఞవల్క్యచరిత్రము, అను మూఁడుపద్యకావ్యములను రచియించెను. ఇతఁ డెల్లామాత్యునిపుత్రుఁడు. ఈ కవి యాజ్ఞవల్క్య నియోగిబ్రాహ్మణుఁడయినట్టు కనఁబడుచున్నాఁడు. ఇతఁడు కుచేలోపాఖ్యానములోఁ దన్నుఁగూర్చి యిట్లు వ్రాసికొనియున్నాఁడు:—

సీ. భ్రమరాంబికావరప్రభవదివ్యకవిత్వవిద్యాప్రవీణత వెలసినాఁడ
ఘటికాశతగ్రంథఘటనాసమంచితచాతుర్యమహిమకుఁ జాలినాఁడ,

ప్రౌఢిమనేకకపక్షయానమహాప్రబంధకల్పనశక్తిఁ బ్రబలినాఁడ
మఱియు నాలుగు చిత్రమాధుర్యవాక్యప్రగల్భతంబున నుతు ల్గాంచినాఁడ
శ్రీకుధరమల్లికార్జునశ్రీపదాబ్జమత్తభృంగాయమానసస్వాంతుండ
నక్కలీశ్వరకరుణాప్రసాదవతుఁడ । ఘట్టుప్రభునామధేయ విఖ్యాతయశుఁడ.

ఈకవి నెల్లూరిమండలములోనివాఁడయినట్టును, అప్పటి కెనుబది సంవత్సరముల క్రిందట నుండినట్టును, నెల్లూరిమండలచరిత్రమునందు వ్రాయఁబడియున్నది. కాఁబట్టి కవి యిప్పటికి నూఱుసంవత్సరములక్రిందట నుండినవాఁడు. ఇతనికవిత్వ మంతగా నిర్దుష్టమయినదియు ప్రౌఢమయినదియుఁ గాకపోయినను, మంచి లోకోక్తులతోను న్యాయములతోను నిండియుండి ద్రాక్షాపాకమున జదువువారి కింపుగానుండును. ఈతఁడు రచియించిన యాజ్ఞవల్క్యచరిత్రము ప్రస్తుతము నావద్ద లేదు. తక్కిన గ్రంథములనుండి కొన్నిపద్యముల నిం దుదాహరించుచున్నాను—

కుచేలోపాఖ్యానము.

శా. చిత్రం బెన్నఁగఁ జిన్ననాఁడె తనయుల్ శిష్టానుగుణ్యుల్ తుదన్
బాత్రు ల్గా రతిదండకార్యములకున్ బ్రాయంపువారైన ని
ర్ధాత్రిం జుట్టములట్ల చూడవలదా తండ్రు లనూజాతులన్
బుత్రం మిత్రవదాచరే త్తనుచు నేప్రొద్దున్ శ్రుతు ల్చాటఁగన్.—ఆ. ౧.

ఉ. కామితవస్తుజాతములు గల్గి దయాపరులైనపుణ్యులన్
బ్రామత నిచ్చి పుచ్చుకొనుభావముసం దలపోయఁ డెంతయున్
గ్రామము క్రొత్తదైనఁ దనకర్తయు క్రొత్తయె పెక్కుమాట లిం
కేమి యదృష్టహీనునకు నెచ్చటి కేగినఁ గల్గునే సిరుల్.—ఆ. ౨.

ఉ. అన్నము లేకయుండిన లఘుం బగు దేహము రక్తమాంసముల్
సున్నగు నింద్రియస్ఫురణ స్రుక్కు మదాళియుంబు దూరమౌ
నన్నులమీఁదిప్రేమ చెడు నచ్యుత నీపయి నిల్చు మానసం
బెన్నటికైన జ్ఞానులకు హెచ్చు దరిద్రతసాటియే సిరుల్.—ఆ. ౩.

కురాభాండేశ్వరము.

చ. తవిలినమోహపాశమున దైన్యముఁ బూని మనోవ్యథం గడుం
దివురుచు విన్ననై యవనిదేవుఁడు ప్రార్థనచేసి మ్రొక్కఁగా
నువిదయుఁ జేరికిం గొనక యూరక యేగెను నిర్దయాత్మయై
శివశివ మిక్కిలిం గఠినచిత్తులు గారె లతాంగు లిమ్మహిన్.

చ. పరమవివేకశీలుఁడవు బాపఁడ వుత్తమవంశజుండ వీ
వెఱుఁగవె యొండ్లభూమితుల నీగతిఁ గోరుట ధర్మమే మహా
దురితము లైనవట్లఁ గడుదూరముగా నెదలించి మోహముల్
మఱచుట ధర్మ మంద్రు మతిమంతులు వేదపురాణసమ్మతిన్.

ముప్పిరాల-సుబ్బరాయకవి.

ఇతఁడు కృష్ణాభ్యుదయమనెడి యైదాశ్వాసముల ప్రబంధమును రచియించి చిక్కాలాల శేషయామాత్యున కంకితము చేసెను. ఆగ్రంథమునఁ గవి తన్నుఁగూర్చి యిట్లు చెప్పుకొనియున్నాఁడు.

మ. నను శ్రీనాథకథాసుధారససరిన్నాథాగ్రయోషాంబుగా
హనదూరీకృతసర్వకల్మషు హయాస్యానుగ్రహప్రాప్తసా
రనిరాఘాటనితాంతశోభికవితారాజ్యాన్వితున్ సత్సుధీ
జనసంతానవిధేయుఁ జూచి పలికెన్ సంతోష ముప్పొంగఁగన్.

సీ. అతిశయోత్ప్రేక్షోపమాద్యలంకారముల్ గొలఁకంగ ముద్దులు గులుకుఫణితిఁ
బద్యకావ్యముగాఁగఁ బ్రద్యుమ్నచరితంబు రసికు లౌననఁగను రచనచేసి
తలయుచు ద్విపదగా వెలయు సావిత్రిచరిత్ర యొనర్చితి చిత్రలీల
భద్రాద్రిఁ దగు రామభద్రునిపై నొక్క శతకంబుఁ జేసితి చతురఫణితి
నేరయుడ నరస్తుతులు నీవు సేయ వైన! భ్రాతృవాత్సల్యమెసఁగఁ బ్రబంధమొకటి
చెప్పి నా కంకితంబుగఁ జేయుమిపుడు! సుకవినుతగుణసముదాయ సుబ్బరాయ

పయిపద్యములనుబట్టి యీకవి ప్రద్యుమ్నచరిత్రమును సావిత్రీచరిత్రమును భద్రాద్రి రామశతకమునుగూడ రచియించినట్లు తెలియవచ్చుచున్నది. ఈకవి యెప్పటి వాఁడో తెలియరాలేదుగాని నూఱుసంవత్సరములకంటెఁ బూర్వపువాఁడు. ఈతని కవనము మృదువయి మధురముగా నున్నది. కృష్ణాభ్యుదయములోని కొన్నిపద్యముల నిందుదాహరించుచున్నాను—

ఉ. సంతమదాదిగంధయుతసారసమీరము మీఱితీవఁగాఁ
గంకణఝుంకృతు ల్వెలయఁగా సురసుందరు లొయ్య నొయ్యనన్
బొంకముమీఱ నాఁపఁగను భోగికులాధిపడోలికన్ రమా
పంకజగంధిఁ గూడుకొని బంధురహర్ష తరంగితాత్ముఁడై.— ఆ. ౧.

చ. విను చెలి జోడుకోడలగు వేఁడివెలుంగును రేవెలుంగునున్
వనజదళాయతాక్షునకు వారిరుహాసనుఁ డింపొనర్పఁగాఁ
గనుఁగవఁ జేయ నాసయును గాంచనపుష్పము నాశ్రయించి నా
రనిశము పువ్వువంతు లను నాఖ్య వహించిరి ముజ్జగంబులన్.—ఆ. 3.

ఉ. మారశరాళికిన్ మలయమారుతపాళికి మంజులాళికిన్
మీఱుమరాళికిన్ జిగురుమెక్కెడునీలిగయాళికిన్ శశాం
కోరుకరాగ్రకీలికి మయూరకదంబము కేళికిన్ సితాం
భోరుహనేత్ర కుంది తలపోయఁ దొడంగె మనంబులోపలన్.—ఆ. ౪.

చ. కొనియెద రుక్మిణీసతిని గోపవధూవిటుఁ డడ్డమైన మా
ర్కొనియెద మద్భుజాబల మకుంఠితమై తగ నెల్లి మీఱ క
న్గొనియెద రంచు బంధుజనకోటికిఁ దెల్పుచుఁ జైద్యుఁ డంతటన్
గని యెదురైనవారు నగఁ గ్రక్కున వచ్చె నృపాలువీటికిన్.—ఆ ౫.

ప్రయాగ-కామేశ్వరకవి.

ఇతఁడు గోపాలలీలాసుధాలహరి యను మూఁడాశ్వాసముల ప్రబంధమును రచియించి రామతీర్థస్వామి కంకితము చేసెను. ఈకవి విశాఖపట్టణమండలపువాఁడు; వైదికబ్రాహ్మణుఁడు; కౌశికగోత్రుఁడు; నారసింహపౌత్రుఁడు; సర్వేశ్వరపుత్రుఁడు. ఇతఁడు నూఱుసంవత్సరముల క్రిందట నుండినవాఁడు. కవిత్వము మంచిదేయైనను శృంగారవర్ణనము నితఁడు మిక్కిలి పచ్చిగాఁ జేసినందునఁ బుస్తక మిప్పటివారు చదువుట కంతగా యోగ్యమయినది కాదు. ఈప్రబంధమునుండి రెండుపద్యముల నిం దుదాహరించుచున్నాను—

ఉ. దుండగ మేలచేసెదవు తోయజసాయక దండనిల్చి కో
దండము డించి మాచెలికిదండము పెట్టుము రెండుకన్నులన్
నిండిననీరు దోయిటను నించి శపించుఁ దదశ్రువారిగన్
దండనచేయు ఫాలశిఖితండ్రిసుమీ కడుశిక్ష చేయఁగన్.—ఆ. ౨.

మ. యమునాతోయము దోయిటం గొని సముద్యల్లీల నేణాక్షి భా
మముఖాబ్జంబునఁ జల్ల నానెలఁతయు న్మార్గోము గావించుచో
దుమికెం దుమ్మెదచాలు ఫుల్లనవపాథోజంబుపై నాఁగ శ
క్రమణీరోచులనీనుకొప్పు విడి వేగం గ్రమ్మెఁ దద్వక్త్రమున్.—ఆ. 3.

అనంతనార్యుఁడు.

ఈకవి గాధేయోపాఖ్యానమును నేకాశ్వాసశృంగారప్రబంధమును రచియించి కామాంబకును జిన్నప్రభు'కును బుత్రుఁడగు కృష్ణభూపాలుని కంకితము చేసెను. ఇతఁడు తాళపలింగకవికుమారుఁడు ఈకవినిగూర్చియు నీతనికాలమునుగూర్చియు మఱేమియుఁ దెలియరాలేదు. ఇతఁడు నూఱేండ్లకు లోపలివాఁడుకాఁడు. ఈతని కవిత్వము హృద్యమయి యనవద్యమయియున్నది. కవితామాధుర్యమును జూపుటకై గాధేయోపాఖ్యానములోనిపద్యముల రెంటి నిందుక్రిందఁ బొందుపఱుచుచున్నాను—

ఉ. మానక యింతవంత దరమా సురమాన్యపదంబుగన్న మ
న్నీని కిదేల పట్టివగ నీకృపచే వగ నేవగ న్జగ
న్నానితతత్తపోమహిమ మానప నాదవిలాసమోవు నీ
పూనికమోపు నాపయినిమోపు వెత న్విడుమోపురంకరా.

చ. చిలుకలకు న్వచోగురుతఁ జెందుచు సప్తవిధస్వరంబులన్
బలుమఱుఁ దేరియ ల్గులుకఁ బాడెనునీలలితాంగిఁ జూచి లో
కులుమతి కీరవాణియును గోకిలవాణియునంగఁ దోఁచ చి
లుకలు మఱి రామరామయనఁ గన్నులఁ గెంపు వహించుఁ గోవిలల్.

భైరవకవి

ఇతఁడు రత్నశాస్త్రమును తెనుఁగునఁ బద్యకావ్యమునుగా రచియించెను. ఇతఁడు గౌరనసుతుఁడు. ఇతఁడు భ్రమరాంబికా వరప్రసాదముచేతఁ దనకుఁ గవిత్వము వచ్చినట్టు క్రిందిపద్యములలోఁ జెప్పుకొనియుండుటచేత కర్నూలుమండలము లోనివాఁ డయినట్టు తోఁచుచున్నది—

క. తన్నుఁ బ్రియమార వేఁడిన । యున్నమునీంద్రుల కగస్త్యముని చెప్పిన యా
సన్నుతమణిలక్షణములు । చెన్నుగఁ గ్రోడీకరించి చెప్పెదఁ దెలియన్.

క. భ్రమరాంబికామహావర । సముచితనిరవద్యహృద్యసాహిత్యకళా
క్రమవిమలప్రతిభాసం । క్రమణుఁడ మతిశాలి నైనగౌరనసుతుఁడన్

"భైరవుఁడ నుభయభాషాపరీణుఁడ" నని కవియే తనకుసంస్కృతాంధ్రభాషాద్వయపాండిత్యము కలదని చెప్పుకొనెను. ఈతనికవిత్వము మొత్తముమీఁద చక్కఁగానే యున్నది. రత్నశాస్త్రములోని రెండుపద్యము లిం దుదాహరింపఁబడుచున్నవి.

ఉ. నీరదము ల్దిగంతములనిండి తటిద్ఘనగర్జితంబు లిం
పార మహోగ్రవృష్టి కురియం బ్రభవించు నింతాతకాంతితో
నారయఁ గుక్కుటాండసమమైపడుముత్యము లంతరిక్షసం
చారులు పట్టుకొందురు విశన్ వసుధం బడకుండ నేర్పునన్.
ఉ. చేత ధరింప మానవులచెంతను జేరవు భూతకోటు లే
రీతిని దుష్టవిద్య లొనరించిన నెక్కువు క్రూరజీవముల్
ఘాతలు సేయలేవు సతిగర్భముమోప సుఖప్రసూతియా
నాతతభాతితోఁ బ్రతిదినంబును బ్రీతి యొనర్చుఁ గేతువున్.

అనముగుర్తి రంగయ్య.

ఇతఁడు యాదవగిరిమాహాత్మ్య మనెడి యైదాశ్వాసముల పద్యకావ్యమును రచియించెను. ఇతఁడు నందవరీక నియోగిబ్రాహ్మణుఁడు; తిమ్మయామాత్య తనూభవుఁడు. ఈకవి తనగ్రంథమును రావూరి వేంగామాత్యున కంకితము చేసెను. కవి యెప్పటివాఁడో సరిగా తెలియదుగాని నూఱుసంవత్సరములకుఁ బూర్వపువాఁ డనుటకు సందేహములేదు. ఈతనికవిత్వము శ్రావ్యముగానే యున్నది. యాదవగిరి మాహాత్మ్యములోని రెండుమూడుపద్యముల నిం దుదాహరించుచున్నాను.—

చ. పిసుగులఁబోలు నెండసెగఁ బెట్టిం పైరులు వాడిపోయినన్
మడిమడిఁ దప్పఁ జేతములు వాటుచు; బావులు త్రవ్వి కారుపై
రిడి యొకకొన్నిబాన లటు లెత్తుచు గాడ్పులదూలి సారనీ
రడలినఁ జూచి యొక్కతడి యిత్తురు హాలికు లశ్రుధారలన్.—ఆ ౩.
చ. బెళఁకులు నేర్చుఁ జూపు తిరిపెల్లు లపాంగజల్లె మేనిడాల్
కెలఁకులఁ జూడఁజూడఁ బెరిఁగెం జనుఁబూపలు సిగ్గుదేరఁ జె
క్కిలికవ సన్ననూలువడి కెన్నడు మెక్కడనుండి వచ్చెనో
చెలు లొకనాఁడు కేరుపనిసిగ్గు వధూటికి నాఁడునాటికిన్.—ఆ. ౮.
ఉ. వాలికచాగుఁ బ్రేంగుజడ వారిపయింబడి తేలియాడుచున్
వ్రాలఁగ, నీలహంస మని వారిరుహంబని డాయ, నొక్క ప్రో
యాలి మెఱుంగుమో మమరె నవ్వల నివ్వల రాహుకేతువుల్
వాలిని డాయు వారియెడఁ బర్వినపర్వసుధాంశుఁడో యనన్.—ఆ. ౫

తామరపల్లి-తిమ్మయ్య

ఇతఁడు శేషధర్మమనెడి యైదాశ్వాసముల పద్యకావ్యమును రచియించి శ్రీరామాంకితము చేసెను. ఇతఁడు నియోగిబ్రాహ్మణుఁడు; చరణయామాత్యుని పుత్రుఁడు. ఇతఁ డుండినకాలమేదో తెలియదు. నూఱు సంవత్సరముల క్రిందట నుండియుండును. ఇతని కావ్యమునం దపప్రయోగములు కొన్ని గలవుగాని కవిత్వము మొత్తముమీఁద చక్కనిధారకలదయి శ్రావ్యముగా నుండును. ఈతని శేషధర్మములలోని కొన్ని పద్యముల నిం దుదాహరించుచున్నాను—

ఉ. తోడికులాంగనల్ మణులతోఁ గనకంబులతోడ వెండితో
వాడలవాడలన్ సికి వన్నెలు వెట్టుచు నాథపుత్రులం
గూడి సుఖింపఁగా మనము కూటికిఁ గూరకుఁ జిక్కి బిడ్డల
న్గాడఁగ నెల్లకాలము మహాత్మ కనుంగొనుచుండ శక్యమే —ఆ. ౧.

మ. మును పోషించినపుత్రమిత్రవనితాముఖ్యుల్ స్వకర్మంబులం
జని యెందేఁ జన వారికై జపతపస్స్వాధ్యాయముల్ ల్పాసి దు
ర్జనులం గూడి పరాపకారనియతిం బ్రాఢత్వము ల్బాప నా
పెనుపాపంబున గర్భవేదనలు పైపెట్టుమ్యె నెట్లోగుదున్. —ఆ. ౩.

ఉ. అక్కడనున్న యాపశుమృగాదులు తావకపాదపద్మముల్
దిక్కని ముక్తికామికి దీవన లిచ్చు సుపర్వ లింతయున్
నిక్కము యిగ్గిరీంద్రమున నిల్వఁగవచ్చును బుణ్యశాలికిన్
గక్కసమౌ మహాదురితకర్ములకున్ వసియింప నివ్వటన్ —ఆ. ౫.

నారన సూరన.

ఇతఁడు వనమాలివిలాసమను కావ్యమును జేసి, కొండూరి యక్కదండనాథుని కంకితము చేసెను. నావద్దనున్న యీగ్రంథము యొక్క ప్రతి యసమగ్రమయినది; అవతారిక లేదు. కృతిపతిమంత్రియు దండనాథుఁడునయి యజ్ఞము చేసిన నియోగిబ్రాహ్మణుఁడు. కవినారనామాత్యుని కుమారుఁడైన నియోగివిప్రుఁడు. ఇతఁ డాధునికుఁ డని చెప్పుట దక్కఁ గవికాల నిర్ధారణము చేయుటకుఁ బుస్తకమునం దాధారమేదియుఁ జిక్కలేదు. ఈతని కవిత్వము సలక్షణమయి మృదువుగానున్నది. వనమాలివిలాస

ములోని కొన్ని పద్యముల నిం దుదాహరించుచున్నాను—

ఉ. గొజ్జఁగినీరుఁబోసి సమకూర్చిన చందనవాటిఁదోఁచి లా
మజ్జకతాళవృంతముల మాటికిఁ ద్రిప్పఁగ రాలుశీకరం
బజ్జలజాక్షుచెక్కులనునందుఁ దనర్చె ముఖేందునుజ్వరం
బుజ్జ చేరఁ గూడఁబడియున్న యుడుప్రకరంబుచాడ్పునన్.—ఆ. ౧.

చ. మెఱయు కపోలపాళికలమీఁదఁ జలత్కణికుండలద్యుతుల్
గిఱికొన ఫాలభాగమునఁ గించిదుదంచితనర్తనంబులై
కెఱికురు లింపుచేయఁ గమనీయవిలోచన లూఁచి రావలల్
కొలి భవద్యశోమహిమ కోనలి మాటికిఁ జెప్పుచుండఁగన్—ఆ. ౨.

చ. కలమధురంబులైన కలకంఠివచోరచనాగుంభనం
బులు విని సిగ్గునం బలుకుపూనిక తెల్లము బోవడించి మూఁ
గలవలె నోళ్లు మూసికొని కానసీమలఁ జేరియున్నవో
కిలములు బుజ్జగించి పలికించు మధూదయ మాత్రసంగతిన్.—ఆ. ౩.

ఉ. తొల్లియు మోసపోయితివి తోయరుహానన పెక్కుమాటలో
చెల్లఁ బదీయధార్త్యులచేతనె యిప్పుడు నమ్మి కానె నీ
యుల్లము సారె నెత్తులినుచున్నది యీక్రియ నాడు మంచు నా
కల్లతెఁబు లింతటినిగాఁ దలపోయు నరాళకుంతలా.—ఆ. ౪

పోచరాజు పెదరామామాత్యుఁడు.

ఇతఁడా ఱువేలనియోగిబ్రాహ్మణుఁడు; భారద్వాజగోత్రుఁడు; ఆపస్తంబ సూత్రుఁడు; శివరామమంత్రికిని సీతమాంబకును బుత్రుఁడు. ఇతఁడు శివరామాభ్యుదయ మను ద్వ్యర్థికావ్యమును రచించెను. ఇతఁ డీగ్రంథమును గురజాల పేరయార్యుని ప్రేరణమునఁ జేసెను. కవి కృతిప్రేరకుని తన గ్రంథమునందు

సీ. ఏమంత్రికులపూర్వుఁ డిలఁ జమత్కారభారత ముఁజెప్పె శ్రీరంగరాజనాముఁ
డేమంత్రిముఖ్యుతాత యామల్లయజ్వ దాక్షాయణీపరిణయగ్రంథ మంద
నేమంత్రితాత యజ్ఞామాత్యుఁ డొనరించె సప్తసంతానముల్ సరవితోడ
నేమంత్రిపిత పార్వతీశ్వరుఁ డావిరుదాత్తయై పద్యగద్యంబు లంద
నట్టిగురజాలకులకలశాబ్ధిచంద్రుఁడు | రసికుఁ డిపటూరిమల్లనారాధ్యశిష్యుఁ
డభవపూజాధురంధరుఁడైన పేరఘనుఁడు కౌండిన్యసగోత్రుఁడైనయనియు,

ఇట్లు వర్ణించి, అతఁడు తన్నుఁగూర్చి పలికినట్లుగా నీక్రిందిపద్యములను జెప్పికొని యున్నాఁడు.—

సీ. అనఘభారద్వాజమునిగోత్రజాతు నాపస్తంబసూత్రుఁ బ్రశస్తచంతు
ఘనునిఁ బోడూరి వేంకటమంత్రివరునప్త మహితధీబాపయమంత్రి పౌత్రు
శివరామమంత్రికి సీతమాంబకు సూనులై మించు బాపార్య రామ రాము
ఘనులముగ్వురిలోన గణన కెక్కినపెదరామకవీంద్రు శ్రీరమ్యచరితుఁ
జిత్రయమకాంధ్రసంస్కృతశ్లేషకవిత । రచనసేయఁగ నేర్చి భారతికరుణను
రాజవిద్వత్సభలయందుఁ బూజితుఁడగు । నన్నుఁ బిలిపించి పలికెఁ బ్రసన్నఫణితి.

సీ. నీవంశపూర్వధీనిధి కొండకవి చెప్పె భార్గవాభ్యుదయప్రబంధ మెలమి
నీయన్న బాపమంత్రి రచించె నాగినుషాకన్యకాపరిణయకావ్య మెసఁగ
నీతమ్ముఁ డసమునం దనిరోష్ఠ్యజానకీకళ్యాణకృతి గామకవివరుండు
నీవు ప్రౌఢోక్తిని నిర్మించినావు కౌసల్యాపరిణయాది సరసకృతుల
మతి యుదాహరణాది సమస్తకృతులను । సంస్కృతాంధ్రకవిగఁ జెప్పఁజాలినట్టి
ప్రౌఢసత్కవి నీవె ధరాంతరమునఁ । గలితగుణగణ్య పెదరామకవివరేణ్య.

ఈ పెదరామకవి సంస్కృతాంధ్రకవులను స్తుతించినపిమ్మట శ్లేషకావ్యములకు మార్గదర్శియైన పింగళి సూరనామాత్యు నిటు పొగడియున్నాఁడు —

ఉ. శ్లేషకవిత్వవైఖరివిచిత్రత రాఘవపాండవీయ ము
త్కృష్టముగా రచించి జగదేకనుతుల్గని ధాత్రిలో నవ
ప్రష్ట యనంగఁ బద్మభవసన్నిభుఁడైనమహాకవీశ్వరా
భీష్టసమప్రభావుఁ డగుపింగళిసూరకవీంద్రుఁ గొల్చెదన్.

కావ్యప్రేరకుఁడైన గురుజాల పేరయామాత్యుని యభీష్టప్రకారముగా నీగ్రంథమును గోదావరిమండలములోని యాచంటగ్రామమునందలి రామలింగేశ్వరస్వామి కంకితము చేయుటచేతనే కవి గోదావరిమండలములోనివాఁ డగుట స్పష్టమగుచున్నది. ఈతనికాలము నిశ్చయముగాఁ దెలియరాదుగాని యితఁడు నూఱుసంవత్సరముల క్రిందటివాఁడని తోఁచుచున్నది. ఈతనికవిత్వధార యనర్గళమయి మృదువుగానున్నది. కవితాధోరణి తేటపడుటకయి శివరామాభ్యుదయములోని రెండుపద్యము లిందుదాహరింపఁబడుచున్నవి.—

చ. తరమె నుతింపఁగా నగణితస్ఫురితాంకతఁ దద్ధరాధినే
శరసికుఁడౌ ననంత వసుధారథుఁ డుగ్రపురారి భీముఁ డీ

ర్వార నుతి కెక్కె మించె వృషవాహసమాఖ్యుఁ డహీనసద్గుణో
త్కరవరుఁ డాజిభీకరనితాంతపరాక్రమశాలి యానృపా. — ఆ. ౧.

మ. అలరన్ దత్సుకుమారభానురసహాయుం బొప్పఁగాఁ దారకో
జ్జ్వలనామాహితదంసకాంక్షు విబుధాంచద్భర్తయా దాన నా
కులపత్సంతతిఁ జూడవచ్చె నమితాత్ముం డుండుపుమీఱంగ మం
జులతారామమహాధ్వరాజితవరాంకు ల్లగ్గునవ్వీటికిన్. — ఆ ౨.

రామావఝ్ఝల-కొండుభట్టు.

ఈకవి కపిలగోసంవాద మనుపేర నధ్యాత్మవిద్యాప్రతిపాదకమగు నాలాశ్వాసముల పద్యకావ్యమునురచియించి యహోబిలనృసింహస్వామి కంకితముచేసెను. ఇతఁడు వైదికబ్రాహ్మణుఁడు; హరితసగోత్రుఁడు; నరసావధానికిని అక్కమకును పుత్రుఁడు. ఇతఁడించుమించుగా నూఱుసంవత్సరములక్రిందటి వాఁడని తోఁచుచున్నది. ఈతని కవిత్వము మృదువయి నాతికఠినమయి శ్రావ్యముగానున్నది. కపిలగోసంవాదములోని యొక్కొక్క యాశ్వాసమునందలి పద్యము నొక్కొక్కదాని నిం దుదాహరించుచున్నాను —

ఉ. ద్వైతముచే ననిత్యసుతదారధనాద్యఖిలైహికోత్సవ
వ్రాతములందు దైవతనివాససుఖంబులయందు లోలుఁడై
పాతరలాడువారల కపారత నిత్యసుఖాబ్ధిఁదేల నే
భాతి లభించు సద్గురుకృపామహిమం బొడగూడ దేనియున్. — ఆ ౧.

శా. ఔనా మీమదులం దనూనయనూనయాదేవిపైఁ బూన మే
మానాతిం జెనకంగఁ జాలుదుమె మీయాలాపము ల్గార్వరా
దైనం బోయెద మందు నేమగనితో యం చాదేవదేవోత్తముల్
గానంబోయిరి యమ్మునీంద్రునిసతిన్ గాపట్యవేషంబులన్. — ఆ. ౨.

శా. వేదాంతార్థసముజ్జ్వలాగ్ని భవసద్విజ్ఞానదీపంబుఁ దా
నాదిన్ మానసమం గరంగఁగ సముద్యల్లీలమైఁ బూని స
మ్మోదం బొప్పఁగ హృద్గృహాంతరవసన్మోహాంధకారంబు వి
చ్ఛేదంబై చనఁ జొచ్చి యందుఁగలయన్ శేషాహిభూషున్ బరున్. — ఆ. 3.

ఉ. అపరమేశ్వరుండు సకలాంతరబాహ్యములందు నిల్లఁ డా
వ్యాపకుఁ డౌట లింగమున వందును బింబితుఁ డయ్యె నందుచే

రూపని జీవుఁడై మిగులరూఢిని గర్తను భోక్తనంచు సం
తాపము నొందుచుండుఁ దమఁ దాఁ గనలేమిని నెల్లభంగులన్. — ఆ. ౪.

మ. ప్రతిబింబంబు లనంగ దుర్విషయదుష్ప్రజ్ఞాదిదుర్వాసనల్
సతతంబున్ మదిలోనఁ బాదుకొన నిశ్చాంచల్యముం బొంద నీ
కితరభ్రాంతులఁ ద్రిప్పుచున్ శ్రవణవాగిత్యాదిసంసర్గసం
గతులం బన్వకొనంగ లేని యపియాఁ గౌటిల్యమాలిన్యముల్. — ఆ. ౫.

ఉ. చక్కెర పుచ్చకాయవలె సంతనగా నొనరించియుంచ నం
దక్కడనైనఁ జేఁదు గలదే వినుమాత్మయఖండరూపమై
పిక్కటిలంగ నే నొకటి భేదము తోఁచునె యెట్లుచూడఁ దా
నొక్కటియొక్కటే నిజము నొక్కటి యున్నదియు న్విచిత్రమే. — ఆ. ౬.

మారయకవి.

ఇతఁడు మైరావణచరిత్రము పద్యకావ్యముగా రచియించెను. ఈకవి నియోగిబ్రాహ్మణుఁడు; సర్వయామాత్యునికుమారుఁడు. అక్కడక్కడ వ్యాకరణదోషములు కానఁబడుచున్నను మొత్తముమీఁద నీతనికవిత్వము మృదువయి మనోహరముగా నున్నది. కవనధోరణి తేటపడుటకయి మైరావణచరిత్రములోని రెండుమూడు పద్యముల నిం దుదాహరించుచున్నాను—

ఉ. చెప్పఁగరానిమాయల విచిత్రపురూపులు దాల్చి యింక వాఁ
డెప్పుడువచ్చునో యిటకు నేమతియుండినఁ గార్యమంతయుం
దప్పునుగాన రాఘవులు తద్దయుఁ గాంచుకథంబు గొబ్బునన్
జొప్పడఁ జెప్పుఁడీ తెలియ సూనృతవర్తనులార నావుడున్ — ఆ. ౧.

ఉ. మారుని మోహనాంబకము మాడ్కిని బ్రాణము లైదు నున్నబం
గారపుబొమ్మకీతిఁ దొలుకారుమెఱుంగులపోకభంగి శృం
గారరసంబునం దొలఁకఁగట్టి పువ్వులయొత్తురీతి న
న్నీరజగంధివచ్చి తగ నిల్చెను బ్రీతిని భర్తముందటన్. — ఆ. ౧.

చ. దనుజ దురాత్మ నీకు నిఁకఁ దస్కరవృత్తినిఁ జొచ్చి మాయలన్
దినకరవంశ్యులం దొడరి తెచ్చినపద్ధతిఁ బోవరాదు సా
ఘనతరవాలరోమమునఁ గట్టి జగంబులు మెచ్చ నిన్ను న
య్యనిమిషులెల్ల భీతి నిట కడ్డమువచ్చినఁ గావఁ జంపెదన్. — ఆ. ౨.

పరశురామపంతుల_లింగమూర్తి

ఈకవి సీతారామాంజనేయమనెడు మూఁడాశ్వాసముల వేదాంతగ్రంథమును రచియించెను. ఈతఁడు నియోగిబ్రాహ్మణుఁడు; రామమంత్రికిని తిమ్మాంబకును బుత్రుఁడు; మహాదేవయోగి శిష్యుఁడు. ఈగ్రంథము ప్రథమాశ్వాసము తారకయోగమును గూర్చియు, ద్వితీయాశ్వాసము సాంఖ్యయోగమునుగూర్చియు, తృతీయాశ్వాసము రాజయోగ మనఁబడెడి యమనస్కయోగమును గూర్చియు, తెలుపును. ఈ సీతారామాంజనేయ సంవాదము బహుజనులచేఁ జదువఁబడెడు జనప్రియమైనపుస్తకముగా నున్నది. కవిత్వము నిర్దుష్టమయి హృద్యముగా నున్నది. ఈకవి తనపాండిత్య ప్రకటనమునకయి యిట్టి వేదాంతగ్రంథమునందు సహితమేకాక్షరద్వ్యక్షర పద్యములను జొప్పించియున్నాఁడు. ఇతఁడు నూఱుసంవత్సరములకుఁ బూర్వమునం దుండినట్లు తెలియవచ్చుచున్నది సీతారామాంజనేయ సంవాదమునుండి కొన్నిపద్యముల నిం దుదాహరించుచున్నాను—

ఉ. ప్రాపుగ రామనామము నిరంతరమున్ భజియించువా కిం
బాపములేదటంచుఁ బెనుపామును బట్టఁగవచ్చు నగ్నిసం
దీపితలోహఖండము నతిత్వరితంబుగ మ్రింగవచ్చు బ
ల్కోపము పెంచుపెద్దపులికోఱలు దీయఁగవచ్చు సిద్ధగన్.—ఆ. ౧.

చ. నమ్ము మనమ్ములో ననుదినమ్ము వెలుంగుచిదాత్మసత్ప్రభా
వమ్ము నిజమ్ము నేన నిధనమ్మును సంజననమ్ము రూపవ
ర్ణమ్ములుఁ గర్మకార్యకరణమ్ములు వర్ణగుణాశ్రమాభిమా
నమ్ములు నాకు లే వనుఘమ్మగు నావచనమ్ము నెమ్మదిన్ —ఆ. ౨.

శా. గానంబున్నటనంబుఁ దాళగతులం గావించుచున్ జూపువి
ద్యానైపుణ్యముఁ జూపుచున్ శిరముమీఁదం గల్గుపెందొంతరన్
బూనం గైకొనునాట్యశీలునిగతిన్ బుంఖానుపుంఖోజ్జ్వల
స్వానార్థానుభవజ్ఞుఁ డయ్యు బుధుఁ డానందాత్ముఁ గాంచున్నదిన్.—ఆ. ౩.

పరశురామపంతుల_రామమూర్తి.

ఈకవి శుకచరిత్ర మనెడి యైదాశ్వాసముల వేదాంతగ్రంథమును రచియించెను. ఇతఁడు నియోగిబ్రాహ్మణుఁడు; సీతారామాంజనేయసంవాదమును రచియించిన లింగ

మూర్తి పుత్రుఁడును శిష్యుఁడును; ఈతని తల్లి లింగాంబ. కవి తన తండ్రినిఁ గూర్చియు దన్నుఁ గూర్చియు నిట్లు చెప్పికొనియున్నాఁడు.—

సీ. ఆత్మభూకుఁడు గాని యాత్మభూకుఁడు గాఁడు నిగమాగమాంతార్థనియతి దోఁపఁ
బురుషోత్తముఁడు గాని పురుషోత్తముఁడు కాఁడు సజ్జనానుగ్రహసరణి మెఱయ
మృత్యుంజయుఁడు గాని మృత్యుంజయుఁడు కాఁడు సర్వప్రపంచోపశమన మమర
నమృతసిద్ధుఁడు గాని యమృతసిద్ధుఁడు గాఁడు ఘనరసాధిసమంచనము దనర
నలచుఁ దా వ్యతిరేకాన్వయప్రసిద్ధి। లలిఁ బ్రత్యక్షముగ నజుఁ డచ్యుతుండు
నభవుఁ డమరేంద్రుఁడై యెప్పు వనిత తెఁడె। లింగమూర్తియు నాగురులింగమూర్తి.
గీ. అమ్మహాలింగమూర్తి లింగాంబికాని। మారుఁడఁ దదీయసేవానుమతుఁడఁ బరశు
రామపంతులకులకంజరాజికర్య। మాకృతిబోల్చు రామనామకుఁడ నేను.

ఇతఁడు నూఱు సంవత్సరముల క్రిందటివాఁడయినట్లు తోఁచుచున్నది. ఇతఁడు రచి రచియించిన వేదాంతగ్రంథమయినను కవిత్వము మృదువయి హృదయరంజకముగా నున్నది. శుకచరిత్రములోని కొన్ని పద్యములను గవితాధోరణిని జూపుటకయి యిందుదాహరించుచున్నాను—

ఉ. కాయవనంబునన్ ధనువుగా భ్రుకుటిం గుఱిచేసి నారిగా
వాయువు గూర్చి చూపులను వాఁడిశరంబులఁ బూని వణ్ముఖిన్
బాఱునిదృష్టి మాటుకొని మానసముఖ్యమృగంబులన్ సుఖో
పాయముగా వధించు మృగయారతు లుందురు తప్పురంబునన్.—ఆ. ౧.
మ. లలనా యౌవనభూమి కెల్లపుడు వాలాయంబుగా నప్పరో
లలనారత్నము లేగి యూఘుకులపాలం గల్గు సేవంతికా
లల నాతీరరసాలజాలకుల నేలాడోలలం గేళిలీ
లల నాట్యంగొని యాడుచుందురు బాలా కంటివే యిచ్చటన్ —ఆ. ౨.
ఉ. ఏ నెఱినైనఁ ద్రిప్పిన హృషీకేంద్రియబుద్ధులహర్నిశంబు పూ
ర్వానుభవాభిలాషవిషయంబుల కేచను వాని మల్పి నా
నాగమాంత శాస్త్రవచనశ్రవణాదుల నిల్పి తత్సమా
ధానమె మన్ననిపరనిధానము గాఁగొని యభ్యసించెదన్.—ఆ. ౩.
ఉ. యోగిజనాశ్రితానిలనియోగము సాధకలక్ష్యలక్షణో
ద్యోగము దేవదత్తనినియోగము సంతతముక్తికామినీ
భోగము నిత్యసత్త్వగుణభోగము ద్రష్టపరాత్మజీవసం
యోగము నొందఁజేయు భవయోగవియోగము రాజయోగమున్.—ఆ. ౪.

మ. జనకుం గాంచితి భేదవాదమతముల్ చెండాడితిన్ శక్తివా
దిని భంగించితి నాగమాంతమతయుక్తి న్నిల్పి మెప్పింప న
గ్గని మోహించితిని ముక్తికాంతను మహాకల్యాణయుక్తంబుగా
నెనయంగూర్చి నతండు దానిఁగొని యే నేతెంచితి న్వేడుకన్.—ఆ. ౫.

వేగినాటి కొండనార్యుఁడు.

ఈకవి వివేకసింధువనెడి యైదాశ్వాసముల వేదాంతగ్రంథమును రచించెను. ఇతఁడు వేగినాటి నియోగిబ్రాహ్మణుఁడు; శ్రీవత్సగోత్రుఁడు. మొట్టమొదట నీవివేకసింధువును నాంధ్రవచనకావ్యమునుగా రచియించిన ముకుందయోగిని కవి యీక్రింది పద్యమున స్తుతించియున్నాఁడు—

మ. వినుతింపన్ భవరోగవైద్య మగునీవేదాంతశాస్త్రంబు పా
వనమై యుండఁ బ్రవీణతన్ వచనకావ్యం బొప్పఁగాఁ జేసి స
జ్జనులం బ్రోచినపుణ్యమూర్తి విమలస్వాంతుండు విజ్ఞానశా
సనుఁడైనట్టి ముకుందమౌనికి నమస్కారంబు గావించెదన్.

ఈకవియు నూఱేండ్ల క్రిందట నుండియుండవచ్చును. శుకచరిత్రమునందు వలెనే యీవివేకసింధువునందును వ్యాకరణవిరుద్ధములైన ప్రయోగములు కొన్ని కనఁబడుచున్నను మొత్తముమీఁద కవిత్వము మృదువయి శ్రావ్యముగా నున్నది. కవనరీతి తేటపడుటకయి వివేకసింధువునుండి కొన్నిపద్యము లిం దుదాహరింపఁ బడుచున్నవి—

చ. కడువడిఁ గర్మమార్గ మను కాఱడవిం బడి విభ్రమించుచున్
జడమతి నింద్రియార్థఫలసంచితతిక్తకషాయసారముల్
డడఁబడఁగ్రోలి దుర్వ్యసనదాహమునన్ వెసఁ డొంది స్రుక్కి మీ
యడుగులు గాంచితిన్ ననుఁ గృపామృతమానఁగనిచ్చి ప్రోవవే.—ఆ. ౧.

మ. వడిగాఁదీసి ధనుర్ధరుండు విడువం బాణంబు నెందాఁక న
వ్వడిగల్గున్ శర మంతదాఁక నడుచున్ వమ్మైనయచ్చోటనే
పడుఁ బ్రారబ్ధపుఁగర్మవేగమును నాపర్యంతమున్ దేహముల్
పడ వావేగము తూలినం బడును జూ భగ్నంబులై మేదినిన్.—ఆ. ౨.

మ. సమతన్ మేఘుఁడు వారిధారలు మహిన్ సంప్రీతి వర్షింపఁ బ
ల్లములై యుండినచోట్ల నీరు నిలుచున్ రక్షింపఁగాబండపై

దురితస్సీరము నిల్వ దట్టగుట నెదుం బాత్ర మూహించి యు
త్తమునందుం దగ బ్రహ్మవిద్య నిలుపన్ ధర్మంబు చింతింపఁగన్.— ఆ. ౩.

మ. తనువుల్ స్వప్నమనోరథంబులక్రియన్ దండోపతండంబులై
యనయంబుం బొడచూపఁ బోవు నివి కర్మాధీనసంప్రాప్తముల్
ఎనయ న్నాతను వీనితోఁ దగులు లే దెల్లప్పుడున్ నే ఘనుం
డను నిత్యుండ నిరామయుండ విమలుండన్ సాక్షిచైతన్యుఁడన్.— ౪.

ఉ. అప్పుడు పుట్టినట్టిశిశువందును జవ్వనియై మిటారియై
యొప్పులకుప్ప యైనవికచోత్పలలోచనయందు వార్ధకం
బుప్పతిలంగ నున్నముదియగ్గలియందును నిర్వికారుఁడై
చెప్పెడి దేమి యొందు సమచిత్తుఁడు మందుఁడ యెంచిచూడఁగన్.— ఆ. ౫.

వాసుదేవయోగి.

ఈకవి జీవప్రబోధమనెడు నాలుగాశ్వాసముల వేదాంతగ్రంథమును రచియించెను. యోగశాస్త్రము లనుపేర రచియింపఁబడిన వేదాంతగ్రంథములలో ననేకములకంటె నిందలికవిత్వము సలక్షణమయి హృదయంగమముగా నున్నది. కవి యేకాలపువాఁడో తెలియదు గాని నూఱుసంవత్సరముల పయివాఁ డని తోఁచుచున్నది. జీవప్రబోధములోని రెండుపద్యముల నిం దుదాహరించుచున్నాను.—

చ. అనఘ జీవుఁ డిట్లుమఁ బ్రయత్నముఁ బ్రాప్యపదంబు లేక తా
ననయము ఖండమై జగములందును గారణకార్యరూపతం
బెనఁగొనియున్నయాత్మ కొకపిండపదంబుఁ బ్రయత్నసాధనం
బును నసఁ గల్గునే యనుచు బుద్ధికిఁ దోఁచెడి వీనిఁ జెప్పవే.— ఆ. ౩.

ఉ. అంధతమఃప్రసక్త్యనుగతాత్ముల శుద్ధశరీరశుద్ధిచే
బంధవిముక్తి గోరి కరిభంగిని నీట మునుంగ దేహదు
ర్గంధము వాయుఁగాక భవకర్తనిబంధవిముక్తి కల్గునే
బంధురరాగరోషములఁ బాసిన శుద్ధతఁ గాక జీవుఁడా.— ఆ. ౪.

కానాల నరసింహకవి

ఈకవి హరివంశములోని యాశ్చర్యపర్వమునందలి శివధర్మముల నెనిమిదాశ్వాసములపద్యకావ్యమునుగా రచియించెను. ఈతఁడు నందవరీక నియోగిబ్రాహ్మణుఁడు; వాసిష్ఠగోత్రుఁడు; వేంకటేశయామాత్యపుత్రుఁడు; ఈతనివాసస్థలము తతిగొండగ్రామము; ఇతఁడు తనశివధర్మగ్రంథమును తతికొండ నృసింహస్వామి కంకితము చేసెను. ఈతనికాల మేదియో తెలియరాలేదు. ఇతఁడు తనగ్రంథమునందు

గీ. ఆంధ్రవిద్వజ్జనాచార్యు నన్నపార్యు । సుజనగుణమాన్యసోత్పలసోము సోము
సుకవిరాలంకృతిభ్రాజి సోమయాజి । సత్కవిసవాధు శ్రీనాథు సన్నుతింతు'

అని యాంధ్రకవులను వర్ణించుచోఁ దమనందవరీకులలో సుప్రసిద్ధులైనపెద్దనాదికవులనుసహితము వర్ణించియుండలేదు. ఇంతమాత్రముచేత నితఁడు పెద్దనాదికవులకంటెఁ బూర్వుఁడనికాని వారితోడి సకాలికుఁడనికాని చెప్ప వలనుపడదు. ఇతఁడించుమించుగా నూఱునూటయేఁబదిసంవత్సరముల క్రిందట నుండియుండవచ్చును. అక్కడక్కడఁ గొన్నివిలక్షణములైనప్రయోగము లున్నను కవిత్వము మొత్తముమీఁద మృదువయి నిరర్గళధార కలదిగా నున్నది. ఈతనిశివధర్మములలోనుండి కొన్నిపద్యముల నిం దుదాహరించుచున్నాను.

చ. పటుతరమేఘమండలవిభాసితసౌధచయోపరిస్థితో
త్కటవరహేమకుంభసముదాయధగద్ధగితోరుకాంతిని
స్ఫుటచపలాకృతి న్మెఱయుఁజూడఁగవచ్చినవార లెల్ల ని
చ్చటఁ గలవంచలల్ కమునచంచల లంచు భ్రమింతు రెంతయున్ — ఆ. ౧.

చ. ఘనవిషజంతుపూరిత మగాధము కూపము దీనిఁ జూడు నీ
వొనరఁగఁ గూఁతు నియ్యవు తిలోదక మియ్యవు గాన దాన మా
తనువులు జీర్ణతం బొగసె దారుణరూప సమేతకూపమం
దును ఒడియున్నవార మతిదుఃఖసమాకులతన్ మహాత్మకా. — ఆ. ౨

శా. దారాపత్యయుతుం దకించనుఁడు విద్వాంసుండు వేదాంతమా
ర్గారూఢుండును వృత్తిహీనుఁడును నిత్యానందుఁడున్ శ్రోత్రియుం
డైగాజిల్లినబ్రాహ్మణోత్తమున కత్యానందులై జీవనం
బీరే దాతలు పొందరే సుగతు లుర్వీశా ధరామండలిన్. — ఆ. 3

ఉ. నీసము లెండలో శమనునిం గనఁబోయిన నీకుఁ జావురా
దాసరుఁ బుట్టినిల్లయి మహాకలుషంబు లొనర్చి సభ్యులన్

మోసము చేసి నేఁ డిటులు మూల్గినఁ బోవునె తత్ఫలంబు నీ
భాసినఁ గల్గు మా కఖిలభాగ్యము లేఁదుము కాలుద్రోలికిన్.—ఆ. ౪

మ. అనుచున్ దూతి మహీవరా సుతకళత్రార్థంబుగాఁ బాపచిం
తన లగ్నార్జఁ జేసి వాని నిరవందం బ్రోతు రంతంబునన్
దనవెంటం జనుదెంతురే కడపటన్ గా నొక్కఁడే పోవుటల్
గనియున్ మోహలతానిబద్ధు లగుచున్ గానంగలే రింతయున్.—ఆ. ౫.

మ. సతియుం దానును బుత్రపౌత్రయుతుఁడై సంప్రాప్తసర్వేష్టుఁడై
యతిసంతోషము మీఱఁగా మెలఁగి దేహాంతంబునన్ లోకపా
లతతుల్ పూజ లొనర్ప సర్వసుఖసంప్రాప్తుండునై క్రమ్మఱన్
క్షితిపైఁ బుట్టెను జక్రవర్తి యగుచున్ జేతోముదం బొప్పఁగన్.—ఆ. ౬.

చ. పొలుపగు కాంచనంబుఁ దిలపుష్పము నచ్చెలి నాసికోపమం
బలరఁగ వచ్చి దానిఁ గనఁ బాటకుఁ జాలక యూర్ధ్వదృష్టిఁ గో
మ్మలఁ దల క్రిందుగాఁ దగు మొనగఁ జేసి ఫలించువేళ మే
నులు విడిచెన్ [illegible] బలవద్విరోధియై.—ఆ. ౭

ఉ. నిన్నును దీపదానములు నెమ్మిఁ జేయును దాన మోక్షమున్
శ్రీవరుఁ డిచ్చు జ్ఞానమును జేకుఱు జ్ఞానముచేత మోక్షమున్
భూవర నీకుఁ గల్గు హరిపూజ లొనర్పుము కార్తికంబునం
దీనిమలేతిహాసము మహిన్ వినువారికిఁ గల్గు సౌఖ్యముల్.—ఆ. ౮.

రామనామాత్యుఁడు.

ఈకవి గయోపాఖ్యానమనెడి రెండాశ్వాసముల ప్రబంధమును రచియించెను. ఇతఁడు నియోగిబ్రాహ్మణుఁడు; తిమ్మామంత్రిపుత్రుఁడు. గయోపాఖ్యానమునకు కృష్ణార్జునసంవాదమని నామాంతరము గలదు. ఈతఁడు నూఱుసంవత్సరముల క్రిందటివాఁడయి యుండవచ్చును. ఇతఁడు తన గ్రంథమును శ్రీమదహోబిల నృసింహస్వామి కంకితము చేసెను. ఈతని గ్రంథమునందు లక్షణవిరుద్ధము లైన ప్రయోగము లనేకము లున్నను, మొత్తముమీఁద కవిత్వము సరసముగా నేయున్నది. గయోపాఖ్యానములోని పద్యములు రెండిందు క్రిందఁ జేర్పఁబడుచున్నవి.—

ఉ. వారిజనాభ నీ వనప వాసవనందనుఁ డున్నచోటికిన్
హిమాద్రిధైర్యునకుఁ జెప్పితి బుద్ధులు పెక్కురీతులన్

భూరిదయాబ్ధి యాఘునిబుద్ధికి నేమని యెంచిచూడ నీ
ధారుణిఁ బాండవేయులకు దాపునదండయు నీవెకా హరీ —ఆ. ౧.
ఉ. ఏమని చెప్పవచ్చు బళి యీఖలపార్థులబాహువీర్యముల్ ?
రాముని సాటి వత్తురు శరాసనవిద్యకు శౌరిధైర్యముల్
హేమమహీధరంబునకు నెక్కువ వీరలతోడ మార్కొనన్
సోమధరుండు వాసవుఁడు సూర్యకులోద్భవుఁడైన నోర్తురే. —ఆ. ౨.

పోచన.

ఈకవి చంద్రాభ్యుదయ మను ప్రబంధమును రచియించెను. ఇతఁడు వైదిక బ్రాహ్మణుఁడు. ఈతనితండ్రి నృసింహసోమయాజి. ఈచంద్రాభ్యుదయము అమ్మనమంత్రి కుమారుఁడగు చిన్నయామాత్యున కంకితము చేయఁబడినది. ఈకవికాల మేదో తెలియరాలేదు. ఇతఁడు నూఱుసంవత్సరములకంటెఁ బూర్వమునందుండినట్లు తోఁచుచున్నది. ఈప్రబంధము శబ్దాలంకారములతో నిండి శ్రావ్యముగా నున్నది. చంద్రాభ్యుదయములోని పద్యములు రెండిందుక్రిందఁ బొందుపఱుపఁబడుచున్నవి—

చ. తిమిరపుజవ్వనంబున నతీతసతీతనువృత్తమైనచి
త్తముతమి పౌరవారవనితాజనతాజనితానురాగయో
గమున ముఱింగి దర్పకవికారము తోరముగా ఘటింపన
క్కొమరుమిటారిబారిపడి కుఱివృత్తిఁ గ్రమక్రమంబునన్. —ఆ. ౧.
చ. అన విని గుండె జల్లుమన నవ్వనితామణి యమ్మచెల్ల యీ
యన మదనాతురత్వమని యాత్మఁదలంచి తలంచి సాధ్వసం
బున వెఱఁగుం దడంబడఁగఁ బొంపిరి నిట్లను భర్తతోడ న
య్యనువున మిన్నఁ బ్రోవఁగ మహాత్మ యొరుల్ మన కెవ్వరియ్యెడన్. —ఆ. ౨.

పెనుపల్లె బాపనామాత్యుఁడు.

ఈకవి సీతావిజయమను నేకాశ్వాసప్రబంధమును రచించెను. ఇతఁడు నియోగి బ్రాహ్మణుఁడు; కోనయామాత్యపుత్రుఁడు. ఈతని కవిత్వమునందు లక్షణవిరుద్ధములైనప్రయోగము లక్కడక్కడఁ గానఁబడుచున్నవి కవనరీతి తెలియుటకయి సీతావిజయమునుండి రెండుపద్యము లిం దాహరింపఁబడుచున్నవి.—

ఉ. పోల శతాసనుండు శివపూజ యొనర్చుచు నుండి యంతలో
వాలమువార్త కర్ణములయందు వినంబడ నల్కయుగ్రుఁడై
చాలును దేవపూజయని చారులఁ గన్గొని యేమి మత్పురిన్
జాలఁగ నందను ల్గలుగుచందము తోఁచెను జెప్పుఁడంతయున్.

ఉ. భూరిరయంబునం దొడరి భూసుత కన్నుల నెఱ్ఱచేసి యో
రోరిశతాస్య త్రుంగితవి యొక్కట బాణసహస్రకోటి తా
నారజనీచరేంద్రుఁడు తనువందును గ్రుచ్చిన నెత్తు రొల్కఁగాఁ
బోరుచు వాఁడు నొప్పెసఁగెఁ బూచినమోదుగుచెట్టుకైవడిన్.

చదువుల-సోమలింగయ్య.

ఈకవి మదనసాయక విలాసమనెడి యైదాశ్వాసముల శృంగారప్రబంధమును రచియించి శ్రీశైలమల్లికార్జునున కంకితము చేసెను. ఇతఁడు శైవబ్రాహ్మణుఁడు; గారుత్మతద్యుతి గోత్రుఁడు. వేంకటాచలమయారాధ్యునకును అన్నపూర్ణమకును పుత్రుఁడు. ఇతఁడే కాలపువాఁడో సరిగాఁ దెలియరాదు. ఇంచుమించుగా నూఱుసంవత్సరములక్రిందట నుండియుండును. ఈతని కవిత్వము మృదుమధురపాకమున వెలయుచున్నను నిరుపమమైనదికాదు. ఒక్కొక్క యాశ్వాసమునుండి యొక్కొక్కటిచొప్పున నిందుక్రింద నుదాహరింపఁబడిన పద్యములనుబట్టి కవియొక్క కవిత్వరీతి కొంతవఱకు తేటపడవచ్చును—

చ. చలిశశికాంతసంఘటితచారుసువర్ణవికారసౌధమం
దున నెనలేనిగద్దెపయి దోరముగాఁ గొలువుండి సాధుస
జ్జనపరివారయుక్తుఁడయి సత్యముఁ దప్పక మూఁడులోకముల్
తనదుయశంబు గప్పఁగను దద్దయు రాజ్యము చేయుచుండఁగన్. — ఆ. ౧.

చ. అరిదరిఁజేర బాలకుని నక్కునఁజేర్చి చెక్కుదోయి ము
ద్దొనరిచి ముంచు దువ్వుచు మృదూక్తులు పల్కి కడిందిప్రేమ నె
మ్మనమున నల్లిబిల్లికల మాటికి నల్లుకొనంగ నక్కుమా
రునిముఖచంద్రదర్శనవిలోచనకైరవుఁ డౌమ నయ్యెడన్. — ఆ. ౨.

ఉ. తెలిహరుమంజిమస్తైకులు తీరుగనిల్పిరి క్రేవఁ జక్కనౌ
ఖలువగుకెంపుగుంపులకుభస్థితకాంతులు చల్లుమేలుక

మ్మలకు నివాళు లిచ్చు కనుమచ్చికలున్ జెలువొందఁ దావిపు
వ్వులసర ముక్కుకేల నిడి యొప్పగ నప్పి నేగుచుండఁగన్ —ఆ. ౩.

ఉ. ఉల్లము చల్లగాఁ గనినయొప్పులకుప్పపయిన్ సుమాస్త్రయుల్
పెల్లుగ నేసినట్టికను పెద్దవు నీకొకలక్ష్యమా నవో
త్ఫుల్లసరోజలోచనలపొంక మడంచుట మన్మథా ధరన్
తల్లికి ముక్కుకోసి పినతల్లికిఁ గమ్మలొసంగ నేర్తురే.—ఆ. ౪.

ఉ. మారుని గేరు వీనిసుకుమారశరీరము నవ్యచంద్రికా
సారముతీరు హాసము సుసారససారము లౌర కన్నులిం
పారెడుగందుతుమ్మెదలబారులనే లుకురు లౌర వీనిసిం
గారము నీరజాసనునికైన మదిం దలఁపంగ శక్యమే.—ఆ. ౮ ౫.

శ్రీధరమల్లె-వేంకటస్వామి

ఇతఁడు బ్రహ్మోత్తరఖండము నయిదాశ్వాసముల పద్యకావ్యమునుగాఁ దెనిఁగించెను. ఇతఁడు బడగలనాటి కన్నడవంశజుఁడు; ఆశ్వలాయనసూత్రుఁడు; భారద్వాజగోత్రుఁడు; అయ్యనార్యతనూజుఁడు. కవి యీగ్రంథమును జ్యోతిరామనాదుల ప్రేరణముచే రచియించి, సిద్ధవటమునకు సమీపముననున్న యంబాపురమందలి పార్థేశ్వరస్వామి కంకితము చేసెను. ప్రేరకులయిన రామనయు లక్ష్మీనారాయణుఁడును జెంగల్వరాయుఁడును దన్నుఁ గూర్చి పలికినట్లుగాఁ గవి యీక్రిందిపద్యములలోఁ జెప్పుకొన్నాఁడు—

శా. శ్రీమద్వేంకటరామనామునిఁ గవిశ్రేష్ఠున్ రమావల్లభ
ప్రేమాపాంగవిశేషలబ్ధకవితాభివ్యక్తసూక్త్యన్వితుం
గామారిస్తవభక్తియుక్తు విలసద్గాంభీర్యధైర్యాఢ్యు న
న్నామోదంబునఁ జూచి పల్కిరి సముద్యత్కౌతుకం బొప్పఁగన్.

* * * * * *

క. ఖండేందుధరప్రియ మా । ఖండలభాగ్యప్రదంబు కల్పలతికా
ఖండన మగుబ్రహ్మోత్తర । ఖండము రచియింపు పద్యకావ్యముగాఁగన్.

ఈకవి యీబ్రహ్మోత్తరఖండమును రచియించి యెనుబదిసంవత్సరము లయినట్లు గ్రంథాంతమునందలి యీక్రిందిపద్యమునుబట్టి తెలియవచ్చుచున్నది.—

సీ. శరవర్షగణనంబు శైలరామమునీందుపరిమితంబై ధాత్రిఁ బరఁగుచుండు
యువనామసంవత్సరోపేత కార్తికమాసరాజిత పౌర్ణమాసియందు
ధన్యులు విష్ణువర్ధనసగోత్రులు జ్యోతిసుబ్బన్న పుత్రులు సుగుణమణులు
రామన్న లక్ష్మీనారాయణ వెంగళ్వరాయఁడు ననమువ్వు రమలయశులు
చిత్తమున భక్తి వెలయ బ్రహ్మోత్తరాఖ్య
ఖండ మాంధ్రప్రబంధంబుగా ఘటించి
యెలమి సంబాపురపుఁ బార్థివేశ్వరునకు
భాసురముగ సమర్పణఁ జేసి రపుడు.

ఈయిపద్యమునుబట్టి శాలివాహశకము ౧౭౩౭వ సంవత్సరమునందనఁగా క్రీస్తుశకము ౧౮౧౫వ సంవత్సరమునం దీగ్రంథము రచియింపఁబడినట్లు స్పష్టముగాఁ దెలియవచ్చుచున్నది. ఈగ్రంథమునం దక్కడక్కడఁ గొన్ని వ్యాకరణదోషము లున్నను మొత్తముమీఁదఁ బుస్తకము హృదయరంజకముగానేయున్నది. బ్రహ్మోత్తరఖండము లోని పద్యములు కొన్ని యిం దుదాహరింపఁబడుచున్నవి.—

ఉ. ఓమునిసార్వభౌమ మహిమోజ్వల మీ రిట కేగుదెంచుటన్
గామది సంతసం బొదవె నాదుగృహంబు పవిత్ర మయ్యె మ
త్కామితము ల్ఫలించెఁ గడుధన్యుఁడ మాన్యుఁడ నైతి నంచు నా
భూమివిభుండు పల్కుచును బూజలొనర్చె మహాముదంబునన్.—ఆ. ౧.

శా. ఆరాజేంద్రుఁడు కంఠసూత్రరహితన్ త్యక్తాంజనాపాంగశృం
గారప్రాభవహీనగాత్రి గళితగ్రైవేయహారాదికన్
దూరీభూతశుభాంగరాగలలికన్ దుర్వారశోకార్దితన్
సారాచారపరాయణం గనియె నాసాధ్వి స్వచిత్రంబుగన్.—ఆ. ౩.

మ. రణదుద్యన్మణిదీప్యమానకనకగ్రైవేయకోటీరకం
కణహారాంగదనూపురాదుల నలంకారంబు గావించినన్
క్షణమాత్రంబునఁ బాయఁద్రోచి కడువేడ్కన్ శ్రీల రుద్రాక్షభూ
షణము ల్దాల్తురు వారలిర్వురు మహోత్సాహంబు దీపింపఁగన్.—ఆ. ౪.

ఓరుగంటి - సోమశేఖరకవి.

ఈకవి రామకృష్ణార్జునరూపనారాయణీయమను నాలుగాశ్వాసముల త్ర్యర్థికావ్యమును రచియించి శ్రీపూసపాటి నారాయణరాజుగారి కంకితము చేసెను. పుస్తకము

యొక్క పేరు చేతనే యిందు రాఘవయాదవపాండవార్థము లిమిడియున్నవని తెల్లమగుచున్నది. ఈకవి వైదికబ్రాహ్మణుఁడు; కౌండిన్యసగోత్ర సంభూతుఁడు. ఇతఁడు సంస్కృతాంధ్రములయందు చక్కని వైదుష్యము కలవాఁడయి కవితారచనయందత్యంత సామర్థ్యము గలవాఁడుగా నుండెను. ఇతఁడు నూఱుసంవత్సరములకు లోపలివాఁడు. ఈతని త్ర్యర్థికావ్యములోనివి కొన్నిపద్యము లిందుదాహరింపఁబడుచున్నవి.—

శా. సంభూతాతిశుభాతి దర్శనకళాసంపన్నుఁ డారాజు స
ద్గాంభీర్యాంబుధి యేలె సర్వధరణిన్ గాంగేయచాపోరుసం
రంభప్రాధిసహాయుఁడై విదురసారన్యాయమార్గంబుతో
శుభకీర్తి మహోత్సవప్రియకులస్ఫూర్తిన్ విజృంభింపఁగన్.—ఆ. ౧.

ఉ. సంతస మొప్పఁ దోఁచెను వసంతము మంజులకోకిలస్వనా
క్రాంతము కోరకప్రకరకాంతము బంభరగానశోభితా
శాంతము సర్వమంగళనిశాంతము మోహితమానమానినీ
స్వాంతము ధూతసత్పథికశాంతము ఫుల్లలతాంతతాంతమై.—ఆ. ౨.

చ. సుజనకృతస్తవా జనకసూక్తి యలంఘ్య మదన్న చూడఁ దా
నిజము సమక్షమందుఁ దగనిన్ను సమర్థునిగాఁ దలంచి త
ద్ద్విజము నుతింపఁ బంచుపని వారకచేయు సుధర్మసంస్థితిన్
గుజములు ప్రక్క శ్రీహరి గొల్చినవాఁ డనయుంబు నెమ్మనిన్.—ఆ. ౩.

శా. కళ్యాణీధవదర్పితోగ్రవరసత్కారుణ్యతన్ సద్విషత్
కళ్యాణీధరవిఘ్నవర్యవసతీకాండప్రభూల్లంఘనా
కళ్యాణాతిశయంబు నాకు నిపటన్ గల్గెన్ని రాఘూటమై
కళ్యాణాంబరకాంతుఁ జేయుము కృపన్ గాంభీర్యధీ ప్రమొక్కదన్.—ఆ. ౪.

ముడుంబి వేంకటాచార్యుఁడు.

ఈకవి రసప్రదీపిక యనెడు మూఁడాశ్వాసముల వైద్యగ్రంథమును జేసెను. ఇతఁడు శ్రీవైష్ణవుఁడు; శ్రీవత్సగోత్రుఁడు; వేదాంతాచార్యపుత్రుఁడు. ఇతఁడు గోదావరీమండలములో నూఱుసంవత్సరములకు లోపల నుండినవాఁడు. కవిత్వమునందుఁ గొన్ని స్ఖాలిత్యములు గలవు. రసప్రదీపికలోని రెండుమూఁడుపద్యముల నిందుదాహరించుచున్నాను.—

ఉ. పారదగంధకంబు లొక భాగము నాలుగుభాగముల్ సదా
సారము కుప్పెఁ బెట్టి పదిజాములు వండినఁ గెంపుసొంపుతో
భానుణిఁ బుట్టు సిందుర ముదారత నద్దిగ యొత్తు నిచ్చినన్
బోరన రోగపుంజములఁ బోవహరించు నమోఘవీర్యమై.—ఆ. ౧.

చ. ఘృతమునఁ గొండపిప్పలి మిరెంబులతోడుత నభ్రకంబు సం
తతమును జిన్నమెత్తుగొన దారుణమౌ కఫవాతపిత్తసం
యుతగ్రహణీక్షయంబుల వియుక్తప్రమేహగుదాంకురంబులన్
గతుకఁగఁజేసి దీపనము గల్గఁగఁజేయు నమోఘవీర్యమై.—ఆ. ౨.

ఉ. మంచిసువర్ణభస్మము క్రమంబునఁ గొన్నను రాజయక్ష్మమున్
సంచితకృజంబు లగుసర్వరుజంబుల భూతవేధలన్
ద్రుంచి యమోఘవీర్యమయి దోర్బలమున్ ఘనకాంతి తేజము
త్యంచితబుద్ధిమార్గము చిరాయువొసంగును మానిచంద్రమా.—ఆ. ౩.

అక్కెనపల్లి—నృసింహకవి.

ఈకవి యాదిలక్ష్మీవిలాసము, వల్లభాంబాపరిణయము, ఓఘవతీపరిణయము, అను మూడుప్రబంధములను రచియించెను. వీనిలో నోఘవతీపరిణయము శ్రీగోడే జగ్గారాయనింగారిపుత్త్రు లగు శ్రీసూర్యప్రకాశరాయనింగారి కంకితము చేయఁబడి తత్సోదరపుత్త్రు లగు శ్రీమహారాజా గోడేనారాయణగజపతిరాయనింగారిచే ముద్రింపింపఁబడినది. ఈగ్రంథము శాలివాహనశకము ౧౭౩౭వ సంవత్సరమునందు రచింపఁబడినట్లు గ్రంథాంతమందలి యీసీసపద్యమువలనఁ దెలియవచ్చుచున్నది—

సీ. శాలివాహనశకసంవత్సరంబు లజాగ్నిభూధరతుషారాంశులైన
యీశ్వరాబ్దంబున నెసఁగువైశాఖమాసంబున శుక్లపక్షమున మూర్తి
శశిసంఖ్య భౌమవాసరమున శుభవేళ నక్కెనే. లిన్నృసింహకవి యోఘ
వతిపెండ్లికథ సమున్నతిమీఱఁ జెప్పి గోడెజగ్గారాయసూర్యప్రకాశరాయ
మణికి రాజ్యాయురారోగ్యమహితపుత్త్ర। పౌత్త్రనికరాభివృద్ధిగా భవ్యబుద్ధిఁ
గృతి యొసంగెను దద్యశం బతిశయిల్లి। జగతి నాచంద్రతారార్కముగ వెలుంగ.

ఇతఁడు కృష్ణామండలములోని యెల్లమంద నివాసుఁడయినను తనయాదిలక్ష్మీవిలాసమును గోదావరీమండలములోని యంతర్వేది నృసింహస్వామి కంకితము చేసెను.

అనిలక్ష్మీవిలాసము నాలుగాశ్వాసములు గల ప్రౌఢకావ్యము. వల్లభాంబాపరిణయ మను విఘ్నేశ్వరుని పెండ్లికథ మూడాశ్వాసముల ప్రబంధము. ఇది పులిపాక సీతయామాత్య పుత్రుఁ డయినరామమంత్రి కంకితము చేయఁబడినది. ఈకవి నియోగిబ్రాహ్మణుఁడు; కౌండిన్యగోత్రుఁడు; జోగయామాత్య పుత్రుఁడు ఈకవి నూఱుసంవత్సరములకు లోపలివాఁడు. ఈతనికవిత్వము రసవంతముగా నున్నది. ఈతని పుస్తకములోని యీ క్రిందిపద్యములవలన నీతని కవితాధోరణి కొంత తెలిసికొనవచ్చును—

అనిలక్ష్మీవిలాసము.

ఉ. మాయలు నింద్రజాలములు మా కవి క్రొత్తలుగావు మామనో
నాయక యిప్పు డీవు రతినాయకసాయకభిన్నకాయునై
పాయనిమోహ మందునటఁ బన్నఁగఁ గౌఁగిటఁగూర్చి యొయ్యనన్
శ్రీయుతసౌఖ్యవైఖరులు చేకొదలంపుల దీటఁ గూడుమా.—ఆ. ౧.

ఉ. ఎక్కడిగొల్లవాఁడ విది యెక్కడిజాణతనంబు దొంగవై
యెక్కడిపౌరుషంబు మఱి నింత తలంపక ప్రాలుమాలినన్
దక్కెనె నీకుఁ గోక లవి తక్కకయి మ్మికఁ గామపలివే
యక్కలతోడ నీసరసి నాడఁగఁ జీరలు దొంగిలింతువే.—ఆ. ౨.

ఉ. వారిజనేత్ర మీచరణవారిజముల్ హృదయాంబుజంబునన్
గూరిమినిల్పి యెల్లపుడుఁ గొల్చురమాపతియంచు రుక్మిణిం
దారయలేక చైద్యునకు నంగన నిచ్చెదనన్న మాట బ
ల్గారసమట్లు కర్ణమున నాఁట ననుం గృపఁ గాంచి యట్లనెన్. ఆ. ౪.

వల్లభాంబాపరిణయము.

చ. అరయఁగ సిద్ధసాధ్యగరుడామరకిన్నరనాగయక్షకిం
పురుషులయుండ్లలో నెలమిఁ బుట్టెదఁ జేసెడుపాట్ల మీగణే
శ్వరునకుఁ బెద్ద దేల యనిశంబును బొట్టిగఁ బ్రహ్మచారియై
పరఁగెడిమేటికిన్ గతివభావులతో నిల వియ్య మేటికిన్.—ఆ. ౨.

చ. ముద మొనరించు నుచ్చటల ముంచును గంధముఁ బెంచు సౌఖ్యము
ల్గదురఁగ నించు నించువిలుకొంచుఁ జరించువజీరుశాస్త్రసం
పద గడియించు నిత్తురసపద్ధతుల న్నిరసించు మించు ని
ష్ఠదిరయటంచు నెంచుచును మానుగఁ గ్రొవ్విరిమించుబోండ్లొగిన్.—ఆ. ౧.

ఓఘవతీపరిణయము.

ఉ. మేలగుమేలు గూర్చుటకు మీ రరుదెంచితి రంటివౌబళీ
చాలు భవన్మనోరథము చక్కఁ లభించు ఫలం బటంచు నా
లోలవిశాలనేత్ర మొనలోఁ గలతియ్యనివిల్తు నొయ్యనన్
మేలుకొనంగఁ జేసి యొలమిం జని సంయమిరాజు సయ్యనన్.—ఆ. ౧.

ఉ. అంతట నేర్చె విద్యలిసుమంత కొ అంత యలంతలేక భూ
కాంతునిముద్దుపట్టి యజుకాంతయొ యంచు సమస్తసజ్జనుల్
వింతగ సంతసించి తను వేయివిధంబుల సన్నుతింప న
త్యంతకళావినోదమహిమాతిశయంబు శయంబుఁ జేరఁగాన్.—ఆ. ౪.

పైఁడిపాటి-వేంకటనృసింహాకవి.

ఈకవి నృసింహవిలాస మను మూఁడాశ్వాసముల గ్రంథమును రచియించెను. ఈతఁ డాఱువేలనియోగిబ్రాహ్మణుఁడు; ఆపస్తంబసూత్రుఁడు; శతమర్షణగోత్రుఁడు; లక్ష్మీపతికిని వేంకమాంబకును బుత్త్రుఁడు. ఈతఁడు నెల్లూరుమండలములోని పైఁడిపాటి గ్రామనివాసుఁ డయి గ్రామచతుష్టయమునందు స్థావరజీవనము కలవాఁ డయినట్లు నృసింహవిలాసములోని యీక్రిందివచనమువలనఁ దెలియవచ్చుచున్నది—

సీ. శ్రీశైలంబున నొప్పు కృష్ణాపినాకినీదివ్యనదీమధ్యదేశభూమిఁ
గడుఁబూర్వపార్థ్వకిఁ బదమూఁడుయోజనదూరమై తగుఁ గందుకూరు మఱియు
నగరౌ సీతారామమై యొప్పు నాకందుకూరికిఁ దనరు వాయవ్యదిశను
శాలేట దానికిఁ జాల నైరృతిఁ బైఁడిపాడొప్పు దానికిఁ బశ్చిమమున
నెగడుఁ జతుష్టాము నిబ్బరి వేంపాడుఁ జెలఁగు గాడ్పుమూల నిలచియున
నమరుపురచతుష్టయం బిది తృణకాష్ఠజలసమృద్ధి సిరుల నలరుచుండు.

గీ. గ్రహణవేళ గోపరాజు రామన గోల। కొండప్రభువుచేతఁ గొనినదాన
మహిమ దష్టమతుల మహియించి స్థావర। జీవనములు ద్విజులఁ జేర్చె మున్ను.

వ. తదీయాన్వగ్రహలబ్ధం బైనయేతద్గ్రామచతుష్టయము స్థావరజీవనజీవితు లయిన మదీయవంశజులు &c

ఈకవియొక్క కాల మేదియో కానరాదుగాని యితఁ డాధునికుఁ డయినట్టు తెలియవచ్చుచున్నది. నృసింహవిలాసములోని రెండుపద్యము లిందుక్రిందఁ బొందుపఱుపఁబడుచున్నవి—

మ. శశి పక్షక్షయ మెన్ని యక్షయకళాసంప్రాప్తికిన్ ధాతృహృ
ద్వశుఁడై దీని సృజించుకాలమున వక్త్రం బయ్యెనో తా మహా
కృశ మూర్ధ్వస్థితి నుంట రోసి తొలఁగెన్ రేఖేఁ దటంచుం దదం
ఘ్రికయాక్రాంతసఖాకృతిం బొలిచెనో క్రిందై క్వచిత్తాకరల్. — ఆ. ౨.

శా. పోరా వేటకు వేఁటకాండ్రు గహనంబు ల్గుమ్మరన్? గ్రమ్మఱన్
రారా రాత్రి కైన్? వా రలసులై రాకున్న నారాత్రికై
యూరీతిం దపియించుబోఁట్లు కలరే యెందైనఁ జంద్రాస్యలా
ఘోరారణ్యముఁ జొచ్చి చూడఁగలరే గోవిందు రేజాములన్. — ఆ. ౩.

కొటికెలపూడి-వేంకటకృష్ణకవి.

ఇతఁడు శ్వేతాచలమాహాత్మ్యమను మూఁడాశ్వాసముల గ్రంథమును రచియించి, బొబ్బిలిపురాధీశ్వరుఁ డగు రాయణప్ప రంగరాజున కంకితము చేసెను. ఈకవి వైదిక బ్రాహ్మణుఁడు; ఆపస్తంబసూత్రుఁడు; హరితసగోత్రుఁడు; శివరామపౌత్రుఁడు; వేంకటరామపుత్రుఁడు. కృతిపతి తన్నుఁగూర్చి పలికినట్లు కవి తనగ్రంథములో నిట్లు వ్రాసికొనియున్నాఁడు—

మ. నను శ్రీమజ్జనకాత్మజాధిపపదన్యాసప్రపన్నాంతరం
గుని వాణీకరుణాకటాక్షకలనాంకూరత్సుధామాధురీ
వినుతాంచత్కవితాప్రతోషితమహావిద్వత్కవిగ్రామణిన్
ఘనకార్తాంతికతాండిలేయుఁ గడువేడ్కం బిల్చి తా నిట్లనెన్.

చ. హితులు మదన్వవాయజుల కెల్లఁ బురోహితు లార్యలోకపా
లితకవితాప్రకల్పితదిలీపచరిత్రముఖోజ్జ్వలప్రబం
ధతతులు హారికాగ్రణు లుదారగుణాన్వితచిత్తుల స్సదా
శ్రితులు సమస్తసూరినుతశేముషు లెన్నఁదరంబె మిమ్ములన్.

సీ. ధీరత మేఘసందేశంబు తెనిఁగించి ప్రీతి దిలీపచరిత్ర మనెడు
గొప్పప్రబంధంబుఁ జెప్పి శ్రీరాముల కర్పించితివి మున్ను నేర్పుమీఱఁ
గార్తాంతికులు మెచ్చఁగా శ్రీపతి గ్రంథగతిని మామకజాతకము లిఖించి
మా కొసంగితి విప్పు డేకాగ్రచిత్తత సంచితంబుగఁ దెనిఁగించుచున్న
కూర్మమాహాత్మ్య మొసఁగుము కూర్మిమాకు। రమ్యచారిత్ర వేంకటరామపుత్ర
కీర్తిదౌదార్య వేంకటకృష్ణసూర్య। యనుచు బహుమతిచేయ నాహ్లాదమునను,

కృతిపతిపూర్వులు సర్వజ్ఞ సింగమనాయని సంతతివారయిన రావుకులజులయినట్టును, వారిలో లింగప రంగరాయఁడు బొబ్బిలిసంస్థానము స్థాపించినట్లును, కవి యీ క్రిందిపద్యములలోఁ జెప్పియున్నాఁడు—

మ. హరిపాదంబునఁ బద్మనాయకులు గంగాన్వీతులై యుద్భవిం
చిరి తత్పాదజులం దతిప్రబలులై శ్రీరావువంశ్యుల్వెలం
గిరి తద్రావు కులీనులం దలరె గాంగేయస్తుతౌదార్యశౌ
ర్యరసోపేతుఁడు రాజశేఖరుఁడు సర్వజ్ఞుండు సర్వజ్ఞుఁడై.

క. ఆలలితాన్వయసంభవుఁ। డై లింగప రంగరాయఁ డలరె నిజభుజా
ఖేలానిదళితరిపునృప। ఫాలాస్థూలస్ఫురత్కృపాలుం డగుచున్.

క. బెబ్బులి రిపునృపు లనియెను। గిబ్బల కితఁ డంచు జనులు కీర్తింపఁగఁ దా
బొబ్బిలిపట్టణ మేలెను। నిబ్బరుఁడగు లింగపావనీవరుఁ డెలమిన్.

బొబ్బిలి చినరంగారాయనికి దత్తపుత్రుఁడును గృతిపతియునైన రాయణప్ప రంగారాయనింగారు ౧౮౨౧వ సంవత్సరము మొదలు ౧౮౩౦వ సంవత్సరము వఱకును రాజ్యపాలనము చేసినందునఁ దదాస్థానకవియైన యీ వేంకటకృష్ణకవి యిప్పటికి డెబ్బదిసంవత్సరములకుముందే యీగ్రంథమును రచియించినట్లు చెప్పవచ్చును. ఈయన కవిత్వమునందు లక్షణదోషములు కొన్ని యున్నను కవనము మృదువయి మధురముగానున్నది. శ్వేతాచలమాహాత్మ్యములోని కొన్నిపద్యము లిం దుదాహరింపఁబడుచున్నవి—

శా. ఆమాటల్విని భూమిపుండు నిజభార్యన్ సద్వ్రతాసక్తికిన్
శ్రీమన్మానవభక్తికిన్ బొగడి ధాత్రిన్ మాఘచిత్తుండనై
భామారత్నముపాటిబుద్ధి గణుతింపం బూనఁగాలేక యా
సోమార్కాంబపకీర్తిపా లయితినంచున్ లోనఁ జింతిల్లుచున్.—ఆ. ౧.

ఉ. వేరొకభూవరాత్మజుఁడు విప్రుడునగుచ్ఛను రత్నకంకణో
దారకరారవిందమునఁ దాల్చె లతాంగి నను న్వరించినన్
భూరిశుభక్రమాకలన బోటిపదాంబుజ మీరెఱుంగునం
గూరిమితోడఁ బట్టుకొనఁ గోరెద నంచును దీనుఁడై వడిన్ —ఆ. ౨.

శా. జంబాలుం డనఘాని కొన్నిదినముల్ జాయాన్వితుండై తదు
ర్వ్యం బుణ్యస్థితి నుండి గర్భవతినారం బాసి స్వర్గంబు చే
రంబోవంగ క్షమాసమీపమున గర్భస్థార్భకుం బెట్టి నె
య్యం బొప్పారఁగఁ జేసెఁ దత్తగుణి దానగ్నిప్రవేశం బొగిన్.—ఆ. ౩.

కాకరపర్తి-కృష్ణకవి.

ఈకవి శశిరేఖాపరిణయము ముఖలింగక్షేత్ర మాహాత్మ్యము, అనుకావ్యములను జేసెను. ఇతఁడు వైదికబ్రాహ్మణుఁడు; తిరుపతి పాత్రకవికిని సీతమాంబకును తనూజుఁడు. ఈపాత్రకవి సత్యభామాకృష్ణసంవాదాది గ్రంథములను రచియించి శ్రీమహారాజా గోడే నారాయణగజపతిరాయనింగారి పూర్వుఁడైన జగ్గారాయనింగారివలన నగ్రహారాదులను బడసెనఁట. ఈకృష్ణకవి విశాఖపట్టణ మండలములోనివాఁడు. ప్రపౌత్రుఁ డిప్పుడు జీవించియుండుటచే నితఁడు నూఱుసంవత్సరముల లోపలివాఁడు. ఈయనకవిత్వము దోషరహితమయి హృద్యమంగమనుగానున్నది. కవికృతపుస్తకద్వయము నుండియు రెండేసిపద్యముల నుదాహరించుచున్నాను —

ముఖలింగక్షేత్రమాహాత్మ్యము.

చ. అరుమగ సర్వలోకనిచయం బతివేలఘనాంధకారభీ
కరవిపదబ్ధిలోఁ బడ నకారణవైరమునన్ వసూజ్వల
త్తరణిముఖప్రచారములు తప్పఁగఁ జేయుచు నన్నిదిక్కులన్
బెరిఁగెను వింధ్యభూధరము పీతమహాంబునిధీ తపోనిధీ.— ఆ. ౧.

ఉ. ఈనగవైభవాతిశయ మెన్నఁగ శక్యమె ధాతకైన జాం
బూనదరౌప్యరత్నముఖభూరిమనోహరవస్తువిస్ఫుర
త్సానుచరన్మరుద్దనుజచారణకిన్నరసిద్ధసాధ్యసం
తానసమృద్ధి నొప్పు వితతంబగు మేరునగంబుకైవడిన్ .— ఆ. ౩.

శశిరేఖా పరిణయము.

ఉ. మౌనుల నెట్లుప్రోచితివొ మానసవీథిఁ దలంపఁ బాపముల్
మానక ధార్తరాష్ట్రుఁ డవమానమునుం దగఁ జేయుచుండెఁ గృ
ష్ణా నను గావవే యనెను నాపలు కిప్పు డొకించుకైన నీ
వీనుల సోఁకకుండు టిదివింత జనార్దన కంసమర్దనా.— ఆ. ౧.

చ. అనవిని వానితోడ విజయాత్మజుఁ డిట్లనియెన్ దురాత్మ యీ
వనమును గుత్తఁగొంటివిర వచ్చినవారి నెఱుంగ కీవు పా
ప్మనుటకు నీవె యీజగతియందును విక్రమశాలివా మదం
బున నిటుపల్కఁగాఁ దగదు పొమ్మిపు డూరక వైర మేటికిన్.— ఆ.

ఈయుపుస్తకముగాక కోనపల్లి నివాసుఁడగు వేంకటరంగకవి రచితమైన దోక

టియు, అప్పప్పయను భట్టరాజు రచితమైన దొకటియు, శశిరేఖాపరిణయ మనుపేర రెండాధునికప్రబంధములు ముద్రింపఁబడియున్నవి వానినుండియు రెంఁడేసి పద్యములనిం దుదాహరించెదను.—

వేంకటరంగకృత శశిరేఖాపరిణయము.

శా. శుద్ధాంతంబున భైరవార్చనకళాశుద్ధిన్ జరాసంధుఁడు
దృఢధైర్యంబున నిత్య మొక్కొక్కనృపుఁ గ్రోధావేశసంభూతస
ద్దృష్టిం బట్టి కరుక్కరుక్కనఁగఁ దోడ్తో శీర్షముం ద్రుంచి శ
శ్వద్ధాత్రిం బలి యిచ్చుచుండె సలసద్బాహాబలోదగ్రుఁడై.— ఆ. ౧.

ఉ. అంతటికంటె ముందుగనె హాయిగ మజ్జనభోజనంబు లం
దందు నొనర్చి సాత్యకిసహాయముగా వసుదేవదేవకీ
నందను లవ్విధంబు దళనాయకకోటి కెఱుంగఁ జేసి బల్
దుందుభికాహళానిపటుతూర్యరవంబులు బోరుకల్గఁగన్.— ఆ. 3.

అప్పప్పకృత శశిరేఖాపరిణయము.

ఉ. అన్నలు మాటలాడుసమయంబున లేచి సుభద్ర ప్రీతితో
నన్న యకాలి యైనముసలాయుధుఁ గన్గొని నీమఱందియున్
నన్నిటఁ బంపుచుండి పరిణామము వేఁడె భవత్కుమారియౌ
కన్నియ మత్సుతాగ్రణికిఁ గారుణితో త్రము పెండ్లి చేయవే.— ఆ. ౧.

ఉ. పోరునఁ ధార్తరాష్ట్రులను భూరిమదం బడఁగించి పిమ్మటన్
సీరిని మిక్కిలిన్ భయముఁ జెందఁగఁజేసి నీపరాక్రమం
బారగ నాలింప వ్యాళపతి కైనను శక్యము గాదటంచు నా
మాతులిపుత్రునిం బొగడి మక్కువతోఁడఁ గిరీటి యంతటన్ — ఆ. ౪.

కృష్ణయ్య.

ఈకవి పార్వతీపరమేశ్వరపరిణయ మనెడి మూడాశ్వాసముల ప్రబంధమును రచియించెను. ఈతఁడు స్మార్తబ్రాహ్మణుఁడు; భారద్వాజగోత్రుఁడు; చంచయార్య పుత్రుఁడు. ఈతని వాసస్థలము పినాకనీతీరమునందలి కామలాపురము. ఈతఁ డుండినకాల మేదియొ తెలియరాదు గాని యితఁ డేఁబది యఱువదియేండ్లక్రిందట నుండిన ట్లూహింపఁదగియున్నది. ఈతని కవిత్వమునందుఁ గొన్ని వ్యాకరణ దోషములు గలవుగాని మొత్తముమీఁదఁ గవిత్వము శ్రావ్యమయి కొంతవఱకు శ్లాఘ్యముగానే

చున్నది. పార్వతీపరమేశ్వరపరిణయములోని పద్యములఁ గొన్నిటి నిం దుదాహరించుచున్నాను.—

ఉ. ఆపురిఁ గాంచి నిర్జరు లహర్నిశము న్మదిలోన నెన్నుచున్
గాపుర మున్న నాకమునకంటెను మేలని చూచువేడుకన్
దాపునఁ జేరి యంతటఁ దత్పురసౌధసమీపవర్తులై
గోపవిభుండులోనగను గొల్చెడిరీతిగ నుందు రాస్థలిన్.—ఆ. ౧.

ఉ. ఈవిధి వచ్చి విప్రుఁగని యీశ్వరుఁ డర్ఘ్యమొసంగి యిట్లనున్
భూవినుతార్య మీధరను భూమిసురుల్ సుఖులై చరింతురా
మీవనమందుఁ బుష్పములు మేలగుకాయలు పండ్లు పత్రముల్
కావలెనన్నఁ గల్గుఁగద కారణ మే మిట రా విభాన్వజా.—ఆ. ౨.

ఉ. పంచశరుండు నిట్లనుచుఁ బల్కె విరించికి సమ్మదంబుగా
మించులమించుశంకరుని మీఁఱుచు ల్గన నాకు శక్యమే
మంచిది యేమియైన నిఁక మద్దళముల్ గొలువంగ నేగెదన్
వంచనలేక నన్నిలను వర్తిలఁజూడుఁడు పోయివచ్చెదన్ —ఆ. 3.

తరిగొండ - వెంకమ్మ.

ఈమె మంచి విద్వాంసురాలు. ఈమె చేసినపుస్తకములు తరిగొండ నృసింహస్వామి కంకితము చేయఁబడినవి. తరిగొండ కడపమండలములో వాయిల్పాడునకు నాలుగుమైళ్ళదూరములో నున్నది. ఈమెరచియించిన గ్రంథములలో రాజయోగసారమను ద్విపదకావ్యము వేంకటాచలమాహాత్మ్యమను పద్యకావ్యమును ముద్రింపఁబడియున్నవి. ఈమె తాను భాగవతము ద్వాదశస్కంధములను ద్విపదకావ్యముగా రచియించినట్లు వేంకటాచలమాహాత్మ్యములోని యీ క్రిందిపద్యములోఁ జెప్పుకొన్నది.

సీ. దారునిర్మితవీణ నాదార్థిఁ బల్కించు గాయకపురుషునికరణి గాను
బురుషోత్తముఁడు దయాపూర్ణుఁడై నాజిహ్వయందుఁ దావసియించియురుదుగాను
బలికించుఁ గావున భాగవతపురాణ మమర నే ద్విపదకావ్యంబుగాను
ద్వాదశస్కంధము ల్దగఁజెప్పి హరికి సమర్పించి శ్రీవేంకటాద్రిమహిమ
మతనికై రమ్యపద్యకావ్యంబు చేసి। శ్రీనివాసునకే సమర్పింపఁగంటి
నీఁగ తో శుధిఁ దాటఁబోయినవిధమున। నాస్వతంత్రత కిల బుధు ల్నవ్విపోరు.

ఈపుస్తకములోని

క. అలకాపురికిం జెలువడి । వలనుగ మాకొలను నందవరపురమందే
నెలకొని కులదైవతమై । యలరుచు మహిమలం జౌడమాంబను గొలుతున్.

అను పద్యమునుబట్టి చూడఁగా నీమె నందవరీక బ్రాహ్మణస్త్రీయైనట్టు తెలియవచ్చుచున్నది. ఈమె తనభర్తయొక్క నామగోత్రములను జెప్పక "వసిష్ఠగోత్రపవిత్ర కృష్ణయామాత్య తనూభవ" యని తాను కృష్ణయామాత్యుని కూఁతురయినట్టుమాత్రము చెప్పుకొనుటచేత నీమె బాలవితంతువయి తన కాలమును వేదాంతగ్రంథపఠనాదుల యందుఁ గడపినట్లూహింపఁ దగియున్నది. ఈమె ౧౭౪౦ వ సంవత్సరమునందు జీవించి యుండినట్లు బ్రౌన్ దొరగారు తమనిఘంటువునందు వ్రాసియున్నారు. కాఁబట్టి యీమె యేఁబదిసంవత్సరములక్రిందట నుండినట్లు తెలియవచ్చుచున్నది. ఈమెకుఁ బూర్వమునం దుండిన బ్రాహ్మణస్త్రీలు రచియించిన పద్యకావ్యము లేవియు నిప్పుడు కానరావు. ఈమెకవిత్వమునం దల్పదోషము లక్కడక్కడఁ గానవచ్చుచున్నను మొత్తముమీఁద కవన మతికఠినముగాక మృదుమధురరచనను గలదయియున్నది. వారాంగన యయినముద్దుపళనివలె శృంగారవర్ణనమని యవాచ్యములు పలుకక కులాంగన కుచిత మయినరీతిగానే వర్ణించుచువచ్చుటయే కాక శృంగారవాక్యములు వచించుట సహితము తన కనిష్టమని సూచించుట కయి శృంగారరసాధిదైవత మయినకృష్ణుని నిట్లు నుతించియున్నది—

శా. శృంగారంకృతితోడ వచ్చి పదముల్ శృంగారసారంబుతో
దం గూఢంబుగఁ జెప్పు నీవనఁగ నట్లేఁ జెప్పలే నన్న నన్
ముంగోపంబునఁ జూచి లేచి యట నే మ్రొక్కంగ మన్నించి త
చ్ఛృంగారోక్తులు తానె పల్కుకొను నా శ్రీకృష్ణు సేవించెదన్.

ఈపద్యమునుబట్టి చూడఁగా నీమె తాను బుస్తకమునం దక్కడక్కడ సందర్భోచితముగా రచించిన శృంగారపద్యములుకూడఁ దనవిగాక కృతిపతి విరచితములే యని లోకమునకుఁ జూప నుద్దేశించినట్టు కనఁబడుచున్నది. ఈమెకవిత్వరీతిని దెలుపుట కయి కొన్నిపద్యము లిందుదాహరింపఁబడుచున్నవి—

వేంకటాచలమాహాత్మ్యము.

ఉ. రామనృపాల ఘోరతరరావణశౌర్యనిఫాల భవ్యను
త్రామసురార్యయోగిజనతాపసపాల కృపాలవాల శ్రీ
భూమిసుతాత్తలోల పరిపూర్ణసుకీర్తివిశాల వానర
స్తోమముతోడ వచ్చు మిముఁ జూచి కృతాగుల మైతి మిద్దరన్—ఆ. ౧,

ఉ. ఇంతట యోగపూరుషుఁడు హెచ్చఁడు తగ్గఁడు సంతతంబు నే
కాంతమున న్వసించుఁ దనయందుఁ బరాత్మను జూచుచుండు వి
భ్రాంతులు తన్నుఁ దిట్టినను గ్రమ్మఱ వారిని దాను దిట్టఁ డీ
శాంతుఁడు రాజయోగి ఘనసద్గురుఁ డంచు వచింపఁగాఁ దగున్.—అ. ౩.

చ. అడవికి వేఁటఁబోయి విపులాద్భుతఘోరమృగాళి నచ్చటన్
బొడగని భీతి నొందితివొ భూతము సోఁకెనొ లేక తాళ్ళపై
వడిచెడజాతి మ్రొగ్గితివొ వాగులలోఁ బడి లేచివచ్చితో
కొడుక నిజంబుఁ జెప్పు మిఁక గొబ్బున నొక్కచికిత్స చేసెదన్.—అ. ౪.

ఉ. ఆకురవంజి యిట్లనియె నాపకు దమ్ముని పిల్వవచ్చినా
రాఁకొనినాఁడు బిడ్డఁ డిపు డమ్మల నక్కల నేద నైన నే
లోకఁగఁజేరి వారలకు సోదె నిజంబుగఁ జెప్పకుండినన్
నాకడు పెట్లు నిండు నని నవ్వుచుఁ బల్కుచు మూర్గ యిట్లనెన్.—అ. ౫.

రాజయోగసారము.

ద్విపద. కాయ మస్థిరమని కానంగలేక
మాయక సంసారబద్ధులై మనుత
వదలక కామార్థవాంఛితు లగుచు
మదమత్తు లగుచు దుర్మార్గత నొంది
మదిలోన నబ్బు కామక్రోధలోభ
మదమోహమత్సరా ద్యాటికిఁ బెంచి
సంపదగలిగిన సామర్థ్య మనుచు
సొంపుమీఱినతుచ్ఛసుఖ మిచ్ఛగించి
కామాంధులై తమగతి గానలేక
భామలవలలోనఁ బడి లేవలేక
తలఁగనియీషణత్రయవార్ధిలోను
మతిమతి మునుఁగుచు మమత కట్టి ప
నాలుబిడ్డలకని యర్థంబుఁ గూర్చి
కాలంబు నూఁకే గడపుచునుండి
యంతకాలము వచ్చినప్పుడు యమునిఁ
జింతఁజేయుచు హింసచేఁ గందికుంది
కష్టంబులోఁ బడి కొన్నినాళ్లుండి

పాపాత్ములగుచుఁ బ్రపంచంబునందుఁ
బుట్టుచుఁ గిట్టుచుఁ బొరలుచుండెదరు.

ఈతరిగొండ వెంకమ్మకుఁ దరువాతఁ దెలుఁగులోఁ బద్యకావ్యములను రచియించిన స్త్రీలెవ్వరును గానఁబడరుగాని శతకములు రచించినవారు కొందఱుండఁ గనఁబడుచున్నారు. ఇట్లు శతకములు రచియించిన స్త్రీలలో శ్రీరాజా గోడే నారాయణ గజపతిరాయనింగారి మేనత్త యగుచుండిన సుభద్రయ్యమ్మగా రగ్రగణ్యురాలుగాఁ గానవచ్చుచున్నది. ఆమె ౧౭౭౦ వ సంవత్సరమునందు జననమొంది యించుమించుగా తరిగొండ వేంకమాంబతో సమకాలికురాలుగా నుండినది. ఈమె రచియించిన శ్రీరామదండకము, రఘునాయకశతకము, కేశవశతకము, కృష్ణశతకము, రాఘవరామశతకము మొదలయిన శతకము లొక్క సంపుటముగా నీనడుమను బ్రకటింపఁబడినవి. ఈమె కవనకౌశలమును జూపుటకయి రెండుపద్యముల నిం దుదాహరించుచున్నను—

ఉ. శ్రీరమణీకళత్ర సరసీరుహనేత్ర జగత్పవిత్ర స
త్సారసబృందమిత్ర శుభసన్నుతిపాత్ర నరేంద్రపుత్ర శృం
గారసమగ్రగాత్ర జనకక్ష్మాదారణకృచ్చరిత్ర శ్రీ
నారదమౌనిగీతచరణా రఘునాయక దీనపోషకా.

ఉ. మన్నన దప్పియున్నయెడ మక్కువ వగ్గినవారి నేయెడన్
దిన్నఁగ మందలించినను దల్గుగా మఱి నొవ్వకుండునే
యన్నను ధార్తరాష్ట్రునకు నాదరమొప్ప హితోపదేశమి
ట్లెన్నఁగఁ జేసి యావిదురుఁ డేమిఫలంబును జెందెఁ గేశవా.

ఇప్పుడు తెలుఁగుదేశమునందంతటను బాలికాపాఠశాలలు స్థాపింపఁబడి స్త్రీవిద్య ప్రబలుచున్నందున మంచిగ్రంథములను రచింపఁగల కులకాంతలు శీఘ్రకాలములోనే బైలుదేరుదురుగాక!

పిండిప్రోలి-లక్ష్మణకవి.

ఇతఁడు లంకావిజయమనఁబడెడు రెండాశ్వాసముల ద్వ్యర్థికావ్యమును జేసెను. ఇతఁ డాఱువేలనియోగిబ్రాహ్మణుఁడు; ఆపస్తంబసూత్రుఁడు; భారద్వాజగోత్రుఁడు; గోపాలామాత్యపుత్రుఁడు ఈకవి గోదావరీమండలములోని రామచంద్రపురమునకు

సమీపముననున్న కుయ్యేరను గ్రామమునకు కరణము. ఈ గ్రామమును గుత్తచేసిన రావు ధర్మారాయఁడను పద్మనాయకకులజుఁ డీకవియొక్క లంకగోల మూఁడుపందుము లపహరింపఁగాఁ గోపావేశముచేత యౌవనమునందితఁడు ధర్మారావును రావణాసురునితోఁ బోల్చుచుఁ దనక్షేత్రాపహరణకథను రామాయణపరముగా శ్లేషార్థము వచ్చునట్లు రచియించెను. ఇతఁడు తిట్టుకవిత్వమునకుఁ బేరుపడినవాఁడు. ఈ విషయమును గూర్చి లంకావిజయమునఁ గవియే యిట్లు వ్రాసికొనియున్నాఁడు—

క. తెలియుమిసు రామకవ్యా । దులఁ బూర్వకవిప్రముఖపృథుప్రతిభావం
తులు భీమ శ్రీనాథు । ల్వెలయఁగ నాకరణిఁ దిట్టలే రూఢముతోన్.

ఇతఁ డిట్లు యౌవనదశయందుమాత్రమే కాక వార్ధకమువచ్చి యవసానదశ సమీపించు వఱకునుగూడ నల్పములైన యైహికలాభముల నిమిత్తము పరులను దూషించుచు భూషించుచుఁ బద్యములను జెప్పి కాలము గడపుచుండెను. ఈ లంకావిజయమునకు రావణదమ్మీయమని నామాంతరము. కవి సమర్థుఁడేయైనను రాఘవపాండవీయాదుల వలె రావణదమ్మీయము మంత్రప్రౌఢముగా లేదు. కవి గ్రంథమునందు రామాయణకథ కనుకూలముగాఁ దనకథను మార్చుకొనుచు నల్పసంఖ్యగల రెండర్థముల పదములతోనే గ్రంథమునంతను బూరించినాఁడు. ఈ గ్రంథములోని

క. లేదమ్మా కష్టము నీ । కేదమ్మా సిగ్గి భీతి ఘృణ నీ వొందన్
రాదమ్మా యిఁక మిన్నక । పోదమ్మా యుక్తి నిజము పాలుపుగదమ్మా.

గీ. ఏడుపందు మల్లోకంబు లెఱుఁగ లంక । నేలకోల పరక్షేత్రాప్తి మేలుగాదు
పేర్మి నాభూమిజాతసంప్రీతితోడ । వీడు మదియె సౌఖ్యము లిచ్చు వేయు నేల.

ఉ. ప్రాజ్ఞత నెవ్విధంబునను రాముఁడుం దగుసాటి గావు స
ర్వజ్ఞ నృసింహుఁ డాయనను వంశమునన్ జనియించి పెద్దదు
ష్ప్రజ్ఞుఁడ వీవు కానకు విచారము లన్నియుమాని ధర్మగో
ష్ఠిజ్ఞులు మెచ్చుచొప్పు కని సీతను వేవిడుమంత మేలగున్.

గీ. జ్యేష్ఠుఁడా లక్ష్మణాగ్రజ క్షేత్ర మీవు । వదలకుండిన మోసంబు వచ్చునింకఁ
జండనిర్భీకవనచారిపిండిప్రోలి । కవికులవరుతోఁ బితూరి ముఖ్యముగ వలదు.

ఇత్యాదిపద్యముల ననేకులు మెచ్చుకొనుచున్నారు. లక్ష్మణకవి లంకావిజయమును క్రీస్తుశకము ౧౭౯౫ వ సంవత్సరమునందుఁ జేయ నారంభించెను. అప్పటి కితనికి యిరువదియైదుసంవత్సరముల ప్రాయ ముండినపక్షమునఁ గవి ౧౭౭౦ వ సంవత్సర ప్రాంతములయందు జనన మొందియుండవలెను. ఈతఁడు ౧౮౪౦ వ సంవత్సర ప్రాంతము వఱకును సజీవుఁడయి యున్నందున నించుమించుగా డెబ్బదియేండ్లు బ్రతికి

యుండెననుటకు సందేహము లేదు. ఇది యొక్కటితప్ప నితఁడు రచియించిన గ్రంథము వేఱొకటియు లేదు.

మ. అరయ స్వర్ణనఁ జేతుఁ దారకపదవ్యాక్రాంతవర్తిన్ గురున్
స్ఫురదుత్తుంగబలాతిరేకకలనక్షీభూతారిజీవున్ ఘనాం
గిరసాఖ్యాతు బుధాఘపుంజితపదుం క్షేమంకరాంచత్తపో
భరసంతోషితసర్వమానిధివరున్ వాచస్పతి న్నార్యనిన్.

ఈపద్యములో వాచస్పతినార్యుని ననియుండవలసినదానికి వచస్పతిన్నార్యుననియు,

చ. అని తలపోయుచో నలప్రజాపతి చేసినఘోర దప్పకం
బునవడి నద్రిచారు లసమానమహారణధామయుక్తితో
దన పరవాహినీశనికటంబున కేగి నరిప్రవజంబుచే
యు నతను సంగరంబునకు నోపక పాఱిరి జోక్కువీడఁగన్.

ఈపద్యములోఁ దప్పక యని యుండవలసినదానికిఁ దప్పకననియు, నందందుఁ గొన్ని వ్యాకరణదుష్టములయిన ప్రయోగములున్నను, మొత్తముమీఁదఁ గవిత్వము సలక్షణమయి మృదుమధురపదఘటితమయియున్నది. ఈతని రచనాకౌశలమును జూపుటకయి లంకావిజయములోని మఱి రెండుపద్యముల నిం దుదాహరించుచున్నాను—

చ. తమ్ములు నీదుపల్కులు హితమ్ములుగాఁ గొనిచేయు నార్యజా
తమ్ములు నీదుసద్గుణశతమ్ములు సంస్తుతిచేయుఁ బక్షపా
తమ్ములు లేక న్యాయకలితమ్ములుగాఁ గ్రియలొప్ప సర్వభూ
తమ్ములు విశ్వసింప సుకృతమ్ములు వర్ధిలునట్లు చేయు మీ.—ఆ. ౧.

ఉ. తమ్ములు సద్గృహమ్ములు సుతప్రకరమ్ములు సామ్ము లిష్టవ
ర్గమ్ములు వైభవమ్ములు జగమ్ములఁ గ్రమ్మఁగ నెమ్మినుండి పా
పమ్మున శమ్మొనర్పుటనెపమ్మునఁ గీడగు నాదుపల్కు వే
దమ్మని రూఢిరమ్ము విహితమ్ముఁ గుణమ్ము బలమ్ము నమ్మగున్.—ఆ. ౨.

ఈకవికాలములో సంస్కృతాంధ్రభాషాపాండిత్యమునందును సంగీతసాహిత్యముల యందును సుప్రసిద్ధుఁడయిన శిష్టు కృష్ణమూర్తినామక విద్వత్కవి యొకఁ డుండెను. అతనికిఁ దన కున్నంతపాండిత్యము తెలుఁగునందే కాని సంస్కృతమునందు లేదని లక్ష్మణకవియెడల ననాదరభావము కలిగియుండెను. ఆయనకుఁగల గర్వమును దన యెడలఁ గలతిరస్కారభావమును గనిపెట్టి యీ లక్ష్మణకవి యెట్లయిన నాతని గర్వభంగము చేయవలెనని సమయము వేచియుండెను. ఇట్లుండఁగాఁ గృష్ణమూర్తికవి తాను రచియించిన సర్వకామదాపరిణయమను ప్రబంధమును రామచంద్రపుర సంస్థా

వాధిపతియైన కాకర్లపూడి రామచంద్రరాజుగారి తమ్ముఁడైన జగన్నాథరాజున కంకితము చేయుటకయి కాజలూరుగ్రామమునకుఁ బోవుట తటస్థించెను. ఆపుస్తకమును జదివించి విద్వత్కవిసమ్ముఖమున వినుటకు నిర్ణయింపఁబడిన దినమునందు లక్ష్మణకవి యనాహూతుఁడయ్యును సభకుఁబోయి కృష్ణమూర్తికవిని బదుగురిలోఁ బరాభవింపవలెనన్న దృఢ నిశ్చయముతోఁ గూరుచుండియుండెను. సర్వకామదాపరిణయములోని

చ. తరణి శశాంకు లాభరణదంభమున న్వదనాక్షికైతవాం
బురుడసితోత్పలాగ్రమున ముద్రియ కుంతలదేశ మాక్రమిం
చి రొకఫలంబు గాన నగుఁ జివ్వనుచుం బరరూపయుక్తి ని
బ్బరముగ నంతిసాంతముగ బ్రహ్మ యొనర్చినసీమపాల్పగన్.

అనుపద్యమును జదివినప్పుడు లక్ష్మణకవి విని తలయూఁచి నవ్వి యిందలి నాయిక యేకాక్షియయిన యవలక్షణరాశియనియు, కన్నులు నల్లగలువలనిచెప్పి వానిపైని సూర్యచంద్రులున్నట్లు చెప్పుటచేత నొకకన్ను సూర్యకాంతిచే ముకుళించుకలువయై గ్రుడ్డిది కావలెననియు, ఆభరణదంభమునవచ్చి సూర్యచంద్రులు కుంతలదేశ మాక్రమింపఁగా నిరువురకును దగవురాకుండ బ్రహ్మ సరిహద్దేర్పాటుచేసినట్టుగా పాపట యున్నదని వర్ణించుటచే సూర్యచంద్రుల నలంకరించినపిమ్మటఁ బాపటఁ దీయుదురో ముందుగా పాపటతీసి తరువాతనే సూర్యచంద్రుల నలంకరింతురో యీకవి తెలియనివాఁడనియు, ఇటువంటియాక్షేపణము లనేకములు చేసెను. ఇవి సరళములైన సదాక్షేపములు కాకపోయినను సభకువచ్చినవా రనేకు లాయాక్షేపములకు హర్షించి చప్పటలు కొట్టినందునను, జగన్నాథరాజుగా రాకృతి నందుట కిష్టపడనందునను, కృష్ణమూర్తికవిగా రవమానితులయి సభనుండి లేచిపోవలసినవారయిరి.

లక్ష్మణకవి యితరులమీఁదఁ బద్యములను జెప్పుచు వివాహాదులకుఁబోయి కవీశ్వర సంభావనములను గొనుచు ధనార్జనము చేయుచుండెను. ఇతఁడు తన మేనల్లుఁడగు చింతలూరి మంగన్నకు విరోధముగా వ్యాజ్యము తీర్పు చెప్పినందునకయి యప్పటి పండిత సదరమీనగు శంకరమంచి యనంతశాస్త్రిగారి శ్లేషార్థములతోఁ దిట్టినపద్యములలో నొకదానిని, ఆవ్యాజ్యము నపర్యభియోగము తెచ్చినప్పు డాకాలమునందు రాజమహేంద్రవరమున మండలన్యాయాధిపతిగా నుండి తెలుఁగుఘంటువులను జేసిన బ్రౌనుదొరగారిమీఁదఁ జేసినపద్యములలో నొకదానినిమాత్రము ముదాహరించియీతనిని గూర్చి యింతటితో విరమించెదను.—

మ. అవురా శంకర మంచివాఁడవె యనంతాఖ్యుండవై తీర్పుం
గవు మంగన్నరఁ జేసి నీవు బుధమార్గభ్రష్టతన్ బోగిరా

గళగా లంబి పినాకినిం బహుపతీకల్లోలినిం బట్టి స
త్యవధూసక్త్వము దానియుం దిడితి వాగాయత్తు లిట్లేకదా.

శా. పప్పుపచేసి నా బ్రతుకు పండితుఁ డిం కెటునిల్తు నంచు నే
నిప్పుహవృత్తి నుండఁగను నిన్నటిరేఁ గలలోనఁ గోర్టువా
రిప్పిసిమాలుపట్టి ఇఁక నేర్పడ న్యాయముతీర్తు మంచు ధై
ర్యాస్పదసూక్తిఁ బల్కి నటులైన మిముం బొడగానవచ్చితిన్.

అల్లమరాజు-రామకృష్ణకవి.

ఈకవి కవిచకోరచంద్రోదయ మనెడు నాలుగాశ్వాసముల ప్రబంధమును రచియించెను. ఇతఁ డారామ ద్రావిడబ్రాహ్మణుఁడు; రంగనాథార్య పుత్రుఁడు; హరితసగోత్రుఁడు. తనగ్రంథమును దాక్షారామ భీమేశ్వరుని కంకితముచేయుటచేతనే కవి గోదావరీమండలములోనివాఁడగుట స్పష్టమగుచున్నది. తన్నుఁ గూర్చి భీమేశ్వరుఁ డిట్లన్నట్టు కవి తనకవిచకోరచంద్రోదయమునందుఁ జెప్పికొనియున్నాఁడు—

సీ. అమరంగ వైనతేయవిజయంబును సత్యభామావిలాసంబు భానుగముగ
గౌతమీమాహాత్మ్యకథయును ద్రౌపదీపరిణయ మలసుశోభావివాహ
మసమానహనుమదాఖ్యానంబును సుకవిజనమనోరంజనం బనెడు కావ్య
మవనిలో రచియించినట్టి ప్రోడవు నీవు గావున నీవాక్యకలితలలిత
మాధురిమఁ గ్రోలుచుండె నామానసంబు। తంపిదీఅదు వాఖ్యస్తుఁడనుచు నిన్న
నెన్నటంబుగాదు కాని నీకన్న ధరణిఁ। గలరె కవితాసుధాధార లొలుకఁబలుక.

పయిపద్యమునుబట్టి కవి వైనతేయవిజయము, సత్యభామావిలాసము, గౌతమీమాహాత్మ్యము, ద్రౌపదీ పరిణయము, సుశోభా వివాహము, హనుమదాఖ్యానము, సుకవిజనమనోరంజనము, అను కావ్యములను గూడ రచియించినట్లు తెలియ వచ్చుచున్నది. ఈతనికవిత్వము నిర్దుష్టము కాకపోయినను ప్రౌఢ మయి హృదయాహ్లాదకరముగా నున్నది. ఇతఁ డెనుబదిసంవత్సరముల క్రిందటనుండినవాఁడు. కవి యీకవిచకోరచంద్రోదయమును శాలివాహనశకము ౧౭౪౭వ సంవత్సరమునకు సరియైన మన్మథాబ్దమునం దనఁగా క్రీస్తుశకము ౧౮౨౫వ సంవత్సరమునందు రచియించినట్లు గ్రంథాంతమున వ్రాసికొనియున్నాఁడు. ఈకావ్యమునందలివి కొన్నిపద్యము లిం దుదాహరింపఁ బడుచున్నవి.—

ఉ. భారము నొప్పు పుష్పఫలభారవినమ్రమహీజరాజితో
భారమణీయసానుచరభవ్యనభశ్చరభామినీవిపం
చీరవమాధురీకలితజృంభితగానఘుమంఘుమార్భటీ
పూరితసూత్న రత్నయుతభూరిదరిం గనియెన్ మహాగిరిన్.—ఆ. ౧.

ఉ. మారుని మీఱువీనుకుమారము మారమణీసహోదరున్
గూరిమి నోముమోము తళుకు ల్వలుకుల్ నెఱజాణ వైఖరిన్
గేరు నయారె నిర్జరులఁ గిన్నరులు న్నరు లెన్న వీరియొ
య్యారమె చూడ నింపగు జయంతు జయింతు నటన్నరీతులన్.—ఆ. ౨.

కవిచకోరచంద్రోదయమునకుఁ దరువాతఁ గవి రచియించినగ్రంథములు కొన్ని నా కిటీవల లభించినవి ఇతఁడు రచియించిన యితరగ్రంథములు—మదాలసాపరిణయము, శంతనువిలాసము, అధ్యాత్మరామాయణము, అచ్చతెలుఁగుభాగవతము, రామకృష్ణీయము. ఇందలి కడపటిపుస్తకము ఆంధ్రశబ్దచింతామణికి వ్యాఖ్యానము ఈరామకృష్ణీయము లోని యీక్రిందిపద్యమువలన నీతని నివాసస్థానము పిఠాపురమునకు సమీపముననున్న చేబ్రోలుగ్రామ మయినట్టు తెలియవచ్చుచున్నది—

సీ. సిరిమించు శ్రీపీఠపురసమీపంబునఁ బరఁగు చేబ్రోల్పురవాసి నగుచు
నల్లమరాజాన్వయాగ్రణి యగురంగధామార్యవర్యునితనయుఁడ నయి
యెల్లపార్యాగ్రణి కనయఁ బౌత్రుండనై రామకృష్ణాఖ్యుఁడన్ నామ మెలమిఁ
బూని శ్రీవత్సవాటీనికేతనుఁ డై నభీమేశుకరుణచేఁ బెంపు నొంది
సకలజనులకుఁ దెలిసెడిసరణిగాఁగ నన్న పార్యుఁ డొనర్చినయట్టిసూత్ర
ములకు దెలిఁగింతుసూక్ష్మభంగులనుబాలబోధమగునట్లుసుకవులుపొగడుచుండ.

ఈకవి కాలముచేసి యేఁబదిసంవత్సరములు దాఁటినవి. ఈతఁడు శంతనువిలాసము శాలివాహనశకము ౧౭౩౯వ. సంవత్సరమునకు సరియైన క్రీస్తుశకము ౧౮౧౭ వ సంవత్సరమునందు ముగించిన ట్లాపుస్తకాంతమందలి యీపద్యమువలనఁ దెలియవచ్చుచున్నది—

సీ. అవనిలో శాలివాహనశకాబ్దము లగ్నిశాస్త్రశైలశశాంకసంఖ్య నెన్నఁ
బ్లవనామవత్సర ప్రథితకార్తికశుద్ధసప్తమీ భౌమవాసరమువఱకు
సిరిమించు శ్రీపీఠపురసమీపంబునఁ బొలుపొందు చేబ్రోలుపురనివాసుఁ
డలరునల్లమరాజకులరత్నమును రంగధామార్యసుతుఁడునౌ రామకృష్ణ
కవివరుఁడు దక్షవాటికాగారవాసుఁ డైనభీమేశుసత్కృపామానగరిమ
శంతనువిలాసము రచించె సరసఫణితి నఖిలసత్కవిబృదంబు లౌ ననంగ,

ఈకవికృతము లైన గ్రంథములలోని పద్యములు కొన్ని యిం దుదాహరింపఁబడు చున్నవి—

మదాలసాపరిణయము.

ఉ. న్యాయముగా దయాలలన నన్విద నాడిననంగఁ గోయిలల్
కోయనికూయఁ జందురుఁడు గ్రొంకక వెన్నెలఁగాయ మారుఁడున్
సాయకజాలమేయఁ గడుషట్పదముల్ రొదసేయ నే నిటం
బాయఁగఁజాలఁజాలను బాల కవుంగిటఁ జేర్చి ప్రోవవే.

అచ్చతెలుఁగుభాగవతము.

సీ. కూఁకటిమూలడాగ్గాన బెల్ల నదలించి జమిలిముక్కాలిరాసంతు నొంచి
కైగల్గుమెకపుమూఁకల నెల్ల నగిమించి కారుమబ్బుల నెఱసారు ఱంచి
చిచ్చుకన్దొరయత్తిహెమ్మెవన్నెఁ గలంచి విప్పుగన్దొరరాలచొప్పు ద్రుంచి
చీఁకటిమ్రాఁకుల చెలువ మెల్లను డించి కాటుకమలవన్నెఁగి టడంచి
పొగలతెగల జగాజిగి మిగులవంచి। దండితెక్కలి కాండ్లకు మిందగీండ్ల
కింపుగా మబ్బు మసిచల్లునింపు దోఁప। నెల్లకడలందు నంతంత నిరులు గవిసె.

శంతనువిలాసము.

చ. పగలును రేయి పద్మకులబాంధవసోములు తత్పురంబునన్
దగుమణివప్రముం గదిసి దారటుపోవఁగలేక యోరగా
నొగినిరువంకలం జనుచు నొప్పఁగ నుత్తరదక్షిణాయనా
ఖ్యగతిఁ జెలంగి రెంతయు నఖండవిలాసము దోఁచుచుండఁగన్.—ఆ. ౧.

ఉ. హారము (౨) సైచదాయె మణిహారములుం బొడియయ్యె నేఁడు నీ
హారముఁబోలి నాదుశ్యవహారము లెంతయు డిందె మేనిక
న్వాగము లెండె జల్లఘనహారముఁ గన్ మఱుఁ గేఁచసాఁగె నా
హారముశీలలామ యిఁకనైన ననన్ దయ నేలుకోఁగదే.—ఆ. ౫.

కాకరపర్తి బుచ్చిపాత్రికవి

ఈకవి సత్యవతీపరిణయ మనెడి యైదాశ్వాసముల ప్రబంధమును రచియించెను. ఇతఁడు వైదికబ్రాహ్మణుఁడు; కాశ్యపగోత్రోద్భవుఁడు; ముఖలింగక్షేత్ర మాహాత్మ్యాదికావ్యములను రచియించిన కృష్ణకవిపుత్రుఁడు. ఈకవియొక్క మనుమఁడును

సోదరపుత్రుఁడును జీవించియుండుటచేఁ గవి యేఁబది యఱువదిసంవత్సరముల క్రిందట నుండినవాఁ డని స్పష్టము. కవి కథాశయము రచియించి గ్రంథమును శ్రీరాజా (మహారాజా) గోడేనారాయణ గజపతిరాయనింగారి జనకున కంకితము చేయఁదలంచెను గాని యాతఁడు కృత్యాదిపద్యములను, ఆశ్వాసాద్యంతపద్యములను రచియింపకయే మృతి నొందెను. అటుతరువాత శ్రీమహారాజా గోడేనారాయణ గజపతిరాయనింగారి కోరిక పయిని కవికి పారంపర్యమున సోదరపుత్రులగు వేంకటశాస్త్రిగారును పౌత్రులగు సీతారామశాస్త్రిగారును గ్రంథోపోద్ఘాతమును, ఆశ్వాసాద్యంత పద్యములను పూరించి కృతిని ౧౮౭౪ వ సంవత్సరమునందు శ్రీరాజా గోడేనారాయణ గజపతిరాయనింగారి కంకితము చేసిరి. వీరిచేఁ గృత్యాదియందు రాజాగారి వంశాభివర్ణనము విశేషముగాఁ జేయఁబడినది. సత్యవతీచరిత్రమునందలి కవిత్వము నిర్దుష్టమయి హృద్యముగా నున్నది. కవనమార్గమును జూపుటకయి సత్యవతీపరిణయములోని కొన్ని పద్యముల నిం దుదాహరించుచున్నాను.—

చ. ఇలఁ గలకోటలన్ గెలిచి యెన్నిక కెక్కుఁ బురీలలామకున్
జ్వలమణివప్రమం చగసి వారిజసూతి తదంఘ్రిసీమఁ బ
ప్పుల చెలువంపుటందియల సద్భురదాంకము సంఘటించె నా
నలరు నమేయశైవలయుతాంబుకదంబము ఖేయ మప్పురిన్.—ఆ. ౧

చ. పరమతపోధనప్రవరు భవ్యగుణప్రకరుం దపస్విరాం
గరు దిరు భస్మభాసురు నఖస్ఫుటటిత్పటలోజ్జ్వలజ్జటా
భరు మృగకృత్తికాదరు సుపాణిధృతాక్షసరుం గమండలు
స్ఫురితకరుం గనుంగొనియె శోభితదండధరుం బరాశరున్.—ఆ. ౨.

చ. సమధికరాజ్యలక్ష్మి యనుచంద్రవల్లిఁ జాహ్న వేయదు
ర్దమఫణిరాజు చేరని విధం బొనరింపఁగఁ జాలినట్టి మం
త్రముల తెఱంగుఁ జూపఁగను బ్రౌఢి వహించెద వే రాజకా
ర్యము ఫలియించు మంత్రివర రాజహిత ప్రతిపాదనాదరా.—ఆ. ౩.

ఉ. ఎల్లెడలందుఁ జీఁకటుల హెచ్చులు చెల్లెఁ బయోధివృద్ధి పా
టిల్లెఁ జకోరభుక్తులు ఘటిల్లె వియోగిహృదంతరంబు భే
దిల్లె రథాంగదంపతుల తేజము డొల్లె రతీశునాజ్ఞ వ
ర్తిల్లెఁ జంద్రికాప్రతతి దిక్తటకోటుల వల్లె నయ్యెడన్.—ఆ. ౪.

మ. అవనీనాయకు లందఱు న్విభుఁడు గుర్వర్థానుసంధానగౌ
రవమొప్పన్ సముపస్థితిన్ సలిపిరిన్ బ్రవ్యక్తమానస్థులు స

త్యవతీదేవికి నుద్భవించినసుతుం డర్హుం డు ప్రస్ఫారకా
రవరాజ్యంబు భరింపఁగా సకలగోత్రావల్లభు ల్గొల్వఁగన్.—అ. ౫.

శిష్టు-కృష్ణమూర్తికవి.

ఇతఁడు సర్వకామదాపరిణయము మొదలయిన యాంధ్రకావ్యములను రచియించినకవి. ఇతఁడు వైదికబ్రాహ్మణుఁడు; అపస్తంబసూత్రుఁడు; వాసిష్ఠగోత్రుఁడు; సర్వశాస్త్రిపుత్రుఁడు. సంవత్సరము సరిగా తెలియదుగాని యితఁడు గోదావరిమండలమునందలి రామచంద్రపురము తాలూకాలోని గొల్లపాలెమను గ్రామమున ౧౭౯౦వ సంవత్సరమునకును ౧౮౦౦ వ సంవత్సరమునకు మధ్యకాలములో జననమొందెను. ఈతనికి రెండుసంవత్సరముల ప్రాయము వచ్చినప్పుడు స్వగ్రామమువిడిచి తండ్రి కుటుంబసహితముగా రామచంద్రపురమునకు లేచివచ్చి యక్కడ నిల్లు కట్టుకొని స్థిరముగా కాపుర మేర్పఱుచుకొనెను. ఈబాలుఁడు కొంతకాలము రామచంద్రపురములోఁ జదువుకొని తరువాత యనవల్లిగ్రామమునకుఁ బోయి బులుసు అచ్చయ్యగారివద్దఁ గావ్యనాటకాదు లభ్యసించి తరువాత నింకొకరివద్ద వ్యాకరణాలంకారశాస్త్రముల నభ్యసించి మరల రామచంద్రపురము వచ్చునప్పటికీతనికి సంస్కృతాంధ్రములయందు దొడ్డపాండిత్యమును కవనైపుణియుఁ గలుగుటయేకాక సంగీతమునందును నిరుపమానసామర్థ్యము కుదిరెను. ఆశుకవిత్వమును జెప్పుటలోను కర్ణరసాయనముగాఁ బురాణములు చదువుటలోను కృష్ణమూర్తిగారిని మించినవారు రాకాలములో మఱియెవ్వరును లేరు. ఇతఁడు పురాణము చెప్పునప్పుడు పుస్తకము మూసి చదువుచున్నను పద్యములు దప్పులేక తన కవిత్వముతో రసవంతముగాఁ జెప్పు సామర్థ్యము గలవాఁడఁట! ఈయనశక్తిసంపదను జూచి రామచంద్రపురపు జమీందారగు కాకర్లపూడి రామచంద్రరాజుగారును తదనుజుఁడగు జగన్నాథరాజుగారును కృష్ణమూర్తిగారి నాదరించి తమసంస్థానములో నుంచుకొనిరి. ఆయిరువురిలో జగన్నాథరాజుగారికిఁ గవియం దధికానురాగము. వీరిరువురికంటెను కాకర్లపూడి వేంకటకృష్ణరాజుగారికి కృష్ణమూర్తిగారియం దెక్కువదయ యగుటచేత నాతఁడీవిద్వత్కవికి యనవల్లిగ్రామములో పదిపుట్లభూమి దానము చేసెను. అయినను నీటియాధారము లేకపోవుటచేత భూములు చాలకాలమునుండి యిప్పటివఱకుఁ బీడగ నుండెను. ఇట్లు కృష్ణమూర్తిగారు తనకు నలువదియైదుసంవత్సరములయీడు వచ్చువఱకును రామచంద్రపురములో నుండెను. ఈకాలములో రామచంద్రపురముతాలూకాలోని కుయ్యేరు

గ్రామములో పిండిప్రోలి లక్ష్మణకవి యను సుప్రసిద్ధాంధ్రకవియుండెను. పండితులో కవులో యిద్ద ఱొక్కచోట నుండినప్పుడు పరస్పరస్పర్ధ లేకుండుట మహిలో నరుదు. లక్ష్మణకవి యావఱకే రావణదమ్మీయమును రచియించియున్నందుఁ గృష్ణమూర్తిగారి కంటె నిరువదియేండ్లు పెద్దవాఁడయి యాంధ్రకవిత్వమునం దాఱితేఱిన ప్రౌఢుఁడు. తన కున్నంతసంస్కృతపాండిత్యము లేదని యాతని నధిక్షేపించి కృష్ణమూర్తికవి విఱ్ఱవీఁగుచుండెను; తనవలె నాంధ్రకవిత్వము చెప్పనేరఁడని యాతని నాక్షేపించి లక్ష్మణకవి తృణీకరించుచుండెను. కృష్ణమూర్తికవి పాండిత్య మెంత యెక్కువ కలవాఁడైనను లౌకికజ్ఞాన మధికముగాలేని శుద్ధశ్రోత్రియశిఖామణి; లక్ష్మణకవి యల్పపాండిత్యము కలవాఁడే యైనను లోకానుభవమును యుక్తిచమత్కారమును నధికముగాఁ గల లౌకికశిరోరత్నము. అట్లగుటచే నిరువురుఁ దారసించినప్పు డెల్ల లక్ష్మణకవియే మేలు చేయుచుండెను. ఈవైరకారణమునుబట్టియే కాజలూరిలో సర్వకామదాపరిణయ పతనకాలమునందుఁ గృష్ణమూర్తిగారికిఁ బరాభవము సంభవించెను. అట్లు శృంగభంగము నొంది యావమానమును సహింపలేక తరువాత నల్పకాలములోనె కృష్ణమూర్తిగారు రామచంద్రపురమును విడిచి వెడలిపోయిరి. జ్యేష్ఠుఁడగు రామచంద్రరాజుగా రుండఁగా స్వరాజధానిలో ననుజుఁడగు జగన్నాథరాజు కృతినందుట యనుచితమని యాసభ కాజలూరిలో జరపఁబడెను.

కృష్ణమూర్తికవి సేతుయాత్రకుఁ బోయి వచ్చుచుండఁగా నాతనిప్రఖ్యాతిని విని కాళహస్తిప్రభు వగు దామెర వేంకటపతిరాయనింగా రాయనను తమసంస్థానమునం దుండవలసినదని వేఁడుకొన్నందున కృష్ణమూర్తిగా రక్కడఁ బదునాలుసంవత్సరము లుండిరి. కవి నాదరించిన యీవేంకటపతిరాయనింగారు గోదావరీమండలమునందే జనమొందినవారయి కాళహస్తి రాజపత్నిచేత స్వీకరింపఁబడిన దత్తపుత్రుఁడై ౧౭౩౮వ సంవత్సరము మొదలుకొని ౧౭౭౧వసంవత్సరమువఱకును రాజ్యము చేసెను. కాళహస్తి సంస్థానములో నీయనకు నెల కఱువదిరూపాయలు జీత మేర్పఱుపఁబడెను. కాళహస్తికి వెళ్ళకపూర్వమో వెళ్ళివచ్చినతరువాతనో కాకినాడలో నైదుసంవత్సరములు గోదావరీమండల కరగ్రాహివద్ద సిరస్తాదారుగానుండిన తుళసింగసెట్టిగారియింటఁ బురాణము చెప్పుచుండి యాయనప్రోత్సాహముచేత స్త్రీనీతిశాస్త్రమనెడి యేకాశ్వాసగ్రంథమును రచియించెను. ఆగ్రంథమునందుఁ గవి తుళసింగసెట్టి నిట్లు వర్ణించెను—

సీ. శార్ఙ్గభృచ్చరణాంబుజనిసేవ యొనరించు సజ్జనసంతతి సత్కరించు
నాశ్రితకోటి సమ్యగ్గతి నలరించు నాత్మబంధుజనాళి నాదరించు
సరళనీతిపథానుషంగాప్తి విహరించుఁ బరిజనాసత్కృతిఁ బరిహరించు
సగణితానుపమానసుగుణలీలఁ జరించు నార్యగురూక్తుల ననుసరించు

నను కుశంబున ననిశంబు ఘనతఁ బ్రబలు । నట్టి కుశసింగసెట్టి నన్నఖిలబుధుల
ప్రోలుమతి యుంచి యోకృష్ణమూర్తిసుకవీ । సంఘటింపుము స్త్రీనీతిశాస్త్ర మనుచు.

ఈయనకవిత్వరీతిని దెలుపుటకయి మఱి రెండుపద్యము లీస్త్రీనీతిశాస్త్రములోనివి యిం దుదాహరించుచున్నాను—

ఉ. మన్ననచేయ నుబ్బ కవమానము చేయఁగఁ గ్రుక్కఁ డే పతిం
చెన్నలరంగఁ గొల్చుచు విశిష్టపితృమాతృకులప్రతిష్ఠ సం
పన్నము చేయుచుం దనదుబంధులచేతఁ బొగడ్తఁ గన్న య
య్యన్నులమిన్న చే జగము లన్నియు నిల్చు నటంచు నెంచెదన్.

ఉ. ఎచ్చటనో ప్రయాసపడి యేమయినం జతి తెచ్చి వేడ్కతో
నిచ్చినఁ గొంచె మేనియు మహీయముగా మది నెంచి బాంధవు
లెచ్చఁగ నొచ్చ మించుకయు లేనిసమగ్రగుణంబు పెంపునన్
హెచ్చఁగఁ జేయు భర్త్రుకుశ మిట్టిసతి న్వినుతింతు రందఱున్.

ఈపుస్తకముగాక యేతత్కవికృత మైనవేంకటాచలమాహాత్మ్య మొకటికూడ ముద్రింపఁబడి యున్నదిగాని దానిరచన కవియొక్క ప్రఖ్యాతికిఁ దగినంత శ్రేష్ఠముగాఁ గనఁబడలేదు. కాళహస్తిలోఁ బ్రవేశించిన కొంతకాలమునకే కవిచే రచియింపఁబడిన వీక్షారణ్యమాహాత్మ్యముకూడ శ్రీకుశసింగసెట్టికే యంకిత మొనర్పఁబడినందునఁ గాళహస్తి పోకముందే యాతనివద్ద నుండెనేమో యని సందేహము కలుగుచున్నది. కాళహస్తిలో నున్నకాలమున నీకవిపుత్రుఁడు దవముసర్వశాస్త్రి యమరుకమును సంస్కృతమునుండి తెలిఁగించి కాళహస్తిసంస్థానాధీశ్వరుని కంకితము చేసెను. ఈయమరుకములోని రెండుమూఁడుపద్యముల నిం దుదాహరించుట కేవలాప్రస్తుతప్రశంస కాకపోవచ్చునని యట్లు చేయ సాహసించుచున్నాను—

శా. శ్రీమీఱం దగుకాళహస్తిగిరిసీమంబు ధామంబుగా
సేమం బాశ్రితకోటి కీఁ దగు ప్రశస్తిం బొల్చు నాసామియా
సామిరాకృత భూమిభృద్వరతనూజాకామి సేమంబులో
శ్రీమద్దామెర వేంకటేంద్రులకు నాసింగార్యు లిష్టార్థముల్.

చ. అవునవుఁ దల్లి మయ్యె వృథయాపలుమాటలిఁ కేమి సామి నీ
కవలఁ జనంగ వచ్చు నిటు లయ్యెను మాకధి దోష మెద్ది నీ
కివురని నీదుప్రేమరస మిట్లగు నెం స్వభావచంచలం
బవు హతజీవితంబు చనుసంతన మా కొకబాధ కల్గునే.

చ. మును మన కింతకంతయును మూర్తివిభేదము గానలేమ నె
మ్మనమున మీఁదటం బ్రియతమత్వము గల్గెఁ బరస్పరంబు న
య్యెనిపుడు నీకు భర్తృపద మేను భార్యయనంగ నైతి జీ
వనగతవజ్రకర్కశతఁ బాటిలె నిట్టిఫలంబు నేఁటికిన్.

ఈకృష్ణమూర్తికవి కాళహస్తిలో నున్నప్పుడు చేయఁబడిన ప్రధానగ్రంథ మింకొకటి గలదు. ఆకాలములో నీయనకును చెన్నపురి శాస్త్రిపాఠశాలలో నాంధ్రపండితుఁడైన పరవస్తు చిన్నయసూరిగారికిని సిద్ధాంతకౌముదిలోనిసూత్రవిచారము కొంత నడచెను. మనపండితులు సాధారణముగా మత్సరగ్రస్తు లగుట సుప్రసిద్ధమేగదా? అట్టివారీర్ష్యచేతఁ దమకు లాభము లేకపోయినను బరులకు నష్టము కలుగుటయే తమయభీష్టసిద్ధిగా భావించి కొన్నసమయములయందుఁ బరులకీర్తికి భంగము కలిగింపఁ జూతురు. అంతకుఁబూర్వము కొంతకాలముక్రిందటఁ జిన్నయసూరి బాలవ్యాకరణమును రచియించెను. దానితో సరిపోల్పఁదగిన యాంధ్రవ్యాకరణ మావఱకు నేదొకటిలేదు. ఇట్లుండఁగాఁ గృష్ణమూర్తిగారిచేఁ జేయఁబడినవ్యాఖ్యానముతోఁ గూడిన హరికారికలనఁబడెడి యాంధ్రవ్యాకరణసూత్రగ్రంథ మొకటి యటుతరువాత నల్పకాలమునకు వెలువడెను. అదియే హరిభట్టకృతమై యథర్వణాదులచేఁ జేర్పఁబడిన కారికావళియైనపక్షమునఁ జిన్నయసూరి తనవ్యాకరణములోని సూత్రములన్నిటిని హరికృతగ్రంథమునుండి దొంగిలించి తనపేరిటఁ బ్రకటించినట్లు స్పష్టమగును. అయినను మూలగ్రంథములోఁ జూపఁబడిన లక్ష్యములు కొన్ని యథర్వణాచార్యుల కీవలి యాధునికగ్రంథములలోని వగుటచేత వ్యాఖ్యానముమాత్రమే కాక మూలగ్రంథమునుసహితము కృష్ణమూర్తిగారే రచియించి రేమో యని పలువురు సందేహపడుచున్నారు. అట్టిగ్రంథము రచియింపఁ గలసామర్థ్య మావిద్వత్కవికిఁ గలదనుటకు సందేహము లేదు. ఈయన యిటువంటిగ్రంథకల్పనము చేయ సంశయపడువారు కారని చూపుటకయి చరమదశయందు మాపుగల్లులో నున్నప్పు డొక్కరాత్రిలోఁ జేసినట్టీయన కారోపింపఁబడిన యశ్వశాస్త్రికథ కొంత తోడుపడుచున్నది.

కృష్ణమూర్తికవిగారు కాళహస్తినుండి స్వదేశమునకు వచ్చి శ్రీరాజాగంగాధరరామారావుగారివద్ద పిఠాపురసంస్థానములోఁ బ్రవేశించుటకయి నాలుగయిదుమాసము లచటనుండి కృషిచేసిరిగాని ప్రయత్నము సఫలమయినదికాదు. శ్రీరాజాగారు నూఱురూపాయలును జోడుశాలువలు నిచ్చి యాయనకు సెలవిచ్చిరి. తరువాత నాతఁడు తనకుమారుని యత్తవారియూరయిన జగ్గమపేటగ్రామమునకుఁ బోయి, యక్కడఁ గొంతకాలముండి గగ్సంస్థానాధిపతి నుపసరించెను. పీఠికాపుర సంస్థా

నాధిపతియయిన శ్రీరాజా రావు నీలాద్రిమాధవరాయనింగారి భోగభార్యాపుత్రుఁడును జగ్గఁపేట సంస్థానాధిపతియునగు శ్రీరాజా రావు వేంకటరాయఁడుగా రాయనకు సంవత్సరమున కిన్నూఱురూపాయల వచ్చుమాన్యము రెండుశాలువలు నిచ్చి సత్కరించిరి కాని సెలవీయ మెచ్చించి తమ యాస్థానపండితునిగాఁ జేకొనలేదు. తరువాత నీకవి యైనవల్లి గ్రామములోఁ గొంతకాలము వసించి యక్కడనుండి శ్రీజగన్నాథయాత్రకుఁ బోయి పురుషోత్తమక్షేత్రము సేవించి మరల వచ్చునప్పుడు త్రోవలో మాదుగల్లు సంస్థానమునకుఁ బోయి తత్సంస్థానాధిపతి యగు శ్రీకృష్ణభూపతిగారిని సందర్శించెను. ఆయన విద్వత్కవుల నాదరించు రసికాగ్రగణ్యుఁ డగుటచేత వేయిరూపాయలు వచ్చు భూమి నిచ్చి కృష్ణమూర్తిగారిని తమ సంస్థానములో నుంచుకొనెను. ఈకవి మాదుగల్లు ప్రవేశించినతరువాతఁ దానుజేసినజగన్నాథయాత్రనుగూర్చి నీలశైలనాథీయమను పేర సంస్కృతములో నొకగ్రంథమును రచించెను. రెండుసంవత్సరము లాసంస్థానములోనుండి కృష్ణమూర్తిగారు ౧౮౫౦ వ సంవత్సరమునకుఁ దరువాత నెనుబదియేండ్లప్రాయమున నక్కడనే కాలధర్మము నొందెను. ఈయన సంస్కృతమున యక్షోల్లాసమను కావ్యమును, వల్లీపల్లవోల్లాసము మదనాభ్యుదయము నను భాణములను, రామాయణకథను జెప్పు కంకణబంధమును, హరికారికలను, నీలశైలనాథీయమును, ఆంధ్రమున సర్వకామదాపరిణయమును, వేంకటాచలమాహాత్మ్యమును, వీక్షారణ్యమాహాత్మ్యమును, పంచతంత్రమును, వసుచరిత్ర వ్యాఖ్యానమును, రచియించెను.

మంత్రిప్రగడ-సూర్యప్రకాశకవి.

ఈకవి మాదుగొల్లు సంస్థానమున కృష్ణభూపతిగారి యాస్థానకవిగానుండి, కృష్ణార్జునచరిత్రమను రెండాశ్వాసముల ద్వ్యర్థికావ్యమును సీతారామచరిత్ర మనెడి యాఱాశ్వాసముల ప్రబంధమును భీమలింగ శతకమును రచియించెను. ఈయన యాఱువేల నియోగిబ్రాహ్మణుఁడు; హరితసగోత్రుఁడు; ఆపస్తంబసూత్రుఁడు; శరభరాజామాత్యపుత్రుఁడు. ఈయన నలువదిసంవత్సరములక్రిందటఁ గాలధర్మము నొందెను. ఈయన కవిత్వము మృదుమధుర పదగుంభితమయి మనోరంజకముగా నుండును. కవితారచనము జూపుటకయి యీకవి గ్రంథములలోనివి కొన్ని పద్యము లిం దుదాహరింపఁబడుచున్నవి—

కృష్ణార్జున చరిత్రము.

మ. తమలో నీగుణరూపసంపదకు లో రంజిల్లి గోపాలకుం
[illegible] దమితారాతిబిదారితామరసపత్రాక్షుండు కాంత్యుజ్జ్వల
[illegible] మనీయాకృతి రాజదర్జునసమాఖ్యాశాలి ధీరుండు దా
[illegible] రత్నము నీయధీన మగుచుఁ శోభిల్లఁ జేసెంజుమీ.—ఆ. ౧.

ఉ. కులీనుఁడందు భాగ్యమునకుం దగుకార్యము చేయుమంత వి
శ్రుతయశయౌ సుభద్ర కరిసూదనవిక్రముఁ డైనగోపరా
ట్సుతునకు సమ్మతంబుగ విశుద్ధగుణాకర భూరిపుణ్యక
వ్రత మొగిఁ జేయఁగాఁదగు వివాహమహోత్సవ మానసం బ్రజల్.ఆ—. ౨.

సీతారామ చరిత్రము.

శా. ధాత్రాదిక్రతుభుగ్వరుల్ ఘనతపోధారేయమౌ నీదుచా
రిత్రం బెన్న నశక్తులే జడుఁడ వర్ణింప న్సమర్థుండనే
పుత్రీభూతసరస్వతీధవసితాంభోజాక్షరుద్రుండ వో
యత్రీ యత్రివిగాక నీకు సరియే యన్యాగ్రగణ్యాగ్రణుల్.—ఆ. 3.

చ. కనకకురంగ మేల వలెఁ గన్పడె గ్రక్కున దానిఁదేరఁ బో
ష్మతి పతి నేలపల్కితి సహిష్మతి నారఘుభర్త దానివెం
టన జన నేల యగ్రజుని డాయఁగ లక్ష్మణు నేలపంచితిన్
జనవరుఁ బాసి యే నిచటఁ జావఁగ నిన్నిపాసంగె దైవమా.—ఆ. ౪.

చ. వను శర ణొందిన న్దనుజనాయకు రావణునైనఁ బ్రోతు నీ
తనిఁ గరుణించు టెంత శపథం బిదె గావున మీర లేగి చ
య్యనఁ గొనిరండు వీని కభయంబు-నొసంగితినన్న భానుసం
దనుఁడు కృపాంబురాశి యగుదాశరథిం గని సత్కృతాత్ముఁడై.—ఆ. ౬.

భీమలింగశతకము.

కం. తత్పురుషబహువ్రీహుల । సత్పురుషులు రామదాసశాస్త్రార్థ మిలన్
ద్వాత్పరముగఁ జెప్పుదురు జ । గత్పావన భీమలింగ కలుషవిభంగా.
కం. ఏమరవకులంబై నన్ । నీసామర్థ్యంబు గలద నిఖిలాధీశా
దాసీకృత జననీకృత । కౌసల్యా భీమలింగ కలుషవిభంగా.

శక్క-వేంకటనరసయ్య.

ఈకవి శకుంతలాపరిణయ మనెడి మూడాశ్వాసముల ప్రబంధమును రచియించెను. ఇతఁడు సృష్టికరణవంశజుఁడు; భరద్వాజగోత్రుఁడు; నారాయణమంత్రి పుత్రుఁడు. ఇతఁడు విశాఖపట్టణములోని క్రైస్తవోన్నత పాఠశాలయం దాంధ్రోపాధ్యాయుఁడై యుండెను. ఈకవి యీశకుంతలాపరిణయమును నలువది సంవత్సరముల క్రిందట ననఁగా ౧౮౩౬ వ సంవత్సరమునందు ముగించెను. ఇతఁడు అమరపదకల్పద్రుమము, నారాయణస్తవము, మదనసాయకాపరిణయము, కవిదర్పణచ్ఛందము, నారాయణశతకము, కుమారీశతకము, అను గ్రంథములనుగూడ రచియించెను. ఈతనికవిత్వము సలక్షణమయి మనోహరముగానున్నది. శకుంతలాపరిణయములోని కొన్ని పద్యముల నిం దుదాహరించుచున్నాను—

మ. తనరన్ బున్నమరేలఁ దత్పురవరోద్యత్సౌధసంచారికల్
వనజాక్షుల్ ఘనసారఖండమని కేలంబట్టి దీపాగ్రసీ
మను ధూపక్రియఁ జూపఁ గంది చెలులం బ్రార్థింపఁగా వీడిరన్
జనియెన్ వాఁకి నాఁటనుండి కలిగెం జంద్రాఖ్యయుం జిహ్నమున్.—ఆ. ౧.

చ. తొలకరి కాదు మించఁగఁ దోయజబాంధవుఁ డస్తమింపలే
దలజలజాక్షి రేఖయన నంతటఁ గంతటఁ నానుచుండె మే
ల్లెఱుకఁ డానిబొమ్మయనఁ దావులపూవులదీవెయో యనన్
గిలకిల చిల్కపల్కుల నొగిం బదపద్యము లుగ్గడించునే—ఆ. ౨.

చ. సరిసరి పొమ్ము బాల యొకచక్కనిబాలునిఁజూపి వీఁడు నీ
వరసుతుఁ డేమరాణి యని వానికిఁజెప్పఁ దొడంగుచుంటి-వీ
దొరలును మంత్రులున్ ఘనబుధుల్ నను బాయకయుండు రొప్పు వీ
రెఱుఁగని రీతిగా నడవి నెన్నఁడు నిన్నుఁ బరిగ్రహించితిన్?—ఆ. 3.

పేట్వారి-వేంకటేశ్వరకవి.

ఇతఁడు గోవ్యాఘ్రచరిత్రమును, విచిత్రరామాయణమును, పద్యకావ్యములుగా రచియించెను. ఈతఁడు నియోగిబ్రాహ్మణుఁడు; మౌద్గల్యగోత్రుఁడు; బ్రహ్మనామాత్య పుత్రుఁడు. ఈతని నివాసస్థలము విశాఖపట్టణమండలములోని విజయనగరసంస్థానము

నందలి రాపవల్లెయను గ్రామము. కవి ౧౭౫౧ వ సంవత్సరమున స్వర్గస్థుఁ డయి నందున, దాదాపుగా నిప్పటి కేఁబదిసంవత్సరములక్రిందట నుండినవాఁడు. అక్కడక్కడ వ్యాకరణవిరుద్ధములైన ప్రయోగములు కానఁబడుచున్నను, మొత్తముమీఁద నీతనికవిత్వము మృదువయి శ్రావ్యముగానున్నది. ఈతనికృతములైన రెండుకృతుల నుండియుఁ గొన్నిపద్యముల నిం దుదాహరించుచున్నాను—

గోవ్యాఘ్ర చరిత్రము.

చ. మధుకరపంక్తిఝంకృతులు మత్తమయూరనిశాతషడ్జముల్
పృథుతరకోకిలధ్వనులుఁ బెంపలరారుశుకప్రసంగముల్
శిథిలముగాని శారికలచిందఱవందఱచే వనాళిఁ బెం
పొదవఁగ నొప్పెఁ బుష్పమధురోజ్జ్వలసత్ఫలసంకులంబులై.

ఉ. సంతతి లేక డెందమునఁ జాలఁగ దస్సి వ్రతోపవాసముల్
సంతత మేనొనర్చి కడుసంతస మొప్పఁగ వేల్పుటేఁడ్ల మ
తాన్వంతమునందు నిల్పి హిమశైలసుతేశ్వరు నిందుమౌళి న
త్యంతసుభక్తిఁ గొల్చి సుతు నంచితవాంఛ ఫలించఁగాంచిరిన్.

విచిత్ర రామాయణము.

ఉ. మామ యిదేటిమాట వినుమా మనమాఱడిఁజెందె నింక నా
సామిపదంబులాన కొనసాగదు తొల్లిటిభంగి దానవ
గ్రామణియింట నున్న జనకప్రభుకూఁతురి నేలుకొంట కా
రాముని కొప్పె నొప్ప దనరాదు ప్రభుత్వముగల్గువారలన్. ఆ. ౧.

ఉ. పుట్టి జగంబులోనఁగల భూపతుల న్మనలన్ నృపాలురన్
బట్టి వధించి వజ్రధరుపాలికి నేగి సుపర్వకోటులం
గొట్టి సమస్తలోకములకున్ ములుసూపె నతండు నారదుం
డట్టితఁడి న్వైకుంఠపురమందు మురారిని జేరి యిట్లనెన్.—ఆ. ౨.

చ. కళుకులు దేరుబల్మిసిమికాంచనరత్నమయూఖముల్ దిశా
వలయముఁ బర్వ సచ్చరలు వైభవలీల నటింపఁ గిన్నరల్
బలసి రథంబు చుట్టును సభక్తిని గొల్వ సరోజబాంధవుం
డిల కరుదెంచెనో యన ధనేశుఁడు రాఁగ వియన్నిరీక్షుఁడై.—ఆ. ౩.

ఉ. ఇద్ది నృపాలుఁ డిట్లనె మునీశ్వర నీ కెదురాడి నిల్వనా
చిచ్చరకంటిసామికిని జెల్లదు నేనన నెంత యీసుతుల్

సచ్చరితుల్ సురారు లతిసాహసు లాహవకోవిదుల్ కడుం
గుచ్చితు లస్త్రశస్త్రముల గోప్య మెఱింగినటితు రెప్పుడున్.—ఆ. ౪.

ఉ. ఎవరిం దన్ను నెఱుంగలేక మదిలో నెవ్వాఁడు నిన్నిట్లు చె
ట్టినఁడై నాసయు వీరులుం దుదిమె కాంతివ్యంబున న్నున్న నేఁ
డెదరంజేతినదేవదైత్యవరులం జింతింపఁడో చూడు మా
కదనస్థలిఁ గూల్తు వానిఁ దలియుండాఁ బల్కె వేసోదరీ—ఆ. ౫.

మ. శరసంధాన మొనర్చు ప్రౌఢిమము లక్ష్యం బూహగావించు నే
ర్పుగుబాహాబలవిక్రమంబు సమరోద్యోగంబు సవ్యాపస
వ్యరిపక్షీణమహాస్త్రపాతములు రౌద్రాకారముం గన్న నా
పౌరుషం బో వెలిపొందు నీకుఁ దయినం బుత్రా నిజం బింతయున్.—ఆ. ౬.

ఈవిచిత్రరామాయణము గోపీనాథవిరచితాంధ్రవచనకావ్యము ననుసరించి యీకవిచేఁ బద్యరూపమునఁ జేయఁబడెను. ఈవచనకావ్యము ననుసరించియే యిటీవల గోదావరీమండలస్థ వెలగతుఱ్ఱుగ్రామనివాసియు నాపస్తంబసూత్రుఁడును శ్రీవత్సగోత్రుఁడును సుమామహేశ్వరసూ పుత్రుఁడును నగు నరసింహదేవర వేంకటశాస్త్రియను వైదికకవియు నొకపద్యకావ్యమును రచియించియున్నాఁడు. ఈవర్తమానకవిచే రచియింపఁబడిన విచిత్రరామాయణమునందును వ్యాకరణదుష్టము లైనప్రయోగము లనేకములు కానఁబడుచున్నను మొత్తముమీఁద నీతనిగ్రంథము మొదటిగ్రంథమునకంటె నధిక రసవంతముగానున్నది. ఇందలిపద్యములనుగూడఁ గొన్నిటి నిందుదాహరించుచున్నాను—

ఉ. రామ విరాజమానపురరాజకిరీటమణిప్రభాసుమ
స్తోమ సుపూజితాంఘ్రి యఘసూదన తారకనామ నీరద
శ్యామ సురేంద్రవందితవిశాలపరాక్రమ కీర్తికామినీ
కామ కఠోరగాత్రిచరకాండఖండనభండనప్రియా —బాల.

ఉ. తెల్లనిమేనివానిఁ గడుతియ్యనిమాటలవానిఁ గప్పడాల్
చల్లెడుగొంతువాని బలిచాలలతోలు బుజాలపైని కా
జిల్లఁగఁజేయువాని దసచీరలనూనినవాని నెత్తిపైఁ
జల్లనిపెల్లుఁ దాల్చినసామిని జూచి యహీంద్రుఁ డెంతయున్.—అర.

ఉ. ఓసి యభాగ్యురాల పడియుండక యిట్టు నిటులవచ్చినా
వే సకలంబుఁ బోయె నినుఁ బెండిలియాడినపోటుమంది యే

వ్రాసిది నీవు వేశ్మమునఁ బాదముపెట్టితి వంతకంతకుం
దా సొక లైన బట్టకొనఁ గట్టఁగలే దిఁక లేచిపోఁగదే.—అరణ్య.

శా. ఆకంఠీరవనాదము న్విని మహాహంకారసంయుక్తుఁడై
నాకేశాత్మజుఁ డాహవంబునకు సన్నాహంబుతో వేగి వే
నాకక్ష్యంబున నింద్రదత్తకసహాయార్థంబు శాఖామృగా
నీకంబుల్ గొలువంగ వెంటఁ జనితిన్ స్నేహంబు పెంపొందఁగన్ —కిష్కింధ.

ఉ. ఎవ్వఁడవోరి యేమిపని కిచ్చటవచ్చితి నిల్వు నిల్వు నీ
క్రొవ్వడఁగించి ప్రొద్దుకొమఱుండు వసించిన లెంకఁ గంపెదన్
మవ్వపుదెబ్బఁ జూడు మని మారుతివక్షమునందు మోఁద నీ
వెవ్వతెవంచు గ్రుద్ది పడనీడ్చి సమీరసుతుండు రక్కసిన్ —సుందర.

శా. ఏమీ దానవవీరులార యమవహ్నీంద్రాదులన్ గెల్చి సం
గ్రామోత్సాహము లెందుఁబోయెఁ బటుదర్పం బేటికిన్
మీమీయిష్టుల కేగియుంటి రిదియేమీ వైరితేజంబు మీ
సామర్థ్యంబును విక్రమక్రమరణోత్సాహంబులుం దల్పఁగన్ —యుద్ధ.

తిరుమలబుక్కపట్టణపు-చినతాతాచార్యుఁడు.

ఈకవి వడ్లమన్నాటి వెంకప్ప సోమయాజులగారి ప్రేరణముచేత విశ్వగుణాదర్శ మును పద్యకావ్యముగాఁ దెనిఁగించెను. ఇతఁడు శ్రీనివాసాచార్యునిపౌత్రుఁడు; వేంకటాచార్యునిపుత్రుఁడు. ఇతఁడు నలువది యేఁబదియేండ్లక్రిందట కృష్ణామండలములో నుండినవాఁడు. కృతిప్రేరకుఁ డైన వడ్లమన్నాటి వెంకప్పసోమయాజులగారి యజ్ఞమూలముననే కృష్ణామండలములోని వైదికనియోగిబృందములో రెండుకక్ష్య లేర్పడినవి. ఈకవియొక్క కవిత్వమునందుఁ గొన్ని వ్యాకరణదుష్టము లైనప్రయోగము లున్నను మొత్తముమీఁద కవనరచన సరసముగా నున్నదనియే చెప్పవచ్చును. ఆంధ్ర విశ్వగుణాదర్శములోని రెండుపద్యము లిం దుదాహరింపఁబడుచున్నవి—

చ. ఘనవన భూముల న్మెలఁగి కన్నము వేసి గృహాళివిత్తముం
గొని చనువారి దొంగ లనఁగూడును పోషకు లైనవారిలె
క్కను గడుబొంకుపుచ్చి తదఖర్వధనంబులు దొంగిలింతు రీ
గణకులె దొంగ లీగణకకర్తలనే భజియింతు రీజనుల్.

చం. సురభితమాలయుం గుసుమశోభితసాలము వీక్షణార్వబం
ధురతిలకాలిసాలము విధూతమహాదురితౌఘమూలమున్
సరసపరసాలమున్ బనసజాలము మాధవకేళిలోలమున్
బరమగుణాలవాలమును బాయక చూడుము శేషశైలమున్.

మాడభూషి–నృసింహాచార్యుఁడు.

ఈకవి వల్లీపల్లవోల్లాస మను మూడాశ్వాసముల ప్రబంధమును నూజవీడుసంస్థానాధిపతి యగు శ్రీశోభనాద్రి అప్పారావుగారి ప్రేరణమువలన రచియించెను. ఇతఁడు శ్రీవైష్ణవ బ్రాహ్మణుఁడు; నైధ్రువకాశ్యపగోత్రుఁడు; ఆపస్తంబసూత్రుఁడు; వేదాంతాచార్యులపుత్రుఁడు. ఈకవి యిరువది ముప్పదిసంవత్సరముల క్రిందట నుండినవాఁడు. ఈయనకవిత్వము సలక్షణమయి నాతికఠినమయి శ్రావ్యముగానున్నది. వల్లీపల్లవోల్లాసములోని రెండుపద్యముల నిం దుదాహరించుచున్నాను.—

చం. తనయులు పెక్కుగల్గినను దన్వికిఁ బుత్రిక పుట్టకున్న ని
త్తనువు నిరర్థకం బని యొకం దలపోయుదు రింతు లంచుఁ దా
ననమునఁ గొంతసేపు నృపమానిని చింత యొనర్చి యేమి సా
ధనమునఁ గన్యకావదనదర్శనజన్యముదంబు గల్గునో.—ఆ. ౧.

ఉ. పాండుతనూభవుండు తనబాంధవు లత్తఱి సంతసిల్లఁగా
గాండివ మెత్తి యంతిగిచి కల్పకృశానుసమానుఁడై లస
త్కాండముల న్నిగిడ్చి నృపకాండములం దెగటార్చి పేర్చి త
త్కాండమునన్ ముదం బెసఁగఁ దద్దయు నొత్తెను దేవదత్తమున్.—ఆ. ౩.

కోటిమరాజు–నాగయ

ఈకవి యధ్యాత్మరామాయణమును పద్యకావ్యముగా రచియించెను. ఇతఁడాఱువేలనియోగిబ్రాహ్మణుఁడు; కాశ్యపగోత్రుఁడు; భాస్కరమంత్రికిని కామాంబకును బుత్రుఁడు. ఇతఁడు కృష్ణామండలములో ముప్పది నలుబదిసంవత్సరముల క్రిందట నుండినవాఁడు. కావ్యము పెద్దనకవికృతమైనయధ్యాత్మరామాయణమువలె కవిత్వ మంతప్రౌఢముగా నుండకపోయినను మొత్తముమీఁద హృద్యమయి నిర్దుష్టమయి యున్నది. అధ్యాత్మరామాయణములోని కొన్నిపద్యము లిందుఁ జూపఁబడుచున్నవి.—

ఉ. ధరణీదేవ భవత్తపోమహిమ చోద్యం బయ్యె నిస్త్రైచ్ఛికిన్
వర మే నిచ్చెద హైహయుం దునిమి గర్వగ్రస్తులౌ రాజులన్
ధరణిం బేరడఁగించి కశ్యపున కీధాత్రీతలం బిచ్చి కాం
తరుదిం దాల్చి మదంశ నొంది పితృహత్యాతాపంబు వారింపఁగన్.—బాలకాం.

ఉ. రామ త్రిలోకవిశ్రుతు విరాధు నెఱింగవె మద్భుజంబునన్
వేమఱు మాను లీవనము వీడి పలాయితు లైరి నీవు మా
సేమము గోరెదేని యిట సీతను డించి నిరాయుధుండవై
భూమి నదృశ్యవైఖని బొమ్ము రయమ్మునఁ దమ్ముతోడుతన్.—అరణ్యకాం.

ఉ. ఏపెఱిఁగించి నంతటనె యమ్మకరాలయ మెంత దాటి లం
కానగరంబుఁ దుత్తుమురుగా నొనరింపఁగఁ జాలుఁ గార్ముక
జ్యానినదప్రముక్తశరజాలములన్ రఘుసత్తముండు నీ
పైని మనంబుపెట్టి యొకపండును దమ్మఁ డాగగింపఁగన్ —సుందరకాం.

మ. మునివర్యుల్ విజయోస్తుతే యనఁగ సమ్మోదంబుతో నేగి య
న్న నియోగించినభంగి నాలవణునిం జక్కాడి నిర్భీతిమై
జను లెల్లన్ వసియించుపట్టణము లిచ్ఛంజేసి తద్రాజ్యపా
లన నైపుణ్యముతోడ నిం పెసఁగెఁ గళ్యాణీ ధవానీసతీ.—ఉత్తరకాం.

కరాలపాటి_రంగయకవి.

ఈకవి భూతపురీమాహాత్మ్యము, కవిజనమనోహరము, అను రెండు పద్యకావ్యములను రచియించెను. ఇతఁడు వైష్ణవ వైశ్యకుల సంజాతుఁడు. ఇతఁడు ౧౮౧౮ వ సంవత్సరమున జననమొంది ౧౮౬౩వ సంవత్సరమునందుఁ బరమపదము నొందెను. ఇతఁడు చెన్నపురిలోఁ గొంత కాలము పచ్చప్పగారి పాఠశాలయందును గొంతకాలము రాజధానీ శాస్త్రపాఠశాలయందును నాంధ్రపండితుఁడుగా నుండెను. మొట్టమొదట నాంధ్రభారత భాగవత రామాయణములను లేఖకప్రమాద జనితదోష రహితములుగాఁ బరిష్కరించి ముద్రింపించిన దితఁడే. ఇతఁడు తనతండ్రి రామకవియని పేర్కొనుటయే కాక తనతాతయైన నారాయణమూర్తికూడ కావ్యరచన మొనర్చి కర్ణాటరాజులను మెప్పించినట్లు భూతపురీమాహాత్మ్యమునం దీక్రిందిపద్యములోఁ జెప్పియున్నాఁడు.—

ఉ. పాయక యేమహామహునిభవ్యవచోగరిమం బశేషభూ
నాయకగోష్ఠిసత్కవిజనంబులచే ననిశంబు వర్ణితం

జై యప్పద్యగం బరఁగు నాగణశాలి కరాలపాటి నా
రాయణసూరిమౌళి దనరారె సుధీజనపద్మహేళియై.

మ. సకలాశ్చర్యస్తవనీయభవ్యకవితాసంప్రీతకర్ణాటభూ
పకులాధీశ్వరదత్తమత్తగజశశ్వద్దానధారాసము
త్సుకరోలంబకదంబఝంకరణవచ్ఛంభద్గృహప్రాంగణుం
డకలంకాశయుఁ డమ్మహాకవికులాధ్యక్షుండు సామాన్యుఁడే.

ఈకవి భూతపురీమహాత్మ్యములో మూఁడాశ్వాసములు రచియించునప్పటికే యవసానకాలము సంప్రాప్తమయినందున గ్రంథము ముగియలేదు. ఈతనికవిత్వము నిర్దుష్టము మృదుమధురపదభూయిష్ఠమై రసవంతముగానున్నది. అయినను వ్యతిరేకక్త్వార్థకము మాత్రము గ్రంథమునం దక్కడక్కడ ద్రుతప్రకృతికముగాఁ బ్రయోగింపఁబడి యున్నది. శైలి తేటపడుటకయి యీతని గ్రంథములనుండి కొన్ని పద్యము లిం దుదాహరింపఁబడుచున్నవి.—

కవిజనమనోహారము.

ఉ. పోయెఁగదే ననుం గడచి పోట్రాయె యదె వాఁడు రారె రా
రే యుఁ వాఁడు దానును సమిద్ధరయంబున వెంటనంటి య
గ్గాయకపుంగవుం గదిసి గట్టిగఁ బట్టికొనుండు నెమ్మెయిం
ద్రోయఁగ లేక చిక్కువడె దుష్టనిశాటుల నోర్వ శక్యమే.

ఉ. అక్కటికంబులేనిదనుజాన్వయజాతుఁడ వయ్యు నాఁకటన్
స్రుక్కుచు ధార్మికత్వము విశుద్ధమనోగతిఁ బాయలేక న
న్నెక్కుడుప్రీతితోఁ గనిచి తీయుపకారము నీసుశీలమున్
దక్కొరులందుఁ గల్గునె బుధప్రియవర్తన నీకుఁదక్కఁగన్.

భూతపురీమాహాత్మ్యము.

ఉ. జారులు లేరు పేరుకొనఁ జారులకాని యనారతం బనా
చారులు లేరు తత్త్వసువిచారులకాని సరోమహీపణా
కారులు లేరు నిచ్చ లుపకారులకాని విమర్శచేయఁగాఁ
బాసలలోన నమ్మనుజపాలధరాపరిపాలనంబునన్.—ఆ. ౧.

ఉ. ఈశ గిరీశ నేరమి సహింపుము డింపుము రోషము ప్రతీ
కాశము నీమహాత్త్వ మెఱుఁగం దగువారము కాము సత్కృపా
పేశలదృష్టిఁ గన్గొను మపేతకళంకులఁ జేయుమయ్య లో
కేశశరణ్య దీనులను హీనుల మెంతటివార మల్కుకున్.—ఆ. ౨.

ఉ. అమ్మునివర్యభార్య వినయమ్ము భయమ్ముఁ బ్రియమ్ము నెప్పుడున్
నెమ్మది సందడింప మగనిం బరిచర్యలఁ దృప్తుఁ జేయుచున్
సమ్మద మారఁగా నతిథిసంఘముఁ దన్పుచు దేవతావితా
నమ్ముల భక్తిఁ గొల్చుచు గుణమ్ములు సాధుగణమ్ము లెన్నఁగన్. — ఆ. 3.

దామరాజు-లక్ష్మీనారాయణ.

ఇతఁడు బృందావనవిహార మనెడి మూఁడాశ్వాసముల పద్యకావ్యమును రచియించెను. ఇతఁ డాఱువేల నియోగిబ్రాహ్మణుఁడు; శ్రీవత్సగోత్రుఁడు; శివరామామాత్యపుత్రుఁడు. ఇతఁడు తనబృందావనవిహారమును మల్కాపురములోని సీతారామస్వామి కంకిత మొనర్చెను. ఇతఁడు తరువాత గోదావరిమండలములోని యేలూరునకు వచ్చి యచ్చట నివాస మేర్పఱుచుకొన్నట్టు తెలియవచ్చుచున్నది. ఈతనిసంతతివారు మూఁడుతరములనుండి యేలూరునం దున్నారు. ఇతఁ డఱువదిసంవత్సరముల క్రిందట నుండినవాఁడు. ఈతనికవిత్వమునందు వ్యాకరణదోషము లనేకములు గానవచ్చుచున్నను, మొత్తముమీఁదఁ గవిత్వము మృదువుగాను మనోహరముగానునున్నది. బృందావనవిహారములోని రెండుమూఁడుపద్యముల నిం దుదాహరించుచున్నాను.—

ఉ. ధారుణిలోనఁ జూచి విశదంబుగ నెంచిన స్త్రీల కందముల్
చారుగుణప్రధానములు చక్కఁదనంబున కేమిలెక్క యా
సారసగంధికిన్ మిగులఁ జక్కదనంబుకు భూషణంబుగా
మీఱె లసద్గుణావళియు మించుగ సొంపుగ నెన్నిభంగులన్. — ఆ. 1.

మ. కులగోత్రంబులు లేక నిర్మలముగా గూఢీకృతాధిక్యని
స్తులమాధుర్యనిరూపదీపకలితస్థూలైకతానిర్గుణో
జ్జ్వలులై జన్మములంచుఁ బూనుకొని కృష్ణస్వామి రాముండు గో
ల్లలకుం జేతురు చేయరానిపనులన్ లజ్జించెదం జెప్పఁగన్. — ఆ. 2.

చ. మొఱలిడువారిమొఱ్ఱలవి ముందుగ విందుచు వెంటనుండు నా
కఱమఱలేదు వారియెడ న్యాయముగా విహరింతు నెంతుఁ ద
త్తఱమున వారియాపదలు దాటఁగఁజేయుదుఁ దక్షణంబునన్
మఱవక నన్నుఁ గొల్చుటకు మాటుగనుండెద నింతె చూడకే — ఆ. 3.

త్యాగరాజమొదలి.

ఇతఁడు శుద్ధద్రావిడియైనను దెనుఁగుభాషయం దత్యంతాభిమానము గలవాఁడయి యాంధ్రభాషయందుఁ జక్కనిపాండిత్యము సంపాదించి పెక్కుగ్రంథములను జేసినవాఁడు. ఇతఁడు చేసినగ్రంథములలో విద్వత్కర్ణామృతమను నామాంతరముగల సుబ్రహ్మణ్యవిజయమనెడి యైదాశ్వాసముల ప్రబంధము ప్రధానమయినది. ఈకవిచే రచియింపఁబడిన పుస్తకములలో ఛందోరత్నాకరమను చిన్నఛందస్సుకూడ ముద్రింపఁబడియున్నది. ఇతఁడు 1830 వ సంవత్సరప్రాంతమునందు జననమొంది యిరువదియైదు సంవత్సరముల క్రిందటఁ గాలగర్భమునొందెను. ఇతఁడు నారాయణమొదలారి కుమారుఁడు. ఈగ్రంథరచనకాలమునందితఁడు ఇంజనీరింగు డిపార్టుమెంటులో అసిస్టాంటు ఓవరుసీయరుగానుండెను. ఇతఁడు తాను మొట్టమొదట నాంధ్రభాషాభ్యాసముం జేయుటనుగూర్చి యిట్లు వ్రాసికొనియున్నాఁడు.—

"బాల్యంబున ప్రథమం బాంధ్రభాషనభ్యసించుటమనోదర్పణపారదంబుగదా! నాలుగేఁడులు నిండినతోడనే యసదుచ్చారణ సస్యవృద్ధిగోరు మానవబాలికులు జిహ్వాచలజంబునకు హలంబుగా నెంచునాంధ్రభాష నాకు ప్రథమమం దభ్యాసమయ్యె. సమధికోచ్చారణ లేద్రవిడదేశస్థులలో నొకండ నయ్యు నాకలవాటికిఁ గల లేమి లేమియయ్యె. సంస్కృత ద్రావిడ హూణ ప్రముఖభాషలనాయాసలభ్యంబు లయ్యె."

ఇతఁడు తన చిన్నపాత్రములకు సహితము పెద్దపేరులుపెట్టి యాత్మస్తుతిం గొంతయధికముగాఁ జేసికొన్నను, మొత్తముమీఁద నీతనికవిత్వము సలక్షణమయి హృద్యముగానున్నది. కవితారచనను జూపుటకయి సుబ్రహ్మణ్యవిజయములోని కొన్ని పద్యములిం దుదాహరింపఁబడుచున్నవి—

మ. భువనంబు ల్జడమయ్యెఁ బొంగతతులం బొందెం బురత్రాత మెం
దవనత్వంబులులేక చిక్కుముని ముఖ్యావాసముల్ జంతుసం
ఘవిభ ల్వారిత మయ్యె లోకరమణీక న్వంక రయ్యె న్ననైం
దవభూషా యిఁకనైనఁ గర్బురకులోద్భూతిమాయించవే.—ఆ ౧.

ఉ. నెమ్మది యల్కఁ గాంత భయనీతిని వల్దనిపల్క మేనిపైఁ
గ్రమ్మెడిపుల్క లాల్క భయరాగముచిల్క మరుండు దైవతా
ర్యమ్ము దలంచి మోహనశరంబు కరంబునఁ బూని యిట్టుచా
పమ్మున నుంచి వైవఁ దెగువం దివియంగ హరుండు వేడుకన్.—ఆ.౨

చ. తన కపరాధసంచయశతం బొనరించిన నోర్చుఁగాని తాఁ
దననతపాళి నెప్పఁడు దస్త్రయయుక్తుని నాప్తుఁడైనఁ దు
స్మ నతఁడు గాన దేవతలు పొంగినవా రతనిం దదీయులన్
ఘనయుతఁ గూడి తత్త్వనతిసల్పి సుఖింపుము దానవేశ్వరా.—ఆ. ౩.

ఉ. తారల నెన్నవచ్చు నలదైత్యబలేశుల నెన్నరాదు కాం
తారతృణాళి నెన్నఁగుఁ దచ్చతురంగబలంబు నెన్నరా
దార పయోధియం దిసుక నాగసి యెన్నఁగవచ్చుఁ దద్భటో
దారమహాయుధాంబకకదంబము నెన్నఁగరాదు బ్రహ్మకున్.—ఆ. ౪.

మ. ఘనమాయావులు నిత్యచంచలులు నిష్కాముల్ స్వకార్యానుకూ
లనవోపాయవిధిజ్ఞు లస్థిగమ్యపాలాపుల్ కృపాశూన్యు లెం
దనుఁ బుంవయ్యులు దేవదేవు లెపుడున్ దుర్వారసంపత్సమా
ర్త్రితాంతాఁధులు పల్క-నేల మగవారి స్నహ్యుఁగా వచ్చునే.—ఆ. ౫

ఓగిరాల-జగన్నాథకవి.

ఈకవి సుమనోమనోరంజన మనుపేర నైదాశ్వాసముల ప్రబంధమును రచియించెను. ఈతఁడు ఆఱువేలనియోగిబ్రాహ్మణుఁడు; గోదావరీమండలములోని నీలపల్లె గ్రామ నివాసుఁడు; ఆపస్తంబసూత్రుఁడు; భారద్వాజగోత్రుఁడు; వేంకటేశ్వరామాత్యపుత్రుఁడు. ఇతఁడు తనచరమదశయందు కాకినాడపురమునుండి సుధీరంజని యను మాసపత్రిక కధిపతియయి సుమారు పదునేను సంవత్సరముల క్రిందట లోకాంతరగతుఁ డయ్యెను. ఈ యనయు నీయన పెదతండ్రికుమారుఁడైన రంగనాథకవియు మతికొండఱును సుప్రసిద్ధులైన శ్రీమంత్రిప్రెగడ వేంకటరామపంతులవారియొద్ద లక్షణ గ్రంథములను జదివి మంచికవీశ్వరులైరి. శ్రీమదోగిరాల రంగనాథకవినిగూర్చి యీజగన్నాథకవి తన సుమనోమనోభిరంజనమునం దిట్లు వ్రాసియున్నాఁడు—

గీ. వారిలో రంగనాథుండు పండితోప
లాల్యమాననవీనకల్యాణకల్ప
వల్లికాముఖ్యరసవత్ప్రబంధరాజ
కల్పనాదక్షుఁడై ఘనఖ్యాతి మెఱసె.

ఈరంగనాథకవి జగన్నాథకవికంటెను సమర్థతరుఁడయియు నధికలక్షణవేత్త యయియుఁ బేరువడసినను, ఇతఁడు చేసినగ్రంథము లేవియు ముద్రింపఁ బడకుండుట

లోచనీయముగా నున్నది. ఏతత్కవికృతమయిన ద్విరేఫదర్పణ మిప్పు డముద్రితగ్రంథ చింతామణియందు ప్రకటింపఁబడుచు న్నది.

జగన్నాథకవి తనప్రబంధమును ౧౮౭౫ వ సంవత్సరమునందు ముద్రింపించినను, అవలకతఁడు ముప్పదియైదుసంవత్సరముల క్రిందటనే దానిని ముగించియుండెను. ౧౮౭౮ వ సంవత్సరమున నేను పాఠశాలలోఁ జదువుకొనుచుండినకాలములో సుమనోమనోభిరంజనములోని మొదటిమూడాశ్వాసములను వ్రాసికొనియున్నాను. అయినను కవి యీముప్పదిసంవత్సరములలోను గ్రంథమునకు మెఱుఁగువెట్టి సంస్కరించి రెట్టింపవ తెచ్చెను. ఈగ్రంథము సర్వకళాశాలాధ్యక్షులు పట్టపరీక్షకుఁ బఠనీయ గ్రంథముగా ననేకపర్యాయములు నిర్ణయించి యుండుటచేతనే దాని ప్రాశస్త్యము వెల్లడి యగుచున్నది. కవిత్వము రసవంతమయి నిర్దుష్టమయి యనర్గళధార కలదిగా నున్నది. కవనరీతి తెలియుటకయి సుమనోమనోభిరంజనములోని పద్యములఁ గొన్నిటి నిం దుదాహరించుచున్నాను —

మ. నిరతాన్యోన్యమనస్సముద్భవసపత్నీవైరమూలాగనో
దరతిన్ గొబ్బునఁ జిత్రభానుఁ డత్రతత్యాహిరాట్ఫ్యాయిన్
సరసిన్ స్వస్థితుల న్వచించుకొన నిచ్చంబోవుమార్తాండజాం
బరశైవాలిములో యనంగఁ బురద్వారీలపీఠప్రభల్. — ఉ. ౧.

ఉ. చందురునందుఁ గల్గుసుచి సంపెగతావియుఁ బారిజాత మా
రందమునందుఁ గూర్చి హిరణ్యపరాగచయంబు చల్లుచున్
బొందుగ మేళవించి మెఱుపుం దళుకుల్ పయిఁబూసి యాశతా
నందుఁడు నేర్పుమీఱ జతనంబుగఁ జేయఁగఁబోలు నాసతిన్. — ఉ. ౨.

చ. చిలుకపలుకు మావజీగ ముక్కుషీవలుఁ డంగనచిత్తవప్రమున్
జలజకళంబలాంగలమునన్ దళనం బొనరించి కృష్ణు ను
జ్జ్వలగుణబీజ మంటి యతిబ్బుధురరాగరసంబునింపఁ గో
మలసుమనోరథాంకుర మమందముగా జనియించి మించెడున్. — ఉ. ౩.

చ. అరిదరపాణియానమునం దవదాతమృదూర్ధ్వపుండ్రకాం
తరవరవర్ణినీమృదులనవ్యపరాగవిధీయమానసుం
దరతిరచిత్రకద్యుతి గనంగ మసారమణీధరాధరో
పరిగదభిన్నమధ్యతలభాసితటిల్లతరీతి నొప్పెడున్. — ఉల్లాస. ౪.

చ. కలువలరాచరాదొనలు గార్కొనువెన్నెలచేఁ గరంగఁగాఁ
గొలఁకుజలప్రవాహములు తోరపుగ్రొవ్విరితేనెసోనలం

గలయుచు స్రోతోముఖముగా నిలఁ బర్వెను గాఁగ గాఁగ
గలగుణసౌరంబులకుఁ దావలమై తనర్చారు మాధవా.—కు. ౫.

నడకుదుటి-రామనకవి

ఇతఁడు ప్రభులింగలీలను, హరిమీడేస్తవము, ఆత్మానాత్మవివేకచూడామణి, అను సంస్కృతగ్రంథములను దెనుఁగునఁ బద్యకావ్యములనుగా రచియించెను. ఇతఁ డారు వేలనియోగిబ్రాహ్మణుఁడు; ఆపస్తంబసూత్రుఁడు; కౌశికగోత్రుఁడు; లక్ష్మీనృసింహుఁ డను నామాంతరముగల బుచ్చనామాత్యునిపుత్రుఁడు. ఈకవి ౧౭౮౧ వ సంవత్సరము నందు జననమొంది ౧౮౭౪ వ సంవత్సరమున లోకాంతరగతుఁ డయ్యెను. ఇతఁడు మొట్టమొదట గోదావరీమండలమునందలి రామచంద్రపురము తాలూకాలోని శమాపుర గ్రామమునకు కరణముగానుండి, పెద్దాపురమునకుఁ జేరువ నున్న తిరుపతిగ్రామము యొక్క కరణికమును తద్గ్రామమునందలి భూములును దనయత్తవారివిరాఁగా శమాపుర కరణికమును దనజ్ఞాతులకు వదలివేసి ౧౮౩౧వ సంవత్సరమున సకుటుంబముగాఁ దిరుపతి గ్రామమునఁ బ్రవేశించెను. ఇతఁడు రచియించినగ్రంథములలోఁ బ్రభులింగలీలపాలుకు టికి సోమనాథుని ద్విపదకావ్యానుసారముగా నైదాశ్వాసములపద్యకావ్యముగా రచియింపఁబడినది. తక్కినవి రెండును శంకరాచార్యులవారి సంస్కృతగ్రంథములనుండి యాంధ్రీకరింపఁబడినవి. ఇందు వివేకచూడామణియైదాశ్వాసములగ్రంథము. ప్రభులింగలీల ౧౭౯౯వ సంవత్సరప్రాంతమునందును, హరిమీడేస్తవము ౧౮౦౯వ సంవత్సరమునందును రచియింపఁబడినట్టు కవివంశమువారు చెప్పుచున్నారు. వివేకచూడామణి శాలివాహనశకము ౧౭౫౨వ సంవత్సరమునం దనఁగా హూణశకము ౧౮౩౦ వ సంవత్సరమున రచియింపఁబడినట్టు కవియే గ్రంథమునం దీపద్యమునఁ జెప్పుకొనియున్నాఁడు—

గీ. శాలివాహనశకమధ్యసాగరగ । హార్ధి శశిసంఖ్యవత్సరాభ్యర్హితంబు
నగు ప్రజోత్పత్తివత్సరంబందు మాఘ । పూర్ణిమకు గ్రంథకల్పనపూర్తి యయ్యె.

ఈతనికవిత్వమునం దక్కడక్కడఁ గొన్నివ్యాకరణవిరుద్ధములైన ప్రయోగము లున్నను మొత్తముమీఁద శైలి రసవంత మయియున్నది. ఇతనికవిత్వరీతి తెలియుట కయి యొకొక్కగ్రంథమునుండి రెండేసిపద్యముల నిం దుదాహరించుచున్నాను—

ప్రభులింగలీల.

ఉ. నే నొకమాట పల్కెదను నీ పటుచేసి మదిష్ట మిచ్చి నీ
దానిఁగఁ జేసికొ మ్మవితథప్రథవాక్యుఁడవై చెలంగు శా

జేసి భవత్ప్రతిజ్ఞ జగదీశ్వర పొల్లగు దానఁ బాతకం
బే నిటుఁ జెందుఁగాని వినుమీ ననుఁ బొందఁగలేవు నావుడున్.—ఆ. ౨.

శా. ఆజ్ఞాపన మాలకించి దయతో నాయయ్యవారింటికిన్
దా విచ్చేయ సమాత్యవర్యులు మహాధర్మానుషక్తుల్ శమ
ప్రావీణ్యుల్ బసవన్న చెన్నబసవప్రఖ్యాతనాముల్ దగన్
సేవల్ సేయుచు నెంబడిం జనిరి తుష్టిం జెందుభావంబులన్,—ఆ. ౩.

హంసమిత్రస్తవము.

శా. దేహాదివ్యతిరిక్తుఁ డాత్మయని వేత్తృత్వంబు గైకొన్న నా
త్మేహర్షాత్మకబ్రహ్మమున్ దెలివియున్ దీపించుచున్నన్ ధరన్
దేహుల్ లోకులందఱు ముక్తిలేక చెడిరింతేకాక యాత్మత్వధీ
దేహాద్యాకృతినుండు వెండియును సందేహంబు లేకుండఁగన్.

శా. ఏవిజ్ఞానశిఖాస్వరూపు రవివహ్న్యిందూపలబ్ధిస్థలిన్
భావిద్యున్నిభహృద్విభాంతు నతిసత్పాత్రున్ సమస్తాధ్యు సం
సేవల్ భక్తి నొనర్చి యాత్మగతు నీజీవత్వమం దేమహా
భావుల్ జూత్తురొ వాని సంసృతితమోభానున్ హంసం గొల్చెదన్.

ఆత్మానాత్మవివేకచూడామణి.

చ. నియమయమాదియోగపరినిష్ఠితహృత్పరిభావితంబు ధీం
ద్రియవిగతానుభావితము దివ్యము నింద్యమమూర్తిహీన మ
వ్యయ మనవద్యభూతివిషయాగమ మెయ్యది యట్టిబ్రహ్మమీ
వయిలిది జెందమం దరియు మంచు వచించె రఘూద్వహోత్తమా.—ఆ. ౩.

మ. పుటపాకంబునఁ గాంచనం బతులమై పొల్పొంద్యతింజెందు నె
ట్లటులే ధ్యానముచే గుణత్రయమలత్యాగంబు గాఁగం బరి
స్ఫుటసచ్చిత్సుఖనిత్యదివ్యనిజసంపూర్ణ ప్రభన్ బొందు ను
త్కటుఁడై కోపదుఁడంచుఁ జెప్పె మఱి సీతాదృక్చకోరాత్రిజా.—ఆ. ౪.

మాడభూషి-వేంకటాచార్యకవి.

ఈవిద్వత్కవి భరతాభ్యుదయమనెడి నాలుగాశ్వాసముల ప్రబంధమును రచియించెను. ఇతఁడు శ్రీవైష్ణవబ్రాహ్మణుఁడు; నైధ్రువ కాశ్యపాన్వయుఁడు; నృసింహా

చార్యనందనుఁడు. ఇతఁడు సంస్కృతాంధ్రములయం దత్యంతపాండిత్యము గలవాఁడయి, శతలేఖినీపద్యసంధానసామర్థ్యమును అష్టావధానమైపుణియు వ్యస్తాక్షరీకౌశలమును గలవాఁడయి యుండెను. ఈకవి గోదావరీమండలములోని పెంటపాడు గ్రామ వాసియై కృష్ణామండలములోని నూజవీడుసంస్థానమునందు చిరకాలముండి విద్వాంసభినవ పండితరాయాని బిరుదాంకముల నందినవాఁడు. చిన్నతనమునం దీయన ధారణాశక్తి యత్యద్భుత మైనదిగా నుండెను. అప్పు డితఁడు ద్విపద గ్రాహియగుటయేకాక రెండుమాఱులు చదివినపద్యమును తలక్రిందుగా నొప్పగించుటయును వెనిమిదిభాషలలో వ్యస్తాక్షరి చెప్పుటకును సమర్థుఁడయి యుండెను. ఈయన రెండుసంవత్సరములక్రిందట వైకుంఠపదస్థుఁ డయ్యెను. ఈయనకవిత్వము నిర్దుష్టమయి మధురమై శ్రావ్యముగానున్నది. కవిత్వరీతి భరతాభ్యుదయములోని యీక్రిందిపద్యములవలనఁ గొంతవఱకు తేటపడవచ్చును.—

చ. పిలిచిన నుత్తరం బిడదు పిల్వనిదే యిదేవత్తు నంచుఁ దాఁ
బలుకును బల్కరించు చెలిపై నలుగుంజ నలువిక్కులాతితోఁ
బలుమఱుఁజూచు నుస్తకము వంచు వెసం దలయూఁచు నాశకుం
తల ధరణీపురందరగతస్వకమానసపర్వవృత్తియై.—అ. ౧.

ఉ. చానలు గాంచి రొక్కెడ ససారమసారమణిప్రణీతసో
పానపరంపరాసితవిభాపటలంబు తదంతరల్ల స
త్పూనలతాప్రదత్తనవదోహదధూమవిలీలఁ దోఁప ను
శ్రీ నలరారు చారుసరసీరుహధామశిరోలలామముల్.—అ. ౨.

ఉ. కాంచితె నూత యీమృగము గంతముఁ ద్రిప్పి రథంబు సారెకుం
గాంచుచుఁ బోవుచు న్విశిఖపూతభయంబునఁ బూర్వకాయముల్
వంచి సగంబు మేసినతృణంబు శ్రమంబునఁ గొల్లవాలఁగా
నించుక యుర్విఁ జాల దివి నేగను నందక గంతు వేయుచుల్.—అ. 3.

చ. వనితలు పుట్టినింట బహువర్షము లుండఁగరాదు భర్తతో
నునికియె యుత్తమం బని యటుండఁగనిమ్ము సమస్తరాజన్యో
భవమకుటాగ్రభాంఘ్రి యగుపార్థివశేఖరుధర్మపత్ని వ
య్యు నిటులు బీదరాలివలె నుండఁగ నేల పతీశిరోమణీ—అ. ౪.

పెనుమచ్చ-బుచ్చిరాజు.

ఈకవి పరతత్త్వప్రకాశిక యనెడి యెనిమిదాశ్వాసముల వేదాంతగ్రంథమును రచియించెను. ఇతఁడు క్షత్రియుఁడు; ధనంజయ గోత్రుఁడు; వేంకటపతిరాజకుమారుఁడు. ఈకవి తాను కర్గపాలెముగ్రామనివాసుఁ డయినట్టును, సూర్యవంశపు రాజయినట్టును వ్రాసికొనియున్నాఁడు. భాగవతములోని కపిల దేవహూతి సంవాద మాధారముగా నీగ్రంథము పెంచి వ్రాయఁబడినది ఇతఁడు తొంబదిసంవత్సరములు జీవించి కొన్నియేండ్లక్రిందటనే కాలధర్మమునొందినట్లు తెలియవచ్చుచున్నది. అక్కడక్కడ లక్షణవిరుద్ధము లైనప్రయోగములు పెక్కులున్నను, కవిత్వము చక్కఁగానే యున్నదని చెప్పవచ్చును. పరతత్త్వప్రకాశికలోని రెండుపద్యము లిందు క్రిందఁ బొందుపఱుపఁబడుచున్నవి—

ఉ. కోరి భజింపఁగాఁ దగినకోవిదు నాత్మవివేకశీలసం
చారు వికారదూరు శ్రుతిశాస్త్రపరీవృతనిశ్చయార్థస
త్సారమరందబిందువిలసన్మధుపానవికాసభాసురున్
ధారుణి సర్వసంశయవిదారుని ధీరుని సద్గురూత్తమున్.—అ. 3.

చ. మనను సుషుప్తి నొక్కవసి మానుగ వ్రగ్గినఁ జేయుకార్యముల్
కనఁబడ వేమియున్ మనసు క్రమ్మఱ మేల్కని యాతఁ డాతఁడున్
మన మనుచుండఁగాఁ గల సమస్తముఁ దోఁచు మనోవినాశమై
తనరినఁ జిత్తమింద్రియపదాగతులున్ లయ మౌను దానితోన్.—అ. ౭.

మండపాక-పార్వతీశ్వరకవి.

ఈవిద్వత్కవి శతకములు మొదలైనవి యెనుబదిగ్రంథములవఱకును రచియించినను, ఈయనచే రచియింపఁబడి ముద్రింపఁబడియున్న గ్రంథములలో శ్రీరాధాకృష్ణసంవాదమను నాలుగాశ్వాసముల ప్రబంధము ప్రధానమైనదిగానున్నది. ఈయన వైదికబ్రాహ్మణుఁడు; పారాశరగోత్రుఁడు; కామేశ్వరపండితపుత్రుఁడు. ఈకవియొక్క తండ్రితాతలుకూడ కవీశ్వరు లయినట్టు రాధాకృష్ణసంవాదమునందు కవి యీక్రిందిపద్యమునఁ జెప్పియున్నాఁడు—

సీ. శ్రీమించు నుభయభాషామిశ్రసత్కృతుల్ తద్జ్ఞు లెన్న మదంకితములు చేసి
యశముఁ గాంచినపేరయమనీషిమణికిఁ బౌత్రత్వంబుఁ గర్తికవ్రతమహత్త్వ

శివమహాత్మ్యాద్యనేకవిధప్రబంధంబు లొనరించి సత్కవివినుతిఁ గనిన
పారాశరసగోత్రపావనుం డగుమండపాక కామేశ్వరపండితునకు
సుహితపుత్రత్వమును గాంచి బహువిచిత్ర
చిత్రశతిముఖ్యసత్కృతుల్ చెప్పి మెప్పు
వడసితివి గద కులకీర్తి వర్ధిలంగ
సరసగుణసాంద్ర పార్వతీశ్వరకవీంద్ర.

ఈకవి విశాఖపట్టణమండలములోని బొబ్బిలిసంస్థానమం దాస్థానకవీశ్వరులలో నొకఁడుగా నుండినవాఁడు. ఈపార్వతీశ్వర శాస్త్రిగారు ౧౮౩౩వ సంవత్సరమునందు జననమొంది ౧౮౯౭వ సంవత్సర మధ్యమున పరమపదము నొందిరి. ఈకవి సంస్కృతాంధ్రములయందు మంచిపాండిత్యము గలవాఁడయి మృదుమధురనిరర్గళధారతోఁ జతుర్విధకవిత్వమును జెప్పుచు వచ్చుటయేకాక వినయ సౌశీల్యాది గుణసంపత్తి గలవాఁడయియుండెను. పూర్వోక్తమయిన రాధాకృష్ణసంవాదము రావువారను నామాంతరముగల వెలుగోటివారనెడి గృహనామముచే వెలయు శ్రీవేంకటగిరిసంస్థానాధిపతుల వంశానుక్రమమును వర్ణించెడు గ్రంథము. శతకములును దండకములును గాక యీకవి రచియించిన గ్రంథములలో కాంచీపురమహాత్మ్యము, అమరుకకావ్యము, ప్రబంధసంబంధబంధనిబంధనగ్రంథము, శ్రీకృష్ణాభ్యుదయము, కొంతపెద్దవి. ఇప్పుడీయన గ్రంథములలో నొక్క రాధాకృష్ణసంవాదమునుండి మాత్రము కొన్నిపద్యముల నిందుదాహరించుచున్నాను—

శా. సాంగోపాంగముగా నితం డఖిలవిద్యల్ నేర్చినాఁ డోర్చినాఁ
డంగీకారము నింతపట్టు మృదుచర్యం బేర్చినాఁ డేర్చినాఁ
డంగారప్రతిమాస్త్రపంక్తి నరిసైన్యారణ్య మిట్లయ్యు నే
సాంగత్యంబుననో వృథాకపటభాషం దీర్చినాఁ డిత్తఱిన్ — ఆ. ౧

ఉ. ప్రాయఁపు లెక్క లొక్కటిగ రంగదరంగ మెఱుంగుపూఁతలన్
బూయఁడు భిత్తిభాగముల ముఖ్యవిధానములందు మందతం
బాయఁడు బాంధవాదులగువారికిఁ జేయఁగలట్టిసత్కృతుల్
చేయఁడు వేఱె మీ కిపుడు చెప్పఁగ నేటికి మీ కెఱుంగరే. — ఆ. ౨.

మ. తనభూలోకధురంధరత్వ మిపు డేతద్రాజగోపాలకృ
ష్ణనరేంద్రుండు వహించె నాకభర మైనం బూనుదుంగాక యం
చు నృపానుజ్ఞను గోరవచ్చినఫణీశుండో తదేకేచ్ఛ వ
చ్చినప్రాక్కచ్ఛపమో యనం దనరెఁ దచ్ఛ్వేతాతపత్రంబటన్ — ఆ. ౩.

ఉ. తత్పురభర్త పుట్టినకతమ్మునఁ బ్రాభవమొందెనో లెనం
దుఃస్సవ మయ్యె నింక సుర లుండఁగ నేటికిఁ బొం డటంచు నం
చత్సుమధ్వనిం గసరుజాడ గనంబడఁ దామ్రచూడముల్
తత్సమయంబునన్ మొరసెఁ దామరసప్రతిమానలోచనా.— ఆ. ౪.

సత్యవోలు-భగవత్కవి.

ఈకవి యారువేల నియోగిబ్రాహ్మణుడు; జనార్దనామాత్యపుత్రుఁడు; భారద్వాజగోత్రుఁడు. ఈతఁడు గోదావరీమండలములో నించుమించుగా నూటయేఁబది సంవత్సరములక్రిందట నుండినవాఁడు. ఇతఁ డేనుఁగు లక్ష్మణకవి మొదలగువారితో సమకాలీనుఁ డని చెప్పుదురు. ఈకవి రచియించినగ్రంథములలో రుక్మిణీపరిణయ మనెడు నాలుగాశ్వాసములప్రబంధము ప్రధాన మయినది. తాను నూఱుశతకములను జేసినట్లు కవియే తనగ్రంథమునం దిట్లు చెప్పుకొనియున్నాఁడు—

క. ధీరత శతశతకంబులుఁ । దారావళులున్ దశావతారావళులున్
జారూదాహరణంబులు । శ్రీరాజితదండకములుఁ జెప్పినవాఁడన్.

ఇతఁడు చెప్పిన రుక్మిణీపరిణయములోని దశావతారపద్యములు తెలుఁగుదేశములోఁ బలువురచేఁ జదువఁబడుచున్నవి. కవిత్వమునం దల్పదోషములు కొన్ని యున్నను మొత్తముమీఁద నీతనికవనము మృదుమధురపదగుంభిత మయి రసవంత మయి శ్రావ్యముగా నున్నది. రుక్మిణీపరిణయములోని యీక్రిందిపద్యములు కవియొక్క సామర్థ్యమును దేటపఱుచును—

ఉ. ఏసతి నాత్మలోఁ దలఁప నెల్లజగంబుల జంతుకోటి కా
యాసము లేక కల్గు సరసాన్నము లాసతి యవ్విదర్భసిం
హాసనవాసియింట శిశువౌట నొసంగిరి పాయసాన్నము
ల్లాసము మీఱ నాఱవెలఁదుల్ వెలఁతల్ ద్విజబంధుకోటితోన్.— ఆ. ౧.

ఉ. శ్రీకరమూర్తి వైననినుఁ జేరి భజింపఁ దలంపుచుండుటన్
నీకృపఁ గోరుచుండు టది నేరము గాదు సమస్తదేవతా
నీకము చూడ మున్న సిరి నీవగుపేరెదఁ జేరఁ గోరదే
నాకడ నే జనించెను ఘనాఘనధామసమూహమోహముల్.— ఆ. ౨.

చ. అరయుచు రుక్మిముఖ్యనిఖిలాధిపు లాత్మపురోగగోగని
గ్రహుల తెఱంగునన్ బొరలి క్రమ్మఱ ముష్కర మైనధైర్యవి

స్ఫురణ మెలర్ప దర్పయుతశూరతఘోరతరాస్త్రశస్త్రభీ
కరకరులై సముజ్జ్వలితనిర్జితగర్జితభూతజాతులై —ఆ. ౩.

సీ. జమదగ్నిగర్భవాసమునఁ బుట్టి వివిధవిద్యాతపోధనుర్విద్యల కధి
పతివై ప్రబలి యిదం బ్రాహ్మ్య మిదం క్షాత్ర మని మునిరాజచిహ్నముల చాప
చాపనైపుణిఁ జూపి పాపభూపతుల శతాంకకఠోరకుఠారధార
నస్రధారాప్రవాహములుగా శతధా సహస్రధా ఖండించి యాఁదులను
దర్పణము భూమిభూదేవతార్పణమును । జేసినపరశురామ వేషి వని నిను భ
జింతు వైకుంఠనాథలక్ష్మీసనాథ। రక్షణపరాయణుండ నారాయణుండ.—ఆ.౪.

గురురాజకవి.

ఈకవి శేషధర్మములను తొమ్మిదాశ్వాసముల గ్రంథమును రచియించి బళ్ళారిమండలములోని జోహరాపురాధిపతి యైన సంజీవిరెడ్డిగారి కంకితము చేసెను. ఇతఁ డిరువది ముప్పదిసంవత్సరముల క్రిందటనుండినవాఁడు. కవిత్వము నిర్దుష్ట మని చెప్పుటకు వలను పడకపోయినను మొత్తముమీఁదఁ బుస్తకము రసవంతముగా నున్నదని చెప్పవచ్చును. కవికృతము లయినకావ్యాదులనుగూర్చి కృతిపతి పలికినట్లుగా గ్రంథమునం దీక్రిందిపద్యములు చెప్పఁబడినవి.—

గీ. అలఘుతరభద్ర పడకండ్లకులసముద్ర । వత్సముదమిత్ర శుభధరద్వాజగోత్ర
విపులదాక్షిణ్య సౌజన్యవినయధన్య । కావ్యనైపుణ్య గురురాజకవివరేణ్య.

సీ. ప్రతిపద్యమును చిత్రశ్లేష పద్మావతీపరిణయనామదివ్యనాట
కంబు నెంతయుఁ దాదృశం బగురుక్మిణీపరిణయాభిధగద్యపద్యకృతిని
గుణయుతాలంకారమణిమాలికను రాఘవేంద్రస్తవంబును [illegible]
బాలబోధారాసహస్రం బలెఁ గూర్చి యనిరుద్ధచరిత్రపద్మప్రబంధ [illegible]
కంబు నొనరించి తెలిఁగించి కలితధర్మ। హంసశతకముల మృదులకర్ణాటకృతుల
వలిపి భానుజీపాలాదిసభలలోన। గరము బహుమతు లందితి ఘనుఁడ వీవు.

కవియొక్క కవనరీతి తెలియుటకై శేషధర్మములనుండి రెండుపద్యముల నుదాహరించుచున్నాను.—

శా. సత్యంబే పితృ మాత భ్రాత మిగులన్ సత్యంబె సంభోక్తయుఁ
సత్యంబే తగుపాపహంతయు నొగిన్ సత్యంబె శ్రీధాత్రియుఁ

సత్యంబె జగతిన్ సుహృత్త్వ సుఖముల్ సత్యంబె బాంధవ్యముల్
సత్యంబే యని చెప్పుచుందు రెపుడున్ సంఖ్యావదగ్రేసరుల్.—ఆ. ౩.

ఉ. వాసవవంద్య నీ కిదియె వందన మంబుజలోచనా చతు
ర్వాసములందు నే రతిని మానసచాపలముం ద్యజించి బ
ల్యాసిగ సద్వ్రతంబు నిక వారక మీఱి యహర్నిశం బొగిన్
జేసెద నీకృపన్ విహగశేఖరకేతన శ్రీనికేతనా.—ఆ. ౫.

అల్లమరాజు-సుబ్రహ్మణ్యకవి.

ఈకవి యల్లమరాజు రామకృష్ణకవి తమ్ముఁడు. ఈతఁడు చేసిన గ్రంథములలో శ్రీబచ్చురామేశనామక వైశ్యశిఖామణి కంకితము చేయఁబడిన శ్రీకృష్ణకళ్యాణ మనెడి మూడాశ్వాసముల ప్రబంధ మొకటి యచ్చుపడి యున్నది. ఈగ్రంథములోఁ గృతిపతి కవిచేఁ జేయఁబడిన పుస్తకములు [illegible] న్నట్లీ క్రిందిపద్యమునఁ జెప్పఁబడినది—

సీ. ప్రత్యక్షగర్భేశసద్భాశ్రి మాద్గుల కృష్ణభూపతిసభఁ గీర్తిఁ గంటి
రహి మణిధ్వజచరిత్ర మొనర్చి యొప్పుల రామనదొరచేత భూమిఁ గొంటి
రసవదలంకారవసతియౌ చతురిమ ప్రబలఁ గూర్చితివి భద్రాపరిణయు
మమరంగఁ దెలిఁగించి తాత్మబోధమును సారమగుప్రశ్నోత్తరరత్నమాల
శేషధర్మేతిహాసవిశేష మంద్ర। భాషగ నొనర్చి యదుగిరి పాపయసచి
వప్రతిష్ఠితలింగమహత్త్రిరామ। బుధు కర్పించితివి పుణ్యవిభవ మెసఁగ.

ఈకవి వాసస్థలము గోదావరీమండలములోఁ బిఠాపురమునకు సమీపమున నున్న చేఁ
బ్రోలను గ్రామము. ఈతఁడు బ్రాహ్మణుఁడు; హరితసగోత్రుఁడు; [illegible]
[illegible]
[illegible] ఈతని కవిత్వము [illegible] మయి మనోహరముగా నుండును. ఇతని కవిత్వప్రౌఢిమ
తెలియుటకయి శ్రీకృష్ణకళ్యాణములోని కొన్ని పద్యముల నిందుదాహరించుచున్నాను—

చ. చెలిమిని గాదె క్రొత్తలు వచించెద వో యదువంశనాథ నీ
యలఘుభుజాబలశ్రితులమా మనుబోటుల మీవు లేనిచోఁ
దెలుపుఁడు లేరియింతులటు చింతిలుచుందురు నీవు చెంగటన్
వెలసిన నింద్రులోడఁ దగువేల్పులరీతి సుఖింతు మెంతయున్.—ఆ. ౧.

మ. చనునే కృష్ణ భయప్రకంపితులమై శస్త్రాదుల న్వీడి యా
తనితో సంధికి నేగుటల్ మనకు శుద్ధక్షత్రవంశంబునన్
జననం బందియు నాత్మబాహుబలమున్ శౌర్యంబుఁ గోల్పుచ్చి భీ
తి నోరుం గూడుట రాజధర్మ మగునే ధీరు ల్విన న్మెత్తురే. — ఆ. ౨.

ఉ. ముద్దులమూటఁగట్టు నగుమోముపూరంగు తరంగపాళికిన్
హద్దులుదిద్దు ముత్తరులయందము కుందమిలిందబృందమున్
సద్దడఁగించిమించు రదనంబులచక్కఁదనంబు వేణిడా
లద్దిర యద్దిదీని కిదియా నిధియా గుణరత్నరాజికిన్. — ఆ. 3.

గోపీనాథము వేంకటకవి.

ఈకవి వైదికబ్రాహ్మణుఁడు; నెల్లూరిమండలములోని కావలితాలూకాలోని లక్ష్మీపురగ్రామవాసి ఇతఁడు శ్రీవేంకటగిరిసంస్థానమునం దాస్థానకవీశ్వరుఁడుగా నుండి ప్రసిద్ధి కెక్కినవాఁడు. ఈకాలపుఁగవులలో నితఁడు బహుమహాగ్రంథములను రచించినవాఁడు. భాస్కరరామాయణాదులు వాల్మీకివిరచిత మూలగ్రంథానుసారముగా నుండలేదని మూలగ్రంథములో నున్నదానికంటె నెక్కువకాని తక్కువకాని లేకుండునట్లు సరిగా వాల్మీకిరామాయణ మంతయు నితఁడు పద్యకావ్యముగాఁ జేసెను. మఱియు నితఁడు బ్రహ్మకైవర్త పురాణములోని కృష్ణజన్మఖండము నెనిమిదాశ్వాసముల పద్యకావ్యముగాను, మాఘకవికృత మయినశిశుపాలవధను నాలుగాశ్వాసముల పద్యకావ్యముగాను, శ్రీభగవద్గీతాశాస్త్రమును, తెనుఁగున రచియించి మెప్పించి వేంకటగిరిసంస్థానాధీశ్వరులచే నొకయగ్రహారమును బడసెను. ఇతఁడు మిక్కిలి వృద్ధుఁడయి కొన్ని యేండ్లక్రిందటఁ బరమపదము నొందెను. ఈతని కవిత్వము మొత్తముమీఁద సలక్షణ మయి నాతికఠినమయి హృద్యముగా నున్నది ఈయన గ్రంథములలోని కొన్నిపద్యము లిం దుదాహరింపఁబడుచున్నవి —

రామాయణము.

చ. ఘనగుణశాలి ప్రాణమునకంటెఁ బ్రియుం డగురామచంద్రునిన్
జననుతు నొంటిఁ బంపి నిమిషం బయినన్ మనఁజాల వంశవ
ర్ధనుఁ డగునట్టియాతలిరుఁబ్రాయపుముద్దులకుఱ్ఱఁ జేల నీ
యనుమతి నేన వచ్చెద నురారులఁ జంపి మఖంబు గావఁగన్, — బాలకాం.

ఉ. చందురువంటి నెమ్మొగము చాఁగెడుకన్నులు వృత్తదంష్ట్రముల్
బంధురపల్లవాధరము సోగకురుల్మణికుండలప్రభా
బంధురకర్ణయుగ్మమును బారెఁడుచేతులుఁ గల్గు రాము నిం
గాంచఁగఁ జూడకున్న నిలుపోపఁ దరంబె సుమంత్ర యుత్తమా.— అయో.

చ. ఇనకిరణాళికిం జొరవ యీక సదాగతిరాక కైనఁ బ
ల్చనపడ కర్థి సైకతముఁ జల్లిన రాలఁగనీక దట్టమై
దనుజవిముక్తకాండములఁ దట్టుచు దిక్కుల రామకాండముల్
మునిసితభంగి నిండుటయుఁ జూచి సుర ల్వెఱఁగంది రయ్యెడన్.— అరణ్య.

ఉ. భూవరవర్య యెవ్వని సముద్ధతిఁ జంపుటకై కడంగి సు
గ్రీవునితోడ నెయ్య మొనరించి తదీప్సితసిద్ధిఁ గోరి స
న్నీవిధిఁ జంపి తట్టిదనుజేంద్రుని రావణుఁ గీటడంచి నీ
దేవిని నెందు డాఁచినను దెచ్చియొసంగనె యొక్కవ్రేల్మిడిన్.— కిష్కింధా.

ఉ. ఓరిదురాత్మ యిందు బుధు లుండరొ యుండిన నీవు వారలం
జేరవొ సాధువాక్యములు చేకొన నొల్లవొ శిక్షలేమి నా
చారవిహీనమై సకలసజ్జనగర్హిత మయ్యె నీమతం
బారయ నీకతంబున నిశాటకులంబు చెడు న్నిజంబుగన్.— సుందరకాం.

మ. మఱియున్ రావణి సాయకంబులు ధనుర్జ్యావిం దగం గూర్చి బ
ల్గురులాడం దెగనిండఁదీసి వెస వక్షం బుచ్చిపో నేసినన్
గురుబాణక్షతజాతరక్తకలితాంగుండై సుమిత్రాసుతుం
డరయం బొల్చె విధూమవహ్నిగతిఁ బుష్పాఢ్యద్రుమప్రక్రియన్. యుద్ధకాం.

కృష్ణజన్మఖండము.

చ. సలలితశుద్ధతోయములు చారుమణీదళపద్మకైరవో
త్పలములు గంధలుబ్ధకసుతానమధువ్రతగీతనాదముల్
కలరవచక్రకుక్కుటమరాళమనోహరమంజుశబ్దముల్
గలిగి మనోజ్ఞసంపదలఁ గ్రాలు విశాలసరోవరం బొగిన్.— అ. ౩.

మ. పరికింపం గడు దుర్లభం బవనిలోఁ బ్రాణేశ కాంతామణీ
పురుషప్రేమగుణాతిరిక్త మనిశంబుం బూతచారిత్రయున్
స్వరసారజ్ఞయు సాధ్వియున్ రసికయున్ జాతుర్యసంయుక్తయౌ
తరుణీరత్న మెఱుంగు సత్పురుషుఁడున్ దధ్యంబు చింతింపఁగన్.— అ. ౫.

శిశుపాల వధము.

శా. సామర్థ్యంబున మాఱులేనిబల మస్త్యం బవ్విధి న్నీతివి
ద్యామర్యాద నెఱింగి పోవుబల మస్త్యం బిట్టు లీరెంటికిన్
నేమం బేర్పడ భూరితేజమునకుం జీఁకట్లకుం బోలె బ
ల్సామానాధికరణ్య మెట్లు గలుగున్ జర్చింప లోకంబునన్.—ఆ. ౧.

చ. అలఘుధనుష్ప్రభావము గుణాతిమహత్త్వము ముష్టిశక్తియో
యిలయు దిగంతముల్ గగన మీయుచు నున్నవొ యేమిచిత్రమో
తెలియఁగరాదు శౌరిసముదీర్ణశరంబులు చిత్రజల్లుల
ట్లలవడ నొక్కరీతిఁ గురియం దొడఁగెన్ ధ్వనిపూర్వకంబుగన్.—ఆ. ౪.

భగవద్గీత.

ఉ. మెండుగ వృష్టికాలమున మిన్నకపాఱునదీప్రవాహముల్
నిండి చలింపకున్న యలవీరధిఁ జేరినమాడ్కి నెవ్వనిం
దండిగ సర్వకామములు తప్పక చేరు నతండు శాంతుఁడై
యుండు సకాముఁడైనవాఁ డొందఁడు శాంతిని బాండునందనా.

చ. అలయక యోగు లీతనిఁ బ్రయత్నము సేయుచు నాత్మయందు ని
శ్చలముగ నున్నవానిఁగ నిజంబు నెఱుంగుదు రజ్ఞులైన ని
శ్చలమతిహీనులొక్కరు మొగిఁ జాలఁ బ్రయత్నము చేసియున్ సము
జ్జ్వలుఁ దగునీశ్వరుం దెలియఁ జాలరు భారత నిక్క మింతయున్.